తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు

(వ్యాససంకలనం)

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్డు, హైదరాబాద్

BVP - 2068

8/5/18

37/69

తెలంగాణ
గిరిజన భాషా సాహిత్యాలు

(వ్యాససంకలనం)

ప్రధాన సంపాదకులు
జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్
డా. సి. నారాయణ రెడ్డి
అధ్యక్షులు, ఆంధ్రసారస్వత పరిషత్తు

సంపాదకులు
డా. జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి, ఆంధ్రసారస్వత పరిషత్తు

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్డు, ఆబిడ్స్, హైదరాబాదు – 500 001.

TELANGANA GIRIJANA BHAASHAA SAAHITYAALU
(A Collection of Essays)

తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు
వ్యాస సంకలనం

పుటలు : 328

ప్రతులు : 1000

ముద్రణ : **మార్చి, 2015**

మూల్యం : రూ. **200/-**

ప్రింటర్స్ : **రైతునేస్తం ప్రెస్,** హైదరాబాదు.

ప్రతుల కోసం:
ఆంధ్రసారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, ఆబిడ్స్
హైదరాబాద్ - 500 001
ఫోన్: 040-24753724

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి. నారాయణరెడ్డి ఎక్స్ ఎం.పి.
ఎం.ఏ., పిహెచ్.డి., డి.లిట్.
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్,
హైదరాబాదు-500001.
ఫోన్ : (ఆ) 24753724

Jnanpith Awardee
Dr. C. Narayana Reddy Ex. M.P.
M.A., Ph.D., D.Litt.
PRESIDENT
Andhra Saraswatha Parishath
Tilak Road,
Hyderabad - 500 001.
Phone : (Off.) 24753724

అవతారిక

నిజాం పాలనలో తెలుగు భాషాదీపం కొడిగట్టిన కాలంలో దాని పునరుద్దీపనానికి ఉద్భవించిన మాతృసంస్థ ఆంధ్ర సారస్వత పరిషత్తు. శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ కాళోజి నారాయణరావు, శ్రీ బూర్గుల రామకృష్ణారావు, శ్రీ లోకనంది శంకర నారాయణ రావు, శ్రీ గడియారం రామకృష్ణ శర్మ వంటి సాహితీమూర్తుల ప్రేరణతో పరిషత్తు 1943 మే 26న రూపుదిద్దుకుని ఈ రోజు తెలంగాణలో అగ్రేసర సాహితీ సంస్థగా విశిష్టస్థానం వహించింది. మాన్యమిత్రులు డా. దేవులపల్లి రామానుజరావు గారు యావజ్జీవనం పరిషత్తు అభివృద్ధికి శ్రమించినారు. పరిషత్తు బహుముఖీన కార్యక్రమాలు చేపట్టి సమర్థంగా నిర్వహిస్తూ అందరి ప్రశంసలందుకుంటున్నది. పరిషత్తు ప్రాథమిక, ప్రవేశ, విశారద తెలుగు పరీక్షలు జరపడంతోపాటు, తెలుగు పండిత శిక్షణ కళాశాలను, ప్రాచ్య కళాశాలను నిర్వహిస్తున్నది. పరిషత్తు ఏర్పాటు చేసే సాహితీ సభలు, సమావేశాలు, ప్రసంగాలు, సదస్సులు, ఉత్సవాలు, చర్చాగోష్ఠులు, పరిణతవాణి ప్రసంగాలు, ప్రసంగాత్మక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైనవి తెలంగాణ వైశిష్ట్యానికి అద్దం పడుతున్నవి. పరిషత్తు ప్రచురించే గ్రంథాలను సాహితీలోకం అభిమానించి స్వాగతిస్తున్నది. ఇంతవరకు దాదాపు 300 గ్రంథాలను వెలువరించింది.

2013 లో పరిషత్తు సప్తతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించింది. తెలంగాణ ప్రత్యేకతలోని వివిధ పార్శ్వాలను ఆవిష్కరించే సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. నిపుణుల ప్రసంగ వ్యాసాలను "వ్యాసగుళుచ్ఛం" పేరుతో పరిషత్తు రెండు భాగాలు వెలువరించింది. వివిధ రంగాలలో తెలంగాణ వైశిష్ట్యాన్ని విశదీకరించే "తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం" పై సదస్సు వంటి కార్యక్రమాలను పరిషత్తు ఏర్పాటు చేసింది.

తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నం సాకారమై 2014 జూన్ 2 వ తేదీన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. తెలంగాణను సర్వతోముఖంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం, సంస్థలు, ప్రజలు ఉద్యమస్ఫూర్తితో కృషి చేయడం హర్షణీయం. తెలంగాణ భాషా సాహిత్య కళా సంస్కృతుల వికాసాభ్యుదయాల కోసం ఏడు దశాబ్దాలకు పైగా అంకితభావంతో ముందుకు సాగుతున్న ఆంధ్ర సారస్వత పరిషత్తు బంగారు తెలంగాణ నిర్మాణంలో తన వంతు పాత్రలో భాగంగా విశిష్ట కార్యక్రమాలకు రూపకల్పన చేసి నిర్వహిస్తున్నది. వాటిలో కొన్ని – తెలంగాణ మాండలిక పదాలు – ప్రయోగ వైశిష్ట్యం, తెలంగాణ ప్రాచీన తెలుగు కవుల కవితా ప్రాభవం, తెలంగాణ చిత్రకళ, శిల్పకళల వైభవం, తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలపై సదస్సు, తెలంగాణ కవయిత్రుల, కథయిత్రుల రాష్ట్రస్థాయి సమ్మేళనం.

తెలంగాణ వైభవోన్నతిపై పరిషత్తు ప్రత్యేక గ్రంథ ప్రచురణను చేపట్టింది. ప్రస్తుత గ్రంథం '''తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు''. ఇదే పేరుతో పరిషత్తు నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో నిపుణుల ప్రసంగ వ్యాసాల సంకలనమే ఈ గ్రంథం. గోండి, పరధాన్, బంజారా, నాయక్‌పోడ్, కోయ, కోలాం, చెంచు, కొండరెడ్డి, తోటి, ఆంథ్, నక్కల, ఎరుకల గిరిజన భాషలలో విశేష పరిజ్ఞానం సముపార్జించిన భాషావేత్తలు ప్రామాణికంగా సరళశైలిలో రచించిన వ్యాసాలివి. ఆయా గిరిజన భాషా సాహిత్యాల వైశిష్ట్యం గురించి, గిరిజనుల సంస్కృతి, కళలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు మున్నగు వాటి గురించి విశ్లేషణాత్మకంగా ఈ గ్రంథంలో వివరించిన వ్యాసకర్తలకు నా హార్దికాభినందనలు. తెలంగాణలోని వివిధ గిరిజన భాషల వైలక్షణ్యాన్ని ఈ వ్యాసాలు ప్రతిభాన్వితంగా ఆవిష్కరిస్తున్నాయి. సదస్సు విజయానికి, సకాలంలో వ్యాసాల రాత ప్రతుల సేకరణకు తోడ్పడిన ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల ప్రధానాచార్యులు డా.ఎ.సిల్మానాయక్ కృషి ప్రశంసనీయం.

పరిషత్తు వెలువరిస్తున్న ఈ గ్రంథం ఎప్పటిలాగా అందరి మన్ననలను పొందగలదని విశ్వసిస్తున్నాను.

(డా. సి.నారాయణ రెడ్డి)
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు

హైదరాబాదు
తేది: 18-03-2015.

డా॥ జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్,
హైదరాబాదు-500001.
ఫోన్ : 040-24753724

ప్రవేశిక

ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న విభిన్నమైన కార్యక్రమాల్లో పుస్తక ప్రచురణ విశిష్టమైంది. పరిషత్తు ప్రచురించిన గ్రంథాల పట్టికను చూస్తే ఎంత గొప్పవైన ప్రచురణలు వచ్చాయో తెలుస్తుంది. పరిషత్తు ఆధ్వర్యంలో తెలుగు పరీక్షల నిర్వహణ, భాషా సాహిత్య సాంస్కృతిక వికాసానికి దోహదం చేసే సదస్సుల నిర్వహణ, పెద్దల పేరిట నిర్వహించే సంస్మరణ ప్రసంగాలు, పరిణతవాణి ప్రసంగ పరంపర కొనసాగుతూ అనుబంధంగా పుస్తకం ప్రచురణ జరుగుతున్నది. 2013 సంవత్సరంలో పరిషత్తు అధ్యక్షులు డా. సి.నారాయణరెడ్డి నేతృత్వంలో సప్తతి పూర్తి సందర్భంగా ఏడాది పొడవునా అనేకమైన ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. 'తెలంగాణ తెలుగు సాహిత్య వికాసం', 'తెలంగాణ ప్రాచీన కవుల కవితా ప్రాభవం', 'తెలంగాణ మాండలిక పదాలు-ప్రయోగ రీతులు', 'తెలంగాణ ప్రాచీన నృత్య రీతులు', 'తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు', 'తెలంగాణ కవయిత్రులు, కథయిత్రుల సమ్మేళనం' వంటి అనేక సదస్సులు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తరుణంలో తెలంగాణలో సాహిత్య చైతన్యాన్ని పెంపొందించే కృషిలో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించాలని పరిషత్తు భావించింది. నవ్య స్ఫూర్తితో ప్రచురణల్ని కూడా వెలువరించాలని నిర్ణయించింది. గత సంవత్సరం పరిణతవాణి ప్రసంగాలతో కూడిన తాజా సంపుటి, 'తెలంగాణ సాహిత్య వికాసం', 'వ్యాసగుళుచ్ఛం' రెండు సంపుటాలు ప్రచురించడం జరిగింది. వాటిని పాఠకులు ఆదరించారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది. ఈ నూతన యుగోదయవేళ తెలంగాణకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రత్యేక అధ్యయనం జరగాలి. ఆ అధ్యయనానికి కావలసిన పఠన సామగ్రిని సమకూర్చుకోవాలి. ఇప్పటివరకు

ఉమ్మడి చరిత్రలో అంతర్భాగంగా వుండి తగినంత ప్రాధాన్యం లభించలేదని ప్రజల్లో వున్న అసంతృప్తిని పోగొట్టాలి. ఆ దిశగా ఆంధ్ర సారస్వత పరిషత్తు వెలువరిస్తున్న ప్రచురణల్లో 'తెలంగాణ సాహిత్య చరిత్ర', 'తెలంగాణ ప్రాచీనకవుల కవితా ప్రాభవం', 'తెలంగాణ మాండలిక పదాలు – కావ్య ప్రయోగాలు', 'కుతుబ్‌షాహీల తెలుగు సాహిత్య సేవ', 'మా ఊరు మాట్లాడింది', 'తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు', 'సురవరం ప్రతాపరెడ్డి వ్యాసావళి', 'తెలంగాణ ప్రముఖుల పరిణతవాణి', 'బంజారాల వివాహ ఆచార పద్ధతులు', 'యాభైసంవత్సరాల జ్ఞాపకాలు', 'తెలంగాణ చరిత్ర', 'తెలుగు జానపద సాహిత్యం – స్త్రీల గేయాల్లో సంప్రదాయం' ఈ సంవత్సరం వెలువడుతున్నాయి.

పదిజిల్లాల తెలంగాణలో వున్న గిరిజన భాషలు, ఆ భాషలకు చెందిన ప్రజల వాఙ్మయం, వారి విశిష్ట జీవనశైలి గురించి వివేచనాత్మకంగా చర్చించడం కోసం ఆంధ్ర సారస్వత పరిషత్తు ఇటీవల ఒక మంచి సదస్సును నిర్వహించింది. ఆయా భాషల అభ్యుదయం కోసం సుదీర్ఘకాలంగా పాటుపడుతున్న వారిని వక్తలుగా ఆహ్వానించాం. వారితో పాటు గిరిజన భాషా సాహిత్యాల రంగంలో విభిన్నమైన కోణాల్లో పరిశోధన చేస్తున్న వారు కూడా సదస్సులో పాల్గొన్నారు. వారి ప్రసంగ వ్యాసాలతో ఈ సంపుటిని తెస్తున్నాం. వ్యాస రచయితలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలపై పరిశోధన చేస్తున్న వారికి ఈ గ్రంథం ఉపయుక్తంగా ఉంటుందని భావిస్తున్నాను.

ప్రచురణల పరిశీలక సంఘం సభ్యులుగా తమ పూర్తి సహకారాన్ని అందించిన ఆచార్య ఎస్వీ రామారావు, డా. తిరుమల శ్రీనివాసాచార్య, డా. డి. చంద్రశేఖర రెడ్డి గార్లకు కృతజ్ఞతలు.

హైదరాబాదు
తేది: 25-03-2015

డా. జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి

విషయసూచిక

1.	గోండి భాషా సాహిత్యాలు	9
2.	ప్రధాన్ భాషా సాహిత్యాలు	43
3.	బంజారా భాషలో అలంకారాలు, పొడుపుకథలు సామెతల ప్రయోగం	51
4.	ఆంధ్ ఆదివాసి భాషా సంస్కృతి సాహిత్యం	56
5.	గిరిజనుల బాల్యవివాహ సమస్యలు	58
6.	బంజారా భాషా వికాసం – మార్గాలు	61
7.	బంజారా జాతీయాలు, సామెతలు– భాషా సౌందర్యం	69
8.	బంజారాల హోళి పండుగ గేయ సాహిత్యం	75
9.	కొండరెడ్ల భాషాసాహిత్యాలు	90
10.	ఖమ్మం జిల్లా బంజారులు	98
11.	తెలంగాణ బంజారా భాషా సాహిత్యం	108
12.	తెలంగాణ సాహిత్యం — గిరిజన జీవితం	118
13.	తెలంగాణలో బంజారా భాషా సంస్కృతి	130
14.	గిరిజన నృత్యాలు — పరిరక్షణ	135
15.	బంజారా భాష స్వరూపం — వైశిష్ట్యం	140
16.	తెలంగాణ కథాసాహిత్యం — గిరిజనస్త్రీ	145
17.	బంజార వివాహ వ్యవస్థలో సాంస్కృతిక రూపాలు	157
18.	కోయగిరిజనులు — సంస్కృతి సంప్రదాయాలు	168

19. ప్రపంచీకరణలో మాయమౌతున్న బంజారా సంస్కృతి 185
20. Background of Community 195
21. లంబాడీ భాషలో పొడుపు కథలు 205
22. వరంగల్ జిల్లా లంబాడీల సామెతలు – పరిశీలన 210
23. ఎరుకల వారి సంస్కృతి – సాహిత్యం 217
24. "కొండా కోనల్లో.." ప్రతిఫలించిన కోయ జీవితం 233
25. లంబాడీ భాషా స్వరూపం – సమస్యలు, పరిష్కార మార్గాలు 246
26. ఎన్నెలనవ్వు నవల –
యానాదుల సామాజిక, సాంస్కృతిక జీవన చిత్రణ 265
27. గిరిజన బిడ్డ నిన్ను మరవదు ఈ గడ్డ (కొమురం భీం) 275
28. తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు 282
29. బంజారాల సామెతలు – సామాజిక చైతన్యం 316
30. తెలుగు బోధన భాష – బంజారా విద్యార్థుల సమస్యలు 324

1. గోండి భాషా సాహిత్యాలు

– సోయం భీం రావు

నేను సోయం భీం రావు, కోస్లాగూడ, ఇంద్రవెల్లి మండలం నుండి వచ్చాను. నాకు గోండు సాహిత్యం గురించి చెప్పడానికి, ఇక్కడ "తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు" అనే అంశం మీద ప్రసంగించడానికి ఆహ్వానించినందులకు ధన్యవాదాలు.

ఆదిలాబాద్ జిల్లాలో గోండు తెగతో పాటు కొలాం, ప్రధాన్, తోటి తెగవారు కూడా ఉన్నారు. భారతదేశమంతటా ఛత్తీస్‌గడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా, తెలంగాణ, జార్ఖండ్, గుజరాత్, అస్సాం మొదలయిన తూర్పు రాష్ట్రాలలో గోండు తెగవారు, తమ మాతృభాషపై కాకుండా వాళ్ల రాష్ట్ర భాష వైపు మక్కువ చూపిస్తూ ఉన్నందున మాతృభాష మాట్లాడే వారు తక్కువైపోయారు. అందుకే మాతృభాష కనుమరుగవుతున్నది.

తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాలో గోండులు తమ సంస్కృతి సంప్రదాయాలను వదలి పట్టణాలకు వలసపోవడంతో గోండుల సంస్కృతిలో మార్పులు చోటుచేసుకొని కనుమరుగు అవటానికి దారితీస్తున్నాయి.

17, 18వ శతాబ్దంలోనే గోండులకు లిపి ఉన్నట్టు ఆధారాలున్నాయి. మన పరిశోధన ప్రకారం, అలాగే అంత్రోపోలజిస్ట్ హైమండార్ఫ్ కూడా దీనిని పర్యవేక్షించడం జరిగింది;

గోండు లిపి చదివిన **మొదటి వ్యక్తులు.** (చంద్రపూర్, ఆత్రం భలిర్షితో సంబంధం)

1. పేందోర్ లింగోజి, 2. కుంర్ర గంగోజి.

రెండవ తరం వ్యక్తులు

1. ఆత్రం రాంజి 2. ఆత్రం మాన్కు

మూడవ తరం వ్యక్తులు (జీవించి వున్నారు)

1. కోట్నక జంగు (76)
2. కుంర్ర విఠల్ రావు (80)
3. అర్క జైవంత్‌రావు (75)
4. కుంర్ర లాల్ షావు (78)
5. ఆత్రం కమలాబాయి (75)

వీరందరికి గోండిలో చదవడం, వ్రాయడం అలవాటే, అయితే వీరు చదువుకునే సమయంలో ఉర్దూ, మరాఠీ భాషలను చదవడం, వ్రాయడంలో డిమాండ్ ఉండేది, అలా గోండి భాష లిపి విస్మరించడం జరిగింది, తరువాత ఇప్పుడు తెలుగు భాష ప్రాచుర్యం, ఉర్దూ, మరాఠీ భాషలని అణచివేసింది. ప్రస్తుతం ఇంగ్లీష్ భాష వ్యవహారం ఎలావుందో చూస్తూనేవున్నాం.

మీ అందరి సమక్షంలో నేను కోరుకుంటున్నాను. మా మాతృభాషను ప్రాథమిక తరగతుల నుండే పాఠశాలలో బోధించాలని మా విజ్ఞప్తి. ఇంటర్ మీడియట్ విద్యలో ఇతర భాషలకు ప్రాముఖ్యత ఇస్తున్నట్టే ఈ గోండు భాషకి కూడా స్థానం కల్పించాలి. తద్వారా భాష కనుమరుగవ్వకుండా ముందు జాగ్రత్త తీసుకున్నట్టు అవుతుంది.

ఈ విషయంపైనా ప్రభుత్వం దృష్టి సారించాలని మా మనవి.

పహండి కుపార్ లింగు:

అదిలాబాద్ జిల్లా గోండ్ తెగవారు విశ్వసించే దేవుడు పహండి కుపార్ లింగు మరియు రాయితడ్ జంగుబాయి పరెండికిడ (12) కోయ దేవతలు యాదిలో (గుహ) పడిపోవడం జరిగింది. ఆ తరువాత శ్రీ శంభూ మహదేవ ఆజ్ఞతో పహండి కుపార్ లింగు, రాయితాడ్ జంగుబాయివారికి జాడ వెత్తుకుంటూ అయిదు ద్వీపాల్లో తిరుగుతూ వెతుకుతూండగా కఛర్ ఘడ్‌లో (Kachargadh) లో దొరికాయి.

శివుడు అక్కడ పరేండఖడ కోయ దేవుళ్లను తీయడం జరిగింది. తీసిన తరువాత ఆ దేవుళ్ల నుంచి మంచి బుద్ధి, జ్ఞానంతో హితబోధలు చేశారు. అందుకు ఈ రోజుల్లో గోండు కులం వారు. సమస్త గోండులు గజ్ఞ వూర్క్ పూజ చేస్తారు.

– దీపావళి రోజు	– పహండి కుపార్ లింగు
– పూస్యమవాస్య (జనవరి)	– రాయితడ్ జంగుబాయి
– భావై (మే)	– పెర్సిపేన్
– దసరా	– పూజా

గోండు గణం

ఎ) **గావ్‌గడ్** – గోండు గూడెంలో గ్రామ పటేల్ వ్యవస్థ, దేవరి వ్యవస్థ, మహాజన్ వ్యవస్థ, హవల్‌దార్ వ్యవస్థ, కారోబారి వ్యవస్థ, గటియల్ వ్యవస్థలు ఉన్నాయి.

గతంలో ఈ వ్యవస్థలు చాలా బలంగా ఉండేవి. ప్రస్తుతం ఈ వ్యవస్థలు పతనమౌతున్నాయి, దీనివల్ల గోండు గ్రామాల్లో క్రమశిక్షణ, సంస్కృతి, సంప్రదాయం కనుమరుగవుతున్నాయి.

బి) **నార్‌పాట్‌లల్** – గ్రామ పెద్దలు, ఇతను బాగోగులు చూస్తుంటారు. గ్రామానికి ఏ కష్టం వచ్చినా గ్రామస్థులతో చర్చించి (రాయిపాట్) సమస్యలను పరిష్కరించడానికి చర్యలు, కృషి చేస్తారు.

సి) **పేన్‌గడ** – పేన్‌పటేల్, పేన్ కటోడల్, బిర్దాల్ (తోటి) పటాడి, కుటుమలీర్

డి) **వార్వగడ** – గోండు చరిత్రను పాటరూపంలో ప్రస్తావిస్తారు బిర్దాల్, పట్టాడి.

సి) **ముట్నాపోయ్** – (గురువు) మార్గదర్శకులు. సద్బుద్ధి కలవారు. పవిత్రమైన వ్యక్తులు.

డి) **భూంకిల్** – పూజలు చేసేవారు.

సంప్రదాయాల నిర్వహణ

ఎ) **గ్రామ నిర్వహణ :** హోళి పండుగ రోజున ప్రతి ఇంటి యజమాని కొబ్బరి మరియు సామగ్రితో హాజరైతే ఆ ఊరి హాజరుపట్టికలో ఉన్నట్టు పరిగణిస్తారు.

బి) **నొవోంగ్ :** కొత్తగా వచ్చిన చేను పంటను, కుటుంబ సమేతంగా కలిసి "సిమక" ఆకుతో తయారుచేసిన విస్తరలో భోజనం చేయాల్సి ఉంటుంది.

సి) **పేన్‌గడ:** పేర్సాపేన్ దగ్గర హాజరవ్వడంలో, చనిపోయిన వారిని "తుం"గా చేర్చడం, కొత్త కోడలిని "బేటింగ్" చేయడం.

వ్యవసాయ కార్యక్రమాలు

1) **హోళి:** హోళి పండగైన మరుసటిరోజు నలుగురి సమక్షంలో గుడాలను వండుతారు. చేతిలో ఒక గొడ్డలి తీసుకొని చేనుకు వెళ్లి చెట్లపొదలు నరుక్కుంటూ, వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు.

2) భూమి దున్నడం, కట్టెలు ఏరుకోవడం.

3) వర్షాకాలం జూన్ మాసంలో మొహుతుక్ కార్యక్రమాలు చేస్తారు.

4) విత్తనాలు నాటడం మొదలు పెడతారు.

5) నొవోంగ్

6) ఆహార ధాన్యాలు జమచేయడం.

7) ఆహార ధాన్యాలు భద్రపరచడం (విధానం)

– టోట్‌లె, ఫేంమ్క్, గాదెంగ్, దు లెంగ్, డాల్గ్, కాంక్.

రాయి సెంటర్ (ప్రధాన గ్రామం)

1) **సౌర్ మేడి:** రెండు వర్గాల మధ్య జరిగే సమస్యలను పరిష్కరించడంలో ముఖ్యపాత్రను వహిస్తారు.

2) **గీతెదార్:** రెండు వర్గాలను ప్రశ్నించడంలో పాత్ర పోషిస్తారు.

3) **రామ్ (పంచ్):** సామాన్య జనాలు

కొన్ని గ్రామాలను కలుపుతూ అందులోని పెద్ద గ్రామాన్ని రాయిసెంటర్‌గా ఏర్పరుచుకుంటారు.

మారుమూల గ్రామంలో రాజకీయ చొరబాటుతో గ్రామ వ్యవహారాలు దెబ్బతిన్నాయి.

గోండు సంబంధాలు (బంధుత్వం)

అటుం, కుటుం, సేడ్ సగా, సెలాడ్ మియాడ్, సోరాయల్, దారయల్.

1) **అటుం** – ఇంటి పక్కవారు, ఊరు వారు, ఇరుగుపొరుగు వారు కలిగి ఉంటారు.

2) **కుటుం** – కుటుంబానికి సంబంధించిన వారు తల్లి తరపున, తండ్రి తరపున, భార్య తరపున ఇలా మన కుటుంబంలోని వారిని చెప్పవచ్చును.

3) **సేడ్** – సేడ్ అంటే సెలాడ్ (చెల్లెలు) మరియు మియాడ్ (కూతుళ్లు) అంటారు.

4) **సగా** – సగ్గా అంటే గోత్రాలు భారతదేశంలో ‘12’ సగ్గాల (గోత్రాల) వారు గోండులు ఉన్నారు.

అదిలాబాద్ జిల్లాలో 4 – సగాలవారు మాత్రమే ఉన్నారు.

నలుగువేన్, ఐదు వేన్, ఆరు వేన్, ఏడు వేన్.

5) **సోరియాల్** – వరుసకు బావలు, మామలు

6) **దారియల్** – దాయి, బాయి కలిగిన వారు.

కేస్లాపూర్ నాగోబ జాతర

ఎస్. ఆర్. గాడ్గిల్: వీరి అభిప్రాయంలో గొండ్వాన పేర్లు గల రాజ్యాలు చారిత్రకంగా ఎంతో పేరు ప్రఖ్యాతులు గావించినవి. వారి భాష గోండి, గోండి ధర్మము, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, జీవన సరళి పరంపర ఒక విశిష్టత కలిగి ఉండేవి.

భారతదేశంలో సుమారు కొన్ని వేలసంవత్సరాల క్రితం అతి ప్రసిద్ధి గాంచిన సంస్కృతి గోండి సంస్కృతి. ప్రపంచ నలుమూలలకు నాగ సంస్కృతి విలసిల్లినది. ఈ దేశము నాగవంశీయులు నివసించిన దేశం. దీని ప్రాచీన నామం జంబుద్వీపం ఇందులో గోండుల రాజ్యాలు అనేకం ఉన్నట్లు చరిత్ర సాక్షాధారాలు ఉన్నాయి. అన్నింటిని కలిపి గోండ్వానా అని పిలిచేవారు.

నాగవంశ రాజులు

1.	వృత్తసూర్	–	మొహంజోదారో హరప్పా ప్రాంతం
2.	మహాసూర్	–	హిమాలయ, జమ్ముకాశ్మీర్, నేపాల్
3.	మహిషాసూర్	–	అస్సాం, నాగాలాండ్, మైసూర్
4.	గయాసూర్	–	మగధక్షేత్రము

గోండి ధర్మ విశిష్టత

గోండి ధర్మ ప్రజలు ప్రత్యేక ఆచార వ్యవహారములతో నియమ నిబంధనలు గల జీవనవిధానాన్ని కలిగి ఉంటారు. వీరి సంస్కృతి చాలా నియమ నిబంధనలతో రూపకల్పన చేయబడినది. ఈ ధర్మంలో స్త్రీలకు మగవారితో సమానమైన గౌరవ మర్యాదలు ఇవ్వబడినవి. ముఖ్యంగా మానవుల జనన, వివాహ, మరణ సంబంధములు చాలా నిబంధనలతో ఏర్పాటు చేయబడినవి.

జననము

ఈ ధర్మ ప్రజలు ఇంటిలో శిశువు జననము జరిగినప్పుడు వారు ఆచరించే ఆచారాలు ఎంతో ఉన్నతమైనవిగా మనకు కనిపిస్తాయి. శిశువు తల్లి గర్భము నుండి బయటి ప్రపంచములో అడుగుపెట్టినప్పుడు. శిశువును శుభ్రముగా కడిగిన తరువాత తల్లికొరకు మరియు శిశువు కొరకు ఇంటిముందర కాని, దొడ్డిలో కాని స్నానాల కొరకు చిన్న గుంటలు యేర్పాటు చేస్తారు. దానిపై తునికి చెట్టు కట్టెలు, జోడికట్టెలు, వేపకట్టెలు వేస్తారు. ప్రతిరోజు శిశువు మరియు తల్లికి అక్కడే స్నానం చేయిస్తారు.

శిశువు జన్మించిన మొదటిరోజున ప్రత్యేకముగా ఆడవారి కొరకు (పుటిసబ్బి) భోజనం విందు ఏర్పాటు చేస్తారు. శిశువు యొక్క (బొడ్డు) నాభి ఊడిననాడు. బాలింతను ఇంట్లోకి తెస్తారు. ఆరోజు శిశువుకు మేనమామలు తలవెంట్రుకలు తీస్తారు. గోండి ప్రజలు పుట్టు వెంట్రుకలను ఉంచక ఇంట్లోకి వచ్చిన రోజే తీసి వేయడము జరుగుతుంది. ఈ రోజును మొడ్‌సబా (పురుడు) (ప్రాచ్‌వి) అని జరుపుకొంటారు. ముత్తైదువలు వచ్చి సంప్రదాయ రీతిలో బాలింతకు, కుంకుమ పూలు పెట్టి పాటలు పాడతారు. ఇదే రోజు "సుయిన్" అనగా మంత్రసాని బాలెంతను నూతి దగ్గరికి తీసుకొని పోయి నీటిపూజ చేయించడం జరుగుతుంది. పసుపు కుంకుమతో బావి దగ్గర ఎహెవెలాక్ కంకంబుదోక్, సాట్ అస్రాంగ్; మరిముజింగ్ అనే దేవతలకు పూజలు చేస్తారు.

21 రోజులకు బారసాల చేయబడుతుంది. ఈ రోజు బంధువులందరిని పిలిచి వారి "సగా" ఇంటి దేవుని పేరు మీద పూజ చేస్తారు. దీనిని తోకుడ్ పోరి పూజ అని అంటారు. అదే రోజు శిశువు నామకరణము చేయడం జరుగుతుంది. ఈ రోజు నుండి బాలింతకు పడక మంచం ఇస్తారు అంతకు ముందు కింద నేలపైనే పడుకోబెడతారు.

సిమేలి పాట

చుచు చుప్రిం మెట్టతె మల్ ఏందలాత ॥2॥
తర అజె భాండె మల్ పాయదాక ॥2॥
మల్ పాయదాక.
పాయ్మ కోకో పాయ్మ మల్ మేస్కుల్ వాత ॥2॥
మల్ మేస్కుల్ వాత

సార బార పోరిక్ దివడి ఏంద లాతజ్ ॥2॥
దివడి ఏందలాతజ్

సోమల్, ధామల్, ఏమల్, పోరిక్ దివడి పఁదలాతజ్
దివడి మహిన వాత అజె, దివడి ఏంద దాకట్ ॥2॥
దివడి ఏంద దాకట్

హన్కెవాత పురుడు డేగా, మల్ పోరికుల్ వోత ॥2॥
మల్ పోరికున్ వోత

చుచు చుమ్రి మెట్టతె మల్ ఏందలాత ॥2॥

తెలుగు భావం

అడవిలో కొండ కోనల్లో నెమలి నాట్యమాడుతుంది. తేవమ్మ వదినమ్మ నా వేట తుపాకీ నే వేటాడుత, కొట్టవద్దు కొట్టవద్దు మరిది నెమలి గుడ్లకొచ్చింది. చుట్టార తన పిల్లలను నెమలి మేపుతుంది.అక్కడి నుంచి గద్ద వస్తుంది. నెమలి పిల్లలను ఎత్తుకుపోతుంది.

పాట–2

రేలారే రేరెలరే రేలారే రేరేలారే
రేలారే రేరెలారే రేలారే రేరేలారే

కుంరం భీమునా దర్బార్‌రే మంత కోయ దాదాలీరా బేటియ అంత
తాదల్ తమ్ముర్‌రే సేలడ్ తక్కామె సిందీరె పూజ కియానా
రేలారే రేరేలారే రెలారే రెరేలారే

తాదల్ తమ్ముర్‌రే మీరేమసి కొందనా కాసుర్ పుహనా
దొరల్ కోందనా కాసుక్ పుహినా

కోందనా గోటిత్గా గుంగూక్ దొహన
కేడ మెట్టాతా సిరి పియానా! భీమున దర్బార్ తే వాయానా
రేలారే రేరేలారే రేలారే రేరేలారే

దర్బార్ నగ సర్‌కరే వాంత గరబున మద్దతే కింత
గోర్ గురిబునే మద్దతే కింత

జిత్ర మందంత కుసిగమ తంతి!
డెంసా మందంత వాజగాజ మందంతా!
తాదల్ తమ్మురే! సేలడ్ తక్కకే సందీరే పూజ కియాన్
రేలారే రేరేలరే, రేలారే రేరేలారే! ॥3॥

తెలుగు భావం

రేలారే రేరెలరే రేలారే రేరేలారే ॥2॥

కుంరం భీము దర్బార్‌లో గోండి సమాజం లోని అక్కాచెల్లెల్లు, అన్నదమ్ములు ఒక చోట చేరుతారు.

వీరందరూ కలిసి కుంరం భీమును కొలుస్తారు. పూజిస్తారు. అన్నదమ్ములు, అక్కాచెల్లెల్లు కలిసి తెల్ల ఎడ్ల బండ్లు కట్టుకొని అడవి మార్గం గుండా జోడేఘాట్ దర్బార్‌కు ప్రయాణం అవుతారు.

కుంరం భీము దర్బార్ చేరి పాటలు పాడుతూ శ్రద్ధాంజలి ఘటిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఐటిడిఏ ఉట్నూర్ ద్వారా దర్బార్ ఏర్పాటుచేసి గిరిజనుల అర్జీలను స్వీకరించి పరిశీలిస్తారు.

హెరెకుంర్ర సాహిత్యం

హెరెకుంర్ర అనేది ఒక ఇంటి పేరు. హెరెకుంర్ర వత్తున్

“కుర్స్ కొజ్జి దందా”, వీరు “డలై జాకు”ని దేవునిగా కొలుస్తారు. డలైజా తల్లి రాయమొతి, చిన్నమ్మ ముయమొతి, పెళ్లి కూడా జరిపారు. “గజిల్ సోమల్” మడావి వారి కూతురు.

వీరిద్దరు సంతానం నలుగురు. అచ్ఛ్‌పతి, గచ్ఛ్‌పతి, బొపతి, లొపతి;

హెరెకుంర్ర అను వీరు ఎనిమిది ఇంట్లలో ఒక్కరు. ఆ ఎనిమిది (తుంర్రం, వెట్టి, కొడప, మరప, మండాడి; హెరెకుంర్ర, సలాం, రాయిసిడాం) ఈ ఎనిమిది కుటుంబాల పెద్ద దేవుళ్ళు కొట పరందోళి భీదావార్ జింగుబాయి స్థలం.

డలైజాకు. అడవిలో శికారి వెళ్లినప్పుడు మడావి వారు పట్టుకొని వాళ్ల కూతురు గజల్ సోమల్‌తో పెళ్లి చేశారు.

హెరెకుంర్ర మేకని ముట్టుకోరు; మేకని తినరు, ఇప్పుడు కూడా ఈ ఆచారం కొనసాగుతూనే ఉంది.

మండాడిగారు మానవౌజ పిల్లలను ఊయల నుండి ఎత్తుకెళ్లరు. ఆ తరువాత అక్కడికి తల్లిగారు వచ్చి ఏడుస్తున్న సమయంలో బిదనొ అవుతుందని మన "హర్రెకుంర్ర అన్నయ్య తపస్సును చేశారు. ఉయ్యాలలో రెండు మేక శరీరాలు తయారుకావాలని, తయారయినచో మేము పరంపర, మేకలు ముట్టుకోవడంగాని, తినడంగాని జరగదు. అని పూర్వమే ప్రమాణం చేశారు. అందుకీ ఆచారం జరిగింది.

Soyam : వత్తున్ (సోరక్)

హిరియగడ్, వారియగడ్ పించ్ గడ్, కుచ్చండి బామ్డ్‌గడ్ ఉప్పగావ నాగుర్, సోయం సూర్వార్సి రాజాలిర్

Godavari : Gond Vari – Rtd Prof of T.V.

Mark Penny : 5 సంతానం, 4 కూతుళ్లు, 1 బాబు

Kaitur Kadhur :	masa Pathrika
Haimandarf :	కొడుకు పేరు లచ్చు పటేల్ Patel of Marlawai
సోనివోతాడ్ :	Govt. distarbing – Ayamma
Tribal :	Attach. (Non Tribes)

గోండి భాష

ఆదిలాబాద్ జిల్లా గోండి భాష

గోండ్వానా ప్రాంత భౌగోళిక చిత్రపటం

భారతదేశంలో గోండి భాష మాట్లాడే రాష్ట్రాలు

ఆంధ్రప్రదేశ్ (ఆదిలాబాద్ & కరీంనగర్), మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గడ్, ఒరిస్సా, అస్సాం, మేఘాలయ, మణిపూర్, జమ్మూకాశ్మీర్.

ఆదిలాబాద్ జిల్లాలో గోండి భాష మాట్లాడే ప్రాంతాలు.

గోండి మాట్లాడే మండలాలు:

తలమడుగు, తాంసి, ఆదిలాబాద్, బజార్ హత్నూర్, బోథ్, ఇచ్చోడ, నేరడిగొండ, మమ్డ, నిర్మల్, సారంగపూర్, బేల, జౌనాథ, ఇంద్రవెల్లి, ఖానాపూర్, కడైం, నార్నూర్, కేరమేరి, ఆసిఫాబాద్, కౌటల, బెజ్జుర్, సిర్పూర్, జైనూర్, కాగజ్‌నగర్, తాండూర్, రెబ్బన, ఉట్నూర్, దెగాం, సిర్పూర్ (యు), తిర్యాణీ, నెన్నేల, బెల్లంపల్లి, కాసిపేట్, చెన్నూర్, భీమని, మంచిర్యాల, దండెపల్లి, జన్నారం, లక్సెట్టిపేట్, జైపూర్, కొటపల్లి, ఆదిలాబాద్ జిల్లా "గోండి"

భాషపేరు : గోండి

మాట్లాడే జాతులు : గోండులు, తోటి (బిరుదుగోండు)

భౌగోళిక ప్రాంతం: తెలంగాణ రాష్ట్రంలో

ఆదిలాబాద్ జిల్లా	గోండులు	తోటి
కరీంనగర్ జిల్లా	గోండులు	తోటి
వరంగల్ జిల్లా		తోటి
నిజామాబాద్ జిల్లా		తోటి
హైదరాబాద్ జిల్లా		తోటి
రంగారెడ్డి జిల్లా		తోటి

ఆదిమానవుల నుండి పుట్టిన జాతి ఆదివాసులు. గోండులను ఆదివాసులు (aboriginal tribes) అని అంటారు. వీరు భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్, జార్ఖండ్, మిజోరం, మణిపూర్, నాగాలాండ్, ఒరిస్సా రాష్ట్రాలలో గోండులు, రాజ్‌గోండ్, దద్వేగోండ్‌లు నివసిస్తున్నట్లు చరిత్ర ఆధారంగా తెలుస్తున్నది.

పూర్వం మహారాష్ట్ర, (చంద్రపూర్, నాగ్‌పూర్, సిర్వంచ), మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్, తెలంగాణలోని ఆదిలాబాద్, కరీంనగర్‌జిల్లా, వరంగల్ గోండ్వానా ప్రాంతాన్ని గోండు రాజులు పరిపాలించారు.

దాని ఆధారంగా గోండ్వానా రాజ్యం లోని వీరిని గోండులు అనీ, కొయ్‌తూర్ అనీ అంటారు. వీరు మాట్లాడే భాష "గోండి" భాష. గోండు మరియు తోటిలలో ఈ కింది సగ్గ (ఉప తెగ)లకు చెందినవారు నివసిస్తున్నారు.

4 నాల్‌పేన్ సగ

1.	సెడ్మాకి	2.	పర్చకి	3.	సైతం
4.	చహ్కాటి	5.	తలెండ	6.	మంగం
7.	పూసం	8.	కోవ	9.	సిడాం

5 సియ్‌పేన్ సగ

1.	కినక	2.	జుంగ్నాక	3.	ఆడ
4.	దుర్వా	5.	కుంరం	6.	చిక్రం
7.	గోడం	8.	కనక	9.	అర్కా

6. సార్‌వెన్ సగ్గ

1.	తోడ్సం	2.	పెందోర్	3.	ఆత్రం
4.	కుడ్మెతల్	5.	రామ్ సిడాం	6.	యెర్మ
7.	కోడపాల్	8.	హెర్రె కుంరం	9.	వెట్టి
10.	కోట్నాక	11.	వెలది	12.	తుంరం
13.	ఉర్వేత	14.	గేడాం	15.	కొహ్చాడల్

7. ఏడ్‌వేన్ సగ్గ

1.	మడావి	2.	మేస్రం	3.	వెడ్మ
4.	అనక	5.	పుర్కా	6.	గావ్డె
7.	మర్సుకోల	8.	తడం	9.	కర్పెత

స్వాతంత్ర్యం రాక పూర్వం తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసులు కొండకోనల్లో నివసించేవారు. వర్షాధారమైన వ్యవసాయమే ముఖ్య వృత్తిగా చేసుకొని జీవించేవారు.

ఇంకను వీరి జీవనానికి అటవి ఉత్పత్తులపై ఆధారపడేవారు. అది నైజాం రాజు పరిపాలిస్తున్న కాలం. వ్యవసాయం కొరకు భూమి అవసరం. ఆ భూములకు పట్టాలు ఇవ్వడానికి పోలీస్ పటేల్, పట్వారి, గిర్దావరి వ్యవస్థ ఉండేది.

ఆదివాసులు జీవనం సాగిస్తున్న తరుణంలో అటవి భూమిలో వ్యవసాయం వ్యవసాయం చేయడానికి పట్టాలు పొందడానికి అనేక కష్టాలు పడేవారు.

"మేము సాగు చేస్తున్న భూమికి పట్టాలు ఇవ్వా"లని అప్పటి నైజాం ప్రభుత్వాన్ని కోరినా నిరాకరించడంతో, ప్రభుత్వం భూములకు వివిధ రకాల పన్నులు, సిస్తులు వసూలు చేస్తున్నారు కాబట్టి, మా భూములపై హక్కు మాదే అని

"మావా నాటే మావా రాజ్".
మావా నాటే మావా సర్కార్.

జల్, జంగల్, జమీన్ పై హక్కు మాదే అని అమరజీవి "కుమురం భీము" ఆదివాసుల హక్కుల కొరకు నైజాం ప్రభుత్వంతో పోరాటం చేసినాడు.

ఆ క్రమంలోనే కుమురం భీము నిజాం నవాబును కలవడానికి హైదరాబాదుకు కాలినడకన వచ్చాడు.

కాని అతనికి నిజాం రాజును కలిసే అవకాశం దొరకలేదు. తిరిగి ఆదిలాబాద్ జోడే ఘాట్ గ్రామానికి వెళ్లి జీవించసాగినాడు.

ఈ భూమిపై హక్కు మాదని నిజాం ప్రభుత్వంపై ఎదురు తిరిగినందువలన అతని మిత్రుడైన "మడావి కొద్దు" ద్వారా అతని రహస్యాలను తెలుసుకొని నిజాం ప్రభుత్వం కుమురం భీముపై కాల్పులు జరిపి హతమార్చింది.

ఆ తరువాత విషయం తెలుసుకున్న ప్రభుత్వం గిరిజనుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయత్నం ప్రారంభించింది. అప్పటి నుండి రాష్ట్ర ప్రభుత్వంవారు గిరిజన సమస్యల పరిష్కారానికి జోడేఘాట్‌లో "కుమురం భీము" వర్ధంతి సభ అధికారికంగా జరిపి గిరిజన సమస్యలను పరిష్కారం చేస్తున్నారు.

అయిన చాలా సమస్యలు నేటికి గిరిజనులు ఎదుర్కొరటున్నారు. సాగు భూమికి పట్టాలు, త్రాగు నీరు, వైద్యం, విద్య మొదలగునవి.

ఈ తరుణంలో గిరిజన స్థితి గతులను తెలుసుకోవడానికి మానవ పరిణామ శాస్త్రవేత్త ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ గారు అదిలాబాదు జిల్లా మారుమూల గోండు గూడెమైన మార్లవాయి యందు ఉంటూ జిల్లా అంతట తిరిగి గిరిజనుల కష్ట సుఖాలను ప్రభుత్వమునకు తెలియజేసి పరిష్కారం చేసేవారు.

కావున హైమన్ డార్ఫ్‌ను ఇప్పటికీ, ఎప్పటికీ ఆదిలాబాద్ జిల్లా "గోండులు" మరవలేరు. ఈ మధ్యనే ఫిబ్రవరి 2012 లో వారి కుమారుడు, మనుమడు లండన్

నుండి మార్లవాయి గ్రామానికి వచ్చి పిత్రెజ్ (కర్మకాండ) జరిపినారు.

గిరిజనులలో విద్య అభ్యసించినవారు లేరని మార్లవాయిలో ఉపాధ్యాయశిక్షణా కేంద్రం ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను తయారుచేసే గిరిజనులకు విద్యను అందించినారు.

పుర్వం కేవలం కొన్ని పాఠశాలలు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం ప్రతి గిరిజన గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ వారి ప్రాథమిక పాఠశాలలు కొనసాగుతున్నవి.

ఇక్కడ బోధన చేయడానికి స్థానికంగా చదువుకున్న వారినే ఉపాధ్యాయుగా నియమించినారు.

గిరిజనులు అడవులలో నివసిస్తూ ఒక ప్రాంతం నుండి ఇంకొక ప్రాంతానికి వెళ్లడానికి దూరంగా ఉండేవారు.

వారు సంతలలో, అంగడిలో, జాతరలలో పెండ్లిండ్లలో గిరిజనులందరు ఒక చోటకి చేరి వారి కష్టసుఖాలను మాట్లాడుకుంటారు.

కేస్లాపూర్ నాగోబా జాతరకు మాత్రం అందరు గిరిజనులు ఒకచోట చేరి వారి కష్టసుఖాల గురించి మాట్లాడుకొంటారు.

అందుకే ప్రభుత్వంవారు గిరిజన ''నాగోబా దర్బారు''లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూజా ప్రజాఫిర్యాదుల వేదికను ఏర్పాటుచేస్తున్నారు.

ప్రొ. హైమన్ డార్ఫ్ గారు గిరిజనజీవితాలపై విశేషమైన కృషి చేసి గిరిజనుల మదిలో చెక్కు చెదరకుండ ఉన్నారు.

ఆదివాసులు పూజించే ఆరాధ్య దైవాలు. సూర్యచంద్రులు సూర్యల్ – చంద్రల్. జెండా ముండాలలో సూర్య – చంద్రుల గుర్తులు పెట్టి పూజిస్తారు. పెర్సపేన్, జంగుబాయి, బీమాల్ పేన్, అవ్వల్ పేన్, ఆకిపేన్ శివవ్ పేన్‌లు పూజలందుకుంటారు.

పెందోజ్		**పొడుపుకథలు**
గోండి		**తెలుగు**
పొత్రో గూడ బూడ్ మేంజ్	ఇరుక్	ఇప్పపువ్వు
సోన్ సోన్ బోడ్కనన్ వాసి సేడ్క	గార	ఇప్పపరక
సోన్ సోనేకే చుట్నె	ఉచ్	ఉమ్మి

ఆకి మరుం బాకీ	సాప	వంకాయ
చుదుర్ కాండిన రగల్ రుమల్	కొహ్కా	జీడిపండు
కేడ సంది తిరియంత కొత్త అచ్చోర్ జాగతగ ఉదంత	బడ్గె/బడ్డె	వెదురు కర్ర
రోన్ సంది నాకంత మూలతగ ఉదంత	కైసర్	చీపురు
చుడేరే కాండినజ్ రోన్ మెన్ బురజ్	డియ్యే	దీపం
లహక్ లహ్కా తింతా చున్నానై పెల్కంత	నీర్	బూడిద
వత్త కుహితగ ల్లిర్ లొల్లి కీంతర్	లహేజ్	ప్యాలాలు

భాషా పరమైన కొన్ని ప్రత్యేక లక్షణాలు, వ్యాకరణం

నామవాచకం

పోరోల్క్

జంగుబాయి, భీంబాయి, జైలింగు, జై జంగు, మారుతి, సేకల్ కారు, భీర్షావ్, కుంరం భీము, తుకారాం, సురోజి, బిజురి మర్ర, ఇర్ప్ మర్ర, లీమ్ మర్ర, దొండేర మర్ర

కొలతలు

గోండి	తెలుగు
చంపో	నాల్గు ఇంచులు
బిత్తి	జానెడు
కూట	మూరెడు
కస్ర మెండ్	ఎడ్లతాడు
బహో	బారెడు
సోల	1 కిలో
2 సోలాలు	1 చిట్టె
2 చిట్టెలు	1 అట్ట
4 అట్టలు	ఒక మాన్క (మానిక)
20 మాన్కలు	అర్ధగోన
40 మాన్కలు	ఒక గోన
8 గోనలు	ఒక ఖండి
హట్టె	2 కిలోలు

గడ్డె	4 కిలోలు
పాయిలి	8 కిలోలు
మడ్	16 మానకలు/100 కిలోలు
కండిమెన్	20 ఆవులు

మర్రక్ నగ్ పొరాల్క్	**చెట్లపేర్లు**
గోండి	**తెలుగు**
మర్ర	చెట్టు
లీం మర్ర	వేపచెట్టు
మర్క మర్ర	మామిడి చెట్టు
సిత్త మర్ర	చింత చెట్టు
కొహ్కా మర్ర	జీడి చెట్టు
తొాయ మర్ర	మేడి చెట్టు
ఇర్ప్ మర్ర	ఇప్ప చెట్టు
మర్ద్ మర్ర	మద్ది చెట్టు
వడ్ మర్ర	మర్రి చెట్టు
ఆలి మర్ర	రాగి చెట్టు
తెక మర్ర	టేకు చెట్టు
సెర్క మర్ర	మొర్రి చెట్టు
ఇత్ మర్ర	తప్సి చెట్టు
టహ్కా మర్ర	గొట్టి చెట్టు
మహ్కా మర్ర	మారేదు చెట్టు
ముర్ మర్ర	మోదుగ చెట్టు
డొండేర మర్ర	
సేర్ మర్ర	

గృహ సంబంధమైనవి

గోండి	**తెలుగు**
రోన్	ఇల్లు
కావడ్	తలుపు
కిడ్కి	కిటికి

కటుల్	మంచం
చప్కొ	రోలు
జత్త	తిసుర్రాయి
రోకల్	రోకలి
ఊకడ్	ఊయల
వేలి	తీగ
ఏర్	నీళ్లు
గాటో	అన్నం
జావా	అంబలి
కుస్రి	కూర
డారి	పప్పు
సారి	రొట్టె
మిర్కుట్ / చట్ని	కారం
బిజూరి	నిమ్మకాయ
మర్క	మామిడి
సిత్త	చింత
పుర్కి	పేను
తిడింజ్	గోరు
బొట్ట	వేలు
సేతి	చాట
కైసేర్	చీపురు
కోన్ద	ఎద్దు
మూర	ఆవు
నెయ్	కుక్క
కొర్	కోడి
గొగ్గి	పుంజు
వెర్కడ్	పిల్లి
వెర్చె	ఉడుత
సుకుం	నక్షత్రం

పోడ్ద్	సూర్యుడు
లెలెంఙ్	చంద్రుడు
గాడం	గ్రహణం
బొమ్మి	భూమి
గుండ్రాల్	గుండ్రం

క్రియ

1. **గోండి :** జంగుబాపు వాచ్టె సొంజి సేర్ పియు.
   తెలుగు: జంగు బాపు చేసుకు వెళ్లి అరక పట్టు.

2. **గోండి:** సేకల్ కారు వావ్‌టే బావన్ నెహాలి వోమ్
   తెలుగు: సేకల్ కారు నాన్నగారికి సద్ది (భోజనం) తీసుకుని చేనికి వెళ్లు.

గోండి సాహిత్యం ,

1. Koya Punemta Sar in Devanagari Script 1940–Rangolsimh Mangolsimh Bhalavi Balaghat, Madhya Pradesh. Translated by Namdeo Kanake in English 2004.
2. Gondi Nyaaya Suutraalu. Ganga Singh - 1992.
3. Adilabad Jillaa Sarvasvam. B.N. Sastri - 1990
4. Gondi Bhasa Haritra. Sidam Arju - 2004.
5. Gondi Lipi Lingoo poti - Kusram Hanmanth Rao
6. Gondi Samskruti - Mesram Manohar MA Med. - 2004.
7. Iruk Pungaar - Gondi Yadaartha jiivita gaathalu - Mesram Manohar - 2007.
8. Gondi Dictionary - Joana Mark Penny. New Zealand - 2007
9. Language Learning Pharase Book - Mark Penny & Arka Manik Rao
10. Paari Kuppar Lingoo - Gondi punnem Datshan - 2008.
11. Setu Madhav Rao Pagadi. Among the Gonds of Adilabad (in English) - 1949.
12. B.H. Meheta - Gonds of Central India. Highlands - VolumeI&II.
13. R. V. Rusel - Tribe and Caste of Central Provinces of India Volume III 1916.
14. Fuhrer Haimendorf. Raj Gonds of Adilabad 1948.
15. W. Grigson - The Maria Gonds of Bastar 1949.
16. D.D. Chatterton - The Story of Gondwana 1916.

ఆదిలాబాద్ జిల్లా గోండి పాట

పాట 1

జై సేవా జే పెర్స పేన్ పాండికుపర్ లింగు అవ్వలే
కాలి కంకాలి బయ్యో అవ్వలే, దేవతలే

మావ నీకే వందనా కుంరం భీము
మావ నీకే వందనా కుంరం భీము
కోటి కోటితల్ రిస్ధర్ కీతే
కోటి కోటితల్ రిస్ధర్ కీతే
కేంజ మావ వందనా! వందనా! వందనా! హో. హో. హో
మావ నీకే వందనా!

జన్మ వాతి జోడేన్ గాట్నే, కీతి అవాజ్ భీము
సారా దేసునే
సారా దేసునే

మావా లాసి నిమ్మే భీము, కీతి ఈతల్ సొలతే! సొలతే! సొలతే!
మావ నీకే వందనా!
మావ నీకే వందనా!

ఆదిలాబాద్ జిల్లాతె రొప్పో. ఆదివాసి కిల్లాతే రొప్పో
ఆదిలాబాద్ జిల్లాతె రొప్పో. ఆదివాసి కిల్లాతే రొప్పో
వాసి నిమ్మే భీము కీతి ఈతల్ సొలతె! సొలతె! సొలతే!
మావ నీకే వందనా!
మావ నీకే వందనా!

"కుమురం భీము"

తెలుగు భావం: జై పెర్స పేర్ జై పెర్స పేన్

జై సేవ జై పెద్ద దేవుడు పాహండి కుపర్ లింగు అమ్మ

కాలికంకాలి తల్లి, అమ్మా, దేవత

మా వందనం నీకు కుంరం భీము "2"

కోటి కోటి నుండి ధరిత్రి చేసింది "2"

వినుమా వందనం వందనం వందనం హో హో హో

మా వందనం నీకు కుంరం భీము "2"

జన్మించినావు జోడెన్ ఘాట్ యందు వినిపించినావు జగతి యందు మా కొరకు నీవు భీము చేసినావు సౌలభ్యం సౌలభ్యం సౌలభ్యం మా వందనం నీకు కుంరం భీము "2"

ఆదిలాబాద్ జిల్లా యందు ఆదివాసి కిల్లా యందు "2"

మా కొరకు నీవు భీము చేసావు

సౌలభ్యం సౌలభ్యం సౌలభ్యం మా వందనం

నీకే కుంరం భీము మా వందనం వందనం

పాట 2

రేలారే రేరెలరే రేలారే రేరేలారే

రేలారే రేరెలరే రేలారే రేరేలారే

కుంరం భీమునా దర్బార్‌రే మంత కోయ/ గోండి దాదాలీరా

బేటియో ఆంత

తాదల్ తమ్మురే సేలడ్ తక్కయె సందీరే పూజ కియానా

రేలారే రెరెలరే రేలారే రేరేలారే

తాదల్ తమ్మురే మీరేయో మాసి కోందానా కాసుర్ పుహనా!

దొరల్ కోందనా కాసుక్ పుహానా

కోందనా గోటిత్‌గా గుంగూక్ దొహోనా

కేడ మెట్టూతా సరి పియానా! భీమున దర్బార్ తే వాయానా.

రేలారే, రేరేలరే, రేలారే, రేరేలారే.

దర్బార్ నగ సర్ కరే వాంత, గరిబునే మద్దతే కీంత,

గోర్ గరిబునే మద్దతే కీంత

జత్ర మందంత కుసిగమ తాంతా!

డెంసా మందంత వాజగాజ మందంతా!

తాదల్ తమ్ముర్ఱే సేలడ్ తక్కకే సందీరే పూజ కియానా.

రేలారే, రేరేలరే, రేలారే, రేరేలారే!

రేలారే, రేరేలరే, రేలారే, రేరేలారే!

తెలుగు భావం:

రేలారే రేరెలరే రేలారే రేరేలారే "2"

కుంరం భీము దర్బార్‌లో గోండి సమాజం అక్కాచెల్లెలు, అన్నదమ్ములు ఒక చోట చేరుతారు.

వీరందరూ కలిసి కుంరం భీమును కొలుస్తారు. పూజిస్తారు. అన్నదమ్ములు, అక్కాచెల్లెలు కలిసి తెల్ల ఎడ్ల బండ్లు కట్టుకొని అడవి మార్గం గుండా జోడే ఘాట్ దర్బార్‌కు ప్రయాణం అవుతారు.

కుంరం భీము దర్బార్ చేరి పాటలు పాడుతూ శ్రద్ధాంజలి ఘటిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఐ.టి.డి.ఏ. ఉట్నూర్ ద్వారా దర్బార్ ఏర్పాటు చేసి గిరిజనుల అర్జీలను స్వీకరించి పరిశీలిస్తారు.

యాత్ర జరుగుతుంది. అందరూ సంతోషంతో ఆడుతూ పాడుతూ అన్నదమ్ములు. అక్కాచెల్లెళ్లు కుంరం భీముకు నివాళులు అర్పిస్తారు.

పాట 3

జన్మ వేలి పాట

సోనెత వేలీ సాంగ్త ఇందనా లాలా
రూపత వేలి కొడ్స్త ఇందనా. కొడ్స్త ఇందనా లాలా
రూపత వేలి కొడ్సేత ఇందానా "2" "సో"

వేలి పిర్తి బార్ ఇందానా లాలా
వేలి పిర్తి బార్ ఇందానా బార్ ఇందానా లాలా
వెలి బార్ ఇందానా "సో"

బార్ పిర్తి చిచె ఇందానా లాలా
కాయ పిర్తి బార్ ఇందానా. బార్ ఇందానా లాలా
కాయ పిర్తి బార్ ఇందానా "సో"

కాయ పిర్తి కాయ ఇందానా లాలా
చిచే పిర్తి కాయ ఇందానా. కాయ ఇందానా లాలా
చిచె పిర్లు బార్ ఇందానా "సో"

కాయ పిర్తి పండి ఇందానా లాలా
కాయ పిర్తి పండి ఇందానా. పండి ఇందానా లాలా
కాయ పిర్తి పండి ఇందానా "సో"

బోన వేలి సాంగ్త ఇందానా లాలా
బోన వేలి కొడ్స్త ఇందానా లాలా
బోన వేలి సాంగ్త ఇందానా

దస్రున వేలి సాంగ్త ఇందానా లాలా
దస్రున వేలి సాంగ్త ఇందానా సాంగ్త ఇందానా లాలా
దస్రున వేలి సాంగ్త ఇందానా

ఓనే పీర్తి బోర్ ఇందానా లాలా
ఓనే పీర్తి బోర్ ఇందానా బోర్ ఇందానా లాలా
ఓనే పిర్తి బోర్ ఇందానా

తెలుగు భావం

ఏ తీగ సాగుతుంది?

బంగారు తీగ సాగుతుంది.

ఏ తీగ సాగుతుంది?

రూపపు తీగ సాగుతుంది.

ఏ తీగ చిగురిస్తుంది?

బంగారు తీగ రూపం చిగురిస్తుంది

తీగ తీగకు మొగ్గ వేస్తుంది.

మొగ్గ మొగ్గకు పువ్వుపూస్తుంది.

పువ్వు పువ్వుకు కాయ కాస్తుంది.

ప్రతి కాయ ఫలం అవుతుంది.

ఎవరీ తీగ సాగుతుంది? (వంశవల్లి)

వంశపు తీగ సాగుతుంది

దస్రు యొక్క వంశపు తీగ సాగుతుంది.

ఇలా అతని యొక్క వంశ వృక్షాన్ని ఒక తీగతో వర్ణించడం జరిగింది.

పాట 4

చుచుచుమ్రి మెటతె మల్ ఏందలాతా "3"
తర అజే బాండే మల్ పాయ దాక "3" "చుచు"
పాయిమ కొకొ పాయిమ కొకొమల్ మెస్కూన్ వాతా "3" "చుచు"
సుయ్యుర్ బుయ్యూర్ పోరికున్ మల్ మెహోలాత
అందక్ వాత పురడ్ డేగో, డేగో పాసి ఓయర్

తెలుగు భావం

అడవిలో కొండ కోనల్లో నెమలి నాట్య మాడుతుంది. తేవమ్మ వదినమ్మ నా వేట తుపాకి నే వేటాడుత. కొట్టవద్దు కొట్టవద్దు మరిది నెమలి గుడ్లకచ్చింది. చుట్టార తన పిల్లలను నెమలి మేపుతుంది. అక్కడి నుంచి గద్ద వస్తుంది. నెమలి పిల్లలను ఎత్తుకుపోతుంది.

పాట 5

జన్మ సీత మాకున్ మా భూమి బయ్యో

సందిరే సేవ కీకోం నీవా బయ్యో "2"

జాతి భేద్ సిల్లెవో నీ సేవతున్ సంది దునియా సందినారే

నీవా సేవా బయ్యో "జన్మ"

రంగు నీవా హిర్వల్ దిసాలత కీతి పంట మ్రర బెర్సాలాత

హర్ నాటే, హర్ రోన్ ఆనంద్ ఆతా ! అట్ర ధానంగ్ పండ్సి

రోనే వాతా!

ఉంది ఎక్కి మెహనత్‌నే సేవా కీకోం, నీ లాసి మా జీవ

సీకోం!

బొమ్మి మావా కేడ మావా హక్ మావయె! బయ్యో! "జన్మ"

కేడ, యోరు, బొమ్మి మావ ఇత్తోరే! మా నాటే మా రాజ్ ఇత్తోరే!

(జల్, జంగల్, జమీన్) హ.హ.హ. "2"

కాలికోం కాంచి, తుడుం పియిసి, నడి దొహిచి

మున్నె ఆసి. నిల్ల నిమ్మో

బొమ్మి మావా, కేడ మావా! యెరు మావా! హక్ మావయో బయ్యో "జన్మ"

పండుగలు

గోండి **తెలుగు**

దివాడి/దండారి **దీపావళి**

గుసాడి, దండారి "పాండి కుప్పల్ లిజన్" పొర్రో పాటర్ దన్నెగావా తగ గుసాడిర్ అన్‌తేర్ వీర్ దివడిత్ ఆట్ రోజ్ మున్నెతల్ దీక్ష పియంతెర్ అని దండారి.

దుస్రో నాటె సొంజి. సోడ వాజాజ్. అట్ర డెమ్సజ్ "చచ్చోయ్ సాబేయ్" ఇంజేర్ యెందన్తేర్ నీరే. దండరి సోత్త నాట్నూర్ ఇయండ్ వీర నాటే వాసి దండారి యెందన్తేర్.

ఇహిన్ యెత్మసుర్ పేన్ద పూజ కీసి దివడిత్ గుసాడిర్ ఆసి. దండారి. యెండన్ తేర్ గుసాడి. మల్ భూరన టోపి కెర్సి. స(ౖరి. సా(క్రి కెర్సి. లంగుటి పొండన్తోర్. మెందొాదగ నీర్ సోకన్తోర్ ఇహిన్ గుసాడి అంతేర్.

దీపావళి పండుగ (భావం తెలుగులో)

దీపావళి పండుగను గోండు గిరిజనులు ప్రత్యేకమైన పండుగగా జరుపుకుంటారు. ఈ పండుగను ఆషాఢ మాసం పూర్ణిమ రోజు "అకాడి" పండుగ రోజున "అక్డా" పేన్ యెత్మసూర్ పేన్ను స్థాపిస్తారు.

ఇలా స్థాపించి 4 నెలల వరకు ప్రతి రోజు సాయంకాలం. "చచ్చోయ్ - సాబేయ్" అని పాడుతూ "దండారి" కోలాట మాడతారు.

అక్టోబర్/నవంబర్ నెలలో దీపావళి పండుగ 8 రోజుల ముందు దండరి వారోత్సవాలు జరుపుకుంటారు.

ఈ దండారిలో గుసాడి వేషధారణ వేసుకుంటారు. నెమలి ఈకలతో కుచ్చు టోపీని తలకు ధరిస్తారు.

భుజాన జంతువు చర్మం, శరీరానికి విభూతి, మెడకు వనస్పతి కాయలు మాలలు, చేతికి రోకలి దండ భూషణం, లంగోటి ధరిస్తారు.

కాళ్లకు నడుముకు గజ్జెలు ధరిస్తారు. ఈ గుసాడి వేషధారణను దేవతగా భావించి "తాదో" అని కొలుస్తారు.

ఇలా ప్రతి గోండు గిరిజన గూడేలలో దప్పులు, తుడుం మోతలతో సవ్వడితో ఊరంతా సందడిగా ఉంటుంది.

దండారి ఒక ఊరి నుండి ఇంకొక ఊరికి ఆహ్వానం పలుకుతారు. అతిథులుగా వెళ్లినవారికి ఆతిథ్యం, గౌరవంగా ఆహ్వానం, గౌరవ మర్యాదలు ఇచ్చి పుచ్చుకుంటారు.

ఈ పండుగ సందర్భంగానే గోండు గిరిజనులలో (అక్కో, మామల్, సోరిక్, బాగ్) సంబంధ బాంధవ్యాలు, తొలి చూపులు జరుగుతాయి.

పూర్వకాలంలో గోండు గిరిజన పెద్దలు "పొర్రో పాటర్ దన్నె గావా" నుండి పద్మల్ పురి కాకో గ్రామం, గోదావరి నది ఒడ్డున గల గుడి రేపు గ్రామం యందు రావుడ్క అనేవారు దండారిగా వెళ్లారని పూర్వీకులు చెప్తారు.

ప్రస్తుతం గుసాడి వేషం వేసి తొలి దర్శనానికి "పద్మల్ పురి కాడో" వద్ద వెళ్లి దర్శిస్తారు.

గోండి వేసుడి – కథ

ఒక ఊరిలో సూరు అను వ్యక్తి ఉండేవాడు. అతనికి వాద్యాలు వాయించడం అంటే ఎక్కువ ప్రీతి. ఎప్పుడంటే అప్పుడు వేళా పాళా లేకుండా "డోల్" అనే వాద్యాన్ని వాయించేవాడు.

గోండి సంస్కృతి ప్రకారం అవసరమైన సమయ సందర్భాలలోనే వాయిస్తారు. పండుగలకు, పూజలకు, దేవుళ్లకు పెండ్లీలకు కాని సూరు ఇష్టం వచ్చినపుడు డోలు మోగించడంతో ఊరి ప్రజలు విసుగు చెంది అతన్ని మందలించారు.

కాని సూరు వినలేదు. గత్యంతరం లేక ఊరి నుండి వెలివేసినారు. అతను ఊరి బయట అటవి ప్రాంతంలో వెళ్లి జీవించసాగాడు.

కాని అలవాటు ప్రకారం డోలు వాయించడం మానలేదు. ఒక పెద్ద చెట్టు ఎక్కి డోలు వాయించేవాడు.

ఈ విధంగా ప్రతిరోజు చెట్టు ఎక్కి డోలు వాయించడాన్ని అడవి జంతువులు పసిగట్టి ఈ మృదువైన నాదం ఎక్కడ నుండి వస్తుందని? అడవి రాజైన సింహం, అడవి జంతువులు నక్కలు, జింకలు, కోతులు, ఎలుగుబంట్లు, ఇతర జంతువులు అతను వాయిస్తున్న చెట్టు దగ్గరికి చేరినాయి.

అడవి జంతువులన్నీ రావడంతో భయపడ్డాడు సూరు. ఎవరు నీవు చెట్టు ఎక్కి డోలు వాయిస్తున్నవెందుకు అని అవి అడిగినాయి.

సూరు జరిగిన విషయం అంతా అడవి జంతువులకు చెప్పినాడు. ఊరిలో డోలు వాయించనివ్వకపోవడంతో అడవికి వచ్చి చెట్టు ఎక్కి వాయిస్తున్నాడని విషయం తెలుసుకొన్న జంతువులు మీ ఊరి పటేల్‌ను అడిగి నీకు న్యాయం చేస్తాం.నిన్ను ఊరికి తీసుకువెళ్తాం. అని వాగ్దానం చేశాయి.

గోండి సంస్కృతి ప్రకారం గ్రామంలో వాయించాల్సిన పెండ్లి కార్యక్రమం వచ్చింది. సూరు డోలు వాయించాడు.

ఆ శబ్దం, నాదం, వినడానికి అడవిలో అలవాటు పడ్డ జంతువులు ఇచ్చిన మాట ప్రకారం ఒక్కొక్కటిగా ఒక్కో వైపునుండి వస్తున్నవి.

ఒక మూల నుండి సింహాలు, ఒకవైపునుండి నక్కలు, జింకలు, ఏనుగు బంట్లు మొదలైనవి. అడవి జంతువులు రావడాన్ని గమనించిన ఊరి జనులు ఉరుకులు, పరుగులు తీసారు.

ఊరి పటేల్‌తో చర్చించిన జంతువులు సూరుని ఊరిలో ఉంచడానికి ఒప్పించాయి. ఆ రోజు నుండి అందరితో ఉంటూ సమయ సందర్భాలలో డోలు వాయిస్తూ జీవించసాగాడు.

కుటుంబ సంబంధిత పదజాలం:

గోండి	–	తెలుగు
అవ్వల్ / బయ్యే	–	తల్లి / అమ్మ
బావల్	–	నాన్న
దాదల్	–	అన్నయ్య
బాయి	–	అక్క
తమ్ముర్	–	తమ్ముడు
సేలాడ్	–	చెల్లెలు
అక్కో	–	తాతయ్య (అమ్మ నాన్న)
తాదో	–	తాతయ్య (నాన్న నాన్న)
అజీ / (బాపు	–	నానమ్మ
కాకో	–	అమ్మమ్మ
ఆతి	–	అత్త
మామల్	–	మామ
పేఫి	–	పెద్దనాన్న
పేరి	–	పెద్దమ్మ
కాకల్	–	చిన్నాన్న
కాకి / యాయల్ / చిన్ని	–	చిన్నమ్మ
అజే	–	వదిన

బాటో	–	బావ
తాద్ మురియల్	–	బావ
సెర్దు	–	బామర్ది
సేర్డడ్	–	మరదలు
తమ్మన్ కొరియడ్	–	తమ్ముని భార్య (మరదలు)

రజ్ – రంగులు

గోండి	–	**తెలుగు**
రగ్గల్	–	ఎరుపు
దా్రవల్	–	తెలుపు
చిల్లాల్ / ఇర్వాల్	–	ఆకుపచ్చ
బోడాల్	–	పసుపుపచ్చ
నీలాల్	–	నీలి
కారియల్	–	నలుపు

సమయం:

గోండి	–	**తెలుగు**
గడే	–	గడియా
గట్కా	–	కొంత సేపు
జులుక్నె	–	తర్వాత
సేన్డ్	–	ఈ రోజు
నాడి	–	రేపు
మన్నె	–	ఎల్లుండి
పిర్నె	–	ఆవలెల్లుండి
అటోరోజ్క్నా	–	వారంతర్వాత
మహ్నామెటె	–	నెల తర్వాత
సాల్ మెటే	–	సంవత్సరం తర్వాత
ఇయండ్	–	ఈ సంవత్సరం
మున్నెతె	–	వచ్చే సంవత్సరం
పెరెండె	–	మూడవ సంవత్సరం
ఎద్ది గాలుం	–	ఎండాకాలం

పిర్ గాలుం	–	వర్షా కాలం
పీని గాలుం	–	చలి కాలం
పల్ వియ్‌నెకె	–	తెల్లవారు జామున
పహ్టె కాలి	–	తెల్లవారిన తర్వాత
గొగ్ది కూస్నేకె	–	తొలి కోడి కూయంగా
సక్రె	–	ప్రొద్దున
దుపారి	–	మధ్యాహ్నం
అట్నం	–	మధ్యాహ్నం వేళ
పోద్రెక్	–	సాయంత్రకాలం
నర్క	–	రాత్రి
నడ్డు నర్క	–	నడి రాత్రి

మహినజ్	–	**నెలలు**
గోండి	–	**తెలుగు**
1. చైత్	–	ఏప్రిల్
2. బాపెయ్	–	మే
3. బుడ్ బావై	–	జూన్
4. అకాడి	–	జూలై
5. పోర	–	ఆగష్టు
6. అకుర్ పోక్	–	సెప్టెంబర్
7. దివడి	–	అక్టోబర్
8. కార్తి	–	నవంబర్
9. సట్టి	–	డిసెంబర్
10. పూస్	–	జనవరి
11. మహో	–	ఫిబ్రవరి
12. దురడి	–	మార్చ్

వార్క్	–	**వారాలు**
గోండి	–	**తెలుగు**
అయ్తు వార్	–	ఆది వారం
సోమ్మర్	–	సోమ వారం

మంగూర్ వార్	–	మంగళ వారం
బుధ్ వార్	–	బుధ వారం
బస్తుర్ వార్	–	గురు వారం
సుక్కుర్ వార్	–	శుక్ర వారం
శన్ వార్	–	శని వారం

స్థలం:

దిక్కులు

గోండి	–	**తెలుగు**
తలవడ్డ	–	ఉత్తరం
కాల్ వడ్డ	–	దక్షిణం
పోరాయిజ్	–	పడమర
సిడాయిజ్	–	తూర్పు

మూలలు:

గోండి

1. రాంటేక్
2. వోల్ తొాడియల్
3. సోనే రావ
4. మొద్దొల్ మూల

అంకెలు

గోండి	–	**తెలుగు**
1. ఉంది	–	ఒకటి
2. రండు	–	రెండు
3. మూన్డ్	–	మూడు
4. నాలుజ్	–	నాలుగు
5. సియ్యుజ్	–	ఐదు
6. సారుజ్	–	ఆరు
7. ఏడుజ్	–	ఏడు
8. ఆట్	–	ఎనిమిది

9. నౌవ్	–	తొమ్మిది
10. దహ	–	పది
11. అక్ర	–	పదకొండు
12. బార	–	పన్నెండు
13. తేరా	–	పదమూడు
14. చౌవ్ద్	–	పద్నాలుగు
15. పంద్ర	–	పదిహేను
16. సోడ	–	పదహారు
17. సత్ర	–	పదిహేడు
18. అట్ర	–	పద్దెనిమిది
19. ఉంది కమ్మి వీస	–	పందొమ్మిది
20. వీస	–	ఇరవై
50. పన్నాస్	–	యాభై
100. సోవ్ (నూర్)	–	వంద
1000. హజర్	–	వెయ్యి

1. గోండి భాషలో ప్రస్తు పరిస్థితి:

ప్రస్తుత సమాజంలో గోండి భాష మాట్లాడే వారి సంఖ్య తగ్గుతుందేమో అనిపిస్తుంది. ఎందుకంటే ప్రస్తుత పరిస్థితులలో విద్య, ఆరోగ్యం, జీవనం గడపడానికి తెలుగు, హిందీ, ఆంగ్ల ప్రాముఖ్యం పెరుగుతోంది. గోండి భాషలో లిపి లేదు. చదవడం, రాయడం కొరకు తెలుగు లిపిని ఉపయోగిస్తున్నారు.

గోండులు నివసిస్తున్నటువంటి గూడేలలో మాత్రం చిన్న, పెద్ద అందరూ గోండి భాషలో మాట్లాడి జీవనాన్ని కొనసాగిస్తున్నారు. పాఠశాలలో చేరి, చదవడానికై తెలుగు, హిందీ, ఆంగ్లాన్ని నేర్చుకుంటున్నారు. మాతృభాషలో విద్య ఉంటే తొందరగా నేర్చుకుంటారని 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు మాత్రమే గోండి భాష తెలుగు లిపితో రాసిన పుస్తకాలు ఉండి కొన్ని పాఠశాలల్లో మాత్రమే బోధించడం జరుగుతోంది.

2. విద్యలో గోండి ప్రాధాన్యం

మాతృభాషలో విద్యాబోధన చేస్తే తొందరగా విద్యార్థులకు అర్థం అవుతుందనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గోండి భాషలో విద్యా బోధనను ప్రవేశపెట్టడం జరిగింది. అందులో భాగంగానే తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు గోండి భాషలో 386 పాఠశాలల్లో మాత్రమే బోధన కొనసాగుతుంది.

తద్వారా గోండి భాష కథలు, గేయలు, వర్ణమాల అక్షరాలు, వస్తువుల పేర్లు, చెట్ల పేర్లు, పక్షుల పేర్లు, వృత్తుల పేర్లు, పరికరాల పేర్లు, చిత్రపటాలద్వారా తన మాతృభాష అయిన గోండిలో సులువుగా నేర్చుకొని అర్థం చేసుకుంటూ గోండి భాషను నేర్చుకొంటున్నారు.

3. రేడియోలో గోండి భాష వినియోగం:

తెలంగాణలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగా 1993 సంవత్సరంలో రేడియో కేంద్రం ప్రారంభమైంది. అప్పటి నుండి ఆదివాసుల జీవన శైలిపై ఆకాశవాణి రేడియో కేంద్రం వారి ఆధ్వర్యంలో పండుగలు, పాటలు, గేయాలు, కథలు, గుసాడి పాటలు, డెమ్సు పాటలు, దేవుని పాటలు, తోటి బిరుదు గోండి పాడే పాటలు, సాన పాటజ్, అనో రాణి పాట రాజుల పాటలు, బీర్షా ముండ పాటలు, కుమ్రం భీము జీవిత చరిత్ర కథలు, వ్యవసాయ సూచనలు, గోండి భాషలో ప్రసారం చేస్తున్నారు. ఈ ప్రసారాలను గోండులు ఎంతో ఆసక్తికరంగా అభిమానంతో వింటూ, సంతోషపడుతున్నారు.

4. టెలివిజన్ గోండి భాష యొక్క వినియోగం:

గోండి భాషలో టెలివిజన్ కార్యక్రమాలు తక్కువగా ఉన్నాయి. అయినా ఈ మధ్య కాలంలో టెలివిజన్‌లో కూడ గోండి భాష కార్యక్రమాలు ప్రసారం అవుతున్నాయి.

గోండుల సంస్కృతికి సంబంధించి ఆచారాలు, వ్యవహారాలు, పండుగలు, పెండ్లిలు, శుభకార్యాలు, జీవిత చరిత్రలు, సినిమాలు చిత్రీకరించి ప్రసారం చేస్తున్నాయి.

"రేలారే రేలారే" కార్యక్రమం గోండి భాషలో మా టివి, తెలంగాణ టివి, టివి9, టివి2 యందు కూడా ప్రసారం అవుతున్నాయి.

గోండి భాషను బ్రతికించడానికి అమరజీవి కుమ్రం భీం జీవిత చరిత్రను సినిమా తీసి ప్రసారం చేయడం జరిగింది. ''పరిసి'' సినిమా విడుదల అయినది.

గోండి పాటలు, డెమ్సు, గుసాడి నృత్యాలు కూడ టెలివిజన్ ద్వారా ప్రసారం అవుతున్నాయి.

సప్తగిరి టివిలో ప్రసారమయ్యే పాఠశాల కార్యక్రమంలో గోండి భాషలో కథను చిత్రీకరించి ప్రసారం చేస్తున్నారు.

5. వ్యాపార రీత్యా వ్యవహారంలో గోండి ప్రాముఖ్యం:

ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువగా మాట్లాడే భాష గోండి భాష ఇక్కడ వ్యాపార రీత్యా గోండులు తాము పండించిన పంటలను అమ్మాలన్నా, వస్తువులను, పశువులను, బట్టలు, నిత్యావసర వస్తువులు, కూరగాయలు కొనడానికి వ్యాపారులే గోండి భాషను నేర్చుకొని వ్యాపారం సాగిస్తున్నారు.

ఏజెన్సి ప్రాంతంలో వ్యాపార రీత్యా గోండి భాషకు చాలా ప్రాధాన్యం ఉంది.

కప్డి బాన్ మీటర్
మిర్చజ్ బాన్ కిలో
సాపజ్ బాన్ కిలో
సాకుర్ బాన్ కిలో
గాస్లిజ్ బాన్ డజన్
కేరే పండిజ్ బాన్ డజన్
లసుడ్క్ బాన్ కిలో
జాటజ్, తూరిజ్ బాన్‌కిలో

ఈ విధంగా గోండి భాష వ్యాపార రీత్యా ప్రాధాన్యం పొందింది.

6. ఇంటర్‌నెట్‌లో గోండి వినియోగం:

ఈ పరిస్థితులలో గోండి భాష యొక్క సాహిత్యం, సంగీతం, పాటలు, ఇంటర్‌నెట్‌లో పొందుపరచబడినవి. తద్వారా గోండి భాషకు భారతదేశంలోనే కాకుండా ఇతర దేశాలలో కూడా ప్రాధాన్యం సంతరించుకుంది.

చహ్కాటి రవి, దుప్పర్ పేట్, ఇచ్చోడ, ఆదిలాబాద్, తెలంగాణ.

వెడ్మ వెంకటేశ్, దుప్పర్ పేట్, ఇచ్చోడ, ఆదిలాబాద్, తెలంగాణ

వీరు సాలేమర జీడ్పె చెక్కవాడే అనే పాటను తెలంగాణ నుండి అమెరికా వెళ్లి మాటివి కార్యక్రమాలలో పాడటం జరిగింది.

ఇంటర్‌నెట్‌లో "గూగూల్.కామ్" లో గోండి సాంగ్స్‌లో ఈ పాటలు ఉన్నాయి.

1. మామా నా వావ్‌టే మర్కన వాడి
2. సంగోనివా వాసికే
3. బచ జేల్‌గా మామా పెడి సుడంత పెడి సుడంత
4. రాణి అడికియామా రాణి సోంగ్ పియుమా.

7. వార్తాపత్రికలలో ప్రచురణలో గోండి భాష పాత్ర:

వార్తా పత్రికలలో గోండి జాతికి సంబంధించిన వార్తలు ప్రచురణ పొందుతున్నాయి. పండుగలలో దీపావళికి గుసాడి నృత్యం

దెమ్స నృత్యం
జానపద గేయాలు
నాగోబా జాతర
కుమ్రం భీము వర్ధంతి
హేమన్ డార్ఫ్ వర్ధంతి – లాంటివి.

హేమన్ డార్ఫ్ గారు ఆదిలాబాద్ జిల్లా గోండుల జీవన స్థితి గతులపై అధ్యయనం చేసి తన జీవితాన్నే త్యాగం చేసినారు. వారి కర్మకాండను వారి కుమారుడు, మనుమడు లండన్ నుండి తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా మార్లవాయి గ్రామానికి వచ్చి గోండుల సంప్రదాయం ప్రకారం పిత్రెజ్ (కర్మకాండ) జరిపినారు. ఫిబ్రవరి 2012 లో ఈ విషయం జాతీయ మరియు అంతర్జాతీయ వార్తా పత్రికలలో ప్రచురింపబడింది.

8. గోండి భాషలో కొన్ని ఆంగ్లపదాలు కూడ చేరినాయి

ఆంగ్లేయులు భారతదేశాన్ని పరిపాలన చేయడం వలన కొన్ని ఆంగ్ల పదాలు తెలియకుండానే గోండి భాషలో కూడ కలిసిపోయినాయి.

రేడు – రేడియో
రిబ్బిన్ – రిబ్బన్
టి.వి.– టెలివిజన్

9. 65 సంవత్సరాలపై వయసు గల వ్యక్తులకు 15–20 సంవత్సరాల గోండి వ్యక్తుల మధ్య వ్యత్యాసం

65 సంవత్సరాలపై బడిన వ్యక్తులు మాతృ భాషలో స్వచ్ఛంగా మాట్లాడుతారు. గోండి పదాలలోనే మాట్లాడతారు. ప్రస్తుతం 15–20 సంవత్సరాల వారు ఆధునిక ఇతర ఆంగ్ల, హిందీ, తెలుగు భాషల పదాలను కలిపి మాట్లాడతారు.

వ్యాపార, వ్యవసాయ రుణాలు, మహిళా సంఘాలు కలిసికట్టుగా మాట్లాడే సందర్భంగా 65 సంవత్సరాలు నిండిన వ్యక్తులు 15–20 సంవత్సరాల వ్యక్తి. సందర్భానుసారంగా గోండి వ్యక్తులు తమ మధ్య వ్యత్యాస పదాలను ఉపయోగిస్తారు.

10. సంగీతంలో గోండి భాష ప్రస్తుత పరిస్థితి:

ప్రస్తుత పరిస్థితులలో సంగీతంలో గోండి భాష ప్రాధాన్యం చాలా విస్తరించింది.

గోండి భాషలో సంస్కృతి సంప్రదాయాలు ఆచారవ్యవహారాలు అన్ని క్యాసెట్ సిడిలలో పొందుపరిచి ప్రతి గిరిజన ఆదివాసి గోండుల ఇండ్లలో "గోండి" పాటల క్యాసెట్లు, సీడీలు ఆలకిస్తూ తిలకిస్తున్నారు. మా టివి, ఈటివి టివి9లలో కూడ పాటలు డెంసలు ప్రసారం జరుగుతున్నాయి.

అమెరికా వెళ్లి కూడా గోండి భాష పాటలను పాడుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా దేశంలోను, ఇతర దేశాలలో కూడా గిరిజన ఆదివాసి గోండుల సంగీతం ప్రాధాన్యతను సంతరించుకుంది.

వార్తాపత్రికలలో, టివిలలో, ఇంటర్‌నెట్‌లలో కూడ డెంస, పాటలు పొందుపర్చబడి విస్తరణ జరుగుతున్నది.

2. ప్రధాన్ భాషా సాహిత్యాలు

– మెస్రం మనోహర్

భారతదేశపు మూల నివాసులైన ఆదిమ గిరిజనులలో ప్రధాన్ (గోండు) ఒక తెగ. వీరు ద్రావిడ సంతతికి చెందిన వారనే అభిప్రాయం కలదు. వీరు ముఖ్యముగా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్, బీహార్, ఒరిస్సా, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో నివసిస్తున్నారు. వీరు నిసర్గవాదులు వీరి సామాజిక వ్యవస్థ – వీరి పూర్వీకులైన పాహన్డీ కుపార్ లింగో ప్రతిపాదించిన 'టోటెం వాదం' అనగా (జంతువుల) గుర్తింపు చిహ్నాంపై ఆధారపడి ఉన్నది. వీరి సాంస్కృతిక, ధార్మిక, సామాజిక శిక్షణ ఆదర్శవంతమైనదిగా ఉన్నది. వీరి సంస్కృతి సింధు నాగరికతకు చెందినది. సింధు నాగరికత తవ్వకాలలో బయటపడిన శివలింగం, మాతృమూర్తి విగ్రహం వీరి వంశ పురుషుడైన పాహన్డీ కుపార్ లింగో ఆకారమును పోలిఉన్నది. వీరి సామాజిక రచనలకు మూలపురుషుడు 'పాహన్డీ కుపార్ లింగో' అని భావిస్తారు.

వీరు భాషా పరంగా మరాఠి మాట్లాడుతారు. (ఆదిలాబాదు జిల్లా తెలంగాణలో) కాని గోండి మాతృ భాష అయినందున అందరికీ గోండి భాష మాట్లాడుట వచ్చు ఉంటుంది. గోండుల ధర్మ సంస్కృతిని ప్రచారం చేయుట వీరి ముఖ్యమైన వృత్తి. ప్రధానంగా గోండు సంస్కృతిని పదిలపరిచి ఉంచినవారి గురించి వివిధ చరిత్రకారులు తెలిపిన వివరములు ఈ మాదిరిగా ఉన్నాయి.

రస్సెల్ హీరాలాల్ గారి అభిప్రాయము: The Pradhans are inferior branch of the Gonds who act as priest and ministers of the Gonds. As the priest of the Gonds the Pradhans are employed to conduct the ceremonial worship of great God Bura dev which takes place on the third day of the bright night baishakh. (page No 21).

ప్రధాన్‌లు గోండు జాతికి ఉపజాతిగా ఉండి, గోండుల పూజలు నిర్వహించే పూజారులుగాను, మంత్రులుగాను కార్యములు చేస్తారు. వైశాఖ మాసములో

పౌర్ణమికి జరిగే శ్రేష్ఠమైన పెద్దదేవుని (పెర్సాపేన్) పూజ నిర్వహిస్తారు. పూజలో సజారిలో ప్రధాన్‌లు ముఖ్య భూమికను నిర్వహిస్తారు. గోండుల ముఖ్య పూజారులుగా ప్రధాన్‌లకు పని అప్పగించడం జరుగుతుంది.

డా. వెరియర్ ఎల్విన్ : The Pardhans are officially ministrel of the Gond tribe they are infact a branch of great Family and in their myths say that their founder was the youngest of the original seven Gond brothers they share the life of the Gond.

ప్రధాన్‌లు గోండు వారికి అధికృత మంత్రులు. వాస్తవానికి వారు గోండుల పెద్దకుటుంబము యొక్క ఒక శాఖ. వారి పురాణాల ప్రకారం ఏడుగురు గోండు అన్నదమ్ములలో అందరికన్నా చిన్నవాడైన ప్రధాన్ ఆదివాసుల సంస్థాపకుడు. వీరు గోండుల ఆచార్య వ్యవహారాలను అనుసరిస్తూ జీవించారు. **డా. ఎల్విన్:** The Pradhans have their own long narrative poems of almost epic character which are not shared by the others. But the bulk of the songs is common to all and the variation arise only as one moves from place to place. The songs printed here call all with a few exceptions noted in the text be called Gond songs, but they could equally well be called Pradhan.

దాదాపు పురాణేతిహాసాల లక్షణాలతో కూడిన సుదీర్ఘ కథా గేయాలు ప్రధానులకున్నాయి. అవి వారికే విశిష్టమైనది. కానీ ఈ పాటల్లో చాలా వరకు అందరికీ సమానమైనవే. ప్రాంతాన్నిబట్టి కొద్ది భేదాలుంటాయి. ఇక్కడ ప్రచురించిన పాటలను ఏ కొన్నిటినో మినహాయిస్తే గోండుపాటలనే అనవచ్చు. కాని వాటిని ప్రధానుల పాటలనడం కూడా సరైనదే.

డా. రామ్‌భరోస్ అగర్వాల్ మధ్యప్రదేశ్‌లోని మండ్లా. ఈ గ్రంథంలో పర్ధాన్, పర్ధాన్ జాతి గురించి వెరియర్ ఎల్విన్ గారి అభిప్రాయము వెలిబుచ్చినారు: There is one class of tale, however, that must have special mention. The Pradhans are the official ministers of the Gonds tribe. They are in fact a branch of the great Gond family and in their myths that their founder was the youngest of the original seven Gond

brothers, they share the life of the Gond. Often act as their priests there is a pradhan priest at the famous shrine of Lingo at semurgaon and it was Pradhan priest who first recounted the Lingo Lengerd to the Rev Stephen Hislop have same class and have entirely similar social and religious observances. But they do not intermarry and though the Pardhan may eat from a Gond kitchen. The Gond is forbidden to accept his younger brothers food, the Pardhan have the right to visit Gonds houses to the same sect as themselves and sing there. There are several kinds of gifts that Gonds are expected to give their pardhan class member (page No 84)

మౌఖికముగా కథలు చెప్పే వర్గము కలదు వారి గురించి విశేషముగా చెప్పవలసి ఉన్నది. గోండుల గురువులు అన్ని పనులు చేసే సమయంలో లింగో యొక్క ప్రసిద్ధ పవిత్రస్థానము అయిన సుమేర్ గ్రామములో పర్ధాన్, లేదా ప్రధాన్ గురువు ప్రస్తావన కనిపిస్తుంది. ఈయనే ఆ గురువు పర్ధాన్ లింగో గురించి స్టీఫెన్ హిష్లప్ The story of Gondwas రచయితకు ప్రథమంగా వివరించాడు. ఆయన వంశము సంపూర్ణ సామాజిక మరియు ధార్మిక విధానాలు అలాగే వాటిని ఆచారించే జాతి ఉన్నట్లు వివరించాడు. గోండులు ప్రధానులు పరస్పరముగా వివాహ సంబంధాలు ఏర్పర్చుకోరు, పర్ధానులు గోండుల చేతి వంట తింటారు కాని గోండులు మాత్రము ప్రధానుల చేతి వంటను తినరు. వారి గోత్రాల వారి ఇంటికి వెళ్లి కలుస్తారు మరియు పాటలు కథలు వీరగాథలు పూజాకార్యక్రమాలు చేసే సంపూర్ణ అధికారము పర్ధాన్‌లకు కలదు, గోండులు పర్ధాన్ వంశస్థులకు వివిధ రకాల దానాలు ఇవ్వడాన్ని అభిలషిస్తారు.

గోండి దేవతల జన్మకథ

పరెండ "ఖడా" కొమపేన్, గోండి దేవతలకు జన్మనిచ్చిన కాళికంకాలి తన పిల్లలను అడవిలో వదలి వెళ్లిపోయినది. అప్పుడు శ్రీశంభు, గిరిజల్ పార్వతి మూడు లోకములు విహరించుటకు బయలుదేరినారు మార్గమధ్యంలో అడవిలో ఈ పిల్లల ఏడుపు విని పార్వతి నందిపై నుండి దిగివచ్చి వీరిని తీసుకొని కైలాసానికి

వెళ్లిపోయినది. వీరికి, ఇతరదేవతలకు పాలను ఇస్తుండెను. అయితే కొన్ని నెలలకు పార్వతి ఎడమ స్థన్యం, ఎడమవైపు శరీరము బక్కపడడం జరిగినది. ఇది గమనించి శ్రీశంభు ఒక రోజు అందరు పిల్లలకు భోజనాలు ఏర్పాటుచేశాడు, శాఖాహార భోజనము. అయితే ఈ గోండులు స్నానానికి వెళ్లి అక్కడ ఇప్ప సారా సేవించి భోజనానికి వచ్చారు. భోజనపంక్తిలో కూర్చున్న తరువాత వారికి శాఖాహార భోజనము రుచించలేదు. వారిలో వారు మాంసాహారము ఉంటే బాగుండునని అనుకోసాగారు. ఈ విషయమును గ్రహించిన శ్రీశంభు తన తొడ నుండి మైల తీసి ఒక ఉడుతను తయారచేసి దానిని భోజన పంక్తి మధ్యలో వదిలినాడు. దానిని చూసి గోండి దేవతలు– పట్టుకోండి అంటూ భోజన పంక్తి మధ్యలో నుండి లేచి పరుగులు పెట్టినారు. ఇది గమనించిన శ్రీశంభు వీరు మాంసము కొరకు పరుగులు తీస్తున్నారు.వీరికి జ్ఞానము వచ్చేవరకు వీరు (గుహలో) ఉండాలని (యాది) గుహలో బంధించాడు. ఎప్పుడు ఒక సత్పురుషుడు వచ్చి మిమ్ములను బంధ విముక్తులు చేస్తాడో అప్పుడు మీరు బయటకు రావలెనని శపించాడు.

గోండి దేవతలను బంధ విముక్తులు చేయడం

పన్నెండు సంవత్సరాలకు పాహన్దీ కుపార్ లింగో, జంగోరాయితడ్ హీరాసుక్కా ప్రధాన్ కలసి వారిని శాప విముక్తులు చేసినారు. వీరు గుహబయటకు వచ్చిన తరువాత వారికి సామాజిక రచన, బంధాలు, బాంధవ్యాలు, ఆచారవ్యవహారాలు, దేవతల పూజా విధానము నేర్పినారు.

మోతిరాం కంగాలి– ప్రసిద్ధ గోండి రచయిత గారి పారికుపార్ లింగో కోయపున్నెం అనే గ్రంథంలో: గోండి దేవతలు శ్రీ శంభుని శాపము వలన దేవతలు ఖోరోపాటర్ దన్నేగాం అనే ప్రాంతంలో (యాది) గుహ యందు బంధించి ఉంచినారు. ఇది మహారాష్ట్రలోని భండార్ జిల్లా యందు గల సల్లేకసా అనే తాలుకాలో కలదు. ప్రతి సంవత్సరం మాఘమాస పౌర్ణమినాడు జాతర జరుగును. ఈ జాతరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా, బీహార్, ఛత్తీస్‌గడ్, తెలంగాణ రాష్ట్రాల నుండి అధికమొత్తంలో ఆదివాసులు గుమిగూడుతారు. దేవతలను శాపవిముక్తులు చేయడానికి పాహన్దీ కుపార్ లింగో, జంగోబాయి, హీరాసుక్కాల సహకారం తీసుకొన్నాడు.

గుహ బయటకు దేవతలను తీయడము చాలా కష్టమైనది. అప్పుడు పాహన్దీ కుపార్ లింగో తన సంగీత గురువైన హీరాసుక్కాను వేడుకున్నాడు. శిష్యుని ప్రార్థనకు

మెచ్చి హీరాసుక్కా ఏమి కావాలని అడిగినాడు. అప్పుడు పాహన్దీ కుపార్ లింగో గోండి దేవతలు శాపముతో ఈ గుహ (యాది) యందు కలరని వారిని శాపవిముక్తులు చేయాలని కోరినాడు. అప్పుడు హీరాసుక్కా ఈ కార్యము ప్రాణములతో చెలగాటమని సాహసముతో కూడుకున్నదని, ఒకవేళ ఈ కార్యములో తాను ప్రాణాలు కోల్పోతే నా సంగతి ఏమిటని ఆవేదన వెలిబుచ్చాడు. తను ఈ ధర్మ పరిరక్షణలో ప్రాణాలు కోల్పోతే తన వంశము వారికి మీరు ఈ అభయము తీర్చాలని షరతు పెట్టినాడు. వీరు ఏడు రకాల దానాలు చేయాలని సూచించారు. అవి :

1. పేన్‌దాన్ = దేవుని పూజా కార్యక్రమాలలో ఇచ్చేది
2. ముయార్ దాన్ – ధనము
3. మర్మింగ్‌దాన్ – వివాహము
4. సడేదాన్ – అల్లుల
5. పాల్‌దాన్ – పాల యొక్క దానము అనగా
   ఉదా: 5వ సగా తిమ్మాయి. 4వ సగా వారి పాలు త్రాగి ఉంటే
   4వ సగా వారికి ఇచ్చుట.
6. తంగేదూల : భార్య విడాకులు పొందితే ఇచ్చేది
7. కారుణ్ దాన్ – కర్మకాండలో (చనిపోయిన తరువాత) ఇచ్చేది.

పై షరతులకు ఒప్పుకొని పాహన్దీకుపార్ లింగో తన గోండి దేవతలను బయటికి తీయవలసిందిగా అభ్యర్థించాడు. హీరాసుక్కా తన సంగీత గాత్రం కిక్రి అనే వాయిద్యంతో గుహ (యాది) ముందుండి సంగీతమును వాయించడం ప్రారంభించాడు. సంగీత ధ్వనులు వారి చెవులయందు ప్రతిధ్వనించసాగాయి. గుహ లోపల ఉన్న గోండి దేవతలలో శరీరాల్లో ఒక్కసారిగా శక్తి, విద్యుత్తు ప్రవహించినట్లు ప్రవహించి వారిని మేల్కొపినది. అందరూ ఒకేసారి గుహ ముందున్న బండరాయిని నెట్టివేయగా ఆ బండరాయి గుహ ముందర కిక్రి వాయిస్తున్న హీరాసుక్కా మీద పడి ఆయన అక్కడే అమరుడైనాడు. ఆయన ప్రాణవాయువు గుట్టపై ఉన్న బండల నుండి వెళ్లిపోయినది. ఏ బండరాయి గుండా ప్రాణము పోయినదో అక్కడ చిన్న సన్నని రంధ్రము ఏర్పడినది. ఇప్పటికిని ఆ రంధ్రము గుండా ప్రతి నిమిషానికి ఒక చుక్క నీరు పడుతుంది. గుహ (యాది) బయట హీరా సుక్కా యొక్క సమాధి మరియు జెండా ఉన్నాయి.

అంతటి గొప్ప ప్రాణత్యాగము చేసి గోండి దేవతలను శాపవిముక్తులను చేసిన హీరాసుక్కా త్యాగానికి పాహన్డీ కుపార్ లింగో గోండి దేవతలను గుహ బయటకు తీసిన తరువాత వారిని ప్రమాణము చేయించినాడు ఆకాశంలో సూర్యచంద్రులు ఉన్నంతవరకు భూమి ఉన్నంతవరకు హీరాసుక్కా త్యాగము మరవకుండా ఆయనకు చేసిన ప్రమాణమును తప్పకుండా గోండి ధర్మములో నిలుపుతామని గోండి దేవతల చేత ప్రమాణము చేయించినాడు.

పర్ధానులు పూర్వకాలంలో కేవలం ధర్మవిషయాలు మాత్రమే చెబుతూ గోండులు ఇచ్చే దానాలు స్వీకరించే వారు. గోండి ధర్మప్రజలు సామాజిక వ్యవస్థగా ఏర్పడిన తరువాత ఎవరి దేవతలు వారుగా 4 సగాలుగా (కుదురుగా) ఏర్పడినారు అలాగే వారికి 4 సగాల పర్ధానులు ఏర్పడ్డారు. ఒక పర్ధాన్ ఇంకొక సగా వారి దగ్గరికి వెళ్లడు.

పర్ధానులు: ముఖ్యముగా పెర్సుపేన్, పెద్దదేవుడు, జంగోబాయి, పాహాన్డీకుపార్ లింగో, అవ్వల్‌పేన్, ఆకిపేన్, భీమల్ పేన్, రాహుడ్ పేన్, బేతాల్, జైతూర్ మొదలైన దేవతల పూజలు చేస్తారు.

తెలంగాణ ప్రాంతములో ఎక్కువగా 4వ సగా నుండి 7వ సగా వరకు గల వారి వివరాలే లభ్యమౌతాయి.

4వ సగా దేవుళ్ల గోత్రాల Totem తాబేలు

5వ సగా దేవుళ్ల గోత్రాల Totem గువ్వ రకానికి చెందిన (పొనాడ్ పిట్ట)

6వ సగా దేవుళ్ల గోత్రాల Totem పులి

7వ సగా దేవుళ్ల గోత్రాల Totem నాగసర్పము.

పైన తెల్పిన Totem లను చంపటం కాని తినటం గాని చేయరు.

జననం

ఇంటిలో బిడ్డ జన్మించినప్పటి నుండి 12 రోజుల వరకు బాలింతను నేలపైనే పడుకోబెట్టుతారు. శిశువు పుట్టిన 3 రోజులకు ఆడవారి కొరకే పుట్టిసభ ఏర్పాటు చేస్తారు. ముత్తైదువలు హాజరై నువ్వులు, బెల్లంతో తయారుచేసి (ఎంజూర్) అనే దానిని పంచి పెట్టుతారు. 9 లేక 12 రోజులకు శిశువు యొక్క వెంట్రుకలు మామ వరుసవారు తీస్తారు. 21 రోజులకు నామకరణం చేస్తారు.

వివాహం

పర్ధానులు గోండులు చేసే వివాహపద్ధతి ఒకే రకంగా ఉంటుంది. వివాహ వ్యవస్థను పాహన్డీ కుపార్ లింగో చాలా పకడ్బందీగా చేసినాడు. ఈ వివాహ పద్ధతులు ఇతర వారికన్నా భిన్నంగా ఉంటాయి. 1 నుండి 12 సగాల వారి పెండ్లి సంబంధాలు సరి సంఖ్య వారితో సరి సంఖ్య గోత్రాల వివాహము చేయరాదు. బేసి సంఖ్య వారి గోత్రాలలో బేసి సంఖ్య వివాహము చేయరాదు. అలాగే తల్లి 4వ సగాకు చెందినదైతే వారి పాలు ఒకే సగకు చెందినవిగా భావిస్తారు. వారు వరసకు అన్న అవుతారు. ఒక్కొక్కప్పుడు పెండ్లి వధువులు దొరకటం కూడా కష్టమైనా, ఈ పద్ధతిని ఇప్పటికీ పాటిస్తున్నారు. మామూలుగా వివాహాలు 1. పెద్దలు కుదిర్చినవి, 2. రాక్షస వివాహం. ధరున్‌టాక్‌న వధువును ఎత్తుకొని పోవుట. 3. శివార్ దాసచ వధువుకు వరస కలిసి నచ్చితే వరుని ఇంటికి వెళుతుంది. 4. ఘర్‌జావై ఇల్లరికం మొదలైన పద్ధతులు కలవు.

మరణం

మృత్యువు మానవుల జన్మకు ముగింపు సన్నివేశం. చనిపోయిన వారిని దాదాపుగా ఖననం చేస్తారు. 3 రోజుల వరకు సూతకమును పాటిస్తూ వారి పేరు మీద (కొరమర) పిట్టికేసే కార్యక్రమం చేస్తారు. సంవత్సరం తరువాత కార్తికమాసంలో దేవ్ కారుణ్ చేస్తారు. ఒకవేళ వారి గోత్రంలోని వారు పేదవారైతే దేవ్‌కారుణ్ చేసే సమయంలో చనిపోయిన వారి కుటుంబీకులను కూడా వీరు చేసే కార్యక్రమంలో భాగస్వాములు చేస్తారు.

ఆడవారి హక్కులు

కొన్ని పండుగలు ప్రత్యేకంగా ఆడవారికి మాత్రమే కలవు. శిశువు జన్మించినపుడు, వివాహంలో కొన్ని కార్యక్రమాలు ప్రత్యేకముగా కలవు. ఇప్పటివరకు వరకట్న సంస్కృతి లేదు. మగవాడు అనేవాడు తప్పక ఆడవారిని పోషించాలి అనే భావన కలదు. కాని ప్రస్తుతం మెల్లమెల్లగా వరకట్నం అడుగుపెట్టుచున్నది.

సాహిత్యం: పర్ధానుల సాహిత్యం తరతరాలుగా మౌఖిక రూపంలో భద్రపరిచి ఉంచినారు. వారి మత రాజకీయ సాంఘిక జీవన విధానాలు తెలిపేటటువంటి మౌఖిక గాథలు ఎన్నో కలవు. పర్ధానులు సాంస్కృతిక మతదైవ సంబంధమైనటువంటి సాహిత్యమును మౌఖికముగా ప్రచారం చేస్తూ ముందు తరాలకు అందిస్తూ ఉన్నారు.

వీరు రేలా పాటలు, పెండ్లి, జనన, మరణానికి సంబంధించిన కథలు, దేవతలకు సంబంధించిన కథలు నిక్షిప్తపరిచి ఒక తరం నుండి మరొక తరానికి బహుమతిగా ఇస్తూ వస్తున్నారు.

జీవన విధానము: ప్రధానంగా వీరు ధర్మప్రచారకులుగా జీవనం గడుపుతారు. అధికమందికి భూములు లేవు. వీరిది ఆధారపడ్డ ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయ కూలీలుగాను, కూలీగాను అటవీ ఉత్పత్తిని సేకరించి వచ్చిన ఆదాయంతో జీవితాన్ని గడుపుతారు.

పండుగలు : 1. ధురాడి (హోళి), 2) మాండావుస్ (ఉగాది), 3) చైత్‌భీంగా మర్మింగ్ 4) ఆకాడి 5) జామూర్ ఆవూస్ 6) నాగ పంచమి 7) పోరా 8) బడీగా 9) దసరా 10) దీపావళి (సట్టె) పేర్సాపేన్ పూజ సంక్రాంతి.

ముగింపు :

ఈ ధర్మప్రజలు ఎన్నో సాంస్కృతిక దాడులకు గురైనప్పటికిని తరతరాలుగా వారి ఆచార వ్యవహారాలను పాటిస్తూ భారతీయ ఆదివాసి సంస్కృతిని కాపాడుకుంటూ వస్తున్నారు.

3. బంజారా భాషలో అలంకారాలు, పొడుపుకథలు సామెతల ప్రయోగం

– చోడ రవి,

పరిశోధన విద్యార్థి ఉస్మానియా విశ్వావిద్యాలయం

తెలంగాణ గోర్ బోలి

తెలంగాణ అంతటా బంజారులు తమ భాషను "గోర్ బోలి" లేదా గోర్‌వాతే అని, తమను తాము గోర్ జాతి అని పిలుచుకుంటారు. బంజార స్టడీ టీమ్ 1969 సంవత్సరంలో తొలిసారిగా వీరి భాష "గోర్ బోలి" అని వ్యావహారంలో ఉన్నదని గుర్తించారు. తమ జాతివారిని "గోర్" అని పిలుస్తారని బంజార స్టడీ టీమ్ గుర్తించింది.

భారత దేశంలో వివిధ జాతులవారికి వివిధ తెగల వారికి ప్రత్యేకమైన భాష ఉన్నది. లంబాడీ భాషలో వారు మాట్లాడే మాటల్లో పాడే గేయాల్లో అలంకారాలు పొడుపు కథలు, సామెతలు సందర్భాన్ని బట్టి ఉద్భవిస్తాయి.

సంచార జీవులైన లంబాడీలకు అలంకార శాస్త్రం గురించి అవగాహన లేదు కాని సహజంగా వారి మౌఖిక గేయాల్లో అలంకారాలు నిక్షిప్తమై ఉన్నాయి.

శబ్దాలంకారాలు : శబ్దాన్ని ఆశ్రయించి ఉద్భవించే అలంకారాలను శబ్దాలంకారాలు అంటారు.

(1) **వృత్యను ప్రాస అలంకారం:** ఒక అక్షరం లేదా పదము పలుమార్లు ఆవృత్తం కావడం వృత్యను ప్రాసాలంకారం అంటారు.

ఉదా: "హలో హలోరే బాలకేయా"

పై ఉదాహరణలో "ల" అనే అక్షరం అనేకసార్లు ఆవృత్తమైనది. అందువల్ల వృత్యను ప్రాసాలంకారం అంటారు.

(2) అంత్యాను ప్రాసాలంకారం: వాక్యము చివరగాని పాదం చివర గాని ఒక అక్షరం లేదా పదము ఆవృత్తమైతే అంత్యాను ప్రాసాలంకారం అంటారు.

ఉదా: "యాడి బాగేన గేచ
ఖాటే అంబా లాయిచ
ముక్క ముక్క కాటిచ
కాటన్ అచార్ ఘాలిచ"

పై గేయంలో "చ" అనే అక్షరం ప్రతి చరణం చివర ఆవృత్తమైనది. కావున ఇది అంత్యాను ప్రాసాలంకారం అంటారు.

ముక్తపదగ్రస్తాలంకారం: వాక్యం చివరగాని పాదం చివరగాని ప్రయోగించిన మాటను లేదా పదమును తిరిగి వెంటనే గ్రహించి ప్రయోగించుటను ముక్తపద గ్రస్థాలంకారం అంటారు.

ఉదా: "ఉదంర్ కత్త దల్బామా
దల్బా కత్త పాణి బరాగో
పాణి కత్త ఢోర్ పిగే
ఢోర్ కత్త గట్సాయా
గట్సా కత్త బళ్గో"

పై గేయంలో చరణాంతంలో వాడిన పదాలనే తిరిగి వెంటనే గ్రహించి ప్రయోగించుటచే ముక్తపదగ్రస్థాలంకారం అంటారు.

అర్థాలంకారాలు: అర్థాన్ని ఆశ్రయించి ఉద్భవించే అలంకారాలను అర్థాలంకారాలు అంటారు.

(1) **ఉపమాలంకారం:** ఉపమానానికి ఉపమేయానికి. చక్కని పోలిక చెప్పి మనోహరంగా వర్ణించుటయే ఉపమాలంకారం.

ఉదా: "సీతారో ముండో చాంద్ నయి జగ్ జగ్ జాంకరో"

ఉపమేయం: ముండో

ఉపమానం : చాంద్

ఉపమావాచకం: నయి

సమాన ధర్మం: జగ్ జగ్ జాంకరో

పై ఉదాహరణలో ఉపమేయానికి ఉపమానానికి చక్కని పోలిక చెప్పి మనోహరంగా వర్ణించబడింది. కాబట్టి ఇది ఉపమాలంకారం.

అతిశయోక్తి అలంకారం: ఒక వస్తువును ఉన్నదానికంటే అధికం చేసి వర్ణించుటను అతిశయోక్తి అలంకారం అంటారు.

ఉదా: "ఓ టాండేయా బంగ్లా రామేన లాగరేచ"

పై ఉదాహరణ మేడలు ఆకాశానికి తాకుతున్నయి. మేడలు ఎత్తుగా కట్టినప్పటికి ఆకాశానికి తాకడం సాధ్యం కాదు. కాబట్టి అధికం చేసి చెప్పడం వలన అతిశయోక్తి అలంకారం అంటారు.

లంబాడీ భాషలో పొడుపు కథలు: తెలుగు భాషలో పొడుపు కథలు సందర్భాన్ని బట్టి ఉద్భవించిన మాదిరిగానే లంబాడీ భాషలో కూడా సందర్భాన్ని బట్టి పొడుపు కథలు ఉద్భవిస్తాయి. పొడుపుకథను సంస్కృతంలో "ప్రహేళిక" అని, ఇంగ్లీషులో 'Riddle' అని అంటారు. తెలుగులో పొడుపుకథకు విడుపు కథ, తట్టుకథ, మారు కథ, చిక్కుముళ్లు, అడ్డు కథ మొదలైన పేర్లు ఉన్నాయి. లంబాడీ భాషలో పొడుపుకథను "ఓదడేర్ సాకీ" అంటారు. "ఓదడేర్ సాకీ" అంటే విడుపు కథ అని అర్థం, పోడేర్ సాకీ అంటే పగలగొట్టు కథ అని అర్థం. లంబాడీలు పొదుపు కథను పెళ్లి సమయాల్లో పండుగ సమయంలోను పంచాయితీ సమయంలోనూ ఒకరు పొడుపుకథను పొడుస్తుంటే మరొకరు విప్పుతూ ఆనందంతో పొంగిపోతారు. ఈ వినోదం విజ్ఞానాన్ని మేధను పరీక్షించే విధంగా కొనసాగుతుంది. లంబాడీల పొడుపుకథలకు తెలుగు జానపదుల పొడుపు కథల లక్షణాలు వర్తిస్తాయి.

పొడుపు కథలు రకాలు 1) ప్రకృతి సంబంధిత పొడుపు కథలు

1) "దేవేర్ బేటా ఉపర్ ఏంచూ
పరబాతి అవుచు సాంజ్ ఝూవుచూ॥ (దాడో)

"దేవుని కొడుకును పైన ఉంటాను.
ప్రొద్దున్న వస్తాను సాయంత్రం పోతాను" (సూర్యుడు)

2) "బంజి బరి ఝూర్‌మా ఎక్కజ్ కాంకర" (చాంద)
పుట్టెడు జొన్నల్లో ఒక్కటే రాయి (చంద్రుడు)

3) "కాటతో కట్‌ని మార్‌తో మర్‌ని" (చానిండి)
కోస్తే తెగదు కొడితే చావదు (నీడ)

2) వృక్ష సంబంధిత పొడుపు కథలు

1) "బందేని యాయేని పాల్ని బరో దూద్ దచ్" (తాడేర్ ఝాడ్)
కట్టదు వినదు మానెడు పాలు ఇస్తుంది (తాటి చెట్టు)

2) ఎక్కజ్ మనిక్కర్ ఓల్ద బరే పోతర (గేరళ)
ఒక మనిషికి గంపెడు పిల్లలు (తాటి ముంజలు)

3) పశువులకు పక్షులకు సంబంధించిన పొడుపు కథలు

"కాళో కట్ గట్లా గట్ల హెట చార్ బోరే" (బ్యాసిర్ వాడో)
నల్లగుట్ట దాని క్రింద నాలుగు బోర్లు (బర్రె పొదుగు)

4) పనిముట్లకు సంబంధించిన పొడుపు కథ

బుజి బుంజాయి కుకడి ఝూడేతి లడాయి మారి (కొరాడి)
కాల్చబడిన కోడి చెట్టుతో పోరు పడుతుంది (గొడ్డలి)

5) పండ్లకు సంబంధించిన పొడుపు కథలు

"హరే పత్రాలేమ ధావిళో ధాన్
దాన్ భావచ కాళో నోగాంన్ బగవచ॥ (సీతాఫల్)

పచ్చని విస్తరి ఆకులో తెల్లని అన్నం
అన్నమంటాం నల్ల కూరను పారవేస్తాం (సీతాఫలం)

కర్‌ని మాట్ల బర్‌ని పాణి (నారళ్)
చెయ్యని కుండ పొయ్యని నీళ్లు (కొబ్బరికాయ)

6) మనుషులకు సంబంధించిన పొడుపు కథలు

అవడిక్ కొల్గిమా లాత్‌బాయి నాచరీ (జీబ్)
చిన్న గురిగిలో చిలుకమ్మ నాట్యం చేస్తుంది (నాలు)

ప్రపంచంలోని అన్ని నాగరిక అనాగరిక భాషల్లో సామెతలున్నాయి. తెలంగాణ లంబాడీ భాషలో సామెతలు ఉన్నాయి. తెలుగు భాషలో సామెత అను పదం సంస్కృత శబ్దమైన సామ్యం నుండి పుట్టింది. సామెతను సంస్కృతంలో సూక్తి అని, ఆంగ్లంలో ప్రొవెర్బ్ అని అంటారు. లంబాడీలు సామెతలను చట్ట లేదా సాకీ అని వ్యవహరిస్తారు.

లంబాడీ సామెతలు తరతరాల వారి అనుభవాల నుండి ఆవిర్భవించాయి. అల్పమైన వాక్యంలో అనల్పమైన అనుభవాలు ఉంటాయి. సామెతలు మానవుల ఆలోచన పరిపుష్ఠి నుండి సందర్భనసారంగా సూటిగా ధీటుగా వాడకంలో పరిపూర్ణత సాధించుకుంటాయి.

లంబాడీ సామెతలు

"పరబాతీరి దూద్ కచేరి రాతేరి భూత్ కచేరి"
"ఉదయం పాల సమావేశం రాత్రి భూతాల సమావేశం."

సాళీన చోడన్ సాసుతి మసకరి కరో
మరదలను విడిచి అత్తతో సరసాలాడినట్టు ఉంది.

వాతేవాళేర్ బుండ వక్‌జా భనవాతేర్ జారివకేని

మాటలు మాట్లాడే వ్యక్తి బుండలు అమ్ముకుంటాడు. కాని మాటలు రాని వ్యక్తి జొన్నలు కూడా అమ్మలేడు.

ముగింపు

లంబాడి భాషలో అలంకారాల ప్రయోగము, వివిధ రకాల పొడుపు కథలు, సామెతల ప్రయోగం గురించి ఈ లఘు వ్యాసంలో వివరించడం జరిగింది.

4. ఆంధ్ ఆదివాసి భాషా సంస్కృతి సాహిత్యం

– విష్ణు

భారతదేశంలో ప్రభుత్వం, భౌతికరాజ్యాంగం గుర్తించిన సుమారు 700 (ఏడు వందలు) గిరిజన తెగలలో "ఆంధ్" ఆదివాసి గిరిజన తెగ ఒకటి. ఈ తెగవారు భారతదేశంలో మూల నివాసులుగా, ఆదివాసులుగా ఎన్నో శతాబ్దాల నుండి నివసిస్తున్నారు. వీరు ఎక్కువగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో ఉన్నారు. మరియు తెలంగాణ రాష్ట్రంలో కొంతవరకు ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేప్రకారం వీరి జనాభా ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 30,000 వరకూ ఉంటుంది.

వీరు పట్టణాలకు దూరంగా అటవీ ప్రాంతంలో, గుట్టలలో, కొండలలో, లోయలలో, నది పరిసరప్రాంతాలలో నివసిస్తున్నారు. వీరు ప్రధానంగా వ్యవసాయం, వ్యవసాయ కూలిపనిమీద ఆధారపడి జీవిస్తారు. అటవీ ఉత్పత్తుల సేకరణ, వేటాడటం, చేపలు పట్టడం, పశుపోషణ వంటి వాటిపై కొంతమేర ఆధారపడి జీవిస్తారు.

ఈ తెగవారు "మరాఠి"ని తమ మాతృభాషగా మాట్లాడుతారు. ఆంధ్ తెగలో వర్తాళి, ఖాల్తాళి అనే రెండు అంతర్వివాహ సముహాలుగా విభజన జరిగింది. వర్తాళి తెగవారు, ఖాల్తాళి తెగవారి కంటే అధికులుగా గుర్తింపు పొందారు. దీని కారణంగా వారి మధ్యలో వివాహ సంబంధాలు ఉండవు. "ఆంధ్" తెగలలో అనేక బహిర్వివాహ శాఖలు లేదా ఇంటిపేరుగా విభజించబడింది. దీనిని వీరు అడ్‌నావ్ (ఇంటిపేరు) అని అంటారు. ఒక్కొక్క అడనావ్ ఒక్కొక్క బహిర్వివాహ శాఖ. సాధారణంగా వివాహాలు సంప్రదింపుల ద్వారా జరుగుతాయి. ఈ సమాజంలో వితంతు వివాహాలకు అనుమతి ఉంది. అయితే వితంతువు తన భర్త సోదరుడ్ని కాని అతని వంశస్థులలో ఎవరినైనా కాని వివాహం చేసుకోవడానికి అనుమతి ఉండదు. ఏకపత్ని విధానం అమలవుతుంది. బహుభార్యాత్వం అరుదుగా ఆచరించడం జరుగుతుంది. విడాకులు కూడా అనుమతిస్తారు. వీరిలో అక్షరాస్యత చాలా తక్కువ.

తెలంగాణ రాష్ట్రంలో "ఆంధ్ తెగ" నుండి సుమారు 50 మంది వరకు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నారు. ఒక్క ఉద్యోగి కూడా గెజిటెడ్ పోస్టు స్థాయిలో లేరు. వీరు అక్షరాస్యత, చదువుల ప్రాముఖ్యతను గుర్తించకపోవడం వల్ల అజ్ఞానం, మూఢనమ్మకాలతో పేదరికంలో దుర్భరమైన జీవితం గడుపుతున్నారు. సమగ్ర అభివృద్ధికి ఎన్నో మైళ్ల దూరంలో ఉన్నారు. వీరు నిస్వార్థపరులు, నీతి నిజాయితిపరులు. నీతి నిజాయితీనే తమ అభూషణంగా భావించి జీవనం సాగిస్తారు.

వీరు ముఖ్యముగా పంచమహాభూతాలను, ప్రకృతిని దేవుని స్వరూపంగా భావించి, పూజిస్తారు. మహదేవుడు (శంకరుడు) ఖండోబా, కాన్హోబా, శ్రీకృష్ణ, కులదేవత, గ్రామదేవత, ఇష్టదేవతలను పూజిస్తారు.

ఆంధ్ ఆదివాసి పుట్టు పూర్వోత్తరాలు

పూర్వకాలంలో ఆంధ్రప్రదేశ్‌లో మొదట వీరు నివాస స్థానం ఏర్పాటు చేయడం వలన, అనార్య జాతికి చెందడం వలన వీరిని ఆంధ్ ఆదివాసి తెగగా గుర్తించవచ్చని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. కాలక్రమంలో ఆంధ్ర అనే వాక్యం "ర" అనే అక్షరం తొలగి "ఆంధ్" గా రూపాంతరం చెంది ఉండవచ్చని మరికొందరి అభిప్రాయం.

సులభ విశ్వకోశం (నిఘంటువు) భాగం 1 లో శ్రీ య. రా. దాతే గారు, శ్రీ చి.గ. కవ్రే ఈ తెగ ఆంధ్ర జాతి నుండి ఆంధ్ జాతిగా పుట్టుక జరిగి ఉండవచ్చని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆంధ్ర అనే శబ్దం అపభ్రంశం చెంది ఆంధ్‌గా రూపాంతరం చెందిందని వారు తమ మనోగతం వ్యక్తం చేశారు.

(అసంపూర్ణ వ్యాసం)

5. గిరిజనుల బాల్యవివాహ సమస్యలు

– అంబోతు రావి నాయక్

ఈ సృష్టిలో మానవుడేనాడు పుట్టాడో ఆనాటి నుండి కులమతాలకు అతీతంగా ఉండాలనుకున్నాడు కానీ తరతరాల నుంచి మొదలయినాయి కులాలు, మతాలు అనేవి. ఏ మతాన్ని, ఏ కులాన్ని చూసినా ఏమున్నది గర్వకారణం. ఎవరైనా మనుషులే కదా, మనుషులందరు సమానులే. అయితే ఈ పృథ్విపై గిరిజనుడు అనే ఓ కులాన్ని సృష్టించాడు దేవుడు. గిరిజనుల వస్త్రాలంకరణ, వేషభాషలు, వారుండే పల్లెలు (తండాలు) వారి జీవనాభివృద్ధి, గిరిజనుల సంప్రదాయం, వారివారి రోజువారీ పనులు ఇవన్నీ ప్రజలను ఆకర్షిస్తాయి. (వాళ్ల వాళ్ల కులాల కట్టుబాట్లు సంప్రదాయాలూ) గిరిజనులు కూడా వారి సంప్రదాయాల ప్రకారం వివాహం (పెళ్లి) జరిపిస్తారు. కానీ గ్రామపంచాయితీలకు కాస్తా దూరంగా (ఎడంగా) ఉండటం వలన వారు చదువుకొనుటకు ఎక్కువ ఆసక్తి చూపడం లేదనుటలో ఎలాంటి అతిశయోక్తి లేదు కానీ బాల్యవివాహాలు జరిపించుటలో మాత్రం ముందుంటారు. ఆ వివాహం బాల్యవివాహం అని తెలియక చేస్తారు. కానీ ఆ తర్వాత మొదలవుతుంది కథ.

అభం శుభం తెలియని అమ్మాయిలకు వివాహం చేస్తుంటారు. తల్లిదండ్రులు ఆడపిల్ల (అమ్మాయి) అనగానే తమ గుండెల మీద కుంపటిలా ఉందని భావించి చిన్న వయసులో పెళ్లి చేస్తారు. కానీ వాళ్లు జీవితంలో పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అత్తమామల దౌర్జన్యం, ఆడపడుచుల పెత్తనం, భర్త అహంకారానికి బలయిపోతుంది ఆ అబల. పెదాలు విప్పుకోలేక గాలిని కొంగున నింపుకొని గొంత గడియను (నోరు) తెరుచుకోలేక తన హృదయంలో దాచుకొని కుమిలిపోతుంది నెలవంక తెలియని అభాగ్యురాలు. ఇలా జరగడానికి కారకులు తల్లిదండ్రులు ఎందుకంటే వారు నిరక్ష్యరాస్యులు. అదే చదువుకున్నవారైతే వాళ్ల కూతుళ్లకు ఎప్పుడు ఏ వయస్సులో ఎలా చేయాలనేది అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు చూసుకుంటూ, వారికి నచ్చిన సంబంధం కుదుర్చుకొని పెళ్లిళ్లు జరిపిస్తారు. అలాంటి వారికి ఎలాంటి ఇబ్బందులు

తలెత్తవు, కానీ చదువురాని తల్లిదండ్రుల వలన బలయ్యే గిరిజన ఆడపిల్లలు ఎందరో ఈ భూమిపై ఉన్నారు.

ఆడపిల్ల పెళ్లి చేసాం ఇక తమ తలపైనున్న బరువు తగ్గిందనుకున్న తల్లిదండ్రుల ఆశలు కొన్నాళ్లకే అడియాశలవుతాయి. తమ అమ్మాయి (కూతురు) జీవితం గురించి రోజుకో కాకి కబురు తెస్తుంది, గాండ్రించే పులిలా, గర్జించే సింహంలా అల్లుడి వేధింపులు మొదలవుతాయి, తాగుడుకు బానిసైన అల్లుడిని చూసి అమ్మాయి తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ బాధపడుతారు తప్ప ఏమి చేయలేక నిస్సహాయస్థితిలో ఉండిపోతారు.

సమాజంలో స్త్రీ, పురుషులు సమదృష్టితో, సమానత్వపు కొలతలు తెలుసుకోక తమ పురుషాధిపత్యాన్ని దురహంకారాన్ని బాల్యం బరువైన ఆడపిల్లపైన చూపిస్తారు దుర్మార్గులు. కొందరైతే రకరకాలుగా హింసపెట్టే సెక్సోన్మాదులు కూడా ఉన్నారనడంలో ఏమాత్రం సందేహంలేదు, ఎందరో చిట్టితల్లులు ఇలాంటి వారి చేతిలో ప్రాణం పణంగా పెట్టి కాపురాన్ని బతుకుబండిలా ముందుకు సాగనంపుకుంటూపోతారు, కొందరి కాపురాలు అర్థాంతరంగా ఆగిపోయి మబ్బులో ఎటూ కనబడని (వెలుగునివ్వని) చంద్రుడిలా కాలం వెల్లదీస్తుంటారు. మరికొందరు గువ్వగోరింకలా హఠాత్తుగా విడిపోయి ఆ గువ్వ పడే బాధ ఎలా ఉంటుందో అలా ఉంటారు. బాల్యంలో కాకుండా యుక్తవయస్సులో తరాలు చూసుకుంటూ అమ్మాయికి నచ్చినవాడికి ఇచ్చి పెళ్లి చేయడం చాలా మంచిది.

విన్నపం:

దయచేసి ఈ సమాజంలో నున్న ప్రతి గిరిజన తల్లిదండ్రులకి రెండు చేతులు జోడించి చెప్పడం ఏమిటంటే ఆడిపిల్లలను బరువుగా భావించకుండా చదివించి వారి జీవితపు పుటలు తిరగేసే చోట పుస్తకాలతో కుస్తీలు పట్టించండి కానీ పెళ్లితో కాదు. వారి బాల్యంలో తూనీగల ఆటలు ఆడుకొనిచ్చి, కోయిలమ్మ పాటలు పాడుకొనివ్వండి కానీ విషవాయువుల వివాహంతో కాదు, ప్రకృతిని పరవశింపజేసే పాలపిట్టలా ఆడుకోనివ్వండి కానీ కట్లపాములా కాటేసే కామాంధులతో జోడీ కట్టకండి. సెలయేటి గలగలలా కాళ్లకు గజ్జెలు కట్టి ఆడనివ్వండి కానీ దేగ కంట్లో పడనివ్వకండి.

ముగింపు :

సమాజంలో నున్న నిరక్షరాస్యతను అరికట్టాలి. గిరిజన తండాలలో పాఠశాలలు నిర్మించి విద్యనందించాలి అలాగే చదువుకునే వారిని ప్రోత్సహించి ఉపకార వేతనాలను సరైన క్రమంలో వారికి అందేలా తగిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగాలలో గిరిజనులకు రిజర్వేషన్ పెంచాలి. అప్పుడు బాల్యవివాహాలను ఆపవచ్చు, మానవ మృగాల బారినుండి రక్షించవచ్చు.

6. బంజారా భాషా వికాసం - మార్గాలు

- ఆచార్య డి. సూర్యధనుంజయ

తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం

పరిచయం :

మానవుడిని భూమిపై గల మిగతా జీవరాశిని వేరు చేసే విభిన్నమైన సాధనం భాష. ఆదిమకాలంలో రాతియుగాల్లో ఏవేవో సంజ్ఞల ద్వారా మొదలైన భాష నీటి ఊట 'ఇంతింతై వటుడింతై' అన్నట్లు నేడు మహా సముద్రరూపాన్ని దాల్చి వేల భాషలుగా పరిణామం చెందాయి. ఆ విధంగా వేల సంవత్సరాల క్రితం ధ్వని పూరితమైన చిన్నచిన్న శబ్దాలతో అడుగులు వేస్తూ నడక నేర్చుకున్న 'భాష' ప్రస్తుతం అత్యున్నత స్థితికి చేరి మానవ నాగరికత చరిత్ర నిర్మాణంలో విశిష్టపాత్ర పోషిస్తున్నది.

ఉమ్మడిగా పరస్పర అవగాహనతో ఒక నిర్ణీత ప్రదేశంలో జీవించే పౌరసమాజం ఒకే భాష, ఆచార సంప్రదాయాలు కలిగి ఉండి ఒక సహజసిద్ధ సాంస్కృతిక జీవనాన్ని వారసత్వంగా అందిస్తున్నాయి. అటువంటి ఒరవడిలో 'బంజారభాష' ఎన్నో సంవత్సరాలుగా ప్రకృతి జీవనంతో ముడిపడి తన సంస్కృతి సంప్రదాయాలను, సాహిత్యాన్ని, జానపద విజ్ఞానాన్ని మౌఖిక రూపంలో ముందు తరాలకు అందిస్తూ వస్తున్నది. బంజారాల వేష భాషలను, జీవన విధానాన్ని, వైభవాన్ని ప్రపంచానికి చాటడంలో బంజారాభాష 'గోర్‌బోలి', బంజారసాహిత్యం రెండూ ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి.

ఇలాంటి సందర్భంలో గోర్ బోలికి 'లిపి' లేకపోవడం లేదా లిపిని ఎంచుకొని భాషాభివృద్ధికి ప్రయత్నాలు జరగకపోవడం వల్ల వారి సాహిత్యంలోని సౌందర్యం బయటి ప్రపంచానికి తెలిసే అవకాశం లేదు. తద్వారా బంజారాజాతి ఎంతో నష్టపోయింది. వారి భాషాసాహిత్యాలు అంతరించిపోతున్న భాషల సరసన చేరిపోయాయి. ఒక గణనీయమైన సంఖ్యలో ఉన్న బంజారాలు మాట్లాడేభాష ఈ

దుస్థితికి చేరిందంటే కారణాలు పరిశీలించవలసిన అవసరం ఉంది. ఈ వ్యాసం ముఖ్యోద్దేశం గోర్‌బోలి భాషా వికాసానికి మార్గాలను అన్వేషించడం.

బంజారా భాష:

- 'భావప్రసార మాధ్యమమే భాష'. – రాబర్ట్ హాల్
- 'అలవోకగా ఉత్పన్నమయ్యే కంఠధ్వనుల సాధనాలతో కేవలం మానవతా సంబంధమై సహజాతీత పద్ధతి ద్వారా మానవోద్రేకాలను, ఆలోచనలను, వాంఛలను తెలియజేసేదే భాష'. – సపీర్
- 'భాష వివిధ అంతస్సంబంధాలతో మానవ జీవితంలోని వివిధ దృక్కోణాలతో పెనవేసుకొని ఉంది. భిన్న దృక్పథాలతో అధ్యయనం చేయాల్సి ఉంటుంది'. – గ్లిసన్

బంజారాల వేషభూషణాదులు ఎంత విలక్షణమైనవో వారి భాష కూడా అంతే విశిష్టమైనది. భారతదేశమంతటా నివసిస్తున్న దాదాపు 6–7 కోట్లమంది మాట్లాడే భాషను 'గోర్‌బోలి' సుమారు 'ఆరువేల' సంవత్సరాల పూర్వమైందని భాషా పరిశోధకుల అభిప్రాయం. బంజారాభాషను మిగతా భారతీయుల భాషలతో పోలిస్తే, ఉత్తరభారతదేశ భాషలైన హిందీ, రాజస్తానీ, గుజరాతి, మరాఠి మొదలైన భాషలతో దగ్గర సంబంధాలు కలిగి ఉంది. కాబట్టి బంజారాల 'గోర్‌బోలి' ఇండోఆర్యన్ భాషా కుటుంబానికి చెందినదిగా భాషాశాస్త్రవేత్తలు నిర్ధారించారు.

బంజారా శబ్దం 'వాణిజ్యం' అనే సంస్కృత పదం నుండి 'బనజ్' అనే హిందీ శబ్దం 'బనజ్' నుండి 'బంజారా' రూపొందిందని చారిత్రక పరిశోధకులు పేర్కొన్నారు. వీరు వివిధ రాష్ట్రాల్లో ఒకే భాష (గోర్‌బోలి) ని ఉపయోగిస్తున్నప్పటికీ, ఆయా రాష్ట్రాల్లో బంజారాలు వివిధ నామాలతో పిలవబడుతున్నారు. రాజస్థాన్‌లో వీరిని 'గవారియా' లేదా 'గమాలియా' అని ఢిల్లీ హర్యానాలలో 'సిరికిబాండ్' అని, పంజాబ్‌లో 'సిరికివాలా' అని మిగతా రాష్ట్రాల్లో బంజర, వనచర, బ్రంజారి, బ్రజ్వాసి, లఖాన్, సబాన, బళదియా, లదణియా అని, కర్ణాటకలో 'లమాన్', లంబాణి, మహారాష్ట్రలో 'సింగడి బంజారా', కేరళలో 'గహర్' తెలంగాణలో 'లంబాడి', రాయలసీమలో సుగాలీలని పిలుస్తారు.

ఈ విధంగా దేశంలో బంజారాలు ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా పిలవబడుతున్నా కూడా వారి వేషభాషలు ఒకేవిధంగా ఉండడం విశేషం.

బంజారాభాష ప్రస్తుత స్థితి:

ఒకప్పుడు సంచార జీవనాన్ని సాగించిన బంజారా గిరిజనులు ఇప్పుడు దేశమంతటా ఎక్కడి వారక్కడ స్థిరనివాసాలు (తండాలు) ఏర్పరచుకున్నారు. బంజారాలతో పోలిస్తే భారతదేశంలో ఏ ఇతర గిరిజన తెగ కూడా ఇంతలో దేశమంతటా వ్యాపించలేదు. దేశంలో అత్యధిక జనాభా మాట్లాడే భాష హిందీయే. ఆ తర్వాత తెలుగు. ఈ రెండింటి తర్వాత ఎక్కువ జనాభా మాట్లాడే భాష ఏదంటే అది బంజారాభాష అనే చెప్పాలి. అంతటి విస్తృతమైన పరిధి కలిగిన బంజారా భాషకు 'లిపి' లేకపోవడం, కేవలం లిఖితసాహిత్యం లేకపోవడం వల్ల ఎంతో గొప్ప మౌఖిక సాహిత్యం ఉన్న బంజారాభాష నేడు కేవలం ఒక గిరిజన భాషగానే మిగిలిపోయింది.

భారతదేశంలో 398 భాషలున్నాయని భాషావేత్తలు తేల్చారు. అందులో 99 భాషలు విలుప్తమైనాయి. సంఖ్యాపరంగా చూస్తే ఐదుకోట్ల కంటే ఎక్కువ జనాభా మాట్లాడే భాషలు ఐదు ఉన్నాయి. హిందీ, బెంగాలీ, తెలుగు, మరాఠీ, తమిళం వరుసలో ఉన్నాయి. ఆరవస్థానం బంజారా భాష 'గోర్‌బోలి'దే. అంతటి గణనీయమైన స్థాయిలో ఉన్న బంజారాభాష నేడు అతి త్వరగా అంతరించి పోతున్న భాషల్లో చేరడం చాలా బాధాకరం.

బంజారాభాషయైన 'గోర్‌బోలి'కే లిపి ఉండి ఉంటే, మౌఖిక సాహిత్యం గ్రంథస్థం కాబడి లిఖిత సాహిత్యం అభివృద్ధి చెంది వుంటే, ఈ రోజు దేశంలో గొప్పవిగా పెద్దవిగా చెప్పబడుతున్న భాషల సరసన గోర్‌బోలి ఉండేది. సంఖ్యలో పదిలక్షల కంటే తక్కువమంది ప్రజలు మాట్లాడే కాశ్మీరి, ముండారి లాంటి భాషలకు భాషాపరమైన జనాభా లెక్కల్లో దక్కిన చోటు ఇంతటి వ్యాసార్థం కలిగిన బంజారాభాషకు దక్కకపోవడం విచారకరం.

సమస్యలు

ఎంత పెద్ద నావ అయినా చిన్నచిల్లుతో మునుగుతుంది అన్నట్లుగా ఎంతో గొప్ప చారిత్రక నేపథ్యం, సంస్కృతి కలిగిన బంజారా భాష కేవలం మౌఖిక సాహిత్యం గానే వాడుకలో ఉండడం, లిపిలేని కారణంగా నేడు అంతరించిపోతున్న భాషల సరసన చేరడం ఆందోళనకరం.

ఏదేని ఒక భాషాభివృద్ధికి సప్రమాణత, అలంకారికత, ఛందోబద్ధత, విషయనిష్ఠత, వస్తునిష్ఠత లాంటి అలంకార లక్షణాలు ఎలా అయితే అవసరమో

అంతకన్నా ముఖ్యంగా భాషాభివృద్ధికి, సుస్థిరతకు 'లిపి' మరియు లిఖిత సాహిత్యాలు అంతకన్నా అవసరం.

సహజంగా బంజారాభాష ఇండో-ఆర్యన్ భాషా కుటుంబానికి చెందినదిగా గ్రియర్సన్ లాంటి భాషావేత్తలు నిర్ధారించారు. తెలుగు, కన్నడం, తమిళం మొ॥న భాషలు 'ద్రావిడ భాషా కుటుంబానికి' చెందడం వలన ఆర్యభాషా కుటుంబానికి చెందినటువంటి బంజారా మౌఖిక సాహిత్యాన్ని తిరిగి తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం లాంటి ద్రావిడ భాషల్లోకి అనువదించడం వలన మాండలిక పరమైన వైయక్తిక బేధాలు, అలంకారానికి లొంగని పదబంధాలు, కొద్దిపాటి పలుకుబడులతో మార్పు చెందే ఉచ్ఛారణా దోషాలు, అర్థాలు మొదలైన భాషాపరమైన సమస్యలు వాటిలో తలెత్తుతున్నాయి.

బంజారాలకు ఎంతో గొప్పనైన సాహితీ సంపద ఉంది. ఎన్నో ఇతర భాషలకన్నా బంజారాభాషలో ప్రాచీనమైన జానపద కథనాలు, పాటలు, సామెతలు మొదలైన మౌఖిక సాహితీ విజ్ఞానం ఉంది. తరతరాల నుండి ఈ సాహిత్యమంతా మౌఖికంగానే ఉంది. ఒక భాష గొప్పదనం తెలియాలంటే ఆ భాషా సాహిత్యానికి తగిన ప్రాచుర్యం కల్పించాలి. లిఖిత సాహిత్యరూపంలో బంజారా సాహిత్యం ఇతర భాషల్లోకి అనువాదం కావాలి.

లిఖిత సాహిత్యం ఎంత అభివృద్ధి చెందితే, బంజారా సాహిత్యంలోని అందచందాలు బాహ్యప్రపంచానికి అంతలా తెలిసే అవకాశం ఉంటుంది. మనదేశంలో 22 భాషలు రాజ్యాంగంలోని 8 వ షెడ్యూల్డ్‌లో చేర్చబడినాయి. అందులో ఐదు భాషలు మాత్రమే 'ఐదు' కోట్ల కంటే ఎక్కువమంది మాట్లాడుతున్నారు మిగతా 16 భాషలు మణిపురి, డోంగ్రీ, బోడో లాంటి భాషలను కేవలం 11 నుండి 22 లక్షల మంది మాత్రమే మాట్లాడుతున్నప్పటికీ ఆయా భాషలకు 8 వ షెడ్యూల్‌లో చోటు దక్కింది. కానీ దేశమంతటా ఆరుకోట్లమంది మాట్లాడే 'గోర్‌బోలి' బంజారాభాషకు చోటు దక్కకపోవడం శోచనీయం. దానికి కారణం లిపి లేకపోవడం మరియు సాహిత్యం ప్రాచుర్యం పొందకపోవడంగా భావించవచ్చు.

విద్యాబోధన విషయానికి వస్తే ఉత్తరాదివారు తమ మాతృభాష అయిన హిందీని, అంతర్జాతీయ భాషయైన ఆంగ్లాన్ని అభ్యసిస్తారు. అలా వారు కేవలం రెండు భాషలు

అభ్యసిస్తే చాలు, దక్షిణాది వారు మాతృభాష+జాతీయభాష+అంతర్జాతీయ భాష మొత్తం మూడు భాషలను అభ్యసించవలసిన అవసరం ఉన్నందున హిందీ వ్యతిరేకతా భావం కలిగే ప్రమాదం ఉంది. ఇలాంటి సందర్భంలో కొన్ని తండా ఏరియాలలో బంజారాభాషను ప్రాథమిక విద్యా స్థాయిలో పాఠశాలలో పెట్టినా అది అంతగా ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. వివిధ ప్రాంతీయ భాషల ప్రభావం వల్ల బంజారా భాష ఒక విచిత్రమైన సంక్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటున్న స్థితి మనకు కనిపిస్తుంది.

ఇలాంటి సంక్లిష్టమైన పరిస్థితులలో ఉన్న బంజారాభాష అభివృద్ధి జరగాలంటే ఆ భాషకు ఒక లిపిని అధికారికంగా చలామణిలోకి తేవాల్సిన అవసరం ఉంది. తద్వారా బంజారాసాహిత్యాన్ని అభివృద్ధిపరిచి చెల్లాచెదురుగా ఉన్న బంజారాలను ఏకం చేయాల్సిన అవసరంఉంది. అంతేకాకుండా విలుప్తం చెందుతున్న భాషకు ప్రాణం పోసే అవకాశం ఉంది. అత్యధిక సంఖ్యలో ప్రజలు మాట్లాడే ఒక భాషను బ్రతికించి అభివృద్ధి చేస్తే ఆ ప్రజల సంస్కృతికి ప్రాణం పోసినట్లే అవుతుంది. వారి భాషా సాహిత్యాలు అభివృద్ధి చెంది మిగతా సమాజంలో కలసిపోయే అవకాశం ఉంది.

వికాస మార్గాలు:

భాష అనేది ఆ భాష మాట్లాడే వారి సంస్కృతిని పరిరక్షించే బలమైన సాధనం. సాహిత్యం ఆ భాష మాట్లాడే వారి సంస్కృతిని ప్రపంచానికి చాటే సాధనం. భాష, సాహిత్యం రెండూ అభివృద్ధి చెందాలంటే అట్టి భాషకు ఒక 'లిపి' అనేది ఉండాలి. మౌఖిక భాష సాహిత్యాన్ని ఒకరినుండి మరొకరికి చేరవేస్తుంది. కానీ, వాగ్రూపంలోని సాహిత్యానికి లిఖితరూపం ఇచ్చి శాశ్వతత్వాన్ని చేకూర్చేది లిపి మాత్రమే. అటువంటి లిపి బంజారాలకు లేకపోవడం ప్రధాన సమస్య. కాబట్టి ఇట్టి భాషకు దేశమంతటా ఒకే లిపిని వాడకం లోకి తేవాల్సిన అవసరం ఉంది.

బంజారాభాష ఇండోఆర్యన్ భాషా కుటుంబానికి చెందినది కావున ఉత్తరాది భాషల్లో ద్రావిడ భాషకు వ్యాకరణ, మాండలికాల దృష్ట్యా వ్యత్యాసం ఉంటుంది. ఈ ద్రావిడ భాషలు ఏవీ కూడా బంజారా భాషా సాహిత్యాన్ని అనువాదం చేసినా దాని సహజసిద్ధ ఆత్మసౌందర్యాన్ని ఆవిష్కరించలేవు. ఉత్తరాది భాషలైన హిందీ, గుజరాతీ, మరాఠీ, పంజాబీ భాషలు దేవనాగరి లిపిని వాడి ప్రాచుర్యం పొందాయి. అలాగే

బంజారా భాష కూడా దేవనాగరి లిపి వాడుకొన్నట్లైతే ఆ లిపిలో గోర్‌బోలి భాష కూడా ఇమిడిపోయే అవకాశం ఉంది.

ఇలా దేశమంతటా బంజారాలకు ఒకే లిపి ప్రవేశపెట్టడం ద్వారా ప్రజలు ఒక్కో రాష్ట్రానికి ఒక్కో భాషలో అనువదించుకోవడం కనిపెడితే మరొక రాష్ట్రం వారికి అది కష్టతరమైన విషయం అవుతుంది నేర్చుకోవడానికి. కాబట్టి ఇప్పుడు కొత్తగా ఎటువంటి లిపిని కనుక్కోకుండా ఉన్నటువంటి సాహిత్యాన్ని 'దేవనాగరి లిపి' లోనే వాడుతూ అధికారికంగా గుర్తింపు తెచ్చిన యెడల ఒక పెద్ద సమస్యకు పరిష్కారం చూపినట్లే అవుతుంది.

''ప్రపంచంలో ఉన్న సాహిత్యమంతా వాగ్రూపంలో ఉన్నదే, కాకపోతే అది లిఖితరూపం ధరించి గ్రంథస్థం కాబడినపుడే శాశ్వత సుస్థిరతను ఏర్పరచుకుని ప్రపంచభాషల్లో ప్రయాణిస్తుంది.''

– (అంతర్జాతీయ భాషా సదస్సు 2012)

బంజారా భాష విలుప్తం చెందే భాషల చెంతన చేరటం వల్ల అంతరించిపోతున్న సంకేతాలు వెలువడినప్పటికి ఆరుకోట్ల మంది బంజారా ప్రజల భాష సంస్కృతి సాహిత్యం పరిరక్షణకు ప్రభుత్వం చొరవ చూపలేదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని బంజారా భాష పరిరక్షణ చర్యలు చేపట్టాలి.

తెలుగు రాష్ట్రాల్లో బంజారాలు 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 27 లక్షలు (9.5%), ఆంధ్రప్రదేశ్‌లో 5.6 % ఉన్నారు. సమైక్య రాష్ట్రంలో ఆంధ్రప్రాంతంలోని గిరిజన జనాభా తక్కువ ఉండటం వల్ల మొత్తం రాష్ట్రంలో 'సగటు' గిరిజన జనాభా ఆరుశాతంగా పరిగణించడం వల్ల తెలంగాణాలోని 5, 6 జోన్లలోని 10 నుంచి 11 శాతం ఉన్న గిరిజనులు తక్కువ రిజర్వేషన్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కాబట్టి ఇక ముందైనా ప్రభుత్వాలు వాస్తవిక సంఖ్య ఆధారంగా జనాభాకు తగ్గ స్థాయిలో నిధులు రిజర్వేషన్లు కల్పించి సంక్షేమ చర్యలు చేపట్టాలి.

బంజారా భాషను షెడ్యూల్డ్ ఎనిమిదిలో చేర్చినట్లయితే సత్వరం పరిరక్షణ చర్యలు చేపట్టవచ్చు. షెడ్యూల్డ్ 8 ద్వారా అట్టి భాషలను కాపాడాల్సిందిగా రాజ్యాంగంలో చట్టం చేశారు కనుక సంబంధిత శాఖకు నిధులు విడుదల చేసి బంజారాభాషను రక్షించాలి.

అలాగే బంజారా భాషకు సంబంధించి భాషాజ్ఞానం, సాహిత్య పఠనం మొ॥న అంశాలకై ప్రభుత్వమే స్టడీ సెంటర్స్ ఏర్పాటు చేయాలి. ఎలక్ట్రానిక్ మరియు ప్రింట్ మీడియాలు, వివిధ టివి ఛానళ్లు బంజారాభాషకు భావప్రసార భాషామాధ్యమంగా ప్రచారం కల్పించాలి.

బంజారా భాషకు ప్రత్యేకతను చాటే వారి జానపద సాహిత్యాన్ని గ్రంథస్తం చేసి, భాషా సాహిత్యాభివృద్ధికి ప్రత్యేక అకాడమీని ఏర్పాటుచేయడం ద్వారా బంజారా భాషను అభివృద్ధి చేయవచ్చు.

బంజారా పిల్లలకు పాఠశాల స్థాయిలో మాతృభాష (గోర్‌బోలి)లో విద్యాబోధన చేయడం ద్వారా భాషా తారతమ్యత వల్ల చదువుకు దూరమయ్యే అనేకమంది లంబాడీలకు చదువు దక్కే అవకాశం ఉంది. అప్పటివరకు తండాల్లో మాతృభాషలో భాషించిన పిల్లలు పాఠశాలకు రాగానే తెలుగు లేదా రాష్ట్ర భాషలో మాట్లాడాల్సి, చదావల్సి, రాయాల్సి రావటం వల్ల వారి మనోవికాసం ఆందోళనతో కుంటుపడుతుంది. కాబట్టి వారి మాతృభాషనే విద్యార్జనకు ఉపయోగిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది ఒక రకంగా మారుమూల ప్రాంతాల్లో నివసించే బంజారాలకు మిగతా సమాజానికి మధ్య గల దూరాన్ని తగ్గించేందుకు దోహదపడుతుంది. బంజారా సాహిత్యాన్ని ప్రపంచానికి అందించడం వల్ల వారి ఘనమైన సంస్కృతి సంప్రదాయాలు అందరికీ తెలిసే అవకాశం ఉంటుంది. వారిని తండాయేతర సమాజం అర్థం చేసుకుని అక్కున చేర్చుకునే అవకాశం ఉంటుంది. మొత్తంమీద బంజారా భాషా సంస్కృతులు వికాసం చెందితే తద్వారా వారు సామాజికంగా, సంస్కృతిపరంగా అభివృద్ధి చెందుతారు.

గత ప్రభుత్వాలు పాఠశాల ప్రాథమికస్థాయిలో బంజారాభాషలో పాఠ్యాంశాలు ప్రవేశపెట్టాయి. ఆ పాఠ్యాంశాల్లో ఉపయోగించిన లిపి తెలుగు లిపికావడం, తెలుగు ద్రావిడభాషా కుటుంబానికి చెందినది కావడంవల్ల భాషా సమస్యలు తలెత్తాయి. ఈ సమస్యను అధిగమించడానికి ఇండో-ఆర్యన్ భాషా కుటుంబానికి చెందిన 'దేవనాగర లిపి'ని ఎన్నుకోవడం మంచిది.

బంజారాభాషపై "పరిశోధన" చేసే విద్యార్థులకు ప్రభుత్వం మంచి ప్రోత్సాహకాలు అందించడం ద్వారా వారి సంస్కృతి, సాహిత్య సంపదలను మరింతగా వెలికితీసి ప్రపంచానికి అందించే అవకాశం కలుగుతుంది.

ముగింపు :

అతికొద్ది మంది మాట్లాడే భాషలకు షెడ్యూల్డ్ ఎనిమిదిలో చోటు దక్కినప్పుడు ఆరుకోట్లమంది మాట్లాడే బంజారాభాషకు చోటు దక్కక పోవడం బాధాకరం. లిపి లేకపోవడం దానికి కారణంగా పేర్కొన్నప్పటికీ వారి లిపిని రూపొందించుటకు లేదా దేవనాగరి లిపి లాంటి ప్రాచుర్యం పొందిన లిపిని బంజారా భాషకు ప్రతిపాదించే చర్యలు తీసుకోకపోవడం బంజారాలపై ప్రభుత్వానికి ఉన్న అనాసక్తిని, నిరాదరణను కళ్లకు కడుతున్నాయి.

స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లకు కూడా బంజారాభాషకు, లిపికి, సాహిత్య పరిశోధనకు, పరిరక్షణకు ఒక ప్రత్యేక అకాడమీని ఏర్పాటు చేయకపోవడం విచారించవలసిన విషయం. ఈ నేపథ్యంలో ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బంజారాభాషను పరిరక్షించి అభివృద్ధిపరిచే దిశగా కార్యాచరణను ప్రకటించాల్సిన అవసరం ఉంది.

పట్టణీకరణకు దూరంగా తండాల్లో నివసిస్తూ ప్రకృతి సమతౌల్యాన్ని పరిరక్షించే బంజారాలను, వారి భాష (గోర్‌బోలి) ను నిర్లక్ష్యం చేయడమంటే ఆ ప్రజల అస్తిత్వాన్ని, ఆకాంక్షలను నిర్లక్ష్యం చేయడమే. కాబట్టి ఇకనైనా ప్రభుత్వాలు ఈ నిర్లక్ష్య వైఖరికి స్వస్తిపలికి పరిరక్షణ చర్యలకు పూనుకుని అత్యధికులు మాట్లాడే బంజారాభాష అభివృద్ధికి కార్యాచరణను ప్రకటిస్తాయని ఆశిద్దాం...!

ఆధార గ్రంథాలు :

1) 'నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం – జీవనచిత్రణ' – ఆచార్య సూర్యధనుంజయ్
2) 'ఆధునిక సమాజంలో గిరిజన భాష-సంస్కృతులు' – డా॥ భూక్యా తిరుపతి
3) 'కొండకోనల్లో తెలుగు గిరిజనులు' – డా॥ శివరామకృష్ణ
4) 'తెలుగు-బోధనా పద్ధతులు' – తెలుగు అకాడమీ
5) 'అంతర్జాతీయ భాషా సదస్సు' – పత్రికా వ్యాసాలు
6) Grierson – Quotes, theories
7) Banjara: Out Side Impact

7. బంజారా జాతీయాలు, సామెతలు– భాషా సౌందర్యం

యడవెల్లి సైదులు

భాష అనేది ఒక పూలతోట అయితే దాని వికాసానికి, విస్తరణకు దోహదపడే పరిమళం 'లిపి'. శాశ్వతతత్త్వాన్ని చేకూర్చడమే కాకుండా, ఆదాన ప్రదానాలకు మార్గం సుగమం చేస్తుంది. జానపద సాహిత్యాన్ని మౌఖిక సాహిత్యంతో పోలిస్తే, లిఖిత సాహిత్యం పాత్ర చాలా పరిమితం. 'గిరిజన సాహిత్యం'లో ఇప్పటి వరకు ఉన్నదంతా మౌఖిక సాహిత్యమే. 'లిపి' లేనందున ఈ సాహిత్యాన్ని మాతృభాష అయిన బంజారా భాషలో కాకుండా ఇతర భాషలలో అక్షరీకరించడం జరిగింది.

సహజంగా ఒక భాష అధికకాలం కొనసాగాలన్నా, గ్రంథరూపం ధరించాలన్నా అందుకు 'లిపి' అవసరం. కేవలం మౌఖికభాషగా ఉన్నంత మాత్రాన ఇతర భాషల నడుమ మనుగడ సాగించడం కష్టం. కానీ అటువంటి సంప్రదాయ కొలమానాలకు తూగకుండా తన సొంత అస్తిత్వాన్ని కొన్ని వందల సంవత్సరాలుగా నిలుపుకుంటూ వస్తుంది బంజారా భాష, సాహిత్యం. అందుకు కారణం బంజారా భాషకు, బంజారాలకు ఉన్నటువంటి అవినాభావ సంబంధం.

బంజారాలు వారి రోజువారీ జీవనంలో ఒకరితో ఒకరు సంభాషిస్తూ అనేక 'సామెతలు–జాతీయాలు' పలుకుతుంటారు. అవి వారి జీవనశైలికి అద్దం పడుతూ మాతృభాషలో ఉండే వెసులుబాటును నొక్కి చెబుతాయి. బంజారా సాహిత్యంలో సామెతలు, జాతీయాల పరిధి విస్తృతమైనదే కాక చాలా దృఢమైనది.

బంజారా సాహిత్యంలో – జాతీయాలు

జాతీయం సహజంగా ఏదైనా ఒక భాష (జాతి) కు మాత్రమే చెందిందై ఉంటుంది. జాతీయం విశిష్ట పదబంధం, ప్రత్యేక నుడికారం, పలుకుబడి కలిగి ఉంటుంది. ఒక జాతీయానికి మాతృభాషలో ఉన్న సౌందర్యం ఇతర భాషల్లోకి అనువదిస్తే మాతృభాషలో మాదిరిగా ప్రకాశించదు. అందుకే జాతీయం అంతర్లీనంగా నిరంతరం తన 'జాతి'ని తెలియజేస్తుంటుంది.

సుగాలీలు, బంజారాలుగా పిలువబడే లంబాడీల్లో భాషా సౌందర్యాన్ని తెలిపే ఎన్నో జాతీయాలు వాడుకలో ఉన్నాయి.

జాతీయం నిర్వచనాలు :

"పలుకుబడి అంటే రెండు, మూడు పదాలు కలిపి ఆ పదాలన్నిటితో గానీ, కొన్నిటితో గానీ సంబంధం లేని ఒక విశిష్టార్థాన్నిచ్చేది జాతీయం" – తాపీ ధర్మారావు

"భాషతో పాటు మన సంస్కృతికి సంబంధించినవే జాతీయాలు. జాతీయమనేది ఒక్కొక్క భాషకు ప్రత్యేకంగా ఉండే భాషాలంకారం" – రామరాజు

ఇలా మొత్తంగా 'జాతీయం అనేది ఒక భాష లేదా జాతి లక్షణాలను, ప్రత్యేకతను, సొగసును వ్యక్తీకరిస్తాయనే విషయం తెలుస్తుంది.

బంజారా సాహిత్యంలోని కొన్ని జాతీయాల పరిశీలన

బంజారా సాహిత్యంలోని జాతీయాలు తక్కిన భాషల్లోని జాతీయాలతో పోలిస్తే సాంప్రదాయికత, సంక్షిప్తత, సాదృశ్యపూర్వకం, అలంకారిక చమత్కృతి, సారవంతం, అనుభవాల మూలం మొదలగు సుగుణాలతో కూడి సులభంగా జ్ఞప్తికి (నోటికి అబ్బేలా ఉంటాయి.

ఉదా:

బంజారా జీతీయం	–	తెలుగు అర్థం
భూంజ్ లేన్ భావ	–	కాల్చుకు తిను/వేధించు
లాడేరి బేటి	–	ముద్దుల కూతురు
పోట్ భాంద్ లేన్	–	మూట కట్టుకొను
చబాయే నిజకోణ్ హడకా	–	పరిష్కారం సాధ్యంకాని సమస్య
పాపేర్ మాల్	–	పాపపు సొమ్ము (అక్రమంగా సంపాదించిన సొమ్ము)
బడాయిర్ వాతే	–	గొప్పలు చెప్పుట
ఖడ్ ఘాల్	–	గడ్డి పెట్టు/బుద్ధి చెప్పు.

ఇలా బంజారా భాషలో జాతీయాలన్నీ చిన్న పదబంధాల ద్వారా పెద్ద భావాన్ని అర్థవంతంగా చెప్పే భాషామాధుర్యం కలిగి ఉంటాయి.

బంజారా సాహిత్యంలో సామెతలు

లంబాడీలు వారి దైనందిన జీవితంలో సామెతలను ఎంతో ఉత్సాహంతో, అసంకల్పితంగానే ఉపయోగించడం గమనించవచ్చు. అందుకు కారణం లేకపోలేదు. సామెత అనేది బంజారాలకు జాతితో ముడిపడిన జనుల అనుభవాల సారాంశ వైఖరుల బహిర్గత రూపం. గిరినజ భాషలోని (సాహిత్యంలోని) సామెతలు కేవలం వాక్యం, పదం అర్థాలనే కాక జాతి యొక్క ఆత్మని, అస్తిత్వాన్ని ఆవిష్కరిస్తాయి.

పరిశీలించాలే కానీ బంజారాల నిత్యవ్యవహార శైలిలోని సామెతల అర్థం, అంతరార్థాలు దర్శించి భాషా నైపుణ్యాలు వృద్ధి పరుచుకొని పునరుత్తేజాన్ని పొందలేని పాఠకుడు ఉండడు.

సామెత నిర్వచనం:

- 'ఒక పండితార్థాన్ని కొద్ది మాటల్లో చెప్పేది సామెత' (విశ్వనాథ)
- 'సామెత జీవితానుభవం యొక్క సూత్రప్రాయమైన నగ్నస్వరూపం' (బి.రామరాజు)
- 'బంజారా ప్రజల యొక్క వచన చాతుర్యం యొక్క మార్గం వీరి దైనందిన వ్యవహారము వలన కాకుండా వారు అప్పుడప్పుడు చెప్పుకునే సామెతలపై కూడా ఆధారపడి ఉంటుంది' – (బి. చీనియా నాయక్)
- 'జానపదుల భాషలో సామెతలదొక విలక్షణమైన సొసగు. అవి జీవిత అనుభవమును ఎల్లప్పుడు సారవంతంగా నుంచెడి సూత్రాలు. పల్లీయుని పలకరించినచో కొంగ్రొత్త సామెతలెన్నింటినో వినగలము' – (ఎసీ. గంపప్ప)
- "Question is a good King. There is a Community of thought in it" - (Rechard A).

బంజారా భాషలో సామెతలు భాషా సౌందర్యం

బంజారాలు సామెతలను కొన్ని ప్రక్రియలకు, కొన్ని సందర్భాలకు పరిమితుల్ని చూపకుండా జీవిత దశలోని వివిధ మనస్తత్వాలు, అనుభవాలు, ప్రకృతి సంబంధితాలు, జంతువులు, కాలాలు మొ॥న అన్ని అంశాల్లోనూ సామెతలను జోడించి సంభాషణను రక్తి కట్టించుతారు.

- "మీటీన్ దేకన్ మాకి అవజు" – బెల్లం ఉన్నప్పుడే ఈగలు వాల్తాయి.

ఈ సామెతలో 'మీటా' పదం యొక్క అర్థం 'బెల్లం' గా పరిగణించినప్పటికీ అంతరార్థంలో 'సంపద' ఉన్నప్పుడే బంధువులు, పరిచయస్తులు దగ్గరవ్వటం మనం గమనిస్తూంటాం.

- 'వాసుదేవ్ జాన్ గదాటాంగీ పకడోజు'

ఈ బంజారా సామెతకు 'వసుదేవుడు వెళ్లి గాడిద కాళ్లు పట్టుకున్నట్లు' అని అర్థం. ప్రస్తుత కాలానికి ఈ సామెత వర్తిస్తుంది. అవసరం కోసం ఒక్కొక్క సారి గొప్ప వారైనా చిన్న స్థాయి వారిని ప్రాధేయపడడం లోకవిధితమే.

- 'దీయేర జన్నాజ్ ఘర్ సదార్ లేవణు'

'దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకొను' అంటారు. నిజమే కదా మరి, ఏదైనా భవిష్యత్ అనేది మన చేతిలో ఉండదు. కాబట్టి వర్తమాన కాలంలోనే ఉన్న అవకాశాలతో మంచి జీవితాన్ని రూపొందించుకోవాలి.

- 'సత్రం భోజనం మఠం నిద్ర'

  'గామాదళియ గుడిమ నీంద్'

  ఊళ్లో బువ్వ గుళ్లో నిద్ర.

- 'సాసు కేతీజ్జా బ్యాడీ సామళ్తీజ్ జా'

  అత్త చెబుతూనే ఉంటుంది కోడలు వింటూనే ఉంటుంది.

  'భాయి అపణేర్ రతో భనోయి అపణేర్ వేజాక'

  అక్క మనదైతే భావ మనవాడవుతాడా?

- 'సోమాటి' ఏక్జాగ్ పొందపడన్ తీన్ బీరే పొందేనిజు'

  వందమంది మగవాళ్లు ఒకచోట ఉండగలరు. కానీ ముగ్గురు ఆడవాళ్లు ఒక చోట ఉందరు.

- 'జుట్టు ఛజాకో యాడీ ఛోడ్ భి సకచ, భాంద్ బి'

  జుట్టున్నమ్మ ఏ కొప్పు వేసినా అందమే.

- 'బాటీర్ గరీబ్ పడన్ భగవానేర్ కోని'

  భగవంతుని దృష్టిలో బీద, గొప్ప భేదం లేదు.

- 'గ్వార్ గ్వాణ్ణిర్ లడాయి ఉందాళేర్'
  ఆలుమగల కలహం అన్న ఉడికేంత సేపే.
- 'యాడీ పేట్ దేక్ తాండ్రి పోట్ దేక'
  తల్లి కడుపు చూస్తుంది. పెళ్లాం మూట చూస్తుంది.
- 'బేటా హుయోకరన్ మురస్ మత్ బేటీ హుయీకరన్ రోమత్'
  కొడుకు పుట్టాడని మురువకు,
  కూతురు పుట్టిందని ఏడ్వకు.

బంజారాలు సామెతలను ఇలా అందంగా, అర్థవంతంగా, ప్రాసయుక్తంగా పలుకుతూ జీవితంలో ప్రతి దశను, ప్రతి పనిని సందర్భాన్ని ఉట్టి మాటలతో కాక సామెతలను జోడించి వ్యాఖ్యానించడం పరిపాటే.

బంజారా వ్యవహారములలో సామెతలు, జాతీయముల పాత్ర

బంజారాలు దృఢమైన శరీరమే కాకుండా వివేకవంతమైన మేధస్సు గలవారని మనం వారి సామెతలు, జాతీయాలు పరిశీలిస్తే అర్థం అవుతుంది. బంజారాలు ఇప్పటి వరకు కూడా మౌఖిక సాహిత్యం మీద ఆధారపడే భాషా వినియోగం చేస్తూ, జీవనచక్రాన్ని నడుపుతున్నారు.

ఒక భాష దీర్ఘకాలం వాడుకలో ఉండాలంటే దానికి లిఖితరూపమైన వర్ణముల వాడకం కావాలి. అలా లేని భాషలు కనుమరుగై పోతాయి. కానీ అటువంటి 'నిబంధనల'కి, బంజారాభాష లొంగలేదు. కారణం బంజారా భాషలోని నుడికారాలు, పదబంధాలు, జాతీయాలు, సామెతలు గట్టి 'చేవ' గలిగిన భాషాకారకాలు కావడం.

బంజారా సంస్కృతి సంప్రదాయాలనుంచి పుట్టిన ఎన్నో సామెతలను, జాతీయాలను తక్కిన భాషల్లోకి ఆదానప్రదానాలు జరిగినా సొంత భాషలోని సొబగును ఇతర భాషలు ఆవిష్కరించలేక పోవడం బంజారా భాషా సౌశిష్ట్యానికి, విశిష్టతకు నిదర్శనం.

బంజారాలు, కష్టంలోనూ, సుఖంలోనూ, హాస్యంలోనూ, వివిధ కాలాల్లోనూ, వావి వరుసల్లోనూ, కుటుంబ బంధాల్లోనూ ఇలా ప్రతిచోటా అనునిత్యం సామెతలు, జాతీయాలు సందర్భోచితంగా వాడుతూనే ఉంటారు.

ముగింపు :

మానవ నాగరికత మూలాలైన జానపదసాహిత్య పుటల్లో ఆదివాసీలైన బంజారాల ప్రస్తావనలేని చరిత్రను ఊహింపజాలము. ప్రకృతి జీవనానికి నిరంతరం సమీపంలో ఉండే గిరిజనులు రోజు రోజుకీ రంగులు మార్చుతున్న ప్రపంచంలో మలినమవకుండా ఇంకా స్వచ్ఛంగా ఉన్నారంటే కారణం వారి ఉజ్వలమైన సాంస్కృతిక నేపథ్యమే. అటువంటి దృఢమైన సాంస్కృతిక నేపథ్యం కలిగిన చెంచు, కోయ, కొండ రెడ్లు, సుగాలీ, లంబాడీ మొదలైన గిరిజన జాతులు అంతరించి పోతున్న భాషలు కలవిగా ముందువరుసలో ఉన్నాయి.

అందుకు కారణం గిరిజన సాహిత్యాన్ని మాతృభాషలో లిఖించుకునే అవకాశం లేకపోవడమే, కాబట్టి గిరిజన సాహిత్యాన్ని పరిరక్షించే చర్యలకు శ్రీకారం చుట్టాల్సిన తరుణం సమీపించింది అనడంలో సందేహం, అతిశయోక్తి రెండూ లేవు.

- ప్రభుత్వం గిరిజనుల భాషా సాహిత్యాల పరిరక్షణకు చొరవచూపాలి.
- బంజారా భాషకు 'లిపి'ని రూపొందించాలి.
- యూ.జి.సి. వారు విశ్వవిద్యాలయాల్లో గిరిజన సాహిత్యంపై మరింత విస్తృతంగా పరిశోధనలు చేయించాలి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బంజారా, గిరిజన సాహిత్యాలపై కృషి చేసే వారిని అభినందించి బహుమతులు అందించాలి.
- బంజారాలు బాగుంటేనే భారతదేశంలోని 'భిన్నత్వంలో–ఏకత్వం' ఆచరణలో రూపం దాల్చినట్లుంటుంది.

"ప్రతి ప్రత్యేక భాషా సమూహానికి రత్నాల్లాంటి జాతీయాలుంటాయి. అయితే మారుతున్న సంస్కృతి సంప్రదాయాలకింద అసలు జాతి జాతీయాలు అణగారే ప్రమాదం ఉంది". – దాశరథి రంగాచార్యులు

ఉపయుక్త గ్రంథాలు:

1. నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం – జీవన చిత్రణ – ఆచార్య సూర్యధనుంజయ్
2. బంజారా – తెలుగు జాతీయాలు – తులనాత్మక పరిశీలన – డా. నూనావత్ రాంబాబు
3. కొండకోనల్లో తెలుగు గిరిజనులు – డా.శివరామకృష్ణ.

8. బంజారాల హోళి పండుగ గేయ సాహిత్యం

డా. పాన్‌గోత్ భగ్గు
పోస్ట్ డాక్టరల్ ఫెల్లో

హోళి పండుగ రమణీయమైన రంగుల పండుగ. లంబాడీలు జరుపుకునే అతి ప్రధానమైన పండుగల్లో ఇది ఒకటి. చిన్నా చితకా, ముసలి ముతకా అందరూ ఆడి, పాడి ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ. అందుకే హోళి పండుగ అని చెబితే చాలు మంచంలో ఉన్న ముసలివాడైనా గంతులేయడం లంబాడీల్లో కనిపిస్తుంది. అయితే ఈ హోళి పండుగ పుట్టు పూర్వోత్తరాల గురించి పురాణ గాథను నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం పాన్‌గోత్‌తండా నివాసి నేణావత్ బిచ్యా (90) ఇలా వివరించారు:

"పడమర దిక్కు నుండి ఒక అబ్బాయి తనకు ఇష్టమైన అమ్మాయి దొరికితే పెండ్లి చేసుకోవాలని వస్తుంటే, తూర్పుదిక్కునుండి అందమైన ఒక రాక్షసుని కుమార్తె మంచి అందగాడైనా అబ్బాయి దొరికితే పెళ్లి చేసుకోవాలని వస్తూ ఉంటుంది. ఒకరికొకరు ఎదురుపడి మీరెవరని అబ్బాయిని అడిగితే నేను రాజకుమారుడినని, ఏం చేస్తావంటే వ్యాపారం చేస్తానని చెప్పగా నేను రాజకుమారినని ఈమె చెప్తుంది. అలా తమ మనసులోని మాటను వ్యక్తపరుచుకొని ఇద్దరూ ఇష్టపడి పెళ్లి చేసుకుంటారు. వారికి మగ పిల్లవాడు జన్మిస్తాడు. అయితే ఒకరోజు భర్త చేస్తున్న వ్యాపారాన్ని చూడాలనే కుతూహలంతో ఆయనకు చెప్పకుండా అక్కడికి రాగా, అతను చెప్పులు కుడుతూ ఉంటాడు. నేను పెళ్లి చేసుకున్నది ఇతనినా? అనుకొని ఇంటికి వచ్చి ఊయలలో ఉన్న కొడుకు తలపై బండరాయితో కొట్టి చచ్చాడని నిర్ధారించుకొని ఇంటినుండి వెళ్లిపోయింది. భార్య నన్ను చూసి కోపంతో తిరిగిపోయిందని ఇంటికి వచ్చి చూడగా ఊయలలో ఉన్న అతని కొడుకు కొనఊపిరితో ఉండగా ఆకులు, అలములు తెచ్చి కట్టుకట్టగా ఆ పిల్లవాడు ఊపిరి పీల్చుకున్నాడు. పిల్లవాడు రోజురోజుకు పెరుగుతూ తండ్రి కంటే అందంగా తయారైనాడు. తన పెళ్లి తనే చేసుకుంటానని అమ్మాయి కోసం

తిరుగుతుండగా ఇంటి నుంచి వెళ్లిపోయిన ఈమె తన మహిమతో యవ్వనంగానే అంతే అందంగా ఉన్నది. అయితే ఆమె కూడా పెళ్లి చేసుకోవడానికి తిరుగుతూ ఈ అబ్బాయిని కలుస్తుంది. అప్పుడు ఇద్దరూ ఇష్టపడి పెళ్లి చేసుకొని చాలా ఆనందంగా జీవిస్తూ ఉండగా ఒకరోజు తన భర్తకు తలంటుస్నానం చేయిస్తుండగా తలపై గాయాలు ఉండటంతో ఆ గాయాలు ఏమిటని అడుగగా మా నాన్న మా అమ్మను మోసం చేసి పెళ్లి చేసుకున్నాడని ఆగ్రహించి ఊయలలో ఉన్న నన్ను కొట్టి చంపేశాననుకుని వెళ్లిపోయిందని జరిగిన విషయాన్ని వివరిస్తాడు. అమ్మో ఈ లోకంలో ఎవరూ చేయని విధంగా నేను కొడుకును పెళ్లి చేసుకొని సంసారం చేశానని వెళ్లి దేవతలను అడుగగా ఆ రోజు దేవతలందరూ కలిసి ఈ హోళిని తయారుచేశారు. అందుకే మనం మొదట 'కాకి దాది రీస మత కరజో హం ఖేలాంఛా హోళి' అని పాడుతాం. అనగా చిన్నమ్మ, నాయనమ్మలు మీరు కోప పడవద్దు మేము హోళి ఆడుతున్నాం అని మొదటగా చెప్పి ఆ తరువాత బూతు తిట్టుకుంటాం. ఆమె చేసిన పాపం ఈ రోజు వరకు కూడా పోలేదు. అందుకనే హోళి కాల్చి ఆ పాపం పోయే వరకు తిడుతూనే ఉండాలి'' అని పేర్కొన్నాడు.

పై కథనంలో చెప్పిన విధంగా లంబాడీలు హోళి పండుగ సందర్భంలో వావివరుసలు లేకుండా బూతుపదాలు ఉపయోగించి ఒకరినొకరు తిట్టుకోవడం, ఆడ, మగ ఎవరూ ఎలాంటి కోపతాపాలూ ప్రదర్శించకుండా చిన్నా, పెద్దా తేడా లేకుండా ఉత్సాహంగా, ఉల్లాసంగా ఆనందించడం హోళి పండుగ సమయంలో తప్ప మిగతా రోజుల్లో పాడకూడదని అలా పాడితే గజ్జి తామరలు వస్తాయనే నియమం ఉండడం అలాగే అందరూ పాటిస్తుండటం పై కథనాన్ని బలపరుస్తున్నది.

అయితే హోళి పండుగకు సంబంధించి మరో కథనాన్ని నల్లగొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లి మండలం నందియా తండా నివాసి రమావత్ వసరాం (95) ఇలా వివరించాడు: "హోళి తల్లిదండ్రులు రాజదంపతులైన నీలావతి, హరణ్‌కోస్ తమ్ముడిపేరు పొలాస్. ఇప్పుడు మనం రాం రాం అంటున్నట్టు అప్పుడు జగత్తు మొత్తం యా హరణ్‌కోస్ అని అనేవాళ్లు. ఒకరోజు పొలాస్ ఊరికి వెళుతుండగా కుమ్మరి పచ్చికుండల బట్టీకి నిప్పు పెట్టి ఉంటే ఆ బట్టీలో ఉన్న నా పిల్లలు కాలవద్దని రాం రాం అనుకుంటూ ఒక పిల్లి ఆ బట్టి చుట్టు తిరుగుతుంటే పొలాస్ ఆశ్చర్యపోయి లోకంలో అందరూ మా నాన్న పేరు యా హరణ్‌కోస్ అంటారు. ఈ పిల్లి రాం రాం అంటున్నదని

అనుకొని ఆ బట్టి తీసేటప్పుడు పౌలాస్ కూడా వెళ్లి చూస్తే ఆ పిల్లి పిల్లలు ఏమాత్రం కాలకుండా బయటపడడంతో ఈ రోజు నుండి అందరూ రాం రాం అనాలని దప్పు చాటింపు వేయిస్తాడు. ఆ విషయాన్ని తెలుసుకున్న హోళి అన్నతో వాగ్వాదం చేసి మైనంతో చేసిన గొడ్డలితో ఇనుపస్తంభాన్ని నరకాలని పందెం కట్టుకుంటారు. యా హరణ్‌కోస్ అని హోళి ఇనుప స్తంభాన్ని నరకగా గొడ్డలి మూడు ముక్కలు అవుతుంది. పౌలాస్ యా రాం అని నరకగా ఇనుపస్తంభం తెగిపోయింది. అయితే ఆ విషయాన్ని హోళి ఒప్పుకోకపోవడంతో అన్నాచెల్లెళ్లు మరొక పందెం కడతారు.

రెండవ పందెం ప్రకారం పది టన్నుల కట్టెలలో పన్నెండు టన్నుల నూనె పోసి నిప్పంటిస్తే అందులో నుండి రాం రాం అనుకుంటూ పౌలాస్ బయటికి వస్తాడు. తరువాత హోళి ఆ నిప్పులో నుండి రావడానికి ప్రయత్నిస్తుండగా గాలి దశ మారిపోయి హోళి కాలిపోతుంది. అమ్మో నా కూతురు అని వాళ్ల అమ్మ వస్తే ఆమె కూడా మంటల్లో కాలిపోతుంది. అందుకే మొదట తల్లి హోళిని కాల్చి, తరువాత హోళిని కాల్చుతారు. అలా సంచారం చేస్తున్న ఒక రాజు కూతురుకు అంటుకోగా ఒక మంత్రగాడి సలహా మేరకు రాజు ఆజ్ఞ ప్రకారం ఆ సంవత్సరం పుష్కలంగా పండిన జొన్నలను బయట పారబోసి హోళి కాల్చి నృత్యాలు చేసి ఆడి పాడితే ఆ రాజు కూతురు మంచిగా అయ్యింది. అప్పుడు బంజారా నాయకుడు పమార్ వంశీయుడైన పూణా నాయక్ సంచారం చేస్తూ జొన్నల వ్యాపారం చేసేవాడు. అక్కడ ఇక్కడ తిరుగుతూ జొన్నలు కొనడం కోసం ఆ రాజ్యానికి వెళ్లి అక్కడ పారబోసిన జొన్నలను ఎత్తుకొని వస్తాడు. ఆ జొన్నలవెంట వచ్చిన హోళి పూణా నాయక్ కూతురుకు అంటుకోగా హోళిని కాలిస్తే నీ బిడ్డ బాగవుతుందనగా 'బాదర్‌బండ' అనే గుండురాయిపై హోళి కాలుస్తున్నానని పిలవగా లంబాడీల మిగతా వంశాల వారందరూ రాగా హోళిలో నిప్పు పెట్టి, ఆడుతుండగా జారి కింద పడితే అతని మీసాలు కొద్దిగా కాలాయట. అలా అక్కడికి వెళ్లి ఆడి పాడిన వారి వెంట హోళి వచ్చేసరికి అందరూ ఈ పండుగను జరుపుకుంటున్నారు'' అని పేర్కొన్నాడు. ఈ కథనంలో చెప్పిన విషయాలలో బంజారాలు సంచారంలో ఉన్నప్పుడు పమార్ వంశీయుడైనా పూణా నాయక్ కర్ణాటకలోని బళ్లారి దగ్గర ఉన్నా 'బాదర్ బండ' మీద హోళిని కాల్చాడనేది ఇప్పటికి అందరూ చెబుతున్నారు. అలాగే హోళి కాల్చిన తరువాత అందులో జొన్నలు వేసే ఆచారం ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. కాబట్టి ఈ కథనం కూడా రూఢి అవుతున్నది.

హోళీ కాల్చడానికి చెప్పే కథనాలు వేరు వేరు అయినప్పటికీ హోళీ పండుగను ఉత్సాహంగాను, ఆనందంగానూ జరుపుకుంటున్నారు. హోళి పండుగ దగ్గర పడుతున్నప్పుడు ఒక నాయక్ ఆధ్వర్యంలో ఉన్న కార్‌భారి మరియు ఇతర తండాల వాళ్లు ఒక దగ్గర కూర్చొని చర్చిస్తారు. ఆ సంవత్సరంలో పాడి పంటలు, ఆర్థిక పరిస్థితులు, వాతావరణం అనువుగా వుందా లేదా అనే విషయాలను పరిగణనలోకి తీసుకొని హోళి పండుగ చేద్దామని నిర్ణయించుకుంటారు. ఫలానా రోజు కఱ్ఱ (దాండో) ను కడదామని అనుకొని తమ తమ తండాలలో ఏర్పాట్లు చూసుకుంటారు.

దాండో భాందేర్

తండాలు వేరైనా నాయక్ ఒక్కడే కాబట్టి ఆ నాయక్ పేరు మీదనే హోళి జరిపిస్తారు. దాండో భాందేర్ కార్యక్రమం మాత్రం కార్‌భారి ఇంటి దగ్గర చేస్తారు. మిగతా తండాల వారు వచ్చి నాయక్ దగ్గర నుంచి తెచ్చిన హోళి కాల్చేటప్పుడు పెట్టే ప్రత్యేకమైన కఱ్ఱ (దాండో) ను అందరి సమక్షంలో కట్టి కార్‌భారికి అప్పగించి వెళ్లిపోతారు. అది అధికారికంగా హోళి చేస్తున్నారు అనే దానికి సంకేతం. ఇక మరుసటి రోజు నుండి పురుషులు తమకు కావాల్సిన రంగు రంగుల చొక్కాలు, పంచెలు, శాలువాలు, కండువాలు, కాళ్లకు గజ్జెలు కొనుక్కొని వస్తారు. నాలుగైదు డప్పులు, నగారాలు సిద్ధం చేసుకుంటారు. ఇక అక్కడి నుండి ఆడటం, పాడటం ప్రారంభిస్తారు. అలా ఆడుతూ పాడుతూ మిగతా నాయక్‌ల తండాలకు విరాళాలు వసూలు చేసుకోవడానికి వెళ్లినప్పుడు ఆడుతూ పాడే విధానాన్ని 'ల్యాంగి' లేదా 'లేంగి' అంటారు. ఈ లేంగిలో ఆడటానికి రంగురంగుల దుస్తులతో ఆభరణాలతో గజ్జెలతో అలంకరించుకున్న వారిని 'గేరియా' అంటారు. లేంగిలో గుంపుగా ఆడే వారిని గేరియాలు అంటారు. లేంగిలో గేరియాలు ఆడుతూ, పాడుతూ నృత్యాలు చేస్తూ పాడే పాటలు క్రింది విధంగా ఉంటాయి.

గరూరే బాలాజి తారి సోనేరి పాలకి యే
సమ్మాళ్ తారి పాలకి పర దీజ సవాయి రకలో
జె బోలో   బైబై ర
జె బోలో   గేరియాతి

బంగారు పల్లకిపై కూర్చున్న ఓ వేంకటేశ్వర స్వామీ! హోళి ఆటలు, పాటలు పాడుతున్నాం మమల్ని దీవించు.

ఛోటి ఛోటి డోరే కువలో నయి పూంఛ
తారే పేటియారి డోరేన చోడన భాందన డోరల పాణి యే
కువలేపర్ హూసి గేరియా
కువలేపర్ సీళ్‌కళ్ ర

చిన్న చిన్న దారాలతో ప్రయత్నిస్తే అవి బావిలోకి అందవు. అందుకే నీ లంగా (పేటియా) దారం తీసి కట్టుకొని బావిలో నీళ్లు తోడుకో హుషారుగా, సంతోషంగా మేం హోళి ఆడుకుంటాం.

ఘరేరె సాజానీయాన కాఠీ క మిఠి లాపసియే
వూతో పరలే సాజానీయాన ఖీరపొళి లాపసియే
ఘర దూబళో బైబై ర
జావా జకో రాత కసేన కోవో
జావా చాలోర బైబైర

ఇంటాయనకు ఏమో పుల్లటి, తియ్యటి పాయసాన్ని పెట్టి, తన ప్రియుడికేమో బెల్లం, నెయ్యితో కలిపిన పాయసమా? ఇది తగునా? ప్రియురాళ్లు తమ భర్తలకు పెట్టే తిండిని, తమ ప్రియుడికి పెట్టే తిండిని వివరిస్తూ వారి మధ్య ఉండే ప్రేమానుబంధాన్ని తెలియజేస్తున్నది గేయం.

సాతీ సమదరే పరియా జింగేరి హార్ ఛ
జింగేరి హార్ ఛ వత గేరియారి ఢార్ ఛ
తూ కోని కేవసర కేవటీయో
ఓడ కేవెద బైబైర
ఓడ కేవెద నాఛోర

ఏడు సముద్రాలలో రొయ్యల హారం ఉన్నట్టు గేరియాల గుంపు ఉన్నది. ఆ గేరియాలను నీవు భరించలేవు. అందుకే ఓడను భరించనివ్వండి. ఏడు సముద్రాలలో

రొయ్యలు ఎలా గుంపులు గుంపులుగా తిరుగుతాయో అలాగే గేరియాల గుంపు కూడా ఉన్నదని చెబుతున్నారు.

పీసా వగాయేరో

'లేంగి' అనగా వలయాకారంలో నిలబడ్డ పురుషుల (గేరియాల) గుంపు అని అర్థం. అయితే ఈ హోళి కార్యక్రమం పూర్తయ్యే వరకు బాధ్యతలు మోయడానికి ఒకరిని నియమిస్తారు. అతనిని 'మద్దిగేరియా' అని అంటారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి ఆటుపోట్లు ఎదురైనా, సామరస్యంగా కారక్రమాన్ని తన ఓర్పుతో, నేర్పుతో అందరిని సమన్వయపరచడానికి సహాయపడతాడు. గేరియాలందరు వలయాకారంగా (లేంగి) నిలబడితే మద్దిగేరియా ఆ లేంగి మధ్యలో నిలబడి పాటను ఎత్తి, నృత్యం చేస్తుంటే మిగతా గేరియాలందరూ అతనిని అనుసరిస్తూ, పాటలు పాడుతూ, నృత్యం చేస్తారు. ఆ నృత్యానికి అనుగుణంగా నగారాలు, డప్పు చప్పుళ్లకు గజ్జెల సవ్వడులు తోడై చూడటానికి కన్నుల పండుగగా ఉంటుంది. ఇలా లేంగి నృత్యం అయిపోయిన తరువాత ఇద్దరిద్దరూ గేరియాలు నృత్యాలు చేయడం ఆరంభిస్తారు. ఇద్దరు ముగ్గురు నగారాలు, డప్పులు మోగిస్తుండగా మొదట కూర్చున్న పెద్దలందరికీ నమస్కారం చేసి ఇద్దరు గేరియాలు నృత్యం చేయడం ఆరంభిస్తారు. గేరియాలు నృత్యం చేస్తున్నప్పుడు ఇంకా బాగా నృత్యం చేయాలని వారికి ఉత్సాహం వచ్చే విధంగా మిగతా గేరియాలు, స్త్రీలు పాటలు పాడుతూ రెచ్చగొడతారు. అప్పుడు నృత్యం చేస్తున్న గేరియాలు ఉత్సాహంతో ఇంకా బాగా నృత్యం చేయడానికి ప్రయత్నం చేస్తారు. ఈ సందర్భంగా పాడే పాటలు ఈ విధంగా ఉంటాయి:

పగ్గే బారే పాయల్ వోరే యేడి పర గూగర
వూతో వాజ గూగర వజావ గూగర
సాసిజకపల్లంగేపర్
చమక్యాగూగర పల్లంగేపర్
మోకాళ్ళ వరకు గజ్జెలు కట్టి ఆడిపాడుతున్నారు.
హూనా సత్తీరి హోతేమా కుంకమేరి డబలి
వోరే సాత ఘోడేపర లద్దోయావే

సత్తేధారీర   భాయి భాయి ర

గీదే బోలోర సత్తేధారీర

హూనా సత్తి చేతిలో కుంకుమ డబ్బా ఉన్నది. అతని ఏడు గుర్రాల మీద మహిమ గలవాడు వస్తున్నాడు. పాటలు పాడండి. నా పేరు భగవంతునిది నిజమేనా? ఇవి హోళి రోజులు అమ్మ కూర్చున్నది.

డబ్బలాకే చాందారి తేడిరక ఛాందణియే

సమ్మాళ్ ఛాందా చప జావర భాయి భాయి ర

దేవేరి ఛాందా చపగోర

కాళివాజళేమా ఛాందా చపగోర

పున్నమి వెన్నెల్లో హోళి ఆడుతూ ఉంటే నల్లని మబ్బులు వచ్చి ఆ చంద్రుని కమ్మేస్తున్నాయి. ఆ వెన్నెల్లో ఆడుకుంటే ఎంత హాయిగా ఉంటుందో తెలియజేస్తున్నారు.

బారే బారే మినామా ఆజ్ ఆయిర హోళియే

వూతో గేరియారో భానో రకాడి హోళియే

హోళి రమ్మార భాయి భాయి ర

నంగరి హాపణరహోళి రమ్మార

మోటియారర హోళి రమ్మార

పన్నెండు నెలల తరువాత హోళి ఈ రోజు వచ్చింది. హోళి గేరియాలను చాలా హుషారుగా ఆడి పాడించినది.

వాల పడి తరవాల పడిరే

నాచే వాళో గేరియా భణోరే గేరియా భణో

వావోర భయిడా వావోరే వావో

ఓ గేరియా! హోళీ ఆట ఆడటానికి మంచి సమయం ఇదే. అక్కడ కరవాలం (తలవార్) కూడా పడి ఉన్నది. అది అందుకుని హోళీ ఆటలు బాగా ఆడుకోమని చెబుతున్నారు.

వరలో నాచ యాడో తేడో

పరలో నాచ చ్యాడోరే పల చ్యాడోరే

వావోర భయిడా వావోరే వావో

నాచేవాళో రసతో నాచలర గేరియా

హోళి హోంకజ మారిరే బల మారిరే

ఇవతలి వాడి అడుగులు అడ్డదిడ్డంగాను, అవతలి వాడు విశాలంగాను ఆడుతున్నాడు. కావున లయబద్ధంగా ఆడగలిగే వాళ్లందరిని హోళీ మాత పిలుస్తున్నది. అందరూ వచ్చి హోళి ఆడండి.

సుంవాళి

హోళి కాల్చే రాత్రి ఏడు గంటలకు సుంవాళి తీసుకోవడానికి అందరు తండా కార్భారి ఇంటిముందు జమ అవుతారు. అప్పుడు లేంగి పెట్టి నృత్యాలు చేస్తారు. పాటలు పాడుతారు.

దేవర భోజాయి ఆపణ్ గోరలీమ జామా

వూతో రీంచాళి క్యాళిమా గండి గాసగో దేవర నాణకీయ

బై బై ర దేవర నాణకీయ

వదిన మరుదులం మనం ఇద్దరం కలిసి గొర్రెలు మేపడానికి గట్టుకు వెళదాం. అక్కడ నేను నీకోసం ఎదురు చూస్తుంటాను. నేను చిన్నవాడిని అయినా పరవాలేదు మనం హాయిగా గడుపుదాం. అని నృత్యం చేస్తూ పాటలు పాడుతూ ఒక దగ్గర జమ అయి, సుంవాళి తీసుకోవడానికి దూండ్ ఎవరెవరి ఇంట్లో చేస్తున్నారో వారి ఇంటికి బయలుదేరుతూ ఈ క్రింది పాటలను పాడుతారు.

హోవ హోవ బోసి సుంవాళి కత బోసి

చల్ భీయా పరదేసి వరేసి ఆవో బోసి

ఓ వదినల్లారా! అప్పులు (తోటా) ఎక్కడ దాచి పెట్టారో చెప్పండి. లేదంటే ఇప్పుడు బండ బూతులు తిడతాం. మీ పని పడతాం మీ మీదకు పడకముందే చెప్పేయండి. అప్పుడు స్త్రీలు కూడా క్రింది పాటను పాడుతారు.

వూంచే ఖజూరి హేట ఘణక్యారే గోపాళో ల గోపాళో ల
యాండి వాలి దిని హేలి ఛ్వాళోరే గోపాళో ల గోపాళో ల
గేరియాన దిని హేలి ఛ్వాళోరే గోపాళో ల గోపాళో ల

ఓ గోపాలుడా! పైన ఈత చెట్టు కింద పచ్చని గడ్డి, అమాయకమైన అమ్మాయి నీతో పరిహాసమాడింది. ఆమెనే మీకు అవకాశం కల్పించినది. అని పాడుకుంటూ దూండ్ చేస్తున్న ఇంటికి వెళతారు. అక్కడ ఇంటామె ఒక పొయ్యిని ఏర్పాటు చేసి ఆ పొయ్యి మీద పెనం పెడుతుంది. పెనంపై అప్పలు పెట్టి కాల్చుతుంటే గేరియాలు ఆ అప్పలను లాక్కుంటారు. అప్పుడు వరుసైన వారు ఒకరిపై ఒకరు బూతుపాటలు పాడుకుంటారు.

హోళి బాళేరో

ఈ విధంగా పాటలు పాడుతుండగా అంతకుముందే సిద్ధం చేసిన కట్టెలను ఒక దగ్గర పేర్చుతారు. ఆ తరువాత తండా నాయక్ మొదటగా ఒక చిన్న కట్టెలకుప్పలో నిప్పు పెట్టి, తరువాత పెద్ద కట్టెల కుప్పలో నిప్పు పెడతాడు. అతడిని ఇతర పెద్దలు అనుసరించి నిప్పు పెడతారు. చిన్న కుప్ప అనగా తల్లి హోళి అని పెద్ద కుప్ప అనగా బిడ్డ హోళి అని నమ్ముతారు. ఇలా హోళిలో ఒకవైపు నాయక్ నిప్పుపెడుతుండగా, కార్ భారి 'దాండో' అనే ఒక కర్రను ఆ మండుతున్న కట్టెల కుప్పలో పెట్టడానికి ప్రయత్నిస్తూ 'హోళి మా దాండో గేరియా బాండో' అని పాడుతూ పెట్టగానే మంట సెగ ఆ దాండోకు తగలక ముందే దానిని తీసుకొని ఒక గుంపు పారిపోతుంది. దాండో నికళగో దాండో నికళగో అని ఒకరు కేకలు వేయగానే ఇక చిన్నాచితకా ఆడమగ రకరకాల నృత్యాలు చేస్తూ ఆ మంట చుట్టూ పాటలు పాడుతూ ఆడతారు.

హోళియే మారి భమ్మర హోళి
భర గేరియారి జోళి

ఉవ్వెత్తున ఎగుస్తున్న హోళి నీవు మా గేరియాల ఒడిని నింపు. తమకు సిరిసంపదలు, పిల్లా పాపలు ముఖ్యంగా మగ సంతానం కలగాలని హోళీ మతను వేడుకుంటారు.

ఆ సందర్భంగా ఎగుస్తున్న హోళీ మంట చుట్టు చిన్నా, పెద్దా, ఆడా, మగా అందరూ తిరుగుతూ, హోళీ మాతను మొక్కుతూ పాటలు పాడుతూ నృత్యాలు చేస్తారు.

సూతేరే సపనేమా ఆయిరే మేరామా

సమ్మాళ్ సేవాభాయా ఆయిరే మేరామా తోన పరగేటి

గేరియారి భూక తోన దేగిరే సేవాభాయా.

ఆయిరే మేరామా తోన పరగేటి

సమ్మాళ్ సేవాభాయా ఆయిరే మేరామా తోన పరగేటి

సేవాభాయా కలలో మేరామా వచ్చింది. గేరియాల ఆకలి నీకు అమ్మ ఇచ్చిపోయింది. మేరామా వచ్చి నీకు వరం ఇచ్చింది.

మారే ఘరేమా మ సూతితి

కాంకర్య కూణ మారగో

వూ చందణ రుమాలేవాళో ఛ్వార మారగో

కేదూ కేదూర భాయి భాయి ర

వూతో రాతడ రుమాలే వాళో హిజడో

కేదూ కేదూర బై బై ర

కేదూ కేదూర నాయేకేన

నా ఇంట్లో నేను పడుకున్నాను. రాయి ఎవరు కొట్టారు? ఆ నేను చూశాను ఆ ఎర్ర రుమాల్ పిల్లగాడు కొట్టాడు. తండా నాయక్‌కు, కార్‌భారికి, గేరియాలకు నేను చెప్పేస్తా. ఈ విధంగా పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ హోళి మంటలో కట్టెలన్నీ కాలే వరకు ఆడుతూ, పాడుతూ ఉంటారు. ఆ తరువాత పిల్లలు లేని స్త్రీలను మద్దిగేరియా హోళీ గుండం చుట్టు ఏడుసార్లు తిప్పుతాడు. అయితే మరిది వరుస అయ్యేవాళ్లు ఆ వదినను పైకెత్తి కేరింతలు కొడతారు. అలా చేస్తే ఆమెకు సంతానం కలుగుతుందని నమ్ముతారు. ఆ తరువాత నాయక్, తండాకు కార్‌భారి, మిగతా తండాల వారు 'దూండ్' కోసం వెళతారు.

దూండ్

హోళి కాల్చిన రోజు ఈ దూండ్ కార్యక్రమం చేస్తారు. ఈ దూండ్ అనేది రెండు హోళీల మధ్య జన్మించిన మగపిల్లల పేర్ల మీద చేయడం ఆచారంగా వస్తున్నది. లంబాడి పిల్లలకు దూండ్ చేయడం అంటే పుట్టిన రోజు పండుగ చేయడమని లంబాడి పెద్దలు చెబుతున్నారు. ఏ పిల్లవాడికైతే దూండ్ చేయరో అతనిని గండేరో అని పిలుస్తారు. హోళి పండుగ చేస్తున్న సంవత్సరంలో ఒక తండాలో ఎంతమంది మగ పిల్లలు జన్మిస్తే వారందరికి దూండ్ చేస్తారు. తండాలో ఈ దూండ్ కార్యక్రమం ఎవరెవరికి చేయాలో మద్ది గేరియా సలహాతో కార్ భారి నిర్ణయిస్తాడు.

హోళి కాల్చిన తరువాత గేరియాలందరు దూండ్ చేస్తున్న ఇంటికి ఆడుతూ పాడుతూ నృత్యాలు చేసుకుంటూ చేరుతారు. అప్పటికే ఆ ఇంటిముందు సానిపి చల్లి, నాలుగు గుంజలు పాతి చద్దర్లతో గుడారం (పాల్) నిర్మిస్తారు. ఆ గుడారం ముందు ముగ్గు తీస్తారు. అందులో చాప వేసి సిద్ధంగా ఉంచుతారు. ఇంటిల్లిపాది తల స్నానాలు చేసి కొత్త బట్టలు కట్టుకొని, పిండితో చేసిన అప్పలు (ఫోట) ఎర్రని గుడ్డ (మద్రి) ఎండు కొబ్బరితో సిద్ధంగా ఉంచుతారు. అలాగే బెల్లం కలిపి వండిన అన్నం మరియు మామూలు అన్నాన్ని రెండు బిందెలలో వండి, ఇంటి ముందు నాలుగు పెద్ద పెద్ద కర్రలను భూమిలో పాతి, ఆ కర్రల మధ్య అన్నంగిన్నెలు పెట్టి తాడుతో ఆ అన్నం బిందెలను గట్టిగా బిగించి కట్టి ఉంచుతారు. గేరియాలు ఆ కర్రలను పీకి, అన్నం బిందెలను తీసుకొని వెళ్లాలి. అయితే ఆ బిందెల కోసం గేరియాలు ప్రయత్నం చేస్తున్నప్పుడు ఆ తండాలోని స్త్రీలందరూ కర్రలతో కొడుతూ ఆ బిందెలను తీయనివ్వరు. స్త్రీల దెబ్బల నుండి తప్పించుకొని ఆ అన్నం గిన్నెలను ఎత్తుకొని పోవడం అనేది గేరియాల బలానికి, ధైర్య, పరాక్రమానికి పరీక్షగా భావిస్తారు. దూండ్ చేస్తున్న ఇంటికి చేరుకున్న గేరియాలు, మొదటగా గుడారం (పాల్) దగ్గర చేరుకొని, బాలుడిని తల్లిదండ్రుల ఒడిలో కూర్చోబెట్టి, ఎర్రగుడ్డ (మద్రి)ని ఆ బాలుడి తలకు తలపాగాను మద్ది గేరియా చుడతాడు. అలా చుట్టిన తరువాత ఆ బాలుడి చేతిలో కొబ్బరి కుడకలు పెట్టి కింది పాటను పాడతారు.

ఆవోనార్ యావతడో కాయి

బ్యాసోనార్ పీటాపర్

పీళే పలంగ్ పర్ చ్వారా చే

రాతడ్ పలంగ్ పర్ ఛ్వారి చే

చ్వారియే తోన్ చ్వారాలేజ

కుకన్ కాడు పీడా అబే

దీనిని ఒకసారి పాడాలి

అటోపియా తం చలే సాత్ రే

జాపత్ లాడి లాడి ఆవే

లాడికో లాడానే లావే

వటలాడి తూ పలంగ్ పచావే

వార్ గుదరియా గోర్ దరావే

ఓ హోరికర్ తార్ దబావే

ఆత్ గోత్ యే దేకణి ఆవే

గుణపత్ వతో గోణ్ దరావే

బ్యాటి సాసు పాళ్ దబావే

బ్యాటో ససరో సీక్ దరావే

సీకచ సికావచ

సీకా హాత్ గలావచ

సీకజేరి సాత్ పోళి కిరాన్ పోళి

బాళకియారో ప్యాలో త్యావార్

ఆయి హోళి వాజి ట్వాళి

చరిగ్ చరియా చంపాడాళ్

జుజు చంపా లారాల్

జుజు సూత్ పడేరాహో

ససరో పూత్ మాయే సమాళ్

ప్యాసట్ పూత్ బాపే సమాళ్
స్యాసట్ పూత్ గోడోదుకావ్
శిసరో పూత్ లేకో కరావ
కాసి కావడ్ క్యాహో
హోళి సబూతి గర్కూనా చ్వారా అవ్డార్ అవడా
దీనిని ఏడుసార్లు పాడాలి

భావం: రండి పీట మీద కూర్చోండి. పసుపు పచ్చని పీట మీద అబ్బాయి, ఎర్రని పీట మీద అమ్మాయి కూర్చోని ఉన్నారు. అమ్మాయి నిన్ను అబ్బాయి తీసుకొని వెళ్తాడు. ఇప్పుడు నీ పీడా ఎలా వదిలించుకోను. అటు నుంచి వస్తున్న మీరు మా వెంట రండి. జాపత్ లాడి వస్తుంది. ఆ లాడి, వటలాడి పల్లంగ్ మీద పలకరిస్తాను. గోరులైన లంబాడీలు ఈ విధంగా మాట్లాడుతారు. మంచి గుణం ఉంటే గోణి ఇప్పిస్తారు. కూర్చున్న అత్త పాదాలు ఒత్తించుకుంటుంది. మామ కూర్చోని మంచీ చెడూ తెలియజెపుతాడు. తెలుసుకోవడానికి ఏడు పోళీలు బాలుని మంచి గుణంతో పెంచండి. హోళి వచ్చింది. చరిగ్ చరియా చంపా ఢాలు ఉన్నది.

టోకణ్ కోసేర్

ఈ పాటను పాడి బాలుడిని ఆశీర్వదించి, అరిసెలు, కుడకలు కొంత డబ్బును మద్దిగేరియా తీసుకోగానే వయసులో ఉన్న గేరియాలు హుషారుగా కేరింతలు కొడుతూ అన్నం కట్టిన గుంజల దగ్గరకి వస్తారు. ఆ పరిసరాలలోకి రాకుండా స్త్రీలందరూ కర్రలతో కొడుతుంటే ధైర్యవంతులు సాహసం చేసి వారిని చెదర కొడుతూ వాళ్ల దెబ్బలు తింటూ ఎలాగోలా ఆ గుంజకు ఉన్న తాళ్లను విప్పి అన్నంగిన్నెలు స్వాధీనం చేసుకొని భూమిలో పాతిన గుంజలను సైతం పీకి పారేస్తారు. ఇది గేరియాల శక్తికి పెట్టే పరీక్ష. ఒక్కొక్కరు తినే దెబ్బలు వారి శౌర్య పరాక్రమానికి ప్రతీకగా భావిస్తారు. తామెంత శక్తిమంతులమో తెలియపరుస్తారు. స్త్రీలు, పురుషులు, యువతీ యువకులు హుషారుగా, ఉత్సాహంగా పోటీపడి స్నేహ పూర్వక రణరంగంగా మార్చి ఆనందించడం ప్రత్యేకమైన ఘట్టంగా చెప్పవచ్చు. ఈ సందర్భంగా ఒక ఇంటి నుండి మరో ఇంటికి వెళ్లేటప్పుడు ఈ విధంగా పాట పాడుతూ ముందుకు వెళతారు.

భూల్ భాయి భూలడా తూ

ఆంగేరే ఘరేన చాల్ రే తూ

తమ్ముడూ అన్ని మరచిపోయి మరొక ఇంటికి పదా.

ఈ అన్నం గిన్నెలను తీసుకొనే క్రమంలో జరిగిన అన్ని విషయాలను మరిచిపోయి ముందుకు వెళ్లడం అంటే వ్యక్తిగతంగా తీసుకోవద్దని సముదాయించడం విశేషం. ఇలా తండాలో దూండ్ చేస్తున్న ప్రతి ఇంటికి వెళ్లి పైన చేసిన కార్యక్రమంలాగా చేసి, సేకరించిన అన్ని అన్నం గిన్నెలను ఒక దగ్గరికి చేర్చి మగ వాళ్లందరూ కూర్చొని అప్పుడు అన్నం తింటారు. ఆ రోజు ఎంత సమయమైనా, పొద్దుగూకినా కూడా అన్నం గిన్నెలను సేకరించకుండా గేరియాలు అన్నం తినరు. అన్నం తిన్న తరువాత ఎవరింటికి వాళ్లు వెళ్లిపోయి విశ్రాంతి తీసుకుంటారు.

కాళ్మస్

దూండ్ అయిపోయిన తెల్లారి నాలుగు గంటలకు అందరూ తయారై నంగారాలు, డప్పులతో హోళిని మొక్కడానికి (హోళిదోకేర్) వెళ్తారు. తండా నుండి వెళ్లే ప్రతి ఒక్కరు తమ తమ ఇండ్లలో నుండి కొంత జొన్నలను తీసుకొని వెళ్తారు. పైన ఐతిహ్యంలో చెప్పిన విధంగా మొదటగా లంబాడిలకు హోళి పండుగ మొదలైంది. పారబోసిన జొన్నలు తీసుక రావడం వలన అనే విషయం ఇక్కడ ఋజువవుతున్నది. తీసుకువెళ్లిన జొన్నలను హోళి కాల్చిన ఆ బూడిదలో చల్లి మాకు పుత్ర సంతానం కలిగించమని ప్రార్థిస్తూ, ఆ బూడిదను కొంత ఇంటికి తీసుకొని వస్తారు. అక్కడ నుండి బయలుదేరేటప్పుడు పచ్చి బూతులు, రాయలేని భాషా పదాలు వాడుతూ, ఒకరిపై మరొకరు పాటలు పాడుకుంటూ తండాకు వచ్చి, పేడ మట్టి రంగులతో చిన్నా పెద్దా కలిసి హోళి ఆడతారు. అయితే ఇక్కడ ఎవరికీ ఏ కోపం రాకుండా ఉండడానికి

కాకి దాది రీస మత కరజో

హం ఖేలాంఛా హోళి

నాయనమ్మలు, చిన్నమ్మలందరూ మీరు మమ్మల్ని కోపగించుకోవద్దు. ఎందుకంటే మేం హోళి ఆడుకుంటున్నాం. ఇక్కడ హోళి ఆడే సందర్భంలో ఏమైనా తప్పులు జరగచ్చు, కాబట్టి మీరు మాపై కోపగించుకోవద్దు. పెద్ద మనసుతో మమ్మల్ని

అర్థం చేసుకోవాలని ముందే అనుమతి కోరడం అద్భుతంగా ఉన్నది. నిజంగా తప్పు చేసి పాశ్చాత్తాప పడటం కంటే, ముందే తప్పు జరుగుతుందేమోనని, మన్నించమని అడగటం లంబాడీల ముందు చూపుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

బోబో పాటియా బోబో లగాడగేరే

బోసిపర టికో లగాడగేరే

బోబో అని చెప్పి మా మీద అపహాస్యం చేసి వెళ్లిపోయారు. ఇలా రాయడానికి వీలు లేని భాషలో పచ్చి బూతు పదాలు ఉపయోగిస్తూ ఆనందోత్సాహాలతో ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ హుషారుగా ఆడుకుంటారు.

గోట్

సాయంకాలం తండాలో ఉన్న అన్ని కుటుంబాలకు సరిపోయే విధంగా మేకలు, గొర్రెలు కోసి పోగులు పెట్ట పంచుకొని బంధుమిత్రులకు విందు భోజనాలు పెట్టి అందరూ ఆరగించి నిద్రపోతారు. దీనితో ఈ పండుగ పూర్తవుతుంది. అయితే హోళి పండుగ సందర్భంగా పాడే పాటలు, మిగతా రోజులలో పాడకూడదు అనే నియమం ఉన్నది. అలా పాడితే గజ్జి, తామరలు అవుతాయని లంబాడిలు విశ్వసించి, దానినే ఇప్పటికి పాటిస్తుండటం విశేషం.

9. కొండరెడ్ల భాషాసాహిత్యాలు

శ్రీను కేతావత్

పరిశోధక విద్యార్థి, హైదరాబాదు విశ్వవిద్యాలయం

కొండరెడ్ల పరిచయం :

కొండరెడ్లు ఖమ్మం, ఉభయగోదావరి జిల్లాలలోని అటవీ ప్రాంతాల్లోని కొండలపైన అధికంగా నివస్తున్నారు కావున వీరికి 'కొండరెడ్లు' అనే పేరు వచ్చింది. వీరిని హిల్ రెడ్లు అని, రాచరేడ్లు అని, పాండవరెడ్లు అని కూడా వ్యవహరిస్తారు.

కొండరెడ్ల రూపం – ప్రత్యేకత

కొండరెడ్లు చామనఛాయ రూపంతో కొంచెం పొడవుగా ఉండి దృఢకాయులుగా ఉంటారు,పొడవైనజుట్టును కలిగి ముడివేయడం ఆనవాయితి,కొనతేలిన ముక్కు నాసికా రంధ్రాలు, చిరుగడ్డంతో ఉంటారు. మగవాళ్లు గోచిపాతలుగానీ, అడ్డపంచెలుగానీ ధరిస్తారు. కచ్చితంగా తలపాగా ధరిస్తారు.ఇటీవల యువతరం క్షవరం చేసుకోవటం, ప్యాంట్లు, చొక్కాలు, షర్ట్‌లు వేస్తూ నాగరికతకు అలవాటుపడుతున్నారు, స్త్రీలు చీర, లంగా, జాకెట్టు వేసుకుంటున్నారు. కానీ ప్రాచీన కాలంలో వీరు జాకెట్టు తొడిగేవారు కాదు. స్త్రీల కట్టుబొట్టు, అలంకరణలు సంప్రదాయికంగా ఉండేవి. వివిధమైన ఆభరణాలు ధరించి తమ ఉనికిని చాటుకునేవారు. వాటిల్లో నాసికారంధ్రాల మధ్య నోటిపై భాగాన నత్తులను ఆభరణంగా ధరించడం, మెడకు రకరకాల పూసల పేర్లు ధరించడం వీరి ప్రత్యేకత. స్త్రీలు తలకొప్పు వేసి పూలు పెడతారు.

నివాస స్థలం :

సాధారణంగా కొండరెడ్లు తూర్పుకనుమల మధ్య ప్రవహించే గోదావరినదికి ఇరువైపులా వున్న కొండలలో జీవిస్తున్నారు. వీరు కొండ ప్రాంతాల్లో నివసిస్తుండడం వల్ల వీరికి కొండరెడ్లనే పేరు వచ్చింది. వేలేరుపాడు మండలంలో టేకులపల్లి,

పేరంటాలపల్లి, కాకిఇసునూరు, కోయిదా, రేపాకగొమ్ము మొదలైన గ్రామాలలో కొండరెట్లు నివాసముంటున్నారు. ఇవి గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న గ్రామాలు. ఇక్కడ సమతల భూమిపై పంటలు పండిస్తారు. గోదావరి జలాలను పంటలకు వినియోగిస్తారు. ఈ ప్రాంతంలోని కొండరెడ్లు నాగలి వినియోగించి వ్యవసాయం చేస్తారు. కొంత నాగరిక సమాజానికి దగ్గరగా ఉండడం వల్ల ఈ మండలంలోని ప్రజలు నాగరిక జీవనానికి అలవాటు పడినట్లు కన్పిస్తున్నారు. వీరు గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి చేపలు తెచ్చి అమ్ముకుంటారు. చేపలవేట ఎవరికి వారు చేసుకుంటారు. ఇక్కడ సామూహిక విధానం కన్పించదు.

కూనవరం మండలంలోని కొండరెడ్ల గ్రామాలు:

గబ్బిలాలగొంది, తోటమామిడి, కుసుమామిడి, కొత్తకర్మాన్ కొండ, పాతకర్మాన్ కొండ, చింతగండి, ఎలుగుగొంది, కొప్పిరిమెట్ట, కిందిపాకల, టేకులొద్ది. ఈ గ్రామాలన్ని దట్టమైన అడవులమధ్య ఉన్నాయి. ఒక్కో గ్రామంలో 3–5 ఇండ్లు మరికొన్ని చోట్లా 10 ఇండ్లు ఒక్కోదగ్గర ఒక్కటే ఇల్లు కూడా వుంది ఆ గ్రామాలలో నివసించే కొండరెడ్లకి కావలసిన నిత్యావసరాలకి వారికి సమీప గ్రామంగా భావించే కుటూరు గ్రామంలో సోమవారం సంతలో కొనుక్కొని తిరిగి కొండెక్కుతారు.

అశ్వారావుపేట మండలంలోని కొండరెడ్డి గ్రామాలు కవాడిగుండ్ల, గోగులపుడి, కన్నాయిగూడెం, బందారిగూడెం, గాండ్ల గూడెం మొదలైన గ్రామాలలో కొండరెడ్లు ఉన్నారు.

చింతూరు మండలంలో కూడా అధిక సంఖ్యలోనే కొండరెడ్లు నివసిస్తున్నారు. చెదలవాడ, బాయిబొక్క, కొల్లేరుమద్ది, పల్లకావం, చిన్నటుగు, చింతలపాడు మొదలగు గ్రామాలలో కొండరెడ్లు నివసిస్తున్నారు.

వరరామచంద్రాపురం మండలంలో జిడిగుప్పా, ఇప్పూరు, ముత్యాలమ్మ గండి, దారపల్లి, కల్తినూరు, పోచవరం, కొండేపూడి, మారేడుపూడి, గండిగూడేం, రాయిగూడేం, కోటారుగుమ్ము, గ్రామాలలో కొండరెడ్లు జీవిస్తున్నారు. ఈ మండల ప్రజలు గోదావరి పరివాహక ప్రదేశంలో నివసిస్తున్నారు. వీరి నివాసం సమతల ప్రాంతం. కొండపైకి వెళ్లి పోడు వ్యవసాయం కూడా చేస్తారు. చేపల వేటకి వెళతారు.

ఈ మండలంలోని వారు ప్రాచీన, అర్వాచీన నాగరికతలను రెంటినీ పాటించడం కన్పిస్తుంది.

నివాస విధానం

కొండరెడ్లు చిన్న కుటుంబాలుగా నివసిస్తారు. భార్య, భర్త, పెండ్లికాని పిల్లలు ఈ కుటుంబంలో భాగస్వాములు. పిల్లలు ఎదిగిపెండ్లి కాగానే వేరు కుటుంబం పెట్టిస్తారు. కొండరెడ్లు తమ ఇంటిని కొండగడ్డితో, తాటాకులతో, కప్పుకుంటారు. ఇంటి నిర్మాణానికి కావలసిన కలపకు అడవిలో లభించే వెదురు బొంగులను ఉపయోగిస్తారు, గదుల నిర్మాణానికి, అలాగే గుమ్మాలకి వెదురు తడికెలు వాడతారు. కోడిసే బడితలను ఇంటి చుట్టూ నాలుగు వరుసలుగా వెదురు కంపగాని, కర్రతోగాని పాతిపెట్టి వెదురు బొంగులతోనే కడతారు. అది వారి ఇంటికి ప్రహరీలాగా ఉంటుంది. అదేవిధంగా పంటల కాలంలో కొండపోడు వద్ద ఎక్కడివారు అక్కడ మరో ఇల్లువేసుకుంటారు. వీటిని చేనుపాకలు అంటారు. ఈ పాకల్లోనే ఉండి పోడు పనులన్ని పూర్తి చేసుకుని తిరిగి ప్రధాన గ్రామంలోకి చేరుతారు, వీరికి ఒంటరిగా జీవించే లక్షణం కూడా ఉంది. కొండరెడ్ల ఆర్థిక జీవనం ఏదేమైనా సామాజిక సంబంధాలలో ఐక్యతతో పాటు మంచి పరిపాలనా దక్షత కూడా ఉంటుంది, ప్రతి గ్రామానికి సంబంధించి చిన్న పెద్ద, పెద్దపెద్ద ఉంటారు. వీరికి పాలనా సంబంధ వ్యవహారాల్లో సమప్రాధాన్యం ఉంటుంది. కుదురుల మధ్య పేచీలు వస్తే తీర్మానాలకు జాతి పెద్ద ఉంటాడు. వీరి నిర్ణయానికి అందరు సమ్మతించి మెలగడం ఈ జాతి వైశిష్ట్యం.

పోడు వ్యవసాయం :

కొండరెడ్లు చేసే పోడువ్యవసాయం ప్రత్యేకమైంది. సాధారణంగా వేసవికాలంలో (ఫిబ్రవరి–మార్చి) కొండపై ప్రాంతాల్లో దేవతలను ప్రతిష్ఠించి పూజలు చేసి పనులను ప్రారంభిస్తారు. చిన్నచిన్న తుప్పల్ని నరికి అడవికి నిప్పు పెడతారు. ఇప్పచెట్లు, జీలుగుచెట్లు నరకరు. వీటిని తల్లితో సమానంగా భావిస్తారు. అలా తొలకరి వర్షాలు రాగానే కొండ దేవరకి బలిగా కోడిని కోసి రక్తాన్ని భూమిపై చల్లి వ్యవసాయం ప్రారంభిస్తారు. దీన్నే భూమిపూజ అంటారు. పోడు భూములు కొండవాలులో ఉంటాయి. నాగలిగానీ, కర్రుగానీ వాడరు. అడవిలోని చెట్టు పుల్లలను కూసిగా

చివ్వుకుని వాటితో వ్యవసాయానికి ఎన్నుకున్న క్షేత్రంలో నేలపై పొడుస్తూ పోతుంటారు. ఎక్కడ నేలలో పుల్ల దిగుతుందో అక్కడ విత్తనం నాటుకుంటూ వెళతారు. ఇలా చేసే వ్యవసాయాన్నే పోడు వ్యవసాయం అంటారు. పోడులో ప్రధానంగా పండించే పంటలు కొండజొన్నలు, సజ్జలు, సామలు, కొర్రలు. కొండవాలు ప్రాంతాల్లో వరి పండిస్తారు. వీటితో పాటు నల్ల అలసందలు, కందులు, కులమకాయలు, దోసకాయలు, గోంగూర పండిస్తారు. కాని ఈ మధ్యన జనాభా పెరగటం, అటవీ చట్ట నిబంధనల కారణం చేత, పోడు విస్తీర్ణం తగ్గిపోవడం చేత చాలాచోట్ల ఒకే స్థలంలో ఎన్నో ఏళ్లుగా వ్యవసాయం చేయాల్సివస్తుంది. దానివల్ల దిగుబడి తగ్గి కొండరెడ్లకు 'పోడు' జీవనాధారం కల్పించలేకపోతుంది.

వేట:

కొండరెడ్లు వేటలో ఆరితేరిన వారుగా ప్రసిద్ధి. గ్రామంలోని ప్రతి ఒక్కరు కత్తిని, విల్లంబులను ధరించే జీవనం సాగిస్తారు. విల్లంబులు వీరి అస్తిత్వ చిహ్నం. వీళ్లది అనాదిగా వేటకు వెళ్లే సంప్రదాయం గల తెగ. అడవులలోనూ కొండల్లోనూ నివసిస్తున్న జంతువులను, పక్షులను వేటాడడం వీరికి జీవనోపాధి మాత్రమే కాదు వినోదం కూడా. గ్రామంలోని వారందరూ కూడుకుని సామూహికంగా వేటకు వెళ్లడం అలవాటు. వేటకు వెళ్లిన రోజున ఆ గ్రామానికి చెందిన వారంతా ఒక చోట కూడి సామూహిక విందు భోజనం చేసుకుంటారు. అందరూ కలసి మిగులు మాంసాన్ని ఊరిలోని కుటుంబాలు సమానంగా పంచుకోవటం ఆనవాయితి. ఈ పంపకం వేటకు మాత్రమే పరిమితం. కారణం నిల్వ ఉండకపోవటమే.

ఆహార పదార్థాలు :

కొండరెడ్ల తెగలోని అందరూ ఇంటి ముందు గానీ వెనకగానీ కొంత స్థలం సరిచేసుకుని తోట పెంచడం కచ్చితమైన అలవాటుగా కలిగి ఉంటారు. వెదురు తడికలతో ప్రహరీ కట్టుకుంటారు. ఆ స్థలంలో అరటి, మునగ, చీమమిరప, నిమ్మ, నారింజ, బత్తాయి, బొప్పాయి చెట్లను పెంచుతారు. అడవుల్లో నుండి దుంపల్ని సేకరిస్తారు. వీటిల్లో వేలిచందగడ్డల్ని శనగ్గడ్డల్ని తెచ్చి రెండురోజులు నీళ్లలో నానబెట్టి విషరహితం చేసుకుని తింటారు. వీటికి ఉప్పుకారం కలిపి ఏదయినా ఆకుకూరలో చేర్చి

తింటారు. ఇంటిదగ్గర మెంతికూర, దుగ్గలికూర, అక్కాచెల్లెళ్ల కూరవంటి ఆకుకూరలు వంటకి వినియోగిస్తారు. లేత వెదురుతో వంటచేసి కూరగా ఉపయోగిస్తారు. మామిడి టెంకల్ని నీళ్లలో నానబెట్టి తర్వాత పిండిగొట్టి రొట్టెలుగాను, జావగాను ఉపయోగిస్తారు. జిలుగు చెట్టు కల్లును కొన్నిసార్లు ఆహారంగా ఉపయోగిస్తారు. దాని బెరడును తీసి అంబలి కాచుకొంటారు. అది వారికెంతో బలాన్ని ఇస్తుందని విశ్వసిస్తారు. ఇలాంటి పౌష్టికాహారం వల్లే మైదాన ప్రాంతాల వారికంటే కొండరెడ్లు చాలా బలంగా ఉంటారు.

కొండరెడ్ల సంస్కృతి :

కొండరెడ్ల సంస్కృతిని నాలుగు అంశాలుగా దర్శించవచ్చు. పుట్టుక, పెండ్లి, మరణం సంబంధంగా నిర్వహించే ఆచార వ్యవహారాలు. కొండరెడ్లు నిర్వహించే పండుగలు ప్రధానమైనవి. ఇవి కాకుండా వీరి నమ్మకాలు సంస్కృతిలో భాగం అవుతాయి.

పుట్టుక :

కొండరెడ్ల ఇండ్లల్లో గర్భం ధరించినట్లు తెలియగానే ఆ స్త్రీని ప్రత్యేకంగా గుర్తిస్తారు. బలమైన పనులకు వీళ్లను వినియోగించకుండా తేలికైన పనులను చేసుకోనిస్తారు. పోషక ఆహారం అంటూ ప్రత్యేకంగా ఏమి లేకపోయినా నెలనెలా ఎదుగుదలను కాంక్షిస్తారు. నెలలు నిండగానే ఊరిలోని స్త్రీలలో అనుభవజ్ఞురాలైన స్త్రీని పిలిచి తోడు ఉండమని ప్రసవం చేస్తారు. సహజ ప్రసవం అయ్యేట్లు ప్రోత్సహిస్తారు. పుట్టిన బిడ్డకు వెంటనే స్నానం చేయించరు. పుట్టిన బిడ్డపై చల్లటి నీళ్లు చల్లుతారు. మరురోజు గోరువెచ్చని నీటితో స్నానం చేయిస్తారు. బిడ్డ పుట్టిన తర్వాత తల్లిని ప్రత్యేకమైన ఇంటిలో ఉంచుతారు. బాలింతలను ఇరవైఒక్కరోజులు ఉంచుతారు. కొందమంది మూడు నెలలు కూడా ఉంచుతారు. దీన్ని కీడుపాక అంటారు.

వైవాహిక సంబంధాలు :

సాధారణంగా కొండరెడ్లకి వావివరుసలకి సంబంధించిన విషయాలలో పట్టింపులు ఎక్కువ. ఇంటిపేర్లు ఆధారంగా వారి గత సంబంధాల ఆధారంగా పెళ్లిళ్లు చేసుకొంటారు. వీరు వావివరుసలను కచ్చితంగా పాటిస్తారు. ఎవరైనా వావివరుసలను

అతిక్రమిస్తే సహించరు. శిక్షలు జరిమానాలే కాదు గ్రామ బహిష్కరణ వంటివి కూడా ఉంటాయి. కొండరెడ్లలో వివాహపద్ధతి ప్రధానంగా మూడురకాలుగా ఉంటుంది. ఇవి 1. బలవంతపు వివాహం, 2. మొగనాలు వివాహం (పారిపోయి పెండ్లి చేసుకోవడం) 3. పెద్దలు కుదిర్చిన వివాహం. వీరికి బహుభార్య విధానం ఉంది. అంతేకాదు చనిపోయిన సోదరుడి భార్యను వివాహమాడటం, విడాకులు మొదలైనవి వీరి ఆచారాలు. అలాగే ఇల్లరికపు వివాహపు పద్ధతిని కూడా ఆదరిస్తున్నారు. పెండ్లిండ్లు సాదాసీదాగా జరిగినా వారి ఆర్థిక పరిస్థితిని బట్టి ఖర్చు ఉంటుంది. మేనరికం వివాహాలు జరుగుతాయి. మేనత్త మేనమామ పిల్లలు వరుస అవుతారు. మేనమామతోనూ, మేనకోడళ్ళతోనూ పెండ్లిండ్లు జరుగుతాయి. పెద్దలు కుదిర్చిన వాటిలో అబ్బాయి కుటుంబం అమ్మాయి కుటుంబానికి ఓలి కట్టాలి. కాని నేడు నాగరికసంస్కృతీ ప్రభావం వల్ల ఆడపిల్లల నుంచి కట్నాలు అడుగుతున్నారు. అది ఎంత అనేది వారి ఆర్థికస్తోమతను బట్టి ఉంటుంది.

మరణం :

చనిపోయిన వ్యక్తి బంధువులందరికి సమష్టిగా కబురుచేసి పిలుస్తారు, శవాన్ని మోసేటప్పుడు కాళ్ళను ముందువైపు ఉంచి తీసుకుపోతారు, ఎందుకంటే వారి జననం సూర్యుడు ఉదయించే విధంగా ఉంటుందని నమ్ముతారు. చనిపోయిన వ్యక్తికి శవముద్ద వేసిన తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తారు. వీరి ఒలుకుల్లు (శ్మశానం) గ్రామానికి తూర్పువైపునా ఉంటాయి. నలుగురు వ్యక్తులు నాల్గువైపులా కట్టేసి వున్న 4 కాంజుల సహాయంతో మోసుకుపోతారు. దీనిని కాంజులు పాడే అంటారు. పెండ్లయినవారు చనిపోతే దహనం చేస్తారు. పెండ్లికానివారు చనిపోతే ఖననం చేస్తారు. శవయాత్ర అనంతరం స్నానాలు చేస్తారు. ఆ తర్వాత 3వ రోజు దినం చేస్తారు. అంత్యసంస్కారాల అనంతరం అంటే పెద్దకర్మ తర్వాత విందు చేస్తారు.

పండుగలు

కొండరెడ్లు మామిడికాయకోత పండుగను అత్యంత ఉత్సాహంగా జరుపుకుంటారు. వీరికి ఈ పండుగ ఎంతో ముఖ్యమైంది, ఈ పండుగను వేరువేరు కుటుంబాల వాళ్ళు వేరు వేరు దేవతలను మామిడికాయ పండుగ సందర్భంలో పూజిస్తారు. పూజారి ఇంటిపేరుగల వారు ముత్యాలమ్మ తల్లిని, నిమ్మకాయల వాళ్ళు

పోతురాజును, విద్దెల వాళ్ళు పుట్టలమ్మ తల్లిని, వాల్లలవాళ్ళు దేవతమ్మను కొలుస్తారు. కొండరెడ్లు మామిడికాయ కోతపండుగ, భూదేవిపండుగా, రాజులపండుగ, టెంకపండుగలను పూర్వం వేరువేరుగా ప్రత్యేకమైన రోజుల్లో చేసుకునేవారు. కానీ యిప్పుడు ఈ పండుగల నన్నింటిని వరుసగా మూడురోజులు చేసుకుంటున్నారు. మామిడికాయ కోతపండుగను సోమవారంనాడు, దేవర్లపండుగను మంగళవారం నాడు, భూదేవిపండుగను బుధవారంనాడు జరుపుకుంటారు. దేవర్లపండుగనే పరమరాజుల పండుగ అని కూడా అంటారు. ఈ పండుగ రోజుల్లో కోళ్ళని, మేకల్ని, పందిని బలి ఇచ్చి కప్పెదుతారు. ఇలా వీరి జీవితంలోని ముఖ్యమైన ఘట్టాలకి సంబంధించిన పండుగలలో ప్రకృతిని తృప్తి పరచడానికి బలులు ఇస్తారు. బలి రక్తం విత్తనాలపై చల్లితే పంటలు బాగా పండుతాయని వారి నమ్మకం.

నృత్యం :

ఈ పండగ సందర్భాలలో దేవతలకు బలులు అర్పించే సమయాలలో డప్పు వాయిద్యాలతో శబ్దాలకు అనుగుణంగా (డోల్లు, ఔజాలతో) నృత్యాలు చేస్తారు. వీటిని మామిడికాయ నృత్యాలని వ్యవహరిస్తారు. ఈ సంప్రదాయ నృత్యాలకు అవసరమైన వాయిద్యాలను వీరే తయారు చేసుకుంటారు. స్త్రీలు అడవి గుచ్చకాయతో తయారుచేసిన గిల్లికాయ గజ్జెల నినాదంతో నృత్యంలో పాల్గొంటారు. ప్రారంభంలో వాయిద్యాలు నెమ్మదిగా వాయిస్తారు. వీటిలో సామూహిక నృత్యం, పురుషుల నృత్యం విశిష్టమైనవి, అర్ధరాత్రి వరకు ఆడిపాడి విందులు ముగించి మరలా ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మను, కొండ దేవతలను ఆహ్వానిస్తారు. ఈ ఆటపాటలు కొండరెడ్లకు ఎంతో ఉత్సాహాన్ని, ఉద్వేగాన్ని కలిగిస్తాయి.

కొండరెడ్లు నేటికి తమ అస్తిత్వాన్ని కాపాడుకునే దిశలో నాగరిక సమాజానికి దూరంగా జీవనం సాగిస్తున్నారు. స్థానికంగా వీరి మాతృభాష తెలుగుకాని ప్రామాణిక తెలుగుకి వీరి తెలుగుకి వైవిధ్యం ఎక్కువ. ఉదా: ఎర్కలు –పితలు, లేదువాడు– వారులేరా, ఇటే ఉన్నాద్– ఇటే ఉన్నారు, కిటుపెట్టె –అగ్గిపెట్ట రాగాలపెట్టే –రేడియో, దిడ్డు –వీధి, బర్కం –పరదా (కవర్) బుడ్డాడు –తాత, బుడ్డి– అవ్వ, ఎక్కిచుచవ –ఎక్కి చుశారా! పాట పాడ్తర్– పాటపాడతారు, నీగూడా పాడ్త– నీవు కూడా పాడ్తావు, కారోజుపని – కరువుపని (ఉపాధి హామీ పని), సూంపు –చూపెట్టు, బుట్టలు నైతం

–వెదురు బుట్టలు అల్లడం, బందుగులు –బంధువులు, ఆదరకూడి –అందరం, కలిసి, వైతన్నార్ –వచ్చి ఉన్నారు, సుసేన్నార్ – చూసిఉన్నారు, కంకులువైతం – జొన్నలు వేస్తాం, పెతర్లు –పితృదేవతలు, నాటుపెడ్తార్ –సారాయి కాస్తారు, మీయ్యూరు ఎక్కడ? –మీఊరు ఏది, ఆడంగుళ్ళు వస్తయి –ఆడవాళ్ళు వస్తారు, పోయిలపై –పొయ్యిలో వేయి, తింతం –తింటాము, సుక్కదిప్ప –సొరకాయ నీటి పాత్ర, గోట్టకాయలు –కల్లుచెట్టుకు కట్టె పాత్రలు, కంబాల –నిచ్చెన, పుట్టోసి –జననం/పుట్టుక, నాల్గుకాంజులు –పాడెకట్టెలు, పెద్దయా లేదా –పెద్దయ్యాలేరా, సుంక్కు –రకరకాల విత్తనాలు రక్తంలో కలిపి భూమిపై చల్లడం కోసం తయారుచేసేది. దీనినే పోలకట్ట అంటారు. మాడికాలూ –మామిడికాయలు, గూరేం –బొమ్మ. వైతుండు –కొడుతూఉండు. అదివాస్తం –అదివాస్తవము.

కొండరెడ్లు పేరుకి మాత్రమే కొండల్లో నివసించే ప్రాచీన తెగగా పరిశోధకులు గుర్తించారు కానీ నిజానికి వీరి జీవన శైలిని ప్రత్యేకంగా దర్శించి పరిశీలన చేస్తే తరతరాలుగా ఉన్న వీరి జీవన విధానంలో అనేకమైన ప్రాచీన అర్వాచీన నాగరిక చిహ్నాలు కన్పిస్తున్నాయి.

10. ఖమ్మం జిల్లా బంజారులు

డా. జి. వెంకట లాల్,
తెలుగు ఉపన్యాసకులు,
యస్.ఆర్.&బి.జి.యన్.ఆర్. ప్రభుత్వ కళాశాల, ఖమ్మం

స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ నిర్మాతలు భారత రాజ్యాంగంలో గిరిజనుల కొరకు కొన్ని ప్రత్యేకమైన నిబంధనలను రూపొందించారు. భారత రాజ్యాంగంలో షెడ్యూల్ తెగలకు నిర్దేశించబడిన రిజర్వేషను సౌకర్యం, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో నివశిస్తున్న బంజారా (సుగాలీ) లకు 1950 వ సంవత్సరం నుండి అమలులో ఉంటే, తెలంగాణాలోని బంజారులకు 1976 వ సంవత్సరం నుండి ఏర్పాటులోకి వచ్చింది. అప్పటినుండి ఖమ్మం జిల్లాలో బంజారులకు ప్రభుత్వం అమలుచేసిన 'సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ'' ద్వారా ఎంతో మేలు చేకూరుతుంది. గిరిజనుల అభివృద్ధికి, ప్రగతికి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు జరుపుతొంది. ఐనప్పటికీ ఖమ్మం జిల్లాలోని బంజారా గిరిజన తెగ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎంతో వెనుకబడి వుంది. ఖమ్మం జిల్లాలోని షెడ్యూల్ తెగలలో బంజారా (లంబాడీ) పెద్ద తెగ.

బంజారుల జీవన విధానం విలక్షణమైంది. వైవిధ్య భరితమైంది. వీరి జీవన విధానం ఒక భిన్నమైన వేషధారణను, ఆహారపు అలవాట్లను, గృహ నిర్మాణాలను, రాజకీయ సామాజిక వ్యవస్థను కలిగి ఉంది. వీరు ప్రత్యేకమైన భాషా సాంస్కృతిక విధానాన్ని కలిగి, మిగతా సమాజంతో తక్కువ సంబంధాన్ని కలిగి వున్నారు.

జీవన విధానం :

బంజారులు బ్రిటిషు పరిపాలనా కాలంలో సరుకుల రవాణాను ప్రధాన వృత్తిగా చేపట్టిన చారిత్రక ఆధారాలున్నాయి. వీరు ఆహార ధాన్యాలు, ఉప్పు, సుగంధ ద్రవ్యాలు చేరవేస్తూ మంచి రవాణాదారులుగా ఖ్యాతి గడించారు. రవాణా కొరకు

ఎద్లను, గుర్రాలను, ఒంటెలను ఉపయోగించేవారు. భారతదేశంలో బ్రిటిషువారు ఎన్నో రాజ్యాలను తమ హస్తగతం చేసుకొని పాలించటం జరిగింది. రానురాను రవాణా సౌకర్యాలు కల్పించి వాణిజ్యాన్ని అభివృద్ధి పరిచే ఉద్దేశంతో బ్రిటిషువారు రోడ్లు, రైలు సౌకర్యాలు ఏర్పాటుచేసుకున్నారు. తద్వారా బంజారుల రవాణా వ్యవస్థ మరుగున పడి వృత్తిని కోల్పోయారు. అప్పటికే భారతదేశమంతటా వ్యాపించి ఉన్న బంజారులు ఎక్కడికక్కడే వివిధ రవాణాలావాదేవీలను పరిష్కరించుకొని గుంపులు గుంపులుగా ఎవరికి అనుకూల ప్రదేశాల్లో వారు స్థిరనివాసాలు ఏర్పరచుకొని, వారి వారి వృత్తులను ఏర్పరుచుకున్నారు. అలాగే ఖమ్మం జిల్లాలోని బంజారులు వ్యవసాయం, పశుపోషణను ప్రధాన వృత్తులుగా చేపట్టి స్థిరపడ్డారు. తమ పశువులకు అనుకూలంగా ఉండే ప్రదేశాలలో, తమ పశువులకు ఎల్లవేళలా గ్రాసాన్ని అందించే అడవి ప్రాంతాలలో, కొండవాలు ప్రాంతాలలో, అరణ్య మైదాన ప్రాంతాలలో, నదీ తీరప్రాంతాలలో గుంపులు, గుంపులుగా నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ గుంపునే 'తండా' అంటారు. క్రమంగా వ్యవసాయం నేర్చుకున్నారు. ఇదే ఇప్పుడు వీరి ప్రధాన వృత్తిగా మారింది.

తండా :

'తండా' బంజారుల నివాసప్రాంతం. 'తండా' శబ్దాన్ని అక్బర్ బాదుషా ఆవిష్కరించినట్లు చరిత్ర చెబుతుంది. 16వ శతాబ్దానికి ముందు బనారస్ సమీపంలో గుంపులుగా ఏర్పడిన బంజారా నివాసాలను అక్బర్ 'తండా' అని పేరు పెట్టాడట. బంజారులు అప్పట్లో సంచార జీవనాన్ని కొనసాగిస్తుండేవారు. 16వ శతాబ్దంలో కత్వాలు, జులహాలు ఆ ప్రాంతంలో స్థిరనివాసాలు ఏర్పరుచుకున్నారు. 18వ శతాబ్దంలో బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీ ఏజెంట్లు వాణిజ్య కేంద్రాలను స్థాపించారు. ప్రస్తుతం ఆ తండా ఒక ప్రత్యేక వాణిజ్యకేంద్రంగా ఉంది. బంజారుల నివాసాలకు అక్బరు ఆనాడు పెట్టిన పేరే నేటికీ పిలువబడుతుంది.

బంజారుల నివాస ప్రదేశమైన 'తండా' ఒక చిన్నగ్రామాన్ని పోలి వుంటుంది. సాధారణంగా బంజారులు అటవీ ప్రాంతాల్లో, మిగిలిన కులాలకు దూరంగా, బంజరు భూములలో నివాసాలు ఏర్పాటుచేసుకుంటారు. వీరికి ఇండ్లు కట్టుకోవటానికి భూపరిమితి అంతగా ఉండదు. వీరు తమకనుకూలమైన భూమిని చదును చేసుకొని

దీర్ఘచతురస్రాకారంగా గుడిసెలను, పూరిళ్ళను నిర్మించుకుంటారు. మట్టిని, రాళ్ళను ఇళ్ళ నిర్మాణానికి వాడతారు. ఇళ్ళకు ఎడమవైపు కాని, ఎదురుగా కాని పశువుల కొట్టాలను నిర్మించుకుంటారు. ఇంటిపై కప్పును పూరి లేదా వరిగడ్డి లేదా జొన్నచొప్ప లేదా సజ్జ చొప్ప లేదా అడవిలోని మొదుగాకులతో కప్పుతారు. ఇళ్ళకు ఎదురుగా లేదా పక్కన గుంజలతో నిర్మించిన పందిరి ఉండి, రెండు లేదా మూడు వైపులా మట్టితో కట్టిన గోడలు కలిగిన కొట్టాలు పశువుల కొరకు నిర్మించుకుంటారు.

తండాలో రాజకీయ వ్యవస్థ:

ఖమ్మం జిల్లాలో నివసించే బంజారులకు ప్రత్యేకమైన సామాజిక కట్టుబాట్లు ఉంటాయి. బంజారులు తండా న్యాయవ్యవస్థకు, స్వరాజ్యపాలనకు కట్టుబడి వుంటారు. వివాదాలను పరిష్కరించే న్యాయవ్యవస్థ తండా పంచాయితీ ద్వారానే కొనసాగుతుంది. తండా రాజకీయ వ్యవస్థలో 'నాయక్ (నాయకుడు), కారోభారి (సలహాదారుడు, కార్యదర్శి), డప్టియా (సమాచారం, సందేశాన్ని చేరవేసేవాడు)' మొదలైనవారు ఉంటారు. బంజారులు నిర్వహించే పంచాయితిని 'నసాబ్' అని అంటారు. 'నసాబ్' అంటే సమస్యా పరిష్కారానికి జరిపే సామూహిక పంచాయితీ అని అర్థం. ఈ 'నసాబ్'కి తండా 'నాయక్' అధ్యక్షత వహించి 'కారోభారి' సలహా మేరకు కొనసాగిస్తారు. వాద ప్రతివాదనలు విన్నతర్వాత తండా ప్రజల అభిప్రాయాల మేరకు 'నాయక్' ఒక తీర్మానాన్ని, తీర్పును ప్రకటిస్తాడు. 'నాయక్' పంచాయితీలో తీసుకున్న నిర్ణయమే శిరోధార్యం. అటువంటి నిర్ణయాన్ని వాద ప్రదివాదులు తప్పక పాటించవలసిందే. లేని పక్షంలో కుల బహిష్కరణకు లేదా గ్రామ బహిష్కరణకు గురి కావలసి వస్తుంది. బంజారులు భారత న్యాయవ్యవస్థలో భాగమైనప్పటికీ చట్టపరమైన తీర్పుల కంటే కుల పంచాయతీలలో తీసుకున్న నిర్ణయాలకే ప్రాధాన్యత ఇస్తారు. ఒకవేళ తండా పంచాయితీ తీర్మానం తమకు ససేమీరా వద్దనుకున్నప్పుడు మాత్రమే భారత ప్రభుత్వ న్యాయవ్యవస్థలను ఆశ్రయిస్తారు.

పంచాయితీ నిర్వహించే పద్ధతి:

ఖమ్మం జిల్లా బంజారులు తండాలో నిర్వహించే పంచాయితీ పద్ధతి ఎంతో విలక్షణంగా ఉంటుంది. అర్జీదారు తనకు జరిగిన అన్యాయాన్ని తండా నాయక్,

కారోభారీలకు విన్నవించిన తర్వాత 'డప్టియా' ద్వారా తండావాసులకు సందేశాన్ని పంపిస్తారు. సందేశకర్త అయిన 'డప్టియా' ఒక విలక్షణమైన రీతిలో డప్పును వాయిస్తూ, తండా వాసులకు నాయకుడి సందేశాన్ని తెలియజేస్తాడు. 'నాయక్' నిర్దేశించిన సమయంలో ఒకచోట అందరూ సమావేశమై పంచాయితీ నిర్వహిస్తారు. పంచాయితీ మధ్యలో వాద ప్రతివాదనల సందర్భంలో 'సాకీసాత్రాలు' (పొడుపుకథలు, సామెతలు) చెప్తూ లోకం పోకడ గురించి తెలియజేస్తూ సమస్యకు పరిష్కారాన్ని కనుగొనే ప్రయత్నం చేస్తారు. దీనిని బట్టి బంజారులకు తండా పంచాయితీ ఎంత ముఖ్యమైన న్యాయవ్యవస్థగా తండాల్లో ఉందో తెలుస్తుంది. బంజారులు ఇప్పటికీ తమ జాతి పంచాయితీ వ్యవస్థనే ఎక్కువగా విశ్వసిస్తారు. గోర్‌కుల పంచాయితీ వ్యవస్థ ద్వారానే తమ సామాజిక, వివాహ సంబంధ వివాదాలను పరిష్కరించుకుంటున్నారు.

పంచాయితీకి సమావేశమైన తండావాసులు, నాయక్, కారోభారీలు గుండ్రంగా కూర్చుంటారు. పంచాయితీ నిర్వహించి వాద ప్రతివాదనలు విన్న తర్వాత అందరూ చర్చించి పరిష్కారాన్ని నిర్ణయిస్తారు. పంచాయితీ ముగిసిన తర్వాత వాద ప్రతివాదుల చేతులు కలుపుతారు. తర్వాత అందరూ సారా తాగి వెళ్లిపోతారు. బంజారుల న్యాయపంచాయితీ సాధారణంగా తండా 'నాయక్' ఇంటి ఆవరణలో కానీ ఏదైనా సమావేశానుకూల ప్రదేశంలో కాని నిర్వహిస్తారు. ఒకవేళ పంచాయితీ రెండు లేదా మూడు తండాల మధ్యలో జరిగినట్లయితే ఆయా తండాల పొలిమేరలలో ఎక్కడో ఒకచోట అనుకూల ప్రదేశంలో నిర్వహిస్తారు. అలాంటి పరిస్థితుల్లో ఇతర తండాల 'నాయక్', 'కారోభారీ'ల సమన్వయంతో పంచాయితీ నిర్వహించబడుతుంది. పంచాయితీ నిర్వహణకయ్యే ఖర్చులు వాదప్రతివాదుల నుండి వసూలు చేయటం జరుగుతుంది. పంచాయితీ పూర్తయిన తర్వాత పంచాయితీకి వచ్చిన తమ తోటి గిరిజనులకు, అతిథులకు సారా పంపకం చేస్తారు. పంపకం జరిగిన తర్వాత 'నాయక్' అందరి వైపు సారాను చూపిస్తూ 'దారూ లోర్ నాయక్' అని అనుమతిస్తాడు. తర్వాత అక్కడ వున్న వారందరూ 'దారూ లోర్ నాయక్' అని ప్రతివాదం చేస్తూ అందరూ సారా సేవిస్తారు. ఈ విధంగా ఖమ్మం జిల్లా బంజారుల పంచాయితీ వ్యవస్థ కొనసాగుతుంది. ఒకవేళ పోలీస్‌స్టేషన్లలో కేసు నమోదు అయినా, చివరికి ఆ కేసు కుల పంచాయితీతోనే ముగుస్తుంది.

భాష :

బంజారులకు ప్రత్యేకమైన భాష ఉంది. 'గోర్‌బొలి', 'గ్వారేర్ వాత్'గా ఈ భాషను పేర్కొంటారు. తెలుగు భాష శాస్త్రవేత్తలు బంజార భాషను ఇండో ఆర్యన్ భాషలో చేర్చారు. కానీ ఈ భాషకు లిపి మాత్రం లేదు. ఖమ్మం జిల్లా కొత్తగూడెం నివాసి 'భూక్యా బాలాజీదాసు రాథోడ్' బంజార భాషకు లిపి కనిపెట్టి, అనేక గేయాలు, రచనలు చేసినప్పటికీ, ప్రభుత్వ కృషి లేనందున అది మరుగున పడింది. ప్రస్తుతం వీరి భాషను తెలుగు లిపిలోనే రాస్తున్నారు. వీరి లిపి ఆమోదం పొందితే ఆచార వ్యవహారాలు అంతరించిపోకుండా చూడవచ్చు. నేను ఈ వ్యాసాన్ని తెలుగు లిపిలో రాసే అవకాశం ఉండేది కాదు.

వస్త్రధారణ :

ఖమ్మం జిల్లా బంజారుల వస్త్రధారణ ఒక ప్రత్యేకతను కలిగి వుంది. వీరి పిల్లలు, యువకులు, వయోవృద్ధుల వేషధారణలో అంతగా వ్యత్యాసం లేకున్ననూ స్త్రీలు మాత్రం ఒక ప్రత్యేకమైన వస్త్రధారణ కలిగి వుంటారు. బంజారుల్లో వివిధ వయస్సుల్లో ఉన్న వారి వేషధారణ ఎలా ఉంటుందో పరిశీలించినట్లయితే వారి జీవన సరళిలోని విశిష్టత తెలుస్తుంది.

బంజారా స్త్రీలు 'కాళి' (రవిక) ను ఛాతీ భాగానికి, 'ఫేట్యా (లంగా) ను నడుముకు, 'టుక్రి', 'ఘూంగ్టో' (ముసుగు, పైటా వంటి తలనూ వంటినీ కప్పుకునే దుపట్టా) ధరిస్తారు. కాళి, ఫేట్యా, ఘూంగ్టోలు కొన్ని రంగుల గుడ్డముక్కలను ముఖ్యంగా ఎరుపు, నీలం, పసుపు, నలుపు, ఆకుపచ్చ రంగుల్లో సమ్మిళితం చేసి కుడ్తారు. స్త్రీల వస్త్రాలపై చతురస్రాకార (పలుకల), వృత్తాకార (గుండ్రంగా) అద్దపు ముక్కలను అలంకరణ కొరకు వాడుతారు. ఇట్టి వస్త్రధారణ రంగుల మయంగా ఉండి చూపరులను ఆకట్టుకొనే విధంగా ఉంటుంది.

బంజారా స్త్రీలు తమ వస్త్రాలు వారే కుట్టుకుంటారు. బంజారా స్త్రీలు కుట్టుపనిలో బాగా ఆరితేరినవారు. తమ కాళీ ఫేట్యాలపై ఒకప్రత్యేకమైన అల్లికను కుడతారు. రంగు రంగుల దారాలను, రంగురంగుల ఖాదీ గుడ్డలను తమ వస్త్రాల అలంకరణకు ఉపయోగిస్తారు. అద్దాలను, రూపాయి బిళ్లలను అక్కడక్కడా అమర్చి అందంగా

కుడతారు. ప్రస్తుత కాలంలో, సమాజంలో బంజారా కుట్టు చాలా ప్రాచుర్యాన్ని పొందుతుంది. బంజారుల వేషధారణను పోలిన ఫ్యాన్సీ డ్రస్సులు, గీతాంజలి డ్రస్సులు ఆధునిక సమాజాన్ని ఆకర్షిస్తున్నాయి.

బంజారా పురుషులు అతి సాధారణ ధోవతి, చొక్కా ధరిస్తారు. ఒక ఎర్రని పొడవైన దుపట్టాను తలపై రుమాలుగా ధరిస్తారు. ఒక సామాన్య బంజారా వయోజనుడి ధోవతి, చొక్కా ఎర్రమట్టిలో పులిమిన రంగులో ఉంటాయి. కొంతమంది తెలుపు లేదా నీలిరంగుని వాడతారు. రుమాలు మాత్రం తెలుపు, ముదురు ఎరుపు రంగు లేదా ఆకుపచ్చ రంగులో ఉండి తల భాగాన్ని పూర్తిగా కప్పే విధంగా చుట్టుకుంటారు. సాధారణ బంజారా పురుషులు తలవెనుక భాగంలో మెడ వరకు వేలాడేటట్లు పాంక్టో (ఛుంగా) (తోక) చుట్టుకుంటారు. తండా నాయకుడు మాత్రం తలనుండి వీపు మీదుగా నడుము భాగం వరకు వేలాడేటట్లు పాంక్టో చుట్టుకుంటాడు. ఈ పాంక్టోను పట్టి నాయకుడని గుర్తిస్తారు. కొన్ని ప్రాంతాలలో బంజారులు తలరుమాలు మాత్రమే చుట్టుకుంటారు. ఛుంగాలుండవు. తండా నాయకుడికి మాత్రమే ఛుంగా ఉంటుంది. బంజారుల వేషధారణ భారతదేశంలోని రాజాస్థానీ వేషధారణను పోలి ఉంటుంది. బంజారులు రాజస్థాన్ నుండి వలస వచ్చి దేశంలోని నలుమూలలా వ్యాపించారనటానికి ఇది ఒక ఆధారంగా పేర్కొనవచ్చును.

అలంకరణలు :

ఖమ్మం జిల్లా బంజారా స్త్రీలు తలపై నడినెత్తిన పాపిట తీసి తలను దువ్వుకొని వెండితో చేయబడిన వివిధ ఆభరణాలను తలలో అలంకరించుకుంటారు. వీటినే టోప్లిలు (బుట్టలు) అంటారు. టోప్లిలను వెండితో చేయబడిన ప్రత్యేకమైన రెండు బుట్టలవంటి ఆభరణాలను తల వెంట్రుకలతోపాటు అల్లుకొని రెండు చెవులకు కొంత పై భాగంలో అలంకరించుకుంటారు. కన్యలు ధరించే టోప్లీలకు ఘుగ్రి (గజ్జెలు) ఉండదు. ఘుగ్రి కలిగిన టోప్లిలు ముత్తయిదువలు మాత్రమే ధరిస్తారు. స్త్రీలు మెడలో 'హాంస్లీ' లేదా 'హాంస్లో' అనే ఒక వెండి గుండ్రని కంఠ కడియాన్ని ఆభరణంగా ధరిస్తారు. ఈ ఆభరణం ఒక గుండ్రని కడ్డీకి వివిధ వెండి ఝుంకాలు తగిలించబడి హారంలా ఉంటుంది.'హాంస్లి' సాధారణంగా చిన్నగా ఉండి పెళ్ళికాని యువతులు ధరిస్తారు. 'హాంస్లో' ముత్తైదువలు ధరిస్తారు. స్త్రీలు ముంజేతులకూ, భుజాల వరకు

'బల్యా'లు (ఏనుగు కొమ్ములతో చేయబడిన మందపు తెల్లని గాజులు) ధరిస్తారు. కన్యలు ముంజేతులకు మాత్రమే ధరిస్తారు. స్త్రీలు చేతులకు ఉంగరాలు సాధారణంగా ధరిస్తారు. పెళ్ళయిన స్త్రీలు కాళ్ళకు కస్ (మెట్టెలు), 'వాంక్టీ' (కాళ్ళ పట్టీలు) లు ధరిస్తారు. పెళ్లికాని కన్యలు కాళ్లకు 'ఘుగ్రా' (మువ్వలు) హారాలు కుట్టుకుంటారు. చెవులకు కన్యా (కమ్మలు), ముక్కుకు 'ఫూలీ', 'భూర్యా' (ముక్కుపోగు) ను ధరిస్తారు. బంజారా పురుషులు కాళ్ళకు, చేతులకు 'కోల్డా' (కడియం), చెవులకు, ముక్కుకు నత్తి (పోగు) ని అలంకరించుకుంటారు.

ప్రస్తుత సమాజంలో ఆధునిక, నాగరిక వేషధారణకు ఆకర్షితులై ఈ వేషధారణను విడనాడుతున్నారు. ఒకప్పుడు ఇవి సులభంగా లభించేవి. ప్రస్తుత సమాజంలో ఇవి చాలా ఖరీదు. తయారు చేయడానికి సంవత్సర కాలం పట్టడం వల్ల వీటిని విడనాడుతున్నారు. పట్టణ, నాగరికతకు ఆకర్షితులై తమ వేషభాషలను మార్చుకుంటున్నారు. ఇంకో తరం మారితే ఈ వేషధారణ పూర్తిగా అంతరించిపోతుంది.

ఆహారపు అలవాట్లు :

ఖమ్మం జిల్లా బంజారులు అధికంగా మాంసాహారులే. మాంసాహారంతో పాటు ఆకుకూరలు (భాజీ) ఎక్కువగా తింటారు. వీరి మాంసాహార, శాకాహార వంటకాలను కింది విధంగా పేర్కొనవచ్చు.

మాంసాహారం:

బంజారులు సాధారణంగా మాంసప్రియులు. వీరి మాంసాహార వంటకాలలో 'బోటిర్ లోంగాణ్' (మాంసం కూర), సళోయి (రక్తంతో మాంసాన్ని కలిపి వండిన నల్ల), ఇందులో గుడ్లా హడ్కా (కీలు, మూలిక, బొమిక) ముఖ్యమైనవి. మాంసంతోపాటు జొన్నరొట్టె తప్పనిసరి తీసుకుంటారు. అందుకే 'బాటి, బోటి, సళోయి' అనే నానుడి ఉంది. వీరు కోడి, మేక, గొర్రె, చేపలు మాత్రమే తింటారు. కొన్ని పాడా (కులాలలో) లో పందిమాంసం కూడా తింటారు.

శాకాహారం :

బంజారులు ముఖ్యంగా 'జారేర్' (జొన్నల), 'బాజ్రీర్' (సజ్జల) 'బాటీ' (రొట్టె) లను ఇష్టంగా తింటారు. వీరు అత్యధికంగా సాగునీరు అందని మారుమూల అటవీ

ప్రాంతాలలో, మైదాన ప్రాంతాలలో నివసించటం వల్ల సాధారణంగా మెట్టపంటలైన జొన్నలు, సజ్జలు, రాగులు పండుతాయి. కావున వీరు జొన్న లేదా సజ్జ రొట్టెలను తమ దైనందిన ఆహార పదార్థంగా అలవాటు చేసుకుని ఉంటారు. బంజారులకు అత్యంత ఇష్టమైన మరో వంటకం 'జారేర్ భల్డా' (జొన్న గటక), 'బాజ్రీర్ ఖీడో' (సజ్జ అన్నం). సజ్జలను కడిగి దంచి వండిన వంటకం, జొన్నలను ఘట్టీ (ఇసురురాయి) లో బొరుసుగా పట్టి వండిన వంటకం అంటే ఎంతో ఇష్టం. అలాగే 'రాయ్' (రాగుల) 'రాబ్డీ' (జావ), వరి బియ్యపు అన్నం, బియ్యం పాలు బెల్లం కలిపి వండిన 'లాప్సి' లేదా 'ఖీర్' (పాయసం) వీరికి పండుగలలో పబ్బాలలో చేసుకొనే ప్రత్యేకమైన వంటకం. ప్రస్తుత సమాజంలో బిర్యాని, పలావు లాంటివి. వివిధ రకాల ఆకుకూరలు (భాజీ) వీరి వంటకాలలో సాధారణంగా ఉంటాయి. 'దాళ్' (పప్పు), ఖోడీ (చట్నీ), ఆచార్ (పచ్చడి), లోంగాణ్ (కూరగాయల కూరలు) వీరి ఆహారంలో భాగమే. వీరు పశుపోషకులు కావున సాధారణంగా మజ్జిగ, పెరుగు, నెయ్యి మొదలైనవి కూడా వీరి ఆహారంలో భాగంగా ఉంటాయి.

మద్యపానం :

బంజారులు మద్యాన్ని అధిక శాతం మంది స్వీకరిస్తారు. వీరు తాము జరుపుకునే ప్రతి పండుగ సందర్భంలోనూ ప్రత్యేకమైన సందర్భాలలోనూ, కుల పంచాయితీలలోనూ, చావు పుట్టుకల సందర్భంగాను సారా సేవిస్తారు. వీరు సారాను తమ సంస్కృతిలో ఒకభాగంగా భావిస్తారు. వివిధ రాకల మద్యపానాలను తామే స్వయంగా కాచి ప్రత్యేక సందర్భాలలో వాడుకుంటారు. 'మోబ్‌డార్ దారు' (విప్పపూల సారా), 'గోళేర్ దారూ' (బెల్లం సారా), 'సీంది' (కల్లు)ను సేవిస్తారు. నేటి సమాజంలో వీటితో పాటూ బ్రాంది, విస్కి, రమ్ములు సేవిస్తున్నారు.

ధూమపానం :

బంజారులు తమ జీవనంలో ధూమపానాన్ని కూడా ఒక అలవాటుగా వాడుతున్నారు. చుట్ట (పొగాకు చుట్ట), బీడిలను తాగుతారు. వీరే చుట్టలకు పొగాకుతోనే ప్రత్యేకంగా పొరచుట్టగా, ధాంక్డార్ పాన్ (మోదుకు ఆకుల) తో చుట్టలు అప్పటికప్పుడే చుట్టుకొని వెలిగిస్తారు. నేటి సమాజంలో ఆధునిక చుట్టలు, బీడిలు, సిగరెట్‌లు కూడా వాడుతున్నారు.

ఇంతటి గొప్పజీవన విధానాన్ని, రాజకీయ వ్యవస్థనూ, వేష భాషలనూ, ఆచార వ్యవహారాలను కలిగి వున్న బంజారా వ్యవస్థ, ఆధునిక సమాజంలో, నాగరికతకులోనై తమ అలవాట్లనూ, వేషభాషలనూ, ఆచార వ్యవహారాలనూ, జీవన విధానాన్ని, సంస్కృతి– సంప్రదాయాలను విడనాడి, వీరు బంజారులేనా అనే అనుమానం వచ్చే విధంగా సమాజంలో కలిసిపోయారు. తమకున్న ప్రత్యేక ప్రతిపత్తి కనుమరుగైపోయింది. బంజారా వస్త్రాలు పోయి, చీరెసారెలొచ్చాయి, లంగా ఓణీలు పోయి పంజాబీ డ్రస్సులొచ్చాయి. పంచే దోవతిలు పోయి పయింటు చొక్కాలొచ్చాయి. బంజార అలంకరణలు పోయి నెక్‌లేసులు, హారాలు, రంగురంగు గాజులు వచ్చాయి. కాళ్ళకు గజ్జెలు (మువ్వలు) పోయి గజ్జల పట్టిలొచ్చాయి. ఇప్పటికైనా వీరు తమ సంస్కృతిని – ఆచార వ్యవహారాలను కాపాడుకోవాలని ఆశిద్దాం. అయితే ఖమ్మం జిల్లా ప్రసాదించిన బంజారా కవుల గురించి తెలుసుకుందాం.

శ్రీ భుక్యా బాలాజి దాస్ రాథోడ్ :

శ్రీ భుక్యా బాలాజి దాస్ రాథోడ్ గారు ఖమ్మం జిల్లా కొత్తగూడెం నివాసి. వీరి తండ్రి భూక్యా రాంజీ రాథోడ్, తల్లి హంస్లీబాయి. వీరి గోత్రం రాత్‌ళా. వీరు బంజారా జాతి ఆదికవిగా వన్నెకెక్కారు. వీరు 'బంజారా లిపి'ని 'దేవనాగరి లిపి' ఆధారంగా తయారు చేసి 1వ, 2వ తరగతుల పుస్తకాలను ముద్రించి ప్రచారం చేశారు. ఆ లిపిని ప్రభుత్వ అభివృద్ధి చేసి వుంటే ఇప్పటికి బంజారా లిపి దేశమంతటా విస్తరించి, భాషాపరంగా ఎంతో అభివృద్ధిని సాధించేది.

బంజారా భాషలో కవిత్వాన్ని, పాటలను అప్పటికి అప్పుడే సందర్భానుసారంగా అల్లగలిగిన ప్రజాకవి, జానపద గేయకవిగా పేరు పొందారు. బంజారా వంశ చరిత్రను మొట్టమొదట రాసి ప్రచారం చేసిన ఆదికవి. వీరు సుమారు 40 పైన పుస్తకాలు రాసారట. కొన్ని తెలుగులోను, కొన్ని బంజారా భాషలోను, తెలుగు లిపి ఆధారంగా ముద్రించి ప్రచారం చేసారు. అందులో ముఖ్యమైనవి 1) బంజారా వంశావళి చరిత్ర 2) బంజారా వంశావళి బుర్రకథ 3) రాథామోల అనుడ్రామా 4) బాలాజీ భజనమాల 5) వేదాంత బాలబోధిని 6) త్రిభాషా బాలాజీ భజనమాల 7) బంజారా సుజ్ఞాన దీపిక 8) పృథ్వీరాజ్ చౌహాన్ బుర్రకథ 9) ప్రతి రోజూ బుర్ర కథ 10) బంజారా కీర్తనలు 11) బాలాజీ బోధనామృతం 12) బంజారా బోధనామృతం, 13) బంజారాల

వీరచరిత్ర 14) నవీన బంజారా సాంఘిక సంకీర్తనలు 15) బంజారా బాలశిక్ష మొదటి, రెండవ వాచకాలు 16) బంజారా సొగలి ప్రచార్ 17) బంజారా బాలాజి పద్య రత్నావళి 18) దోబణ్ లక్ష్మణ బుర్రకథ 19) శల్వరాజ్ శనివాళేర్ బుర్రకథ 20) సూరజ్ రాథోడ్ సుందర చౌహాన్ బుర్రకథ మొదలైనవి ఎన్నో రాసి బంజారాల అభివృద్ధికి పాడుపడినారు.

ఝూంజణోత్ మూడ్ కృష్ణనాయక్ చవాణ్ :

"బంజారా గీతామృత్" అనే బంజారా భాషలో భగవద్గీత రచించిన యం.కృష్ణనాయక్ చవాణ్‌గారు 05-9-1953 న మర్రిగూడెం గ్రామం, గార్ల మండలం, ఖమ్మంజిల్లాలో జన్మించిన బంజారా సాహితీకారుడు, తల్లిదండ్రులు కీ.శే. మూడ్ ఠాకూర్, లక్ష్మి. వృత్తిరీత్యా డేటా బేస్ మేనేజరు, రైల్వే రిజర్వేషన్ కార్యాలయం, సికింద్రాబాద్‌లో ఉద్యోగం చేస్తూ, తెలుగు లిపితో బంజారా భాషలో భగవద్గీతను "బంజారా గీతామృత్" (2006) అనే గ్రంథాన్ని రాసి బంజారుల కృష్ణ భగవానుడుగా ఖ్యాతి కెక్కారు. హిందువుల ముఖ్యగ్రంథం భగవద్గీతను శ్రీకృష్ణభగవానుడు చెబితే, బంజారా భాషలో ఈ కృష్ణనాయక్ (భగవానుడు) చెప్పి బంజారా కృష్ణ భగవానుడుగా పెద్దల మెప్పు పొందాడు. సుమారు 18 నెలలు కష్టపడి ఈ 'బంజారా గీతామృత్' ను రూపొందించారు. ఇది బంజారుల ఆదికావ్యంగా పెద్దలు పేర్కొన్నారు. 'దేశీయ ఛందస్సులో 'బంజారా గీతామృత్' అవతరించటం బంజారాల అదృష్టం' అని 'బంజారా గీతామృత్' అనే కావ్యం ముందుమాటలో డా. మసన చెన్నప్పగారు తెలియజేశారు. అదేవిధంగా దీనికి రచయిత ఇంటి పేరుతో 'మూడ్‌ఛందస్సు'గా పేర్కొన్నారు. అంతటి పేరుపొందిన కృష్ణనాయక్ గారు ఖమ్మం జిల్లా ప్రసాదించిన బంజారా సాహిత్యకారుడు.

వీరే కాక వర్ధమాన బంజారా రచయితలు శ్రీ భూక్యా హరిదాసు రాథోడ్, శ్రీ ధరావత్ ప్రేమ్‌చంద్ నాయక్, వాంకుడోతు రాంబు నాయక్, డా. జి.వెంకట్‌లాల్ మొదలైన వారు కూడా బంజారా సాహిత్య వ్యాప్తికి కృషి చేస్తున్నారు.

11. తెలంగాణ బంజారా భాషా సాహిత్యం

డి. రామదాసు
పరిశోధక విద్యార్థి,
ఉస్మానియా యూనివర్సిటి, ఫోన్ నెం. 9989685807

పరిచయం:

బంజారాలను లంబాడీలని కూడా పిలుస్తారు. బంజారాలకు ఒక భాష కూడా ఉంది. కాని, లిపి లేదు. కాబట్టి బంజారా సాహిత్యం మీద పరిశోధన జరగలేదు. బంజారా సాహిత్యం జానపద సాహిత్యంలో భాగమే. అయినా లిపిలేని కారణంగా ఇతరులకు బంజారా సాహిత్యంలోని అందచందాలు తెలియని పరిస్థితి ఏర్పడింది. కాని బంజారా సాహిత్య అధ్యయనం, పరిశోధనలు పూర్తిగా ఆగిపోలేదు. ఈ మధ్యకాలంలో కొందరు బంజారా చరిత్ర, సంస్కృతి ప్రగతిపై పరిశోధనలు జరిపారు. కాని బంజారా సాహిత్యంపై సమగ్రమైన పరిశోధనలు జరగలేదనే చెప్పాలి. బంజారా సాహిత్యాన్ని సమగ్రంగా అధ్యయనం చేసినట్లయితే బంజారాల జీవనాన్ని గురించి ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు.

ప్రపంచ దేశంలో అనేక జాతులు, సంస్కృతులు విరాజిల్లాయి. ప్రసిద్ధమైన సింధూ, ఈజిప్టు, ఇరాన్, ఇరాక్ నాగరికతలు నేడు అంతరించినా, భారతీయ సంస్కృతి మాత్రం అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ ఉంది. భారతదేశంలో అనేక జాతులు, కులాలు, మతాలు, భిన్న ఆచారాలు ఉన్నాయి. భిన్నతంలో ఏకత్వం. భారతదేశంలో ఇతర దేశాలవలే ఆదిమ మానవ జాతులు నివసించిన ఆనవాళ్ళు ఉన్నాయి. ఆదిమ తెగలు నేటికీ తమ ప్రాచీన ఆచారాలను, సంప్రదాయాలను, జీవన విధానాలను నాగరిక సమాజంలో భాగంగా ఆచరిస్తూ జీవిస్తున్నాయి. ప్రతి ఒక మానవ సముదాయం ఒక ప్రత్యేకమైన భాషను, జీవన విధానాన్ని కలిగి ఉంటుంది. ఉదాహరణకు, తెలుగుజాతి తెలుగు భాషను మాట్లాడే జన సమూహాన్ని, తమిళ జాతి తమిళాన్ని మాట్లాడే జన సమూహాన్ని, అలాగే లంబాడీ జాతి లంబాడీ భాష మాట్లాడే జన సమూహాన్నీ కలిగి జీవిస్తున్నాయి. వీరి ఆచార వ్యవహారాలలో బిన్నత్వం కూడా కనిపిస్తుంది.

బంజారాల పుట్టుక:

భారతదేశంలో నివసిస్తున్న అనేక ఆదిమ జాతులలో "బంజారా" ఒక విశిష్టమైన గిరిజన తెగ. భారతదేశంలో బంజారాలను గోర్ లేదా గోర్ బంజారా అని అంటారు. గోర్ లేదా గోర్యా అనే పదాలు "గవారా" అనే హిందీ పదం నుండి పరిణామం చెందినట్లు చరిత్రకారులు, భాషా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. హిందీలో "గవారా" అనగా గ్రామగ్రామాలు తిరిగేవారని అర్థం. గోసంరక్షణ చేసేవారు కావున బంజారాలను గోర్ బంజారాలని పిలుస్తున్నారు. బంజారాలను గోవులతో అనుబంధం చాలాకాలం నుండి ఉంది. గోవుల మోపులపై ఉప్పు, సుగంధ ద్రవ్యాలు ఇతర వస్తువులు రవాణా చేసేవారు కనుక వీరికి "గోర్ బంజార" అని పేరు వచ్చినట్లు చరిత్రకారుల అభిప్రాయం.

బంజారా శబ్ద ఆవిర్భావాన్ని గురించి చరిత్రకారులు వివిధ రకాలుగా పేర్కొంటున్నారు. వాణిజ్యం అనే సంస్కృత పదం నుండి బనజ్ అనే హిందీ శబ్దం బనజ్ నుండి బంజారా రూపొందింది. ఒక స్థిర నివాసం లేక వనాలలో సంచరించే వారిని సంస్కృతంలో వనచరులని అంటారు. కాలక్రమేణా వనచర శబ్దం వంజరిగానూ వంజర బంజర గాను పరిణామం చెంది ఉండవచ్చని ఒక అభిప్రాయం ఉంది.

బంజారాలు స్వాతంత్ర్యం రాకముందు ఒక సంచార తెగగా జీవిస్తూ ఉండేవారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వీరు ఎక్కడివారక్కడ స్థిర నివాసాన్ని ఏర్పర్చుకొని తమ జీవితాన్ని కొనసాగిస్తున్నారు. బంజారాలను భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో వివిధ పేర్లతో పిలుస్తున్నారు. లంబాడీలను రాజస్తాన్‌లో గవారియా లేదా గమాలియా, ఢిల్లీ, హర్యానాలలో సిరికిబండ్, పంజాబ్ లో సిరికివాలా మిగతా రాష్ట్రాలలో బంజారా, బంజర, వనజార, బ్రంజారి, బ్రజ్వాసి, లభాన్, బిళదియా, కర్నాటకలో లమాన, మహారాష్ట్రలో కంగసీయ లేదా సింగాడి బంజారా అని పిలుస్తున్నారు. తెలంగాణా ప్రాంతంలో బంజారాలను లంబాడి లేదా లంబాడా, గోర్‌మాటి, గోర్‌బోలి అని పిలుస్తారు.

భాష పుట్టుక:

మానవుడికి ఉన్న అమూల్యమైన శక్తి భాష మాట్లాడగలగడం, మానవుడు తన మనస్సులోని అభిప్రాయాలని బహిర్గతం చేయడానికి నోటి ద్వారా చేసే ధ్వనులే భాష. ఇప్పుడు మనం వినే భాష ఒక వ్యక్తి నోటి ద్వారా చేసే రకరకాల ధ్వనులే ఆ

భాష తెలిసినవారికి ఆ ధ్వనులు అర్థం అవుతుంది. తెలియని వారికి వాటి అర్థం తెలియదు. కాబట్టి భాష అంటే కొన్ని ధ్వనుల సముదాయమేనని దీనివల్ల తెలుస్తుంది. కోతులు, పశుపక్ష్యాదులు కూడా భయం, ప్రేమ, కోపం, ఆకలి మొదలైన భావాలని సూచించడానికి అరుస్తాయి. అయితే మానవ భాషకి, పశుపక్ష్యాదుల అరుపులకి మధ్య ఎంతో భేదం ఉంది. మానవ భాషలో రకరకాల ధ్వనులు కలిసి మాటలుగా ఏర్పడం, రకరకాల మాటలు కలిసి రకరకాల వాక్యాలు ఏర్పడం జరుగుతుంది.

మానవుడికి భాష మాట్లాడి అర్థం చేసుకోగలిగే శక్తి పుట్టుకతో వస్తుంది. కాని ఏ భాషా పుట్టుకతో రాదు. పుట్టిన పిల్లవాడు మొదట అవ్యక్త ధ్వనులు చేస్తూ పెరుగుతున్న కొద్దీ తన చుట్టూ ఉన్న వ్యక్తులు చేసే ధ్వనులు వింటూ అవి సూచించే అర్థాలు తెలుసుకుంటూ భాష మాట్లాడడము, అర్థం చేసుకోవడము అలవాటు చేసుకొంటాడు.

భాషా లక్షణాలు:

మానవ జాతి తనకి సన్నిహితమైన చింపాంజీ, గిబ్బన్ వంటి కోతి జాతుల నుంచి కోటి, కోటిన్నర సంవత్సరాలకి ముందే విడిపోయిందని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. కాని భాష సుమారు 25 వేల సంవత్సరాల క్రితం మాత్రమే పుట్టి ఉంటుంది. ఈ కాలంలో మానవుల మెదడు పరిమాణం పెరిగి ఒక తరం నుంచి మరొక తరానికి మొదట సంస్కృతి తరువాత భాష ప్రసరించడం ఉండవచ్చు. అలాగే గిరిజన భాష కూడా ప్రాచుర్యంలోకి వచ్చింది. గిరిజనపదం అంటే గిరుల్లో లేదా కొండల్లో నివసించే ప్రజలకు గ్రామం, గిరులలో జీవించేవారు. కాబట్టి వీరిని గిరిజనపదులుగా పేర్కొనవచ్చు. గిరిజనులలో ప్రధానమైన తెగ బంజారా. వీళ్ళను లంబాడీలు అని కూడా పిలుస్తారు. వీరి భాషలో పదాలు క్రింది విధంగా ఉంటాయి.

తెలుగు	**లంబాడీ**	**హిందీ**
ఒకటి	ఏక్	ఏక్
రెండు	ది	దో
కూర	క్యాడి	సబ్జీ

ఇలా బంజార భాషా సాహిత్యం తెలుగు, హిందీ, ఉర్దూ పదాలతో మిళితమై వారి వేష, భాష, కట్టుబాట్లు మిగతావారి కంటే భిన్నంగా ఉంటాయి. వారు పాడుకునే పాటలు జానపద సాహిత్య రూపంలో ఉంటాయి.

జానపద విజ్ఞానం మీద గత అర్థ శతాబ్ది పైబడి పరిశోధనలు జరుగుచున్నవి. జానపద ప్రదర్శన కళలపైన విస్తృతమైన అధ్యయనం జరుగుతూ ఉంది. కానీ గిరిజన విజ్ఞానం మీద చెప్పుకోదగ్గ పరిశోధనలు జరగలేదు. బంజారా సాహిత్యంపై ఈ మధ్య కొంత అధ్యయనం జరిగింది కానీ, బంజారా జానపద నృత్యం పైన అంతగా పరిశోధనలు జరగలేదు. కాబట్టి గిరిజన నృత్యం అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతో ఉంది.

మన దేశంలో అనేకమైన గిరిజన తెగలు, జాతులు ఉన్నాయి. మన రాష్ట్రంలో నివసిస్తున్న గిరిజనుల్లో బంజారాలు ఒక విలక్షణమైన సంస్కృతి సంప్రదాయాలను కలిగి ఉన్నారు. ప్రకృతితో ముడిపడి ఉన్నందున వీరి సాహిత్యం కూడా ప్రకృతిని, ప్రకృతి దేవతలను ఆరాధించేది ఉంటుంది. వీరికి తమ నృత్యాన్ని ఒక వేదికపై పదర్శించే ఆనవాయితీ కానీ, అవకాశం గానీ లేదు. బంజారా ప్రజలకు సంగీతం, గేయం గురించి తెలుసుకొని వారి శాస్త్రీయ సంగీతం గురించి తెలియదు. వారి సహజ ఆలాపనే వారి సంగీతం. శాస్త్రీయంగా నాట్యం, నృత్యం వారికి తెలియదు. కానీ లయబద్ధంగా ఆడడం, పాడడం మాత్రం తెలుసు. నాటకం గురించి తెలియదుకాని వారు గుంపు గుంపులుగా ఉండి ఆడి పాడి తిలకించి ఆనందపడతారు.

లంబాడీ నృత్యం:

బంజారా జానపద విజ్ఞానంలో భాగమైన కళలను స్థూలంగా గేయం, నృత్యంగా పేర్కొనవచ్చు. గేయానికి దరువు తోడైనపుడు అది సంగీతమౌతుంది. బంజారాల నృత్యం వారి సంప్రదాయక సంగీత వాద్యాల (డబ్బడ) సాయంతో ప్రదర్శించడం జరుగుతుంది. వీరు పండుగల సందర్భంగాను, జాతరలు జరిగే సమయంలోనూ వివాహాది ఆచారాల సందర్భంగాను నృత్యప్రదర్శనలు ఇస్తుంటారు.

ఉగాది (ఆటం):

తోల్జాభవాని పండుగ బంజారాలు పూజించే తొలి పండుగ. ఇది మార్చి నెలలో వస్తుంది. బంజార ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో చేసే పండుగలలో ఉగాది పండుగ ఒకటి. లంబాడీలు కొంతమంది తోల్జామాతను దసరా రోజున కూడా పూజిస్తారు. కొంతమంది లంబాడీలు ఫిబ్రవరి మాసంలో పూజిస్తారు, మరికొంత మంది లంబాడీలు ఉగాది రోజు (మంగళవారం) పూజిస్తారు. ఈ పండుగ సందర్భంలో పురుషులు డప్పు కొడుతూ ఉంటే స్త్రీలందరూ వలయాకారంలో ఉండి చేతులు పైకెత్తి ఊపుతూ నృత్యం చేస్తూ గానం చేస్తారు.

ఈ సందర్భంలో వారు పాడుకునే పాట

"తోల్జాపరేమా దుండియాడితోన
లాంబికోని మోహుషణేన
బాటి మాంగుకన దుండియాడితోన
లాబికోని మోహుషణేన
భారిషారాతి దుండియాడితోన
లాబికోని మోహుషణేన"

భావం:

తోల్జాపురం (మహారాష్ట్ర) లో వెతికానమ్మా నీకోసం కాని ఎక్కడ దొరకలేదు. మాకు బాటి, రోటి, వరము కోసం వెతికానమ్మా నీకోసం. చాలా కష్టపడి ఇష్టపడి వెతికానమ్మా నీకోసం. అయినా ఎక్కడ దొరకలేదు. మేము సంవత్సరానికి ఒకసారి నీ పండుగ చేస్తున్నాము మమ్మల్ని అన్ని విధాలుగా చల్లగా చూడాలి అనే భావం ఈ పాట ద్వారా తెలుస్తుంది.

సీత్లాభవాని పండుగ:

బంజారాలు పండుగలను ఆట, పాటలతో తమ సంస్కృతి, సంప్రదాయాలతో అత్యుత్సాహంగా జరుపుకుంటారు. లంబాడీలు జరుపుకొనే పండుగలలో సీత్లాభవాని పండుగ, తీజ్ పండుగ, దసరా పండుగ, హోళి పండుగ మొదలగునవి.

లంబాడీలు పండుగలన్నిటిని సమిష్టిగా జరుపుకోవడం ఆచారం. వీరి పండుగలైనా, పూజలైనా, జూతరలైనా, ఆచార వ్యవహారమైన, వారి కట్టుబాట్లు, వారి వేషధారణ మిగతా వారి కంటే భిన్నంగా ఉంటాయి. వీరి వేష, భాష వైవిధ్య భరితంగా ఉంటుంది.

లంబాడీల జీవనాధారం పశుసంపద, కాబట్టి వారి పశువుల కొరకు ప్రత్యేకంగా జరుపుకొనే పండుగ సీత్లాభవాని పండుగ. బంజారాలు కొలిచే ఏడుగురు శక్తి దేవతల్లో శీత్లాభవాని ఒకటి. పశువులకు, మేకలకు, గొర్లకు ఎలాంటి రోగాలు సోకకుండా మనుషులకు కలరా, కుష్ఠు వ్యాదులు రాకుండా ఆ దేవత రక్షిస్తుందని ఆ పండుగ జరుపుకొంటారు. లంబాడి తండాలలో పెద్ద మనిషి సమక్షంలో ఈ పండుగ జరుగుతుంది. ఈ పండుగ మంగళవారం రోజు, లేదా గురువారం రోజు మాత్రమే

జరుపుకొంటారు. అయితే ఆ రోజు తండాలోని ప్రతి ఇళ్లలో జొన్న గుగ్గిల్లు, పెసర గుగ్గిల్లు, బొబ్బెర్ల గుగ్గిల్లు వండి వైవిధ్యంగా పెడతారు. తర్వాత లంబాడీ స్త్రీలు అందరూ కలిసి బేసెన్‌లో (గిన్నెలో) వండినటువంటి గుగ్గిల్లు పెట్టుకొని సామూహికంగా వలయాకారంలో నృత్యం చేస్తుంటారు. నృత్యంతో పాటు గానము ఉంటుంది. తర్వాత సీత్లాభవానికి మొక్కేటప్పుడు ఇది కథాగేయ రూపాలలో ఉంటుంది.

పాట:

యచ సీత్లాయాడి కత్త బ్యాటిబియాడి
సాయి రకాడేస్ యాడి గర్ పర్ రకాడేస్
సర్ పర్ రకాడేస్ యాడి అసామి తార్ యాడి
కచ్చబచ్చ తార్ యాడి డోడి గోడి తార్ యాడి
పంట పైరెమా పోలిబర్కత్ గాల్నోయాడి
ఘర్ బారెమా బర్కత్ రకాడేస్ యాడి
నిసర్ యాడి బార మలక్ దేకన
తార్ అసామిన దేకన
ఊర్ నంగారిన్ దేకన
వర్సెమా ఏక్ దాడ్ తార్ పండుగ కరరేచయాడి
తార్ బోకడ్ తోన దేరేచయాడి
మలకేన హరోబారో రకాడేస్ యాడి
గవు గవడిన్ హరోబరో రకాడేస్ యాడి
సాయివేన్ సావయి రకాడేస్ యాడి

భావం:

దేవి సీత్లామాత ఎక్కడ కూర్చున్నావు, సంవత్సరానికి ఒక రోజు నీకు పూజ చేస్తున్నాము. మాకు అన్ని విధాల సంపదను ఇవ్వు. గోసంపద, ధాన్యసంపద, పాలు, పెరుగు, నెయ్యి సమృద్ధిగా కలిగేట్టు చూడు. పసిపిల్లలను, అసామిని (రైతులను) మంచిగా చూడు, వినాశనాన్ని మా నుంచి దూరంగా ఉంచు. ఏదైనా కష్టసుఖాలను మాతో పంచుకోవాలని సీత్లాదేవిని ప్రార్థిస్తారు.

తీజ్ పండుగ:

లంబాడీ ప్రజల సీత్లాభవాని పూజ ముగిసిన తర్వాత పెళ్ళికాని ఆడపిల్లలు జరుపుకొనే పండుగను "తీజ్" అంటారు. తీజ్ పండుగ తెలంగాణ రాష్ట్రంలోని బతుకమ్మను పోలి ఉంటుంది. లంబాడీలు పూలకు బదులు గోధుమ, శనగ మొలకలను పూజించడం విశేషం. తెలంగాణలో తెలుగు ఆడపడుచులు బతుకమ్మను పూజించి నిమజ్జనం చేసినట్లే. లంబాడీ యువతులు (కన్యలు) చిన్న చిన్న బుట్టలలో ఎర్రమట్టి పోసి దాంట్లో మెత్తటి ఎరువు చల్లి తండాలోని యువతులు, ఆడపడుచులు అందరూ కలిసి సాయంకాల సమయంలో పాట పాడుకుంటూ, నృత్యం చేస్తూ గోధుమ, శనగ మొలకలను బుట్టలలో చల్లుతారు. తరువాత తండాలోని స్త్రీలు అందరూ సామూహికంగా కలిసి వలయాకారంలో నృత్యం చేస్తుంటారు. ఆ రోజు నుంచి ఉదయం పూట, సాయంకాలం పూట తండాలో ఉన్న పెళ్ళికాని అమ్మాయిలు అందరూ కలిసి ఇత్తడి బిందె నెత్తిపై ఎత్తుకొని పోయి పాటపాడుకుంటూ నీళ్ళకోసం వెళ్తారు. పాట పాడుకుంటూ నీళ్ళను నింపుతారు. పాట పాడుకుంటూ నింపిన నీళ్ళను నెత్తిపై మోసుకొని వస్తారు. యువతులు తెచ్చిన నీళ్ళను తీజ్ బుట్టలపై చల్లుతూ పాట పాడుతారు. అప్పుడు పాడే పాట ఈ క్రింది విధంగా ఉంటుంది.

పాట

లామి లామియే లామీడి ఏకేరియా
దొక కిరాయే లామిడి ఏకేరియా
మళ్ళీ కారియే లామిడి ఏకేరియా
లేరా లేరియే లామిడి ఏకేరియా
తోన కూణ్ బోరాయే తీజ్ బాయిరో పాలేణ
పాలేనియా పుందా బందే బాయిరో పాలేణ
సేవాభాయా బోరాయేతీజ్ బాయిరో పాలేణ
సేవాభాయారి నంగరితి రాజీ ఏగి తీజ్ బాయిరో పాలేణ
పాలేనియా పుందా బందే బాయిరో పాలేణ

భావం:

లంబాడీ యువతులు నీళ్ళకు వెళ్ళేటప్పుడు తీజ్ బుట్టపై నీళ్ళు పోసేటప్పుడు ఈ పాటను పాడుతుంటారు. మా తీజ్ గుబురుగా, ఏపుగా పెరగాలి; ఇంకా బాగా పెరిగి మా సంతోషాన్ని నింపగలవు. నిన్ను ఎవరు పెంచి పెద్ద చేస్తున్నారు అంటే సేవాభాయా

అధ్వర్యంలో వారి ఆశీస్సులతో తీజ్ బాగా ఏపుగా పెరుగుతుంది అని సేవాభాయాను తలుస్తూ పాట పాడుతూ నృత్య ప్రదర్శనలు చేస్తుంటారు.

తీజ్ పండుగకు ఏడవ రోజు డమోళి చేస్తారు. అంటే మేరామ మాతను రెండు యాట పొట్టేళ్ళు కోసి పూజిస్తారు. సేవాభాయకు (లాప్సి) నైవేద్యం వండి పెడతారు. కోసినటువంటి పొట్టేళ్ళను తండాలోని ప్రతి ఇంటికి పోగు ఏర్పాటు చేసి అందరికి సమానంగా వచ్చేటట్లు పంచిపెడతారు. యువతులు మాత్రం శాఖాహార వంటలనే చేసుకొని రోజువారీలా కాకుండా ఈ 9 రోజులు మితంగా తినాలి అనేది వీరి ఆచారం, ఎక్కువ తిన్నా, కారంతోటి తిన్నా తీజ్ మొలకలు పెరగవు, మాడిపోతాయి అనేది లంబాడీల నమ్మకం.

తర్వాత లంబాడీ స్త్రీపురుషులు కలిసి సేవాభాయా కోసం వండినటువంటి బెల్లం పాయసం (లాప్సి) గిన్నెల్లో లేదా చేతుల్లో పట్టుకొని ఇంటింటికి తిరిగి పరిహాసము చేస్తూ వాళ్ళని ఇంట్లో నుండి తీసుకొనివచ్చి లాప్సి (బెల్లం పాయసం) పూస్తారు. తరువాత ఇంట్లో స్త్రీ వున్నా, పురుషుడు వున్నా ఇంటింటా తిరిగే గుంపులో కలిసిపోతారు. అలా మొదటి ఇల్లు నుంచి చివరి ఇల్లు వరకు పోయి అందరిని కలిసి లాప్సిపూసి పరిహాసపు పాట పాడుతు నృత్యం చేస్తారు. ఈ పాట క్రింది విధంగా ఉంటుంది.

పాట:

ఉటే బోసడే బోకడే ఆయే
జల్ల బర్ బర్ బోకడ ఆయే
ఉటేరే వీరా బోకడే ఆయే
జల్లా బర్ బర్ లాప్సి లాయే
ఉటేరే జగ్నా బోకడే ఆయే
జల్లా బర్ బర్ లాప్సి లాయే

భావం:

తొందరగా లేవండి మేము అందరం వస్తున్నాము. గంప నిండా పాయసం అన్నం (లాప్సిర్ దళ) తీసుకొస్తున్నాము. మీరు తొందరగా లేవండి, లేవని యెడల మీకు లాప్సిర్ దళ బెల్లంతో చేసినటువంటి అన్నం పూస్తాము, మీరు తొందరగా లేవండి అని వాళ్ళని కూడా తీసుకొని పరిహాసపు పాటలు పాడుకుంటూ తిరుగుతారు.

తీజ్‌ను ఎనిమిది రోజులు పూజించి తొమ్మిదవ రోజున రంగ రంగ వైభవంతో తండాకు కిలోమీటరు దూరంలో ఉన్న కాలువ లేదా చెరువులో నిమజ్జనం చేస్తారు. నిమజ్జనం చేసిన తర్వాత ఇంట్లో అక్కచెల్లెళ్లు ఉంటే సోదరుడు, అక్కచెల్లెళ్ల కాళ్ళు కడిగి బొట్టుపెట్టి, దండం పెట్టి కట్నకానుకలు సమర్పించే ఆచారం ఇప్పటికి కూడా కొనసాగుతుంది.

తీజ్ నిమజ్జనం తర్వాత స్త్రీలు అందరు కలిసి బోరెడికి వెళ్తుంటారు. పచ్చి శనగలు ముళ్ళలో పెడుతుంటారు. వాళ్ళని పెట్టనివ్వకుండా పురుషులు అడ్డుపడుతుంటారు. అప్పుడు స్త్రీలు పాట పాడుతూ బోరెడి ముళ్ళలో గుచ్చుతారు. ఆ సందర్భంలో పాడే పాట.

పాట:

కుణసే నాయకేర్ టాండోయ్ బోరేడియా
దూద్యీ నాయకేర్ టాండోయే బోరేడి
గాలేద నాయక్ బాపురే బోరెడియా
కాచిక పాకియే బోరేడియా

భావం:

ఏ నాయకుని తండ ఇది, దూద్యీ నాయకుని తండా. ఈ తండా నాయకుల సహకారంతో బొరెడి పెట్టనియ్యండి (పచ్చి శనగలు) అని లంబాడీ స్త్రీలు తండాలలో ఉన్న పురుషులను ఊహించి పాట పాడుకుంటూ ముళ్ళకు బొరెడి పెట్టుకుంటారు ఇది లంబాడీ ప్రజల ఆచారంగా కొనసాగుతోంది. ఇంతటితో తీజ్ పండుగ ముగుస్తుంది.

హోళి:

బంజారా ప్రజలకు హోళీ పండుగంటే చాలా ఇష్టం. లంబాడీల అన్ని పండుగల కంటే భిన్నమైన పండుగ హోళీ. హోళీ పండుగను పది రోజుల ముందు నుంచి ఆట పాటలతో నృత్యం చేస్తూ ఊరూరు తిరిగి చందాలు, ఇనాం వసూలు చేయడం వీరి ప్రత్యేకత.

లంబాడీ స్త్రీ పురుషులు రంగు రంగుల దుస్తులు వేసుకొని చేతిలో గొడుగుపట్టుకొని ఇంకో చేతిలో రుమాలు (తువాల) పట్టుకొని మగవాళ్ళు కాళ్ళకు గజ్జెలు కట్టుకొని డప్పుకొట్టుకుంటూ దరువు వేస్తుంటే ఆడ, మగ, చిన్న పెద్ద అనే భేదం లేకుండా నృత్యం

చేస్తుంటారు. ఈ దృశ్యాన్ని చూసేవారు కచ్చితంగా ఆగి చూడాల్సిందే. ఈ పండుగ ఎంతో ఉత్సాహాన్ని నింపుతుంది. ఈ సందర్భంలో వారు పాడే పాట.

దేవరకొండారి బస్తీమా చ్వారి మస్తియే బారి మస్తియే ॥2॥
ఉతో చాలతే గేరియాతి దుంగో గసగియే

చ్వారి మస్తియే బైబైర
చ్వారి మస్తిమ సాసిజోక్
చ్వారి మస్తిమ గమతేతి

మిర్యాల గుడారి బస్తీమా చ్వారి బారి మస్తి యే ॥2॥
ఉతో చాలతే గేరియాతి డుంగో గసగియే

చ్వారి మస్తియే బైబైర
చ్వారి మస్తిమ డ్వాలేతి
చ్వారి మస్తిమ గమతేతి

భావం:

దేవరకొండ, మిర్యాలగూడ బస్తీల్లో చ్వారి (అమ్మాయి) చాలా హుషారుగా ఉంటుంది. ఈ అమ్మాయి బస్తీలో ఉన్న గేరియా (అబ్బాయి) నడుమును రాసుకుంటూ పోతుంది. ఈ అమ్మాయిలో ఎంత మస్తి ఉంది అని లంబాడీ స్త్రీ పురుషులు పరిహాసపు పాట పాడుతుంటారు.

ఆధార గ్రంథాలు:

1. నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం – జీవన చిత్రణ – సూర్య ధనుంజయ్.
2. ఆధునిక భాషా శాస్త్ర సిద్ధాంతాలు – ఆచార్య పి.యస్. సుబ్రహ్మణ్యం.
3. సుగాలి సంస్కృతి భాషా సాహిత్యాలు, గోనానాయక్.
4. తెలుగు లంబాడీ గేయ సాహిత్యం – జనపాల శంకరయ్య.
5. బంజారా చరిత్ర – సంస్కృతి ప్రగతి – చీనియా నాయక్.

12. తెలంగాణ సాహిత్యం – గిరిజన జీవితం

డా. నూనావత్ రాంబాబు
పోస్టు డాక్టొరల్ ఫెలో, హైదరాబాదు విశ్వవిద్యాలయం
Cell: 9652009764, dr.ramhcu87@gmail.com

ఆధునిక తెలంగాణా సాహిత్యంలో నవల, కథ, కవిత్వం, నాటకం ప్రధాన ప్రక్రియల్లో గిరిజనుల సమస్యలను చిత్రిస్తూ పలువురు తెలంగాణా గిరిజనేతర రచయితలు అల్లం రాజయ్య, ఉప్పల నరసింహం, కాలువ మల్లయ్య, గీతాంజలి, జాతశ్రీ జీవన్, బోయ జంగయ్య, బి.ఎస్. రాములు, ముదిగంటి సుజాతారెడ్డి, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, దిలావర్, పి.చంద్, పైడి చంద్రలత, శెట్టి కాంతారావు, శనిగరం వెంకటేశ్వర్లు (సాహు), పెద్దింటి అశోక్ కుమార్, గోపిభాగ్యలక్ష్మి, ఇప్పుడిప్పుడే వస్తున్న కొందరు గిరిజన రచయితలు సూర్యధనుంజయ్, వడ్త్య పంతులు నాయక్, భూక్యాతిరుపతి నాయక్, పద్దం అనసూయ, సిల్మానాయక్ మొదలైనవారు సాహిత్యాన్ని వెలువరించారు. కొంతమంది తెలుగు ప్రాంత రచయితలు తెలంగాణా ప్రాంత గిరిజనుల జీవితాలను ఇతివృత్తాలుగా తీసుకొని రచనలు చేశారు. వారిలో ఎ.విద్యాసాగర్, ఫణికుమార్, కేశవరెడ్డి మొదలైనవారు ముఖ్యులు.

నవలలు గిరిజన జీవితం:

ఆధునిక సాహిత్యంలో నవలకు ప్రాచుర్యమెక్కువ. తొలి నవల ఏది అన్న చర్చలో స్థానం సంపాదించుకున్న నవల **'శ్రీరంగరాజ చరిత్ర'.** కర్నూలు జిల్లా డిప్యూటి కలెక్టర్‌గా పనిచేస్తున్న నరహరి గోపాలకృష్ణమ్మ శెట్టి 1872 లో రచించారు. దీనికే **'సోనాబాయి పరిణయం'** అని పేరు కూడా ఉంది. ఇందులో కథ విద్యానగరాన్ని ఏలిన రంగమరాజు లంబాడీ తెగకి చెందిన సోనాబాయిని ప్రేమించి పెళ్లి చేసుకొంటాడు. తరువాత సోనాబాయి తన అత్తకూతురే అని తెలుసుకుంటాడు. ఇది మొదటి నవలగా స్థానాన్ని పొందనప్పటికి గిరిజనుల ప్రస్తావన వచ్చిన మొదటి నవల. 1985 తర్వాత గిరిజన నవలలు ఎక్కువగా వెలువడినాయి.

దాశరథి రంగాచార్యులు **'మోదుగుపూలు'** నవలలో కోయగూడెంలోని ఆటవికులకు నాగరికత అంటే ఏమిటో తెలియదు. వాళ్లు రాతియుగంలో జీవిస్తున్నారు. కోయగూడెంలో పాతిక గుడిసెల్లో నివసిస్తున్న కోయ జీవితాన్ని కళ్లకు కట్టినట్లు చిత్రీకరించారు. రైతాంగ పోరాటంలో పాల్గొని, నైజాం గుండెల్లో నగారా మోగించి ప్రాణాలర్పించిన గిరిజన వీరయోధుని చరిత్ర **'కొమురం భీం'**. ఈ నవలను సాహు, అల్లం రాజయ్య రాశారు. 1915 నుండి 1940 వరకు జరిగిన సంఘటనలను పొందుపరచి చారిత్రకంగా కొమురం భీం 1983 లో వెలువరించారు. అవాస్తవాల చరిత్రలు మాత్రమే చదివివున్న వాళ్ళకు వాస్తవ ప్రజాపోరాటయోధుల్ని, మన సాంప్రదాయిక యోధుల్ని పరియచం చేయడానికి, భూమిపోరాటం అంతిమంగా రాజ్యాధికార పోరాటంగా ఎట్లా ఎదగవలసి ఉంటుందో చూపడానికి ఈ నవలను రచయిత రాశారు.

వసంతరావు దేశ పాండే **'అడవి'** నవల చతురలో 1988 లో ప్రచురించారు. ఈ నవల 1981లో ఇంద్రవెల్లిలో జరిగిన పోరాటానికి, పోలీసుల కాల్పులకు అద్దం పట్టింది. నవల రెండు భాగాలుగా ఉంటుంది. మొదటి భాగం పోలీసుల చేతుల్లో వారి జీవితం ఎలా తెల్లారిపోయిందో చూపిస్తారు. మిగిలిన సగభాగం కొమురం భీం ప్రస్తావన వస్తుంది. ఈ పోరాటం కొనసాగింపుగా సాధన **'అడవిలో అన్నలు'** నవల 1990 లో అరుణతారలో ప్రచురించబడింది.

పులి ఆనంద మోహన్ రాసిన **'వసంత గీతం'** నవల 1990 లో గిరిజన పోరాట నేపథ్యంలో వచ్చింది. సాధన రాసిన **'సరిహద్దు'** నవల 1985 తర్వాత విప్లవ ఆచరణలో వచ్చిన మార్పు ఆ నవలలో కన్పిస్తుంది. ఆదివాసియేతర–ఆదివాసి అనుభవాల సారాంశం ఈ నవలలో కన్పిస్తుంది. సాధన రాసిన **'రాగో'** నవల గోండు స్త్రీల పట్ల అనుసరిస్తున్న కట్టుబాట్లు, అణచివేతలను, ఆచారాలను రాగో వ్యతిరేకిస్తుంది. స్వేచ్ఛను కోరుకుంటుంది. తను కోరుకున్న స్వేచ్ఛ తమ జాతి స్త్రీలందరూ పొందాలని ప్రయత్నిస్తుంది. ఈ నవలలో రాగో లేవలెత్తిన ఆదివాసి ఖాయిదాలకు (ఆచార సంప్రదాయాలకు) సంబంధించినట్లు కన్పించినా ఇవి ప్రపంచ ప్రజలవి. ముఖ్యంగా ప్రపంచ జనాభాలో సగభాగంగా ఉన్న స్త్రీలకు సంబంధించినవి.

అరుణ రాసిన **'ఎల్లి'** నవల ఎరుకల జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. ఎల్లి, నీలి జీవితాలు రెండూ ఎల్లి పేరిట నవలగా వెలువడ్డాయి. చింతాకు కోసుకొని,

బుట్టలల్లుకొని, పందులను కాసుకుని జీవించే ఎరుకల జీవిత నేపథ్యం నుంచి ఎరుకల స్త్రీ కడగండ్లు, ఆసాముల బిడ్డలచేతిలో అత్యాచారానికి గురై, వివాహ జీవితానికి అనుకూలం కాలేక మగవాడంటేనే భీతిల్లిపోయి, పిచ్చెక్కి మరణించిన జాజి పాత్ర లాంటి దయనీయ గాథలు, స్త్రీలపై జరుగుతున్న లైంగిక వేధింపులకు, వివక్షలకు నిదర్శనంగా నిలుస్తాయి. కాని తమ సమాజంలోనే ఉన్న అనాగరిక ఆచారాల కాఠిన్యం ప్రధానంగా చిత్రితమైంది ఈ నవల.

పులుగు శ్రీనివాస్ రాసిన **'అడవి తల్లి'** 1999 లో వచ్చింది. సహజ పుట్టుకలు – సహజ మరణాలు అరుదైన కాలంలో ఎక్కడో మారుమూల ఆదిలాబాద్ అడవుల్లో ఒక డెబ్బై ఏళ్ళ ముసలమ్మ కొమురం భీం సహచరి సోంబాయి ఆకలి చావును, కొమురం భీం పోరాట జీవితాన్ని చిత్రించిన చారిత్రక నవల ఇది. కేశవరెడ్డి రాసిన **'అతడు అడవిని జయించాడు'** (ప్రథ. ముద్రణ 1984) నవలలో, ఒక గిరిజనుడి జీవనాధారం పంది. అడవిలోకి వెళ్ళిన చూలు పంది పిల్లల్ని తల్లి పంది నుండి, అడవి జంతువుల నుండి రక్షించబోయి పంది, పంది పిల్లల్ని కోల్పోయి నిరాశ్రయుడై వచ్చిన వ్యక్తి దీనగాథను అతడు అడవిని జయించాడు నవల చిత్రించింది.

మంజరి రాసిన **'కనిపించని సూర్యుడు'** నవల 2005 చతుర పత్రికలో వెలువడింది. గిరిజనుల ఆచార వ్యవహారాలు, జీవిత విధానం, స్వాతంత్ర్యోద్యమం నేపథ్యంగా ప్రతిబింబిస్తూ ఆసక్తికరంగా మలచటమే కాక వారి గుండెల్లో కొన్ని తరాల వరకు ఆరాధ్యుడై నిలిచిన ఒక బ్రిటీషు అధికారి వ్యక్తిత్వ వివరాలు విశ్లేషించబడినాయి. బిభూతిభూషన్ బందోపాధ్యాయ (1894–1950) బెంగాలిలో రాసిన **'అరణ్యక'** నవలను సూరంపూడి సీతారాం రాసిన **'వనవాసి'** పేరుతో తెలుగులో అనువదించారు. అరణ్యక నవల 1938లో మొట్టమొదట ప్రచురించబడింది.

మల్లికార్జున హిరేమఠ్ కన్నడంలో రాసిన **'హవన'** నవలను జయశ్రీ మోహన్ రాజ్, ఎస్. మోహన్ రాజ్ **'తండా'** పేరుతో తెలుగులోకి అనువదించారు. ఈ తండా నవల కాత్యాయని సంపాదకత్వంలో 2004 లో ప్రథమంగా ప్రచురించబడింది. ఈ నవలలోని కథ తాండా ప్రజల నాయకుడైన సోమాల్య వ్యక్తిత్వం చుట్టూ అల్లుకుని ఉంటుంది. ఈ నవల రెండు భాగాలుగా రచింపబడింది. మొదటి భాగం మొత్తం తాండాకు వచ్చిన కొత్త స్కూలు మాస్టారికి సంబంధించిందిగా, రెండవభాగం

ఝిమ్రి, హరి, కసవనుల కథనం ప్రకారం నడుస్తుంది. సోమాల్య ముఖ్యపాత్రగా ప్రతి కథనంలోనూ కనిపిస్తాడు.

చిన్నప్పభారతి రాసిన **'సంఘం'** నవల గిరిజన చైతన్యానికి అద్దం పట్టిన నవల. ఈ నవలలోని ఇతివృత్తం రంగస్థలం కొల్లిమలై అనే కొండ ప్రాంతంలో నివసించే గిరిజనుల జీవితాలకు సంబంధించినదైనా, అన్ని వెనుకబడ్డ పర్వత ప్రాంతాల్లోని గిరిజనులందరి జీవితాలనూ దీని వెలుగులో చూడవచ్చు.

మహాశ్వేతాదేవి బెంగాలీలో ఉన్న గిరిజనుల వెతల్ని బెంగాలీ భాషలో నవలలుగా రాశారు. అవి తెలుగులోకి అనువదించబడినాయి. **'ఎవరిదీ అడవి', 'రాకాసికోర', 'ఒకతల్లి'** మొదలైన నవలలు గిరిజనుల జీవితాలపై వెలువడినాయి.

కథలు గిరిజన జీవితం:

జనజీవన చిత్రణకు పెద్దపీట వేసిన ఆధునికి సాహిత్య ప్రక్రియ కథ. గిరిజన జీవితాన్ని సంస్కృతిని జీవిత సమస్యల్ని చిత్రిస్తూ కథలు వెలువడ్డాయి. తెలంగాణా కథా సాహిత్యంలో గిరిజనుల సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకొని పలువురు రచయితలు కథలు రాశారు.

కాయిదా (సంప్రదాయం) ముసుకులో గిరిజనులు ఎలా తమ జీవితాన్ని అప్పుల పాలు చేసుకుంటున్నారో వివరించే కథ సాహు రాసిన **'కాయిదా'**. గిరిజన గూడెం వాళ్లు వర్షాలు లేక దేవుళ్ళకు మొక్కి, ఆ దేవుళ్ళ పేరుతో ఎర్రజెండాలను ఎగురవేస్తుంటారు. పోలీసు అధికారి ఆ జెండాలు దేవుళ్ళ జెండాలని తెలియక మోసపోవడాన్ని సాహు రాసిన **'జెండా కథ'** లో చిత్రించారు. కూటికిలేని పేదవాళ్ళు సంప్రదాయాన్ని ఆచరించే క్రమంలో గిరిజనేతరుడు కోరిన టేకు చెట్లు ఇచ్చి, బదులుగా జొన్నలు తీసుకుని పండుగపూట జైలుపాలైన గోండు దీన గాథ ఫణికుమార్ రాసిన **'దండారి'** కథ. కట్నకానుకల మధ్య నలిగిపోయే గిరిజన జీవితాన్ని సాహు రాసిన **'పెళ్ళికావాలి'** కథలో వర్ణించే ప్రయత్నం చేశారు. భూక్యా తిరుపతి నాయక్ రాసిన **'కాక్లా'** కథ గిరిజన మూఢనమ్మకాలకి అద్దంపట్టే కథ.

ఆర్థిక ఇబ్బందులకు తాళలేక, గిరిజన పిల్లల్ని 100, 200 రూపాయలకు అమ్ముకునే దుస్థితినీ, గిరిజన స్త్రీ గర్భంతో ఉండగానే బేరమాడి, అడ్వాన్స్

ఇచ్చే కాంట్రాక్టరు వెంకటరత్నం లాంటివారినీ రచయిత్రి డి. కామేశ్వరిగారు **'కంసావతారాలు'** కథలో కళ్ళకు కట్టినట్లు చిత్రించారు.

గిరిజనుల నివాస ప్రాంతంలోనే ఆఫీసులుంటే, వారి సమస్యలను వెంటనే పరిష్కరించడానికి వీలౌతుందనీ, పక్కాభవనం లేనప్పటికీ చెట్టు నీడనే ఆఫీసుగా ఏర్పాటు చేసుకొని వారి సమస్యలని పరిష్కారం చేయడాన్ని రచయిత ఎ. విద్యాసాగర్ **'చెట్టుకింద ఆఫీసు'** కథలో వివరించారు. ప్రభుత్వం ఉచిత సేవలు అందించినప్పుడే గిరిజనులు అభివృద్ధి చెందగలరని తెలియజేసే కథ ఎ. విద్యాసాగర్ రాసిన **'మనలోమాట'**. తిండికి లేకపోయినా గౌరవంగా జీవించాలనుకొనే గోండు వ్యక్తిగాథను ఇతివృత్తంగా ఫణికుమార్ రాసిన కథ **'రాజాసాబ్'.**

'గెరిల్లా' కథలో ఉద్యమకారులు పూర్తికాలం కార్యకర్తలుగా, దళారులుగా తిరుగుతూ, ప్రజల మధ్యవుంటూ, గెరిల్లా సైన్యంగా ఎదుగుతూ – ప్రజల నుండి గెరిల్లా సైన్యాన్ని తయారు చేసే క్రమాన్ని చిత్రించిన రచయిత పి.చంద్. పోలీసులు కాల్పులు జరుపుతున్నా బెదరకుండా పోలీసులను గూడెం దాటేంత వరకు తరిమిన విధానాన్ని అల్లం రాజయ్య **'తుడుం'** కథలో చిత్రించారు.

'మాబడి' కథలో గూడెంలోని పిల్లల ఆకలి మంటలు, వేసవిలో కూలికోసం పోరాటం, కూలిరేట్లు తగ్గించడం, తునికాకు తెంపకూడదని ప్రభుత్వ అధికారుల ఆజ్ఞ, గిరిజనులు ఆకలి మంటలతో అల్లాడటం చూసి సుక్కు స్క్వాడ్ లో చేరడాన్ని మయూరి చిత్రించారు. నక్సలైట్లకు ఆశ్రయమిస్తున్నారని తండాలోని లంబాడీలను పోలీసులు చితకబాదడం ముదిగంటి సుజాతరెడ్డి రాసిన **'ముట్టడి'** కథ. గోండుల భూమిని ఆస్తిని ఆక్రమించుకున్న భూస్వాముల దోపిడీ పాలననుండి కాపాడాలని చేసిన ప్రయత్నం అల్లం రాజయ్య రాసిన **'మలుపు'** కథలో కనిపిస్తుంది.

అడవిలో నివాసం ఏర్పరచుకొన్న గిరిజనులు అడవి వెదురును పొట్టకూటికోసం నరుకుతున్నారు. గిరిజనేతరులు లాభాల కోసం కలపను కొట్టి గిరిజనుల మనుగడకి గండికొడుతున్న తీరును ఎ. విద్యాసాగర్ **'కూసున్న కొమ్మ కొట్టుకుంటామా సారూ?'** కథలో వివరించారు. అడవిలో ఆహారం కోసం పోరాటం చేశారు. అలా పోరాటం చేసిన గిరిజనుల నాయకుడు కొమురం భీము. అతన్ని నైజాం పోలీసులు 1941 లో

దొంగచాటుగా కాల్చి చంపేశారు. ఒక గిరిజన వీరుని యదార్థ జీవితగాథ భూపాల్ రాసిన **'కొమురం భీము'**. పశువుల్ని మేపుకుంటూ, పట్వారీలకు లంచం, చౌకిదార్లకు లంచం ఇస్తూ ప్రభుత్వానికి పన్నుకడుతూ ఉంటారు. అయినాగానీ భూమి గిరిజనుల సొంతం కాలేకపోతుంది. దాంతో గూడెం వాళ్ళందరూ కలిసి మాట్లాడుకుంటారు. అందరూ కలిసి మెలిసి ఉండాలనీ, పన్ను చెల్లించకూడదని నిర్ణయించు కోవడాన్ని సాహు **'నిర్ణయం'** కథలో చిత్రించారు.

గిరిజనులు అడవుల్లో నివసించడం వల్ల ఒకసారి అడవుల్లో చిక్కుకున్నారు. వారిని రక్షించాలనుకున్నా రక్షించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఎటుచూసినా నీటి ప్రవాహం ఉన్న తీరును ఎ. విద్యాసాగర్ **'ఇటూ కిన్నెరసాని – అటూ కిన్నెరసాని'** కథలో వివరించారు. గోదావరి నదిని ఆశ్రయించి ఎన్నో గిరిజన, గిరిజనేతర గ్రామాలున్నాయి. వరదలు వచ్చినప్పుడు ఈ ప్రాంతాలన్నిటికి ముప్పు ఏర్పడుతుంది. గిరిజనులను రక్షించాలని బయలుదేరిన సంక్షేమాధికారులు గమ్యం చేరుకోలేక గిరిజనేతర గ్రామంలోనే వారి సేవలు కొనసాగించిన తీరును ఎ. విద్యాసాగర్ **'రోడ్డు మీద లాంచి! ఆకాశవాణి నందిగామ!!'** కథలో తెలియజేశారు. ఏటూరు నాగారం గిరిజనాభివృద్ధి సంస్థ వరదలో చిక్కుకున్న నాగారంలోని రామన్న ప్రజల్ని రక్షించిన తీరు, రామన్న గూడెం ప్రజలకు జరిగిన నష్టాన్ని తెలియజేయాలన్న నేపథ్యంలో ఫణికుమార్ రాసిన కథ **'వరదలలో నాగారం'.**

గిరిజనుల కోసం ఏర్పాటుచేసిన చట్టాలు వారికి నిష్ప్రయోజనంగా ఉండటాన్ని రచయిత ఫణికుమార్ **'చింతాసాలక్క'** కథలో వివరించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా వరద ప్రవాహంలో భార్యను, బిడ్డను కోల్పోయి మౌనాన్ని వహించిన వ్యక్తి, ప్రాణాలు కోల్పోయిన స్త్రీ దీనగాథ ఫణికుమార్ రాసిన **'నువ్ మంచి గుండు మామా'** కథ. 1985 వ సంవత్సరంలో కొత్తగూడెం దగ్గర పాడులో గిరిజనులకు ఉద్యానవనాలు ఏర్పరచే శిక్షణ గిరిజనుల భూమిలోనే ఏర్పాటు చేశారు. ఫారంలో, ఫారెస్టులో కలిసి పోయిన భూమికి నష్టపరిహారం లభించక, ఎప్పటికైనా భూమి తిరిగి ఇస్తారని ఆశించే గిరిజనుల బాధల్ని వివరించే కథ ఎ. విద్యాసాగర్ రాసిన **'భూమికోసం'**. ఎలుగుబంట్లు చేసిన దాడిలో రూపాన్ని కోల్పోయిన గిరిజన స్త్రీ దీనగాథను **'రాకితల్లి'** కథలో ఫణికుమార్ చిత్రించారు.

ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వలస వెళ్లినా, గిరిజన జీవితాలు బాగుపడవనీ, వారికి ప్రభుత్వం అందించే పథకాలు, సహాయ సహకారాలు అందక గిరిజనులు తమ జీవితాలను కోల్పోతున్న తీరును బోయజంగయ్య **'అడవి పూలు'** కథలో చిత్రించారు. గూడేలకి దగ్గరగా వెదురు డిపోలుంటే బాగుంటుంది. డిపోలు కొండ కింద ఉన్నాయి. దీనివల్ల గిరిజనులకు డిపో నుండి వెదురు తీసుకోవడం అంటే కొండకు కట్టెలు మోయడంలాంటిదనీ, డిపోలు కొండకింద ఉండడం వల్ల వచ్చే నష్టాన్ని గిరిజన స్త్రీ వివరించడాన్ని ఎ.విద్యాసాగర్ **'కొండకు కట్టెలుమొయ్యమంటరా... సారూ?'** కథలో తెలియజేశారు. గిరిజన తండాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఏ మాత్రం అమలుకాని తీరును కొండవీటి సత్యవతి **'గూడు'** కథలో వివరించారు.

పొట్టకూటి కోసం కట్టెలు కొట్టడానికి వెళ్లి జంతువు చేసిన దాడిలో ముఖాన్ని కోల్పోయిన వ్యక్తి దీన గాథను రచయిత ఎ.విద్యాసాగర్ **'నా మొకం మల్లొచ్చింది సారూ!'** కథలో చిత్రించారు. గిరిజనాభివృద్ధి సంస్థ ద్వారా సహాయం పొందని వారికి సాయం చేయాలి అనుకున్నప్పుడు రాజుల మడుగు సరైన ప్రాంతమని గుర్తించి, ఆ ప్రాంతవాసులకు సేవలందించలేని విధానాన్ని రచయిత ఫణికుమార్ **'రాజులమడుగు'** కథలో తెలియజేశారు.

జలయజ్ఞం పేరుతో ప్రాజెక్టు నిర్మించదలచిన ప్రభుత్వం గిరిజన గూడేలను ఖాళీ చేయించి, పునరావాసం కల్పించక గిరిజనులను ఇబ్బంది పెడుతున్న విధానాన్ని వివరించిన కథ దిలావర్ రాసిన **'అరణ్యరోదన'**. ప్రాజెక్టు కడితే కాలగర్భంలో కలిసిపోయే సంస్కృతిని పరిరక్షించుకోవాలని చేసే ప్రయత్నంలో ఒక వృద్ధుడు తనవారి మనుగడ గురించి ఆలోచించే తీరు, గూడెం వాసులందరూ ఏకమైన తీరును జీవన్ **'పోటెత్తిన జనసంద్రం'**. గిరిజనేతరులు ఆక్రమించిన గిరిజనుల భూమిని వారికి ఇచ్చేయమని కోర్టు తీర్పు ఇచ్చినా ఆచరణలో అమలుకాని విధానాన్ని ఫణికుమార్ **'అన్నలొచ్చిన్రు'** కథలో వివరించారు. అభివృద్ధికి దూరంగా అడవిలో నివాసం ఉంటున్న గిరిజనుల దయనీయ జీవితాన్ని ఎ.విద్యాసాగర్ **'చీకటి మండలం'** కథలో చిత్రించారు.

భూమికోసం చివరకి గూడెం మొత్తం ప్రాణాలను వదిలేయడం సాహు రాసిన **'భూమికొరకు'** గిరిజనులు అష్టకష్టాలుపడి భూముల్లో పంటలు పండించుకుంటూ

వుంటే, పంట పండే సమయాల్లో భూమిని వదిలి వెళ్లిపోవాలని ప్రభుత్వాధికారులు నోటీసులివ్వడం వల్ల గూడెం వాళ్ళంతా కలిసి పోరాటంచేసి భూమిని కాపాడుకోవాలని నిర్ణయించుకుని చైతన్యంతో అందరూ కలిసి తుడుం కొట్టాలి అని అనుకోవడమే సాహు రాసిన **'మరట్ తుడుం పాయానా'**. గిరిజనుల మధ్య తలెత్తే భూతగాదాలు, ఆ తగాదాలు తీర్చడానికి వచ్చే అన్నలు (నక్సలైట్లు) మూలంగా ఏర్పడే చైతన్యం ... చివరకు గిరిజనులు తమ భూములను తామే కాపాడుకోవడం కోసం పోలీసుల్ని, కాంట్రాక్టర్లను తరిమి కొట్టడమే అల్లం రాజయ్య రాసిన **'రగల్ జెండా మైసివాకట్'.**

గిరిజనేతరుడు గిరిజన ఆర్థిక అవసరాన్ని, నిరక్షరాస్యతను ఆధారం చేసుకొని, ఋణభారం తరతరానికి అంటుకొని పీడించేలా చేస్తున్న విధానాన్ని పి.చంద్ **'అనామతు ఖాతా'** కథలో వివరించారు. పొగాకు రిక్కిచ్చి తవ్వెడు కందులు, చిన్న బెల్లం గడ్డిచ్చి సోలెడు నువ్వులు, సోలెడు బియ్యమిచ్చి అడ్డెడు అవిశలు తీసుకునే షావుకార్ల దోపిడిని సాహు **'అయిదు రూపాయల కథ'** లో చిత్రించారు. గిరిజనులు నివసించే ప్రాంత పరిసరాలను బట్టి వారు అనుసరిస్తున్న వివాహ పద్ధతిని ఎ. విద్యాసాగర్ **'ఇద్దరుండాల సారూ!'** కథలో వివరించారు.

గిరిజన స్త్రీలు ఆచార సంప్రదాయాల ముసుగులో పడే బాధలను, గోండుల జీవిత సంప్రదాయాలు, అవి వాళ్ళ జీవితానికే ఆటంకాలుగా తయారైన తీరుతోపాటు స్త్రీలలో కొత్తతరంవాళ్ళు పితృస్వామ్య సంకెళ్ళ నుంచి బయటపడాలనే తపన, అక్కడ రాజ్యమేలుతున్న అస్పృశ్యతలాంటి రుగ్మతలు, షావుకార్ల వడ్డీ లెక్కలతో గోండులు తమ భూములను కోల్పోవడం లాంటి వాస్తవాలను గోపి భాగ్యలక్ష్మి రాసిన **'జంగుబాయి'** కథలో చిత్రించారు. గిరిజన సంస్కృతిలోకి క్రైస్తవ మతం ప్రవేశించి, వాని ఆచార వ్యవహారాలను ధ్వంసం చేస్తున్న వైనాన్ని రచయిత్రి పద్దం అనసూయ **'మూగబోయినశబ్దం'** కథలో చిత్రించారు. గిరిజనుల అమ్మాయిల్ని గిరిజనేతరులు వివాహం చేసుకున్నా, గిరిజనేతర అమ్మాయిల్ని గిరిజనులు వివాహం చేసుకున్నా నష్టపోయేది గిరిజనులేనని ప్రాజెక్టాఫీసరు ద్వారా తెలుసుకున్న వ్యక్తిలో వచ్చిన మార్పు ఫణికుమార్ రాసిన **'వాళ్ల అల్లుళ్ళువద్దు – కోడళ్ళు వద్దు'** మొదలైన కథలు తెలంగాణా గిరిజన సాహిత్యంలో కనిపిస్తున్నాయి.

ఆడపిల్లల్ని అమ్ముకునే విధానాన్ని బోయజంగయ్య **'ఇప్పపూలు'** కథలో వర్ణించారు. టీచరే కోయ స్త్రీలను మోసం చేస్తున్న తీరును చిత్రించిన యదార్థగాధ

ఎ. విద్యాసాగర్ రాసిన కథ **'కోయకన్నె'**. వాడ్రేవు వీరలక్ష్మి **'పేరెంట్' 'కొండఫలం'** కథ, సాహు **'రక్తపింజెర', 'కన్నీటి కథ – నీటి కథ'**, బి.ఎస్.రాములు **'అడవిలో వెన్నెల'**, గీతాంజలి **'యాడి'** కథలు రాశారు. ఈ కథలన్నీ గిరిజన స్త్రీ సమస్యలు, గిరిజనేతరుల మోసపూరితమైన ప్రవర్తన, గిరిజనుల అమాయకత్వం వివరిస్తున్నాయి.

కవిత్వం గిరిజన జీవితం:

గోపీ భాగ్యలక్ష్మి, సాహు, అల్లం రాజయ్య, సూర్యధనంజయ్, వద్ద్యపంతులు నాయక్ మొదలైన వారు గిరిజనుల బాధల్ని కవిత్వీకరించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని గిరిజనుల దగ్గరకే వెళ్లి బాధలను కవితలుగా మలిచారు. ఖమ్మం జిల్లా సాహితీ స్రవంతి – ఖమ్మం **'జీవన్మరణం .... పోలవరం గిరిఘోష'** కవితల సంపుటిగా 2006 లో వెలువడింది.

వద్ద్య పంతులు నాయక్ **'నసాబ్' (పంచాయితీ)** అనే బంజారా కవిత్వం కవితా సంపుటిగా 2008 లో వెలువడింది. ఈయన రాసిన కవితలు చాలా భావాత్మకంగా, అర్థవంతంగా బంజారా సమాజానికి మేలుకొలుపుగా ఉన్నాయి. ప్రస్తుత బంజారా సమాజంలో ప్రబలియున్న ఈతి బాధలను, వాటి నివారణ ఆవశ్యకతను గ్రామీణ భాషలో అందరికీ అర్థమయ్యేట్లు తన కవితల ద్వారా బంజారా సోదర సోదరీమణులకు సమర్పించారు.

వద్ద్య పంతులు నాయక్ రాసిన మరో కవిత **'రామ్ రామ్ నాయక్'** అనే కవితా సంపుటి 2013 లో వెలువడింది. ఇది లంబాడీ యువకుడు, లంబాడీ జీవితం మీద రాసిన గొప్ప కవిత్వం. ఇది లంబాడీలు అసమానతల వల్ల పొందే ఆక్రోశం, ప్రకృతిని చూచి పరవశించే సుకుమార హృదయ సౌందర్యం కలగలసిన గొప్ప కవిత్వం.

సూర్యధనంజయ్ రాసిన **'బంజారా నానీలు'** 2013 లో వెలువడింది. ఇందులో నానీలన్నీ ఒకే వస్తువుపై రాయడానికి ప్రధాన కారణం బంజారాలు. బంజారాల సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక, ఆర్థిక పరిస్థితులన్నీ ఈ నానీలలో కనిపిస్తాయి. భయంకరమైన కరువుతో పట్నాలకు వలసవెళ్ళడం, అక్కడ దారుణమైన పరిస్థితుల్లో దుర్భర జీవితం గడపడం, ముఖ్యంగా ఆడపిల్లల్ని అమ్ముకోవలసి రావడం లాంటి ఘోరమైన పరిస్థితులు కవితావస్తువుగా కనిపిస్తున్నాయి.

'కవితా ఝంకార్' కవితా సంకలనాన్ని (గ్రీన్ హంట్ వ్యతిరేక కవితా సంకలనం) విరసం వారు 2013 లో వెలువరించారు. ఎనభై కవితలున్న ఈ పుస్తకం మహాకావ్యం

రూపుదాల్చినట్లు కవుల పేర్లు, కవితల పేర్లు తీసేస్తే యిదొక జాతి జీవితపు బహు పురాతన పురాణ గాథ. ముఖ్యంగా ఆదివాసుల అవిచ్ఛిన్నయుద్ధాలు, తిరుగుబాటులు, స్వయం సన్నద్ధాలు, సాంస్కృతిక పరిరక్షణలో పలవరింపులేవో విన్నట్టుగా ఉంటాయి.

గిరిజనులపై రాసిన కవితలు మరికొన్ని ఇలా ఉన్నాయి. అరుణతార సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక (జనవరి – ఫిబ్రవరి, 2014) లో **'ఆదివాసులోయమ్మ'** కవితను జామరల్లి నర్సింహారెడ్డి, **'కేదమావయి కూ కూ...'** కవితను అన్నవరం దేవేందర్, **'యుద్ధం – అనివార్యమే'** కవితను కే. బాజ్జి, **'ఆదివాసి పోరు'** కవితను కె. ప్రజ్ఞ రాశారు.

పై విధంగా గిరిజనుల జీవన విధానాన్ని కవితా వస్తువులుగా తీసుకొని రచయితలు కవితలు రాస్తున్నారు.

నాటకం గిరిజన జీవితం:

గిరిజనులపై నాటకాలు రాసిన రచయితలను వేళ్ళపై లెక్కించవచ్చు. గోండు వీరుడు కొమురం భీం నడిపిన వీరోచిత పోరాటాన్నే తనకు లభ్యమైన సమాచారంతో చారిత్రక నాటక రూపంగా మలచి అందించారు. శ్రీ గొల్లపల్లి యాదగిరిగారు. నాటక రచయితగా, నటునిగా, కవిగా, గేయకవిగా ప్రసిద్ధిగాంచిన ఈ కవి వరంగల్ జిల్లా గొల్లపల్లి.

'కొమురం భీం' చారిత్రక నాటకం మొత్తం తొమ్మిది దృశ్యాల నాటకం. ఈ నాటకంలో నాయకుడు కొమురం భీం. ఇంకా ఇతనితోపాటు విటోబా, కుర్దు, పైకుబాయి, మన్నెందొరల పాత్రలు ముఖ్యమైనవి. మిగిలిన పాత్రల పరిచయం వాటి అవశ్యకతను బట్టి రచయిత కూర్చాడు. కొమురం భీం మీద వచ్చిన తొలి నాటకం ఇది. ఈ నాటకంలో తెలంగాణా గిరిజనుల జీవితం దృశ్యమానమవుతుంది. ఆనాటి ఆర్థిక, సాంఘిక, సామాజిక విషయాలు ఇందులో ఇమిడివున్నాయి. గిరిజనుల వాస్తవ జీవితం ఈ నాటకం, పెత్తందార్లు చేసే అరాచకాలు ఎంత దారుణంగా ఉండేవో కళ్ళకు కట్టినట్లు చూపించారు. ముఖ్యంగా ఈ నాటకంలో గోండు, కొలాంల వ్యవస్థ ప్రతిబింబించబడింది. గిరిజనుల వ్యక్తిత్వం నిరూపించే నాటకం ఇది.

'కట్టుబానిస' (బెంగాలీ నాటిక) మూలం మహాశ్వేతాదేవి. తెలుగు సేత కొత్తపల్లి రవిబాబు. అనువాద సహకారం నిర్మలానంద అందించారు. ఈ నాటికలో నాలుగు అంకాలున్నాయి. మహాశ్వేతాదేవి రచనలో ఈనాటి కట్టుబానిసలైన గిరిజనుల కష్టభరిత జీవితాన్ని కొండను అద్దంలో చూపించినట్లు, కట్టుబానిస కన్నీటి బొట్టులో వున్న సముద్రజలపాతాల్ని చూపించగలిగారు. వారి ప్రళయఘోషని వినిపించగలిగారు. మానవ చరిత్ర సారాన్నంతా తనలో ఇముడ్చుకున్న పరమాణువులాగా ఈ కట్టుబానిస నాటిక రూపొందిస్తుందనడంలో సందేహం లేదని చెప్పకనే చెప్పారు రచయిత్రి.

అరుణతార సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక (జనవరి–ఫిబ్రవరి,2014) లో **'బాసగూడ'** అనే నాటికను ఉదయమిత్ర రాశారు. ఇందులో అమాయక గిరిజనులపై జరుగుతున్న కాల్పులను ఈ నాటికలో తెలియజేశారు. ఈ నాటిక హనుమకొండలో జరిగిన విరసం 24వ రాష్ట్ర మహాసభల్లో భాగంగా జనవరి 11 న విరసం సాంస్కృతిక బృందం తొలిసారి ప్రదర్శించింది.

తెలంగాణ గిరిజన సాహిత్యంలో నవలలు, కథలు, కవిత్వం, నాటకం వంటి ప్రక్రియల్లో గిరిజనుల జీవితాలను, వారి సమస్యలను చిత్రిస్తూ పలువురు తెలంగాణా రచయితలు సాహిత్యాన్ని వెలువరించారు. చరిత్ర నిర్మాణంలో తమ పాత్రను గుర్తించే చైతన్య క్రమంలోనే గిరిజన రచయితలు తమ చరిత్రను తామే రచించుకునే అవసరాన్ని కూడా గుర్తించాలి. గిరిజనులు గిరిజనేతరులు మరికొన్ని ప్రక్రియలపైన లోతుగా అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపయుక్త గ్రంథసూచి

1. అరుణతార సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక, హైదరాబాదు: జనవరి–ఫిబ్రవరి, 2014.
2. గోనా నాయక్, ఎం. గిరిజన సాహిత్యం. ఆంధ్రప్రదేశ్: నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణ, 2012.
3. జంగయ్య, బోయ, అడవిపూలు, హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2005.
4. తిరుమలరావు, జయధీర్, జీవన్, ఇప్పపూలు (గిరిజన సంచారతెగల కథలు), ఖమ్మం: ప్రతిభా ప్రచురణలు, 2009.

5. దక్షిణామూర్తి, పి. తెలుగు నవల, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమి, 1975.
6. పంతులు నాయక్, వడ్త్య. నసాబ్ (పంచాయితీ), హైదరాబాదు: మేగ్యా తండా ప్రచురణ, 2008.
7. పంతులు నాయక్, వడ్త్య. రామ్ రామ్ నాయక్, హైదరాబాదు: మేగ్యా తండా ప్రచురణ, 2013.
8. ఫణికుమార్, గోదావరి గాథలు, గుంటూరు: శ్రీనాథపీఠము, 1989.
9. భారతి, చిన్నప్ప, సంఘం, హైదరాబాదు: ప్రజాశక్తిబుక్ హౌస్, 1989.
10. మోహన్ రాజ్, జయశ్రీ మోహన్ రాజ్, ఎస్. (అను) తాండా, హైదరాబాద్: హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 2004.
11. రాంబాబు, నూనావత్, తెలుగు గిరిజన కథలు–వస్తు, శిల్పవైవిధ్యం, అముద్రిత పరిశోధన గ్రంథం, హైదరాబాదు విశ్వవిద్యాలయం, 2012.
12. రాజయ్య, అల్లం, కథా కెరటాలు, (విరసం కథలు), విజయవాడ: విరసం ప్రచురణ, 2001.
13. రాములు, బి.ఎస్. అడవిలో వెన్నెల, కరీంనగర్: కరీంనగర్ బుక్ ట్రస్టు, 1985.
14. వాఙ్మయి, సాహిత్య, చారిత్రక పరిశోధన పత్రిక, హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, జులై–సెప్టెంబరు, 2013.
15. విద్యాసాగర్, ఎ. భద్రాచలం మన్నెం కథలు, హైదరాబాద్: ప్రియదర్శిని ప్రచురణలు, 1993.
16. విప్లవ రచయితల సంఘం (సం). కవితా ఝంకార్, ఆంధ్రప్రదేశ్: విప్లవ రచయితల సంఘం, 2013.
17. వెంకటేశ్వర్లు, పుల్లా భొట్ల. తెలుగు నవలా సాహిత్య వికాసం, ఖమ్మం: వై.యస్.ప్రెస్, 1984.
18. శైలమ్మ, జి. తెలుగు కథాసాహిత్యం–గిరిజన జీవితం, కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయం, 2011.
19. సాహు, రాజయ్య, అల్లం, నైజాం గుండెల్లో నగారా మోగించిన కొమురం భీము, జోడెన్ ఘాట్: ఆదివాసి ప్రచురణలు, 2010.
20. సూర్యధనంజయ్, బంజారా నానీలు, హైదరాబాదు: శీతల్ పబ్లికేషన్స్, 2013.

13. తెలంగాణలో బంజారా భాషా సంస్కృతి

డా. వన్నె గోపాల్
అసిస్టెంట్ డైరెక్టర్, ప్రచురణలు & విస్తరణలు, సేవల విభాగం,
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం – 517 426.

జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత ఆచార్య సి. నారాయణరెడ్డి గారు గిరిజనులను "పురజనులు" గా నిర్వచించారు. గిరిజనులు కొండలు, లోయల్లో నివసిస్తూ వారిదైన సంస్కృతి, సాహిత్యాలతో, ఇతర సమాజం నుంచి దూరంగా, ఏకాంతంగా జీవనాన్ని గడుపుతున్నారు.

గిరిజనులు ఇతర సంస్కృతుల ప్రభావానికి, మత విశ్వాసాల ప్రభావానికి గురవుతూ తమ సంస్కృతిని కోల్పోతున్నారు. గిరిజనేతరులు కూడా గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్నప్పుడు గిరిజనుల ఆచార వ్యవహారాలను అనుసరిస్తున్నారు. ఇలాంటి పరిణామాన్ని అసాంస్కృతీకరణ అని వ్యవహరిస్తారు. హిందూ నిమ్నకులాల దేవతలకు గిరిజన దేవతలకు మధ్య సామీప్యత కలిగి ఉండటమే ఇందుకు కారణం.

భారతదేశమంతటా విస్తరించి ఉన్న బంజారా లంబాడీ తెగ గ్రామీణ సంస్కృతికి, నగర సంస్కృతికి భిన్నంగా ఒక విశిష్ట సంస్కృతిని కలిగి ఉన్నారు. ఐరోపా ఖండంలోని రోమా జిప్సీలు కూడా లంబాడీ తెగకు చెందిన వారే. మధ్య యుగంలో వ్యాపారరీత్యా దక్షిణానికి తరలి వచ్చిన లంబాడీలు మన రాష్ట్రంలో 1977లో గిరిజన తెగగా గుర్తించబడ్డారు.

లంబాడీలను లవణి, సుగాలి, బంజారా, లంబానీ, వంజారీ, సుకాలి తదితర పేర్లతో పిలుస్తారు. కర్నాటకలో వీరిని గోహర్ కేరి అని పిలుస్తారు. ఈ తెగవారు తెలంగాణ రాష్ట్రమంతా విస్తరించి ఎక్కువగా వరంగల్, నల్గొండ, ఖమ్మం, మహబూబ్ నగర్ జిల్లాలలో నివసిస్తున్నారు. తెలంగాణలో అతిపెద్ద గిరిజన సముదాయంగా పేర్కొనవచ్చు. వీరు నివసించే గ్రామాలను తండాలు అంటారు. వీరు ఐదు ప్రధాన

ఉపతెగలుగా విభజించబడ్డారు. వీటిలో భూక్యా (రాథోడ్), పదిత్య (జాదవ్), చౌహాన్, పమార్, బానోత్ (అడే) వీరే కాకుండా వీరికి సంబంధించిన చరిత్రను, గోత్రాలను చెప్పే భాట్, దాడీ, ఉప్పుడియా కులాలున్నాయి. ఈ రాష్ట్రంలో వీరు ఎర్రమట్టి నేలల్లో జీవిస్తూ జొన్నలు, మొక్కజొన్నలు, రాగులు, సజ్జలు, మిరప వంటి పంటలు పండించటం, అడవి నుండి కుంకమ కాయలు, మెందుగాకులు, ఇంటి అలంకరణకు ఉపయోగించే ఎర్రమట్టి, సీతాఫలపండ్లు, జీడిపండ్లు, లక్క మొదలైనవి సేకరించి నగరాలలో అమ్మడం చేస్తూ ఉంటారు. వీరి ప్రధాన వృత్తి పశుపోషణ.

భాష:

ఒక క్రమంలో అమరిన అర్థవంతమైన ధ్వనుల సముదాయాన్ని శాస్త్రీయంగా 'భాష' అంటారు. ప్రపంచంలో ఎన్ని భాషలున్నప్పటికీ ఏదో ఒక భాష మాత్రమే వ్యక్తికి స్వంత భాష అవుతుంది. కాగా ఇతర భాషలన్నీ అతనికి పరిచయమున్న భాషలుగానే వ్యవహరించబడతాయి. ఈ నేపథ్యంలో భాష అనే పదానికి పూర్వానుబంధం చేరి మాతృభాష ప్రథమ భాష, ద్వితీయ భాష, అంతర్జాతీయ భాష, అధికార భాష లాంటి వైవిధ్యాలు ప్రపంచంలో ఉన్నాయి. వీటిలో మాతృభాష తప్ప ఇతర భాషలన్నీ వ్యక్తిగత సాంఘీకరణానికి, నాగరిక సంపర్కానికి సంబంధించినవి. నాగరికత, సాంకేతిక పురోగతి మేరకు విద్యారంగానికి, ఏర్పడ్డ అపార ప్రాధాన్యం దృష్ట్యా భాష కూడా తగిన ప్రాధాన్యం సంతరించుకొంది.

లంబాడీలు దేశమంతా విస్తరించి ఆయా ప్రాంతీయ భాషలు మాట్లాడగలిగినప్పటికీ తిరిగి అందరూ కలసి ఒకే భాషలో మాట్లాడటం ఒక విశేషంగా చెప్పవచ్చు. అయితే విద్యలో మాత్రం లంబాడీలకు భాషే ప్రధాన సమస్యగా పరిణమించిందని చెప్పడానికి అవకాశముంది. ప్రతి సమాజం బాగోగులు సమాజంలో జరిగే విద్యావ్యాప్తిపైనే ఆధారపడి ఉంటాయి. ఆ విద్య కూడా ఏదో మొక్కుబడిగా కాక తరతరాల భావాలను ప్రభావితం చేసే అభ్యున్నతి పంథాలో సాగినప్పుడే జాతి వికాసగమనంలో చైతన్యం తొంగి చూస్తుంది. ఈ క్రమంలో మాతృభాష అపారమైన ప్రభావాన్ని గుర్తిస్తే లంబాడీలు విద్యాభ్యాసానికై ప్రాంతీయ భాషలపై ఆధారపడటం వారి విద్యా వ్యాప్తికై అపారమైన ప్రభావాన్ని చూపిస్తున్నదని చెప్పవచ్చు. ఈ మేరకు లంబాడీలు విద్య తద్వారా అభివృద్ధి కుంటుపడటానికి భాషే ప్రధాన కారణమని

విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. "అభివృద్ధి చెందిన కులాలు, జాతులు పోటీపడి ముందుకు సాగిపోతుంటే అభివృద్ధి చెందని లంబాడీలు మరీ వెనుకబడి పోతున్నారు. దీనికంతటికి కారణం విద్య. విద్య అనేది మాతృభాష నుండి నేర్పించవలసి ఉంది. కాని బంజారాలకు మాతృభాష ఒకటి ఉంటే, విద్య నేర్చుకునే భాష వేరొకటిగా ఉంది. అందువల్ల కావలసినంత అభివృద్ధి చెందలేకపోతున్నారు." ఇలా లంబాడీల అభివృద్ధి కుంటుపడటంతో భాష తద్వారా విద్యను ప్రధానంగా పరిగణిస్తున్నప్పటికీ పరిస్థితి చక్కదిద్దే ప్రయత్నాలు అరకొరగా ఉన్నాయే తప్ప ముమ్మరంగా పూర్తిస్థాయిలో సాగటం లేదనిపిస్తుంది. ఈ ప్రయత్నాలు ఇంకా రకరాకల అభిప్రాయాలను క్రోడీకరించడం, చర్చించడం, అధ్యయనం, ప్రయోగాల్లాంటి ప్రారంభ దశలకి పరిమితమైనందున లంబాడీ పిల్లలు ప్రాంతీయ భాషల్లో విద్యాభ్యాసాన్ని కొనసాగించక తప్పడం లేదు.

పరిష్కార మార్గాలు:

తెలుగు మాధ్యమ పాఠశాలల్లో లంబాడీ పిల్లలు విద్యనభ్యసిస్తున్న మేరకు లంబాడీ భాషేతర ఉపాధ్యాయుల్లో లంబాడీ భాష కనీస పరిజ్ఞానం కల్పించి బోధనా ప్రమాణాలను పెంచాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం కొన్ని కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమాల్లో తెలుగు లిపిలో బంజారా భాష పాఠ్య పుస్తకాలను ప్రవేశపెట్టడం ప్రధానంగా చెప్పుకోవచ్చు.

1986 జాతీయ విద్యావిధానాన్ని అనుసరించి 8 గిరిజన తెగలకు మాతృభాషలో విద్యాబోధన జరగాలని ప్రాథమిక విద్యవారు నిర్ణయించారు. అప్పటి ప్రాథమిక విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి డా. ఐ.వి. సుబ్బారావు గారి అధ్యక్షతన ఏర్పడ్డ కమిటీలో హైదరాబాద్ లోని కేంద్రీయ ఉస్మానియా, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాల భాషాశాస్త్ర నిపుణులు, అనుభవజ్ఞులైన ప్రాథమిక స్థాయి గిరిజన ఉపాధ్యాయులు, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ ఉపన్యాసకులు సమిష్టి కృషి మేరకు గిరిజన భాషలలో వాచకాల రూపకల్పన జరిగింది. గిరజన సంక్షేమ, ప్రాథమిక విద్యాశాఖలు దాదాపు ఏడాదిపాటు చేసిన సంయుక్త కృషి ఫలితంగా తెలుగు లిపిలో లంబాడీ భాష పాఠ్యపుస్తకం "బంజారా భారతి" పేరిట 2004లో ముద్రించబడింది. ఒకటవ తరగతి లంబాడీ పిల్లల కోసం ముద్రించబడ్డ ఈ పాఠ్యపుస్తకాన్ని 2004-05 విద్యా సంవత్సరంలో మొదటగా పది ప్రాథమిక పాఠశాలల్లో మాత్రమే ప్రయోగాత్మకంగా

ప్రవేశపెట్టడం జరిగింది. ఈ ప్రయోగం సత్ఫలితాలనిస్తున్న నేపథ్యంలో 2005-06 విద్యా సంవత్సరంలో రెండో తరగతి, 2006-07 విద్యా సంవత్సరంలో మూడవ తరగతి పాఠ్యపుస్తకాలను వరసగా ప్రవేశపెట్టడం జరిగింది. 2007-08 విద్యా సంవత్సరంలో రావాల్సిన నాలగవ తరగతి పాఠ్యపుస్తకం విషయంలో కొంత ఆలస్యం జరిగి 2008-09 విద్యా సంవత్సరంలో ప్రవేశపెట్టడం జరిగిందని నిపుణులు తెలియజేశారు. బంజారా భారతి తర్వాత సర్వశిక్షా అభియాన్ వారి ఆధ్వర్యంలో బంజారా బాల బాలికల్లో విద్యావికాసం (A Banjara Telugu Bilingual Module for Teachers) అనే పుస్తకం ముద్రించబడింది. ఈ పుస్తకాన్ని బంజారా భారతి లాగా కొన్ని పాఠశాలల్లో మాత్రమే కాక రాష్ట్రంలోని అన్ని తాండా ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశపెట్టారు. దీన్ని కేవలం విద్యార్థులపరంగానే కాక భాషేతర ఉపాధ్యాయులకు కూడా ఉపయోగపడే విధంగా రూపకల్పన చేయడం జరిగింది. మొత్తానికి తెలుగు లిపితోనైనా లంబాడీ మాతృభాష బోధన ప్రారంభమై సత్ఫలితాలు ఇస్తున్న తీరు కొంతమేర ఆశాజనకంగానే ఉందని చెప్పవచ్చు.

బంజారా భాషపై తెలుగు భాష ప్రభావం మన రాష్ట్రంలో దాదపు రెండు వందల సంవత్సరాలుగా ఉంది. సాధారణంగా ఏ తెలుగు పదాన్నైనా సులభంగా ఇముడ్చుకోగల భాషా సహనం బంజారాలకు సాంస్కృతికంగా వచ్చిన వారసత్వం. ఏ భాష అయినా మాట్లాడేవారు లేకపోతే, కొన్ని రోజులకు ఆ భాష అంతరించే అవకాశం ఉంది. ఉదాహరణకు బంజారా బాషను చూసినట్లయితే రానురాను ఆ జాతి వారే వారి భాషను మాట్లాడకుండా ఆధునిక నాగరికతకు అలవాటుపడి వారి భాషనే మర్చిపోతున్నారు.

మహబూబ్ నగర్ జిల్లా అమరచింత తాండా ప్రాథమిక పాఠశాల బంజారా ఉపాధ్యాయుడితో ముఖాముఖి జరిపినప్పుడు ప్రారంభంలో లంబాడీ పిల్లలకు మాతృభాషలో విద్యా బోధన వల్ల పరిస్థితి మెరుగ్గానే ఉందని చెప్పుకొచ్చిన ఆ ఉపాధ్యాయుడు క్రమంగా ప్రాంతీయ, అధికార, ఆంగ్ల భాషలతో పోల్చుకుంటే లంబాడీ భాష బోధన వల్ల చేకూరే భవిష్యత్తు ప్రయోజనాలు ప్రశ్నార్థకమేనన్న అభిప్రాయానికొచ్చాడు. అంతేగాక అతని పిల్లల ప్రగతిని ప్రశ్నిస్తే వారిని ఆంగ్లమాధ్యమ పాఠశాలల్లో చదివిస్తున్నట్లు చెప్పడం గమనార్హం. దీనిని పలు ప్రయోజనాలపరంగా

మాతృభాషపై ఏర్పడ్డ చిన్నచూపుకు నిదర్శనంగానే కాక ఉపాధ్యాయుని నైతిక బాధ్యతపరంగా ఉత్పన్నమయ్యే మరో సమస్యగా కూడా చెప్పవచ్చు. ఇతర వృత్తులతో పోల్చుకుంటే అధ్యాపకవృత్తి గౌరవప్రదమైందేగాక బాధ్యతాయుతమైంది కూడా. విద్యార్థిని ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయ నైతిక విలువలు ప్రధాన పాత్ర వహిస్తాయి. వైద్యుడి పొరపాటు వల్ల రోగికి మాత్రమే నష్టం. ఇంజనీరు అనైతికత వల్ల ఒక కట్టడంలో మాత్రమే నాణ్యత లోపిస్తుంది. అదే ఉపాధ్యాయుడు బాధ్యతను విస్మరిస్తే వ్యవస్థే నాశనమై సరిదిద్దుకోలేని ప్రమాదముంటుందన్న సత్యాన్ని గ్రహిస్తే మాతృభాషేతర ఉపాధ్యాయులేకాదు మాతృభాష ఉపాధ్యాయులుకూడా లంబాడీ పిల్లల విద్యాభ్యాసం సమస్యల్లో భాగమవుతున్నారని చెప్పాల్సి ఉంటుంది. అంతేకాగ జాతి సంస్కృతిలో కీలకాంశంగా భాషను గుర్తిస్తే లంబాడి విద్యావంతుల్లో భాషాపరంగా ఏర్పడుతున్న న్యూనతాభావం ఏకంగా వారి జాతిమనుగడపై ప్రభావం చూపే పరిస్థితి లేకపోలేదని చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథసూచి

1. బంజారా చరిత్ర సంస్కృతి – ప్రగతి
2. మాతృభాషలో ప్రాథమిక విద్య శాస్త్రీయ వివరణ
3. భారతీయ గిరిజనులు – ఓరియంటల్ లాంగ్ మన్ హైదరాబాదు
4. గిరిజన సాహిత్యం – ఆచార్య ఎం. గోనానాయక్
5. భారతదేశంలో లంబాడీలు – ఆచార్య ఎం. గోనానాయక్.

14. గిరిజన నృత్యాలు – పరిరక్షణ

డా. ఎల్. దేవేందర్
ప్రశాంత్ నగర్, రోడ్ నెం. 2,
మేడిపల్లి, హైదరాబాదు, ఫోన్ నెం. 9347834553

గిరిజన నృత్యాలు వ్యక్తికంటే సమిష్టికే ప్రాధాన్యతనిస్తాయి. ఆదిమానవుని నుంచి నేటి ఆదిమ గిరిజనుని వరకు వారి నృత్యాలు సామూహికమైనవి. ఆదిమానవుడు ప్రకృతిని అనుసరించి నృత్యం చేసేవాడు. ఈ ఆదిమ నృత్యాలే నేటి ఆదిమ గిరిజనుల నృత్యాలకు మరియు జానపద నృత్యాలకు మూలాధారాలు. గిరిజన తెగలలో చాలా తెగలకు తమ తమ ప్రత్యేకతలు గల జానపద గిరిజన నృత్యాలున్నాయి. ఆ కళను కొత్తతరం నేర్చుకోవటానికి ఏ రకమైన ఖర్చు లేకుండా గ్రామ గ్రామాల్లో వారసత్వంగా, నేర్చుకుంటూ ఆనందిస్తున్నారు. కనులకింపుగా, రంగురంగుల వేషాలతో ప్రశంసించదగిన చక్కని నృత్యాలు అనేక తెగలలో వున్నాయి.

గిరిజన నృత్యాలను వివిధ సందర్భాల్లో ప్రదర్శిస్తారు. పండుగలు, జాతరలు, వివాహాది సమయాలలో చేసే నృత్యాలు వేరు, వ్యవసాయపు పనుల సందర్భంగా చేసే నృత్యాలు వేరు. వివిధ సందర్భాలకు వేరుగా గిరిజన నృత్యాలను వీరు వికసింప చేసుకున్నారు. మన ప్రాంతంలో గిరిజన నృత్యాలైన 'థింసా' మరియు గోండు 'గుస్సాడి' నృత్యం, సవర నృత్యం కొమ్ముకోయ నృత్యం, 'మయూర' నృత్యం 'లంబాడి' నృత్యం, వివిధ గిరిజన నృత్యాలు అందరికీ తెలిసినవే.

కానీ, నేడు ఒకవైపు సమాజంలో ఆదరణ లేక రెండవవైపు ఆ తెగలోని కొత్తతరం వారికి వాటి పట్ల తక్కువ చిన్నచూపు చూపే ప్రవృత్తి పెరగటం కారణంగా ఈ నృత్యాలు కనుమరుగు అయ్యే ప్రమాదం ఏర్పడుతున్నది. వాటిని పరిరక్షించవలసిన అవసరముందని చెప్పడమే ముఖ్య ఉద్దేశ్యం.

గోండుల గుస్సాడి నృత్యం:

గుస్సాడి అంటే గురువు. గుస్సాడి నృత్యం గిరిజనులలో గోండు తెగవారు చేసే నృత్యం. గోండులు తెలంగాణాలో ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నారు. దీపావళికి పది రోజులు ఉండనగా గుస్సాడిలు వేషాలు ధరించి ఒక ఊరి నుంచి ఇంకొక ఊరికి వెళ్లి నృత్యం చేస్తూవుంటారు. వీరు తలకు నెమలి ఈకలతో తయారు చేసిన కిరీటం పెట్టుకుంటారు. చేతిలో రోకలి పట్టుకొని నృత్యం చేస్తూ వుంటారు.

థింసా నృత్యం:

చేతిలో నెమలి కన్నుల పొత్తి, కాళ్ళకు గజ్జెలు, ఒకే రంగు చీరలు కట్టుకొని స్త్రీలు చేసే నృత్యమే థింసా. ఈ నృత్యం గిరిజనులు, భూమిదున్ని విత్తనాలు జల్లేటప్పుడు భూమి పూజ చేసే సందర్భంలోను, పండుగలకూ చేస్తారు. గిరిజన నృత్యాలలో కొమ్ము నృత్యం అన్నింటికన్నా ప్రాచీనమైనది. తర్వాత రెండవ ప్రాచీన గిరిజన నృత్యం 'థింసా' ఈ నృత్యంలో ఒకరి నడుముకు మరొకరి చేతులు పట్టుకొని గుండ్రాకారంగా నృత్యం చేస్తారు.

ఈ నృత్యం ముఖ్యోద్దేశ్యం అడవిలోకి వెళ్లేటప్పుడు జంతువులను ఒక చోటుకు చేర్చడం. అందుకనే నృత్యం చేస్తూ మృగాల్లా అరుస్తూంటారు. ప్రతి బృందంలో నృత్యకారులు పదమూడు మంది ఉంటారు.

సంకుదేవుడు, పెదదేవుడని వారి రూపాలను రెండు రాళ్లుగా రావిచెట్టు క్రింద పెడతారు. పండక్కి రెండు లేక మూడు గ్రామాల వారందరూ కలిసి ఆ దేవుళ్ల ఎదుట నృత్యం చేస్తారు. పెళ్లిళ్లప్పుడు, ఇతర శుభకార్యాలప్పుడు కూడా అందరూ కలిసి ఈ నృత్యం చేస్తారు. వీరు పోడు వ్యవసాయం చేస్తుంటారు. ఈ నృత్యం గిరిజన ప్రాంతమైన పాడేరు, విశాఖపట్టణం జిల్లాలో ఎక్కువగా ప్రచారంలో ఉంది.

సవర నృత్యం:

భూమిని దున్నుకొని విత్తనాలు వేసేటప్పుడు సవరలు వారి భాషలో పాటలు పాడుకుంటూ నృత్యం చేస్తారు. ఆ నృత్యాన్ని 'సవర' నృత్యం అంటారు. సవరలు శ్రీకాకుళం జిల్లాలో నివసిస్తూంటారు. వీరు పోడు వ్యవసాయం అనగా కొండలు గుట్టలలో కొంత భూమిని హద్దులు పెట్టుకొని వ్యవసాయం చెయ్యటం పంటలు

పండిన తర్వాత ఆ భూమిని వదలి మరల వేరే భూమిని సాగుచేసుకోవటం. ఈ పద్ధతి కొన్ని ఆటవిక తెగలలో ఉంది. సవరులలో కూడా ఈ పద్ధతి ఉన్నది. వీరు కొండ దేవత పండుగ చేసుకొని వారి భాషలో పాడుకుంటూ నృత్యం చేస్తారు. ఈ పండుగను 'ఆగమ' పండుగ అని అంటారు. సవర నృత్య బృందంలో 15 నుండి 18 మంది ఉంటారు.

కోయ నృత్యం:

కోయలు ఖమ్మం, వరంగల్, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఎక్కువగా ఉన్నారు. కోయల సంప్రదాయ నృత్యంలో ప్రధానమైనవి స్త్రీలు చేసే 'రేల' నృత్యం, పురుషులు ప్రత్యేక అలంకరణలతో చేసే 'పెరంబో' నృత్యం. ఈ రెండు రకాల నృత్యాలు ఖమ్మం, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లో గల కోయలు అనుసరిస్తున్నారు. వారందరిలోకల్లా ఖమ్మం జిల్లా భద్రాచలం డివిజన్‌లోని కూనవరం, చింతూరు మండలాల్లోని గిరిజన గ్రామాల కోయలు చేసే నృత్యాలు అత్యంత ఆకర్షణీయంగా వుంటాయి. ఈ నృత్యాలను వారి పండుగలు – పెళ్ళిళ్ళ సందర్భంలో చేస్తారు.

రేల నృత్యం ప్రధానంగా గిరిజన స్త్రీలే చేస్తారు. కానీ ఉత్సాహం గల యువకులు కూడా పాల్గొంటారు. స్త్రీలు ఈ నృత్యసందర్భంగా తలకు కొప్పు పెట్టుకుంటారు. చీరను మోకాళ్ళవరకు అడ్డకట్టు కడతారు. కాళ్ళకు కడియాలు పెట్టుకుంటారు. స్త్రీలు వరసగా నిలబడి దండలు పట్టుకుని రెరెలయ్యో రెరెలో.... రెరెలయ్యో రెరెల... రేలరేలా రెరెలా.... అంటారు. ముందుకు లయబద్ధంగా అడుగులు వేస్తూ నడుస్తారు. నృత్యం మరీ ఊపు ఎక్కితే తొందరగా గంతులేస్తారు. ఈ సందర్భంగా వారు ఎంతో ఆనందపడతారు. చూపరులకు ఎంతో ఆసక్తి కలిగిస్తుంది. ఈలలు వేస్తూ కేరింతలు కొడతారు. 'పెరంబో' నృత్యం కేవలం పురుషులే చేస్తారు. ఇది ప్రధానంగా పెళ్ళిళ్ళకు చేస్తారు. వేసవి కాలంలో ఖాళీ సమయాలలో సంతోషానికి రాత్రి పూట చేస్తారు. ఈ సమయంలో పురుషులు బారుగా వున్న కొయ్యడోలు మెడకు తగిలించుకొని ఒకవైపు చిర్రతో, మరో వైపు చేతి వేళ్ళలో కొడతారు. అడవి దున్నల కొమ్ములు, నెమలి ఈకలు గల వెదురు బుట్టను తలకు తగిలించుకుంటారు. నెమలి ఈకలకు పొడవాటి గుడ్డ చుట్టి వేలాడ దీస్తారు. డోలికయ్య తగిలించుకున్న వ్యక్తి స్త్రీలు కట్టుకునే లంగా వంటి బట్టతో అలంకరించుకుంటాడు. వీరికి హుషారెక్కినప్పుడు కడియం గల కాసును అప్పుడప్పుడు విసరివేస్తూ 'కెయ్' అని పెద్దగా అరుస్తారు. సంతోషంగా ఊగిపోతారు.

ఈ విధంగా పురుషులు నృత్యం చేస్తున్నప్పుడు వారి ప్రక్కనే స్త్రీలు రేల పాటలు పాడుతూ వారి నృత్యాన్ని సాగిస్తూనే వుంటారు. ఈ నృత్యం శ్రమ పూరితమైనది కానీ, ఆనంద పడతారు. డోలు చాలా బరువుగా వుంటుంది. అయితే గిరిజనుల్లో వారి ఆర్థిక పరిస్థితి, జీవనం మెరుగుపడక పోయినా, బయటి ప్రపంచ పరిస్థితుల ప్రభావం వలన ప్రస్తుత పరిస్థితులలో వాటి ఎడల ఆసక్తి తగ్గుతున్నది.

కొండరెడ్లు – మామిడి నృత్యం:

కొండరెడ్లు తూర్పు కనుమల మధ్య ప్రవహించే గోదావరికి ఇరువైపులా వున్న కొండల మీద మరియు గోదావరి ఒడ్డు వెంబడి, అడవి సరిహద్దు ప్రాంతాలలో నివసిస్తున్నారు. మామిడి పండ్లు కోతకు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని కొండరెడ్లు జరుపుకునే పండుగల్లో ఈ నృత్యం ప్రదర్శించబడుతుంది. వీరి నృత్యంలో స్త్రీ పురుషుల నృత్యం, పురుషుల నృత్యం ఉంటాయి. ఈ నృత్యాన్ని రాత్రిపూట మాత్రమే ప్రదర్శిస్తారు.

ఈ నృత్యంలో స్త్రీలు, పురుషులు ఒకేసారి నృత్యంలో పాల్గొంటారు కాని జంటలుగా కలవరు. రంగస్థలం చుట్టూ ఎడమవైపు వలయాకారంగా తిరిగుతూ నృత్యం కొనసాగిస్తారు. నృత్యం పతాక సన్నివేశానికి వచ్చినప్పుడు స్త్రీలు, పురుషులు వేరు వేరుగానే నృత్యం చేస్తారు. స్త్రీలు పాదాన్ని నేలకు తాకించుతూనే నాలుగు అడుగులు ముందుకు వేస్తారు. ఇలా ముందుకు వెళ్ళడం ఒక క్రమ పద్ధతిలో జరుగుతుంది.

పురుషులు అడుగులు వేసే పద్ధతి స్త్రీల కంటే భిన్నంగా వుంటుంది. నృత్యం చేస్తున్న బృందంతో పాటు వాద్యకారులు ప్రక్కగా వెంటవెంటనే ముందుకు అడుగులు వేస్తారు. ప్రారంభంలో వాద్యాలను పట్టుకున్న కళాకారులు రంగస్థలం మధ్య కనిపిస్తారు. అడుగు ముందుకు వేసేటప్పుడు మొదట కుడిపాదం వేసి ఆ తరువాత ఎడమ పాదాన్ని కుడిపాదం మడమదాకా ముందుకు తీసికువస్తారు. ఆ విధంగా మళ్ళీ కుడిపాదంతో అడుగు వేయడానికి వీలు కలుగుతుంది. ఈ నృత్యానికి రెండు రకాల చర్మ వాద్యాలు లయను అందిస్తాయి. వాద్యాలను మరింత వేగంగా వాయించిన కొలది నృత్యంలో ఉత్సాహం కూడా పెరిగి మరింత చురుకుగా సాగుతుంది.

లంబాడీ నృత్యం:

ఆంధ్రప్రదేశ్‌లో చాలా ప్రాంతాల్లో 'లంబాడీలు' నివసిస్తున్నారు. వీరినే 'సుగాలీలు' 'బంజారాలు' అని కూడా అంటారు. వీరి నృత్యాన్ని ప్రతి సంవత్సరం

పండుగల్లో, పెళ్ళిళ్లు, తీరిక వేళల్లో వెన్నెల రాత్రుల్లో ప్రదర్శిస్తారు. నృత్య ప్రదర్శనలో ముఖ్యంగా వలయాకారంగా తిరిగటం రెండు చేతుల్ని ఊపటం ముఖ్యమైనవి. స్త్రీలు, పురుషులు నృత్యంలో పాల్గొంటారు. వీరి మధ్యలో లేదా ప్రక్కన ఒక పురుషుడు మాత్రం ప్రత్యేకంగా డప్పు కొడుతూ ఉంటాడు. డప్పు వరసలకు అనుగుణంగా స్త్రీలు రకరకాల అడుగులు వేస్తూ నృత్యం చేస్తారు. పాటలు పాడుతూ చేతులు పైకెత్తుతూ ముందుకు అడుగులు వేయటం ప్రధానంగా కుడికాలి ముందుకు కుడివైపుకు సాగుతుండటం నృత్యంలోని ప్రత్యేకత.

సుఖదుఃఖాల్ని కలిపి పంచుకునే ఏకత నృత్యంలో చక్కగా కనిపిస్తుంది. నృత్యాల్లో స్త్రీల పాత్ర ఎక్కువ కనిపిస్తుంది. నేడు వివిధ రాజకీయ పార్టీలు తమ ప్రచార రథాల ముందు, బహిరంగ సభలకు ముందు, ఊరేగింపులకు ముందు ఆకర్షణ కోసం, ఆ నృత్యాలను ఉపయోగించుకుంటున్నాయి.

ప్రపంచీకరణ నేపథ్యంలో గిరిజన నృత్యాలు గిరిజన సంస్కృతి సంప్రదాయాలు కనుమరుగు అవుతున్నాయి. గిరిజన కళాకారులు ఆత్మన్యూనతాభావం వల్ల సమాజంలో ముందడుగు వేయలేక పోతున్నారు. మనం కొన్ని కళలను సంస్కృతి సంప్రదాయాలను కోల్పోతున్నాము. కొన్ని సంవత్సరాలుగా వికసింపచేసుకొంటూ వస్తున్న ఈ గిరిజన నృత్యాలను పరిరక్షించటం చాలా అవసరం. వీటిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భద్రపరిచి, ముందుతరాల వారికి అందించాలి. మన భాష, సంస్కృతి, ఆచార వ్యవహారాలపై పరిస్థితుల ప్రభావం, నూతన పోకడల పేరిట అసలు సంస్కృతి మరుగున పడిపోకుండా కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది.

ఉపయుక్త గ్రంథాలు

1. అర్జా శ్రీకాంత్ – ఆంధ్రప్రదేశ్ జానపద కళారూపాలు
2. డా. వి.ఎన్.వి.కె. శాస్త్రి – ఆంధ్రప్రదేశ్ గిరిజన సంస్కృతి పరివర్తన
3. రంగారెడ్డి, కెచ్చెల – అభివృద్ధికి దూరంగా ఆంధ్రప్రదేశ్ గిరిజనులు
4. రాధాకృష్ణమూర్తి, మిక్కిలినేని – తెలుగువారి జానపద కళారూపాలు
5. వివేక్, వినాయక్ – గిరి చరిత్ర
6. ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి – డా. చిగిచర్ల జానపద కళా వ్యాసావళి
7. ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి – జానపద నృత్యకళ

15. బంజారా భాష స్వరూపం – వైశిష్ట్యం

డా. హెచ్. కిషన్

1. భాష:

"భాష్యతే ఇతి భాషా" భాషింపబడేది భాష అని అర్థం. "భాషావ్యక్తాయాంవాది" వచించుటకు ఉపయోగపడేది భాష అని మరో నిర్వచనం. తమవైన ఆలోచనలను, ఊహాపోహలను ఎదుటివారితో పంచుకోవడం కోసం, మానవ సమూహం ఏర్పాటు చేసుకున్న ధ్వనుల సంకేతార్థ వివరణ, భాష.

ఇలా ఆలోచన చేస్తే భాషకు లిపి అవసరం లేదు. మాట్లాడడం, వినడం అనే రెండింటినీ ఒక గాటన చూడాలి. అలాగే చదవడానికి, రాయడానికీ కలిపి ఒకే భావనతో ప్రతిస్పందించాలి. అలాంటప్పుడు భాషకు లిపి అవసరం లేదు. కనీసం వినడానికి, అనడానికి శక్తి ఉంటే చాలు. సమర్థవంతమైన భావజాలంతో, దృఢతరమైన శక్తిగా, స్వేచ్ఛాయుత స్పందనలతో మానవజాతి మనుగడకు ఆధారమైన భాష మొదట లిపి లేని భాష. ఆ సంప్రదాయానికి కట్టుబడిన అత్యంత ప్రాచీనమైన, పురాతనమైన భాష లంబాడీభాష లేదా బంజారాల భాష.

2. బంజారా భాష నిర్మాతలు:

బంజారాలు అంటే వ్యాపారం చేసేవారు. ఆ వ్యాపారం కూడా ఆ రోజుల్లో అన్ని చోట్లా సులభంగా లభించని ఉప్పు. అలాగే పశువుల క్రయవిక్రయాలూ చేసేవారు. వారి భాష, వారికే స్వంతమైన భాష బంజారాల భాష. అలాంటి లిపిలేని భాష పురాతనమైన భాష అయిన బంజారా భాషకు ద్రష్టలు, వ్యవహర్తలు, స్రష్టలు బంజారాలు. దేశమంతా వ్యాపించిన వీరు వివిధ ప్రాంతాల మాండలికాలను అనుసరించి ఏది వ్యవహరిస్తున్నా కూడా, మూలరూపం అయిన భాష మట్టుకు ఎలాంటి మార్పు చేర్పులకు లోనుకాని మూలభాష. తల్లి భాష, అమ్మభాష – బంజారాభాష.

3. భాషా నిర్మాణం:

మానసికమైన భావ పరంపరలను వ్యక్తులు పరస్పరం తెలియజేసుకోవడానికి ఉపయోగించే వాగ్రుపమైన సాధనమే భాష. తన జాతి ఆచార వ్యవహారాలను తనవారి తీరు తెన్నులను, కట్టు, బొట్టు మున్నగు సంస్కృతి సంప్రదాయాల వంటి అనేక రకాల విశేషాలను బాల్యం నుంచి తెలుకోవడానికి అనువైనది ఇది. ఈ సంప్రదాయాలోంచే భాష నిర్మింపబడుతుంది.

బాహ్య ప్రపంచాన్ని తెలుసుకోవడానికి తొలి భాష. బాధ కలిగితే ఏ వ్యక్తి అయినా తన భాషలోనే, అనగా లంబాడి భాషలో "యాడి" అని, అదే తెలుగు భాషలో "అమ్మా" అని అనడం సహజమే. సంభాషణ, విషయ, విశ్లేషణ చేయడం కూడ ఇబ్బందిగా ఉండదు. పరస్పరం చర్చించుకోవడానికి వీలు ఉంటుంది.

4. అవసరం:

మానవ చరిత్రలో ఏ జాతి వికాసం పొందినా లేక పొందాలన్నా ఆ జాతి ప్రజల నాల్కలపై నడయాడే భాష ఎనలేనిది. పరస్పరం తమ అభిప్రాయాలను వ్యక్తీకరించుకోవడానికి మేధస్సులో జనించే సృజనాత్మకతకు ప్రధాన వాహకం భాష. మనిషి పరిపూర్ణ వికాసానికి, సమగ్ర అభివృద్ధికి సరియైన పరిజ్ఞానం పునాది వంటిది భాష.

లంబాడీ పిల్లలు పరిపూర్ణ వ్యక్తులుగా తయారు కావాలంటే సాహిత్యం పాత్ర చాల గొప్పది. నాటి నుండి నేటి వరకు మన సంస్కృతిని, అందులో మంచి చెడ్డలను అందించగలిగేది అయిన లంబాడీ భాషకు బంజారాల సాహితీ కథలే ఆధారం. నిజానికి చిన్నతనం నుండి తమ పూర్వీకులు అందించిన విజయాలు, వాళ్ళు పాటించిన సంస్కృతి, సంప్రదాయాలు, అలవాట్లు, పద్ధతులు మొదలగునవి, నీతి కథలు వాటి నుండి వెలువడే మంచి గుణాలు వీరి రక్తంలో ఇంకాలి. అప్పుడు మాత్రమే తన జాతిని కాపాడుకోగలుగుతారు. మనకు సొంత వ్యక్తిత్వం రూపుదిద్దుకోవడం కేవలం భాష ద్వారానే సాధ్యమౌతుంది.

సమకాలీన సమాజంలో మార్పులు, ఆసక్తులు మానవ విలువలు తమ సాహిత్యం ద్వారానే తెలుస్తాయి. భాషా సాహిత్యాలు వీరికందరికీ అవసరమైనవి,

సృజనాత్మకత, నైపుణ్యాలు, భావస్పష్టత, భావ ప్రకటనా సామర్థ్యం రావడానికి అనువైనది భాషద్వారానే.

5. ప్రాధాన్యత:

ఎంతటి మేధావి అయినా ఆలోచించేది తన భాషలోనే. బంజారాలు, ఆధునిక కాలధర్మాన్ని అనుసరించి తెలుగు నేర్చుకున్నప్పటికీ, లంబాడి భాషలోనే ఆలోచించి తెలుగులో అనువదిస్తారనేదే అక్షర సత్యం. ఇక్కడ కొన్ని ఉదాహరణలు పరిశీలిద్దాం.

1.	**పొడుపు కథ:**	**లంబాడీ భాషలో** "అవుడికి బుట్టిమా చావళ్" (తార)	**తెలుగులో** "చిన్న గంపలోన బియ్యమే బియ్యం" (చుక్కలు)
2.	**సామెత:**	"ఏ కానేతి సామళన్, ఓ కానేతి కాణాకే వాళ్"	"ఈ చెవితో విని, ఆ చెవి నుండి తీసేస్తావు"
3.	**సాధారణ నామాలు:**	మాటి కూండి ఘర్ దూద్	మనిషి అమ్మాయి ఇల్లు పాలు
4.	**ద్వంద్వ పదాలు:**	బాబేటా బెట్ బేటా డోక్రా డోక్రి గోర్ గొణ్ణి ఛోరా ఛోరి	తల్లికొడుకు కూతురు కొడుకు ముసలిది ముసలోడు, భార్యభర్తలు అబ్బాయి, అమ్మాయి
5.	**జంట పదాలు**	దాణామాణా గోర్లి గావ్ డి	గింజా గిత్రా గొర్రెలు ఆవుల
6.	**మూల అంకెలు (1-10)**	ఏక్, ది, తీన్, చార్, పాంచ్, ఛో, సాత్, ఆట్, నవ్, దస్	1, 2, 3, 4, 5 6, 7, 8, 9, 10

7.	అంకెలు దశాంశాలు (10-100)	దస్, వీస్, తీస్, చాళీస్, పచ్చాస్ సాట్, సత్తర్, అస్సీ, నవ్వద్, ఏక్ సో	10, 20, 30, 40, 50, 60, 70, 80, 90, 100
8.	పెద్ద సంఖ్యలు	సో, హజర్, దస్ హజర్, లాక్, దస్ లాక్, కరోడ్ / సోలకే	100, 1000, 10,000, 1,00,000 10,00,000, 10000000
9.	భిన్నాంశాలు	పావ్‌లా, ఆదో, డ్యాడ్, అడాయి	¼, ½, 1-½, 2-½

6. ఉప సంహారం:

ఈ నాటి సమాజ అవసరాలలో అనువాదం మొదటి స్థానంలో ఉంది. బంజారా భాషకు పూర్వవైభవం రావాలంటే, ఆనాటి విశిష్టతను మనం నిలబెట్టాలంటే, అనువాదం ఒక అద్భుతమైన ఆయుధం. బంజారా భాష నుండి తెలుగులో అనువాదమనే ప్రక్రియ మెదడులో జరుగుతుంది. కాబట్టి బంజారా స్పష్టమైన అవగాహన, వ్యక్తీకరణ నైపుణ్యాలుంటేనే ఇతర భాషలో అనువాదం చేయడం సాధ్యమౌతుంది.

ఆలోచన నేర్పగలిగేది మన భాషలోనే అంటే తల్లిదండ్రుల నుండి వచ్చే భాషలోనే అందువల్ల ఎలాంటి ఒత్తిడి లేకుండా శ్రమరహితంగా సమాజానికి మంచి వార్తలు విషయాలు అందిస్తాం. అందుకే మన భాషకు మించిన భాషలేదని చెప్పవచ్చు.

"స్వభాష" వ్యాసంలో జంఘాలశాస్త్రి నోట పానుగంటివారు మాతృభాష మాట్లాడలేని వారిని వ్యంగ్యంగా పరిహసించారు. మ్యావ్ అనలేని పిల్లి ఉంటుందా? ఉండదు. కానీ, ఈ నాటి సమాజంలో మాతృభాషలో మాట్లాడలేని వారు ఉంటున్నారు. ద్వితీయ భాషగా ఇతర భాషలు ఎన్ని నేర్చినా, బహుళ ప్రయోజనం మట్టుకు మాతృభాష వల్లనే అనాలి.

ఒక పిల్లి తన పిల్లలను వెంట పెట్టుకొని వీధి వెంటపోతుంది. అంతలో ఎదురుగా ఒక కుక్క వచ్చింది. దాంతో పిల్లి పిల్లలు గుండెలు అవిసిపోయాయి. భయంతో బిక్కచచ్చిపోయాయి. తల్లిపిల్లి, తన పిల్లలతో తన మాతృభాషలో, భయంలేదు అని ధైర్యం

చెప్పింది. ఆ తర్వాత కుక్కభాషలో "భౌ భౌ" అంటూ అరవడంతో, భయంతోపాటు ఆశ్చర్యం ముప్పిరిగొనగా, కుక్క తోక ముడుచుకొని పారిపోయింది. తల్లి పిల్లికి వచ్చిన ద్వితీయ భాష – వారికి వచ్చిన ఆపద నుండి గట్టెక్కించింది. కాని పిల్లి పిల్లలకు ధైర్యం నూరిపోసింది మాత్రం మొదట వాటి మాతృభాష. బంజారాల విషయంలో కూడా ఈ విషయంలో కూడా ఈ విషయం సత్యం దూరం కాదు. బంజారాలు ఎంత చదివినా, పెద్ద పెద్ద ఉద్యాగాలు చేసినా, తమ భాషను మాత్రం మరచిపోకూడదు. ప్రతి బంజారా కుటుంబంలో పిల్లలకు లంబాడి భాషను నేర్పించాలి. లేనట్లయితే ఇప్పటికే లంబాడి స్త్రీలు, పురుషులు ధరించే వేషాధారణ వేగంగా కనుమరుగైపోతున్న విషయం అందరికి తెలిసిందే. కాబట్టి రాబోయే తరానికి రిజర్వేషన్లు ఉండాలంటే, ప్రతి లంబాడి పౌరుడు తన భాషను నేర్చుకొని తీరాల్సిందే. నేర్పించే బాధ్యత కూడ తల్లిదండ్రులపైన ఉందనే విషయాన్ని మరచిపోరాదు.

7. ప్రభుత్వ సహకారం:

తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ప్రతి జిల్లాలో బంజారాలు నివసిస్తున్నారు. వీరందరు ఒకే భాషను మాట్లాడతారు. అదే లంబాడిభాష లిపిలేనిది. ఈ భాషకు ప్రత్యేకమైన గుర్తింపు రావాలంటే ప్రభుత్వం చొరవ తీసుకొని లంబాడీ భాషాదినోత్సవం ప్రకటించాలి. దీనికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి.

ఆధార గ్రంథాలు:

1. బంజారా చరిత్ర సంస్కృతి – ప్రగతి : చి. చీనియానాయక్
2. తెలుగు లంబాడీల గేయ సాహిత్యం : డా. జనపాల శంకరయ్య
3. నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం – జీవన చిత్రణ : డా. సూర్యాధనంజయ్
4. సుగాలి సంస్కృతి – భాషా సాహిత్యాలు : డా. ఎం. గోనానాయక్.

16. తెలంగాణ కథాసాహిత్యం – గిరిజనస్త్రీ

డా. ఎల్. మంగమ్మ

పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం.

భారతదేశంలో కుటుంబ జీవనానికి అత్యధిక ప్రాధాన్యం వుంది. కుటుంబ రథానికి భార్యాభర్తలు సారథులు. మారుతున్న పరిస్థితులలో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై వ్యష్టి కుటుంబాలు అధికమయ్యాయి. పురుషునితో సమానంగా బయటపని, ఇంటిపని, పిల్లల్ని కనిపెంచడం వంటి పనుల భారంతో సతమవుతుంది. కులాన్నిబట్టి, మతాన్నిబట్టి స్త్రీలు పలురకాల సమస్యలు ఎదుర్కొంటున్నారు. గ్రామ కుటుంబంలో స్త్రీ పురుషునితోపాటు కష్టపడి కూలిపని చేస్తుంది. కాని కుటుంబపోషణ కోసం స్త్రీలు చేసే చేతివృత్తులు మాయమవుతున్నాయి. కుటుంబ పోషణ నిమిత్తం బొంబాయి వంటి ప్రాంతాలకు వలస వెళ్లి, పూట గడవక పడుపువృత్తిలోకి లాగబడుతూ, ప్రాణాంతకమైన ఎయిడ్స్ వంటి వ్యాధులు సోకి చావుకు దగ్గరవుతూ తమ వారినుండి వెలివేయ బడుతున్నారు. ఆడపిల్లలు పుడితే వారికి అయ్యే ఖర్చు భరించలేక పేదరికం వల్ల ఆడశిశువులను అమ్ముకోవడం, చంపుకోవడం, లేదా రోడ్లమీద వదిలివేయడం చేస్తున్నారు. మగ సంతానం కోసం మరో మనువు చేసుకొంటామనే భర్తల బెదిరింపులను ఎదుర్కొంటున్నారు. ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ కుటుంబ నియంత్రణ పాటించక పిల్లల్ని కనే యంత్రంగా స్త్రీలు మారిపోతున్నారు.

గిరిజన స్త్రీల జీవన విధానాన్ని చూసినట్లతై వారిలో నిరక్షరాస్యత, అమాయకత్వం, పేదరికపు విషవలయంలో చిక్కుబడివుంటారు. అంతేగాక ప్రసూతి సమయంలో సరైన వైద్య సౌకర్యం అందక గిరిజన స్త్రీలు ప్రాణాపాయ స్థితిలో పడుతున్నారు. కరువు కారణంగా కడుపునిండా అన్నం లేక గిరిజన పిల్లలు పనిపిల్లలుగా, దొంగలుగా మారిపోతున్నారు. పోషకాహార లోపంతో ఒంటినిండా కప్పుకోవడానికి బట్టలు లేక కుటుంబ భారాన్ని మోస్తూ పేదరికమనే విషవలయంలో గిరిజన స్త్రీలు కొట్టుమిట్టాడుతున్నారు.

ఆధునిక తెలంగాణ కథా సాహిత్యం విస్తృతంగా వ్యాప్తిలోకి వచ్చింది. గిరిజన సమస్యలు, గిరిజన స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధాన ఇతివృత్తాలుగా తీసుకొని తెలంగాణ కథారచయితలు గీతాంజలి, జాతశ్రీ, బోయ జంగయ్య, బి.ఎస్ రాములు, ముదిగంటి సుజాతారెడ్డి, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, పి.చంద్, శనిగరం వెంటేశ్వర్లు (సాహు), గోపిభాగ్యలక్ష్మి మొదలైన వారు స్త్రీల కథా సాహిత్యాన్ని వెలువరించారు. కొంతమంది తెలుగు ప్రాంత రచయితలు తెలంగాణ ప్రాంత గిరిజన స్త్రీల జీవితాలను ఇతివృత్తాలుగా తీసుకొని రచనలు చేశారు. వారిలో ఎ. విద్యాసాగర్, ఫణికుమార్, మొదలైనవారు ముఖ్యులు.

ప్రకృతిపరంగా గిరిజన స్త్రీ:

పేదవాడి జీవనాధారం భూమి. భూమి పై ఆధారపడి గిరిజన కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. గిరిజనాభివృద్ధికోసం ప్రభుత్వం గిరిజనుల భూమిని సేకరించి ప్లాంటేషన్స్ చేస్తుంది. దీనివల్ల గరిజనులు భూమిని కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది. భర్తను కోల్పోయి స్త్రీలు వృద్ధాప్యంలో భూమి మీద ఆధారపడి జీవిస్తుంటారు. గిరిజనేతరులు బతుకు దెరువుకోసం గిరిజనుల గూడెంల దగ్గర నివాసం ఏర్పరచుకొని గిరిజనుల భూమిని కాజేస్తున్నారు. గిరిజనులు జంతువులు అడవిలో సహజీవనం చేస్తుండటం వల్ల క్రూర జంతువులు గిరిజనులపై దాడి చేస్తుంటాయి.

కష్టించి ఫలసాయానికి తెచ్చిన గిరిజనుల భూమిని గిరిజన స్త్రీలకు చెందనీయకుండా నాగరిక సమాజం కాజేసే విధానాన్ని వాడేవు వీరలక్ష్మిదేవి 'కొండఫలం' కథలో చిత్రించారు. గిరిజన స్త్రీ అయిన సీతాలును గిరిజనేతరుడైన గంగరాజు వివాహేతర సంబంధం పెట్టుకొని, ఆమె ఎస్.టి సర్టిఫికెట్ ఉపయోగించుకొని ఐదెకరాల మడిచెక్కను సాగుచేసి జీడిమామిడి తోట వేస్తాడు. సీతాలుకన్నా ముందే ఈ పొలంను గిరిజనేతరుడైన కృష్ణమూర్తి సాగుచేసుకుంటాడు. గిరిజనుల భూమి గిరిజనులకే చెందాలన్న నియమంవల్ల ఈ భూమిని గిరిజన స్త్రీ అయిన సీతాలుకు ఇస్తారు. ఇంతలో హరిజనుడైన ఫక్రీరావు ఆ భూమి తనదేనని కోర్టునుండి స్టే తీసుకురావడంతో సీతాలు టీచరమ్మను ఆశ్రయిస్తుంది. టీచరమ్మ సీతాలు భూమి విషయం తెలుసుకోవాలని ఎమ్మార్వో ఆఫీసుకి వెళ్ళి, ఫక్రీరావు ఎస్.టి సర్టిఫికెట్ సృష్టించాడనీ, లాయర్లు భూ వివాదానికి సంబంధించిన సీతాలు ఎస్.టి సర్టిఫికెట్

కోర్టులో దాఖలు చేయలేదని తెలుసుకుంటుంది. గిరిజనులకు జీవనాధరమైన భూమికి చట్టాలు వచ్చినప్పటికీ గిరిజన స్త్రీలను చదువుకున్న గిరిజనేతరులు మోసంచేసి లాక్కోవడమనేది ఈ కథలో కనిపిస్తుంది.

వాడ్రేవు వీరలక్ష్మిగారు రాసిన మరో కథ 'బినామీ'. ఈ కథలో గిరిజనుల భూమిని బినామీ పేరుతో తీసుకొన్న ఫలితంగా గిరిజన స్త్రీ జీతం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడినప్పుడు తిరుగుబాటే పరిష్కారమని పరిష్కారాన్ని చూయించారు రచయిత్రి. ఈ కథ 'కొండఫలం' కథాసంపుటి లోనిది.

ఎ. విద్యాసాగర్ రాసిన 'భద్రాచలం మన్నెంకథలు' కథాసంపుటిలోని కథ 'భూమికోసం'. 1985వ సంవత్సరంలో కొత్తగూడెం దగ్గర పాడులో గిరిజనులకు ఉద్యానవనాలు ఏర్పరచే శిక్షణ గిరిజనుల భూమిలోనే ఏర్పాటు చేశారు. ఫారంలో, ఫారెస్టులో కలిసి పోయిన భూమికి నష్టపరిహారం లభించక, ఎప్పటికైనా భూమి తిరిగి ఇస్తారని ఆశించే గిరిజనుల స్త్రీల బాధల్ని వివరించే కథ భూమికోసం.

సాహు రాసిన 'కన్నీటికథ–నీటికథ', 'అడవిలో వెన్నెల' కథాసంపుటిలోని. ఈ కథ అడవుల్లో నివసించే గిరిజనుల నీళ్ళ కోసం ప్రాణాలు పోగొట్టుకోవటమే ఈ కథయందలి ప్రధాన ఇతివృత్తం. ఈ కథలో ప్రధాన పాత్ర నిండు చూలాలైన సుక్కుబాయి దట్టమైన అడవిలో గిరిజన తెగ బతుకు యాత్ర సాగిస్తూ ఉంటుంది. గిరిజన తెగ నీళ్ళకోసం పడే అవస్థలు వర్ణనాతీతం. గిరిజన గూడెంలో చిన్న చేదబావి కూడా ఉండదు. ఆవాసాలకు దూరంగా ఆమడ దూరం లోవుండే నీటి వనరుల దగ్గరకు వెళ్ళిన నిండు చూలాలైన గిరిజన స్త్రీ సక్కుబాయి జంతువుల దాడికి గురై ప్రాణాలు కోల్పోయిన దయనీయ స్థితిని వివరించిన కథ ఇది. గిరిజనులు ఏళ్ళ తరబడి నీళ్ళకోసం యుద్ధం చేస్తూనే ఉంటారు నిద్ర కళ్ళతో లేచి కొండ మీదకెళ్ళి సూర్యోదయానికల్లా గుట్ట దిగుతూనే ఉంటారు. చిన్నా పెద్దా, ముసలి ముతకా అనే భేదం లేకుండా అందరూ నీళ్ళ కోసం బాధలు పడుతుంటారు. ఈ కథ సాగేతీరు చివరికి కన్నీరు పెట్టిస్తుంది.

ఫణికుమార్ రాసిన 'రాకితల్లి' కథ వరదలలో నష్టపోయి, చేతినిండా పనిలేకుండా నివసిస్తున్న గిరిజనులు నిత్యం పూట గడవక జీవిస్తున్నారు. వీరు అడవిలో నివసించడం వల్ల వీరికి జంతువుల ప్రమాదం పొంచి ఉంది. ఎలుగుబంట్లు చేసిన దాడిలో రూపాన్ని కోల్పోయిన గిరిజన స్త్రీ రాకీ దీనగాథ. ఈకథ 'గోదావరి గాథలు' కథాసంపుటిలోనిది.

'ఆకలి' కథారచయిత సాహు. ఈ కథలో ప్రధాన పాత్ర అయిన జైతు అన్న జానన్న, భార్య సీత, పిల్లలు ముసలవ్వతో పాటు జీవిస్తుంటాడు. తిండి తినడానికి ఏమి లేక ఆకలితో జైతు కుటుంబం బాధపడుతుంటుంది. ముసలవ్వ అడవికి వెళ్లి తులసి జాతి గింజల్ని తీసుకొచ్చి జావ చేస్తుంది. అవ్వ జావను పొయ్యి దగ్గర పెట్టి నీళ్ళు తేవడానికి చెలమ దగ్గరకి పోతూ జావను జంతువుల నుండి కాపాడమని పార్వతికి చెప్తుంది. కానీ దారిలో అవ్వకు రాయి తగిలి నీళ్ళన్నీ కింద పడిపోతాయి. జావేమో కుక్కతాగేస్తుంది. కొడుకు కోడలికి పనిచేసేచోట జీతం ఇవ్వరు. ప్రభుత్వం ఎలాంటి సహాయం అందించదు. అవ్వ కొడుకుని కొమురంభీం దారిలో నడవమని బోధిస్తుంది. పోరాటం చేస్తేనే ఆకలి మంటలు చల్లారతాయని ప్రభోదిస్తుంది గిరిజనస్త్రీ.

'వందేళ్ళ తెలుగుకథ' కథాసంపుటిలో తుమ్మేటి రఘోత్తమరెడ్డిగారు 'పనిపిల్ల' కథ రాశారు. ఈ కథ దారిద్ర్యంలో మునిగి తేలుతున్న గిరిజనులు వారి పిల్లలు భూస్వామిక వర్గంపై తిరుగుబాటు చేసి తిండిగింజలు సంపాదించుకోవడం కనిపిస్తుంది. గిరిజనులు నివాసముంటున్న కొండప్రాంతంలో గిరిజనేతరులు తట్టాబుట్టలతో వచ్చి, నివాసాలు ఏర్పరచుకుని, కొన్ని రోజుల్లో నే షావుకార్లుగా మారిపోతున్నారు. వారిలో యశోదమ్మ కుటుంబం ఒకటి. ఈమె భర్తకు రాజకీయంలో పలుకుబడి బాగావుంది. ఈమె తమ్ముడైన కృష్ణారెడ్డి స్నేహితుడు మహేంద్ర పనిపిల్ల కావాలనీ గిరిజనుల అమ్మాయిని తీసుకుపోవడానికి యశోదమ్మ ఇంటికి వస్తాడు. మహేంద్ర భార్య ఉద్యోగం చేస్తుంటుంది. అతని భార్య ఎప్పుడూ అతనిపై గొడవ పడుతుంటే పనివల్ల విసుగ్గా ఉంటుందేమోనని పనిపిల్ల చేదోడువాదోడుగా ఉంటే సమస్య పరిష్కారమవుతుందని భావించి, యశోదమ్మ పిండిమిల్లులో నాయకపు తెగకి చెంది, ఆకలితో అలమటిస్తున్న ఎండిపోయిన బలహీనమైన ఒక అమ్మాయిని పనిపిల్లగా మహేంద్ర తీసుకువెళ్తాడు. ఆకలి దరిద్రంతో దుర్భర జీవితం సాగిస్తున్న గిరిజనులకి అన్నల అండ దొరకడంతో, గిరిజనులందరు ఏకమై శ్రమదోపిడి చేసిన షావుకార్ల ఇళ్లపై దాడిచేసి ఇళ్లు కొల్లగొడతారు. ఆ సమయంలో మహేంద్రమేల్కొని చూస్తాడు. దోపిడీ చేయడానికి వచ్చిన వాళ్ళలో పనిపిల్ల కూడా ఉంటుంది. దారిద్ర్యంలో మునిగి తేలుతున్న గిరిజనులు వారి పిల్లలు భూస్వామిక వర్గంపై తిరుగుబాటు చేసి తిండిగింజలు సంపాదించుకొన్న తీరును రచయిత చిత్రించారు.

ఉప్పల నరసింహం 'బియ్యం' కథ, 'ఎర్రలైటు' కథాసంపుటిలోనిది. తాగుడుకు బానిసైన భర్త చాలీచాలని సంపాదనతో కుటుంబ భారాన్ని మోస్తున్న ఎరుకల

జాతికి చెందిన పాపమ్మ, పూట గడవటానికి పడుతున్న కష్టాల చెలియజేస్తుంది ఈ కథ. అనారోగ్యంపాలైన పాపమ్మ పుస్తెను కుదువ పెట్టి 50 రూ. తెచ్చుకుంటుంది. నారాయణరెడ్డిని ఆ పుస్తెపైనే మరల 50 రూ. ఇవ్వమనగా, నారాయణరెడ్డి వస్తువుని అమ్మేశాననీ, ఆ వస్తువుపై ఆమె భర్త తమ్మయ్య తాగుడికి డబ్బు తెచ్చుకున్నాడనీ, వస్తువు ఖరీదుకంటే ఎక్కువ డబ్బు బాకీ ఉన్నారనే విషయం చెప్తాడు. ముగ్గురు పిల్లల ఆకలి తీర్చడానికి బదులుగా బియ్యం ఎవరిని అడగాలనేది ఆమె ముందున్న సమస్య.

'యాడి' కథను గీతాంజలి రాశారు. ఈ కథ 'బచ్చేదాని' కథాసంపుటిలోనిది. పేదరికం కారణంగా ఒక లంబాడీ కుటుంబం పదేళ్ళ పాపైన చిట్టిని ఉద్యోగస్తుల ఇంట్లో పనిచేయడానికి పెట్టడంతో, ఆ పాప పడే కష్టాలు, తల్లిని చేరుకోడానికి చేసే ప్రయత్నాలు మనకు కంట తడిపెట్టిస్తాయి.

'రక్తపింజెర' కథను సాహు రాశారు. ఈ కథ 'అడవిలో వెన్నెల' కథాసంపుటిలోనిది. శిడాంశిత్రు భార్య మల్కుబాయి. వీరికి ఒక కూతురు. వీరు తినడానికి తిండిలేక, కట్టుకోడానికి గుడ్డల్లేక చలికి కప్పుకోడానికి దుప్పటిలేక జీవిస్తుంటారు. శిడాంశిత్రు భార్యకు చీరైనా కొనివ్వాలని ఆశపడి, బొంగు కొట్టించే సూపరువైజరు దగ్గర వంద రూపాయలు అప్పు తీసుకొని సంతకెల్లి చీరకొని తెస్తానని భార్యకు చెప్తాడు. మల్కుబాయి కూతురితో కలిసి రోడ్డుపనికి వెళ్తుంది. కూలీలందరు రోడ్డు వేయడానికి అడ్డంగా ఉన్న పెద్ద బండని తొలగిస్తారు. దానికిందున్న రక్తపింజెర మల్కుబాయిని కుడుతుంది. పర్ధాన్ లు పసర్లుపోసి మంత్రాలు చదువుతారు. పాములవాడిచ్చిన తేజాబు (ఆమ్లం) తెస్తారు. దాన్ని శర్మ చూడాలని ఎడమచేతిపై పోసుకోవడంతో అతని చేయికి పుండవుతుంది. మందు అందక మల్కుబాయి మరణిస్తుంది. కష్టం తప్ప సుఖం ఎరగని గోండు స్త్రీమల్కుబాయి ఆ కష్టంలోనే విషపాము వల్ల ప్రాణాలు వదలడం దురదుష్టం.

గిరిజనేతరుల మోసం:

గిరిజన సమాజాల్లో స్త్రీలు నిరక్షరాస్యులు, అమాయకులు, నిరంతరం వ్యాపార నిమిత్తం, అటవీ పరిరక్షణ నిమిత్తం, ప్రాజెక్టుల నిర్మాణ పథకాల కోసం వస్తున్న గిరిజనేతర ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు గిరిజన స్త్రీలను మోసం చేయడం వల్ల గిరిజన స్త్రీలు వారి చేతిలో మానప్రాణాలు కోల్పోతున్నారు. గిరిజన

స్త్రీలను గిరిజనేతరులు ప్రేమించినట్లు నటించి బినామీ పేరుతో వారి భూములను తీసుకుంటున్నారు.

'కోయకన్నె' కథను ఎ. విద్యాసాగర్ రాశారు. గిరిజన ప్రాంత వాసుల్ని విద్యావంతుల్ని చేయాలని ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేసింది. విద్యాబుద్ధులు చెప్పవలసిన బాలకృష్ణ అనే టీచరు, కోయకన్య రాజమ్మను వివాహం కాలేదని నమ్మించి, ఒక బిడ్డ తల్లినిచేసి, నష్టపరిహారంగా రాజమ్మ కూతురు పేర 10,000 రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి కూతుర్ని ఎప్పుడైన చూడొచ్చుగానీ, రాజమ్మతో ఎలాంటి సంబంధం ఉండదనే తీర్పువల్ల తప్పు కట్టేసి గిరజనేతరుడు వెళ్లిపోతే, కోయ స్త్రీ మళ్లీ పెళ్లి చేసుకోవచ్చు. కానీ గిరిజనేతరుడు తప్పు కట్టెయ్య గలిగితే ఎంతమంది కన్యల జీవితమైనా బలికావాల్సిందేనా అనేది సమాధానం లేని ప్రశ్నగా మిగిలిపోతుంది. కోయస్త్రీ మోసపోయిన యథార్థ గాథను ఇతివృత్తంగా రచయిత చిత్రించారు.

గిరిజన స్త్రీకి పుట్టిన బిడ్డలకు తండ్రిగా బాధ్యత వహించని గరిజనేతరుడైన భూషయ్య అహంకారాన్ని అణచిన గిరిజన స్త్రీ జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకొని వాడ్రేవు వీరలక్ష్మీదేవి 'పేరెంట్' కథ రాశారు. గిరిజనుల భూమిని ఆక్రమించిన భూస్వామి భూషయ్య గిరిజన నివాసాలకు దగ్గరలో నివసిస్తుంటాడు. భర్త చనిపోయిన గిరిజన స్త్రీ భూషయ్య ఇంట్లో పాచిపని చేస్తుంది. ఈమెను భూషయ్య లొంగదీసుకుంటాడు. ఫలితంగా ఈమెకు బాలమ్మనే కూతురు పుడుతుంది. స్కూలు వార్షికోత్సవానికి అతిథిగా వచ్చిన భూషయ్యే తన తండ్రని తెలుసుకుని సిగ్గుతో, బాధతో అవమానంతో బాలమ్మ ఏడుస్తుంది. బాలమ్మ ఇంటర్మీడియట్ వరకు చదివి గ్రామ మునసబు సాయంతో వి.ఏ.ఓ పోస్టుకి పరీక్షరాసి ఉద్యోగం సంపాదించి, భూషయ్య ఆక్రమించుకున్న 50 ఎకరాల భూమిని పిటిషన్లు పెట్టి గిరిజనులకు చెందేలా చేస్తుంది. నువ్వు 'నాన్ ట్రైబల్ 'కూతురివి'' అని బెదిరిస్తాడు. బాలమ్మ భూషయ్యను తండ్రిగా అంగీకరించక, ఏమైనా చేసుకోమని చెప్పివెళుతుంది. వి.ఏ.ఓ ఉద్యోగం ఇక అవసరం లేదని రాజీనామా చేసి, టీచరుగా పాఠశాలలో పనిచేస్తుంది.

'ఎర' కథలో రాజకీయ రంగంలో పోటీ చేయడానికి పార్టీ టికెట్టు ఆశచూపి గిరిజన బాలిక మైనా శీలాన్ని దోచుకున్న తీరు, ఫలితంగా ఒక బిడ్డకి తల్లై, పిచ్చిదై,

తండాకి దూరమైన గిరిజన యువతి దీనగాథను రచయిత బోయ జంగయ్యగారు చిత్రించారు.

'నెత్తురుకూడు' కథను జాతశ్రీ రాశారు. ఇది 'ప్రభంజనం' కథాసంపుటిలోనిది. అడవిలో కట్టెలు తెచ్చుకోవడానికి వెళ్లిన గిరిజన యువతి తానంగిని అడవికి కాపలావుండే చౌకీదారు చేతిలో లైంగిక దోపిడీకి గురవుతుంది. ఆమె తండ్రి జొన్నయ్య కోయదొర వరదయ్యను, గూడెం పటేలు ఎంగలయ్యను తన బిడ్డకు న్యాయం చేయమని అడుగుతాడు. అందరూ చౌకీదారు ఇంటికి న్యాయంకోసం వెళ్లతారు కానీ ఆ చౌకీదారు కూలి ధర 5 రూపాయలు పెంచడంతో కరువు రోజుల్లో పనిదొరకడం ఆకలి మంటలతో బాధ పడుతున్న వారికీ తానంగి విషయం అడగాలనిపించక అడగలేకపోతారు. కూలీరేటుతో గిరిజనుల నోరు నొక్కిన తీరు, దానివల్ల గిరిజన స్త్రీకి అన్యాయం జరిగిన విధానం కనిపిస్తుంది.

పి.చంద్ రాసిన 'హత్య' కథలో మానభంగానికి గురై హత్యచేయబడిన ఆదివాసి జంగుబాయి కన్నీటి కథ, గిరిజనులపై జరుగుతున్న హత్యలు ఎవరు చేశారో, ఎందుకు చేస్తున్నారో తెలియని పరిస్థితులను ఈ కథ వివరిస్తుంది. హత్యకథ 'భూనిర్వాసితులు' కథా సంపుటిలోనిది.

పడుపువృత్తి:

మహిళలు వ్యభిచారంలకి నెట్టబడటానికి ప్రధాన కారణం పేదరికం. కుటుంబ పోషణ భారం, కరువు ఏర్పడటం, చేతివృత్తులు నశించటం వల్ల బలవంతంగా వ్యభిచారంలోకి నెట్టబడుతున్నారు. గిరిజన ఆడపిల్లలు బొంబాయివంటి పెద్ద పట్టణాలలో వ్యభిచారకేంద్రాలకు అమ్మబడుతున్నారు. పేదరికాన్ని జయించడానికి మాత్రమే గిరిజనస్త్రీలు వ్యభిచారులుగా మారుతున్నారు.

'బురద' కథను అల్లం రాజయ్య రాశారు. ఈ కథ 'శ్వేతరాత్రులు' కథాసంపుటిలోనిది. కొండమీదకి పెట్టుబడిదారి పరిశ్రమ విస్తరించి కృత్రిమ కరువు సృష్టించింది. అడవిలో నివసించే మనుషులు అడవిపై ఆధారపడి జీవిస్తుంటే అడవి అంతరిస్తుందని అక్కడున్న గిరిజనుల్ని బయటకు తరిమారు ఫారెస్టు అదికారులు. ఫలితంగా పట్టణాలకు వలస వచ్చిన గిరిజన స్త్రీ గోందుబాయి మాట్లాడేవారులేక

పొట్టకూటికోసం దారి తప్పుతుంది. మూడురోజుల పసికందును బిడ్డలు కోల్పోయిన రైతు దంపతులకు 50 రూపాయులకు అమ్మేస్తుంది. గోండు యువకుడు అమెను గుర్తించి తమతో తీసుకెళ్లాలనుకుంటాడు కానీ ఆమె కనిపంచదు. ఎవరూ రక్షించలేని పట్నం బురదలో కూరుకుపోతుంది ఆ స్త్రీ.

ముదిగంటి సుజాతరెడ్డి రాసిన కథ 'బేరం'. ఈ కథ 'విసుర్రాయి' కథాసంపుటిలోనిది. పట్నంలో పని ఉంటుంది డబ్బు బాగా సంపాదించుకోవచ్చని నమ్మబలికిన భద్రయ్య, పెళ్ళైన కొంతజంట మల్లన్న, లక్ష్మిని పట్నం తీసుకువెళ్ళి, పట్నం అంతా చూయిస్తానని తీసుకెళ్లి, భద్రయ్య లక్ష్మిని ఐదువేలకు అమ్మేస్తాడు. మల్లన్నకు మూడు వేలు చేతిలోపెట్టి ఎద్దులు కొనుక్కుని సేద్యం చేసుకోమనీ, ఎవరైనా అడిగితే లచ్చి ఎవరితోనో లేచిపోయిందని చెప్పమంటాడు. అంతేగాక పెళ్ళాంపోతే మరల కట్నం తీసుకొని పెళ్లి చేసుకుని డబ్బు సంపాదించవచ్చనీ ధైర్యం చెప్తాడు. మల్లన్న చేతిలోని మూడువేలపై మమకారం లచ్చిని మర్చిపోయేలా చేస్తుంది. లచ్చిబదులు కాడెద్దులు కంటి ముందుమెరుస్తాయి. భార్యను వ్యభిచారగృహాలపాలు చేసిన స్వార్థబుద్ధి కనిపిస్తుంది.

ఆడపిల్లపుట్టుక:

మహిళ మానవ సమాజాభివృద్ధిలో ప్రధాన భూమికను పోషిస్తుంది. గిరిజనులను పేదరికం వెంటాడి వేటాడుతుంది. పూట గడవక పస్తులు పడుకుంటున్నప్పుడు మగ సంతానం కావాలని, వంశోద్ధారకుడ్ని ఇవ్వకపోతే మరో వివాహం చేసుకుంటామని పురుషులు స్త్రీలను వేధిస్తుంటారు. సంపాదన లేని కుటుంబంలో పిల్లల్ని పెంచడం కష్టమై ఆడశిశువులను గొంతునులిపి చంపుతున్నారు. లేకుంటే అమ్ముకుంటున్నారు. కుటుంబ పోషణకోసమే ఆడశిశువుకు జన్మనిస్తారు. బిడ్డను అమ్ముకున్న తల్లులు దుఃఖాన్ని దిగమింగుకుని జీవిస్తుంటారు.

'ఇప్పపూలు' కథా రచయిత బోయ జంగయ్య. అడవితల్లి ఒడిలో వాగెమ్మటే వున్న ముంద్రాయితండాలో లంబాడీలు, చెంచులు జీవిస్తుంటారు. ఈ తండాలో నివసించే లచ్చిమికి ముగ్గురు కూతుర్లు. పెద్ద కూతురు వివాహం కుదరడం వల్ల చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో ఆమె భర్త లచ్చినాయక్ సంవత్సరం వయస్సున్న చిన్న

పాపను, వెయ్యిరూపాయలకు అమ్మేసి, జంతువు ఎత్తుకుపోయిందని చెప్తాడు. పక్క తండాలోకూడా పాపను జంతువు ఎత్తుకుపోతుంది. పెళ్ళైన పెద్దకూతుర్ని అత్తగారింటి నుండి పుట్టింటికి తీకుసొస్తుండగా మధ్యలో ఎలగొ కనిపించి తమ చెల్లెలని తినేసిందనీ లచ్చినాయక్ కూతుర్లు ఏడుస్తారు. లచ్చీనాయక్ కూడా ఏడుస్తాడు. జీవనం గడపడంకోసం ఆడపిల్లలను అమ్ముకోవడం వీరి జీవితంలో భాగమవుతుంది.

సంస్కృతి-ఆచారం:

గిరిజనులు తనకంటూ ఒక సంస్కృతిని కలిగివున్నారు. ఆ సంస్కృతిలో భాగంగా ఆచార సంప్రదాయాలు అనుసరించాలి. ఆచార సంప్రదాయాలు పాటించడానికి ఆర్థికంగా వెసులుబాటు లేకపోయినా అప్పుచేసైనా సరే ఆచరిస్తారు. ఫలితంగా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

గిరిజనులకు చట్టాలు తెలియవు. వారికి అవసరం అనిపిస్తే ఇద్దరు స్త్రీలను వివాహం చేసుకుంటారు. గిరిజనులు నివసించే ప్రాంత పరిసరాలను బట్టి వారు అనుసరిస్తున్న వివాహ పద్ధతిని ఎ. విద్యాసాగర్ 'ఇద్దరుండాలా సారు' కథలో వివరించారు.

'వాళ్ళ అల్లుళ్ళూ వద్దూ – కోడళ్ళూ వద్దూ' కథను ఫణికుమార్ గారు రాశారు. గిరిజనుల అమ్మాయిల్ని గిరిజనేతరులు వివాహం చేసుకున్నా, గిరిజనేతర అమ్మాయిల్ని గిరిజనులు వివాహం చేసుకున్నా నష్టపోయేది గిరిజన స్త్రీలేనని ప్రాజెక్టాఫీసరు ద్వారా తెలుకుకున్న వ్యక్తిలో మార్పు వచ్చిన వివాహం మాత్రం జరగడం ఈ కథలో కనిపిస్తుంది.

గోపి భాగ్యలక్ష్మి రాసిన 'జంగుబాయి' కథ ఆదివాసి జీవితానికి దర్పణం. గిరిజన స్త్రీలు ఆచార సంప్రదాయం ముసుగులో పడే బాధలను, గోండుల జీవిత సంప్రదాయాలు, అవి వాళ్ళ జీవితానికే ఆటంకాలుగా తయారైన తీరుతోపాటు స్త్రీలలో కొత్తతరంవాళ్ళు పితృస్వామ్య సంకెళ్ళ నుంచి బయటపడాలనే తపన, అక్కడ రాజ్యమేలుతున్న అస్పృశ్యతలాంటి రుగ్మతలు, షావుకార్ల వడ్డీ లెక్కలతో గోండులు తమ భూములను కోల్పోవడం లాంటి వాస్తవాలను కూడా ఈ జంగుబాయి కథ చిత్రిస్తుంది. ఈ కథ 'శ్వేతరాత్రులు' కథాసంపుటిలోనిది.

ప్రభుత్వ పథకాలు:

గిరిజన సంక్షేమంకోసం ప్రభుత్వం పథకాలు ప్రవేశ పెట్టింది. అయినా అవి గిరిజనుల అభివృద్ధికి దోహదపడకపోగా మరింత ఆర్థికలోటు అనుభవించేలా చేస్తున్నాయి. గిరిజనాభివృద్ధి కోసం ప్రవేశ పెట్టిన పథకాలు అమలులో చిత్తశుద్ధి లోపించడం, అవినీతి వల్ల పథకాల ఫలాలు గిరిజనులకు అందకపోవడం జరుగుతుంది ప్రభుత్వం ఏర్పాటు చేసే పథకాలు అమలు కావాలంటే గిరిజనులకు ప్రాథమికంగా కొంత ధనం ఉండాలి. ఉదాహరణకు గృహపథకం. ముందు ఇల్లు కట్టి చూపిస్తే ప్రభుత్వం డబ్బులిస్తుంది. కట్టడానికి డబ్బులుంటేనేగదా వాళ్లు ఆ పథకాన్ని వినియోగించుకొనేది. 'సంబూ అక్క' కథా రచయిత ఫణికుమార్. ఏటూరు నాగారం ప్రాంతంలోని గిరిజనులకు వైద్య సౌకర్యాలు అందుబాటులో లేక వారు పడుతున్న కష్టాలు ఇతివృత్తంగాగల కథ సంబూ అక్క.

'శాపలు దాగితే సెరువెండుద్దా సారూ?' కథా రచయిత ఎ. విద్యాసాగర్. పాల్వంచ ఐ.టి.డి.ఎ గిరిజనాభివృద్ధి సంస్థ గిరిజన సంక్షేమానికి ప్రవేశపెట్టి పథకాలు వల్ల అడవులు అంతరిస్తున్నాయని ఐ.టి.డి.ఎ. అధికారి అంటాడు. దానికి గిరిజన మహిళ చెప్పిన సమాధానాన్ని ఈ కథలో తెలియజేశారు. గూడేలకి దగ్గరగా వెదురు డిపోలుంటే బాగుంటుంది. డిపోలు కొండ కింద ఉన్నాయి. దీనివల్ల గిరిజనులకు డిపో నుండి వెదురు తీసుకోవడం అంటే కొండకు కట్టెలు మోయడంలాంటిదనీ, డిపోలు కొండకింద ఉండడం వల్ల వచ్చే నష్టాన్ని గిరిజన స్త్రీ వివరించడాన్ని ఎ.విద్యాసాగర్ 'కొండకు కట్టెలు మొయ్యమంటరా.. సారూ?' కథలో తెలియజేశారు.

నక్సలైట్లతో సంబంధం:

గిరిజనేతరులు ఉద్యోగాలు, వ్యాపార నిమిత్తం ప్రవేశించి గిరిజనులను దోపిడీ చేస్తున్నారు. గిరిజనులను నక్సలైట్లకి ఆశ్రయమిస్తున్నారని పోలీసులు, అడవిలో కలపను కొట్టి అడవిని అంతరింప జేస్తున్నారని అటవీశాఖాధికారులు జైలుపాలు చేస్తున్నారు. గిరిజనులకు అప్పులిస్తూ వడ్డీల మీద వడ్డీలు తీసుకుంటూ షావుకార్లు గిరిజనుల భూమిని ఆక్రమిస్తున్నారు. శ్రమ దోపిడీ కూడా చేస్తున్నారు. వీరిని ఎదురించడానికి గిరిజనులు నక్సలైట్లుగా కూడా మారుతున్నారు.

బి.ఎస్.రాములు రాసిన 'అడవిలో వెన్నెల-2' కథ 'నేలతల్లి విముక్తికోసం' సంకలనంలోనిది. 1985 సంవత్సరంలో షోలాబు గూడెంలో జరిగిన యథార్థ

గాథఇది. రూపులమ్మ భర్త మల్లుదొర. కొడుకు అ ఏప్పడు. కూతురు బాలవ్వ. పొద్దంతా కష్టపడి పనిచేస్తేగానీ కదుపునిండదు. ఒంటి నిండా దారిద్ర్యంతో నివసించేవీరిపై పోలీసులు దాడి చేస్తారు. గూడెంలో రాజులుభార్య పార్వతిపై పోలీసులు సామూహిక అత్యాచారం చేస్తారు. గిరిజనుల్లో దాగివున్న పోలీసు భయాన్ని నక్సలైట్స్ పోగొడతారు. ఇంటిపని, కూలిపని చేయడంలో అడవిలో అన్నలను రక్షించడంలో ఎండ, చీకటి ఏదీ స్త్రీకి అడ్డుకాదని నిరూపించే కథ ఇది.

గిరిజన మహిళలు కూలిపని, ఇంటిపనితో సతమవుతూ, భర్త ఆర్థిక ఆసరా లేకపోతే కుటుంబ పోషణ ఆమెపైనే పడుతుంది. పిల్లల పోషణార్థం వ్యభిచారం చేయడానికీ, లేదా ఆడపిల్లలను అమ్మడానికి కూడా వెనకాడని పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. పెళ్లిపేరుతో గిరిజనేతరుల వలలో పడి మోసపోతున్నారు. గిరిజనులు ఆచారాలు సంప్రదాయాలు వల్ల మానసిక, శారీరక హింసలకు గురవుతున్నారు. అప్పుడప్పుడు ప్రకృతి కన్నెరచేస్తుంటుంది. అంతేగాక క్రూరజంతువుల దాడికి కూడా గురవుతున్నారు. గిరిజనేతరులు గిరిజన స్త్రీలను కులాంతర వివాహాల పేరుతో, బినామీల పేర్లతో, దొంగ కుల ధ్రువీకరణ పత్రాలతో చేసే మోసం పోవాలంటే గిరిజన స్త్రీలకు విద్యావకాశాలు లభించినప్పుడే సాధ్యమవుతుంది.

ఉపయుక్త గ్రంథసూచి

1. కాత్యాయనీ విద్మహే. సంప్రదాయ సాహిత్యం–స్త్రీవాద సాహిత్యం, వరంగల్ : స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ, 1998.
2. గీతాంజలి, బచ్చేదాని (కథలు), హైదరాబాదు: గోదావరి ప్రచురణలు, 2003.
3. గోపి, ఎన్. తిరుమలరావు, జయధీర్, తెలుగుకథ, హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం, 1999.
4. జంగయ్య, బోయ, అడవిపూలు, హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2005.
5. జంగయ్య, బోయ, ఇప్పపూలు, నల్గొండ: ప్రగతి పబ్లికేషన్స్, 2003.
6. జాతశ్రీ ప్రభంజనం, ఖమ్మం, 1982.
7. తిరుమలరావు, జయధీర్, జీవన్, ఇప్పపూలు (గిరిజన సంచారతెగల కథలు), ఖమ్మం: ప్రతిభా ప్రచురణలు, 2009.

8. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి, తెలంగాణ సాహిత్య చరిత్ర, హైదరాబాదు: తెలుగు అకాడమి, 2012.

9. పద్మారావు, కత్తి, భారతీయ సంస్కృతిలో స్త్రీ. పొన్నూరు: లోకాయుత ప్రచురణ, 1996.

10. ఫణికుమార్. గోదావరి గాథలు, గుంటూరు: శ్రీనాథపీఠము, 1989.

11. మల్లయ్య, కాలువ. నూటపదేళ్ళ తెలుగు కథావిభిన్న ధోరణులు, హైదరాబాదు: తెలుగు అకాడమి, 2012.

12. రాంబాబు, నూనావత్. తెలుగు గిరిజన కథలు–వస్తు శిల్ప వైవిధ్యం. అముద్రిత పరిశోధన గ్రంథం. హైదరాబాదు విశ్వవిద్యాలయం, 2012.

13. రాజయ్య, అల్లం. కథా కెరటాలు. (విరసం కథలు). విజయవాడ: విరసం ప్రచురణ, 2001.

14. రామారావు, కాశీపట్నం. శ్వేతరాత్రులు. ప్రచురణ–4. హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్, 1993.

15. విద్యాసాగర్, ఎ.భద్రాచలం మన్నెం కథలు. హైదరాబాద్: ప్రియదర్శిని ప్రచురణలు, 1993.

16. వీరలక్ష్మి, వాడ్రేవు. కొండఫలం. హైదరాబాదు: శ్రీప్రచురణ, 2009.

17. వీరలక్ష్మీ, వాడ్రేవు. కొండఫలం. హైదరాబాదు: శ్రీప్రచురణ, 2009.

18. శైలమ్మ,జి. తెలుగు కథాసాహిత్యం–గిరిజన జీవితం.కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయం, 2011.

19. సాహు. అడవిలో వెన్నెల. కరీంనగర్: కరీంనగర్ బుక్ ట్రస్ట్, 1985.

20. సుజాతారెడ్డి, ముదిగంటి. విసుర్రాయి. హైదరాబాదు: రోహణం ప్రచురణలు, 2001.

17. బంజార వివాహ వ్యవస్థలో సాంస్కృతిక రూపాలు

శ్రీమతి ధరావత్ సునీత

ఉపోద్ఘాతం:

భారతదేశానికి ఆర్యులు ఆసియా మధ్యభాగం నుండి రాక పూర్వమే ద్రావిడులు వచ్చారని, ఆ ద్రావిడులు రాక పూర్వమే మన దేశంలో ఉన్న వారిని ఆదివాసులంటారని చరిత్రకారుల అభిప్రాయం. భారతదేశంలో మొత్తం జనాభాలో దాదాపు 7% ఆదిమ జాతులు ఉన్నట్లు చెప్పబడింది. భారత ప్రభుత్వం 1950 సం॥లో 571 ఆదిమ జాతులని S.T. (Schedule Tribes) లుగా గుర్తించింది.

మన సంస్కృతిలో మూడు రకాలైన దశలు కనిపిస్తాయి. అవి.

1. అరణ్య జీవన స్థితి 2. అనాగరిక స్థితి 3. నాగరిక స్థితి.

వీటిలో జానపదులు అనాగరిక స్థితికి చెందిన వారు కాగా, గిరిజనులు ఆటవిక స్థితికి చెందిన వారు. ఇప్పటివరకు భారత ప్రభుత్వం గుర్తించిన గిరిజన తెగలు 35. అందులో బంజార తెగ ఒకటి".

బంజారా:

బంజారులు భారతదేశంలోని రాజస్థాన్ ప్రాంతానికి చెందినవారు. రాణా ప్రతాప్ సింగ్ మరణానంతరం వారు నిరాశ్రయులైనారు. బతుకు కష్టమై జీవనోపాధి కోసం అడవుల్లోకి రావడం జరిగింది. చాలా కాలం అడవుల్లోనే నివసించారు. పొట్టకూటి కోసం పశువులను పెంచుకున్నారు. ప్రతి బంజారా కుటుంబానికి చాలినంత పశుసంపద పెరిగింది. వీరు తమ పశుసంపదతో పాటుగా తమ మాతృభూమి అయినా రాజస్థాన్‌లోని 'పహాడ్' అనే ప్రదేశాన్ని వదిలి **"మాళ్వ"** వైపు పయనించారు. ఆ సమయంలో వీరు తప్పని పరిస్థితిలో మొగలులుకు సేవలు చేయవలసి వచ్చింది.

"వీరు మొగులులకు, వారి సైన్యానికి ఆహార ధాన్యాలను, యుద్ధ సామగ్రిని సరఫరా చేసేవా''రని 'షేర్ సింగ్ షేర్' అనే ఆంగ్ల కవి పేర్కొన్నారు.

బంజార అనే పదం జానపదుల ప్రకారం "భణ్ జారే" అనే హింది పదం నుండి వచ్చింది. అంటే వలస వెళ్ళేవారని అర్థం. వీరు పూర్వం ఆహార పదార్థాలను బస్తాలలో నింపి ఎడ్ల వీపుల మీద వేసుకుని ఊరూరు తిరుగుతూ అమ్మేవారని ఆ రకంగా వీరికి **'బంజారా'** లనే పేరు వచ్చిందంటారు. వీరిని వివిధ ప్రాంతాల్లో వివిధ రకాలుగా పిలుస్తారు. ఆంధ్ర దేశంలో మూడూ ప్రాంతాల్లో విభిన్నంగా పేర్కొంటారు. తెలంగాణాలో లంబాడీలని, రాయలసీమ, ఆంధ్రాల్లో సుగాలీలు/బంజారులని వ్యవహరిస్తారు.

వివాహవ్యవస్థ:

పెళ్ళంటే సందడి, సంతోషం. ఒక మగాడికి ఒక స్త్రీతో జరిగే తంతును పెళ్లి అంటారు. సృష్టి ఆరంభం నుండి ఇప్పటి వరకు కొన్ని కోట్లాను కోట్ల పెళ్ళిళ్ళు జరిగాయి. పెళ్ళికి కారణం ఉపయోగం, పరస్పరం సహాయ సహకారాల కోసం, పనిపాటలు చేసుకోవడంలో తోడ్పడడానికి చేసుకున్న ఒక ఏర్పాటు. ఈ పెళ్ళి జంటలు ఒకరు పొలంపని చేస్తే, ఒకరు ఇంటి పని చేస్తుంటారు. ఒకరు కట్టెలకు పోతే, మరొకరు నీళ్ళకు పోతారు. సహకారం కావలసి వచ్చినప్పుడే ఒక వ్యక్తి సహాయం కోసం ఎదురు చూస్తుంటారు. అదే వివాహానికి నాంది అయిందని చెప్పవచ్చు.

"వివాహ వ్యవస్థకు, అభివృద్ధికి పునాది పూర్వకాలమని చెప్పవచ్చు. ప్రధానంగా మానవ జాతి జీవన క్రమ సరళికి అనువైనది పెళ్లి. హిందూ వివాహ వ్యవస్థలో అష్టవిధ వివాహ పద్ధతులున్నాయి. అవి. 1) బ్రహ్మ వివాహం 2) దైవ వివాహం 3) ఆర్ష వివాహం) ప్రజాపత్య వివాహం 5) అసుర వివాహం 6) గాంధర్వ వివాహం 7) రాక్షస వివాహం 8) పైశాచిక వివాహం. వీటిలో బ్రహ్మ, దైవ, ఆర్ష, ప్రజాపత్య వివాహాలు నాలుగు శ్రేష్ఠమైనవనే భావన ఉంది. కారణం 'కన్యను' అలంకరించి వరునికి దానం చేయడం."

బంజారా వివాహపద్ధతి:

హిందూ వివాహం లాగే తాండా సంస్కృతిలో బంజారాల వివాహ సంప్రదాయం చాల ముఖ్యమైనది. వీరు కొన్ని శతాబ్దాల కాలం నుండి తమ ఆచారాలను

రక్షించుకుంటూ వస్తున్నారు. పూర్వం సంచారా జీవులైన వీరు సంవత్సరంలో నాలుగు/ఐదు నెలల కాలం పాటు వ్యాపారం కోసం వివిధ ప్రాంతాల్లో ఉండేవారు. ఈ కారణం మూలంగానే అనేక తాండాలు నిర్దిష్టమైన స్థలాల్లో నిర్మింపబడి స్థిరంగా ఉండేవి కావు. స్థిరంగా ఉండకపోయినా వీరు తాండా వారితో వివాహ సంబంధాలు ఏర్పాటు చేసుకునేవారు. వీరి వివాహాల్లో కొన్ని ప్రత్యేకతలుంటాయి. ఇవి సాధారణంగా ఈనాడు కన్పించే ఒక రోజు పెళ్ళిళ్ళు కావు. పూర్వం నెలల కొద్ది ఈ సంబరాలు జరిగేవి. ఇప్పుడు 10/15 రోజుల వరకు అక్కడక్కడ జరుగుతున్నాయి. అందులో ప్రధానంగా ఏడు **(7) రోజుల పెళ్ళి (సాత్ దాడేర్ నొక్తా), మూడు రోజుల పెళ్ళి (తీన్ దాడేర్ నొక్తా)**. వీరు వివాహంలో కనిపిస్తాయి. ఈ సంబరాలు రాత్రి వేళ 8-00 గంటలకు ప్రారంభమై, తెల్లవారు జామున 3-00 గంటల వరకు జరుగుతాయి. వీరి పెళ్లిళ్లలో అడుగడుగునా పాటలు కనిపిస్తాయి. వీటిలో కొన్ని నృత్య ప్రాధాన్యం కలిగి ఉంటాయి. మరికొన్ని కార్యకలాపాలతో ముడిపడినవిగా ఉంటాయి.

ఒక రకంగా చెప్పాలంటే హిందూ వివాహాల్లోని వేదమంత్రాల స్థానాన్ని వీరి పాటలు ఆక్రమించాయని చెప్పవచ్చు. బంజారాలు పార్వతీ పరమేశ్వరుల్ని, సీతారాముల్ని ఆదర్శంగా భావిస్తారు. కాని మారుతున్న నేటి ప్రపంచీకరణలో వీరి పెళ్లి పద్ధతిలో కూడా మార్పులు వచ్చాయి. తాండా నాయకుని ఆధ్వర్యంలో జరిగే వీరి పెళ్ళిళ్ళు నేడు హిందూ సంప్రదాయం ప్రకారమే బ్రాహ్మణుడి ఆధ్వర్యంలో వేద మంత్రాల సాక్షిగా జరుగుతున్నాయి. వీరి వివాహ పద్ధతుల్ని కింది విధంగా తెలుసుకోవచ్చు.

1) సంబంధాల ఏర్పాటు (సగాయి).

ఏ వివాహ వ్యవస్థలోనైన నిశ్చితార్థం ముఖ్యం. అలాగే బంజారాల వివాహాల్లో మొట్టమొదటి ఘట్టం సంబంధాల ఏర్పాటు. వీరిలో ప్రధానంగా నాలుగు గోత్రనామాలున్నాయి వారు పమార్, రాఠోడ్, చౌహన్, జాదవ్/వడిత్యా అనేవి ప్రధాన గోత్రాలు. వీరు సగోత్రికులను కాకుండా వేరే గోత్రికులను పెళ్లి చేసుకుంటారు. మిత్రుల సహాయ సహకారాలతో సంబంధాలు ఏర్పాటు చేసుకుంటారు. మంచిరోజు చూసి అమ్మాయి, అబ్బాయిల తరుపున ఉన్న పెద్దలు మాట్లాడుకుని తండా నాయకుని ఆధ్వర్యంలో పప్పన్నం తింటారు. దీనినే బంజారాలు బెల్లం తినడం అంటారు. ఈ సందర్భంలో ఇరు పక్షాల వారు సంబంధానికి గుర్తుగా ఒక రూపాయి బిళ్లను, అద్దాన్ని

తీసుకుని సాక్ష్యంగా వాటిని అందరికీ చూపిస్తూ తాండా నాయకునికి అందిస్తారు. ఆ తర్వాతా నూనెలో కుంకుమ, పసుపును కలిపి గుర్తుగా అక్కడికి వచ్చిన వారి బట్టలకు పూస్తారు. ఇరు పక్షాలవారు హాస్యంగా ఛలోక్తులు విసురుకుంటారు. మొదట బాలాజీ స్వామిని పూజించి అక్కడికి వచ్చిన పిన్నా పెద్దలకు బెల్లం పంచుతారు. అలాగే అక్కడికి వచ్చిన వారందరికి మత్తుపానీయాలు పోస్తారు. కట్న కానుకలు, ఆభరణాలు, వస్త్రవిశేషాల గురించి చర్చించుకుంటారు. ఒకవేళ ఏ కారణం చేతనైనా సంబంధం నచ్చకపోతే అబ్బాయివారు, అమ్మాయివారు, ఇరువురు నాయకుల సమక్షంలో సాక్ష్యంగా ఇచ్చి పుచ్చుకున్న రూపాయి బిళ్లను మంగలి వానితో పంపిస్తారు. జరిమానాగా ఒక రూపాయికి 25 నుండి 60 రూపాయలుగా విధిస్తారు. దీనినే బంజారాలు ఘంటేర్ పచ్చిస్, సాక్యార్ సాట్ గా వ్యవహరిస్తారు. ఇరు పక్షాల్లో ఎవరిది తప్పు అయితే వారు ఈ జరిమానాను చెల్లిస్తారు. దీనితో సంబంధం రద్దు అవుతుంది. ఒకవేళ సంబంధం రద్దు కాకుంటే వేరే సంబంధం చూడడానికి వీలులేదు. ఈ విధంగా బంజారాల వివాహ పద్ధతి ఉంటుంది. దీనినే వారు 'సగాయి' అంటారు. ఈ సందర్భంలో ఈ క్రింది గేయాన్ని బంజారా స్త్రీలు పాడుతారు.

> **"ఆవోరే రామి రామి, జావోరే రామి రిమి.**
> **నమది చాలోరే రామి రామియే, ఛోరేరి ఘరేయాంగ పామణ ఆయే.**
> **నమేలక దీయే ఝులోరే, దాణా పాణీరో హాత్ ఛే,**
> **వర సమీయావో వర్ వాతఛే–"**

సందర్భం: పప్పన్నం తినడానికి అబ్బాయివారు, అమ్మాయి వారింటికి వచ్చినప్పుడు అమ్మాయివారి తరుపునవున్న స్త్రీలు ఎదురుగా వెళ్ళి పై పాటను పాడుతారు.

భావం: రండి రండి వియ్యంకులారా, మీకందరికి నమస్కారాలు. మీరు ఎన్నిసార్లు అయినా రావచ్చు. అన్ని వేళలా మానమస్కారాలుంటాయి. అబ్బాయివారు చాలా ధనవంతులు. అయినా సమాజంలో మంచిపేరు ప్రతిష్ఠలున్నాయి. ఎదురుగా హారతి పళ్లెం పట్టండి. అబ్బాయివారు చాల ధనవంతులు. మన అమ్మాయికి ఏ లోటు ఉండదని భావం.

2) పురోహితుడు లేకపోవుట:

బంజారాల వివాహ వ్యవస్థలో పెళ్లిళ్లు జరుపడానికి పురోహితుడు అంటూ ప్రత్యేకంగా ఉండరు. వీరిలోనే 'భగత్' అనే ఒక పూజారి ఉంటాడు. అతని ఆధ్వర్యంలో

గాని లేక తాండా నాయకుని సమక్షంలోనే పెళ్లి సంబంధాలు ఏర్పాటు చేసుకుంటారు. నాయకుడు చెప్పిన విధంగానే ఇరు పక్షాల వారు నడుచుకుంటారు. వివాహ కార్యక్రమమంతా నాయకుడే జరిపిస్తాడు. నాయకుడు లేకుండా ఏ పని కూడ జరగదు.

3) అలంకరణ (పెళ్లికొడుకుని తయారుచేయడం):

బంజారాలు పెళ్లి కుమారునికి చొక్కా, ధోవతి, ఎర్రని రుమాలు (పాగా), 'ఖోళ్' అనే ఎర్రని పెద్దదుప్పటి కప్పుతారు. భుజం మీద కఠారి (కత్తి), భుజానికి అంటే సంకలో సంచిని (కోతలో), దానికి అద్దాలు, పూసలు, రెండు చేతులకు వెండి కడియాలు, చెవులకు వెండి/బంగారు కమ్మలు (మర్కి), కొణదరో అనే మోలతాడు, భుజంపై ఎర్రని శాలువాను కప్పుతారు.

అమ్మాయికి మోకాళ్ల వరకు గజ్జెలు కడ్తారు. పెళ్లి అయ్యేంత వరకు అవి అలాగే ఉంటాయి. పెళ్లి అయ్యేంత వరకు అమ్మాయి ముసుగు ధరిస్తుంది. ముసుగు జారిపోకుండా ఉండేందుకు గజ్జెలతోనూ, అద్దాలతో తయారు చేసిన 'తితరి' అనే దానిని ముసుగు కొంగుకు కట్టుకుంటారు.

పెళ్లి కుమారునికి దుప్పటి కప్పేటప్పుడు పాడేపాట:

> **"మారోతాడు ఏన్ నజర దేకు; మారో మాళీయాభాందతూ హరేలాగే.**
> **మారో సాడలీ రంగావుతూ హరేలాగే; మారే ముటియా మోలావులూ హరేలాగీ.**
> **మారేధోతి మోలావుతూ హర్ లాగీ; మారే ఖ్యాళ్ మోలావుతూ హరేలాగీ,**
> **మారే కారేటే మోలోవుతూ హరేలాగీ---".**

సందర్భం: బంజారా వివాహ వ్యవస్థలో **'ఒడుగు'** అనే ఆచారం ఉంది. ఆ సందర్భంలో పెళ్లి కొడుకుని ఎడమ భుజంపై సూదితో వాతపెట్టి కొత్త వస్త్రాలు కట్టించి, ఆయుధాలు ధరింప చేసి, యుద్ధానికి వెళ్ళె సైనికుడిలాగా తయారు చేసేటప్పుడు బంజారా స్త్రీలు పాటను పాడుతారు.

భావం: పెళ్లి కొడుకును అలంకరించిన తర్వాత అతను అందంగా కనిపిస్తున్నాడు. అందరి దిష్టితగేలేలాగా ఉంది. అతని తలపాగా కట్టడానికి అందరూ అలసిపోయారు. అతని దుప్పటి పై స్వస్తిక్ గుర్తుకు రంగులు వేసి అందరూ అలసిపోయారు. అతని కడియాలు, కమ్మలు, మోలతాడును ఖరీదు చేయడానికి వెళ్లి అందరూ అలసిపోయారు. పెళ్లి పత్రికలు పంచుతూ అందరూ అలసిపోయారని భావం.

4) పెళ్లికొడుకు దుప్పటి కప్పుకోవడం (ఖోల్ ఓడేరా నోక్తా)

దీనిని బంజారా భాషలో 'ఖోళ్ ఓడేరో నోక్తా' అని అంటారు. అంటే దుప్పటి కప్పుకోవడం. ఇది వరుని ఇంట్లో జరిగే కార్యక్రమం. దీనికి 'వదాయి' అని, 'సాడితాణేర్' అని కూడా అంటారు. అంటే విందు భోజన కార్యం. ఆ రోజున పెళ్లి కొడుకుకి 20 మూరలు కలిగిన దుప్పటిని కప్పుతారు. తాండా నాయకులు, పెద్దలు కలిసి ఈ కార్యం చేస్తారు. ఎర్రని వస్త్రంతో తలపాగాను, శాలువాను, సంకలో సంచినీ, ఖడ్గాన్ని ధరింపచేస్తారు. ఆ దుప్పటిని కప్పేటప్పుడు దానిని నాలుగు మూలలను నలుగురు పట్టుకుని భూమిపై విశాలంగా పరిచి, అందులో ఒక రూపాయి బిళ్లను వేస్తారు. ఆ దుప్పటిని మడతపెడుతూ వస్తారు. ఆ రూపాయి బిళ్ల దొర్లుతూ చివరికి బొమ్మ బొరుసును చూసి, వరున్ని అత్తవారింటికి పంపిస్తారు. ఆ దుప్పటి వెనకవైపు 卐 స్వస్తిక్ అనే గుర్తును వేస్తారు. ఇది శుభానికి సంకేతంగా భావిస్తారు. వరుడు అత్తగారి తాండాలో 'ప్రవేశించే ముందు ఆ తాండా నాయకుని అనుమతి తీసుకోవాలి. మొట్టమొదటగా అతని ఇంటికి చేరి 'రాం!రాం! అని శ్రీరాముని పేరు మీదుగా పలకరించాలి. ఆ తర్వాత తాండా నాయకుని అనుమతితో అత్త గారింటికి వెళ్ళుతాడు. ఈ సందర్భంలో ఈ కింది గేయాన్ని పాడుతాడు.'

"బావ మరేటాలాగీ తారి సఫారీ; బావ ఎలేర్ రపీయా సగటేపర్;
బావ కీడి ముంగేరొ జొడా సగటేపర్; బావ ఛుటిఘేరీ తారీ పూటేపర్;
బావ పాటేరొసేలా తారి కాందేపర్; బావ సోనేరీ కొతలి తారి కాంకేమా;
బావ రూపేరి జాంజే తారి హతేమా; బావ టాంగేరో తొడాతారి తళా వాపర్;"

సందర్భం: పెళ్లి కుమారుని కొత్తగా దుప్పటి కప్పేటప్పుడు స్త్రీలు పై పాటపాడుతారు.

భావం: ఓ పూజారి లాంటి పెళ్లి కుమారా! నీవు ఇచ్చిన తమలపాకు తీయ్యగావుంది. నీ దుప్పటిలో వేసిన రూపాయి బిళ్ల మాకందింది. ఈ రోజు నుండి నువ్వు చీమకు పప్పుధాన్యానికి ఉండే సంబంధంలాగా ఉండాలి. నీ భుజంపై దుప్పటి వుంది. నీ సంకల బంగారంతో తయారుచేసిన సంచి ఉంది. నీ భుజంపై ఎర్రని శాలువావుంది. నీ చేతికి, వెళ్ళకు మొలకు బంగారంతో తయారు చేసిన ఆభరణాలున్నాయని అర్థం.

5) తోడి పెళ్లికొడుకు/దూత(లేరియా):

వరుణ్ణి అత్తవారింటికి పంపేటప్పుడు అతనితోపాటు ఒక సమర్థుడైన దూతను పంపుతారు. అతను పెళ్లి అయ్యేంత వరకు వరునితో పాటు ఉంటాడు. ఆడపెళ్లివారు

సరదాగా ఎంత ఆట పట్టించినా వాటన్నింటిని సమర్థంగా ఎదుర్కొంటాడు. పెళ్లి ప్రారంభం నుండి చివరి వరకు వరునికి తోడుగా ఉంటాడు. వేరే వివాహాల్లో తోడి పెళ్లికొడుకును వరుని పక్కన కూర్చోబెట్టి లేపేస్తారు. కాని బంజారా వివాహంలో చివరివరకూ ఉంటాడు.

6) బెల్లం పానకం కార్యం (ఘోటార్ నొక్తా):

ఈ కార్యం రోజున వధూవరులిద్దరూ వేరువేరుగా తాండాలోని ప్రతి ఇంటికెళ్లి అందరిని ఆహ్వానిస్తారు. తాండానాయకుని సమక్షంలో ప్రజలందరూ ఈ కార్యంలో పాల్గొంటారు. బెల్లం తెచ్చి కొత్తకుండలో వేసి పానకం తయారు చేసి అక్కడికి వచ్చిన వారందరికి మర్యాదగా అందిస్తారు. ఆ సందర్భంలో ఈ కింది గేయాన్ని పాడుతూ అందరిని పలకరిస్తారు.

"గోళ లాయోకుణ్ మంగాయోకుణ్ – ఆడోభీంత లాండోకుణ్
ఘోటా ఘోళోకుణ్ ఘోళాయే కుణ్ – ఆడోభీత లాండోకుణ్
టోపర్ లాయోకుణ్ మంగాయోకుణ్ – ఆడోభీంత లాండోకుణ్
ఘస్ ఘసాలోలా యోకుణ్మంగాయోకుణ్–అడోభీంత లాండోకుణ్
కాళిమిర్చిలాయేకుణ్ మంగాయోకుణ్ – ఆడోభీంత లాండోకుణ్"

భావం: బెల్లం తెచ్చిందేవరు, తెప్పించిదెవరు? పానకం తయారు చేసిందెవరు. , కొబ్బరి కుడుకలు తెచ్చిందెవరు! తెప్పించిందెవరు? సుగంధ ద్రవ్యాలు (మిర్చి, గసాలు) తెచ్చిందెవరు; తెప్పించిదెవరు! పానకం తయారు చేసి అక్కడికి వచ్చిన వారందరికీ ఇలా పాట పాడుతూ పానకం అందిస్తారు.

7) అమ్మాయి వారింట్లో పెళ్లికార్యం (వాయర్ నొక్తా):

ఈ కార్యం రోజున పెళ్లికొడుకు అతని దూత ఇద్దరూ కలిసి తాండా ప్రజలందరికి ఆహ్వానిస్తారు. కుమ్మరి వాని ఇంటికెళ్ళి కొత్తకుండలు, జిల్లేడు కట్టెలు, పొడవైన కర్రలు, తాడు మొదలైనవి తెచ్చి అమ్మాయి వారింటిముందు వాటిని నాల్గు మూలలకు అమర్చింపచేస్తారు. ఈ కుండల్ని రంగరించి ఒక దానిపై ఒకటి ఏడుగా పెడతారు. జిల్లేడు కట్టెల్ని చుట్టూ అమర్చి, తాడుతో కడతారు. ఆ నాల్గు కుండల వరుసల మధ్యలో పెద్ద చెక్కపీట (కాకోటి) ను పెట్టి, దాని ప్రక్కన చిన్న రోకలి బండను పాతించి దానికి

గవ్వలు, మేండ్లం అనే అడవికాయల్ని కడుతారు. ఆ కాకోటిపై రాత్రిపూట, మరునాడు వధూవరులిద్దరికి స్నానాలు చేయిస్తారు. దీనినే బంజారాలు వాయార్ నొక్తా అని అంటారు. ఈ సందర్భంలో కూడా బంజారా స్త్రీలు పాటలు పాడుతారు.

8) వధూవరులకు మంగళ స్నానాలు (చోట్టేర్ హోంగోళీ) చేయించేటప్పుడు పాడే పాట:

బంజారాల వివాహంలో వధూవరులిద్దరికి ఆరుబయట అందరి సమక్షంలో మంగళస్నానాలు చేయిస్తారు. కొత్తకుండల్లో చల్లని నీళ్లతోనూ, వారి శరీరం మొత్తం పసుపు కుంకుమలతో పూసి, చెక్క పీటపై కూర్చోబెట్టి స్నానాలు చేయిస్తారు. ఈ సందర్భంలో అబ్బాయిని అత్తగారు కొన్ని ప్రశ్నలడిగి ప్రమాణాలు చేయిస్తుంది. అప్పుడు వధూవరులిద్దరిపై సరదాగా పాటలు ఈ క్రింది విధంగా పాడుతారు.

అబ్బాయి మీద పాట:

"కాకోటివర్ బేటోర ఖటర ఖోలియా; తూ కస్సోదికాచీరే ఘోలటాటియా;
కాకోటివర్ బేటోర్ ఖటర ఖోలియా; తూ కస్సోదికాచీరే భూరముచియా;
వేలదురీ టాంగేహేట గంగావేయిజా; గంగామారి మీటకిటరాట మరిజా;
వేతదురే కాన ఛేని ధాన మాగంరో; వేతదుర్ చోట్టిఛేని బొట్టి మాంగరో
వేతదురే కనాళో పాటియా----"

భావం: పీఠం కూర్చున్న ఓ పొట్టిబావగారు. మీరు కందిరిగలాగా ఉన్నారు. మీ మీసాలు గొధుమ రంగులోవున్నాయి. మీకు చెవులు లేవు కాని అన్నం అడుగుతావు, మీకు జుట్టు లేదుకాని మాంసం అడుగుతారు. మీకు స్నానం చెయించేటప్పుడు నీళ్ళు గంగా ప్రవాహంలాగా ప్రవహిస్తుంది. అందులో కప్పలు తెప్పలుగా అరుస్తూన్నాయని మరదళ్ళు సరదాగా పై పాటను పాడుతారు.

అమ్మాయిమీద

"ఛ్వారీ ఏతితి జనా దాంతయాన మసీమా లగాడతితి –
చల్ ఛ్వారియే కాకొటి చడబేటి.

ఛ్వారీ ఏతితి జనా చాలతే ఛోరాలా ఖాటా మారతితి –
చల్ ఛ్వారియే కాకోటి చడబేటి.

ఛ్వారీ ఏతితి జనా చాలతే చోరాన సైగా కరతితి –

చల్ ఛ్వారియే కాకొటి చడబేటి"

(లావుడ్యా నల్తాబాయి వ.. 60 సం.. టిక్యాతండా, నూతనకల్ (మం), నల్లగొండ జిల్లా సేకరణ మౌఖికం).

భావం: ఓ అమ్మాయి! నీవు చిన్నగా ఉన్నప్పుడు చాలా కొంటే పనులు చేసే దానివి. అందరికి నల్లని మసి పూసే దానివి, ఇప్పుడేమో మంగళ స్నానానికి కూర్చున్నావు. నీవు యుక్తవయసులో వున్న మగపిల్లలకి ఆటపట్టించేదానివి. ఇప్పుడేమో పెళ్లికి సిద్ధమైనావు. అని వరుసకు వదినలైన వారు అమ్మాయి మీద సరదాగా పై పాటను సామూహికంగా పాడుతారు. ఇలా వధూవరులకు మంగళ స్నానం చేయించి, అక్కడే అగ్నిగుండం తీసి అందులో పూజాద్రవ్యాలు వేసి, తడిబట్టలతో ఏడుసార్లు అగ్నిప్రదక్షణం చెయిస్తారు. దీనినే బంజారాలు 'సాత్ ఫేరా ఫేరోరో' అని అంటారు. ఈ సందర్భంలో కూడా గేయం ఉంటుంది.

9) హుక్కావర్తమానం (హుక్కాదేరో)

పెళ్లికొడుకు ప్రతిరోజు తాండాలోని నాయకులందరికి చుట్టలు తయారు చేసి ఇవ్వాలి. ఆ సందర్భంలో ఈ కిందివిధంగా అందరినీ పలకరిస్తారు.

"హెట్ గరి ఉప్పర్ థమ్
థమేవర్ కస్తూరి
అమేరియా కస్తూరి
కస్తూరియా లాల్ లో నాయక్ హోక్కా"—

అర్థం: గౌరవనీయులైన తాండా పెద్దలారా హోక్కా క్రింది భాగం ఇత్తడితోను దానిపై మట్టిచుంగా, అందులో కస్తూరి ఉన్నది. హుక్కా పీల్చి మమ్ముల్ని దీవించండని పెళ్లి కుమారుడు అంటాడు.

10) రెట్టగాజులు తొడిగించడం(చూడోతిపేరోనొక్తా):

బంజారాల్లో తాళిబొట్టు ఉండదు. రెట్టగాజులే వారికి తాళితో సమానం. ఈ కార్యం చేసే ముందు తాండాలోని మత్తైదువలు అందరు కలిసి రాత్రిపూట అమ్మాయికి పాటలు, ఏడుపు నేర్పుతూ అబ్బాయి చేత రెట్ట గాజులు తొడగిస్తారు. ఆభరణాలు అన్ని

కూడా తొడగిస్తారు. అప్పటి నుండి ఆమే గృహిణిగా మారుతుంది. 'దంతపు గాజును' బంజారాలు 'బలియా' అంటారు. ఆ గాజులు మోచేతివరకు పూర్తిగా తొడిగిస్తారు. అమ్మాయి అందర్ని పట్టుకుని ఏడుస్తుంది. అందరి దీవెనలు తీసుకుంటుంది. ఈ సందర్భంలో తాండాలోని స్త్రీలు పాటలు పాడుతుంటే, అమ్మాయి ఏడుస్తుంటుంది.

"మతే ఘాలోయే మారి వరదేశణ్ యాడీ
ఘుగరీయేరి జోల్ ఘాలేరియే జోల్
మత ఘాలోయే మారి పరదేశణ్ యాడీ
ఘుంటే టోపలివాళి యాడి ఘాలేరియే టోప్
మత ఫోడోయే మారి పరదేశణ్ యాడీ
మారి సోనే రూపేరో పటడియేరో టోప్...."

భావం: ఓ అమ్మాలారా! మీరందరు కలిసి నాకు రెట్టగాజులు తొడిగిస్తున్నారు. అవి నాకు వద్దమ్మా. నేను ఎల్లప్పుడు మీ ఇంట్లోనే చిన్న పిల్లలాగా ఉంటాను. నాకు ఈ అన్ని ఆర్భాటాలు వద్దు. ముసుగు, గాజులు, రవిక చెవికి కమ్మలు, చంపకు మువ్వలు, కాళ్ళకు కడియాలు, ఇవన్ని నాకు వద్దమ్మానన్ను కన్న నా తల్లులారా. నాకు పెళ్లి చేసి గృహిణిగా మార్చవద్దు. నేను కన్యగానే ఉంటానని అమ్మాయి పై పాటను దుఃఖిస్తూ పాడుతుంది.

11) పళ్లపుల్లలు ఇప్పించడం (దాంతణీయాచేరోనొక్తా):

పెళ్లి కూతురితో అత్తగారింటి వారు తాండా ప్రజలందరికి ఉదయాన్నే పళ్ళుపుల్లలు ఇప్పించి పరిచయం చేస్తారు. ఇది చాల అద్భుతమైన పరిచయ కార్యక్రమం. తాండా పెద్దలకు కాళ్ళు పట్టిస్తారు. ముఖ్యమైన వ్యక్తులకు అమ్మాయి చేత స్నానాలు కూడా చేయిస్తారు. ఈ విధంగా బంజారా వివాహంలో సాంస్కృతిక రూపాలున్నాయి.

12) అన్నభార్యను, తమ్ముడు చేసుకోవడం:

బంజారాల్లో వదినను, మరిది వివాహం చేసుకునే పద్ధతి వుంది. అంటే వితంతువు పునర్వివాహాలు అంగీకరిస్తారు. ప్రమాదంలో అన్న చనిపోతే వదినను పెళ్లి చేసుకునే సంప్రదాయం వీరిలో కనిపిస్తుంది. ఒకవేళ అతనికి ఇంతకు ముందే పెళ్లైవుంటే రెండవ భార్యగా చేసుకుంటారు. వయస్సులో వదిన పెద్దదైనా సరే ఆమెను

పెళ్లి చేసుకుంటారు. దీనికి కారణం,ఆస్తి, పిల్లల పాలనా, కుటుంబ మర్యాదను కాపాడడమే. ఈ పద్ధతి ఇష్టం వున్నా లేకపోయినా అంగీకరించవలసిందే. ఒక వేళ భార్య చనిపోతే ఆమె చెల్లెల్ని పెళ్లి చేసుకుంటారు. మారుతున్న ప్రస్తుత తరుణంలో ఈ పద్ధతి లేదు.

ఈ విధంగా బంజారా సమాజంలో వైవాహిక పద్ధతి ఇతరుల కంటే భిన్నంగా ఉంటుంది. ఈ సంప్రదాయం నేడు లేదు. మారుతున్న కాలంలో వీరు గ్రామీణ, నగర జీవితాలకులోనై తమ వేషం, భాషను, కట్టుబాట్లను మర్చిపోతున్నారు. విలక్షణమైన వీరి సంప్రదాయం గురించి అధ్యయనం చేయవలసిన అవసరం నేడు ఎంతైనా ఉంది.

జ్ఞాపికలు:

1. సూర్యనారాయణ. ఎం – భారతదేశం గిరిజన సముదాయాలు, తెలుగు అకాడమీ ప్రచురణ, హైదరాబాద్ (1983)
2. మోహన్. జి. యస్ – జానపద విజ్ఞాన వ్యాసవళి, శ్రీనివాసా పబ్లికేషన్స్ మలయానూరు, బెంగుళూర్ (1981)
3. ధర్మారావు. తాపీ – పెళ్లి దాని పుట్టు పూర్వోత్తరాలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్ (1960)
4. చిన్యానాయక్. భూక్యా – బంజారాల చరిత్ర సంస్కృతి – ప్రగతి; శ్రీలక్ష్మి ప్రసెస్, బెంగుళూర్ (1988)
5. గోనా నాయక్. ఎం – సుగాలి సంస్కృతి భాషా సాహిత్యాలు; పద్మశ్రీ గ్రాఫిక్స్, హైదరాబాద్ (2002)
6. శంకరయ్య.జె – కరీంనగర్ జిల్లా లంబాడీల ఆచార వ్యవహారాలు ; కర్షక ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాదు (1995)
7. సిల్మానాయక్.ఎ – బంజారాలు వైవాహిక పద్ధతి (ఎం.ఫిల్ థిసిస్) అముద్రితం. ఉ.వి. హైదరాబాదు (2002)

18. కోయగిరిజనులు – సంస్కృతి సంప్రదాయాలు

ఎ.వి.ఎన్. అరుణకుమారి

తెలుగు పరిశోధకురాలు, ఉస్మానియా విశ్వవిద్యాలయం

గిరిజనులు – పరిచయం:

"గిరిజనులు" పదంలో గిరి అంటే కొండ అని, జనులు అంటే ప్రజలు అని భావం. కొండప్రాంతంలో నివసించే వాళ్ళని అర్థం. ఉత్తర భారతీయ భాషల్లో గిరిజనులను ఆదివాసీలంటారు. 'ఆది' అంటే మొదటి నుండి భూమిపై ఉన్నవాళ్ళు అనే అర్థంలో ప్రయోగం. అటవీ ప్రాంతంలో నాగరిక సమాజానికి దూరంగా నివసిస్తున్నారని "గిరిజనులు" గా భారత రాజ్యాంగం గుర్తించింది. అన్నమయ్య తన సంకీర్తనలలో గిరిజనులు అనే మాటకు బదులుగా "నల్లప్రజ" అని ప్రయోగించారు. ఆంగ్లంలోని గిరిజనులకు సమానార్థకం "TRIBE" ఈ పదం "TRIBUS" అనే లాటిన్ పదం నుండి ఏర్పడింది. ఈ పదాన్ని మొదట రోమన్లు క్రీ.పూ.241 సంవత్సరంలో వాడారు. "TRIBE" అనే పదం బైబిలులో 'గోత్రము' అనే అర్థంలో ప్రయోగింపబడింది. 'గోత్రం, వంశం, పేరు, అడవి' అని శబ్దరత్నాకరములోని అర్థాలు. గిరిజనులకు పర్యాయంగా అటవికులు, నిషాదులు, అనాగరికులని వ్యవహరిస్తున్నారు.

"TRIBE" అనే పదానికి ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలో వివరణ (in some societies) Group of families under recognized leader with blood etc. ties and usually having common culture and dialect.

ప్రకృతిలో దొరికే ఆహారాన్ని సేకరించే మానవులు చిన్నచిన్న గుంపులుగా ఏర్పడతారు. ఈ గుంపు వ్యవస్థీకృతమైనపుడు ఒక కుదురు అవుతుంది. కొన్ని కుదురులు కలిసి ఒక తెగ లేక గణంగా ఏర్పడుతుంది.

ఆదిమ తెగల జీవితాల గూర్చి కొంతవరకు అవగాహన చేసుకోవడానికి చారిత్రక సమాచారం దోహదం చేస్తుంది. "ప్రాచీన ఆచారాలను సంప్రదాయాలను

వీడకుండా కొండల్లో కోనల్లో అనాగరికంగా జీవిస్తున్న తెగలను గిరిజనులు అని అంటారు. కొండల మీదనే తొలుత నివాసాలు కల్గి ఆటవిక సంపదనే తమ జీవితానికి ఉపాధిగా గ్రహించిన వారిని, కొండల్లో ఉండే కొద్దిపాటి చదును ప్రదేశాన్ని గుర్తించి అక్కడ ఎదిగిన చెట్లను కూల్చి పోడు వ్యవసాయం చేసుకునే వాళ్ళను కొన్ని తెగలుగా ప్రభుత్వం గుర్తించింది. వీళ్ళంతా గిరిజనులు".

"కొత్త రాతియుగం (క్రీ.పూ.50,000-5,000) లోను గిరిజనులు ఉన్నట్లు ఆధారాలున్నాయి. సింధులోయ నాగరికత కాలానికి కొన్నిజాతులు భారతదేశంలో నివశిస్తున్నాయి. వారిలో ఈశాన్య ప్రాంతంలో నివసించే, మంగోలులనే కొండజాతుల వారు. వీరు వ్యవసాయం, వేటపై ఆధారపడి జీవించారు. బీహారు గంగానదీ తీర మైదానంలో సంతాలులనే నీగ్రో జాతులవారు ఉన్నారు. సంతాలులు వేటపైనే ఆధారపడి జీవించారు. దక్కన్ పీఠభూమిలో దట్టమైన అరణ్యాలలో కోయలు, గోండులు, బిస్తర్ణులాంటి ఆస్ట్రలాయిడ్ జాతులు, దక్షిణ దేశంలో చెంచులు, యానాదులు, గోండులు, సవరలు ఉన్నట్లు చరిత్రకారులు చెపుతున్నారు. ఇంకా నిషాదులు, భిల్లులు కిరాతులు ఉన్నారు."

గిరిజన తెగలలో ఒక తెగ అయిన కోయ తెగను గిరించి తెలుసుకుందాం!

కోయలు:

కోయలు ఎక్కువగా తెలంగాణాలోని ఖమ్మంలోను, వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలో మరియు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా మన్య ప్రాంతంలోను, పశ్చిమగోదావరి జిల్లాలోని మైదానమందును, విశాఖపట్టణం జిల్లాలో నివసించుచు, గోదావరినదికి ఎడమభాగమున నాగపూరును దాటియున్న బస్తరులోనికి, ఒరిస్సాలోని మలకనగిరి తాలూకాలోనికి వ్యాపించి యున్నారు అని సంగ్రహాంధ్రకోశం వల్ల తెలుస్తుంది.

"ఖమ్మం జిల్లాలో నివసించే గిరిజనుల్లో అధికశాతం కోయలున్నారు. వీరు గోదావరి పరివాహక ప్రాంతంలోని అడవులు, గుట్టల్లో జీవిస్తున్నారు. వీరికి తెలుగుభాషతోపాటు లిపిలేని మాతృభాష కూడా తెలుసు. వీరి మాతృభాషను కోయభాషగా పిలుస్తారు. వ్యవసాయ పనులు, అడవీ పనులు, చేతి పనులు మొదలైన

వృత్తుల ద్వారా వీరు జీవనం సాగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పోడు వ్యవసాయం ప్రధానజీవనంగా వుంది. పూర్వం జొన్నలు, చెట్లవేళ్ళు, దుంపలు, ఆకులు ఆహారంగా తీసుకునేవారు. ఆచార వ్యవహారాలకు, కుల కట్టుబాట్లకు వీరు ప్రాధాన్యమిస్తారు. మాఢవిశ్వాసాలు అనుసరిస్తారు. ముత్యాలమ్మ, కొర్రాజు, కుడిదేవర, మామిలిదేవతలకు పూజలు చేస్తారు. పూర్వం దేవతలకు నరబలులు ఇచ్చేవారు. అదిక్రమేణా జంతుబలీగా మారింది. రోగాలకు వెజ్జు ద్వారా మంత్ర తంత్రాలు చేయించుకుంటారు. ఇప్పటికీ మంత్రతంత్రాలు చేయించుకునే సంస్కృతి ఉంది. అనారోగ్యానికి చేతబడి కారణమని నమ్ముతారు. భూమిపండుగ, కొత్తలపండుగ, కొలుపులు మొదలైనవి చేస్తారు. వీరు గ్రామాల్లో సాంఘిక కట్టుబాట్లు అమలు చేసేవారు. శాంతిభద్రతలను కాపాడేందుకు సంప్రదాయిక పంచాయితీలున్నాయి. ఈ కులపంచాయితీకి పిన్నపెద్ద, పటేల్, పూజారి తదితరులు నాయకత్వం వహిస్తారు. కులగౌరవానికి భంగం కలిగించడం, వావి వరుసలులేని స్త్రీ, పురుష సంబంధాలు, కొట్లాటలు వంటి సంఘటనలపై విచారించి కుల పెద్దలు పంచాయితీ తీర్పులు ఇస్తారు. పంచాయితీ ద్వారా వచ్చే సొమ్మును గ్రామస్తులంతా తాగుడు విందులకు ఖర్చు చేస్తారు. రేల నృత్యాలు చేయడం, పాటలు పాడడం వంటి సాంస్కృతిక వినోదాల్లో మంచి నేర్పరులు.

శారీరక లక్షణాలు:

వీరు అస్ట్రలాయిడ్ ఉపజాతికి సంబంధించినవారుగా కన్పిస్తారు. తెలుపు, నలుపు, చామన ఛాయ వర్ణం కలవారున్నారు. కొంచెం ముందుకు వచ్చిన నోరు, వెడల్పయి అణగివున్న ముక్కు, నల్లని లేదా రాగిరంగు కలిగి ఉండి, తరంగంలాగా వుండే వెంట్రుకలు కలవాళ్ళు వున్నారు. సామాన్యమైన కనుబొమ్మలు, వెడల్పుగా పొట్టిగా వుండే ముఖాలు, వీరు పొట్టిగానో, మధ్యస్థంగానో, పొడవుగానో వుండే దేహం కలవాళ్ళు. వీరు చూడటానికి సామాన్యంగా కన్పించినా దృఢమైన దేహం కలవాళ్ళు.

పుట్టు పూర్వోత్తరాలు:

పాండవులు వనవాస సమయంలో భీముడు వేటకు అడవికి వెళ్ళగా అక్కడ "హిడింబి" ని చూచి వివాహం చేసుకున్నాడని వారికి పుట్టిన సంతానమే 'కోయ' వారిగా "మహాభారతకథ"లో చెప్పబడింది. మరొక కథ భీముడు వనవాస

సమయంలో "నిషాద్" మహారాజు కుమార్తెను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. వారికి పుట్టిన సంతానమే "కోయ" వారని అంటారు.

కోయలలో ఉపతెగలు:

కోయలలో 12 రకాల ఉప తెగలవారున్నారు. అవి:

1)	రాచకోయ లేదా గుట్టకోయ	2)	గొమ్ముకోయ
3)	కమ్మరకోయ	4)	ముసరకోయ
5)	గంపకోయ	6)	ఒడ్డికోయ
7)	పత్తిడికోయ	8)	డోలికోయ
9)	కాకకోయ	10)	మట్టకోయ
11)	లింగకోయ	12)	పుట్టకోయ

రాచకోయ లేదా కోయదొర: వీరు పూర్వకాలం రాచరిక వ్యవస్థ వుండడం వల్ల రాజ్యపాలన చేసేవారు. అందుకే వీరిని కోయదొరలనీ, కోయరాజులనీ పిలుస్తారు.

1. **కమ్మరకోయ:** కమ్మరపని, కొలిమిపని చేయడంవల్ల వీరిని కమ్మరకోయగా పిలుస్తారు.
2. **ముసరకోయ:** డప్పులు వాయించేవారు.
3. **కాకకోయ:** వ్యవసాయం చేసేవారు.
4. **గొమ్ముకోయ:** నదుల ఒడ్డులలో నివసించే నది ఒడ్డును గొమ్ము అని పిలుస్తారు.
5. **డోలికోయ:** కోయజాతి వారి కర్మకాండలలో 'డోలు'ను వాయించేవారు.
6. **లింగకోయ:** వీరు శివారాధకులు. శివుని పూజిస్తారు. వీరు బ్రాహ్మణులవలె మడి, ఆచారంతో పూజలు చేస్తారు. కోయలలో ఉన్నతులుగా చెప్పుకుంటారు.
7. **గంపకోయ:** గంపలు, బుట్టలు అల్లేవారు.
8. **ఒడ్డికోయ:** వీరు పూజారులు. పండుగల సమయాలలో వీరు పూజలు చేస్తారు. వీరు ఆయా గ్రామాలకు పూజారులు.

ఇలా వీరు చేసే కులవృత్తులను అనుసరించి ఉపతెగలు ఏర్పడినవి.

వివాహవేడుక:

కోయలలో గట్టు గోత్రాన్ని తెలియ జేస్తుంది. వీరిలో ఐదు గోత్రాలు ఉంటాయి. సగోత్రం గలవారు వివాహం చేసుకోరు.

వివాహ పద్ధతులు:

1. **పరిగ్రహణ వివాహ పద్ధతి:** ఒక పురుషుడు ఒక స్త్రీని ఆమె గ్రామం నుంచి బలప్రయోగంతో తీసుకువచ్చి వివాహం చేసుకుంటే ఆ పద్ధతిని పరిగ్రహణ లేదా రాక్షస వివాహ పద్ధతి అంటారు. (మ్యారేజ్ బై క్యాప్చర్). ఒకరి వీరత్వానికి, మరొకరి దుర్బలత్వానికి చిహ్నమైన ఈ వివాహ పద్ధతి బాగా వాడుకలో ఉన్నది.

2. **వినిమయ వివాహ పద్ధతి:** కన్యాశుల్కం బారినుంచి బైటపడటానికి ఈ పద్ధతి అమలులోనికి వచ్చింది. ఈ పద్ధతి ప్రకారం ఒక పురుషుడు తన చెల్లెని లేదా తన కుటుంబంలోని మరో అమ్మాయినికాని, తన భార్యకు ప్రతిగా అవతలి కుటుంబంలోని పురుషునికి అప్పగిస్తారు.

3. **సేవాపద్ధతి (మ్యారేజ్ బై సర్వీస్):** భావి పెండ్లి కొడుకు, పెండ్లి కుమార్తె ఇంట్లో కొంత కాలం సేవకుడిగా సపర్యలు చేస్తాడు, కన్యాశుల్కం చెల్లించలేని పరిస్థితులలో ఉంటే తను కోరుకున్న అమ్మాయి ఇంట్లో కొద్ది సంవత్సరాలపాటు ఆమె తల్లిదండ్రులకు సపర్యలు చేసి తరువాత ఆమెను వివాహమాడుతాడు.

4. **ప్రయోగపద్ధతి (మ్యారేజ్ బై ట్రయిల్):** ఈ పద్ధతి ద్వారా జీవితభాగస్వామిని ఎంచుకునే ముందు ఆ యువకుడు తన వీరత్వాన్ని ప్రదర్శించుకోవాలి.

5. **పరీక్షావధి పద్ధతి (ప్రోబిషనరీ మ్యారేజ్):** పెండ్లికొడుకు, పెండ్లికూతురు ఒకరినొకరు పరస్పరం అర్థం చేసుకోవడానికి వీలు కల్పించే నేటి అధునాతన సంప్రదాయానికి ఆదిమ రూపమే ఈ పద్ధతి. ఈ పద్ధతి ప్రకారం వివాహానికి ముందు యువతి యువకులు కొద్ది కాలం కలిసి జీవిస్తారు. ఈ కాలంలో వారికి ఒకరిపై ఒకరికి ప్రేమ ఏర్పడితే పెద్దలు వారికి పెళ్ళి ఏర్పాటు చేస్తారు. అలాకాక వారిద్దరు వ్యక్తిత్వం నచ్చకపోతే యథావిధిగా దూరం అవుతారు.

మతం పూజా విధానం:

ఆదిమ మానవుని మేధ అపరిణితమైనది. ఆనాడు మతం అంటే ఈనాటి మతంలాంటి ఆధ్యాత్మిక గాంభీర్యం కలిగింది కాదు. తన జీవిత సమస్యలకు సంబంధించినది. ప్రకృతి సంఘటనలు, కళ్ళ ఎదుట కన్పించే చావు, పుట్టుకలు మొదలైన వాటిని ఆనాటి మానవుని మేధ అర్థం చేసుకోలేక పోయింది. వీటికంతా బయటవున్న మానవాతీత శక్తే కారణమని గట్టిగా నమ్మాడు. ఇదే మతావిర్భావానికి బీజం. ఇదే తర్వాత దేవతారాధనకు దారితీసింది.

ఆదిమ మానవుడు మతం అనే పదాన్ని ఉపయోగించలేదని తెలుస్తుంది. ప్రకృతి బీభత్సాలకు భయపడిన మానవుడు ప్రకృతిని ఆరాధించడం మొదలు పెట్టాడు. ప్రాచీన మానవుని జీవితంలో భయాన్ని కలిగించే ప్రకృతి వైపరీత్యాలైన భూకంపాలు, పిడుగులు, ఉరుములు భయపడిపోయేట్లు చేశాయి. తనను కాపాడుకునే శక్తి ఉందా? లేదా? అని ఆలోచించిన మానవుడికి, ప్రకృతిలో వున్న శక్తిని ప్రసన్నం చేసుకోవాలనే భావం కలిగి వుండవచ్చు. ఈ భావమే ఎన్నో పూజా విధానాలకు, నమ్మకాలకు దారి తీసింది.

మానవ మేధ పరిణితినొందినకొద్దీ మనిషి దేవతా గణం విస్తృతి పొంది, శిష్టదేవతా గణం స్థాయికి ఎదిగింది. పండితులు, విద్వాంసులైన వారు దేవతలను ఆరాధించడం, పూజారి విధానంలో మార్పులు చేశారు. మత ప్రచారం చేయడమే కాకుండా మతతాత్విక దృష్టిలో గ్రంథాలు వెలువరించారు.

ఈ విధంగా అనేక సిద్ధాంతాలు, బోధనలు అవతరించి మత సృష్టి జరిగింది. కాబట్టి మతం అనే పదం శిష్టులనుండి, జానపదులకు సంక్రమించిందేకాని, ప్రాచీన మానవులైన గిరిజనులకు తెలియదు అని చెప్పవచ్చు.

కోయలలో వారి దేవతలకోసం ప్రత్యేక ఆలయాలు లేవు. అన్ని గ్రామాలలోను ఒకేరకమైన గ్రామదేవతలు, పూజా విధానాలు వుంటాయి. పూజించే సమయంలో అర్థంకాని భాషలో అష్టోత్తర శతనామాలు చదివే సంప్రదాయం వుండదు. ఏదో ఒక ఆకారంలో చేయబడిన విగ్రహాలు వుండవు. సృష్టిలోని ప్రతి వస్తువును శక్తి రూపిణిగా భావించే గిరిజనులు చిన్నరాయి, బండ, కొమ్మ చెట్టు మొదలైన వాటిని దేవతలుగా ప్రతిష్ఠించుకొని పూజిస్తారు.

దేవతలు లేని గిరిజన గ్రామమంటూ లేదు. గిరిజనులు దేవతల ప్రీతికోసమే పండుగలు, కొలువులు చేస్తారు. దేవతలను సంతృప్తి పరచడానికి కోళ్ళు, మేకలు, గొర్రెలు, దున్నపోతులు, పందులని బలి ఇస్తారు. కొబ్బరికాయ, సారా, కల్లు, పసుపు, కుంకుమ, రక్తాన్నం మొదలైనవి గిరిజనుల దృష్టిలో దేవతలకు ప్రీతికరమైన వస్తువులు. అందువల్ల పండుగలు, కొలువులు, కర్మలు మొదలైన వాటిని ఈ వస్తువులతోనే జరుపుకుంటారు.

కోయలలో స్త్రీ దేవతలు, పురుష దేవతలు.

స్త్రీ దేవతలు	**పురుష దేవతలు**
కోడానమ్మ	చిన్నదూల, పెద్ద దూల
మరిడమ్మ	బీరబోయిన (లింగధారికోయ)
ముత్యాలమ్మ	వీరన్న-భద్రమ్మ
సమ్మక్క-సారక్క	పగిడెద్దరాజు, కొర్రాజు

రావిచెట్టు – మరిడమ్మ

మర్రిచెట్టు – కోడానమ్మ (ఊరికి దక్షిణం వైపు ఉంచుతారు)

ముత్యాలమ్మ – ఇప్పచెట్టు (ఊరిపొలిమేరలో ఉంచుతారు)

కొర్రాజు దేవుని చిన్నగుడిసెలో వుంచుతారు.

చెట్లనే వీరు దైవాల పేర్లతో కొలుస్తారు.

పండుగలు:

పండుగలు సమాజంలో ప్రముఖపాత్ర వహిస్తాయి. పూర్వకాలం నుండి ప్రజలలో వున్న నమ్మకాలు, ఆచారాల వలన పండుగలు ఉద్భవించాయి. పండుగలు మానవ జీవితంలో భక్తి భావనను కలిగిస్తాయి. కనిపించని శక్తులపై నమ్మకాన్ని కలిగించి, నైతికంగా, సామాజికంగా, తాత్త్వికంగా మానవుడు బలపడేటట్లు చేస్తాయి.

"సంఘశ్రేయస్సు కోసం సంప్రదాయాన్ని నిల్పుకుంటూ ప్రత్యేకంగా సంవత్సరానికి ఒక పర్యాయం చేసుకునే వేడుకను పండుగ" అని చెప్పవచ్చు.

పండుగలు సామూహికమైనవి. సమాజంలోని వ్యక్తుల మధ్య పండుగలు సామరస్యాన్ని పెంపొందిస్తాయి.

ఆదిమ మానవుడు ప్రకృతిలోని శక్తులను నమ్మేవాడు. ప్రకృతి శక్తులను ప్రసన్నం చేసుకోవడం కోసం పూజలు చేసేవాడు. తర్వాత వ్యవసాయ సంస్కృతికాలంలో వ్యవసాయ సంబంధమైన పండుగలు చేశాడు. క్రమంగా నాగరికత అభివృద్ధి చెందినకొద్దీ శిష్టదేవతాగణం ఆవిర్భవించి, క్రొత్త దేవతల సృష్టి జరిగింది.

కోయవారు జరుపుకునే పండుగలు:

1) భూమి పండుగ

2) కొత్తల పండుగ

3) కొలుపులు

4) భీముడుపెళ్ళి

5) పొక్కల పండుగ

6) కప్పల పండుగ మొదలగునవి చేసుకుంటారు.

భూమి పండుగ: ఈ పండుగను మే, జూన్ నెలలో వర్షాలు పడిన తరువాత భూమిని దున్నే ముందు పంటలు బాగా పండాలని గూడెంలోని ప్రజలంతా ఆచరిస్తారు.

పండుగముందు రాత్రి పురుషులు వేటకు వెళతారు. వేటకు వెళ్ళే పురుషులు ఊరి పూజారి ఇచ్చిన పసుపును (బండారి) బొట్టుపెట్టుకొని, విల్లంబులు ధరించి, వేటకు వెళ్ళేందుకు సిద్ధమవుతారు. ఆ సమయంలో స్త్రీలు పురుషుల మీద పేడవేస్తూ, తరుముతూ, దేవతలను సిగ్గు పరుస్తూ, క్రింది గేయాన్ని పాడతారు.

"యోహోరేలా రేలారేలా రేరేల రేలరేలా
యోహో ముత్తెలమ్మ సిగ్గుమారె ముత్తెలమ్మ
యోహోముత్తెలమ్మ సిగ్గురాదు సిగ్గురాదు
యోహో గంగాలమ్మ సిగ్గుమాలె గంగాలమ్మ
యోహో గంగాలమ్మ సిగ్గురాదు సిగ్గురాదు

యోహో దండికొండ సిగ్గురాదు దండికొండ

యోహో దండికొండ సిగ్గురాదు సిగ్గురాదు

యోహో దూలపురాయి సిగ్గుమాలె దూలపురాయి

యోహో దూలపురాయి సిగ్గురాదు సిగ్గురాదు

యోహో ఊరిపేరు ఉట్టిగ్రామం దొరపేరు పొద్దయ్యదొర

యోహో దండికొండ ఎక్కెగాని దండిపోతునేసికిరా."

దేవతలందరిని సిగ్గుపరచినట్లయితే వారికి పౌరుషం వచ్చి, వేటకు వెళ్ళిన పురుషులకు జంతువులు దొరికేలా చేస్తారని గిరిజనుల నమ్మకం. ఈ గేయంలోని దండికొండ, దూలపురాయి అనేవి కల్లేరు గ్రామం దగ్గరగా వున్న కొండలు. కల్లేరు గ్రామస్థులు ఈ కొండ ప్రాంతానికి వేటకు వెళతారు. 'యోహో దండికొండ ఎక్కెగాని దండిపోతునేసికిరా' అని వేటకు వెళ్ళడంకాదు, వేటాడి రావాలని హేళన చేస్తారు. ఈవిధంగా స్త్రీలు పాటలు పాడుతుండగా, పురుషులంతా వేటకు వెళ్ళిపోతారు.

స్త్రీలు గ్రామ పెద్ద (పటేల్) ఇంటి దగ్గర చేరి, వేటకు వెళ్ళిన వారి పేర్లు చెబుతూ, వారు దుప్పినో, గొర్రెనో, వేటాడి తేవాలని దేవతలకు విన్నవిస్తూ పైన గేయాన్ని పాడతారు.

కొత్తలపండుగ:

కొత్తలపండుగనే సామల పండుగ అంటారు. పంట పండిన తరువాత గ్రామ పెద్దలు నిర్ణయించినరోజు ఈ పండుగను జరుపుకుంటారు. సంక్రాంతికి రైతులు కొత్తపంటను పిత్ృ దేవతలకు పూజలు చేస్తారు. కోయలు, కొండరెడ్లు కూడా కొత్తగా పండిన పంటలతో పితృదేవతలకు పూజలు చేస్తారు. పండినరోజే పండుగ అని ఆహారధాన్యాల సమృద్ధిని బట్టి జరుపుకునే ఈ పండుగ దేశ, ప్రాంత భేదం లేకుండా వుంటుందని చెప్పవచ్చు.

"ఓ ఆడవావే పాడవావే వేడకలు సేయరావె

పచ్చకోకలు కట్టుకొని బయలుదేరిందమ్మగారు

కోడకప్పుల గంగాలమ్మ, కొర్రెలు పండితే నీవురమ్మా
జోడు కప్పుల గంగాలమ్మ జొన్నలు పండితే నీవురమ్మా
ఊరువెళ్ళెదమ్మవారు ఊరునొక్క కేకవనె"!

ఏ పంటైనా సమృద్ధిగా పండడానికి దేవతలే కారణమని భావిస్తారు గిరిజనులు. అందుకే దేవతలను వారు అత్యంత నియమ నిష్ఠలతో పూజిస్తారు. కొర్రలు, జొన్నలు, సామలు మొదలైన ఆహార ధాన్యాలను సమృద్ధిగా పండించమని దేవతలకు విన్నవించి జంతుబలిచ్చి వ్యవసాయం చేస్తారు. పంటచేతి కొచ్చిన తరువాత కొత్తల పండుగ చేస్తారు.

కొలుపులు: గిరిజనులకు పురాణాలు, ఇతిహాసాలు తెలియవు. కాబట్టి రోగ నిర్మూలనకోసం, ఊరి సంక్షేమం కోసం దేవతల ప్రసన్నత కోసం కొలుపులు చేస్తారు.

"ఆడవాలే పాడవాలే వేడుకలు చేయవాలె
అమ్మవారి అడుగులో ఆడవాలే పాడవాలె
దొప్పతోడి భోజనాలు దిప్పతోడి కల్లు
కట్ల కట్ల తాగవాలె – ఓంపు కూడు తినవాలె"!

గిరిజనులు అరణ్యప్రాంతంలో నివసిస్తున్న వారు కావడంతో దేవతలకు బలియిచ్చి, సారా, కల్లుతో విందులు చేసుకుని నృత్యాలతో ఆనందించడమేకాని వాళ్ళకు జానపదులంత గంభీరంగా ఉత్సవాలు చేయడం తెలియదని పై గేయం వల్ల తెలుస్తుంది.

పొంగు, తట్టులాంటి రోగాలు రాకుండ గూడెంలో మంచి జరగాలని మూడు సంవత్సరాలకొకసారి మే నెలలో కొలుపులు చేస్తారు.

గిరిజనులు ప్రకృతిని, అక్కడి దేవతలను విడిచి నివసించలేరు. ఆచారం ప్రకారం దేవతల్ని కొలవకపోతే వాళ్ళు ఆగ్రహించి పులి, పామువంటి వాటి రూపంలో వచ్చి హానిచేస్తారని, రోగాలతో పీడిస్తారనీ భయపడతారు. గిరిజనులు కొలుపుల్ని సామూహిక ప్రయోజనంకోసమే జరుపుకుంటారు.

కప్పల పండుగ: వానకోసం చేసే పండుగ ఇది. వర్షంకోసం గిరిజనులే కాకుండా జానపదులు కూడా ఈ పండుగను ఆచరిస్తారు. ఇద్దరి భావన ఒకటయినా, చేసే

విధానాల్లో వ్యత్యాసం కనిపిస్తుంది. రాయలసీమ, బెంగుళూరులో ఈ ఉత్సవాన్ని కరిగ, కరగ ఉత్సవాలుగా చేస్తున్నట్లు తెలుస్తుంది.

భీముడి పెళ్ళి: కోయలు తమను భీముని సంతానంగా చెప్పుకుంటారు. ఘటోత్కచుడు భీమునికి, హిడింబికికి 'రేల' చెట్టుక్రింద పుట్టాడని అతని సంతతి వాళ్ళు కోయలని చెప్పుకుంటారు. అయితే ప్రతిగేయానికి ముందు వంశకర్త జన్మస్థలానికి గుర్తుగా 'రేల' అనే పదాలతో పల్లవి ఉంటుంది.

ఈ పండుగను మూడు సంవత్సరాల కొకసారి జరుపుకుంటారు.

పొక్కలపండుగ: ఎండిన విప్పపువ్వులను 'పొక్కలు' అంటారు. ఫిబ్రవరి, మార్చినెలల్లో విప్పచెట్లు పూతపడతాయి. అప్పుడు నిర్ణయించిన రోజున ఈ పండుగను చేస్తారు. కోడి, బియ్యం, విప్పచెట్ల దగ్గరకు తీసుకువెళ్ళి, కోడిని బలియిచ్చి, వంటచేసుకుని, చెట్టు కిందనే తింటారు.

కొండరెడ్లలో ఈ విధంగా జరిగిన తరువాత విప్పచెట్ల ఆకుల్లో కోడిగుడ్డుపెట్టి, ఎగరేస్తారు. అది క్రింద పడి పగిలితే ఆ సంవత్సరం పువ్వులు బాగా రాలతాయని వాళ్ళు నమ్ముతారు.

పండుగ అయిన దగ్గర్నుంచి రాలిన పువ్వులను ఏరి ఎండబెడతారు. వీటినుంచే సారాను తీస్తారు. విప్పచెట్లు పొలాల్లోనే కాకుండా గ్రామాల్లో అక్కడక్కడా వుంటాయి.

భాషా, పదప్రయోగం:

1) తెలుగు ప్రశ్నార్థక క్రియల్లో పదాది 'ఎ' కారం వస్తుంది. కోయలో 'ఎ' కారానికి బదులు 'బ'కా రాగమంతోపాటు వర్ణవ్యత్యయం కనిపిస్తుంది.

తెలుగు	**కోయ**
ఎవరు	బేనేడు
ఏల	బేలా
ఏమిటి	బాత
ఎప్పుడు	బెగ్గన్
ఎందుకు	బారి

2) తెలుగులో పదాదిన హల్లువుంటే, కోయలో అచ్చు వుంటుంది. తెలుగులో చ, న కారాలతో కూడిన ఈ ఏకారాలకు బదులుగా, కోయలలో 'ఏ' కారం వుంటుంది.

తెలుగు	**కోయ**
చీపురు	ఏపురు
నీరు	ఏరు
చేట	ఏతు
చెటువు	ఎఱ్ఱు

3) తెలుగు పదాల్లో పదం చివరవున్న హల్లులు, కోయభాషల్లో లోపిస్తాయి.

తెలుగు	**కోయ**
తడమండి(వెదకండి)	తడమ
తమ్ముడు	తమ్మ
చుట్టము	చుట్ట
తలుపులు	తల్పు

4) తెలుగు ధాతువులైన చేయు, కోయు, పాడు, ఎత్తు మొదలైన వాటికి కొండరెడ్ల, మాటలలో 'వ' కారాగమంగా వస్తుంది. పదంచివరి 'ఇ' కొండరెడ్లలో 'ఎ' కారంగా మారుతుంది. కోయలో 'ఇ' కారం లోపిస్తుంది.

తెలుగు	**కోయ**	**కొండరెడ్డి**
ఎత్తాలి	ఎత్తవాల్	ఎత్తవాలె
చెయ్యాలి	తుంగవాల్	చెయ్యవాలె
కొయ్యాలి	కొయదవాల్	కొయ్యవాలె
పాడాలి	అరయవాల్	పాడవాలె

5) తెలుగులోని వచ్చు, వెచ్చు ధాతువులకు పురుషప్రత్యయాలు చేరిన పదాల్లోని 'స' కారం పోయి 'త' కారం మిగులుతుంది. ధాతువు కానప్పుడు కూడ 'త'గానే కన్పిస్తుంది.

తెలుగు	**కోయ**
వస్తాను	వాతాను
తెస్తారు	తత్తారు

వస్తావా	వాతీనా
స్తంభం	తంబం

6) తెలుగుపదాల్లోని 'డ' కారం కొన్నిసార్లు రేఫ, శకట రేఫలుగా కన్పిస్తుంది.

తెలుగు	కోయ
కోడి	కొఱ్ఱు
పాడు	పారు
వేరుపడి	వేరుపార్

7) తాలువులు: తెలుగులో తాలవ్యీకరణం చెందిన పదాల్లో 'చ' కారం వుంటుంది. కాని తెలుగులో తాలవ్యీకరణం చెందిన పదాలు కోయలో తాలవ్యీకరణం చెందలేదు.

తెలుగు	కోయ
చెవి	కెల్చే
చేయి	కయ్చే
చేదు	కయేస్

8) తెలుగులో పదం చివర వున్న అద్విరుక్తమైన 'ల' కారం కోయలో ద్విరుక్తంగా వుంటుంది

తెలుగు	కోయ
నెల	నెల్ల
తల	తల్ల
లే/వేదు	ఇల్లే
వల	వల్ల
కల	కల్ల
ఎలుక	ఎల్లు(కకారలోపం)

9) అనునాసికాలు మార్పు చెందడం: తెలుగులో వున్న 'న' కారం కోయలో 'కా' గా కన్పిస్తుంది.

తెలుగు	కోయ
పని	ఫణి
కన్నులు	కణ్కి

10) తెలుగులో వున్న హ్రస్వం కోయలో దీర్ఘమౌతుంది.

తెలుగు	**కోయ**
వియ్యం	వియ్యాం
తునకలు	తునకాల్

11) తెలుగులో తాలువైన 'చ' కారం కోయలే ఊష్మమైన 'స' కారం వస్తుంది.

తెలుగు	**కోయ**
చుక్క	సుక్క
వచ్చి	వాసీ
చావు	సావు

12) తెలుగులో ప్రశ్నార్థక క్రియల్లో పదం 'వ' కారం వస్తే కోయలో 'న' కారం వస్తుంది.

తెలుగు	**కోయ**
వస్తావా	వాతీనా
వెళ్తావా	అంతీనా
ఆడతావా	కర్సి కడేనా
నిద్రపోతావా	ఉంజ్తినా
వండావా	అడ్తినా

13) వ్యతిరేకార్థక క్రియరూపాలు: తెలుగు (అ) ను (అ) దు ప్రత్యయాలు చేరి వ్యతిరేకార్థక క్రియరూపాలు ఏర్పడతాయి. కోయలు (ఒ) ను (అ) దు ప్రత్యయాలు చేరి వ్యతిరేకార్థక క్రియారూపాలు ఏర్పడతాయి.

తెలుగు	**కోయ**
రాను	వ(రోను
చేయను	తుంగోను
తినను	తిత్తొను
చూడను	ఊడొను
తీసుకురాను	త(రొను

సంఖ్యావాచకాలు:

తెలుగు	**కోయ**
ఒకటి	ఒరట్
రెండు	రెండు
మూడు	మూన్డ్
నాలుగు	నాలు
ఐదు	ఐదు
ఆరు	ఆరు
ఏడు	ఏడు
ఎనిమిది	ఎనిమిది
తొమ్మిది	తొమ్మిది
పది	పది

కోయభాషా ప్రయోజనం:

కోయభాష ద్వారా అనేక రకాలుగా గిరిజనులలో విద్యా వ్యాప్తి జరుగుతుంది. ఈ భాషలో లిఖిత సాహిత్యం లేకపోయినా తెలుగులిపితో కోయభాషలో 1,2,3,4 తరగతులకు 'కోయభారతి' పాఠ్యపుస్తకాలను తయారు చేసి కోయభాషలోనే విద్యాబోధన చేస్తున్నారు. దానిద్వారా గిరిజన విద్యార్థులలో విద్యాబోధన సులువుగా జరుగుతుంది. ప్రాంతీయ భాషలో విద్యాబోధనవల్ల గిరిజనులలో ఆసక్తి పెరుగుతుంది.

అంతే కాకుండా కోయభాషలో నిఘంటువులను కూడా తయారు చేస్తున్నారు. దీనిద్వారా గిరిజన విద్యార్థులు విద్యను అభ్యసించుటకు ఆసక్తి కనబరుస్తారు. వారికి అర్థమయ్యే రీతిలో వారి భాషలోనే విద్యార్జన జరుగుతుంది. గిరిజన ఉపాధ్యాయులనే నియమించడంద్వారా గిరిజన ప్రాంతాలలో వ్యాప్తి ఎక్కువగా జరుగుతుంది.

తిన్ తిన్ తమ్మా – తియ్యటి పణీతిన్
ఉన్ ఉన్ తమ్మా – గలిసెడి పాలు ఉన్
మన్ మన్ తమ్మా – ఆరోగ్యంగా మన్

భావం: తిను తిను తమ్ముడా – తియ్యటి పండ్లు తిను
తాగు తాగు తమ్ముడా – గ్లాసుపాలు తాగు
ఉండు ఉండు తమ్ముడా – ఆరోగ్యంగా ఉండు

(1) పాట

పల్లవి: రేరేలా రేరేలా... రేలా... రేరేలా రేరేలా ..రేలా.. 2

చరణం: మేయ్యాలు మేయవ్వా రాసిస్తేపోలు
పోలుచుట్టూ ఉడ్డాలే వెంకన్న ..రేరేలా..

చరణం: మీయన్నాలు, మేయంగే రాసిస్తేపోలు
పోలుచుట్టూ ఉడ్డాలే వెంకన్న ..రేరేలా..

చరణం: మేదాదాలు, మే అమ్మ రాసిస్తే పోలు
పోలు చుట్టూ ఉడ్డాలే వెంకన్న ..రేరేలా..

భావం: (పోలు – జొన్నపిండితోవేసిన పెళ్ళిపందిరి కింది ముగ్గు)
మీనాన్న మీ అమ్మ రాయించిన పోలు చుట్టు
తిరిగిపోలు మీద కూర్చో పెళ్ళికొడకా!
మీ అన్నా, మీ వదిన రాయించిన పోలుచుట్టు
తిరిగి పోలుమోదు కూర్చో పెళ్ళికొడుకా!
మీ దాదాయ (తండ్రికి తండ్రి) కు నాన్నఅమ్మరాయించిన పోలుచుట్టు
తిరిగి పోలు మీద కూర్చో పెళ్ళికొడకా!

(2) పాట

పల్లవి: రేరేలాయో రే లా రే లా రే లా .. రేరేలారేలా.....2

చరణం: పేరాంటాల చెవ్ దేరే వాల్తే
దులిపి తిందనాంకి అత్మూలే జుంజాం పెయిదీత్
కలబర్తనాంకి అత్మూలే జంజాం పెయిదీత్ ..రే..

చరణం: బోడో మెట్టాతె మిన్నానా వర్సోలే
గుడగుడా బెడబెడ యిర్రే వర్ర వర్సో ..రే..

భావం: పేరాంటాలు = పెళ్ళికూతురుకు సంబంధించిన నగలు తీసుకుని వస్తున్న స్త్రీ పేరంటాలు చేనిలో పెత్తెర వాలింది. దులుపుకొని తినడానికి పోతే కాగడ పట్టకొని గెదుముతుంది. కలబడటానికి పోతే కరవడానికి వస్తుంది.

(3) పాట

పల్లవి: రేరేలాయే రేలారేలా రేరేలాయో రేరేలా...రేలా...2

చరణం: రాయి మార్తా జెండచెల్లో ... రాయి మార్తా జెండాలే
జెండ ఊడీ నల్లారు చెల్లో... జెండ ఊడి నల్లారో
బేనికాటె నల్లారో... వర్సకాటే నల్లారో ..రేరే..

చరణం: తాండి మార్తా జెండచెల్లో ...2
జెండ ఊడోరో నల్లారో
బేన్ని తమ్మాలు నల్లార్ ..రేరే..

(4) పాట

పల్లవి: రేరేలాయో రేలా రేలా రేలా.... రేరేలా రేలా... 2

చరణం: వర్సవాని వియ్యాల్ బొందు ఇద్దో అద్దో
కయెదె వాటి నేల్దెవాట నెల్దెవాటి
కాల్దెరాక ఇద్దో అద్దో ..రేరే..2

చరణం: వర్సవాని వియ్యాల్ బొందు ఇద్దో అద్దో
కయెదె వాటి నేల్దెవాట నెల్దెవాటి
కాల్దెరాక ఇద్దో అద్దో ..రేరే..2

భావం: వర్సవారి వియ్యాపు కంకణం చేతిలో పట్టుకొని కిందపెట్టి కాళ్లతో రాకు పాయంవారి వియ్యపు కంకణం చేతిలో తీసుకొని మెడకు పెట్టు, మెడకు పెట్టి మేడలోపెట్టు.

భావం: రాయిమార = రావిచెట్టు

రావి చెట్టుపైన జెండ ఎప్పుడు రెపరెపలాడుతూ ఉండేది. ఇన్నాళ్లు మన స్నేహం కూడా అలాగే ఉంది. కాని ఈరోజు మమ్మల్ని విడిచి వెళ్ళుచున్నావు. మాకు మాటలు రావడంలేదు. మన స్నేహాన్ని వర్సవారు విడదీస్తున్నందుకు చాలా బాధగా వుంది.

19. ప్రపంచీకరణలో మాయమౌతున్న బంజారా సంస్కృతి

– డా.ఎ. సిల్మానాయక్
ప్రధానాచార్యులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాల, హైదరాబాద్

ఉపోద్ఘాతం

ప్రపంచీకరణ : ప్రపంచీకరణ అనే పదానికి ఆంగ్లంలో 'గ్లోబలైజేషన్' అని వ్యవహరిస్తున్నారు. ఈ పదానికి ప్రపంచస్థాయిలో అనేకార్థాలు ఉన్నాయి. "సమీకరణ, ప్రపంచ కుగ్రామం" మొదలైనవి. ఈ పదాన్ని సృష్టించిన మేధావుల ఆలోచనల ప్రకారం, జాతీయ రాజ్యాలస్థానంలో కొత్త ప్రపంచానికి వ్యవస్థల నిర్మాణం జరుగుతుంది. ఈ క్రమంలోనే వస్తువులు పెట్టుబడులు, ఉత్పత్తి, సాంకేతిక పరిజ్ఞానం ఒక దేశం నుండి మరొక దేశానికి ప్రయాణిస్తున్నాయి. అందుకే దీనిని పెట్టుబడిదారీ ఆర్థికాభివృద్ధి వస్తుగత నియమమే "గ్లోబలైజేషన్" అని అంటారు. ఎల్లలు లేని వ్యాపారం అనే మాట ద్వారా ప్రపంచ ప్రజలను మార్కెట్ మాయాజాలంలోకి లాగడమే దీని పని, దీని మూలంగా ప్రపంచస్థాయి సంస్కృతి కట్టుబాట్లు, కుల వృత్తులు, చేతి వృత్తులు మానవీయ విలువలు సమస్తం ధ్వంసమైనాయి.

1990 నుండి నూతన ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైనాయి. అప్పుడు ప్రపంచ స్థాయిలో "లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్" (ఎల్‌పిజి) మూలంగా మూడవ ప్రపంచ దేశాల ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో అనేక మార్పులు వచ్చాయి. దీని మూలంగా సమాజంలో చెడు ఫలితాలు వచ్చాయి. మానవ విలువలు ధ్వంసమైనాయి. డాలరు కట్టలే జీవితాన్ని నిర్దేశించే స్థితికి వచ్చింది. ప్రపంచమంతా ఒకే గ్రామం. ఎవరైనా ఏ దేశానికైనా స్వేచ్ఛగా రావచ్చు, పోవచ్చు తమ తమ వ్యాపారాలను చేసుకోవచ్చు.

"ప్రపంచాన్నంతా ఒకే సంతలాగా మార్చి, వస్తువుల్ని, మేధస్సును, ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకోవడం ప్రపంచీకరణ" అని చెప్పవచ్చు. (డా. సి. కాశీం–ప్రపంచీకరణ వ్యతిరేక సాహిత్యం, పిహెచ్.డి, సిద్ధాంత గ్రంథం అముద్రితం. పు. 6).

ప్రపంచీకరణ వలన జరిగినదంతా అభివృద్ధేకదా! అని వాదించేవారున్నారు. పది శాతానికి ఉపయోగపడే అభివృద్ధి వలన తొంభై శాతం ప్రజలు నష్టపోయారనే వాస్తవాన్ని మర్చిపోకూడదు. ప్రపంచీకరణ మూలంగా గ్రామాలు, చేతి వృత్తులు, కుల వృత్తులు, సంస్కృతి, వ్యవసాయ రంగం, దళితులు, గిరిజనుల జీవితాలు ఏ విధంగా ధ్వంసమైనాయో నేడు గమనించవచ్చు. ఆ పరంపరలో గిరిజనులైన బంజారాల సంస్కృతి ఏ రకంగా కనుమరుగైనదో తెలుసుకోవడం ఈ వ్యాసం ముఖ్యోద్దేశం.

జాతి ప్రత్యేక అస్తిత్వాన్ని నిలబెట్టి ముందు తరాల వారికి అందించబడేది సంస్కృతి. జాతి జీవన విధానాన్ని, సంస్కృతిగా వ్యవహరిస్తున్నాం. దీనినే కల్చర్ అని ఆంగ్లంలో పేర్కొంటున్నాం. సమాజ భౌతిక వికాసం నాగరికత అని, బుద్ధి వికాసం సంస్కృతి అని కొందరంటున్నారు. నాగరికత, సంస్కృతి రెండు సమానార్థకాలు కాకపోయినా, సంస్కృతిలో భాగమే నాగరికత. మానవుని ఉన్నత జీవనం గడపడానికి భౌతికంగా, మానసికంగా చేసే నిరంతర ప్రయత్నమే సంస్కృతి. సంస్కృతిలో వ్యవస్థ, రాజ్యం, మతం, జ్ఞానం, కళలు, వస్తుజాలం, పండుగలు, జాతరలు, కట్టుబాట్లు, కష్టసుఖాలు, పోరాటాలు మొదలైనవి అన్నీ భాగాలే. సంస్కృతి వికాసం, స్వరూప స్వభావాలు ఆర్థిక, రాజకీయ, సామాజికాంశాలపై ఆధారపడి ఉంటుంది.

భూమిమీద మానవ జాతి ఆవిర్భవించిన తర్వాత అనేక పరిణామాలు జరిగినాయి. మార్పు అనేది ప్రకృతి ధర్మం. జీవక్రమ పరిణామానికి ఇది ఎంతో అవసరం. అందుకే డార్విన్ అనే శాస్త్రజ్ఞుడు 'జీవ క్రమ పరిణామ సిద్ధాంతాన్ని' ప్రతిపాదించాడు. మార్పును అనుసరించి ప్రకృతిలో ఎన్నో వింతలు విశేషాలుజరిగినాయి. జరుగుతున్నాయి. అందుకే ఒక తెలుగు కవి 'మార్పు నా తీర్పు' అన్నాడు. మొట్టమొదట ఆదిమ మానవులందరూ గిరిజనులే. ఆదిమానవుడు కొండ గుహల్లోనూ, చెట్ల తొర్రల్లోనూ తలదాచుకునేవాడు. ఆ తర్వాత స్థిర నివాసాలు, వ్యవసాయం, చేతి వృత్తులు మొదలైనవి చేయడం ప్రారంభించారు. ఇవి అన్ని కూడ ఒక క్రమ పద్ధతిలో జరిగినాయి. మానవ నాగరికత అభివృద్ధి చెందే క్రమంలో కొందరూ నాగరికులైనారు. మరికొందరూ అనాగరికులైనారు. ఈ అనాగరికులనే మనం నేడు గిరిజనులని, ఆటవికులని, ఆదివాసులని రకరకాలుగా వ్యవహరిస్తున్నాం.

తెలంగాణ రాష్ట్రంలో సుమారు 13 గిరిజన తెగలున్నట్లు ప్రభుం గుర్తించింది. వారిలో ఒక తెగ బంజారులు/ లంబాడీలు/ సుగాలీలు. వీరిని ప్రాంతాల వారిగా వివిధ పేర్లతో పిలుస్తున్నారు. తెలంగాణాలో లంబాడా/బంజారులని, ఆంధ్ర ప్రాంతంలో సుగాలీ/లంబాడీలని, రాయలసీమలో బంజారా/ సుగాలీలని అంటున్నారు. వీరు ఎక్కువగా తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో విస్తరించి ఉన్నారు. వీరు వాలి సుగ్రీవుల జాతికి చెందిన వారమని చెప్పుకుంటారు. వీరి ముఖ్య స్థానం రాజస్థాన్ ప్రాంతం. వీరిలో ప్రధానంగా నాలుగు గోత్ర నామాలున్నాయి. అవి 1. చౌహాన్ (ఛోగోత్ చౌహాన్) 2. పమార్ (బారాగోత్ పమార్) 3. రాథోడ్ (సత్తాఇస్ గిత్ రాథోడ్) 4. జాదవ్/వడ్త్యా (బామన్ పాడా వడ్త్యా)

బంజారా సంస్కృతిలో స్త్రీల పూర్వ అలంకరణ

బంజారా స్త్రీలు దంతంతో తయారు చేసిన గాజుల్ని, వెండి కడియాలను, పూసల దండల్ని, రూపాయి బిళ్లల హారాన్ని, చెవులకు, ముక్కుకు, వేళ్లకు వెండి, బంగారు నగలను విస్తారంగా ధరిస్తారు. చిత్ర విచిత్రమైన, రంగు రంగుల గుడ్డలతో కుట్టిన లంగాలను, అద్దాలు, పూసలు, రంగు దారాలతో కుట్టిన రవికెలు, తలపై ఇరువైపులా వేలాడబడే జుట్టుకు వెండి ఆభరణాలు ధరిస్తారు. వీరిలో పరిశుభ్రత ఎక్కువగా ఉంటుంది. బంజారా స్త్రీలు సాహసవంతులు. వీరు శ్రావ్యమైన కంఠ స్వరం గలవారు. వీరు మగాళ్లతో సమానంగా అందరూ కలిసి గుంపుగా బృంద నృత్యం చేస్తారు. విలక్షణంగా కనిపించే బంజారా స్త్రీ రూపం నేడు కంటికి కనబడకుండా పోతుంది. మారుతున్న నేటి కాలంలో వారి వేష భాషలు పూర్తిగా మారిపోయే ప్రమాదం ఉన్నది. బంజారేతరుల సంస్కృతిని, వేష భాషల్ని నేడు వీరు అనుసరిస్తూ, అనుకరిస్తున్నారు. తమ పూర్వ సంస్కృతి సంప్రదాయాలపై బంజారేతరుల సంస్కృతి ప్రభావం పడింది. దీనితో వారి పూర్వ రూపాలు కనుమరుగైపోతున్నాయి.

పూర్వ అలంకరణ

1. టోప్లి-కన్యా-టిప్కి-పిన్నీస్

బంజారా స్త్రీలు ప్రధానంగా పెళ్లి అయిన వారు. తల వెంట్రుకల్ని రెండు సిగపాయలుగా తీస్తారు. దీని మధ్య నుండి పాపిట తీసి రెండు వైపుల జడను చక్కగా దువ్వుతారు. చెవులకు ముందు భాగంలో చెంపపైన వెండితో తయారుచేసిన గుండ్రని

ఆకారంగా తయారుచేసిన 'టోప్లి అనే రెండింటికి వాటిపై శంఖు ఆకారంలో ఉండే మరో ఆభరణం ఘుగ్రీ' అనే దానితో కలిపి కట్టుకుంటారు. రెండు వైపుల ఉన్న ఈ ఆభరణాలను నల్లని దారంతోగాని, లేదా గుడ్డతో తయారుచేసిన తాడు (డోరణ్)తో అనుసంధానం చేస్తూ మూడింటిని కల్పి కట్టుకుంటారు. రెండు వైపుల ఉన్న జడల్ని మూడు పాయలుగా ఆ తాడుతో కల్పి అల్లుతారు. ముళకో అనే జడ చివర్లో రంగు రంగుల దారంతో తయారు చేసిన పూందా అనే దానిని అమరుస్తారు. సీగపాయలకు టొప్లి అనే దానిపై వెండితో తయారుచేసిన పిన్నుల్ని రెండు వైపులా అమరుస్తారు. ఆ రెండు వైపులా ఉన్న పిన్నులకు కన్యా అనే వెండి గొలుసుల్ని అమరుస్తారు. అవి చెంపపై నుండి కింది వరకు వేలాడబడి ఉంటాయి. తలకు మధ్యలోనున్న పాపిట మధ్య భాగంలో టిప్కి అనే పాపిట బిళ్లను అమరుస్తారు. ఇది వెండితో అందంగా తయారుచేయబడి ఉంటుంది.

2. భూర్య–ఫుల్లి–మర్కి

బంజారా స్త్రీలు ముక్కుకు కుడి ఎడమ వైపునున్న రంధ్రాలకు పుడకల్ని ధరిస్తారు. కుడి వైపునున్న రంధ్రానికి భూర్య అనే పెద్ద ముక్కుపుడకను ధరిస్తారు. దీనిని బంగారంతో గుండ్రంగా తయారుచేస్తారు. ఈ గుండ్రని ఆకారంపైన రంగురాళ్లు అమర్చబడి ఉంటుంది. ఇది మందంగా ఉండి చక్కని ఆకారంతో చూడ ముచ్చటగా ఉంటుంది. అలాగే ఎడమవైపునున్న ముక్కు రంధ్రానికి చిన్న పాటి ముక్కుపుడకను ధరిస్తారు. దీనిని వెండి లేదా బంగారంతో తయారుచేస్తారు. దీన్నే బంజారాలు ఫుల్లి అంటారు. అలాగే చెవులకు వెండి లేదా బంగారంతో తయారుచేసిన కమ్మలు ధరిస్తారు. వీనిని మర్కి అంటారు.

బంజారా స్త్రీలు భూర్యను గౌరపదంగా భావిస్తారు. భూర్య లేకుంటే చాలా అవమానంగా భావిస్తారు. మారుతున్న నేటి నాగరికత మోజులో పడి తమ భూర్యను ధరిస్తే నామోషిగా భావిస్తున్నారు. తినడానికి తిండి లేకపోయినా పర్వాలేదు కాని, ముక్కుకు ఈ పెద్ద పుడక ఉండి తీరవలిసిందే. ప్రాచ్య, పాశ్చాత్య సంస్కృతి ప్రభావానికిలోనై, నేడు వీరు సాధారణంగా అలంకరించుకుంటున్నారు. ఇప్పటికి భూర్యను ధరించే 70 నుండి 80 సంవత్సరాల వయస్సు కలిగినవారు ఉన్నారు. ఇప్పుడు

బంగారం, వెండి ధరలు కూడ విపరీతంగా పెరగడం మూలానా, వాటిని కొనుక్కుని ధరించే స్థితిలో లేరు బంజారాలు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్నారు నేటి బంజారులు.

3. హాంస్లో-హాంస్లీ-రపీయార్ హార్

బంజారా స్త్రీలు మెడలో లావుపాటిగా, సన్నగా ఉండే వెండితో తయారు చేసిన 'హాంస్లో-హాంస్లీ' అనే కంటెల్ని ధరిస్తారు. ఇవి రెండు కూడ గుండ్రని ఆకారంలో ఉంటాయి. వాటిపై చక్కని ఆకారాలు, రంగు రాళ్లు అమరుస్తారు. వీటినే బంజారులు 'రూపేరో హాంస్లో, హాంస్లీ' అంటారు. అంటే వెండి కంటెలని అర్థం. అలాగే మెడలో వెండితో తయారుచేసిన చ్వాక్డీ/చోక్డిని ధరిస్తారు. రంగు రంగుల్లో ఉన్న పూసలు, ముంగల హారాన్ని కూడ ధరిస్తారు. అలాగే వెండి రూపాయి బిల్లలతో తయారు చేసిన హారాన్ని ధరిస్తారు. దీనినే బంజారులు 'రూపేర్ రపీయార్ హార్' అంటారు. పైన పేర్కొన్న ఆభరణాలన్నిటిని బంజారా నగల తయారి దారుడయినా సనార్/సునార్ అనే అతను తయారుచేస్తాడు. ఇతను వారి తెగలోనివాడై ఉంటాడు. ఈ హారాన్ని రత్నాల హారంలాగా బంజారులు భావిస్తారు. ఇది రాజరికానికి నిదర్శనం.

4. కాళి-ఖవ్య-పేటి (రవిక):

బంజారా స్త్రీలు రంగు రంగుల గుడ్డల్ని తీసుకొని, వాటిపై దారంతో చిన్నపాటి పూసల (లాల్డీ)తోనూ, చిన్న చిన్న అద్దాలు (కాచే) తోనూ, మధ్యలో పెద్ద అద్దాల (ఆర్సితో) వాటి చుట్టు రంగు రంగుల దారాలతో స్వయంగా రవికెను (కాళి) తయారు చేసుకుంటారు. అలాగే ఈ కాళి (రవిక)కి కుడి, ఎడమ భుజాలపై ఖవ్య అనే వాటిని అమరుస్తారు. ఈ ఖవ్యపై చిన్న పెద్ద అద్దాలు, వాటి చుట్టు రంగు రంగుల పూసలు, వాటి చివర్లో వెండి మువ్వల్ని రూపేర్ ఘు(గా)ని మధ్యలో అన్ని అంటే వెండి చిన్నపాటి వెండి బిల్లలు అమర్చి కుట్టుకుంటారు. అలాగే కడుపుపై ముందు భాగంలో ఈ రవికకు కింద పేటి అంటే డబ్బులు దాచుకునే చిన్నపాటి జేబును అందంగా తయారుచేసి అమరుస్తారు. రవిక ముందు భాగం అంతా కూడా ఎంబ్రాయిడింగ్ చేసి ఉంటుంది. వెనుక వైపు ఖాళీగా ఉండి కిందపైనా వరుసలో కుడి ఎడమలుగా దారంతో గాని లేదా గుడ్డతో తయారుచేసిన డోర్ అనే తాడుతో ముడి వేసుకుంటారు. ఈ కాళి (రవిక) చాల చూడ ముచ్చటగా ఉంటుంది. దానిని ఎంతో నైపుణ్యంగా వీరు తయారుచేసుకుంటారు.

5. ఫేట్యా (లంగా) -లేపో-ఫూందా

బంజారా స్త్రీలు రంగు రంగుల గుడ్డలు తీసుకొని వాటిపై చిన్న పెద్ద అద్దాలు (కాచే, ఆర్సి) పూసలు (లాల్డీ), రంగు రంగుల దారాలతో చక్కగా కుట్టి అలంకరిస్తారు. దీనినే పాటేరో ఫేట్యా (పట్టులంగా) అంటారు. లంగను నడుంకు కట్టుకోవడానికి జోరణ్ (బొందేలు) అనే వాటిని దారంతోగాని లేదా గుడ్డతో తయారుచేసిన తాళ్లను అమరుస్తారు. వాటికి చివర్లో రంగు రగుల దారాలతో ఫూందా (దారపు గుత్తి)ను అమరుస్తారు. ఈ లంగను తయారు చేయడానికి బంజారా స్త్రీలు చాలా కష్టపడుతారు. ఎందుకంటే వారి వస్త్రాల్ని వారే తయారుచేసుకుంటారు. లంగకు చివర్లో అంటే అంచులో పాటో అనే దానిని అమర్చి కుడుతారు. ఈ ఫేట్యా చాల కళాత్మకంగా తయారుచేసుకొని ధరిస్తారు. దీనిని తయారుచేయడానికి దాదాపు మూడు నుండి ఐదు నెలల వరకు సమయం పడుతుంది.

బంజారులను అనాగరికులు అని చెప్పిన సందర్భాలు చాలా ఉన్నాయి. నిజానికి వీరు అనాగరికులు కారు. వారి వస్త్రాలను వారే నైపుణ్యంగా కుట్టుకుంటారు. ఎలాంటి ప్రత్యేకమైన శిక్షణలు అవసరం లేదు. తరతరాలుగా పెద్దల నుండి పిల్లలు అనుకరిస్తారు. వారి కళానైపుణ్యానికి, ఓపికను చూసే వారు జోహార్లు కొట్టవలసిందే. నేడు చీరపై చిన్న, పెద్ద అద్దాలు, చమ్కిలు, రకరకాల పువ్వులతో అందంగా కుట్టుకుంటున్నారు. ఈ పనిని బంజారులు ఎప్పుడో చేశారు. నాగరిక సమాజంలో నానా రకాల తంటాలు పడుతూ, చీరలపై నేడు ఎంబ్రాయిడింగ్ చేసే పద్ధతిని బంజారా స్త్రీలు ఎప్పుడో అతి సులభంగా చేసుకున్నారు. నేడు అద్దాలు, పూసలు, పువ్వులు, చిమ్కిలు గల డిజైన్ చీరలు షో రూంల్లోనూ, మార్కెట్లలలో విపరీతమైన గిరాకి ఉంది. వాస్తవానికి వాటిని కొంతమంది బంజారులచే తయారుచేయించి అమ్ముకుంటున్నారు. ఇప్పటికి కూడా 70-80 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన బంజారా స్త్రీలు తమ పాత సంప్రదాయాలనే అనుసరిస్తూ, వారి వస్త్రాలను పూర్వ పద్ధతి ప్రకారం కుట్టుకుంటారు. చక్కని కంటి చూపుతో ఆరోగ్యంగా ఉన్న స్త్రీలు నేటికి తండాల్లో అక్కడక్కడా కనబడతారు.

6. టుక్రి-ఘుంటో (ముసుగు) – తీత్రి

బంజారా స్త్రీలు తన శరీరసర్వస్వాన్ని కాపాడుకోవడానికి తలపై నుండి కింది వరకు 'టుక్రి' అనే వస్త్రాన్ని ధరిస్తారు. ఈ టుక్రి తలపై నుండి కిందికి జారకుండా

ఉండేందుకు రూపేరో ఘుంటో (వెండి మువ్వలలో అమర్చబడిన అద్దాలు పకిడి)ను అమరుస్తారు. ఈ ఘుంటోను అద్దాలు (ఆర్సి) కాచే (చిన్న చిన్న అద్దాలు), పూసలు (లాల్డీ), రంగు రంగుల దారాలు (దోరా) తోనూ తయారుచేస్తారు. టుక్రీ కూడ రంగు రంగులతో ఉంటుంది. దానిపై కూడా చక్కని అద్దాలు, పువ్వులు, పూసలు కుట్టుకుంటారు. తలపైన ఉన్న ఘుంటోకు వెండితో తయారుచేసిన మువ్వల్ని, అన్ని (చిన్నపాటి గుండ్రని బిల్లలు)లను అమర్చి చక్కగా తయారుచేస్తారు. దీనినే బంజారులు 'రేపేరో ఘుంటో/ఘుంగటో' అంటారు. టుక్రీని ఎడమవైపు భాగాన్ని నడుముకు కట్టి, పాట్లి (ఏదైనా తిను బండారాలు దాచుకునే చిన్నపాటి పట్టి)ని తయారుచేస్తారు. ఎదపై నుండి కప్పుకునేందుకు పైటా కొంగుకు చివర్లో చిన్న చిన్న అద్దాల, మువ్వలు, పూసలు, రంగు దారాలతో అందంగా తయారుచేసిన తీత్రి (పైట జారకుండా ఉండేందుకు కట్టుకునే బరువైన వస్తువు)ని కట్టుకుంటారు. ఈ తిత్రిని ఒక వైపున టుక్రిని కట్టి ఇంకో భుజంపై నుండి వెనుకకు వేసుకుంటారు.

ముసుగు ధరించే సంప్రదాయం ఇప్పటికి బంజారుల్లో ఉన్నది. వారి వేషం మారినా ఏడుపు సంప్రదాయం మారలేదు. వారి దుఃఖాన్ని ప్రకటించేటప్పుడు ముసుగు వేసుకుని ఏడుస్తారు. ముసుగు పద్ధతి ఇప్పటికి మార్వాడి స్త్రీల్లోనూ, రాజస్థాని స్త్రీల్లోనూ, ముస్లిం స్త్రీల్లోనూ కనబడుతుంది. దీని ప్రధాన ఉద్దేశం పరాయి పురుషులకు ముఖం చూపించకూడదనేది వారి సంస్కృతిలో భాగం. ఇది పూర్వం రాజరిక కుటుంబాల్లో కనబడేది. ఇదే పద్ధతి బంజారుల్లో వచ్చిందని చెప్పవచ్చు. బంజారాల పూర్వ స్థానం రాజస్థాన్ అని మరువకూడదు. అందుకే అక్కడి సంప్రదాయాలను కొనసాగిస్తారు.

7. బలియా-బాజుబంద్

బంజారా స్త్రీలు ముఖ్యంగా పెళ్లైనావారు. చేతికి పూర్వం ఏనుగు దంతాలతో తయారైన బలియా అనే దందపు గాజుల్ని ధరించేవారు. అటూ తర్వాతా ఏనుగు దంతాలకు బదులు నేడు మామూలుగా దొరికే తెల్లని ప్లాస్టిక్ గాజుల్ని వేసుకుంటున్నారు. ఇవి భుజంపై నుండి మోచేతి వరకు ధరిస్తారు. భుజంపై ధరించిన రెట్ట గాజుల్ని "చూడేర్ బలియా" అంటారు. వీటికి ప్రత్యేకమైన స్థానం ఉంది అంటే పెళ్లైన పుణ్య స్త్రీలు రెట్ట గాజులు ధరిస్తారు. ఇవి వారికి తాళితో సమానం. ఈ గాజుల్ని వివాహ సమయంలో స్వయంగా పెళ్లికొడుకే తొడిగిస్తాడు. అవి కిందికి జారకుండా ఉండేందుకు బాజుబంద్ అనే వెండితో తయారుచేసిన గాజుల్ని ధరిస్తారు. బంజారాల్లో

ప్రత్యేకమైన తాళి ఉండదు. కాబట్టి, రెట్ట గాజులే వారికి తాళితో సమానం. భర్త చనిపోతే రెట్టగాజులు తీసేస్తారు. ఇవి లేని వారు విధవలుగా ఉంటారు. వీరు కేవలం మోచేతి వరకు మాత్రమే ధరిస్తారు. వీరిని బంజారులు రండాదీ (విధవలు) అంటారు.

8. వాంక్డీ-కస్సే-కోళ్డా/కుళ్డా

బంజారా స్త్రీలు ముఖ్యంగా పెళ్లైనవారు కాళ్లకు కంచు లోహంతో తయారుచేసిన వంకరటింకరగా ఉన్న గజ్జెల కడియాలు ధరిస్తారు. వీటినే వారు "వాంక్డీ" అంటారు. అలాగే కాళ్లకు కంచుతో తయారుచేసిన కస్సే అనే పట్టీలు జాంజే అనే మువ్వల కడియాలు ధరిస్తారు. అలాగే వెండితో తయారుచేసిన కుళ్డా/కొల్డా అనే కడియాలు ధరిస్తారు. ఈ సంప్రదాయం పూర్వం రాజ్యాన్ని పరిపాలించిన ఈ బంజారాలు తమ పట్టపు రాణులకు బంగారంతో చేయించేవారు. అందుకే రాజరికపు కన్యల సంప్రదాయం ఈ బంజారుల్లో ఉంది. బంగారం, వజ్రాలకు బదులు వీరు కంచు లోహంతో తయారుచేసిన ఆభరణాలు ధరిస్తారు.

9. అంకుళత – చట్కి-ఛల్లా

బంజారా స్త్రీలు పెళ్లైనవారు రెండు పాదాలకు మొత్తం పది వేళ్లకు బొటన వేలుతో సహా కంచు లోహంతో తయారుచేసిన మెట్టల్ని ధరిస్తారు. బొటన వేళ్లకు ధరించే వాటిని 'అంకుతళ' అంటారు. అంటే పెద్ద మెట్టెలు. అలాగే మిగిలిన వేళ్లకు ధరించే వాటిని చట్కిలు అంటారు. అంటే చిన్న మెట్టెలు. అలాగే చేతి వేళ్లకు వెండితో తయారైన రూపాయి బిల్లల్ని ఉంగరాలుగా ధరిస్తారు. వీటినే ఛల్లా అంటారు. బంజారాలకు సంబంధించిన పై ఆభరణాలు, వస్త్రాలు, గాజులు, మెట్టెలు, కడియాలు సమకూర్చు వ్యక్తిని 'రంగారా/భరావో' అంటారు. అంటే బంజారాల వస్త్రాల వ్యాపారి అని అర్థం.

ప్రస్తుత పరిస్థితి

పైన పేర్కొన్న వేషాధారణలతో ఉన్న బంజారా స్త్రీల అలంకరణ నేడు కనిపించకుండా పోతుంది. వలసవచ్చినవారుగా తమదైన ప్రత్యేక గుర్తింపుతో ఉన్న నాగరికతకు దూరమైనారు. వీరి బలం పోయింది. బతుకుపోయింది. చేనుపోయింది. చెలిమి పోయింది. చెట్టుకొకరు పుట్టకొకరుగా చెల్లాచెదురైనారు. ఏలిన రాజ్యాలు పోయాయి. ఉన్న రాజాభవనాలు పోయాయి. మంత్రులు పోయారు. వారి మాణిక్యాలు

పోయాయి. మారుతున్న నేటి ప్రపంచీకరణ ప్రవాహంలో వీరి వేశం, భాష, సంస్కృతి, బతుకంతా శూన్యమైపోయింది. ఇన్నాళ్లున్న వారి బలం, ధైర్యం, ఖ్యాతి, ఐక్యత అనురాగాలన్ని కనుమరుగైపోయాయి. నేడు బంజారాలు అల్లకల్లోలమై, వారి జీవితాలు సునామిలాగా అతలాకుతలమైనాయి. దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు. నాగరికతా మోజులో పడి వారి పరిస్థితి. 'పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుగా' ఉంది.

బంజారాల నిజ రూపం (వేశం) పోయినా తర్వాత, తమను తామే గుర్తుంచుకునే స్థితిలో లేరు. వారి వేషం, భాషలు మారిపోయాయి. వీరిలో ఐక్యత నశించింది. ధైర్యం సన్నగిల్లింది. బలం, బలగం నశించాయి. భూమిని నమ్మిన బంజారాలకు భూములు పోయాయి. కొద్దిపాటి భూముల్లో ధాన్యాలు పండకుండా కరువు కాటకాల్లో సతమతమౌతున్నారు. తినడానికి తిండి లేక, ఉండడానికి గూడు లేక, కట్టుకోవడానికి గుడ్డలేక 'అన్నమో రామచంద్రా' అంటూ తల్లడిల్లుతున్నారు. ఆకలి–అప్పుల్ని తట్టుకోలేక కన్న బిడ్డల్ని సైతం అంగట్లో పశువుల్ని అమ్మినట్లు అమ్ముకుంటున్నారు. రాజ్యాల్ని ఏలినోళ్లు రక్తాన్ని అమ్ముకునే దుస్థితికి వచ్చారు. ఇదంతా కూడ ప్రపంచీకరణలో భాగమే. రాజెవరో బంటెవరో తెలుసుకోలేని స్థితికి వచ్చారు. వీరి పూర్వ వైభవం రావాలంటే ముందు వారి అస్తిత్వాన్ని కాపాడుకోవాలి. వారి పూర్వ స్త్రీ అలంకారణలు మళ్లీ రావాలి. తండాలో ఏదో ఇరువై మంది మాత్రమే తమ పూర్వ రూపంలో ఉంటారు. వీరంతా కూడా 70–80 సంవత్సరాల మధ్య వయస్సున్న ముసలివారు. తర్వాత తరం బంజారా స్త్రీలు పూర్తిగా తమ పాత పద్ధతిలో లేరు.

బంజారాలు తమ పూర్వ వైభవాలను గురించి, ప్రధానంగా స్త్రీ వేషధారణ గురించి ముందు తరాల వారికి చెప్పాలంటే అవి పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం వచ్చింది. పూర్వ రూపాలను ప్రదర్శనశాలల్లోనూ, ఫోటోల్లోనూ, చలన చిత్రాల్లోనూ, ఇంటర్‌నెట్ వెబ్‌సైట్లోనూ చూసుకునే దౌర్భాగ్య స్థితి దాపురించింది. కావున బంజారులు, బంజారేతరులు, మేధావులు, విద్యావంతులు, కవులు కళాకారులు, పాలకులు వీరి సమగ్రాభివృద్ధికి పాటుపడాలి. వారి అభ్యున్నతికి కృషి చేయాలి. ఇప్పటి వరకు వీరి అభ్యున్నతికి పాటుపడుతున్న గిరిజనాభివృద్ధి సంస్థ ఇంకా చాలా కృషి చేయవలసి అవసరం ఉంది. అందుకే తెలంగాణ ప్రజా ఆశు కవి అందె శ్రీ గారు చెప్పినట్లుగా

"మాయమౌతున్నడోయమ్మా.. మనిషన్నవాడు" అనే గేయం లాగా కాకుండా మనిషి, మనిషి వేషభాషల్ని పరిరక్షించవలసిన బాధ్యత మన మీద, సమాజం మీద ఎంతైనా ఉన్నదనే విషయాన్ని చెప్పడమే ఈ వ్యాస ముఖ్య ఉద్దేశ్యం.

ఆధార గ్రంథాలు:

1. "బంజారా చరిత్ర సంస్కృతి- ప్రగతి" - చిన్యా నాయక్, బి. శ్రీలక్ష్మి ప్రాసెస్, బెంగుళూరు - 1998.
2. "సుగాలి సంస్కృతి-భాషా సాహిత్యాలు" - డా. గోనా నాయక్. ఎం. పద్మశ్రీ గ్రాఫిక్స్, హైదరాబాద్ - 2002.
3. "తెలుగు లంబాడీల గేయ సాహిత్యం" - డా. శంకరయ్య జనపాల, జనపాల వారి ప్రచురణలు - ఆవునూరు. 2001.
4. "ప్రాచీనాంధ్ర సాహిత్యంలో గిరిజన-జీవన చిత్రణ" - డా. గోపాలు, పిట్టవేణు. వినాయక ప్రింటర్స్, హైదరాబాద్ - 2009.
5. "నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం - జీవన చిత్రణ" - డా. సూర్యాధనుంజయ్, డి. శీతల్ పబ్లికేషన్స్, హైదరాబాద్ - 2009.
6. "బంజారా మౌఖిక కథలు" - డా. రాజారాం. జై. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం, పరిశోధనాలయం - 2009.
7. నల్లగొండ జిల్లా బంజారాల మౌఖిల కథలు - డా. సిల్మానాయక్. ఎ. - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్య గ్రంథాలయ పరిశోధనాలయం - హైదరాబాద్.

20. Background of Community

- **K. Vivek Vinayak**
9848612600

Yerukula is a plains-living tribe found almost in all the districts of the State of Andhra Pradesh. They are known with different names in different regions in a vast area, extending from the Ganges of river Godavari in the north, down to the plains of river Pinakini in the South. They are called as 'Korva' from the extreme south to the north of North-Arcot district in Tamilnadu while they are known as 'Yerukula', 'Korcha' and 'Kaikadi' in Telugu country. Mostly they are called Yerukula in Andhra region. Yerukula and Korcha in Rayalaseema area while they are known as Yerukula and also Kaikadi in Telangana region. But most of them who are found beyond the River Narmada in north are known as 'Kaikadi' who claim to have migrated from Telangana region of Andhra Pradesh (Deccan). Korcha or Korma are Kannada words which means Sooth-sayer. Kaikada is a Yerukula word. 'Kai' Means hand and 'Kadi' means stick in Yerukula parlance. As Yerukula women folk while engaged in fortune telling and fore telling study Palmistry and narrate the events with the help of a wand, they are called Kaikadi. The name "Koravan" is a Tamil word for Yerukula people in Tamilnadu.

"Yeruka" in Telugu, means knowledge or foretelling. Yerukula woman is known to have endowed with the faculty of sooth-saying and possess occult knowledge, she has the

charm to attracting the unsophisticated village women who are susceptible to credulity, when she strolls in the streets shouting "Yerukamma - Yeruka" means 'Prophecy' - 'mother-prophecy'. Dr. Oppert says, "It is highly probable that the name and the occupation of the fortune telling "Kuruvandlu or Kuluvandlu" induced the Telugu people to call this Tribe' Yerukulavandlu'. He further connects 'Kuru' with the root 'Ku' a mountain and in Tamil work of the ninth Century 'Kurru', or Kuru (Kurumagal) is given as the name of a hill tribe". .

The Rev.J.Cain, writing about the Yerukulas of the Godavari District, states that "among themselves they call each other 'Kuruvaru', but the Telugu people call them "Erakavaru or Erakalavaru". The name of the Tribe 'Yerukula' is derived from the Telugu word 'Eruka' which means knowledge or acquintance, as they are great fortune-tellers".

Balfour, writing on the 'Yerukulwad', alludes them as 'Krushiwanloo' and goes on to say that they style themselves 'Yerkai' and give the same appellation to the language in which they hold communication. 'The word 'Yerkal' here undoubtedly stands for 'Yerukula' and Krushi' for 'Korcha' by which name mostly they are known in Rayalaseema area. It is more appropriate to conjoin the profession of fortune-telling (Yeruka) with the origin of the name' Yerukula'.

Ethnically, linguistically and culturally the 'Kaikadi' and the 'Yerukula' are one and the same though they are known with different nomenclature in different regions. Mr.Kilts states that the Kaikadi are known as 'Korvars' in North Arcot and as 'Korvas' in the Karnataca. According to the specimen given in Hislop, the Kaikadi speak a gipsy language which contains

Tamil and Telugu words. Syed Siraj-UI-Hassan is of opinion that Erukula, Kaikadi, Karwali are one and the same who are found between the River Krishna in south and Narmada in North. He gives a valuable account of their occupation and physical appearance which are presently found among the Yerukulas of the state of Andhra Pradesh. He says "Ostensibly, the men of the tribe work as basket makers and mat-makers, day labourers, and musicians while the women wander from village to village as fortune-tellers and tatooers".

Yerukula community is divided into following seven clans (Gothram)

1) Kavadi
2) Sathupadi
3) Kuthadi
4) Kuthadi-Kavadi
5) Kuthadi Sathupadi
6) Manupadi
7) Mandraguthi

The yerukula elders informed that originally there are only two clans i.e., Kavadi and Sathupadi. It is a moiety social organization. It is believed that as their society has been multiplying there was decline in the moral values and rigid customs. The progeny of illegitimate unions were assigned different clans indicating the geresis and degree of illegitimacy Yerukulas believe that different clans were evolved on the basis of occupations they followed and matrimonial alliance.

The Kavadi clan people believe that their ancestors were carrying does it mean they if where the carries of the offerings

rather than shoe who made the offerings water, milk and milk products on bamboo sling (Kavadi) to Lord Venkateswara at Tirupathi for performing daily ceremonies and hence they are called Kavadi clan people. Similarly ancestors of people of Sathupadi gothram used to carry food, fruits and other offerings to god daily for performing daily rituals in the people of Lord Venkateswara on the Tirumala hills 'Sat' in Yerukula dialect means food. Generally in families who are having only one daughter they retain the daughter in the house by performing marriage of the girl to the sword. This girl would become devadasi. (servent of god) and is called Kuti in Yerukula dialect meaning virgin. The children born without marriage were given the name of Kuthadi gothram. In case the women belong to Kavadi clan the progeny inherit the Kuthadi Kavadi clan' and in case women belongs to Sathupadi clan they get Kuthadi Sathupadi gothram. The progeny born to a widow' after death of first husband inherit the clan of 'Manupadi'. In case the widow is kept by her maternal uncle (Menamama) the children will get the clan of 'Mandraguthi' ..

Each clan is further divided into several steps or surnames. The details of the names of steps of some of clans are as follows:-

Kavadi

1.	Kurakula	2.	Katta
3.	Devaraya	4.	Bongiri
5.	Nalgonda	6.	Lokini
7.	Sala	8.	Ambi
9.	Rastapuram	10.	Mangarai
11.	Mogili	12.	Dasu
13.	Annappa	14.	Vajagiri

15.	Sarla	16.	Yaraga
17.	Kaidulla	18.	Kavadi
19.	Nemalli	20.	Voni
21.	Banapuram	22.	Muddana
23.	Chittareddy	24.	Kojja
25.	Karreddula	26.	Vulligeddala
27.	Gujjala	28.	Pujari
29.	Eruku	30.	Kampa
31.	Malle	32.	Kaveti
33.	Vonam	34.	Budda
35.	Chittore	36.	Rasaputhra
37.	Bojjagani	38.	Kondati
39.	Anchi	40.	Vuyala
41.	Yeragdimala	42.	Kunchala
43.	Galaty	44.	Jaganadham
45.	Dinari	46.	Pittala
47.	Penugonda	48.	Badanapuri
49.	Bongiri	50.	Valagi
51.	Sorakayala	52.	Salolu
53.	Marigiri	54.	Veluttla
55.	Tegala	56.	Rayapuram
57.	Gadda	58.	Singam
59.	Madigani	60.	Mukara
61.	Avula	62.	Venkatagiri
63.	Yerraga	64.	Bayyana
65.	Chandra	66.	Meda
67.	Bjjanthri	68.	Koonreddy
69.	Kuthati	70.	Valguthula
71.	Nadigadda	72.	Vulagondla
73.	Myadapolu	74.	Undadi

75. Bellamkonda
76. Kethari
77. Ponarsu
78. Pengonda
79. Bangi
80. Medari
81. Pogadathula
82. Nekkili
83. Vanam
84. Valgumanu
85. Vasantha
86. Rayapudi
87. Sriramula
88. Rudraksha
89. Peram
90. Vekili
91. Katta
92. Budda
93. Yadagiri
94. Sathupadi
95. Srimaruthi
96. Sriram
97. Komsaram
98. Koneru
99. Kurra
100. Bijili
101. Kumbha
102. Hanumanthu
103. Dasari
104. Sarsarla
105. Valigi
106. Palaparthy
107. Chadala
108. Usarthy
109. Mecherla
110. Kondra Konda
111. Pothuraju
112. Garika
113. Garika Pogula
114. Puli
115. Periga
116. Kotimgundle
117. Kaki
118. Puvadi
119. Ragala
120. Pulicherla
121. Angadi
122. Pallkonda
123. Amballa
124. Pola
125. Ballari
126. Sadhani
127. Guthi
128. Sulthan
129. Motta
130. Kandula
131. Kemsaram
132. Losari

133. Sambaru
134. Dasiri
135. Balani
136. Revalli
137. Annagani
138. Alija
139. Karukondla
140. Koneti
141. Gunadari
142. Guramkonda
143. Devara
144. Devasari
145. Nalikuduru
146. Palakirthi
147. Ponna
148. Porasa
149. Balani
150. Bochu
151. Bagham
152. Markala
153. Rameshwari
154. Valagula
155. Valvayi
156. Etta
157. Penubodi
158. Singaram
159. Jinkala
160. Vebili
161. Jantula
162. Kale
163. Gorla
164. Tenugu
165. Dasara
166. Putha Bonthi
167. Chimma Sarthi
168. Duggale
169. Amavasa
170. Sake
171. Sangadala
172. Kamanchi
173. Bandi
174. Guthi
175. Aalegi
176. Chinnakuri
177. Manupadu
178. Sindasu
179. Ponna
180. Kaleti
181. Kumba
182. Pudtha
183. Yadoni
184. Pulishari
185. Devasani
186. Guthupa
187. Manupati
188. Rageer
189. Nasari
190. Naswaram
191. Piriga
192. Jetti
193. Surasura

Sathupadi Kuthadi

1.	Ponna	2.	Caleti
3.	Kumbha	4.	Pudutha

Sathupadi Kavadi

1.	Madugani	2.	Piriga

Mandraguthi

1.	Devara Konda	2.	Nallagonda
3.	Sriram	4.	Avula
5.	Kondareddy	6.	Gajjala
7.	Chinnapotula	8.	Nalabai
9.	Nalabothula	10.	Motta
11.	Mangarai	12.	Valepu
13.	Sri ram		

Manupadi

1.	Amasa	2.	Itta
3.	Kamanchi	4.	Madela
5.	Madline		

The elders in the yerukula community informed that some of the surnames in the three clans are also found in the rest of the four clans. Most of the members of the community claim to belong to important clans only which are free from any kind of stigm. The 'Sathupadi' clan claims superiority over the 'Kavadi' clan for matrimonial alliances The Sathupadi and Kavadi clans are known as 'Pothu' (male) and 'Penty' (female) respectively in local parlance since tile former was going in search of bride while the latter was in search of bride-groom. The manupaid and mandraguthi' clans are also called 'Penty' since these two clans also go in search of male for their daughters. The Kavadi, Mandraguthi and Manupadi clans fail under one group

as 'Penty' (Female) while sathupadi clan as 'Pothu' (male) which claims superior social status than the rest of the clans, Sathupadi clan men marry the women of kavadi clan and the Kavadi men also can take spouses from the sathupadi clan. All the families included in the sathupadi clan are considered 'Pothu' (male) while all the families included in the Kavadi clan are considered as 'Penlty' (female), It is said that the girls of 'Sathupadi' clan lose their social status by virtue of their being married to the men of Kavadi clan where as the girls of Kavadi clan acquire one degree of superiority by marrying the boys of the 'Sathupadi' clan. Whenever women of sathupadi clan are married to Kavadi clan male members, the former community people console themselves by saying that their woman given in marriage to Kavadi clan man would regain their lost social status through their daughters by being married to men of sathupadi clan. As per local custom in order to maintain this kind of social status the women who is given to 'Penty' clans must give her two daughters to the maternal uncle who would marry them to his sons. There was no social sanction of matrimony between the Sathupadi clan and Manupadi and Mandraguthi as one unit in view of their equal social status. The Kavadi clan next in social hierarchy had been playing a dual role unlike the sathupadi clan in the institution of marriage in Yerukula society. In the first instance, the Kavadi clan may offer their daughters to the Sathupadi clan and in return accept spouses for their sons. The Kavadi clan is offering their daughters to other clans also as receiving spouses for them. It is reported that under any circumstances the Sathupadi clan do not offer their daughters to Manupadi and Mandraguthi Clans, They do not want their daughters to lose again one more degree of

social status but they could sanction or assign one more degree of elevated social status to the spouses which they secure from lower clans. in the past marriages were solemnized between the two clans of sathupadi and kavadi. As the kavadi clan members are numerically predominent they have started also to give and take spouses from the other two clans of Manupadi and Mandraguthi. The sathupaid clan people, who are very dogmatic about preserving the chastity of their clan, have preferred to offer their daughters even for second and third marriages in Kavadi clan alone. As the Kavadi clan is already accepting spouses from other clans without depending upon Sathupadi clan, the sathupadi clan at present changes from their rigid custom are accept spouses from the other clans also.

The traditional Kulapanchayat (Tribal council) exercises control over social, religious and political aspects of the community. Each clan members have to perform the duties assigned to them through tradition and religious sanctions. The principal deities of yerukula are Venkateswara who is also known as Balaji and Narasimha. 'Sathupadi' clan has the right of decorating the God and dressing him in his festive attires. The 'Kavadi' is to carry the god and the regalia in procession during the festivities. The third clan 'Manupadi' drag the ternple car (Chariot) and sing and shout during its progress. They have to bring water from the sacred river for the ritual. The fourth clan viz., 'Mandraguthi' used to cleanse the temple and the temple premises. The mixed clans are riot assigned any kind of religious duties."

21. లంబాడీ భాషలో పొడుపు కథలు

బోడా రవి
పరిశోధనా విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం,

తెలంగాణలో గోర్ బోలి..

తెలంగాణ అంతట బంజారాలు తమ భాషను గోర్ బోలీ లేదా గోర్ వాతే అనీ, తమను తము గోర్ జాతి అని పిలుచుకుంటారు. బంజారా స్టడీ టీమ్ 1969 సం॥లో తొలిసారిగా వీరి భాషను "గోర్‌బోలి" అని వ్యవహారంలో ఉన్నదని గుర్తించారు. తమ జాతి వారిని గోర్‌లని పిలుస్తారు.

భారతదేశంలో వివిధ జాతుల వారికి వివిధ తెగల వారికి ప్రత్యేకమైన భాషలు ఉన్నాయి. వారి మాదిరిగానే లంబాడీలకు ప్రత్యేకమైన భాష ఉంది. లంబాడీ భాషలో వారు మాట్లాడే మాటల సందర్భాన్ని బట్టి పొడుపు కథలు చెప్పుకుంటారు.

లంబాడీ భాషలో పొడుపు కథలు:

తెలుగు భాషలో పొడుపు కథలు సందర్భాన్ని బట్టి ఉద్భవించిన మాదిరిగానే సందర్భాన్ని బట్టి పొడుపు కథలు ఉద్భవిస్తాయి. పొడుపు కథను సంస్కృతంలో "ప్రహేళిక" అని ఇంగ్లీష్‌లో Riddle అని పిలుస్తారు. తెలుగులో పొడుపు కథకు విడుపు కథ, తట్టు కథ, మారు కథ, చిక్కుముళ్ళు, అడ్డుకథ మొదలైన పేర్లు కూడా ఉన్నాయి. లంబాడీ భాషలో పొడపు కథను "ఓదడేర్ సాకీ" అంటారు. "ఓదడేర్ సాకీ" అంటే విడుపు కథ అని అర్థం. పోడేర్ సాకీ అంటే పగుల గొట్టుట (విప్పుట) అని అర్థం. లంబాడీలు పెళ్ళి సమయాల్లో, పండుగ సమయాల్లోను, పంచాయితీలోను ఒకరు పొడుపు కథను పొడుస్తు ఉంటే మరొకరు విప్పుతూ ఆనందంతో పొంగిపోతారు. ఈ వినోదం విజ్ఞానాన్ని, మేధను పరీక్షించే విధంగా కొనసాగుతుంది. లంబాడీల పొడుపు కథలకు తెలుగు జానపదుల పొడుపు కథల లక్షణాలు వర్తిస్తాయి.

పొడుపు కథల రకాలు:

1. ప్రకృతికి సంబంధించిన పొడుపు కథలు

దేవేర్ బేటా ఉంపర్ రుంచూ
పర్భాతి అవుచు సాంజ్ ఝూవుచూ (దాడో)
''దేవుని కొడుకును పైన ఉంటాను
ప్రొద్దున్న వస్తాను సాయంకాలం పోతాను'' (సూర్యుడు)

''బండి భరి ఝూరేమా ఎక్కజ్ కాంకర'' (చాంద్)
పుట్టెడు జొన్నల్లో ఒక్కటే రాయి (చందమామ)
''కాట్‌తో కటేని మారతో మరేని'' (చ్యాండి)
కోస్తే తెగదు కొడితే చావదు (నీడ)

2. వృక్ష సంబంధిత పొడుపు కథలు

''బందేని యాయేని పాల్లి బరో దూద్ దచ'' (తాడేర్ ఝూడ్)
కట్టదు ఈనదు మానెడు పాలు ఇస్తుంది (తాటి చెట్టు)
''ఎక్కజ్ మనిక్యర్ ఓల్డ బరే పోతర (గేరళ)
ఒక మనిషికి గంపెడు పిచ్చలు (తాటి ముంజలు)

3. పశువులకు పక్షులకు సంబంధించిన పొడుపు కథలు

''కాళో కట్ గట్లా గట్లహెట చార్ బోరే'' (బ్యాసిర్ వాడో)
నల్ల గుట్ట దానికింద నాలుగు బోర్లు (బర్రె పొదుగు)

4. పండ్లకు సంబంధించిన పొడుపు కథలు

''హరే పత్రాలేమా ధ్వాళో ధాన్
దాన్ ఖావచ్ కాళో నోగాంన్ బగవచ్ (శీతాఫల్)
పచ్చని విస్తరాకులో తెల్లని అన్నము
అన్నము తింటాము నల్ల కూరను పారవేస్తాం (శీతాఫలం)
''కరేని మాట్ల బరేని పాణి (నారళ్)
చెయ్యని కుండ పోయని నీళ్ళు (కొబ్బరికాయ)

5. మనుషులకు సంబంధించిన పొడుపు కథలు

"అవడిక్ కొల్లిమా లాత్‌బాయి నాచరీ" (జీబ్)

చిన్న గురిగిలో చిలుకమ్మ నాట్యం చేస్తుంది (నాలుక)

6. పనిముట్లకు సంబంధించిన పొడుపు కథలు

"బుంజి బుంజాయి కుకడి ఝూడేతి లడాయి మారి" (కొరాడి)

కాల్చబడిన కోడి చెట్టుతో పోరు పడుతుంది (గొడ్డలి)

గాపన్ గోయి గట్లపర్ చడేని (బండి)

కడుపుతో ఉన్న ఉడుము గుట్టపైన ఎక్కదు (ఎడ్లబండి)

ఆవడకో మటి కొల్డాగాలేన్ బ్యాటో (టోకనో)

చిన్న మనిషి కడియం ధరించి కూర్చున్నాడు (బిందే)

సాప్ సరక్ తిత్తర్ లటక్ (బోకన్య)

పాము జరుగుతుంది బురక వేలాడుతుంది (బొక్కెన)

గట్ల ఓటల్ జారోజేన సాన్‌డియా తామో (సిబ్బి)

గుట్ట డొల్లడానికి పోయినప్పుడు అంబోతు ఆపింది. (సిబ్బి)

7. తినుబండారాలకు సంబంధించినవి

యాడి బళేరి బేటి సిజ్‌రీ (గూగరి)

తల్లి కాలిపోతుంది. బిడ్డ ఉడుకుతుంది. (గుగ్గిళ్ళు)

పిస్సా గాలన్ లాస్ మునాగ మెళ్ళెన్ రోస్ (కాంద)

పైసలు పెట్టి తెస్తాం ముందల పెట్టుకొని ఏడుస్తాం (ఉల్లిగడ్డ)

సాత్ సాడో ఎక్‌లిజ్ భాంది (మొక్క)

ఏడు చీరలు ఒక్కటే కట్టింది (మొక్కజొన్న)

8. ఇతర పొడుపు కథలు

ఆవడిక సుంతల శార్‌జాన్‌ఆయి (వాట్)

చిన్న తాడు హైదరాబాద్ పోయి వచ్చింది (బాట)

కాలష్ గావడిరో కొల్‌జో మీటో (మంగాలేరుమాలో)

నల్లని ఆవుది గుండెకాయ తీపి (తేనె తుట్ట)
దోయి గట్ల ఆదివచ్చ సాండియాడాడో (పాదని)
రెండు గుట్టల మద్య ఆంబోతు రంకే వేసింది (పిత్తు)
కాళోసో ఘూలన్ ధ్వాలోసో కాడ (చుట్టా)
నల్లది పెట్టి తెల్లది తీస్తారు (చుట్టా)
ఏక్ యాడిర్ రాస్ముండో (బమ్మోళి)
ఒక తల్లికి చాలా ముఖాలు (పుట్ట)

లంబాడి భాషాలో పాడే గేయాల్లో అలంకారాలు కనిపిస్తాయి.

సంచార జీవులైన లంబాడీలకు అలంకార శాస్త్రం గురించి అవగాహన లేదు కాని సహజంగా వారి మౌఖిక గేయాల్లో అలంకారాలు నిక్షిప్తమయి ఉన్నాయి.

శబ్దాలంకారాలు:– శబ్దాన్ని ఆశ్రయించి ఉద్భవించే అలంకారాలను శబ్దాలంకారాలు అంటారు.

వృత్యాను ప్రాస అలంకారం :– ఒక అక్షరం లేదా పదం పలుమార్లు ఆవృత్తం కావడం వృత్యను ప్రాసాలంకారం అంటారు.

ఉదా:– "హాలో హాలోరే బాలకీయా"

పై ఉదాహరణలో "ల" అక్షరం అనేకసార్లు ఆవృత్తమైంది. అందువల్ల వృత్యను ప్రాసాలంకారం వస్తుంది.

అంత్యాను ప్రాసాలంకారం:– వాక్యం చివరగాని పాదం చివర గాని ఒక అక్షరం లేదా పదం ఆవృత్తమైతే అంత్యాను ప్రాసాలంకారం అంటారు.

ఉదా:– "యాడి బాగేన గీచ
ఖాటే అంబా లాయిచ
ముక్క ముక్క కాటిచ
కాటన్ అచార్ ఘాలిచ"

పై గేయంలో "చ" అనే అక్షరం ప్రతి చరణం చివర ఆవృత్తమైనది. కావున ఇది అంత్యానుప్రాసాలంకారం అంటారు.

ముక్తపదగ్రస్తాలంకారం: – వాక్యం చివరగాని పాదం చివరగాని ప్రయోగించిన మాటను లేదా పదాన్ని తిరిగి వెంటనే గ్రహించి ప్రయోగించడాన్ని ముక్తపదగ్రస్తాలంకారం.

ఉదా:– "ఉందర్ కత్త దల్దామా
దల్దా కత్త పాణి బరాగో
పాణి కత్త ఢోర్ పిగే
ఢోర్ కత్త గట్లామా
గట్లా కత్త బళ్గో "

పై గేయంలో చరణాంతంలో వాడిన పదాలనే తిరిగి వెంటనే గ్రహించి ప్రయోగించడాన్ని బట్టి ఇది ముక్తపదగ్రస్తాంకారం.

అర్థాలంకారాలు: – అర్థాన్ని ఆశ్రయించి ఉద్భవించే అలంకారాలను అర్థాలంకారాలు అంటారు.

ఉపమాలంకారం: – ఉపమానానికి ఉపమేయానికి చక్కని పోలిక చెప్పి మనోహరంగా వర్ణించడాన్ని ఉపమాలంకారం.

ఉదా:– "సీతారో ముండో చాంద్ నయి జగ్ జగ్ జాంకరో"
ఉపమేయం – ముండో
ఉపమానం – చాంద్
ఉపమావాచకం – నయి
సమాన ధర్మం – జగ్ జగ్ జాంకరో

పై ఉదాహరణలో ఉపమేయానికి ఉపమానానికి చక్కని పోలిక చెప్పి మనోహరంగా వర్ణించబడింది. కాబట్టి ఇది ఉపమాలంకారం.

అతిశయోక్తి అలంకారం: – ఒక వస్తువును ఉన్నదాని కంటే అధికం చేసి వర్ణిస్తే అది అతిశయోక్తి అలంకారం.

ఉదా:– " ఒ టాండేమా బంగ్లా రామేన లాగరేచ"

పై ఉదాహరణలో ఆ తండలో మేడలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఎత్తుగా కట్టినప్పటికి ఆకాశానికి తాకడం అసాధ్యం. కాబట్టి ఉన్నదానికి అధికం చేసి చెప్పటం వల్ల ఇది అతిశయోక్తి అలంకారం.

22. వరంగల్ జిల్లా లంబాడీల సామెతలు – పరిశీలన

శ్రీమతి అజ్మీర కవిత
రీసెర్చ్ స్కాలర్, తెలుగు & అనువాద అధ్యయన శాఖ,
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం

ప్రతి జాతి జీవితంలో సామెతలు ప్రత్యేక స్థానాన్ని పొందుతాయి. సామెతలను సందర్భానుసారంగా మాటల రూపంలో వాడుతూ ఉంటారు. ఒక్కొక్క సామెత వెనుక ఒక్కొక్క పరిపూర్ణ జీవిత సత్యమే దాగి ఉంటుంది. ప్రతి మనిషి తన నిత్యజీవితంలో సుఖదుఃఖాల రెండింటిని సమానంగా అనుభవిస్తాడు. తాను అనుభవించిన దాన్ని ఇతరులకు ఉపదేశాత్మకంగా, సందేశ రూపంలో చిన్న వాక్యంలో అందిస్తాడు. సామెతలు అనుభవాల నుండి పుట్టినవి. సామెత అనేది పెద్దల అనుభవం పొదిగిన ముక్క అని కూడా చెప్పవచ్చు. ఆ అనుభవం కేవలం ఒక్కరిది మాత్రమే కాదు. జన సామాన్యులందరిది. సామెత కూర్పు మాత్రం ఒక్కరిదే కావచ్చు. ఒక సూక్తిని కట్టినంత మాత్రానికే అది సామెత అనిపించుకోదు. అది ప్రజామోదాన్ని పొంది జనజీవితంలో చలామణి కావాలి. ఒక సంపూర్ణ జీవన సారమంతా ఒకే వాక్యంలో ఇమిడి ఉంటుంది. సామెతల గురించి పలువురు సాహిత్య పరిశోధకులు పలు రకాల నిర్వచనాల్ని ఇచ్చారు. కీ.శే. డా. విశ్వనాథ సత్యనారాయణగారు "ఒక పండితార్థాన్ని కొద్ది మాటలలో చెబుతుంది సామెత'' అని అన్నారు.

"సామెత–సాటవ అనునవి ఏకార్థమున ప్రయోగింపబడుచున్నవి. సాటి అయినవే సాటవ'' అని కీ.శే. డా. దివాకర్ల వేంకటావధానిగారు పేర్కొన్నారు.

"సామెతలలో సమత ఉంటుంది. వాక్య నిర్మాణం రెండు దళాలుగా ఏర్పడి ప్రాసగాని, యతిగాని రెండును జతకలసికొని వుంటుంది. స్థూలంగా లోకోక్తికి, సామెతకు గల భేదం నిరూపించినా దాని విలక్షణత శాస్త్రబుద్ధికిగాని విభిన్నాలుగా

తోపని పరిస్థితులు కూడా లేకపోలేదు. ఈ కారణాల వల్ల సామెత అనగా జన వ్యవహారంలో క్షుణ్ణమైన ఉక్తి అనే. అయితే ఇప్పటికి తృప్తి పడవచ్చు అనగా నలుగురి నోట పడి నలిగిన మాట అని అర్థం'' అని శ్రీ సంపత్ రాఘవాచారిగారు నిర్వచించారు.

సామెతలు నన్నయ భారత రచనకు పూర్వమే ఉన్నాయనీ శ్రీ సంపత్ రాఘవాచారిగారు సామెత అనేపదం మొదట 15వ శతాబ్దిలోని వరహపురాణంలో ప్రయోగింపబడిందని తెలిపారు.

సామెతల గురించి ఆరుద్రగారు ఇలా అన్నారు. "గతానుభవాన్ని దృష్టిలో ఉంచుకొని, వర్తమానాన్ని ఆలోచిస్తూ భవిష్యత్తునకు వర్తించునది సామెత'' అని నిర్వచించారు.

సామెత అనే మాట సామ్యత నుండి పుట్టింది. సంస్కృతంలో సూక్తి అని సుభాషితమని ఆంగ్లంలో Proverb అని అంటారు. సామెత గురించి ఆచార్య జి.ఎస్. మోహన్‌గారు ఇలా అన్నారు. సామెతలనగా "అల్పాక్షరాలలో అనల్పార్థ రచన'' అనుభవాన్ని సూటిగా చెప్పడం. "Much matter in decoted into a few words" అని Thomas fuller నిర్వచించారు.

"A short popular saying that express effectively some complete truth of useful thought" అని Random House Diction-ary నిర్వచించింది. "Proverbs are the cream of a nation's thought" Anon మొ॥ ఆంగ్లంలో నిర్వచించారు.

సామెతలు ఎప్పుడు పుట్టినాయో చెప్పటం చాలాకష్టం. రామాయణ కాలంనాటికే సామెతలు ప్రచారంలో ఉన్నట్లు "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ'' ఈ వాక్యం ద్వారా అర్థమవుతుంది.

ఆంగ్లభాషలో సామెతలు క్రీ.పూ. 3000 నాటికే ఉన్నాయని International Book of Quotations అనే గ్రంథం ద్వారా తెలుస్తుంది. సామెతలకు పండితుల కావ్యాలలో కంటే పామరుల నోళ్ళలోనే వాటికి స్థానమెక్కువ. సామెతలు అనేవి ప్రతి జాతికి సంబంధించిన జానపద సాహిత్యంలో ఒక భాగంగా ఉన్నాయి. సామెతల

పుట్టుక అనేది ఏరుల పుట్టుక లాంటిది. ఏరు ఎప్పుడు పుట్టిందో చెప్పడం కష్టం, అలాగే సామెత. ఎప్పుడు పుట్టిందో చెప్పడం కూడా కష్టమే. కాని వివిధ కోణాలలో ఆలోచిస్తే మాత్రం భాష ఎప్పుడు పుట్టిందో అప్పుడే సామెత పుట్టి ఉండవచ్చునని, దానితోపాటు మనిషి ఆలోచన శక్తి ఎప్పుడు ఆవిర్భవించిందో అప్పుడే పుట్టి ఉండవచ్చని అభిప్రాయపడవచ్చు.

సామెతల లక్షణాలు

1) సంక్షిప్తత, 2) వాక్యరూపంలో ఉండటం, 3) స్పష్టంగా ఉండటం, 4) అలంకారికమై ఉండటం, 5) సర్వజనీనమై ఉండటం, 6) ఉపదేశాత్మకంగా ఉండటం మొదలైనవి లక్షణాలుగా చెప్పవచ్చు.

లంబాడీలు ఉత్తరాది రాష్ట్రాల నుండి దక్షిణాది రాష్ట్రాలకు వలసవచ్చి ఉన్నప్పటికీ వారు తెలంగాణ ప్రాంత తెలుగు ప్రజలతో మమేకమయ్యారు. కనుక లంబాడీలకు, తెలుగు వారికీ ఆచార వ్యవహారాలలోనూ, జీవన శైలీలోనూ దగ్గర సంబంధాలున్నాయి. ఆలోచనా సరళిలో, విధానంలో, స్పందన, ప్రతిస్పందనలు జీవన సరళీ, ఊహలు ఒకే విధంగా ఉండే ఆస్కారం ఉంది.

లంబాడీలు ఎక్కువగా శ్రమ జీవులు. తమ దైనందిన జీవితంలో ప్రతీరోజు కష్టసుఖాలు అనుభవిస్తూ ఉంటారు. అందువల్ల వారు చేసే పనులను గురించి పెద్దవారు ఆ పని బాగుందో లేదో లేక సరిగా చేయలేదనో తెలిపేటప్పుడు దాన్ని గురించి సామెతల రూపంలో వారి మనసులోని భావాన్ని వ్యక్తపరుస్తారు. ఈ విధంగా లంబాడీలు తమ రోజువారి జీవితాలలో జరిగే సంఘటనలను సామెతలుగా చెప్పుకుంటారు. లంబాడీలలో నిరక్షరాస్యతా శాతమెక్కువ. అందువల్ల వాళ్ళు ఈ సామెతలను మౌఖికంగా ఒకరి నుండి ఒకరు నేర్చుకొంటారు. భాష బ్రతికి ఉన్నంత కాలం సామెతలు సజీవంగా ఉంటాయని చెప్పవచ్చు.

సామెతలను ప్రయోగించడం లంబాడీల జీవితంలో ఒక భాగం. సామెతలను లంబాడీ భాషలో సాకీ అని అంటారు. సామెతలు కూడా స్త్రీ, పురుషులు వేరువేరుగా ప్రయోగించే సందర్భాలు, అలాగే ఇద్దరు కలిసి ఒకేసారి ప్రయోగించే పరిస్థితులు కూడా ఉంటాయి. లంబాడీ భాషలో ఉన్న సామెతలను పరిశీలిస్తే కొన్ని తెలుగు సామెతలు లంబాడీ సామెతలు ఒకేలా ఉంటాయి. మరికొన్ని ప్రత్యేకంగా రెండు

భాషలకు సంబంధించినవి వేర్వేరుగా ఉంటాయి. ఇరువురికి సంబంధించినవి కొన్ని సామెతలను పరిశీలిస్తే –

1) బెల్లం ఉన్నప్పుడే ఈగలు వాలుతాయి
(గోళ్ రత్తోజో మాక్కీ వాళే)

మన దగ్గర సిరిసంపదలు ఉంటేనే బంధువులు, స్నేహితులు అందరూ చేరుతారు. అనే సందర్భంలో ప్రయోగిస్తారు.

2) బండిఎడ్లు ఒక్కటైతే గుట్ట ఎక్కవచ్చు.
బండి బళద్ ఏక్‌వతో గట్ల చడేవాసు.

అలాగే భార్యభర్తలు కలిసికట్టుగా ఉంటే ఎటువంటి సమస్యనైనా ఎదుర్కొనవచ్చు.

3) అత్తవి నాలుగు రోజులు, కోడలివి నాలుగు రోజులు
(సాసుర్ చార్‌దాడే బ్వాడిర్ చార్ దాడే)

ఏది ఎవరికి శాశ్వతం కాదు!

4) పెళ్ళి చేసి చూడు, ఇల్లుకట్టి చూడు
(ఘర్ బాంధన్ దేఖ్ వయకరణ్ దేఖ్)

పెళ్ళి చేయడం, ఇల్లు కట్టడం అనేవి కష్టంతో కూడుకున్నవి.

5) పేదోడి పెళ్ళాం అందరికొదినె
(గరిబెర్ గ్వాణి – సక్టెర్ భోజాయి)

బలహీనుడు అన్నా, అతని భార్య అన్నా అందరికీ చులకన.

6) నిద్ర చావు ఒక్కటే
(సుత్తోన్ మువ్వొ ఎక్కజ్)

నిద్రపోయినవాడికి ఏమి తెలియదు అనే అర్థంలో వాడతారు.

7) ఊరందరిది ఒక దారి ఉలిపికట్టదొక దారి)
(టాండే వాళెరొ ఏక్‌వాట్ పెంటియార్ ఏక్ వాట్)

గ్రామంలోని వాళ్ళని కాదని వేరుగా మాట్లాడేవారి సందర్భంలో ప్రయోగిస్తారు

8) నోరు మంచిదైతే ఊరు మంచిదే
(మూండో ఆచ్చొరత్తో టాండో సారీ అచ్చొజ్)

నోటి దురుసుగల వాళ్ళ గురించి ప్రస్తావించే సందర్భంలో ఈ సామెత వాడతారు.

9) కూర్చొని తింటే గుట్టైనా కరిగిపోతుంది.
(బ్యాసన్ ఖావతో గట్లాబి ఖుట్జా)

ఏ పని చేయకుండా కూర్చొని తింటే సంపాదనంతా ఆవిరైపోతుంది అనే సందర్భంలో వాడబడుతుంది.

10) సముద్రాన్ని ఈదవచ్చుకాని, సంసారాన్ని ఈదలేము.
(సంద్రేన ప్యారేవాసు పణన్ సంసారమేన ప్యారాని)

సంసారం ముందు సముద్రం చిన్నది అనే సందార్భంలో వాడుతారు.

అలాగే కొన్ని సామెతలు లంబాడీలలో మాత్రమే కనిపించేవి అవి.

1) పొటియాతి పంచాతి తుటేని
(పొట్టోనితో పంచాయితి తెగదు)

పొట్టివాడు ప్రతిసారి ఏదో ఒకటి అడ్డుపుల్ల వేస్తాడు.

2) ఆద్మి ఆంగ్ల అవడ – వాతే హతే సరికి
(మనిషి వేలంత – మాటలు చేతులంత)

చిన్నవాడైనా పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నప్పుడు వాడతారు.

3) కాణిన చాందిర్ కొచ్లో మళొతో పాణీ పీన్ పేట్ ఫోల్దిది.
(గుడ్డి దానికి ఇత్తడి కంచం ఇస్తే నీళ్ళు తాగి కడుపు పగలగొట్టుకుది)

వస్తువు విలువ తెలియని వాళ్ళ గురించి ప్రయోగిస్తారు.

4) కుత్రార్ పుంద్డి ఝులన్ ఖాల్యా ప్యారజు
(కుక్క తోక పట్టుకొని వాగు దాటినట్లు)

మూర్ఖునితో స్నేహం ప్రమాదకరం అనే సందర్భంలో ప్రయోగిస్తారు.

5) ఘాలేవాళో అప్నో అద్మిరత్తో కత్తె ప్యాసతోయి ఏకజ్.
(వడ్డించే వాడు మనవాడైతే ఎక్కడ కూర్చున్న ఒక్కటే)

మన మీద ప్రేమలేని వాళ్ళ గురించి మాట్లాడే సందర్భంలోనిది

6) సో లబ్బారి కరన్ తొయి వాయకర్నొ
(వంద అబద్ధాలు ఆడైనా పెళ్ళి చేయాలి)

మంచి పని చేసేటప్పుడు అబద్ధం ఆడినా పర్లేదు అనే సందర్భంలోనిది.

7) ఖెట్రి వాళ్ రత్తొ – పాణి వాళొగ
(నది వంకరతే నీళ్ళు వంకరనా)

మనిషి అంగవైకల్యం ఉన్నా మనసు మంచిది

8) దీయో రెత్తాజ్ ఘర్ సర్దలేనో
(దీపం ఉండగానే ఇల్లు సర్దుకోవాలి)

వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

9) కాక్లర్ సరాపేతి బళజ్ మరగే?,
(కాకి శాపంతో ఎద్దు చనిపోతుందా!)

కష్టపడకుండా కృషి లేకుండా ఏ విజయాన్ని అందుకోలేరు.ఖ

10) కుత్రాన ఖీర్ ఘాలేతొ కీడా కీడా కన్ కొ కచ్చొ
(కుక్కకు పాయసం పెడితే పురుగులు పురుగులు అన్నది)

అడగకుండా ఎవరికి ఏది ఇవ్వకూడదు. అలా ఇస్తే దాని విలువ వాళ్ళకు తెలియదు అనే సందర్భంలో వాడతారు.

ఇలా చెప్తూ పోతే సామెతలకు అంతం బహుశా ఉండకపోవచ్చు. మన జీవితంలో ఎన్నో సామెతలు నిలదొక్కుకున్నాయి. అవి ఒకదానికొకటి పెనవేసుకొన్నాయి. సామెతలు సమాజాన్ని ప్రతిబింబించే నిలువుటద్దాలంటే అతిశయోక్తి ఏ మాత్రం కాదని చెప్పవచ్చు.

పరిశీలించిన గ్రంథాలు

1) డా. జి.ఎస్. మోహన్ – 2010. జానపద విజ్ఞానాధ్యయనం.

2) డా. టి.వి. రామనరసయ్య – తెలుగు సామెతలు

3) డా. గోనానాయక్ – 2002. సుగాలి సంస్కృతి, భాష మరియు సాహిత్యం.

4) డా. సూర్య ధనుంజయ్ – 2009. నల్గొండ జిల్లా బంజారా సాహిత్యం – జీవన చిత్రణ.

5) డా. భూక్య తిరుపతి – 2005. లంబాడీ భాషా సాహిత్యాలపై తెలుగు భాషా ప్రభావం, ఎం.ఫిల్ సిద్ధాంత గ్రంథం (అముద్రితం).

6) క్షేత్ర పర్యటన వరంగల్ జిల్లా నర్సంపేట, ములుగు, వర్ధన్నపేట ప్రాంతాలు.

23. ఎరుకల వారి సంస్కృతి - సాహిత్యం

బి. భీమమ్మ
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

పరిచయం :

తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద ఆదిమ గిరిజన జాతిగా మనుగడ సాగిస్తున్న ఎరుకల తెగని "ఎరుకల" "కుర్రు" "కైకాడి'... వంటి పేర్లతో గుర్తిస్తుంటారు. ఇక్కడ "ఎఱుక" అంటే తెలిసినవాళ్ళు అనేది ప్రధాన అర్థం. వీళ్ళు సోదె (గద్దె) తెలిసినవాళ్ళు కాబట్టి "ఎరుక" జాతి పదంలో సమగ్రత వున్నది.

తెగలు :

రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన 33 గిరిజన తెగల్లో ఎరుకలది ఒక విశిష్టమైన తెగ. ఈ తెగల్లో తిరిగి 18 ఉపతెగలు వున్నాయి. అవి, దబ్బ ఎరుకల, ఈతకట్టె ఎరుకల, కూటు ఎరుకల, ఉప్పు ఎరుకల, ఎద్దు ఎరుకల భజంత్రీ ఎరుకల, తాళ్ళ ఎరుకల, ముగ్గు ఎరుల, కోతల ఎరుకల, కొత్త ఎరుకల, కావాలి ఎరుకల, కరివేపాకు ఎరుకల, కుంచపురి ఎరుకల, వూర ఎరుకల, పిట్టల ఎరుకల, మంత్రసాని ఎరుకల, పాముల ఎరుకల, బేరగాళ్ళ ఎరుకల.... మొదలగునవి.

ఎరుకలవారి గోత్రాలు :

సాతుపాడి, మానుపాటి, ఉయ్యాల, కావాడి మేంద్రగుత్తి, బండి....

ఎరుకల అర్థ వివరణ :

ఎరుకలవారు చాలా వరకు ఎరుపు వర్ణంలో ఉంటారు. కాబట్టి ఎర్రటివారు అనే అర్థంలో "ఎర-కల్ ఎరుకల్-ఎరకల" అయివుంటుందనేది కొందరు పరిశీలకులు భావిస్తున్నారు.

ఎఱుక అనగా :

తెలియుట, జ్ఞానం, అనే అర్థాలు వున్నాయి. ఎఱుకలవారు అన్ని తెలిసినవారు అనే అర్థంతో ఎరుకల శబ్ద వ్యుత్పత్తి జరిగి వుండవచ్చు. "సోదె" అనగా అన్ని తెల్సుకోగలిగే వారుగా అర్థం చేసుకోవాలి. ఎఱుక అనే పదానికి తెలివి, జ్ఞానం ఇవేకాకుండా ప్రజ్ఞ, స్మృతి, వివేకం, విచక్షణ, కనుగొనడం, గుర్తు, అవగాహన.... అనే పర్యాయ పదాలున్నాయి. గుర్తులేదా జ్ఞపిక్తి వుంది అనడానికి "ఎరుక" వుంది అనడం, తెలుసు అనడానికి నాకు ఎరుక అనడం, అర్థమైందా అని అడగడంలో ఎరకయ్యిందా! అనడం మొదలగునవి సాధారణ వ్యవహారాల్లో కనిపించే పదాలు. ఈ విధంగా "ఎరుక" అనేది మనిషి మానసిక వివిధ స్థితుల్లోని ప్రతిభను వ్యక్తపరుస్తున్నది.

చారిత్రక కథనాలు :

చారిత్రకంగా ఎరుకల జాతికి చెందినవాడుగా చెప్పబడుతున్న ఏకలవ్యుడు "హిరణ్యధన్వుడు" అనే ఎరుకలరాజు కుమారుడు. ఈ విషయం గురించి నన్నయ్య భారతంలోనూ చెప్పబడింది. ప్రపంచంలో ప్రసిద్ధిగాంచిన తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి జీవిత చరిత్రలో ఎరుకలవారి పాత్ర అత్యంత కీలకమైంది. పద్మావతీదేవిని పరిణయం ఆడేందుకు వెంకటేశ్వరస్వామి ఎరుకల నాంచారి రూపంలో రావడం అనేది ఎరుకల జాతికే గర్వకారణం.

నృసింహ పురాణంలో నరసింహస్వామిని వివాహం ఆడేందుకు ఆదిలక్ష్మి ఎరుకలసాని చెంచులక్ష్మి వేషంలో రంగ ప్రవేశం చేస్తుంది. హిమవంతుని కూతురు పార్వతీమాత, సుబ్రహ్మణ్యుడి భార్య వల్లీదేవిలను గిరిజన స్త్రీలుగా చెప్పుకోవచ్చు.

శ్రీకాళహస్తిలో భక్తకన్నప్ప ఎరుకలరాజు కుమారుడు. శివుడికి కన్నులు సమర్పించిన వీరభక్తుడు. ఇతని పూర్వనామం తిన్నడు.

ఎరుకల సాహిత్యం :

ఎరుకలవారి మౌఖిక సాహిత్యంలో సామెతలు, పొడుపుకథలు, గేయాలు, కథలు ఎంతో విశిష్ట స్థానాన్ని ఆక్రమించుకున్నాయి.

1) **సామెత :** సిన్నగిందాప్పుడు పొరకలు ఇచ్చోటు, ఇదేదాయామ్మ ఈక్కెతోకలు అండట్టు.

అర్థం: పోరగాళ్ళప్పుడు పొరకట్టలు అమ్మి, ఇవేంటివమ్మో ఈకలు తోకలు వున్నాయన్నారట.

వివరణ: ఈ సామెత ఆయా వ్యక్తుల్లో సానుకూల పరిస్థితుల నేపథ్యంలో వచ్చే దాంభికానికి సంబంధించిన మార్పుల్ని సూచిస్తున్నది. తెలుగులో చిన్నప్పుడంతా చింతకాయలు అమ్మి ఇవేంటమ్మా వంకరొంకర కాయలు అనే సామెత, ఈ సామెతకు సమానార్థాన్ని ఇస్తున్నది. ఈ సామెత ప్రకారం ఒకప్పుడు లేమితో బ్రతికి, కాలం కలిసిరాగానే తెలిసిన/అనుభవించిన విషయాన్ని సైతం తెలియనట్టుగా అపురూపతని ప్రదర్శిస్తుండే కొందరి వ్యక్తుల మానసికస్థితి అవగతమౌతున్నది. ఇలాంటివాళ్ళు ఎరుకలవాళ్ళలో చాలా మంది వున్నారు. వారి వారి జీవన పరిస్థితుల్ని పొందివున్నప్పుడు, మునుపటి కష్టాన్ని మరిచిపోయి ప్రవర్తిస్తుంటే... అలాంటివాళ్ళని ఉద్దేశిస్తూ ఈసామెత సూటిగా వెలవడుతుంది, వాస్తవానికి ఇక్కడ ఇలాంటివాళ్ళు పొరకట్టలు అమ్మి వుండొచ్చు వుండకపోవచ్చు, కాగా, ఈ పొరకట్టలు పదంలో ఒకప్పటి వారి కష్టకాలం పొందుపర్చబడి వుంది. "ఈకలు-తోకలు" పదాల్లో వారిలో తెచ్చిపెట్టుకున్న మార్పు సూచింపబడింది. మొత్తానికి ఈసామెత ఒక విమర్శనాస్త్రం వంటిది.

2) **సామెత:** పట్టుగుడ్డల సారెకోసం – పెట్టెలే పుదుసుకుండు అందాట్లు.

అర్థం: పట్టుబట్టల సారె కోసం పెట్టెలు పట్టుకొచ్చినట్టు.

వివరణ: ఈ సామెతలను ఎదుటివాళ్ళ కానుకల కోసంగాని, వస్తువుల కోసంగాని, లేదా మరేదైనా ఉచితంగా లభించే వాటికోసం ఎగబడే వ్యక్తులను ఉద్దేశిస్తూ ప్రయోగింపబడుతుంది. ప్రపంచంలో ఏ సమాజంలో అయినా తమ జేబుతో సంబంధం లేకుండా తమ స్వంతం అయ్యే వాటికోసం చేతులు చాచేవాళ్ళు అక్కడక్కడా కనిపిస్తుంటారు.

సామెతలో కనిపిస్తున్న "సారె" సంప్రదాయం ప్రసిద్ధమైనది. ఆ సందర్భంగా ఇచ్చే పట్టువస్త్రాలు చిన్న సంచిలో సరిపోతాయి. కాని వాటికోసం పెట్టెలు

తీసుకువచ్చారనడంలో ఆశ అనేది ఎంత పెద్దగా వుందో అర్థమౌతుంది. ఇలాంటి ఆశలు సముచితంకాదు అని మరొకసారి చెప్పుకోవచ్చు. తెలుగులో "నాలుగు సద్దకుంకులు (సజ్జ కంకులు) ఇస్తానంటే నాలుగుబండ్లు కట్టుకొస్తే ఏమనాలి? అనే సామెత ఈ సామెతకు సరిగ్గా సరిపోతుంది.

3) సామెత: కొడలు అర్లదికే కాని బెర్రుతనం తెలిదుల్ల.

అర్థం: పేగులు అరుస్తుంటాయి, గాని పెద్దరికం తగ్గదు.

వివరణ: ఈ సామెతను "తమ దగ్గర ఏమీ లేకపోయినా సరే తలొగ్గని" వ్యక్తుల్ని ఉద్దేశించి ప్రయోగిస్తుంటారు. ఎరుకలవాళ్ళు చాలామంది పేదరికంలో మగ్గుతున్నవాళ్ళే, ఈ క్రమంలో ఇక్కడ "పేగులు" అనేపదం ఆకలిని సూచిస్తుంది. పేగులు అరుస్తున్నాయి అనడంలో ఆకలితో అలమటించడం అర్థాన్ని గైకొనవచ్చు. అయితే ఎంతో కష్టపడుతూ కూడా మరెంతో వెనకబడిపోయి వున్న ఈ ఎరుకలవాళ్ళలో ఆత్మగౌరవానికి ఆత్మవిశ్వాసానికి మాత్రం కొదవలేదు. కాబట్టే పరిస్థితుల రీత్యా పస్తులు వుండాల్సి వచ్చినా, గంభీరతని వదులుకోని వ్యక్తులు, చేయిచాచని వ్యక్తులు, ఎందరో కనిపిస్తూ నిరాడంబరతకు నిదర్శనంలా అగుపిస్తుంటారు. తెలుగులో "ఇంట్లో కంచం కడగకపోయినా పంచె మాత్రం నలగదు" అనే సామెత ఇందుకు సమానర్థాన్ని ఇస్తుంది.

పొడుపు కథలు :

1) **పొడుపు:** ఊటు మినుగల్లె కొందుగుండు ఇక్య, ఊడడ్డి పాతుగుండు ఇక్య.

విడుపు: ఊటు దేవురు.

అర్థం: ఇంటిముందే కూర్చుంటుంది, ఇల్లంతా కలియజూస్తుంది. (ఇలవేల్పు)

వివరణ: ఇంటి ముందు ఎవరు కూర్చుంటారు. కూర్చుని ఎందుకు ఇల్లంతా కలియజూస్తారు? అంటూ ఇతరులు లోతుగా ఆలోచన చేస్తేగాని సమాధానం దొరకని పొడుపుకథ ఇది! ఇందులో ఎరుకలవారి దైవచింతన, దేవతారాధనకి సంబంధించిన ఆధ్యాత్మిక జీవనవిధానం, స్పష్టంగా కనిపిస్తుంది.

ఈ విషయాన్ని విశదీకరిస్తే... సాధారణంగా ఎరుకలవారు ఎల్లమ్మ, పోచమ్మ, బాలమ్మ... మొదలగు దేవతల్ని మనసారా ఆరాధిస్తుంటారు. ఈ విధానంలో భాగంగా చాలామంది ఎరుకలవారికి తమ ఇళ్ళముందే చిన్నగూడు నిర్మించుకుని దేవతల్ని ప్రతిష్ఠించి పూజించే ఆచారం వుంటుంది, ఇలాంటి దేవతల్ని వీరు "ఇడుపుదేవర" అని పిలుస్తుంటారు. ఈ దేవతల్ని ఉద్దేశిస్తూ ప్రస్తుతం ఇంటి ముందే కూర్చుంటుంది అంటున్నారు, ఇక ఇల్లంతా కలియజూస్తుంది అనడంలో దాగివున్న మర్మం ఏంటంటే "ఇంటిల్లిపాదిని కాపాడుతుంది" అని చెప్పడమే! మొత్తానికి ఈ పొడుపు కథ ఎరుకలవారి సంస్కృతిని ప్రతిబింపజేస్తుంది అని చెప్పవచ్చు.

2) **పొడుపు:** కొట్టంకోరు మోతునిగే, గోడమోనుండు అడుపుకోరు బుచ్చు.

విడుపు: పిడక / నుగ్గు.

అర్థం: కొట్టంలో కొడితే, గోడమీది నుండి పొయ్యిలోపడే (పిడక/నుగ్గు).

వివరణ: ఈ పొడుపు కథ ఎరుకలవారి వ్యవసాయిక, గ్రామీణ, జీవన సౌందర్యాన్ని వెల్లడి చేస్తున్నది, కట్టెలపొయ్యిమీద ఆధారపడి జీవనం సాగించే ఈ ఎరుకలవాళ్ళు తమ పశువులపేడతో పిడకల్ని తయారు చేసి, వాటిని కట్టెల పొయ్యిలో అగ్గి బాగా రాజేసుకోవడంకోసమై వినియోగించుకుంటారు. పిడకల నుండి వచ్చేవేడి తీవ్రత అధికం కాబట్టి, వంట తర్వగా కావడంకోసం కూడా వీళ్ళు పిడకల్ని ఎక్కువగా ఉపయోగించుకోవడం కోసం ఆసక్తి కనబరుస్తారు.

ఇక పొడుపుకథని విశదీకరిస్తే... ఇక్కడ కొట్టం అనేది పశువుల్ని కట్టేసే చోటు పేడవుండేది కూడా ఇక్కడే కాబట్టి అక్కడ వున్న పేడను చందమామలుగా కొట్టడం, అవి బాగా ఎండిన తర్వాత పొయ్యి మంటకోసం ఉపయోగించుకోవడం ఇవన్నీ సాధారణంగా జరిగిపోయే విషయాలు.

3) **పొడుపు:** అగ్గిరాజును ఆనపుడికిసూ.

విడుపు: సిబ్బి.

అర్థం: అగ్గిరాజును ఆనబట్టే (సిబ్బి).

వివరణ: ఎరుకలవాళ్ళు సాధారణంగా చెప్పుకునే ఈ పొడుపుకథలో "అగ్గిరాజు ఎవ్వరు?" వాడిని ఆనబట్టేది అంటే అడ్డుకుంటున్నది ఎవ్వరు? అని ఒకసారి ప్రశ్నించుకుని గమనిస్తే... అప్పుడే వండిన గంజితో కూడిన అన్నం కుండను ఇక్కడ కనిపిస్తున్న "అగ్గిరాజుగా" చెప్పవచ్చు.

పొయ్యిమీద నుంచి అప్పుడే దించిన కుండ తీవ్రమైన వేడిని కలిగివుంటుంది. కాబట్టి "అగ్గిరాజు" అని అభివర్ణించడంలో ఎలాంటి సందేహంలేదు. అలాగే అన్నంలోని గంజిని వార్చేందుకు "సిబ్బి"ని ఉపయోగించడం అనేది నేటికినీ అలవాటులో వున్న ప్రక్రియ, ఈ సిబ్బినే ఆనబట్టేదిగా పేర్కొంటున్నారు.

ఈ పొడుపు కథలో ఎరుకలవాళ్ళు వండి వార్చుకునే పాతకాలపు అలవాటుతో పాటుగా, వారివృత్తి విధానం కూడా ద్యోతకమౌతున్నది. ఎలా అంటే... సిబ్బిలు అల్లి అమ్ముకోవడం, వీరివృత్తి ధర్మంలో ఒకభాగం. ఒకప్పుడు అందరి ఇళ్ళల్లో అన్నం వార్చడంతో పాటుగా, కడిగిన కూరగాయల నుండి నీళ్ళు ఒడవడానికి, గుగ్గిళ్ళు వార్చడానికి, ఇలాంటి ఎన్నో విషయాల్లో సిబ్బిని విరివిగా ఉపయోగించేవాళ్ళు. ప్రస్తుతం ఆధునిక ఉపకరణాల పుణ్యమా అని సిబ్బిల వినియోగం తగ్గిపోయింది. అయినప్పటికీ అవసరంమేర అడపదడపా వీళ్ళు సిబ్బిలు అల్లుతుంటారు, అమ్ముతుంటారు. అడవుల్లో దొరికే దుస్సిరితీగ, వావిలితీగతో సిబ్బిలను తయారు చేస్తారు.

ఎరుకలవారి గేయ సాహిత్యం :

ఎరుకలవారి సాంస్క ృతిక జీవనం, వారి ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, విశ్వాసాల చుట్టూ పరిభ్రమిస్తూ వుంటుంది. ఒక వృక్షానికి వివిధ లతలు అల్లుకుపోయినట్లు, వీరి వృత్తి ప్రవృత్తుల్లో అలుపుని జయించేందుకు పాటల్ని ఆశ్రయిస్తారు. ఎరుకలవాళ్ళు చాలా వరకు నిరక్షరాస్యులు, అయినప్పటికీ పాటని గ్రహించడం స్పష్టంగా పాడటం, ఇవన్నీ మౌఖిక ప్రచారం ఆధారంగానే సాగుతుంటుంది.

ఎరుకలవారు ఎక్కువగా వేటకు వెళ్తూ, చేపలకు గాలం వేస్తూ, ఈతకమ్మలు నరుకుతూ, అలుపురాకుండా వుండేందుకు, వృష్టివిధానాన్ని అనుసరిస్తారు, అలాగే

వ్యవసాయం, బొడ్డెమ్మలు,పెళ్ళిళ్ళు, పేరంటాలు, భజనలు వంటి సమయాల్లో సమష్టివిధానాన్ని పాటిస్తూ వినోదాన్ని పొందుతారు.

పాట : కులవృత్తిపాట.

సందర్భం : ఈ పాటను ఎరుకలవాళ్ళు తమవైన కులవృత్తుల్ని ఆచరిస్తున్నప్పుడు, జొన్న చేలల్లో కంకులు ఏరుతున్నప్పుడు, బరుగుల కోసం అడవికి బయలుదేరినప్పుడు, పందులు కాసేటప్పుడు, మనసారా పాడుకుంటారు, ఈ పాట వాళ్ళల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తు పనిమీద ఆసక్తిని కలిగిస్తుంది. ఈ పాటలో ప్రధానంగా అతిశయోక్తులు లేవు, వున్నది వున్నట్లుగా, సూటిగా చెప్పబడటం జరిగింది. ఎక్కువగా స్త్రీలు మాత్రమే ప్రత్యేకించి పాడుకుంటారు.

పాట :

	ఉయ్యాల ఉయ్యాల	ఉయ్యాలో	
	ఉయ్యాల ఓరామ	ఉయ్యాలో	
	ఉయ్యాల పర్ధా అందాసు	ఉయ్యాలో	
	ఊరు పరుకుసమ్మ	ఉయ్యాలో	
1)	యెర్రి కుర్రమ్మ	ఉయ్యాలో	
	రాజు వారు సొన్నుసే	ఉయ్యాలో	
	నాను కుర్రువార్తి	ఉయ్యాలో	
	రాజు ఎనుగ వారుసొన్నుసూ	ఉయ్యాలో	॥ఉయ్యాల॥
2)	నాను పొరకట్టలు కట్టురు వార్తి	ఉయ్యాలో	
	సిబ్బిలు అల్లురువార్తి	ఉయ్యాలో	
	సుట్ట కుదుర్లు సుట్టురు వార్తి	ఉయ్యాలో	
	గంపలు అల్లురు వార్తి	ఉయ్యాలో	
	పంట్రిలు వల్లురు వార్తి	ఉయ్యాలో	
	సోది సొన్నురు వార్తి	ఉయ్యాలో	
	రాజు ఎనుగ వారుసొన్నుసే	ఉయ్యాలో	॥ఉయ్యాల॥

3) రాజుగార్కి సోది సొన్నుత్తుకు ఉయ్యాలో
నిన్ను వారు సొన్నుసే ఉయ్యాలో
సోది సొన్నురు నేవెద్దె ఉయ్యాలో
తల్లారి వాతా ఉయ్యాలో
కష్టనష్టాలు తెలుజుగుండు ఉయ్యాలో
శాన జాగ్రత్తలు ఉయ్యాలో
రాజుగారి సిన్నయా ఉయ్యాలో
ఎనుగెనుగ బెరుగాసు ఉయ్యాలో
వీరాధి వీరులు ఆకు ఉయ్యాలో
తెలుజుగుండు నడుదుకు ఉయ్యాలో
నీట సోది ఆగుమిని ఉయ్యాలో ॥ఉయ్యాల॥

4) రాజుగారి పాలన ఉయ్యాలో
నల్లదు కేటాదు ఉయ్యాలో
పాగాయా రాజులు ఉయ్యాలో
అంతఃపుర తెక్కువుగా ఉయ్యాలో
పూసగుచ్చినట్టు ఉయ్యాలో
అడ్డి సొన్నురు నీట సోది ఉయ్యాలో ॥ఉయ్యాల॥

5) ఎదురు ఇల్లరు నిట కుర్రువిద్య ఉయ్యాలో
అమ్మవారి పలుకుసూ ఉయ్యాలో
వాత వాత కోరు ఉయ్యాలో
నేసు కథలు ఉయ్యాలో
ఇమాను సంగతులు ఉయ్యాలో
తల్లారి నేవెద్దె ఉయ్యాలో
సోది సోదెమ్మ ఉయ్యాలో
రాజు గార్కి సొనుత్తుకు వార్రెమ్మా ఉయ్యాలో ॥ఉయ్యాల॥

వివరణ: పాటలో "ఉయ్యాల" పదం ఒక అనుబంధ పదంగానే కాదు, పాట ప్రారంభానికి పునాదులు వేస్తూ ఈ ఉయ్యాల పరమార్థం చెప్పబడింది. ఉయ్యాల అనేది సంతాన సంబంధ సూచిక, పిల్లల కోసం పిల్లల పుట్టకముందే చాలా మంది

తమ ఇళ్ళల్లో ఉయ్యాల తయారు చేయించి పెట్టే పద్ధతిని నేటికినీ కొనసాగిస్తున్నారు. సంతానలేమితో బాధపడే ఎందరో దంపతులు తమకు పిల్లలు కలగాలని దేవస్థానాలకు ఉయ్యాలలు తయారు చేయించి సమర్పించుకుంటారు.

ఇక పాటలోకి వెళ్ళి గమనిస్తే... ఉయ్యాల ఓరామ ఉయ్యాలో/ఉయ్యాల పుట్టిన తర్వాత ఉయ్యాలో/ ఊరు పుట్టిందమ్మ ఉయ్యాలో/ అని పాడటంలో ఉయ్యాల గొప్పతనం స్పష్టంగా అర్థమౌతుంది. తర్వాత "ఓరామ" అనడంలో రాముడంతటి సుగుణవంతుడు తమకు పిల్లలుగా కలగాలనేది చెప్పకనే చెప్తున్న ఒక కోరిక! యెర్రి ఎరుకలోళ్లం / రాజురమ్మన్నాడే / నేను ఎరుకలిదాన్ని / రాజు ఎలా రమ్మనే / నేను పొరకట్టలు కట్టేదాన్ని / సిబ్బీలు అల్లెదాన్ని / సుట్టకుదుర్లు సుట్టేదాన్ని / గంపలు అల్లేదాన్ని / పందులు పెంచేదాన్ని / సోది చెప్పేదాన్ని / రాజు ఎలా రమ్మనే?... అంటూ తను చేసే పనుల్ని వల్లెవేసుకుంటూ ఆలోచించసాగింది.

కబురు తీసుకువచ్చినవాడు ఆమె ప్రశ్నలను వింటూ, చివరకు ఆమె ప్రశ్నల్లోంచే సమాధానాన్ని పట్టి ఆమెకు వినిపిస్తూ రాజుగారికి సోది చెప్పడానికి / నిన్ను రమ్మనాడే అని చెప్పడం జరిగింది. దీంతో ఆమెకు సమాధానం దొరికింది, అంతేకాదు ఎందరో జ్యోతిష్యపండితులు అందుబాటులో వుండేరాజు గారు, ఎరుకలవారి సోదెకోసం ఆత్రుతపడటంలో "సోది గొప్పతనం" తెలుస్తుంది. మరి ఈ సోదె ద్వారా రాజుగారు ఏమేమి తెలుసుకోవాలి అనుకుంటున్నారో, వచ్చినవాడి మాటలద్వారా వింటే సోది నిజంగా ఎంతటి మహత్యమైనదో ఇట్టే అర్థమైపోతుంది.

సోదిజెప్పే సత్యాలు / భవిష్యవాణి / కష్టనష్టాలు తెల్సుకుని / కదుజాగ్రత్తలు/ అనడంలో భవిష్యత్తులో జరగబోయే ఆటంకాన్ని పొంచివున్న ప్రమాదాల్ని ముందే పసిగట్టి జాగ్రత్తవహించే ముందుచూపు స్పష్టంగా కన్పిస్తుంది.

అలాగే రాజుగారి సంతానం / ఎట్లెట్లా పెరిగితే / వీరాధివీరులు అవుతారో/ అనడంలో వ్యక్తుల్ని నడిపించడంలోనూ "సోది" ప్రముఖమైనదిగా, రాజుగారి పాలన / మంచి చెడ్డలు / శత్రురాజులు / అంతఃపుర దొంగలు / పూసగుచ్చినట్టు అన్ని తెలిపే నీసోది అనడంలో "సోది" ఎదురులేనిదిగా అర్థం చేసుకోవచ్చు. ఇదే

విషయాన్ని ఆ వచ్చినవారు పేర్కొంటూ "ఎదురు లేని నీ ఎరుకలివిద్య'' అని కూడా అంటున్నాడు, ఇంకా... ఆ సోదిని సాక్షాత్తూ దేవతా పలుకులుగా ఊహిస్తూ భావిస్తూ/ అమ్మవారి పలుకే/ పలుకు పలుకులోనా / నిన్నటి కథలు / ఇయ్యాల్టి సంగతులు/ రేపటి నిజాలు'' అంటూ భూత భవిష్యత్తు వర్తమానాల్ని తమ సూక్ష్మ దృష్టితో పరిశీలిస్తూ సోదమ్మ గురించి కీర్తిస్తున్నాడు. అలాంటి సోదె రాజుగారికి ఎంతయినా అవసరం అనేది అతడి మాటాల్లో తెలుస్తుండగా, "సోదె ఒక అద్భుత విద్య'' అనేది నిర్వివాదాంశంగా తోస్తున్నది.

ఏది ఎలా వున్నా ఎరుకలవారు ఎంతో ఇష్టంగా మరెంతో ప్రేమగా, ఇంకెంతో అభిమానంగా పాడుకునే ఈ పాటలో ఎరుకులవారి గొప్పతనం తెలుస్తుంది.

విసిగించే కథ :

ఇక్కందు ఇక్కందు అచ్యుతాపురం ఇందు రాజామున అఖండుడు ఇంగిరురాజు పాలించక్కు ప్రజలకు ఏదో ఓందు పరీక్ష ఎక్కిమీని ఇనాము, కుదుకుమీని ఇందు ఆ రాజుకు ఓందు అలవాటు ఇక్యంచు, ప్రజలకు గూడ రాజుట అలవాటు ఓందు పందుగాతీరి ఇక్యంచు, ఆ పరీక్ష కోరు గెలుసుతుకు అల్లాగాని ఆ పరోక్షన పందుగలాగ సేయ్యితుకు.

ఇదు ఇనుగ ఇక్యందు, ఓందు రోజు రాజు విసిగిపోగురు కథ గురించి పోటి రాజ్యంకోరు దండోరా వోడిక్కిసూ, ప్రకటనకోరు అందండిగే కథలపోటి ఎక్కక్కు ఆ పోటి కోరు రాజుకు ఎదానిగే కథసొన్ని విసిగిక్యందో, అత్తుకు ఒందుపోత్తు తామిడి వరహలు తోటి పాటుగా రాజుట ఊటాయితోటి కలుజు కళి తింగిరు అవకాశము తరాదంట. ఇందు సొన్నుసు ఆసాటిక్కిరుదు పాతమందికి ఆపొత్తుతామిడి కన్న రాజుట ఊటాయి లోటి కళి తింగిరు అదృష్టం వారక్కు. ఇందు ఆలోచన సేయ్యక్కు మునుసో.

ఇదోటి పోటికి మునుగల్లి కిండిగే ఇప్పురు శానామంది పోటికి వంచు. పరీక్ష సమయం గుర్తుగు ఎదురుపాతుగుందు, కొందుగుందు కీదు మంది రాజువంచుకథ సొన్నురాయి ఒండోండేరు ఎద్దిందు వందు కొచ్చిన కథల్న ఒండోందు కథతీరి

సొన్నక్కు రాజున విసిగిక్కురు కథ, సొన్నుమీని కాబట్టి బేరు కథల్ని, అర్థం ఇల్లారు కథల్ని, ఎచ్చిడి సేయ్యిరు. కథల్నా శానామంది సొన్నుసు రాజు ఆ కథల్నా నల్లక సెవ్వుకోరు వోటుగుండు తల ఆయిక్యక్కు గాని ఎట్టి విసుగు వారుల్లా అంతుకిండిగే అర్థం ఇందిగే ఇక్కిలూటిగే గూడ ప్రతి ఒండేరు ఎదో ఒండు కథటి మిన్ను వోగుమీని వొగ్గాక్కు. ఇత్తారు పరిస్థితికోరు ఆ ఊరుకోరు ఓండు పోకిరికెరు కీదు. ఆగోవాడో నటకథ సొన్నకే ఇందు ఎద్దిందు నిలుబుచ్చు ఆకెరున, పాత మంది పోకిరికెరె నీనందు కథ సొన్నరలా కొందుగోన్నింగిసు, మందివాతాలు పుడిపిచ్చుగారు గుండు రాజుకు కథ సొన్నుక్కు.

ఆ గోవాడొ కథ సొన్నురుదు ఇనుగా మొదలెక్కిసు ఇక్యందు ఇక్యందు ఓండు చీమలపుట్ట, ఆ చీమల పుట్టకోరు కోచ్చిన బేరుతామిడి చీమలు, ఆ చీమల పుట్టకు కిట్టకోరు ఓండు తాంతి సంచి, ఆ చీమల ఆసంచికోరు తాంతిన అడ్డి ఎత్తుగుండువోయి ఒడ్డుదాట్లె నిల్వ ఎచ్చుగంబో, ఇందు ఆలోచన సేందు ఇదోటి ఓండు చీమ వంచు ఓండు తాంతిన గింజన ఎత్తుగుండు వోసు, రోండో చీమ వందు తాంతి గింజి ఎత్తుగుండు వోసు, అనుగే మూడో చీమ వందు తాంతిగింజ ఎత్తుగుండువోసు, ఇందుకథన అదే పనితీరి వాసేరుగా సాగమోతి, ఆగోవాడో ఓండు బెరుకెల్లు చీమ అంచుకు వంచు రాజుకు ఆవలింపులు వంచు. అందుదు నీన్నంచి కథలు ఇల్లా చీమలు తాంతిగింజల్నా ఓండే ఎత్తుగుండు వొగక్కు ఇందు గెట్టిగా, ఎయ్యిసు అత్తుకు ఆగోవాడో మెల్లగా కథకీ రాజా కథకీ ఇందు ఓండు సిరుపు సిరుసుకథ. అంతుకు ఇల్లా కాని ఆచీమలాడ్డి తాంతి గింజల్ని ఎత్తుగుండ వోగుమీనల్ల్య. ఈ ఎత్తుగుండు వోగురుదు అయివోనప్పుడే అసలు కథ మొదలాక్కు. అత్తున వరకు ఓపికపుడి రాజా ఇంగీసు గోవాడో అపు నిట పోగురువాతాలు ఓండోండు చీమ అందాదు ఒండోండు గింజన ఎత్తుగుండు వోగురు అందదు, చీమలడ్డి ఓండు వరుసకోరు వందు తాంతిగింజల్ని ఎత్తుగుండు వొక్కు ఇందు ఓండు వాతకోరు సొన్నుతకు ఇత్తున బేరుగా సాగుమోతు మిన్యా ఇండిగే రాజున నీట తెలివోటి అవమానము సేయ్యక్కుర ఇందువాత ఇందుడ విసుగోటి రోస్తోటి రాజు రెచ్చిపోసు.

అత్తునే సభకోరు స్పట్లు మొదలాసు, ఆగోవాడుని మేనివి సుగోటె రెచ్చిపోన ఆరాజుగూడ చప్పున ఎద్దిందు విషయమున అర్థం సేందుగుండు, నన్నపోటి విషయమే

అస్థుదురట్టు సేందా ఆ కెరునా సంతోషమోటి గెట్టిగా అత్తికిందుసు. సభకోరు ఇంకోండు సారి సప్పట్టు శానామొచ్చు మంది ఇనుగ పోకిరి కెరుట అదృష్టంపందుసు.

సారాంశం :

అచ్చుతాపురాన్ని పాలించే అఖండుడికి వినోదం పట్ల ఎంతో ఆసక్తి వుండేది, ఈ కారణంగా తన రాజ్యంలోని ప్రజలకు నెలకు ఒకసారి ఏదో ఒక వినోదాత్మక పరీక్షలు పెట్టి గెలుపొందిన వారికి విలువైన బహుమతుల్ని అందివ్వడం ఒక అలవాటుగా చేసుకుని కొనసాగించసాగాడు. ఈ క్రమంలో ఒకానొకసారి తనని "విసిగించే కథ" గురించి రాజ్యంలో దండోరా వేయిస్తాడు. ఎవ్వరైతే తనని విసిగిస్తారో వాళ్ళకు పదివేల వరహాలతో పాటుగా, ఒకపూట రాజకుటుంబీకులతో కలిసి భోజనం చేసే అవకాశాన్ని ప్రకటిస్తాడు. ఇందు నిమిత్తం ప్రజలు పెద్ద ఎత్తున ఆసక్తిని కనబరుస్తారు. అనుకున్న సమయం రానే వస్తుంది. ఔత్సాహికులు ఒక్కొక్కరుగా లేచి సుదీర్ఘమైన కథలు, అర్థం లేని కథలు, వెకిలి కథలు రాజుని విసిగించే ఉద్దేశ్యంతో వినిపించసాగారు.

అంతలో ఆ వూర్లో పోకిరోడుగా పేరుగాంచిన ఒక యువకుడు లేచి రాజావారికి కథ చెప్పేందుకు సిద్ధమౌతాడు. "పోకిరి నాయాల. వీడేంకథ చెప్తాడు"? అంటూ సభకు విచ్చేసిన ప్రజలు అందరూ వాడ్ని హేళన చేస్తారు. వారి మాటలు వినీ కూడా పట్టించుకోకుండా వాడు మెల్లగా కథలోకి దిగి... "అనగనగా ఒక చీమల పుట్ట, ఆ చీమల పుట్టలో కోట్ల చీమలు. ఆ చీమల పుట్టకు సమీపంగా ఒక జొన్నలసంచి"... అంటూ కథ మొదలెట్టి, పుట్టలోని ఒక్కోచీమ ఒక్కోగింజను తమ పుట్టలోకి మోసుకెళ్ళడాన్ని ఒకటో చీమ... రెండో చీమ... మూడో చీమ... అంటూ అలాగే వందవ చీమ వరకు వెళ్తాడు. చీమలు గింజల్ని మోసుకెళ్ళడమే తప్ప కథ వినిపించని పోకిరోడిపై రాజావారికి కోపం వస్తుంది. అప్పుడు పోకిరోడు "కథ వున్నది రాజా! చీమలు అన్ని ఒక్కోగింజను మోసుకెళ్ళాక అస్సలు కథ ప్రారంభం అవుతుంది" అంటాడు. అప్పటికే ఆవలింతలు వచ్చేసిన రాజావారు కోపోద్రిక్తుడౌతూ "చీమలు గింజలు మోసుకు వెళ్ళాయి అని చెప్పడానికి, ఒక్కో చీమను వివరిస్తావా? తెలివిగా రాజావారిని అవమానం చేస్తున్నావు" అంటూ ఉడికిపోతాడు. అంతే! సభలో పెద్ద ఎత్తున చప్పట్లు మోగుతాయి. అప్పటికిగానీ ఆ రాజావారు తేరుకుని తను విసిగిపోయిన సంగతిని

అర్థం చేసుకుంటాడు. తనని పోటీ గురించి మరిచిపోయేట్లు చేసిన ఆ యువకుడ్ని ఆలస్యం చేయకుండా అమాంతంగా కౌగిలించుకుంటాడు. ఆ విధంగా పోకిరివాడి అదృష్టం పండుతుంది.

వ్యాఖ్యానం :

అల్లర చిల్లరగా కనిపించే వ్యక్తుల్లోనూ కొన్ని ప్రతిభలు దాగి వుంటాయని ఈ కథ నిరూపించింది. కథలో కనిపిస్తున్న "పోటి పరీక్షలు" అనేవి ఎరుకలవాళ్ళు ఆయాపర్వదినాల సందర్భంగా తమలో తాము నిర్వహించుకునే పోటిలను గుర్తు చేస్తున్నాయి. కథలో రాజావారు వివిధ పోటిల్ని నిర్వహించేట్టుగా వీళ్ళు కూడా నాటకపోటీలు, ఎడ్లపందాలు, ఆటల పోటీలు... వంటివి నిర్వహించుకుంటుంటారు. ఇక కథలో కథగా ప్రారంభమైన "ఒక్కోచీమ ఒక్కోగింజను సేకరించే విషయం. మంచి బుద్ధికుశలతను కలిగిన నేర్పరితనం ప్రదర్శిస్తుంటారు.

ముఖ్యంగా రాజావారు బహుమతిగా ప్రకటించిన "వరహాలు" అనేవి పందిముద్ర గలిగిన విలువైన బంగారు నాణెములు. తరతరాలుగా ఈ నాణెములు రాజవంశస్థుల్ని అలరించడంలో, పందుల పెంపకందార్లు అయిన ఎరుకులవారు గర్వించాల్సిన అంశం ఎంతయినా వున్నదని చెప్పవచ్చు.

ఎరుకలవారి సాధారణ జీవన శైలి :

ఎరుకులవారి సాధారణ జీవనవిధానాన్ని పరిశీలిస్తే వీరు అనేక ఆచార వ్యవహారలను విశ్వాసాలను, మూఢనమ్మకాలను. కలిగి జీవిస్తుంటారు. వ్యవసాయం, పందుల పెంపకం, వేట, గంపలు, పొరకట్టలు, సిబ్బీలు అల్లడం కులవృత్తిగా కలిగి వుంటారు.

ఆచారవ్యవహారాల్ని పరిశీలిస్తే వీరి వివాహ పద్దతిలో "ఓలి" ప్రధానమైనది. ఓలి అంటే కన్యాశుల్కంవంటిది. "రూకమాడ" సమయంలో ఈ తంతు కొనసాగుతుంది. రూకమాడ అంటే నిశ్చయ తాంబూలాలు, ఇక అమ్మాయి ఇచ్చుకునే కట్నకానుకలు "పంది, గాడిద, గడియారం, కొన్ని వంట వస్తువులుగా వుంటాయి.

ఆడపిల్లను ఇంటి లక్ష్మిగా భావిస్తారు. కాబట్టి ఆడపిల్ల పుట్టగానే "లక్ష్మమ్మ" అని తాత్కాలికంగా నామకరణం చేసుకుంటారు. ఆ తర్వాత తమ ఇష్టానుసారంగా "ఉయ్యాల" వేడుకలో మరో పేరు పెట్టుకుంటారు ఆడపిల్ల రజస్వల వేడుకను తడకలో కూర్చోబెట్టి ఘనంగా నిర్వహిస్తారు.

ఎరుకలవారి విడాకుల విధానం విచిత్రంగా వుంటుంది, భార్య భర్తలు విడిపోవాలని నిర్ణయించు కున్నప్పుడు వీళ్ళు న్యాయస్థానాల్ని నమ్ముకోరు. కులపెద్దల సమక్షంలో ఒకరావి చెట్టుకు లేదా మర్రిచెట్టుకు లేదా వేపచెట్టుకు గొడ్డలితో మూడుమార్లు గాటు పెడ్తారు. దీంతో ఆ దంపతులు ఇక మనఃసాక్షిగా విడిపోయినట్టులెక్క.

విశ్వాసాల్లో మంత్రతంత్రాలు, భూతపిశాచాలు వంటి అతీత శక్తులపై వీరికి ప్రగాఢమైన నమ్మకం, మంత్రాల్లో మంచిమంత్రాలు, చెడ్డ మంత్రాలు రెండు వుంటాయి. మంచివి ఆరోగ్యానికి ఆత్మరక్షణకు సంబంధించినవిగా వుంటాయి, చెడుమంత్రాలు "చేతబడి"ని సూచిస్తాయి. వీరు ఎల్లమ్మ, నాగమ్మ, పోశమ్మ, మైసమ్మ, మశమ్మ, మాంకాళమ్మ, వంటి శక్తి స్వరూపాల్ని ఎక్కువగా ఆరాధిస్తారు. వీరిలో కొందరు కులదైవాలుగా వుంటారు. మరికొందరు ఇడుపుదేవరలుగా వుంటారు.

జంతుబలి, శకునాలు, వీరి మూఢనమ్మకాల్లో ప్రధానమైని, న్యాయస్థానాలు, న్యాయవాదులు వీరికి గిట్టవు. కులపంచాయితీలపై ఆధారపడ్తారు. ఈ పంచాయితీల్లో అమలు చేసే శిక్ష చాలా కఠినంగా వుంటాయి. కులపెద్దను బెరుముంచో అంటారు.

చేతికి పచ్చబొట్లు, సొదె, వీరి జీవితంలో ఒక భాగంగా వుంటాయి. ఆయుర్వేద వైద్యంలో వీరు నిష్ణాతులుగా వుంటారు. పాము, తేలు, జెర్రి, కుక్క కాట్లకు మంచి వైద్యాన్ని అందిస్తారు. ఈ వైద్యంలో వీరిని మించినవాళ్ళు లేరు.

ఎరుకలవారి నాటి, నేటి పరిస్థితులు :

ఎరుకలవారు ఒకప్పుడు సంచారజీవనం గడిపేవారు. గాడిదలు వీరి రవాణా సౌకర్యాలుగా వుండేవి. ఇండ్లుగా "గుడారాలు" మాత్రమే వుండేవి. వీరి వస్తువుల్లో ఎక్కువగా మట్టి పాత్రలు ఉచ్చులు, బోనులు కనిపిస్తాయి. వీటితో పాటుగా తిరుగలి,

తెడ్డు రోలు కూడా వుండేవి. వీరు తమకు కావాల్సిన ఆహారాన్ని అడవుల్నుండి సంపాదించుకునేవారు. ఈ క్రమంలో తమకు సౌలభ్యంగా వున్న ప్రదేశాలకే వీరు తమ ఆవాసాల్ని తరుచూ మార్చేవారు. బిక్షాటన చేయడం, పందుల పెంపకం, సవరాలు అల్లడం, బొంతలు కుట్టడం, ఎద్దుల్ని, కోతుల్ని ఆడించడం, సన్నాయి వాయించి అడుక్కోవడం, సిబ్బీలు పొరకట్టలు అల్లడం, వీరి జీవివన విధానంలో ముఖ్యమైనవిగా గమనించవచ్చు.

ప్రస్తుతం గమనిస్తే వీరిలో విద్యావంతుల శాతం క్రమంగా పెరుగుతూ వస్తున్నది. సంచారజీవనం తగ్గిపోయింది. మట్టిపాత్రల స్థానంలో స్టీలు, అల్యుమినియం పాత్రలు చోటు చేసుకున్నాయి. గాడిదల అవసరం దాదాపుగా కనుమరుగైపోయింది.

ఆధునిక రవాణా సౌకర్యాలు వీరి జీవితాల్లో సాధారణమైపోయాయి. అయితే నాటికి నేటికీ మారని వీరి పరిస్థితుల్లో బిక్షాటన, పందుల పెంపకం, సోదె చెప్పడం, పొరకట్టలు, సిబ్బీలు, గంపలు అల్లడం వంటివి వున్నాయి. వేట కూడా నాటి నుండి నిరాటకంగా కొనసాగుతూనే వుంది.

ఎరుకల భాష :

తమిళ గ్రామ్యం, కన్నడ గ్రామ్యం, తెలుగు గ్రామ్యం. ఈమూడు ఎరుకలవారి "కుర్రుభాష"లో కనిపిస్తాయి. కుర్రు భాషను "కుర్రువాత" అని కూడా అంటారు వీరి కొన్ని పదాల్ని గమనిస్తే...

1)	పెళ్ళికొడుకు	–	కన్యాలత్తు గుంట
2)	పెళ్ళికూతురు	–	కన్యాలత్తు కుట్టి
3)	బంగారం	–	ఎర్రకెల్లు
4)	వెండి	–	వల్లకెల్లు
5)	సారాయి	–	కుర్రుతోడి, కర్తోడి
6)	అందురు బాగున్నారా	–	అడ్డెరు నల్లకీదా, నలగికిదా
7)	ఏంటిది	–	ఎందదిల్లా, ఎందిల్లా
8)	మీది ఏం కూర	–	నింగులిది ఎంద నెక్కిలి

9)	ఇక్కడికి వచ్చి తిను	–	ఇట్టె వంచు తింగు
10)	నేను కల్లు తాగుతాను	–	నాను వల్లోడి కుడికాకె

ముగింపు :

ఎరుకలవారిది విభిన్నమైన జీవనశైలి. వీరిని ఇతర గిరిజన జాతులతో పోల్చి చూస్తే వీరిది స్వతంత్రమైన జీవనశైలి. కష్టపడటం వీరికి వెన్నతో పెట్టిన విద్య. ఆత్మవిశ్వాసం, దృఢసంకల్పం, వంటి లక్షణాల్లో వీళ్ళకు మించినవాళ్ళులేరు. అయితే వీరు తమకు ప్రభుత్వం కెటాయించిన పథకాల్ని సంపూర్ణంగా అందుకోలేకపోతున్నారు, నేటికినీ ఎంతో వెనకబడి జీవిస్తున్నారు. వీరిలోని విద్యావంతులు వీళ్ళల్లోని వెనకబాటుతనాన్ని తొలగించడానికి కొంత కృషి చేస్తే వచ్చే పదేళ్ళలో ఎరుకల వారిలో కొత్త జీవనశైలిని చూడగలం.

24. "కొండా కోనల్లో.." ప్రతిఫలించిన కోయ జీవితం

డా. జరుపుల రమేష్
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ,
ఎస్.ఆర్ & బి.జి.యన్.ఆర్.ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, ఖమ్మం
9618944654, ramesh.jarupula@gmail.com

ప్రపంచమే ఒక అందమైన సృష్టి. ఆ అందమైన సృష్టిలో అందరూ ఎన్నో మైళ్ళ దూరం ప్రయాణం చేసిన వారే! ఆ ప్రయాణంలో చాలా సంవత్సరాల క్రితం దూరంగా విడిపోయిన సమూహమే ఆదివాసీలు లేక గిరిజనులు. గిరిజనులు ప్రపంచమంతటా, భారతదేశమంతటా ఉండగా అందులో తెలంగాణాలో ఖమ్మం జిల్లాలో ఎక్కువ మంది నివసిస్తున్నారు. ఖమ్మం జిల్లాయే గిరిజనులకు ప్రసిద్ధి. అంతా ఏజెన్సీ ప్రాంతంలో నివాసమే. అలా ఉంటున్న వారిలో కోయ వాళ్ళు ఒకరు. కోయ గిరిజన తెగల్లో ఒకటి. వీరు ఆచారం, సంస్కృతి, వేషధారణ, అలవాట్లలో ఒక ప్రత్యేకతను కలిగి ఉంటారు.

"ప్రకృతిలో దొరికే ఆహారాన్ని సేకరించడానికి మానవులు చిన్న చిన్న గుంపులుగా ఏర్పడతారు. ఈ గుంపు వ్యవస్థీకృతమైనపుడు ఒక కుదురు అవుతుంది. కొన్ని కుదురులు కలిసి ఒక తెగ లేక గణంగా ఏర్పడుతుంద''ని ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం అభిప్రాయపడ్డారు. "ప్రాచీన ఆచారాలను సంప్రదాయాలను వీడకుండా కొండల్లో కోనల్లో అనాగరికంగా జీవిస్తున్న తెగలను 'గిరిజనులు' అంటారు. కొండల మీదనే తొలుత నివాసాలు కల్గి, ఆటవిక సంపదనే తమ జీవనానికి ఉపాధిగా గ్రహించిన వారిని, కొండల్లో ఉండే కొద్దిపాటి చదును ప్రదేశాన్ని గుర్తించి అక్కడ ఎదిగిన చెట్లను కూల్చి పోడు వ్యవసాయం చేసుకొనే వాళ్ళను కొన్ని తెగలుగా ప్రభుత్వం గుర్తించింది. వీళ్లంతా గిరిజనుల''ని బోయ జంగయ్య అభిప్రాయం. ప్రముఖుల అభిప్రాయాన్ని పరిశీలించిన తర్వాత గిరిజనులు అంటే సంచార తెగల సమూహం అని తెలుస్తుంది.

ఇటీవల కాలంలో డా. దిలావర్ 'కొండా...కోనల్లో' అనే ఆదివాసీ కథల సంపుటిని తీసుకొచ్చారు. ఈ కథా సంపుటిలో 'కారడవిలో కాంతి కిరణం' 'పాటకు

మరణం లేదు' 'వేట' 'తునికాకు' 'బొందల గడ్డ' 'రాళ్ళూ రప్పలూ' '1/70, I 420' 'చెట్టు కూలుతున్న దృశ్యం' 'నిర్జీవావరణం' 'అరణ్య రోదన' 'కొండా కోనల్లో' 'ఆ ఏడు మండలాలు' కథలు ఉన్నాయి. ఈ కథలన్నీ 'కోయ' తెగకు చెందినవే! ఒక్కొక్క కథ అనేక వైరుధ్యాల సమాహారం.

ఈ సంపుటిలో కథా శీర్షికతో వచ్చిన 'కొండా...కోనల్లో' కథను పరిశీలిస్తే రచయిత విహంగ వీక్షణం చేసాడనిపిస్తుంది. తాను ఖమ్మం జిల్లా పరిధిలో ఉన్న గిరిజన ఏజెన్సీ ప్రాంతాలను, తాను చూసిన దృశ్యాలను, సంఘటనలను, ఈ కథలో వివరించారు. ఈ కథలో రచయితే ఒక పాత్ర. రచయిత మనోభావాలను తెలిపేటప్పుడు కొంత జాగ్రత్త వహించడం గమనార్హం. ఒక్కొక్క ప్రాంతంలో గిరిజనులు వారి జీవన విధానాలను, ఆ ప్రాంతంతో వారికి ఉన్న అవినాభావ సంబంధాన్ని రచయిత అనుభవాల ద్వారా ఈ కథలో వివరించారు.

1. 'పాటకు మరణం లేదు'

ఈ కథలో ఎర్రన్న, చెంద్రమ్మ ప్రధాన పాత్రలు. ఎర్రన్న చెల్లెలు చెంద్రమ్మ. ఎర్రన్న, అంటే చెల్లికి, చెల్లి అంటే ఎర్రన్నకు ఎనలేని ప్రేమ. ఒకరోజు ఆ ఊరి దొర "కాసిరెడ్డి" 'చెంద్రమ్మ'ను లైంగికంగా లోబరుచుకోడానికి ప్రయత్నిస్తే చెంద్రమ్మ ప్రతిఘటిస్తుంది. చెంద్రమ్మ చాలా గౌరవంగా బతుకుతూ ఉండేది. ఎర్రన్న ఊరూరా తిరుగుతు నిత్యం పాటలుపాడుతూ కోయగూడాలను చైతన్యపరుస్తుండేవాడు. ఇలా పాటలు పాడుకుంటూ కోయ గూడాల్లో తిరుగుతూ రెండు వారాల తర్వాత ఇంటికి వస్తాడు ఎర్రన్న. రెండు మూడు రోజుల్లో వస్తానని చెప్పిన అన్న రెండు వారాల వరకు రాకపోయే సరికి ఆందోళనకు గురువుతుంది చెంద్రమ్మ. అన్నను చూడగానే ధైర్యం వస్తుంది. కానీ మౌనంగా మాట్లాడకుండా ఉండిపోతుంది. ఆ విషయాన్ని గమనించిన ఎర్రన్న వెంటనే చెల్లిని తనదైన పద్ధతిలో బతిమిలాడి అన్నం తినిపించాలని ముద్ద నోట్లోకి పెడుతుంటే "ముద్ద చెంద్రి నోటికందకముందే విసురుగా కోడిపిల్లను గద్దతన్నుకు పోయినట్టుగా గాలిలోకి ఎగిరింది. మరుక్షణం గట్కగిన్నె కూడా బంతిలా గాలిలోకి ఎగిరిపడింది" (పుట: 16) ఏమి జరిగిందో తెలియకముందే పోలీసులు వచ్చి నిలబడ్డారు. ఎర్రన్నను రకరకాలుగా ప్రశ్నించారు. పాట ఎక్కడ నేర్చుకున్నావని, ఎవరు నేర్పారని ప్రశ్నల వర్షం కురిపిస్తూ పోలీసుస్టేషన్‌కి తీసుకెళ్తారు. నాలుగైదు

రోజుల తరువాత చంద్రమ్మ అన్నను విడిపించి తీసుకురావాలని పోలీసుస్టేషన్‌కి వెళ్తుంది. అక్కడ పోలీసు కసరుకొని 'ఇక్కడ ఎవరూ లేరని తిరిగి పంపిస్తూంటే' అక్కడ ఉన్న హెడ్ కానిస్టేబుల్ చంద్రమ్మను చూసి'' నల్లని యినుముతో పోతపోసిన విగ్రహంలా వుంది. ముడుకుల పైకి ఎగేసి, సింగులు దోపికట్టుకున్న చీర. ఎదపైన పైటకొంగు చాటు తప్ప ఏ ఆచ్ఛాదనా లేదు. అల్లి పువ్వుల్లాంటి కళ్ళు. నేరేడు పండులా నిగనిగలాడుతున్న బుగ్గలు, వంపుదిరిగివున్న పెదాలు, కళ్ళు తిప్పుకోలేనంత 'అడివి అందం అనుకున్నాడు'' హెడ్డు. (పుట: 18) ఏ ఉద్దేశంతో చెంద్రమ్మను చూశారో కానీ, పులినోటికి బలైపోయింది. ముందుగా ఎస్సై తర్వాత హెడ్డు, తర్వాత కానిస్టేబుల్ తరువాత సెంట్రీ అందరికీ 'చంద్రమ్మ' ఆడ బిర్యాని అవుతుంది.

జీవితం మీద ఆశలు వదులుకొని బతుకుతున్న చంద్రమ్మకు బతుకులోనే కాకుండా తన ఋతుక్రమంలో కూడా మార్పు వచ్చింది. పోలీసుల దౌష్ట్యానికి ఫలితంగా తల్లవుతుంది. ఎర్రన్నకు మాత్రం జైలే జీవితమవుతుంది. పదిహేను సంవత్సరాల తరువాత తప్పించుకొని ఇంటికి వచ్చిన ఎర్రన్న తన పాట గొంతుతో ఒక సారి చెల్లిని పిలుస్తాడు. "అమ్మా! చెల్లెమ్మా...నేను ..నేను ఎర్రన్నను...'' అంటూ కిందపడిపోతాడు ఎర్రన్న. బలవంతంగా లేవడానికి ప్రయత్నిస్తాడు. కానీ లేవలేకపోతాడు. ఎవరో తనకు ఇష్టమైన పాటను పాడుతున్నారు. ఓపికలేక పోయినా ఎవరని అడిగితే "నీ మేనల్లుడు నా కొడుకు అన్నయ్య'' అని చెప్పడంతో ఆశ్చర్యంతో ఎర్రన్న కన్నుమూయడంతో కథ ముగుస్తుంది. ఈ కథలో కనిపించే అంశం నిత్యం మన చుట్టూ జరుగుతున్నదే! పోలీసు వ్యవస్థ ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడుతుందో రచయిత కళ్ళకు కట్టినట్టు చూపించారు. సహాయం చేయక పోగా, సహాయం ముసుగులో మనుషుల్ని బలవంతంగా లొంగదీసుకోవడం ఏ సమాజం నేర్పించిన జ్ఞానమని? మనసులో ప్రశ్నించుకోవడం ఆమె వంతు అయింది. తోటి వ్యక్తి సాటి వ్యక్తికి సహాయం చేయాలనే దృక్పథంతో ముందుకు నడుస్తున్న తరుణంలో దానికి విరుద్ధంగా ఈ కథ సాగింది. కథ రచయిత రాయడానికి తీసుకున్న కాలం, ప్రాంతం, సంఘటనలు అన్నీ కూడా ఈ కాలానికి సంబంధించినవే! గిరిజనుల్లో ఒకరైన కోయ తెగకు సంబంధించినవే! వారి జీవితంలో ఇటువంటి సంఘటనలు చోటుచేసుకోవడం మామూలే! బహుశా ఎన్ని మార్పులు వచ్చినా, గిరిజనులను పట్టి పీడిస్తున్న వైనం అంత తొందరగా మారదని ఈ కథలో సారాంశం. ఈ కథను చదివిన పాఠకులు,

తమ ఆలోచనా సరళిని మార్చుకోవాలని, మార్చుకుంటారని భావించడంలో ఎలాంటి సంశయం లేదు.

2. కారడవిలో కాంతి కిరణం

కథలో గిరిజన వాస్తవిక జీవితం ప్రతిఫలిస్తుంది. గిరిజనులు అనాది కాలం నుండి అడవుల్లో, కొండల్లో కోనల్లో ఉండిపోవడానికి నిరక్షరాస్యత ఒక కారణంగా నేటికీ సర్వేలు, పరిశోధనలు వివరిస్తున్నాయి. వీటన్నిటి కంటే ముఖ్యంగా గిరిజనుల్లో అంతర్నిగూఢంగా దాగి ఉన్న రహస్యమేమిటి? ఎందువల్ల వారు అందరిలో కలిసిపోవడానికి ముందుకురాలేకపోతున్నారు? ఏమైనా చట్టాలు ఉన్నాయా? ఇలా అన్ని కోణాల్లోనూ పరిశీలిస్తే పలు అంశాలు ప్రజల దృష్టికి గోచరిస్తాయి. వాటిలో కొన్నింటిని ఈ కథ ద్వారా రచయిత చెప్పడానికి ప్రయత్నించారు. అన్నిటి కంటే ముఖ్యంగా గిరిజనులు రాకపోవడానికి వారిలో మూఢనమ్మకాలే ప్రధాన కారణం. వ్యక్తి లేదా వ్యక్తుల సమూహంతో కలవాలంటే కావల్సింది వాళ్ళలో చైతన్యం. మారాల్సింది ఆలోచనా సరళి. ఎమర్సన్ అభిప్రాయాన్ని పరిశీలించినట్లయితే 'వ్యక్తి ఉన్నతంగా ముందుకు రావాలంటే ఆలోచనా దృక్పథం మారాలి. ఆలోచనను ఆచరణలో పెట్టినప్పుడే ఆ ఆలోచనకు విలువ!. లేకపోతే ఆ ఆలోచన మరుగున పడిపోతుంది' అంటాడు. ఈ అభిప్రాయాన్ని గిరిజనుల విషయంలో చూస్తే ఏ స్థాయిమేరకు వారు తమ ఆలోచనను ఆచరణలో పెట్టుకుంటున్నారు? ఈ కథలో గిరిజనులు తమ ఆలోచన విధానాన్ని దాటి ముందుకు రాగలిగారా! అంటే కొంత వరకు సంశయమే!. చదువుకొని డాక్టర్ అయి గిరిజన ప్రాంతానికి వెళ్ళిన కిరణ్‌కు ఎటువంటి పరిస్థితి ఎదురయ్యింది! చిన్న కుగ్రామంలో ఒక సన్నకారు రైతు కుటుంబంలో పుట్టిన కిరణ్‌కి పల్లె బతుకులు, వాళ్ళ జీవన శైలి, కష్టాలూ, కన్నీళ్ళూ బాగా తెలుసు. కిరణ్ 'కోయగూడేనికి' వెళ్ళినప్పుడు తన అనుభవాలు బాగా ఉపయోగపడ్డాయి. రోజులు గడుస్తున్నాయి. కిరణ్ అనుకున్నట్టు కోయగూడెంలో మార్పులు రావటం లేదు. రాకపోవడానికి కారణం గిరిజనులు గిరిజనేతరులు తమ ఆలోచనలను మాత్రం అంత తొందరగా ఆచరణలో పెట్టకపోవడమే! వారి జీవితాన్ని ఏ కోణంలో పరిశీలించినా స్థూలంగా కనిపించే పరిస్థితి ఇదే!. పరిశుభ్రంగా లేని నీళ్ళు తాగడం వల్ల అమీబియాసిస్ వస్తుంది. కిరణ్ ఈ విషయాన్ని గమనించి పరిశుభ్రంగా ఉండాలని పదే పదే చెప్తాడు.

ఆ విషయాలేమీ కోయలకు చెవికెక్కలేదు. వారు అనుకున్నట్టే ముందుకు వెళ్ళారు. దానికి ఎంతో మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. అయినా మార్పులేదు. ఒక వ్యక్తి జీవితంలో బలంగా నాటుకుపోయిన మూఢనమ్మకాలు ఎంతటి తారస్థాయి వరకు తీసుకెళ్తుందో. ఈ కథలో మరొక సన్నివేశం చూస్తే తెలుస్తుంది. "బాగా నాని, ఉబ్బివున్న ఓ శవాన్ని పాయం పొమ్మయ్య, యీసం ఎర్రయ్య, ఆలెం రోషయ్య, కుంజ సూరయ్య నల్గురూ కలిసి పాతి పెడుతుంటారు. అంత రహస్యంగా శవాన్ని ఎందుకు పాతిపెడుతున్నారో కిరణ్‌కు బొత్తిగా అర్థం కాదు. 'ఏంటి...? ఏంటి మీరు చేస్తున్న పని...?' అని అతి కష్టమ్మీద గొంతు పెగిలించుకొని తడబడుతూ తడబడుతా అడిగాడు కిరణ్. ఏం లేదు సారూ! మన గూడెంల మంత్రగాడు బూషయ్య వున్నాడు సూడు. మీ కెర్కే గదా? ఆడు మమ్మల్ని బతకనియ్యటం లేదు సారూ! త్యాపత్యాపకూ చేతబడి చేసి మమ్మల్ని ఎతమారుత్తున్నాడు. ఆడు యింకా బతికే వుంటే గూడెం బొందల గడ్డయితదని మేమేం సంపేసినం'' (కొండా కోనల్లో. పుట: 6,7)

ఈ సంఘటనను బట్టి గిరిజనులు నేటికీ ఏ స్థాయిలో ఉన్నారో! ఎందుకు ఆమడ దూరంలో ఉండిపోతున్నారో తెలుస్తుంది. ఈ కథల్లో రచయిత పేర్కొన్న సంఘటనలను బట్టి చూస్తే అక్షరజ్ఞానం లేని వారిగా చిత్రించాడనిపిస్తోంది. అక్షరజ్ఞానం ఉన్న గిరిజనులు కూడా వారితో చేతులు కలపడంతో మార్పు వచ్చిందని చెప్పవచ్చు. అనాగరికత నుండి నాగరికత వైపు పయనించిన ఒక వ్యక్తి చివరికి తమ ఆలోచనా విధానాన్ని ఎవరితో పంచుకుంటాడనే ప్రశ్న వేసుకుంటే అది వారి కుటుంబంతోనే అని తెలుస్తోంది. దానికి కారణం గిరిజనుల మనస్సుల్లో బలంగా నాటుకుపోయిన మూఢనమ్మకమే. చదువుకున్న వ్యక్తి ఆ మూఢ నమ్మకం నుండి బయటపడలేడా? అని ప్రశ్నించుకుంటే గిరిజన వ్యక్తికి అది సాధ్యంకాకపోవచ్చు. ఆ సమాజం, ఆ వాతావరణం ఆ వ్యక్తి ఆలోచనలను కూడా వారి గూడెం సమూహం మార్చేస్తుందనడానికి ఎన్నో ఆధారాలు ఉన్నాయి. అదే ప్రాంతంలో చదువుకున్న గిరిజనేతర వ్యక్తి వెళ్ళగలిగితే అతని ఆలోచన సరళిని మార్చగలుగుతుందా! ఎందుకు ఆ విధంగా జరగడం లేదు! అనే సమాధానాలు వస్తాయి. గిరిజన ప్రాంతానికి వెళ్ళిన గిరిజనేతరుడు తన మాటల ద్వారా గూడెం రూపురేఖలను మార్చగలుగుతాడనే దానికి ఈ కథలో ప్రధాన పాత్రధారి అయిన కిరణ్ నిదర్శనం. కిరణ్ వాళ్ళ కోయగూడెంలో ఊహించిన మార్పే వచ్చింది. బూషయ్య చేసిన పాపం ఏమిటి? ఎందుకు బూషయ్యను చంపేయాల్సిన

అవసరం ఏర్పడిందని ఆలోచిస్తే... వారిలో నాటుకుపోయిన మూఢనమ్మకమే అని బలంగా చెప్పవచ్చు. ఏ చిన్న సమస్య ఎదురైనా దానికి కారణం అక్కడ పదిమందికి కనిపిస్తున్న వ్యక్తి, లేదా దాని వల్ల కలుగుతున్న పరిణామమే!. ఇక్కడ కూడా అదే జరిగింది. వ్యక్తిని చంపడం నేరమనే విషయాన్ని కూడా మర్చిపోయారు. ఆ భావాలు ఉన్న వ్యక్తి జీవించి ఉండడం కంటే మరణించడమే సబబు అనే ధోరణిలో గిరిజనుల ఆలోచనలు ఉన్నాయని రచయిత ఈ కథ ద్వారా తెలియజేస్తాడు. అనారోగ్యంతో బాధపడుతున్న 'బూలచ్మి'ని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళమని కిరణ్ ప్రాధేయపడితే దానికి గిరిజనులు అంగీకరించకుండా, నాటు వైద్యమే ఆధునిక వైద్యం కంటే మెరుగైనదిగా భావించిన సందర్భం ఈ కథలో కనిపిస్తుంది. చివరికి వారి ఆలోచనా విధానంలో మార్పు రావడం వల్ల బూలచ్మి బతకగలిగింది. కిరణ్ కోయ జాతి వారి ఆలోచనా విధానాన్ని మార్చడంలో సఫలుడయ్యాడు. కిరణ్ స్థానంలో వేరే గిరిజన వ్యక్తి అయితే అంత తొందరగా మార్పు రాదని భావించవచ్చు.

3. వేట

వేట కోయ జీవితంలో ఒక భాగం. అది వారి జీవనోపాధి. అనాది కాలం నుండి గిరిజనులు వేట ద్వారా లభించిన మాంసం తిని, తమ కుటుంబాన్ని పోషించుకుంటూ వస్తున్నారని అనేక పరిశోధనలు తెలుపుతున్నాయి. అటువంటి 'వేట' నేటి కాలంలో ఎలాంటి చర్యలకు భాగమవుతుందో రచయిత 'వేట' కథ ద్వారా తెలిపాడు. కోయ వాళ్ళు వేటకు వెళ్ళేటప్పుడు అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం రెండు జంటలుగా విడిపోయి, చివరికి కలుసుకోవడం. అలా వెళ్ళేటప్పుడు స్త్రీలు కూడా రెండు మూడు జంటలుగా విడిపోయి, ఎవరైతే ముందుగా వేట తీసుకొని వస్తారో వారిని వారి వారి స్థాయిలో సన్మానించడం కోయ జీవితంలో జరిగే 'వేట' వేడుక. కానీ, ఈ వేట ద్వారా అమాయక గిరిజనులను రెండు వర్గాల వారు పొట్టన పెట్టుకుంటున్నారు. వేటకు వెళ్ళిన ఒక గుంపును పోలీసులు మీరు అన్నలకు మధ్యవర్తులుగా ఉంటున్నారని హింసించి చంపడం, రెండో గుంపు వాళ్ళను అన్నలు మీరు పోలీసులకు మధ్యవర్తిగా ఉంటున్నారని హెచ్చరించి పంపడం ఈ కథలో ప్రధానంగా కనిపిస్తుంది.

ఏండ్ల తరబడి గిరిజనులే కాకుండా బలహీన వర్గాల వారు కూడా అడవి పైనే ఆధారపడి జీవిస్తున్నారు. కొన్ని వర్గాల వారు కాలంలో వచ్చిన మార్పులను

అవకాశంగా తీసుకొని అడవి నుండి బయటి ప్రపంచంలోకి అడుగుపెట్టారు. కొన్ని గుంపులు వారు మాత్రం అక్కడే ఉండిపోయారు. ఇందులో కూడా కొన్ని ఎత్తుగడలు కనిపిస్తాయి. వారితో పాటు మిగిలిన గుంపులు కూడా బయట ప్రపంచంలోకి వస్తే మిగిలిన సమూహం వారిని తమ సమూహంలో ఒదగనీయకుండా చేసినట్టు కూడా తెలుస్తోంది. వారు చాలా ఏండ్లు దూరంగానే ఉండిపోడానికి ఈ కారణాలే సాక్ష్యంగా కథ నిరూపిస్తోంది. 'కరిస్తే కప్పకు కోపం, విడిస్తే పాముకు కోపం' లాగా కోయ వాళ్ళ పరిస్థితి ఉందని తెలుస్తోంది. సమాజంలో వచ్చిన మార్పు, పాలనాధికారంలో వస్తే బాగుంటుందనే ధోరణి కోయ గూడెంలో వ్యక్తమవుతుంది. వేట కోసం ఎదురు చూసిన ఆ గ్రామం, కొంతసేపటికి సన్మానం పొందుతామనే ఆనందం గాలిలోనే ఆవిరి అయిపోయిన సందర్భం కోయ గిరిజనులకు మిగిలిపోయింది. శ్రీశ్రీ అన్నట్టు 'ఇంకానా ఇక పై సాగవు' అన్న మాటను తీసుకుంటే సాగవని చెబుతూనే తమ పంథాని నెగ్గించుకుంటున్న ఈ లోకంలో కోయ వాళ్ళు బయటపడేదెప్పుడనే ప్రశ్నను మిగిలిస్తుంది. ఆధునిక సమాజంలోనే కాకుండా పూర్వకాలంలో రాజులు కూడా 'వేట' ద్వారా ఆనందాన్ని పొందేవారు. కోయవాళ్ళకు వేట అనేది జీవనంలో ఒక భాగం అని గొంతెత్తి అరవాలనుకున్నా వినేనాథుడే లేడన్నట్టు ఉందని తెలుస్తోంది. కొందరికి సాధ్యం కానిది గిరిజనులో తమకు సాధ్యమని నిరూపిస్తుంటారు. కానీ అదే తమ ప్రాణం పైకి వస్తుందని ఎన్నడు అనుకోలేదు. అలా అనుకొని వుంటే తమకు ఊహ తెలిసిన నాడే 'వేట' నా ప్రధాన వృత్తికాదని తెలుసుకునేవారు. తీరా నాది, నేను దీని మీద కొంతకాలం జీవించవచ్చని అనుకొని సంతోషంగా తిరుగుతున్నపుడు 'ఏరివేత' ముసుగులో గిరిజన సమూహాన్ని వేటాడుతూ ఏరివేస్తారని తెలియదు. తెలిస్తే ఎందుకు వేటకు వెళతాడు. నాగలి పట్టి దున్నే రైతును వెన్నుపోటు పొడిస్తే తిరిగి ఈ సమాజానికి ఆ రైతు ఆకలి తీర్చగలడా! అంటే సంశయమే!. ఈ కోణంలో ఎందుకు ఆలోచించకూడదని ప్రశ్నించాలని ఉంది! అంత ధైర్యంగా ప్రశ్నిస్తే ఈ సమాజం బతకనిస్తుందా? ఈ దాగుడుమూతల్లో కోయతెగ కానీ, మిగిలిన గిరిజన తెగలుగాని పడిపోతున్నాయనడంలో సందేహం లేదు.

వేద కాలం నుండి కులాల ప్రస్తావన ఉంది. నాలుగు కులాలున్నాయి. కులాల నుండి కొన్ని తెగలుగా విడిపోయాయి. ఒక్కొక్క తెగ వారు ఫలానా వృత్తి నిర్వహించాలని మనువు వింగడించాడు.అక్కడి నుండి మొదలయ్యింది ఈ సమస్య.

ఈ వృత్తి గిరిజనులది అని నిర్ధారించలేదు. సమాజం నిర్ధారించనప్పుడు ఏ వృత్తినైనా ధైర్యంగా ఎంచుకునే అవకాశం ఆధునిక సమాజం కల్పించింది. అది కేవలం పుస్తకాలకే పరిమితమయ్యిందా! అనే ప్రశ్న ఎదురౌతుంది. స్వాతంత్ర్యం రాకముందు గిరిజనుల్లో కొన్ని తెగల వాళ్ళని 'నేరగాళ్ళు' దారిదోపిడి' దారులని ముద్ర వేసారు. స్వాతంత్ర్యం వచ్చేంత వరకు ఆ చట్టాలు ఉన్నాయని కొన్ని పరిశోధనలు తెలుపుతున్నాయి. నాకు స్వేచ్ఛ వచ్చింది, ధైర్యంగా ఎక్కడైనా వెళ్ళవచ్చని ఎగిరి గంతులు వేసిన క్షణాలు కలగానే మిగిలిపోతాయని అనుకోలేదు. బ్రిటీషు పరిపాలనలో గిరిజనులు ఎక్కడికైనా వెళ్ళాలంటే ముందుగా అనుమతి తీసుకోవాల్సిన అవసరం ఉండేది. ఎక్కడికి వెళుతున్నారో, ఎందుకు వెళుతున్నారో అనే విషయాన్ని వాగ్మూలం రాసి వెళ్ళేవారు. ఇక నుంచి ఇటువంటి పరిమితులు లేవనే ఆనందంలో బయలుదేరిన కోయ తెగకు తిరిగి ఆ పరిస్థితే ఎదురైంది. రూపం వేరైనా ఫలితం ఒక్కటే!. చట్టాలు వేరైనా శిక్షలు ఒక్కటే. అనుభవిస్తున్న వ్యక్తులూ ఒక్కరే!. చట్టాలు మారినా వ్యక్తులు మారలేదని ఇక్కడ స్పష్టంగా తెలుస్తోంది.

4. తునికాకు

ఆ వాతావరణం, ఆ కొమ్మలు, రెమ్మలు, పండ్లు, ఫలాలు, కొండలు, కోనలు, సెలయేటి ధారలు వేటిని అడిగినా మీకు బాగా తెలిసిన వ్యక్తి, లేదా వ్యక్తులు ఎవరని అడిగితే వెంటనే గిరిజనులు అనే సమాధానం వస్తుందేమో!. ఈ కోవలోకి వచ్చేది 'తునికాకు'. గిరిజనుల తెగల్లో ఎక్కువ శాతం బతుకుతుంది తునికాకుమీదనే. ఒకప్పుడు తునికాకు గిరిజన జీవితంలో భాగం. నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదని రచయిత అభిప్రాయం. కాలం మార్పు కోసం నిత్యం ఎదురుచూసేది ఈ తునికాకు కోసమే!. అలాంటి తునికాకు నేడు గిరిజనులకు ఆమడ దూరంలో ఉండిపోతోంది. కారణాలు అనేకం!. ఒకప్పుడు నెల, రెండు నెలలు దాకా తునికాకు పనుల్లో ఉండే గిరిజనులు నేడు వారం రోజుల కూడా రాలేకపోతున్నాయనే సత్యాన్ని రచయిత పట్టుకోగలిగాడు.

ఎండనక, వాననక కష్టపడే తత్వం గిరిజనులది. అన్ని తెగల వాళ్ళు అదే తత్వంతో కష్టపడి పనిచేస్తుంటారు. స్త్రీ పురుషులంటూ తేడా కూడా కన్పించదు. గిరిజన స్త్రీలు పురుషుల కంటే ఎక్కువ కష్టపడే తత్త్వాన్ని కలిగి ఉంటారు. 'తునికాకు' కథలో

బుచ్చయ్యది ప్రధాన పాత్ర. ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు. ఈ కుటుంబానికి కూడా తునికాకు ఆధారం. బుచ్చయ్య కూతుర్లు వేసిన ప్రశ్నలు గమనిస్తే లోకాన్నంతా ఆలోచించేటట్లు చేస్తాయి. "అయ్యా! గీ తునికాకును గిట్ట మూటలకు మూటలు తెంపు కొత్తంగదా! ఏం జేత్తరే....?"(తునికాకు. పుట: 34) కూతురు అడిగేంత వరకు బుచ్చయ్యకు ఆ ఆలోచనే రాలేదు.

ప్రభుత్వాలు గిరిజనుల కోసం సంక్షేమ ఫలాలు అందించాలనే ఉద్దేశంతో కొన్ని పథకాలను ప్రవేశపెట్టారు. ప్రారంభంలో ప్రభుత్వాలు అనుకున్నంత స్థాయిలో ఫలితాలు రాబట్టలేకపోయినా, కాలానుక్రమంలో కొంతవరకు సాధించిందని నేడు సర్వేలు చెప్పుకుంటున్నాయి. కానీ, ఏ స్థాయిలో సాధించారనే ప్రశ్నను ఈ కథలో రచయిత వేసుకున్నప్పుడు "ఔను!" అనే సందేహమే కలుగుతుంది. గిరిజన తెగల్లో కూడా అన్ని తెగల వారికి వాటి ఫలితాలు పూర్తిస్థాయిలో అందడంలేదని అర్థమౌతుంది. కొన్ని తెగలవారు నాగరిక సమాజానికి దగ్గరగా ఉన్నారు. మరికొన్ని తెగలవారు ఇంకా నాగరికత అంటే ఏమిటో తెలియని స్థాయిలో ఉన్నారు. వారిలో ఈ కోయ తెగ వారు ఒకరని 'కొండా..కోనల్లో' నిరూపిస్తున్నాయి.

కోయ ప్రాంతంలో పరిశోధనకు వెళ్ళిన 'దినకర్' ఎటువంటి పరిస్థితిని అనుభవించాడు! అనే ప్రశ్నకు సమాధానం 'తునికాకు' ఇచ్చింది. తెలుగులో అన్ని కోణాల్లో పరిశోధన పూర్తయింది. ఇంకా తెలుగు సాహిత్యానికి అందాల్సిన కొత్త వస్తువు ఏదైనా ఉందంటే అది 'గిరిజన జీవితాలే!'. ఆ కోణంలో 'దినకర్' పరిశోధనకు వీ.ఆర్. పురం మండలంలోని 'జీడిగుప్ప' అనే కోయగూడెంను ఎంచుకున్నాడు.కోయ గిరిజనులు కొంతవరకైనా అభివృద్ధి పథంలో ఉంటారని అనుకున్నాడు. పరిస్థితి తారుమారు అయ్యింది. ఆ క్రమంలో దినకర్ తనకు తెలిసిన చట్టాలు 1971 లో ఆంధ్రప్రదేశ్ మైనర్ ఫారెస్ట్ ప్రొడ్యూస్ గురించి, 1987 లో ఏర్పడిన 'డిపార్ట్‌మెంట్‌ల్ కలెక్షన్' గురించి గుర్తు చేస్తాడు. బుచ్చయ్య మాత్రం అవేమిటో తెలియనట్టే ఉండిపోయాడనే సత్యాన్ని 'తునికాకు' వివరించింది.

దినకర్ పరిశోధన కోసం కొన్నాళ్ళు కోయ వాళ్ళ దగ్గరే ఉంటానని చెప్పినప్పుడు " పరాశ్కంగా ఉన్నదా? మేం ఏం తింటవో..ఎట్లవుంటవో ఎర్కయ్యే మాట్లాడ్తన్నవా?" (తునికాకు. పుట: 39) అన్న బుచ్చయ్య మాటల్లో వారి పూర్తి జీవితం అర్థమౌతుంది.

దినకర్ మాత్రం " అన్నీ తెలుసు. నేను దొరబిడ్డను కాను. మీ అనుమంటి పూరిగుడిసెల్లనుంచి వచ్చిన వాడ్నే. పేదవాళ్ళు ఏంతింటరో..అసలు ఒక్కోసారి తినడానికి దొరక్క ఉపాసా లెట్లవుంటరో..అన్నీ అనుభవించిన వాడ్నే బుచ్చయ్యా. మీతో పాటే కలోగంజో దొరికింది తిని...నా పని నేను చేసుకుంటా. మీరు సరేనంటే యింటికెళ్ళి నా బట్టలూ.. కాయితాలు తీసుకొని ఎల్లుండి వస్తా" (పుట:39) అనడంలో జీవనసత్యం అంతర్లీనంగా కనిపిస్తుంది.

గిరిజన ప్రాంతానికి ఎవరైనా కొత్త వారు వెళ్తే.. అంత తొందరగా వారితో కలిసిపోరు. పైగా వారిని ఎవరో ఒక శత్రువులాగా పరిగణిస్తుంటారు. ఇవన్నీ తెలిసిన దినకర్ ఆ రకంగా మాట్లాడాడని అర్థమౌతుంది. శత్రువుగా పరిగణించిన వారే నమ్మితే తమ ప్రాణాన్ని కూడా లెక్కచేయరనే సత్యాన్ని మరిచిపోవద్దనే విషయాన్ని రచయిత తెలపకనే తెలిపాడు. బతుకు బండి ముందుకు సాగాలంటే దేన్నైనా లెక్కచేయకుండా ముందుకు పోవాల్సిందే కదా!! పిచ్చయ్య తల్లి పాపమ్మ చేసిన పని కూడా అదే!. ఎండలో 'తునికాకు' కోసం వెళ్ళి వడదెబ్బకు సొమ్మసిల్లి పడిపోయింది. పడిపోయిన 'పాపమ్మ' ఇక లేవలేదు. తిరిగిరాని లోకానికి వెళ్ళిపోయింది. ఎంత మంది పాపమ్మలు ఇలాగ రోజూ ఈ లోకాన్ని వదిలి వెళ్తున్నారో ఈ గూడెంలలో. ఎవరు చూసివచ్చారనే విషయం మాత్రమే కనపడుతుంది. అందుకే వాటిని తెలియజేయాలనే లక్ష్యంతో వెళ్ళిన దినకర్‌కు ఈ స్థితే ఎదురయింది.

5. బొందల గడ్డ, 1/70 I 420 :

ఈ రెండు కథల్లో కనిపించే ప్రధాన వస్తువు భూమి సమస్య. గిరిజన జీవితంలో అనాదిగా ఎదుర్కొంటున్న సమస్యలలో ప్రధానంగా కనిపించేది భూసమస్య. ఒకప్పుడు భూముల విస్తీర్ణత ఎక్కువ ఉండేది. ఇప్పుడు తగ్గిపోవడానికి జనాభా పెరుగుదలతో పాటు, పట్టణీకరణ పెరిగిపోవడం ఒకటి. ఏ అభివృద్ధి అయినా, ఏ ఫ్యాక్టరీ అయినా, ఏ క్వారీలైనా అక్కడే వెలిసేది. ఈ తరుణంలో వాటికి ఆవాసాలు గిరిజన గూడేల్లయ్యాయి. అప్పటి వరకు కోయవాళ్ళ(గిరిజనులు)కు తెలియదు, తమ భూముల్లో నల్ల బంగారం గనులున్నాయనే వాస్తవం. వాటిని పసిగట్టిన గిరిజనేతరులు మెల్లమెల్లగా గిరిజనులకు నచ్చచెప్పి భూములను లాక్కున్న సందర్భం ఈ కథల్లో కనిపిస్తుంది.

"గిరిజన సోదరులందరకీ ఈ శుభతరుణంలో నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుకుంటున్నాను. శుభతరుణం ఎందుకన్నాననంటే ..మీ జీవితాలన్నీ మారిపోయే గొప్ప సమయం ఇది. అడవిలో పుట్టి అడవిలో పెరిగి అడవిలోనే బతుకులు వెళ్ళమార్చే మీరు.. పేదరికంతో ఎంతటి దయనీయ స్థితిలో వున్నారో నాకు తెలుసు. అనుకోకుండా హఠాత్తుగా అదృష్ట దేవత మీ తలుపుతట్టింది. అవకాశాలు మళ్ళా మళ్ళా రావు. మన దేశాభివృద్ధికి చిన్న పరిశ్రమల దగ్గర నుండి భారీ పరిశ్రమల వరకూ అన్నీ.. అన్నీ వెన్నెముక లాంటివే. మరి అవి పని చేయాలంటే ఇంధనం కావాలి. ఆ ఇంధనం నల్ల బంగారం రూపంలో మీ భూముల్లో నిక్షిప్తమైవుంది" (బొందల గడ్డ.పుట: 46) "మీరు యీ కాయితాల మీద సంతకాలు చేస్తేచాలు. రాత్రికి రాత్రే లక్షాధికారులవుతారన్నమాట. అంతే కాదు మీ ప్రతి కుటుంబంలోంచి ఒకరికి ఇక్కడే వుద్యోగం కూడా దొరుకుతుంది" (పుట:47)

'దున్నేవాడిదే భూమి' నినాదం ఇక్కడ మూగబోయింది. డబ్బు ఎర చూపిస్తూ ఆ నినాదాన్ని మంటగలిపారు. కోయవాళ్ళకు నల్లబంగారం అంటే అర్థం కాలేదు, ఇంకా ఏదేదో అన్నారు. అవి కూడా అర్థం కాలేదు. అర్థమైన పరిభాష ఒక్కటే మా భూముల్లో ఏదో చేస్తారనే విషయం!. భూమి పోయినా కూలీ దొరుకుతుందని, ఉద్యోగం దొరుకుతుందని ఆశపడ్డారు. కూలీ దొరకలేదు, ఉద్యోగం దొరకలేదు, భూములు రాలేదు. నిర్వాసితులుగా మారారు. నిన్నటి వరకు అది సాధారణ నాగరిక ప్రపంచానికి దూరంగా ఉన్న కోయగూడెం. ఆ గూడెం ఆనవాళ్ళైనా తెలియదు. కానీ నేడు రూపురేఖలే మారిపోయాయి. తిండిపెట్టిన భూములు, దోపిడి దారుల ఖజానా నింపుతున్నాయనే సత్యాన్ని జీర్ణించుకోలేకపోయారు. దిక్కులేని వాళ్ళుగా మిగిలిపోయారని ఈ కథలు నిరూపిస్తున్నాయి.

'శ్రమ విభజన జరగాలి, కానీ శ్రామికుల విభజన కాదని' భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ (1891-1956) అభిప్రాయపడ్డారు. కానీ ఈ కోణంలో జరుగుతుందంటే శ్రామికుల విభజన జరుగుతుందే తప్ప శ్రమ విభజన జరగడం లేదు. భూమి ఎవరిదైనా ఫలితాలు చెందాల్సిన వారికి చెందాలి. చెందనప్పుడే పోరాటాలు వస్తాయనే విషయం ఎన్నో శతాబ్దాల నుండి గమనిస్తూనే ఉన్నాం. వాటిని కార్యరూపం దాల్చనీయకుండా చేసిన సంఘటనలను ఈ కథలు తెలుపుతున్నాయి.

1/70 I 420 చట్టం ప్రకారం గిరిజనుల భూములు గిరిజనులకే చెందాలి. ఏ పాటి చట్టం అమలును గిరిజనేతరులు పట్టించుకుంటున్నారు. ఈ కథ కాదనే చెపుతుంది. ఈ కథలో రాజాబాబు కోయవాళ్ళలో తెలివి గల వ్యక్తిని, ప్రశ్నించే వాడిని మెల్లగా తన దగ్గర పనివాడ్ని చేసుకుంటాడు. ఇంతకు ముందే అనుకున్నట్టే నమ్మితే కోయవాళ్ళు (గిరిజనులు) ప్రాణాన్నైనా ఇస్తారని. అలాగే సిగ్గన్నను అలాగే లొంగదీసుకుంటాడు. ఆ గ్రామంలో ఉన్న భూములన్నీ మెల్లమెల్లగా కోయవాళ్ళ నుండి కోయవాళ్ళ పేర్లమీద మారిపోతున్నాయి. అధికారం మాత్రం రాజాబాబుదే. భూమి మాత్రం రాజబాబుదే. పేరుమాత్రం వారిది. దీన్ని ఏ రకమైన బినామీ అనాలో కాలమే తేల్చాలి. ఒక వర్గాన్ని ప్రేమతో, మరొక వర్గాన్ని కోపంతో రాజాబాబు ఎందుకు చూస్తున్నాడో కొన్నాళ్ళకి గానీ అర్థం కాలేదు.

కన్నయ్య "అయినా మా బూవులు ఏరే వాళ్ళెవ్వరూ కొనొద్దని, అమ్మొద్దని రూల్సు వున్నయట గద దొరా..." ఏదో ఒక విధంగా తప్పించుకోడానికి మార్గాలు వెదుకుతూ అన్నాడు కన్నయ్య. 'అమ్మ నా కొడకా! రూల్సు మాట్లాడేంతటి పెద్దోడివైపోయావా? ఇక ఉపేక్షిస్తే లాభం లేదు. లోపలి గుంటనక్క మోరపైకెత్తి అటూ యిటూ నెమకుతున్నది. ఆ రూల్సు నాకు తెలియనివా? అయినా బూవులు నేనేం చేసుకుంటాను? నాకు తెలిసిన మీవోడే ఒకడు. చారెడు చెల్కగావాలంటే నిన్ను అడిగాను. అంతే ..అందులో తన స్వార్థమేమీ లేనట్టుగా చెప్పాడు దొర'. (1/70 I 420. పుట: 78) ఇలా మెల్లమెల్లగా ఒకరి పేరు నుండి మరొక గిరిజన వ్యక్తి పేర్ల మీద భూములన్నీ మారిపోయాయి. కాగితాలు మాత్రం రాజాబాబు దగ్గరికి ఎలా చేరిపోయాయో తెలియదు.

మొసలి కన్నీరు కార్చిన రాజాబాబు మైకంలో పడిపోయిన కోయవాళ్ళకు చివరికి తమ ప్రాణాల్నే కాటేసే విషసర్పం అని తెలియదు. ఎలక్షన్ వచ్చినా, నిల్చునేది కోయవాళ్ళే అయినా పెత్తనం రాజాబాబుది. కానీ రాజకీయం నేర్పిన చైతన్యం వల్ల చివరికి కోయ గిరిజనులందరు తిరగబడి తమ భూముల్ని లాక్కోడం ఈ కథలో గొప్ప మలుపు. ఆ విషయం కథకే పరిమితమౌతుంది. నిజ జీవితంలో సాధ్యం కావడం లేదని ఈ కథలు విశదపరుస్తున్నాయి.

మిగిలిన కథలు కూడా ఈ ధోరణిలో అనేక సమస్యలను చిత్రిస్తున్నవే. స్థూలంగా కోయ గిరిజనుల జీవితంలో పాటలు పాడడం నేరమని, వేటాడడం పాపమనే విషయాన్ని ప్రధానంగా తెలుపుతున్నాయి.

సమాజం మారుతున్నప్పుడు కోయ గిరిజనులు కూడా తమ జీవితాల్లో మార్పును ఆహ్వానించుకోవాలి. చైతన్యం వైపు ప్రయాణించాలి. చదవాలి. అనాదిగా వస్తున్న మూఢనమ్మకాలను కాలరాయాలి. నూతన పరిజ్ఞానాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. ఈ నాటికీ నాగరిక సమాజంలో గిరిజనులు ఇంకా ఎదగని పసిపాపలే! గిరిజనుల మీద రచనలు ఇంకా రావాలి. సామాజిక కార్యకర్తలు అభ్యుదయ దృక్పథంకలవారు గూడేల్లోకి వెళ్ళి వారి జీవనశైలిని గమనిస్తే అనేక విషయాలు బయటపడతాయి. చైతన్యం లేకపోతే అచేతనం అయ్యే ప్రమాదం వుంది. వారికి దశదిశా నిర్దేశం చేసేవారు అనాదిగా జరుగుతున్న వ్యవహారాలకు, అన్యాయాలకు స్వస్తి పలికేలా చూడాలి.

25. లంబాడీ భాషా స్వరూపం – సమస్యలు, పరిష్కార మార్గాలు

డా. భూక్య తిరుపతి
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ,
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం–517 426
Mobile: 9441335123
E–mail: thirupathi2612@gmail.com

పరిచయం

భారత దేశంలో దాదాపుగా 600 గిరిజన తెగల వారున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం వీరి జనాభా 8.2%. వీరు మైదాన, కొండ మరియు అటవీ ప్రాంతాలలో నివసిస్తున్నారు. లంబాడీలు మైదాన మరియు అటవీ ప్రాంతాలలో నివసిస్తున్న ఒక గిరిజన తెగ. వీరు ప్రపంచమంతటా వ్యాపించి ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వీరికి 47 పేర్లు వాడుకలో ఉన్నాయి. వీరిని మన దేశంలో ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క పేరుతో పిలుస్తారు. ఒక్క తెలంగాణాలోనే లంబాడీ, బంజారా అనే పేర్లు వాడుకలో ఉన్నాయి. భారతదేశంలో ఈ లంబాడీల జనాభా, దేశ జనాభాలో 10% వరకు ఉండవచ్చని ఒక అభిప్రాయం. భారతదేశంలోని ఉత్తరాది రాష్ట్రాల తరువాత దక్షిణాది రాష్ట్రాల్లో వీరి జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు వరుసగా తెలంగాణ, కర్ణాటక మరియు ఆంధ్రప్రదేశ్‌లే.

లంబాడీ భాష ఇండో ఆర్యన్ భాషా కుటుంబానికి చెందింది. ఈ భాషలో పది అచ్చులు, ఇరవైఒక్క హల్లులు ఉన్నాయి. వీరి భాషకు లిపి లేదు. చారిత్రకంగా వీరి భాషను "గోర్‌బోలి" అని పిలుస్తారు. లంబాడీ భాషను భాషాభాగాలుగా విభజిస్తే నామవాచకం, సర్వనామం, క్రియ, క్రియావిశేషణం మొదలైన విధంగా విభజించవచ్చు. లంబాడీ భాషా స్వరూపాన్ని ఈ క్రింది విధంగా విశ్లేషించవచ్చు.

నామరూప నిర్మాణం

లింగ, వచన, విభక్తులు చేరదగినవి నామవాచకాలు. లంబాడీ భాషలో నామ రూప నిర్మాణం ఇలా ఉంది.

1. మానవ సంబంధమైనవి – ఆద్మి/మాటి (మనిషి) (స్త్రీ, పురుషులెవరైన ఒక్కటే) మహద్వాచకం–బా (నాన్న), భీయా (అన్న), మహతీ వాచకం – యాడి (అమ్మ) భేన్ (చెల్లెలు)
2. మానవేతర సంబంధమైనవి – కొౘ్ర (కుక్క)
3. అప్రాణి వాచకాలు – ఘర్ (ఇల్లు)
4. ద్రవ్య వాచకాలు – దూద్ (పాలు), లాప్సి (పాయసం)
5. భావ వాచకాలు – కామ్ (పని)
6. వ్యక్తుల పేర్లు – బాలాజీ (బాలాజీ) లచ్మి (లక్ష్మి)
7. స్థల నామాలపేర్లు – సొమ్లుతాండొ (సోమ్లు తండా)

సర్వనామాల వివరణ

Pronominal	Distant దూరవర్తి	Proximal సమీపవర్తి	Inter-rogative ప్రశ్నార్థక	Indefinite అనిర్దిష్టంగా
Singular (ఏ.వ.)				
Masculine (పుం.లి)	ఊ–వాడు, అతడు/ ఆతడు	ఈ–వీడు ఇతడు/ ఈతడు	కూణ్– ఎవరు/ ఎవడు	ఏక్లోజ్ ఒకడు
Feminine (స్త్రీ.లి)	ఊ–ఆమే	ఈ–ఈమే	కూణే– ఎవ్వతే	ఏక్లిజ్–ఒక్కతే
Neuter (న.లి)	★ ఓ–అది	ఎ/జ్/ఇజ్– ఇది	కదే–ఏది	
Plural (బ.వ.) Human (మానవ)	★ఓ–వారు/ వారలు	★ ఎ–వీరు	కూణ్– ఎవరు	దసేక్–కొందరు కమ్తి-కొంత
Neuter (న.లి)	★ఓజ్–అవి	ఏజ్–ఇవి	కతె–ఏవి	దసేక్–కొన్ని

Adjectival Masc. (సమూహం)	సే-అంత	దసేక్-కొంత	కత్ర-ఎంత	దసేక్-కొంత (పరిమాణార్థకం)
Count Human (మానవ)	సే-అందరు	అత్ర-ఇందరు	కత్ర-ఎందరు	దసేక్ - కొందరు
Neuter (న.లి)	సే-అన్ని	అత్ర-ఇన్ని	కత్ర-ఎన్ని	దసేక్ - కొన్ని
Demonstrative నిర్దేశ స్సర్వనామాలు	ఊ-ఆ	ఈ-ఈ	కదె/కద్-ఏ	ఏక్/ఒక
Kind (రకం)	ఓర్-అట్టి	ఏర్-ఇట్టి	కుణస్-ఎట్టి	ఏక్-ఒక
Adverbal క్రియావిశేషణం	జన్నా-అప్పుడు	అబ్బె-ఇప్పుడు	కన్నా-ఎప్పుడు	-
Spatial స్థల సంబంధమైన	ఓత్తె-అక్కడ	అత్తె/ఎత్తె - ఇక్కడ	కత్తె-ఎక్కడ	-
Directional (దిక్కు)	ఓవ్డి-అటు	ఎవ్డి-ఇటు	కెవ్డి-ఎట్టు	-
Manner (పద్ధతి)	-	-	కూ-ఎట్లు	-
Reason (కారణం)	జెర్ఘాలి-అందుకు	ఏర్ఘాలి - ఇందుకు	కసేన-ఎందుకు	-

★ ఈ చిహ్నాల దగ్గర ఒ/ఒజ్/ఎ/ఎజ్ లు కూడా చూపించవచ్చు. స్త్రీ, పుంలింగాలకు ఏకవచనంలో దూరానికి సమీప వర్తిలకు 'ఈ', 'ఊ'లు సమానంగా ఉన్నాయి. కాని ప్రశ్నార్థక, అనిర్దిష్టార్థాలకు వేరువేరుగా కూణ్ (పుం.లి.) కూణే (స్త్రీ.లి.) ఏక్లోజ్ (పుం.లి.) ఏక్లీజ్ (స్త్రీ.లి.) ఉన్నాయి.

బహువచనంలో స్త్రీ, పుంలింగాలకు దూరవర్తి, సమీపవర్తిలను ఓ, ఏలు సూచిస్తున్నారు. అయితే ఇందులో కేవలం పురుషులయితే ఒక విధంగా, కేవలం స్త్రీలయితే మరో విధంగా, స్త్రీ, పురుషులు కలిసి ఉంటే కేవలం పురుషులకున్న రూపాన్ని తీసుకుంటుంది.

స్త్రీలైన రూపం మిగిలిన రూపాలతో విభేదిస్తుంది. ఈ రూపం క్రియల మీద ఆయా స్త్రీ, పుంలింగాలకు సంబంధించిన ప్రత్యయాల వలన తెలుస్తుంది.

ఉదా: 1) వాళ్ళు ఇద్దరు వస్తున్నారు (మగ + మగ) వొదిచలే ఆవఛ
2) వాళ్ళు ఇద్దరు వస్తున్నారు (ఆడ + ఆడ) వొది చలి ఆవఛ
3) వాళ్ళు ఇద్దరు వస్తున్నారు (మగ + ఆడ) వొది చలే ఆవఛ

సర్వనామాలు రెండింటికి 'అత్ర' ప్రశ్నార్థకాలకు మూడింటికి 'కత్ర' అనిర్దిష్టాలకు, మూడు వాచకాల బహువచనానికి 'దసేక్' అనే రూపాలు వస్తాయి.

పురుషబోధక సర్వనామాలు

పురుష ప్రత్యయం	ఏకవచనం	బహువచనం
ఉత్తమ పురుష	మ = నేను	హం = మేము, అపణ్ = మనం
మధ్యమ పురుష	తు = నీవు	తం = మీరు
ప్రథమ పురుష	ఉ = అతడు, ఆమె, అది, అవి	ఓ = వారు, వాళ్ళు

నామవిభక్తులు: –

1. ప్రథమ విభక్తి ★ ఏ, అసమాన్
2. ద్వితీయ విభక్తి – నే, ఎ, ఎన్, న
3. తృతీయ విభక్తి – తే, లేన్, పాల్తీ, లారె
4. చతుర్థి విభక్తి – వాసు, నే
5. పంచమీ విభక్తి – తీ, తీజ్, తిస్, కాణే
6. షష్ఠి విభక్తి – ర్, అజ్, ఏర్జ్, ఎన, న
7. సప్తమీ విభక్తి – మ, ధయి, ఏమ, ఎ, ఎన
8. సంబోధన ప్ర.వి. – ఏ, ఓ

★ ఏ అనేది పదం పై ప్రత్యయం వలె చేరుతుంది. అసమాన్ అనేది పదం ముందు (Prefix) పూర్వ ప్రత్యయంగా చేరుతుంది.

లింగం: –

హిందీలో లాగానే లంబాడీ భాషలో లింగ వ్యవస్థ క్లిష్టంగా ఉంటుంది. ఈ భాషలో కొన్నిచోట్ల శబ్దాశ్రితంగా, కొన్నిచోట్ల అర్థాశ్రితంగా ఉంటుంది.

ఉదా: అర్ధాశ్రితంగా ఉన్నవి

బాప్ – తండ్రి (పుం.లిం.)
యాడి – తల్లి (స్త్రీ.లిం.)

కొన్ని అమనుష్య వాచకాలు సహజ లింగంతో సంబంధం లేకుండా స్త్రీ, పుం. లింగాలు వాడుకలో ఉన్నాయి)

ఉదా: కీడా – పురుగు (పుం.లిం)
కీడి – చీమ (స్త్రీ.లిం.)

పెద్ద వస్తువులు పుంలింగాలుగాను చిన్న వస్తువులు స్త్రీలింగాలుగాను ఉన్నాయి.

ఉదా: గట్లా – కొండ/గుట్ట (పుం.లి)
గట్లి – బోడు (చిన్నపాటి రాళ్ళ సముదాయం, స్త్రీ.లిం.)

'ఓ' తో అంతమయ్యే పదాలు పుంలింగాలుగా కనిపిస్తాయి.

ఉదా: ఘోడో – గుర్రం
సస్రొ – మామయ్య

సాధారణంగా 'ఇ' కారాంత శబ్దాలు స్త్రీ మరియు నపుంసక లింగాలు.

ఉదా: హథిలి – అరచేయి
గద్ది – గాడిద
గావ్డి – ఆవు
హడ్కి – ఎద్రి

కొన్ని 'ఎ' కారాంత రూపాలు (నపుంసక లింగం)గా ఉంటాయి.

ఉదా: ముచ్చె – మీసాలు
ఆంత్రే – పేగులు

'అణ్, అణి, ణి' చేరి కొన్ని పదాలు (స్త్రీ లింగ రూపాలుగా మారుతాయి)

ఉదా: నావి – నావణి – మంగలి భార్య
దేవర్ – దరవాణి – తోడికోడలు
గోర్ – గొణ్ణి – లంబాడీ స్త్రీ

నపుంసక లింగాలు:-

ఝాడ్ – చెట్టు, ఖేత్ – చేను, లక్డి – కట్టె, తళావొ – చెరువు.

ముందు వివరించిన ఉదాహరణల ఆధారంగా లింగ వ్యవస్థ వేరువేరుగా ఉందని చెప్పవచ్చు.

వచనం:-

ఆ, ఈ, ఊ, లతో అంతమయ్యే ప్రాతిపదికల్లో ఏకవచన ప్రయోగం లేదు. ఇలాంటి వాటిని నిత్య బహువచనం అంటారు.

ఉదా: మీనా – నెల (బ.వ.), పాణీ – నీళ్ళు (బ.వ.), దారూ – సారాయి (బ.వ) ఈ పదాలు నిత్య బహువచనాలు. లంబాడీ భాషలో ప్రాతిపదిక మీద 'ఓ' ప్రత్యయం చేరడం ద్వారా ఏ.వ. రూపాలు. 'ఏ' అనే ప్రత్యయం చేరడం ద్వారా బహువచన రూపాలు ఏర్పడతాయి.

ఉదా: ఘోడో వ ఘోడ్ + ఒ = గుర్రం (ఏ.వ.)
ఘోడె వ ఘోడ్ + ఏ = గుర్రాలు (బ.వ.)
అయో = వచ్చాడు
అయే = వచ్చారు

'ఇ' కారంతో అంతమయ్యే స్త్రీ లింగ పదాలు 'యే' అనే ప్రత్యయాన్ని చేర్చుకొని బ.వ.గా మారుతున్నాయి.

ఉదా: చ్వారి– చ్వార్ + ఇ వ అమ్మాయి (స్త్రీ) (ఏ.వ)
చ్వారి + యే వ చ్వారియే (బ.వ)
యాడి = అమ్మ (ఏ.వ.)
యాడియే = అమ్మలు (బ.వ.)

'అ'కారాంత పుంలింగ ఏక వచనాలు, 'ఇ' కారాంత పుంలింగ ఏక వచనాలకు, బహు వచనంలో 'వొ'గాని 'యే'గాని ప్రత్యయాలు చేరుతాయి.

ఉదా: బేటా – కొడుకు (ఏ.వ.)
బేటావొ – కొడుకులు (బ.వ.)
ధణి – మొగుడు (ఏ.వ.)
ధణియే – మొగుళ్ళు (బ.వ.)

హల్లుతో అంతమయ్యే నపుంసక లింగ రూపాలకు బ.వ.లో 'ఏ' అనే ప్రత్యయం చేరుతుంది.

ఉదా: వాట్ – దారి (ఏ.వ.)
వాటే – దార్లు (బ.వ.)
తలప్ – తలుపు (ఏ.వ.)
తలపే – తలుపులు (బ.వ.)

సర్వనామాలు, ఏకవచన, బహువచనాలు ఈ భాషలో ఈ క్రింది విధంగా ఉన్నాయి.

పురుష ప్రత్యయం	ఏకవచనం	బహువచనం
ఉత్తమ పురుష	మ = నేను	హం = మనం, మేము
మధ్యమ పురుష	తు = నీవు	తం = మీరు
ప్రథమ పురుష	ఉ = అతడు, ఆమె అది, వాడు	ఓ = వారు, అవి
	ఇ = ఇతడు, ఈమె ఇది, వీడు	ఏ = వీరు, ఇవి

సంఖ్యావాచకాలు:–

ఈ భాషలో కొన్ని సంఖ్యలు మినహాయించి దాదాపుగా హిందీలో ఏ విధంగా ఉచ్చరిస్తారో అలానే కనిపిస్తుంది.

ఉదా: ఏక్ – (సామాన్య సంఖ్యావాచకం)
నవ్ – (సామాన్య సంఖ్యావాచకం)
గ్యార – (సంశ్లిష్ట సంఖ్యావాచకం)
ఏక్ సౌ యెక్ (సంయుక్త సంఖ్యావాచకం)

భిన్నాంశాలు:–

ఉదా: ¼ – పావలా
½ – ఆదొ (అటాణా)
¾ – పావ్ కం ఏక్ (బారాణ)
1¼ – ఏక్ న్ పావలా
1½ – డోడ్
2½ – అడాయి

క్రియా రూపాలు:–

లంబాడీ భాషలోని క్రియలు చాలా వైవిధ్యాన్ని ప్రదర్శిస్తాయి. ఈ భాషలో అకర్మక, సకర్మక, ప్రేరణార్థక ధాతువులు విడివిడిగా ఉన్నాయి.

	అకర్మకం	**సకర్మకం**
ఉదా:	నవ్ (వంగు)	నవా (వంచు)
	వద్ (పెరుగు)	వదా (పెంచు
	సరక్ (జరుగు)	సరకా (జరుపు)

కొన్ని ధాతువులపై 'అడ్' ప్రత్యయం చేరడం వలన సకర్మక ధాతువులుగా మారుతున్నాయి.

ఉదా:	హఁస్ (నవ్వు)	హఁసాడ్ (నవ్వించు)
	దాఁస్ (పరిగెత్తు)	దాఁసాడ్ (పరిగెత్తించు)

సకర్మకం	**ప్రేరణార్థకం**
పుఁచ్ (అడుగు)	పుఁచా (అడిగించు)
ఖో (తిను)	ఖరా (తినిపించు)

సకర్మక క్రియకు పదాంత హల్లుకు దీర్ఘ ఆకారం చేరి ప్రేరణార్థకంగా మారుతుంది.

ద్వ్యక్షర ధాతువులలో ప్రేరణార్థకమైన 'ఆ'కు ముందు ద్వితీయాక్షరంలోని అకారం లోపిస్తుంది.

ఖరచ్ (ఖర్చు)	ఖర్చా (ఖర్చుపెట్టు)
పకడ్ (పట్టుకో)	పక్డా (పట్టించు)

ఏకాక్షర ధాతువులకు 'రా' అనే ప్రత్యయం చేరినప్పుడు ధాతువులోని దీర్ఘాచ్చు హ్రస్వాచ్చుగా మారుతుంది.

ఉదా:	ఖో (తిను)	ఖరా (తినిపించు)
	పీ (తాగు)	పరా (తాగించు)

సమాపక క్రియ:–

భూతకాలం (భూతకాల రూపం = ధాతువు + భూతకాల ప్రత్యయం + (భూతకాల ప్రత్యయం = ఓ, ఏ, ఇ)

పురుష ప్రత్యయాలు

ఉత్తమ పురుష ఏక వచనం	–	'తో'
ఉత్తమ పురుష బహు వచనం	–	'తే'
మధ్యమ పురుష ఏక వచనం	–	'తా'
మధ్యమ పురుష బహు వచనం	–	'తే'
ప్రథమ పురుష ఏక వచనం	–	'తా' (మహత్)
ప్రథమ పురుష బహు వచనం	–	'తి' (మహతి)
ప్రథమ పురుష బహు వచనం	–	'తే' (మహన్మహతి)
ప్రథమ పురుష ఏక వచనం	–	'తి' (అమహత్)

ఉదా: ఖాద్ + ఓ + తో = ఖాదోతా (తింటిని)
చాడ్ + ఏ + తే = చడేతే (ఎక్కితిమి)
అయ్ + ఇ + తి = అయితి (వచ్చితిని/వచ్చింది)
చడ్ + ఒ + తా = చడొతా (ఎక్కితిని)

భవిష్యత్కాలం

ధాతువు

భవిష్యత్కాల ప్రత్యయం – ఉ, అ, ఎ, ఒ, ఇ
పురుష ప్రత్యయం – చు, చా, చి, చొ, చ

ఉదా: చడ్ + ఉ + చు వ చడుచు	(ఎక్తాను)
రమ్ + అ + చా వ రమ్మాచా	(ఆడ్తాము)
కర్ + ఎ + చి వ కరెచి	(చేస్తావు)
దికావ్ + ఒ + చొవదికావొచొ	(కనిపిస్తారు)
అర్ + ఇ + చ వ అరిచ	(వస్తుంది)
లెల్ + ఎ + చా వ లెలెచ	(తీసుకుంటారు)
ర్ + అ + చ వ రచ	(ఉంటాడు/ఉంటుంది)

వర్తమాన కాలం – (ధాతువు + వర్తమానకాల ప్రత్యయం + పురుష ప్రత్యయం)

వర్తమానకాల ప్రత్యయం	–	ఒ, ఎ, ఇ
పురుష ప్రత్యయం	–	చు, చా, చి, ఛి

ఉదా: ఖార్ + ఒ + చు = ఖారొచు (తింటున్నాను)
ఖార్ + ఎ + చా = ఖారెచా (తింటున్నాం)
ఉతర్ + ఇ + చ = ఉతరిచ (దిగుతున్నది)

వ్యతిరేక వర్తమానకాల రూపం = (భావార్థకం + కొని)

ఉదా: ఆరొ + కొని = ఆరొకొని (రావటం లేదు)
లేరి + కొని = లేరికొని (తీసుకోవటం లేదు)

వ్యతిరేక భూతకాల రూపం – అన్నంతం వ ధాతువు + ఒ/ఇ + కొని

ఉదా: ఆయో + కొని = ఆయోకొని (రాలేదు)
సుత్తి + కొని = సుత్తికొని (పడుకోలేదు)

భవిష్యత్కాల వ్యతిరేక రూపం (తద్ధర్మార్థకం)

ఉదా: చడ్ + ఉ + ని = చడుని (ఎక్కను)
ఖావ్ + ఒ + ని = ఖావొని (తినరు)
రేస్ + ఇ + ని = రెస్ని (ఉండవు)
ఆవొ + అ + ని = ఆవాని (రాము)

విధ్యర్థకంలో ఏకవచనం ఉండదు – θ

విధ్యర్థకంలో బహువచనం ఉంటుంది – ఒ

ఉదా: అ = రా – θ
అవొ – రండి
ఖొ θ, ఖావొ – తినండి

వ్యతిరేక విధ్యర్థకం (ధాతువు వ్యతిరేక విధ్యర్థకం – మత్)

ఉదా: ఖావొ + మత్ = ఖావొమత్ (తినకండి)
అవొ + మత్ = అవొమత్ (రాకండి)

నిశ్చయార్థకం (ధాతువు + నిశ్చయార్థక ప్రత్యయం)

నిశ్చయార్థకం (ణొ), తెలుగులో (ఆలి/వాలి)

ఉదా: ఖావణొ = తినాలి
పడణొ = చదవాలి

ఉభయ సంప్రార్థన (ధాతువు + అ)

ఉదా: ఖామ్ + అ = ఖామ (తిందాం)
మార్ + అ = మార (కొడదాం)

అసమాపక క్రియలు

భూతకాల ధాతుజవిశేషణం:–

(భూతకాల ధాతుజ విశేషణం = ధా + భూ.కా.ప్రత్యయం = ఒ)

ఉదా: చదు + ఒ = చడొ (ఎక్కిన)
రమ్ము + ఒ = రమ్మొ (ఆడాను)
ఖాతు + ఒ = ఖాదో (తిన్నాను)

భవిష్యత్కాలిక ధాతుజ విశేషణం:–

(ధాతువు+ భవిష్యత్కాలిక ప్రత్యయం = ఏ)

ఉదా: చదు + ఏ = చడే (ఎక్కే)
ఆవు + ఏ = ఆయే (వచ్చే)

వ్యతిరేక ధాతుజ విశేషణం:–

(ధాతువు + ఎని)

ఉదా: చదు + ఎని = చడెని
అ + ఎని = అయేని

క్త్వార్థకం:–

(ధాతువు + అన్/తాణి/న్)

ఉదా: కర్ + అన్ = కరన్ (చేసి)
జవ్ + తాణి = జతాణి (వెళ్ళి)
పీ + అన్ = పీన్ (తాగి)

వ్యతిరేకక్త్వార్థకం:–

(ధాతువు + కొనిజు)

ఉదా: చడొ + కొనిజు = చడొకొనిజు (ఎక్కకుండా)
రాందొ + కొనిజు = రాందొకొనిజు (వండకుండా/వండక)

అన్నంతం:–

(ధాతువు + ఉని)

ఉదా: ఉతర + ఉని = ఉతరుని (దిగ)
పుంచ్ + ఉని = పుంచుని (అడగ)

చేదర్థకం:–

(ధాతువు + అతొ/ఎతొ)

ఉదా: చడ్ + అతొ = చడతొ (ఎక్కితె)
పుంచ్ + ఎతొ = పుంచెతొ (అడిగితే)

అప్యర్థకం:–

(ధాతువు + తి/తొయి)

ఉదా: కర + తి వ కరాతి/కరతొయి (చేసిన)
కతి + తొయి + కతొయి (చెప్పినా)
జావతి వ జావతొయి (వెళ్ళినా)

వ్యతిరేక అప్యర్థకం:–

(ధాతువు + ఒ/కొనితి)

ఉదా: చడు + ఒ + కొనితి = చడొకొనితి (ఎక్కకపోయినా)
మారొ + కొనితి = మారొకొనితి (కొట్టకపోయినా)

నిశ్చయార్థకం:–

(భావార్థకం– అనొ + ఎనొ)

ఉదా: అవ్ + అనొ = అవనొ (రావాలి)
ల్ + ఎనొ = లెనొ (తీసుకోవాలి)

నిషేధార్థకం:-

(అన్నంతం + ఎర్ ఛేని)

ఉదా: కర్ + ఎర్ ఛేని = కరెర్ ఛేని (చేయవద్దు)
జా + యేర్ ఛేని = జాయేర్ ఛేని (వెళ్ళవద్దు)

అనుమత్యర్థకం:-

(అన్నంతం + వాసు)

ఉదా: ఖాయె + వాసు = ఖాయెవాసు (తినవచ్చు)
కర్లె + వాసు = కర్లెవాసు (చేసుకోవచ్చు)

శక్త్యర్థకం:-

(అన్నతం సకు/క/క్)

కరా + సకుకరాసకు (చేయగలను)
కర + సకాకరసకా (చేయగలం)

క్రియా విశేషణాలు:-

హఁసతో (నవ్వుతూ)
రొతా – రొతా (ఏడుస్తూ ఏడుస్తూ)
ఖాఖాన్ (తినితిని) మొ॥ చెప్పవచ్చును

కాల బోధక ప్రత్యయాలు:-

భూతకాలం = ఒ, భావి = ఉ, వర్తమానం = ఒ, బ.వ.–ఎ

ఉదా: మ కామే వాసు ఫరొతొ (ఫర్+ఒ+తొ) (నేను పనికోసం తిరిగాను)
మ కామే వాసు ఫరుచుఁ (ఉ) (నేను పనికోసం తిరుగుతాను)
మ కామే వాసు ఫర్రొ(ఒ)చు (నేను పనికోసం తిరుగుచున్నాను)
తం కామే వాసు ఫర్రె(ఎ)చొ (మీరు పనికోసం తిరుగుచున్నారు)

వాక్యం :- లంబాడీ భాషలో వాక్యం ఇతర భారతీయ భాషలలో ఉన్నట్లుగానే కర్త, కర్మ, క్రియ వరుసలో పదాలు అమరివుంటారు.

సామాన్య వాక్యం:– ఇది రెండు రకాలు

(1) క్రియా రహితాలు (2) క్రియాసహితాలు

ఉదా:	(1)	ఉ తిరుపతి	(అతను తిరుపతి)
		ఈ లక్ష్మి	(ఈమె లక్ష్మి)
	(2)	మన్ భూక్ లాగ్రిచ్	(నాకు ఆకలిగా ఉంది)
		ఉ దగర్గొ	(అతను వెళ్ళిపోయాడు)

సంశ్లిష్ట వాక్యాలు:–

ఒక వాక్యం మరొక వాక్యంతో కలిసి సంశ్లిష్ట వాక్యాలు ఏర్పడతాయి. సంశ్లిష్ట వాక్యంలో ఒకటి ప్రధాన వాక్యంగా మిగిలిన అన్ని వాక్యాలు ఉపవాక్యాలుగా ఉంటాయి. ఉపవాక్యాలలో అనేక అసమాపక క్రియలుంటారు.

ఉదా: క్త్వార్థక, శత్రర్థక, చేదర్థక, అప్యర్థక మొ॥వి ఇవి అన్ని అసమాపక క్రియలలో చూపించాను.

ఉదా: రాజుధాన్ ఖాన్ సొగొ (రాజు అన్నం తిని పడుకున్నాడు)

సంయుక్త వాక్యాలు:–

సమాన ప్రతిపత్తిగల రెండు గాని అంతకంటే ఎక్కువ గాని కలిపి ఒకే వాక్యం కింద చేసి ప్రకటిస్తే దానిని సంయుక్త వాక్యం అంటారు. అయితే రెండు వాక్యాలు కలిసేటప్పుడు సంయుక్త వాక్యానికి లంబాడీ భాషలో 'అన్, పణణ్, తారు, లపణణ్' చేరుతుంది.

ఉదా: ఓర్ ధాఽయి పెన్ను ఛ 'పణణ్ ఛెనికన్ కొ
(అతని దగ్గర పెన్ను ఉంది కాని, లేదని అన్నాడు)

మార్ ధఽయి మనిక్యఛన్ రపీయాయి ఛ
(నా దగ్గర మనుష్యులున్నారు డబ్బులు కూడా ఉన్నాయి) ఇక్కడ క్రియకు క్త్వార్థక రూపమైన 'అన్' చేరడం ద్వారా సంశ్లిష్ట వాక్యంగా మారింది.

ఈ విధంగా లంబాడీను శాస్త్రీయంగాను ఆధునికంగాను కొంతవరకు విశ్లేషించి వివరించవచ్చు.

నేడు లంబాడీ భాష ఎదుర్కొంటున్న సమస్యలు:-

భారతదేశ వ్యాప్తంగా ప్రమాదంలో ఉన్న భాషలు 196. అత్యంత ప్రమాదంలో ఉన్న భాషలు 35. గడచిన 50 సం॥ల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో సుమారుగా 20 భాషలు కనుమరుగైనాయని 'ది లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా' వారు పేర్కొన్నారు. లంబాడీ భాష కూడా ప్రస్తుతం అంతరించిపోతున్న భాషల జాబితాలో చేరింది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న లంబాడీలు గ్రామీణ ప్రాంతాల్లో తెలుగు మాధ్యమంలో చదువుకోవడం, పట్టణ ప్రాంతాల్లో కొందరు ఆంగ్ల మాధ్యమంలో చదవుకోవడం, ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడటం, ప్రసార సాధనాలు మాతృభాషలో లేకపోవడం అలాగే ఇంటి దగ్గర కూడా మాతృభాషలో మాట్లాడుకోకపోవడం వలన నేడు ఈ భాష అంతరించే స్థాయికి వచ్చింది.

భాష అంతరించిపోవడానికి గల కారణాలు Wikipedia ఇలా వివరించింది. "An endangered language is a language that is at risk of falling out of use as its speakers die out or shift to speaking another language. Language loss occurs when the language has no more native speakers, and becomes a dead language.

The process of globalization and neocolonialism, where the economically powerful languages dominate other languages more commonly spoken languages dominate the less commonly spoken languages and therefore the less commonly spoken languages eventually disappear!"

భాష అంతరించిపోవడం ద్వారా తన వాళ్ళ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, పాటలు, ఐతిహ్యాలు కవిత్వం మొ॥వి నశించిపోతాయి. అంతే కాకుండా వాటిని ఇతర భాషల్లోకి యథాతథంగా అనువదించలేము. దాని ద్వారా వాళ్ళజాతికి గుర్తింపు ఉండదు. తద్వారా అలాగే సామాజిక వెనుకబాటుతనం కనిపిస్తుంది. ఇదే విషయాన్ని "As communities lose their language they often also lose parts of their cultural traditions which are tied to that language, such as songs, myths and poetry that are not easily transfered to another language. This may in turn affect their sense of identity, producing a weakened social cohesion as their values

and traditions are replaced with new ones" అని Wikipedia వివరించింది.

లంబాడీలు ఎక్కువగా నివసిస్తున్న ప్రాంతాల్లో తెలుగు మాధ్యమం ఉండటం. ఆ మాధ్యమంలోనే ఆ లంబాడీలు చదువుకోవడం, ఇంట్లో కూడా తెలుగులోనే మాట్లాడటం జరుగుచున్నది. తద్వారా తరతరాలుగా మౌఖికంగా కాపాడుకుంటూ వస్తున్న లంబాడీ భాష పెద్దవాళ్ళు వయోవృద్ధులు మరణిస్తున్నందువల్ల భాష అంతరించే స్థాయికి చేరుకున్నది.

పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలు:-

1) లంబాడీలు అధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లో వారి మాధ్యమంలోనే విద్యను అందించాలి.

2) ఇంట్లో తప్పకుండా మాతృభాషలోనే మాట్లాడుకోవాలి.

3) కనీసం పర్వదినాల్లోనైనా వారి సాంస్కృతికమైన అంశాలు ప్రతిబింబించే విధంగా వస్త్రధారణను చేసుకోవాలి.

ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు:-

1) మైనార్టీ భాషలను రక్షించడానికి మాతృభాషలోనే విద్యను అందించడానికి భారత రాజ్యాంగంలో కొన్ని హక్కులు పొందుపరచబడినాయి. అందువల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంతరించిపోతున్న భాషలను పునర్నిర్మించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 350ఎ, 350బి ని పరిశీలించినట్లయితే ఈ విధంగా పేర్కొనబడింది.

   Article 350 A: "It shall be the endeavour of every state and every local authority with in the state to provide adequate facilities for instruction in the mothertongue at the primary stage of education to children belonging to linguistic minority groups."

   Article 350 B: "Gives power to the president to appoint appropriate officers and use proper methods to investi-gate and safeguard the rights of linguistic minorities." అని నిర్వచించింది.

కాబట్టి ప్రభుత్వాలు అంతరించిపోతున్న భాషలను వాడుకలోకి తీసుకువచ్చి బ్రతికించడానికి ప్రయత్నాలు చేయాలి.

2) మహారాష్ట్ర లంబాడీలు దేవనాగరి లిపిలో సాహిత్య సృష్టి చేస్తున్నారు. అలాగే కర్ణాటక రాష్ట్రం వాళ్ళు కన్నడ భాషలో లంబాడీ సాహిత్యాన్ని రాస్తున్నారు. కాని తెలంగాణాంధ్ర రాష్ట్రాల్లో కనీసం తెలుగులోనైనా సాహిత్యం రాయడం లేదు. రాయించడానికి ప్రయత్నాలు చేయాలి.

3) లంబాడీల గోర్‌బోలిలో సంస్కృతం, రాజస్థానీ, మరాఠీ గుజరాతి మరియు హిందీ మిశ్రమంతో కూడిన పదాలు ఎక్కువగా కనిపిస్తాయి. కనుక ఈ భాషకు ఏ భాష లిపి గోర్‌బోలికి అనువుగా ఉంటుందో భాషాశాస్త్రవేత్తలను సంప్రదించి శాస్త్రీయంగా పరిశీలించి ఆ లిపిని తీసుకొని అందులో సాహిత్యం రాయడానికి ప్రయత్నం చేయాలి. దానిని లంబాడీలకు అందించే ఏర్పాట్లు చేయాలి.

4) నిఘంటువులు నిర్మించాలి. భాషను భాషాశాస్త్రంగా విశ్లేషించే ప్రయత్నం చేయాలి.

5) భాషలో మాండలికాలు నిర్మించాలి. అన్యదేశ్యాలు గుర్తించాలి.

6) తెలంగాణాలోని ప్రతి విశ్వవిద్యాలయంలో గిరిజన శాఖ ఏర్పాటు చేసి, గిరిజన సాహిత్యం మీద సమగ్రమైన పరిశోధనలు చేయించాలి. చాలామంది గిరిజన సాహిత్యం జానపద సాహిత్యంలో ఒక భాగమని భావిస్తారు కాని, అది తప్పు. రెండింటిని రెండు కోణాల్లో చూడాలి. జానపద సాహిత్యం వేరు గిరిజన సాహిత్యం వేరు.

7) గిరిజన సాహిత్య అకాడెమీలను స్థాపించి, గిరిజన సాహిత్యంలో పరిశోధన, కృషి చేసిన వారికి ప్రతి సంవత్సరం ప్రతి గిరిజన భాషకు కనీసం ఒక్కటైనా అవార్డు ఇవ్వడానికి ప్రయత్నం చేయాలి.

8) ప్రతి విశ్వవిద్యాలయంలోని తెలుగు, హిందీ, ఇంగ్లీషు శాఖలలో ఎం.ఏ. చదివే విద్యార్థులకు ప్రతి సెమిస్టర్‌లో తప్పనిసరిగా గిరిజనులకు సంబంధించిన వివిధ అంశాల పైన ఒక పేపర్ చదివేటట్లు పాఠ్య ప్రణాళికలో చేర్చాలి.

9) ఉద్యోగ పోటీ పరీక్షల్లో తప్పనిసరిగా గిరిజన సాహిత్యాన్ని ఒక పేపరుగా పెట్టాలి. అలాగే జనరల్ స్టడీస్‌లో కనీసం 10 మార్కుల ప్రశ్నలు ఉండే విధంగా ఏర్పాటు చేయాలి.

10) గిరిజన భాషా దినోత్సవం ప్రతి సంవత్సరం ప్రభుత్వమే నిర్వహించాలి.

11) భారతదేశంలో 2004లో సర్వశిక్షాఅభియాన్ Mother-Tongue Based Multilingual Education in India (MTBME) అనే పథకం ద్వారా మాతృభాషలో విద్యాబోధనను ప్రవేశపెట్టారు. తెలంగాణాలో కూడా కొన్ని గిరిజన భాషలకు ఆ పథకాన్ని ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు పరిచయం చేశారు. దానిని మరింత విస్తృతపరచాలి. ఆ ప్రాజెక్టులో పనిచేసేందుకు సంబంధిత భాష మీద పూర్తి అవగాహన ఉన్న వారినే తీసుకోవాలి. గిరిజన మాధ్యమంలో విద్యను నేర్చుకొనే వారికి తప్పనిసరిగా ఉద్యోగాలలో రిజర్వేషన్ సదుపాయాలు కల్పించాలి.

12) మొదటి తరగతి నుండి డిగ్రీస్థాయి వరకు తెలుగు వాచకాలలో ప్రతి తరగతిలో కనీసం ఒక పాఠంలో తప్పనిసరిగా గిరిజనులకు సంబంధించిన భాషా సాంస్కృతిక విషయాలు పొందుపర్చాలి. అలాగే డిగ్రీ స్థాయి వరకు కనీసం రెండు మూడు సార్లయినా తెలుగు ఉపవాచకాలు గిరిజనులకు సంబంధించేవి ప్రవేశపెట్టాలి.

13) లంబాడీ భాషలోని కథలు, పాటలు, సాంస్కృతికమైన విషయాలతో కూడిన పుస్తకాలను ముద్రించాలి.

14) తెలుగులో ఉన్న అన్ని ఎలక్ట్రానిక్ మీడియా ఛానెళ్లలో ప్రతిరోజు కనీసం ఒక గంటపాటు తప్పనిసరిగా గిరిజనుల భాష, సాంస్కృతిక విషయాలు ప్రసారం చేసే విధంగాను, అలాగే దినపత్రికల్లో వారంలో ఒక రోజు తప్పనిసరిగా గిరిజనుల విషయాలు ప్రచురించే విధంగా ప్రభుత్వాలు చట్టాలు చేయాలి.

ఈ విధంగా ముందు వివరించిన అన్ని అంశాలను ప్రభుత్వం, ప్రజలు ఆచరించినట్లైతే, మనముందు తరాల వారు ఇచ్చిన లంబాడీ భాషాసంపదను రాబోవు తరాలవారికి సజీవంగా అందించవచ్చు.

ముగింపు:-

ప్రతిజాతికి భాష అనేది అక్షయ పాత్ర లాంటిది. మన సంస్కృతి, మన మూలాలు అన్నీ అందులో ఉంటాయి. Language is a vessel of culture its loss can be detrimental to the continuation of cultural heritage. మన

భాషను అంతరింపచేసుకున్నామంటే మన గుర్తింపును మనం కోల్పోతాం. అలాగే రాబోవు తరాలవారిని మనజాతి నుండి వేరు చేసినవాళ్ళమవుతాం. కనుక మన భాషను పరిరక్షించుకోవాలి. మన భాషను పరిరక్షించుకోవడం వలన అది మన ఆత్మగౌరవ భావనను పెంపొందించుకోవడానికి, మన జాతి అభివృద్ధి చెందడానికి దోహద పడుతుందని నా ప్రగాఢ విశ్వాసం.

పరిశీలన గ్రంథాలు

1. Grierson, G.A. 1968. Linguistics survey of India, IX Delhi: Sundarlal Jain, Motilal Benarsidas.
2. Trulgill Peter, 1974. Socio Linguistics: An Introduction, Harmonds Worth Penguin.
3. కృష్ణమూర్తి భద్రిరాజు 2000. భాష, సమాజం, సంస్కృతి, హైదరాబాద్: నీల్‌కమల్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్.
4. గౌనానాయక్, ఎం. 2002. సుగాలి సంస్కృతి, భాష మరియు సాహిత్యం.
5. సూర్య ధనుంజయ్. 2009. నల్గొండజిల్లా బంజారా సాహిత్యం-జీవన చిత్రణ.
6. తిరుపతి, భూక్య 2005 లంబాడీ భాషా సాహిత్యాలపై తెలుగు భాష ప్రభావం. ఎం.ఫిల్. సిద్ధాంత గ్రంథం (అముద్రితం).

26. ఎన్నెలనవ్వు నవల - యానాదుల సామాజిక, సాంస్కృతిక జీవన చిత్రణ

పొనుగోటి రవికుమార్
తెలుగు అధ్యాపకులు,
యస్.ఆర్., బి.జి.యన్.ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల, ఖమ్మం

ఎన్నెలనవ్వు నవలలో ఏకుల వెంకటేశ్వర్లు యానాదుల సమగ్ర జీవనాన్ని చిత్రీకరించాడు. గిరిజనుల గూర్చి గిరిజనేతరులు నవలను సృజించారు. చివరి గుడిసె నవలలో యానాదుల బ్రతుకుల గురించి కేశవరెడ్డి తెలియజేశారు. ఆయన గురించి నేడు ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. కానీ ఇ.వి. గురించి ప్రత్యేకంగా ఎందుకు చెప్పుకోవాలంటే ఇప్పటివరకు గిరిజన నేపథ్యంలో గిరిజన రచయిత రాసిన నవల తెలుగులో లేదు. ఎన్నెలనవ్వు ద్వారా ఆ లోటును తీరుస్తున్నాడు ఇ.వి. ఈ విధంగా ఎన్నెలనవ్వు నవలకు తెలుగు సాహిత్యంలో గొప్ప చారిత్రక ప్రాధాన్యత (యానాది బతుకు పేగు తెంచుకుపుట్టిన చారిత్రాత్మక నవల ఎన్నెలనవ్వు ముందుమాట) ఉందన్నారు కోయి కోటేశ్వరరావు. కోయి కోటేశ్వరరావు వ్యాఖ్యానాన్ని రుజువుచేసే అనేక అంశాలను ఇ.వి. లోతుగా చర్చించాడు. యానాదుల ఆర్థిక, సామాజిక, జీవన స్థితిగతులను ఇ.వి. పరిశీలనాత్మకంగా సమీక్షించాడు. యానాదుల సాంస్కృతిక ఔన్నత్యాన్ని, వారి ఆచార వ్యవహారాల్లోని విశిష్టతను, ఆటపాటలను, ఆత్మగౌరవ స్ఫోరకంగా రచయిత నిరూపించాడు. పేదరికానికి అనుగుణంగా యానాదులు తమ కట్టుబాట్లను, ఆహారపు అలవాట్లను మలచుకొనే విధానాన్ని రచయిత ఈ నవల్లో సూక్ష్మ వివేచనచేసి ఎరుకపరిచాడు.

ఈ నవలకు రచయిత ఎన్నెలనవ్వు అనే పేరుపెట్టడం వెనుక నేపథ్యం ఏమిటంటే యానాదులకు నవ్వంటే ఇష్టం. వారి రోజువారీ కార్యక్రమాల్లో హాస్యం

వెల్లివిరిసే సంభాషణలు ఎక్కువగా ఉంటాయి. అందుకే యానాదుల నవ్వులను చూసి 'తాటాకులపై ఇసుకపోసి యానాదులు నవ్వుకుంటారని' ఎగతాళిచేస్తుంటారు. ఇది ఎగతాళి అయినప్పటికీ యానాదులు చిన్నచిన్న విషయాలకు కూడ హాయిగా నవ్వుకోవడం గమనించవచ్చు.

గిరిజనులు – పరిచయం

గిరిజనులు అంటే పదంలోనే అర్థం ఉంది. గిరులపై నివసించేవారు గిరిజనులు. గిరి అంటే కొండ, కొండ మీద నివసించేవారని అర్థం. వీరిని ఆదివాసులుగా పిలుస్తారు. గిరిజనులు అనే మాట కన్నా ఆదివాసులు అనే మాటను చారిత్రకార్థంలోను గౌరవార్థంలోను విస్తృతంగా సామాజికవేత్తలు వాడుతున్నారు. ఈ దేశంలో ఆది నుంచి నివసిస్తున్న వారుగా భావిస్తున్నారు. అడవి ప్రాంతాల్లో నాగరిక సమాజానికి దూరంగా నివసిస్తున్న వారిని గిరిజనులుగా భారత రాజ్యాంగం గుర్తించింది. కాని కేవలం నాగరిక ప్రపంచానికి దూరంగా అడవుల్లో లేదా కొండల్లో నివసిస్తే గిరిజనులు అవుతారా? అనే ప్రశ్న రావచ్చు. కానీ జాతిపరంగాను, సాంస్కృతిక పరంగాను, భాషా పరంగాను, ఆహారపు అలవాట్ల పరంగాను వీరికంటూ కొన్ని ప్రత్యేక ఆచార వ్యవహారాలు, నమ్మకాలు ఉన్న వారిని గిరిజనులు అంటారు.

గిరిజన తెగలు

తెలుగు ప్రాంతంలో గిరిజన తెగలు మొత్తం 35 ఉన్నట్లు గుర్తించారు. ఆయాతెగలను వృత్తులు, జీవనరీతులను ఆధారంగా చేసుకొని వర్గీకరించారు. అయితే 2002కి పూర్వం 33 తెగలు ఉన్నాయి. అయితే 2002లో రెండు తెగలను గిరిజన జాబితాలో చేర్చడం జరిగింది. '34వ తెగ నక్కలవారు' 35వ తెగ 'దూలియగా' గుర్తించారు. గిరిజనులను మైదాన ప్రాంత గిరిజనులు ఏజెన్సీ ప్రాంత గిరిజనులు అని విభజించారు. అందులో 68 శాతం గిరిజనులు షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నివసిస్తుండగా మిగిలిన 32 శాతం మంది గిరిజనులు గిరిజనేతరులతో కలసి మైదాన ప్రాంతంలో నివసిస్తున్నారు.

ఏజెన్సీ ప్రాంత గిరిజనులు

కొండ ప్రాంతాల్లో, దట్టమైన అడవుల్లో పరిసర పల్లపు ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులను ఏజెన్సీ ప్రాంత గిరిజనులు అంటారు. చెంచులు, గదబలు, గోండులు,

గౌడులు, కమ్మరులు, అందులు, బగతులు, భిల్లులు, ఖోండులు, కొలావులు, కొండదొరలు, కొండరెడ్లు, కోమ్మరులు, కోయవారు, మాలిలు, మన్నెదొరలు, వాల్మీకులు, నాయకోడులు, రెడ్డిదొరలు, మూకదొరలు మొదలైనవారు నివసిస్తున్నారు.

మైదాన ప్రాంత గిరిజనులు

మైదాన ప్రాంతాల్లో, గ్రామాల్లో నాగరిక సమూహాలకు దగ్గరగా గిరిజనేతరులతో కలసి నివసించే గిరజనులను మైదాన ప్రాంత గిరిజనులు అంటారు. లంబాడీలు లేక సుగాలీలు, ఎరుకల, యానాదుల మొదలైన గిరిజన తెగల వారు మైదాన ప్రాంతాల్లో నివసిస్తున్నారు.

గిరిజన సంస్కృతి

తెలుగు ప్రాంతంలో గిరిజనులు విభిన్న సంస్కృతుల మేలు కలయిక. ఒక్కో తెగకు ఒక్కో సంస్కృతి ఉంటుంది.సంస్కృతి అంటే జీవనవిధానం, ఆట, పాట, వేషం, నృత్యం లాంటివి మాత్రమే కాదు. భాషా, సామాజిక వ్యవస్థ, ఆర్థిక విధానాలు, మతం, విద్యా, ఆహారపు అలవాట్లు మొదలైనవి కూడా సంస్కృతిలో భాగంగా చెప్పవచ్చు. గిరిజనుల సంస్కృతి ప్రత్యేకంగా ఉంటుంది. అడవుల్లో ఉంటూ వారి జీవన విధానం, వేష భాషలు, ఆహారపు అలవాట్లు, పెళ్ళిళ్ళు మొదలైనవి వారి పురాతనమైన సంస్కృతికి అద్దం పట్టేవిధంగా ఉంటాయి.

యానాదుల చారిత్రక నేపథ్యం – ఆచార వ్యవహారాలు

యానాదులు అన్ని ప్రాంతాల్లో కనిపిస్తారు. నెల్లూరు అడవులనుండి సముద్ర తీరం వరకు విస్తరించి ఉన్న సంచార గిరిజన తెగ యానాదులు. సామాజిక పరిమాణంతో ఆహార సేకరణకు చెందిన జాతి. వారి చుట్టు సమాజం వివిధ దేశాలను దాటుకుంటూ స్థిర వ్యవసాయ జీవితంలోకి స్థిరపడిన వందల ఏళ్ల తరువాత కూడా యానాదులు తమ ప్రాచీన విశ్వాసాలను అంటిపెట్టుకొని ఉండిపోయారు అని వాడ్రేవు చినవీరభద్రుడు 'చివరి గుడిసె' నవల ముందుమాటలో పేర్కొన్నారు. ఈ విధంగా నేటికీ యానాదులు, తమ ప్రాచీన విశ్వాసాలను వదిలిపెట్టక గిరిజనేతరుల చేత అనేక విధాలుగా దోపిడికి గురౌతూనే ఉన్నారు. నెల్లూరు జిల్లాలో వీరి సంఖ్య ఎక్కువగా కనిపిస్తుంది.

యానాదులు భారతదేశంలో ఆర్యులు రాక ముందునుంచే తమ పుట్టుపూర్వోత్తరాలు తెలియక అమాయకులుగా అనాదిగా నివసిస్తున్నారు. ఈ విధంగా వీరిని అనాదినుంచి 'అనాదులు' అని తదనంతరం వాడుక భాషలో అనాదులే 'యానాదులు' అయినారు. మొలువని మీసాలు, మేక గడ్డాలతో గోచిపాతలు ధరించి విల్లంబులు చేతబూని గూచికర్రలతో ఎలుక కలుగుల్ని తవ్వుకుంటూ, చేపలు పట్టుకుంటూ, ఆకులు, అలములు తింటూ జీవనం గడిపేవారు. వీరిని చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణ, గోదావరి జిల్లాల్లో యానాదులని పిలుస్తారు. నల్లమల్ల అడవుల్లో వీరిని చెంచులు అని పిలుస్తారు. 'చెంచు కొండ దిగి యానాది అయినాడు'. వెన్నలకంటి రాఘవయ్యగారు పేర్కొన్నట్లు యానాదులకు, చెంచులకు కొంత బేధం ఉన్నప్పటికీ పోలికలే ఎక్కువ అని 31 అంశాలతో వారిరువురి మధ్య పోలికలు చెప్పాడు. అదే విధంగా కొంత వరకు భేదం కూడా ఉందని తన యానాది గ్రంథంలో తెలియజేశాడు. ఆ విధంగా చెంచులు అడవుల్లో వేటలో పురోగమించిన యానాది అడవి బయట సమాజంలో చేతనైన జంతువుల స్థాయిలోనే వేటాడి జీవించడానికి అలవాటు పడ్డాడు.

యానాదుల్లో మనకు 4 తెగలు ప్రధానంగా కనిపిస్తాయి. అవి 1. రెడ్డియానాదులు, 2. చెల్ల యానాదులు, 3. అడవి యానాదులు, 4. తూర్పు యానాదులు.

పుట్టుక:

ఈ నవలలో చెంచులు పుట్టినప్పుడు ఎలాంటి ప్రత్యేక ఆచారాలు చేసినట్లుగా రచయిత చెప్పలేదు. యానాదులలో బిడ్డ పుట్టినప్పుడు ఎటువంటి ఆర్భాటాలు చేయరు. ఒకవేళ యానాదులకు పిల్లలు పుట్టకపోయినా బాధపడరు. సంతానం ఎక్కువైనా వారు బాధపడరు. వారికి సంతానం కలిగినా, కలుగకపోయినా తేడా ఏమి ఉండదు. వారికి తినడానికి తిండి, ఉండటానికి ఇల్లు లేనందున పిల్లల గురించి ఆలోచించే అలవాటు వారిలో కనిపించదు.

పెళ్ళి

అలివేలు, మునెయ్యల పెళ్ళి సందర్భంగా యానాదులు పెళ్ళిలో పాటించే ఆచార వ్యవహారాలు పెళ్ళిచూపుల నుండి పెళ్ళివరకు వర్ణించారు. ఆదిమ జాతి అయిన యానాదులలో వివాహానికి సంబంధించిన ప్రత్యేకమైన కట్టుబాట్లు, సంప్రదాయాలు

కనబడవు. తాళిబొట్టు, పురోహితుడు, ముహూర్తం, బంధువులకు ఆహ్వానాలు పంపడం వంటి ప్రత్యేక కార్యక్రమాలు వీరిలో కనబడవు. యానాదులకు తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట, ఉండడానికి ఇల్లు లేక, స్త్రీపురుషులు ఇష్టపడి కలిసి దాంపత్య జీవనం గడుపుతారు. ఈ విధంగా యానాది దంపతులు కలసి ఉన్నన్నాళ్లూ వీరి ప్రేమను ఎవరూ ఏమి చేయలేరు. అలివేలు నడవడిక బాగాలేదని గమనించిన మంగమ్మ సిన్నాయన కొడుకులతో పెళ్ళిచేయడానికి నిర్ణయించుకున్నారు. అలివేలుకి పెళ్ళిగురించి తెలియజేస్తారు. యానాదులలో మేనరిక వివాహాలు ఉన్నాయి. పెళ్ళికిముందు అమ్మాయి అభిప్రాయం తెలుసుకుంటారని చెప్పవచ్చు. పెళ్ళిచూపుల సమయంలో యానాదిసంఘం మొత్తాన్ని పిలిచారు. పెళ్ళికొడుకు వాళ్ళు మంచిరోజు చూచుకొని అమ్మాయిని చూడడానికి వచ్చారు. మేకల చెంచయ్య ఆ సంఘానికి పెద్ద, ముదాము. అందర్ని పిలిచి పెళ్ళి సంబంధం చతుర్ల మధ్య మాట్లాడుకున్నారు. పెండ్లికొడుకుకు బట్టలు పెట్టడమే కట్నం. అమ్మాయికి అత్త పర్వతాలు ముక్కుపుడక పెట్టింది. అమ్మాయి, అబ్బాయిలు మావోళ్ళు అనిపించుకున్నారు. తమలపాకుల పళ్ళేలు మార్చుకున్నారు. పెద్దలు అక్షింతలు వేసి దీవించారు. పై విధంగా యానాదుల పెళ్ళిచూపులు, నిశ్చితార్థం నిరాడంబరం జరుగుతుంది.

పెళ్ళికిముందు ప్రధానం, పెళ్ళికొడుకు ఇంటినుండి పెళ్ళికూతురు ఇంటికి తీసుకువస్తారు. పతాణంతో వచ్చిన వారికి అన్నంపెట్టాలంటే ఇంట్లో బియ్యంలేవు. ఇది యానాదుల ఆర్థిక పరిస్థితి. ఏ పూటకి ఆ పూట సంపాదించుకోవడమే యానాదులకు తెలుసు. అప్పుకోసం చౌదరి ఇంటికివెళ్ళితే ఆయన భార్య ఎగతాళిగా మాట్లాడి పని చేయించుకుని డబ్బులు అప్పుగా అడిగితే లేవని, చౌదరిని అడగమంటుంది. చౌదరి ఊర్లో రచ్చబండ దగ్గర నలుగురిలో మంగమ్మను (యానాదుల పెళ్ళిని) ఎగతాళిచేసి డబ్బులిస్తాడు. పతాణం పదకొండు వస్తువులు రాలేదని, గొడవనుఆపి, అందరికీ వండి పెడుతుంది. యానాదులపెళ్ళి అబ్బాయి ఇంటి దగ్గర జరుగుతుంది. అలివేలును పతాణం చీరతో అలంకరించి పెళ్ళి విడిదికి తీసుకువస్తారు. పెళ్ళికి వచ్చేవారు తమ తాహతుకు తగ్గట్టుగా పెళ్ళి సరుకులు సమకూర్చారు. ఇది యానాదులలో ఉన్న సజీవ సంబంధాలను తెలియజేస్తుంది.

యానాదుల పెళ్ళికి ఇంటిముందు పందిరి ఏర్పాటుచేస్తారు. పెళ్లిపందిట్లో కల్లాపిచల్లి ముగ్గువేస్తారు. ఆ ముగ్గుమీద పీటవేసి పెళ్ళికొడుక్కి నలుగుపెడతారు. నలుగులో పాటలు పాడకపోతే యానాదులకు నలుగు పూర్తయినట్టు కాదు. అందుకే

"ఓ రామా... జైరామా /సీతా... మా..నో(హో)కారా.../ కారుణ్య... గుణ... కారా.../ ఈ కమలా.../ కనతల్లీ... వాకీటా/ మరి పీటా...లేపిచ్చీ అనే పాటను మునెయ్య నలుగుపాటగా పెంచలమ్మ, పర్వతాలు శ్రావ్యంగా పాడారు. పెళ్ళిలో నలుగు లేకుండా పెళ్ళి పూర్తికానట్లేనని చెప్పవచ్చు. గంజికావిడి ఆచారం: పెళ్ళికూతురొచ్చిందని తెలిసి పిల్లా, పెద్దలందరూ అక్కడికి వెళ్ళారు. వారితోపాటు గంజికావిడి తీసుకెళ్ళారు. ఒక బుంగలో గంజిబువ్వ, మరోదాంట్లో నీళ్ళు ఉంటాయి. మాకు కలిగింది గంజిబువ్వే. ఆ గంజినీళ్ళే నీవు తాగాలి. ఆచరణ రూపం యానాదులు తెలియజేయడానికి ప్రతీకాత్మకంగా, తమ స్థితిగతులను పెళ్ళికూతురికి, పెళ్ళికి వచ్చిన వారికి తెలియజేయడమే అంతిమంగా యానాదులు చెప్పదలుచుకున్న అంశం.

గడ్డపార ముహూర్తం

యానాదులు గడ్డపార ముహూర్తంలో పెళ్ళిచేసుకుంటారు. గడ్డపార ముహూర్తం అంటే గడ్డపార నీడ భూమిపై ఎప్పుడు నిలవదో అప్పుడే తాళిబొట్టుకట్టాలి. అంటే మిట్టమధ్యాహ్నం అన్నమాట. ఆ ముహూర్తాన్ని సీతా, రాముల పెళ్ళి ముహూర్తమని యానాదులు చెప్పుకుంటారు, నమ్ముతారు. అందుకే వారు ఆ ముహూర్తాన్ని పవిత్రంగా భావిస్తారు. అందుకే 'ఇనుప గడ్డపారను నీళ్ళతో పొడిలేకుండా కడిగారు. అలికినచోట మధ్యలో గడ్డపారని వేశారు. గడ్డపారచుట్టూ ముగ్గుపెట్టారు'. సరిగ్గా గడ్డపార నెత్తిమీదకి పొద్దు వచ్చినప్పుడు అందరూ హడావుడి చేసి పెళ్ళి జరిపించారు. యానాదుల పెళ్ళిళ్ళు బ్రాహ్మణ పంతుళ్ళు చేయరు. కనుక యానాదుల్లో ఎవరో ఒకరు పెళ్ళితంతు జరిపిస్తారు. పక్కలోడు అలివేలు మునెయ్యల పెళ్ళి జరిపించాడు. ఈ పెళ్ళి సమయంలో పక్కలోడు వచ్చీరాని మంత్రాలతో పెళ్ళి జరిపించాడు. బ్రాహ్మణత్వాన్ని ధిక్కరించే స్వరమే పక్కలోడు. అది అధిక్షేప ధోరణిలో రచయిత పక్కలోడు పాత్రతో పలికింపచేశాడు. యానాదులు పెళ్ళిలో అరుంధతి నక్షత్రం చూపిస్తారు. అలాగే యానాదుల నవ్వుల మధ్య చతుర్లతో అరుంధతి నక్షత్రం చూపించి పెళ్ళి ముగించాడు పక్కలోడు.

పెళ్ళితంతును చూస్తే హిందూమత ప్రభావం ప్రస్ఫుటంగా కనబడుతుంది. పెళ్ళికి బ్రాహ్మణులు ముహూర్తాలు చూడరు, పెట్టరు. కాబట్టి యానాదులు గడ్డపార ముహూర్తాన్ని ఎన్నుకొని, దాన్ని పరమ పవిత్రంగా పాటిస్తున్నట్లు భావించవచ్చు. పెళ్ళిలో మంత్రాలు చదవడం, అరుంధతిని దంపతులకు చూపించడం, ఇవన్నీ

బ్రాహ్మణీయ భావజాల ప్రభావమేనని చెప్పవచ్చు. బ్రాహ్మణీయ భావజాల ప్రభావంనుండి యానాదులు బయటపడాలని రచయిత ఆకాంక్షగా భావించవచ్చు

మరణం

యానాదులలో మంత్రతంత్రాలు, తాయత్తులు, కర్మకాండలు మొదలైన వాటిని ఆచరించే వారు కూడా ఉన్నారు. యానాదులకు వీటిపై కూడా నమ్మకం ఉంది కానీ ధన బలం లేనందున ఆచరించరు. మానవుడు మరణించిన పిదప ఏమవుతాడనే ప్రశ్న, యానాదుల్ని కలలో కూడా బాధించదు. బతికి ఉండగా సుఖం అనుభవిస్తే కదా చచ్చినపుడు వచ్చే కష్టాలను తలచుకొని తారుమారు కావడానికి అతని ప్రాణానికి చావుకు మధ్య ఉండేది పాడె పుల్లలు, మోసేవాండ్లు నోచుకోక శవానికి చుట్ట చుట్టిన చినిగిపోయిన ఈతాకుల చాపే కదా! యానాదుల మరణం సమీప కాలంలో బంధువులు, కొరివి పెట్టే వారసులు, ఆత్మీయులనే వారు తరచుగా ఎవ్వరు ఉండరు. పొలాల కావిళ్ళలోని శవం అట్లనే శిథిలమయ్యే దృశ్యాలు లేకపోలేదు. బంధువులకు తంతులు పంపడం, ముందుగా జాబులు రాయడం జరుగదు. తాహతు గలవాడు కర్మ చేస్తాడు. లేని వారికి అదికూడా ఉండదు. ఊపిరిపోయిన తరువాత చేయబడే కర్మల వల్ల, వల్లెవేసే మంత్రాల వల్ల అతని ఆత్మ ఒక్కొక్క అంతస్తు దాటి పైకి ఎక్కడికో పోతుందనే నమ్మకం యానాదికి లేనే లేదు.యానాదులలో చావు, పుట్టుక, పెళ్ళి విషయాలలో ఏమాత్రం ఆర్భాటాలు కనిపించవు, చాలా సామాన్యంగా పుట్టుక, పెళ్ళికి, చావుకు జరిగే వేడుకలు వీరి సమాజంలో జరుపుకోరు. ఈ మధ్య కాలంలో ఆర్థిక పరిస్థితులు కొంతవరకు మెరుగు పడటంతో, స్థిర నివాసాలు ఏర్పరుచుకోవడం పండుగలు, వేడుకలు చేసుకోవడం జరుగుతోంది.

విందులు, ఆహారపు అలవాట్లు:

యానాదుల ఆహారపు అలవాట్లు ప్రత్యేకమైనవి. వాటికి మారుపేర్లు పెట్టుకొని ఇతరులకు అర్థంకాకుండా పిలుచుకుంటారు. అడవుల్లో. కొండ ప్రాంతాల్లో ఒకప్పటి సంచార జీవులైన వీరు అడువుల్లో దొరికే ఆహారం, వివిధ కందమూలాలు, ఆకులు, అలములు తింటూ జంతువులను వేటాడుతూ, వాటి మాంసాన్ని ఆహారంగా సేకరించేవారు. కుందేళ్లను, నెమళ్లను, నేల తాబేళ్ళు, ఉడుములు, ఉడుతలు, అడవి పందులు, అడవికోళ్ళు, జింకలు, దుప్పులు, కొంగలు, నీటికాకులు, ఎలుకలు,

కొండగొర్రెలు, చేపలు, రొయ్యలు మొదలైన వాటిని ఇష్టంగా తింటారు. వారి ఆటవిక జీవితానికి అనుగుణంగానే వారి ఆహారం ఉంటుంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని యానాదులు వివిధ జంతువుల మాంసం తింటారు. ఎన్నో నెలల పాటు చెడిపోకుండా ఉండే నల్లగడ్డ, చామగడ్డ మొదలైన అనేక రకాల దుంపలు, ఆకు కూరలు వీరికి ప్రధాన ఆహారం. కలెపండ్లు, నాగజేముడు పండ్లు, ఊటిపండ్లు, కామంచిపండ్లు, నక్కెరి పండ్లు, అడవి దొండపండ్లు, పాలపండ్లు, బిక్కిపండ్లు, బీరపండ్లు, తోడింద్రపండ్లు, మొదలైనవి, వారికి అడవుల్లో ఉచితంగా లభించే పండ్లు. వీటన్నింటి కంటే యానాదులకు అత్యంత ప్రీతిపాత్రమైన ఆహారం ఎలుకల మాంసం.

ఎన్నెలనవ్వు నవల ఏకుల వెంకటేశ్వర్లు యానాదుల ఆహారపు అలవాట్లు 'ఎన్నెలనవ్వు'లో సిటికలోడు అలివేలు మునెయ్య పెళ్ళి. 'భోజనాల దగ్గర కూర్చున్న వాళ్ళు ఎవరి పాటికి వాళ్ళు భోంచేస్తున్నారు. ఓ... రే... బాపనోల్ల బంతిలావుంది గదర ఇదే... ఆ మాటకు తింటున్న వాళ్ళు తలెత్తి చిటికిలోడువైపు చిత్రంగా చూస్తున్నారు. ఈ పప్పు, గోంగోర... మనింటికాడ వండుకోమంటడు... ఏంకావాలో... ఏందో సెప్పరాదో... ....ఏందే ఈ సప్పిడి పప్పేంది. ఆ గోంగోర తొక్కేంది.. మన యానాదోళ్ళ బంతంటే నాయాల్ది ఎట్టుండాల తంగేడు జింకల కూరేది. కనీసం గెనింకేకర సారన్నా వండొద్దంటా... యానోదుల బంతి భోజనాలు ప్రత్యేకంగా వుండాలన్నట్లు..... నిజానికి తంగేడు జింకలంటే ఎలుకలని, గెనంకేకర కాయలంటే ఎంద్రకాయలని, సెవల పిల్లులంటే కుందేళ్ళని యానాదులకే అర్థమౌతుంది. ఇలా ఎందుకు తమ ఆహార పదార్థాలకు మారుపేర్లు పెట్టుకోవాల్సి వచ్చిందంటే ఒకరి ఆహారపు అలవాట్లకు మరొకరు విలువ ఇవ్వరు. అంతేకాక అసహ్యంగా చూసి అంటరానితనం పాటిస్తారు. కిందికులాల ఆహారపు అలవాట్లను బ్రాహ్మణీయ సంస్కృతి హీనమైనదిగా ప్రచారం చేస్తుంది.

పోలయ్య ఏటికి వెళ్ళడానికి సిద్ధమై సద్దెనీళ్ళు పొయ్యమన్నాడు. మంగమ్మ మొఖం కడుక్కొని వచ్చి పున్నీళ్ళ కుండలో కుడిచేయి పెట్టి దానిలో అడుగున ఉన్న కాస్త కూడు తీసి కంచంలో ఏసి పోలయ్యకి ఇచ్చింది. కాత్త ఉల్లిపాయుంటే ఇటియ్యే... అడిగాడు పోలయ్య. ముక్కలుకోసి ఇచ్చింది. పున్నీళ్ళకుండ యానాదులకు ఆకలి తీర్చే అక్షయ పాత్రలాంటింది. పున్నీళ్ళకుండను కిందికులాల వారు దైవంగా భావించి పవిత్రంగా చూసుకుంటారు. రాత్రిపూట అన్నం మిగిలితే అన్నం, గంజి ఆ కుండలో ఉంటయ్ కాబట్టి ఆ నీళ్లు పుల్లగ పులుస్తయ్. పులిసిన నీళ్లని పున్నీళ్ళని, ... అన్నాన్ని

పున్నీళ్ళ బువ్వని పిలుచుకుంటారు. అన్నం లేనప్పుడు ఆ పున్నీళ్ళ కుండే వాళ్ళ ఆకలి తీర్చుతుంది. అందుకే యానాదులు ఆ కుండను పూజిస్తారు.... మంగళ, శుక్రవారాల్లో ఆ కుండను తాకరు. ఆ రోజు ఎవరికీ పున్నీళ్ళు పొయ్యరు. చాల పవిత్రంగా చూసుకుంటారు. నలుపుడు కారం ఇష్టంగా తింటారు. చేపల కూరంటే ఇష్టంగా తింటారు. మొయ్య చేపల బొడ్లు యానాది పిల్లలు ఎంతో ఇష్టంగా కాల్చుకు తింటారు.

మంగమ్మ పోలయ్య తెచ్చిన చాప ముక్కల్ని తీసింది. ఆ ముక్కలతోపాటు మొయ్య చాపల బొడ్లు కూడా ఉండాయ్. ఆ బొడ్లంటే చెంచులకి చాలా ఇష్టం. వాటిని చీపురు పుల్లకి గుచ్చి అబ్బాయ్.... ఇదిగో తాత సేత కాలిపిచ్చుకో....అని చెంచులకు ఇచ్చింది.

చెంచులు మొయ్యచేపల బొడ్లను చీపురుపుల్లకి గుచ్చి కాలిపించుకు తిన్నాడు. యానాదులు పాచిపని చేసి రాత్రి పాచిపోయిన అన్నాన్ని పడవేయకుండా పరమాన్నంగా భావిస్తారని రచయిత దీపావళి పండుగ నేపథ్యంలో వివరించాడు. అయితే పేదోళ్ళ కూరలకి చాలాపేర్లు ఉంటాయి. 'నలుపుడుకారం, బొటేలుచారు, దరువు, అర్జంటు' అని రకరకాల పేర్లతో పిలుచుకొని యానాదులు నవ్వుకుంటారు.

పండుగలు

దసరా పండుగనాడు యానాదుల ఆనందానికి అడ్డు ఆపూ ఉండదు. మగవారు స్త్రీ వేషంలో కృష్ణుడు, గోపిక, శ్రీరాముడు, సీతమ్మ, వంటి పౌరణికా పాత్రలను ధరించి అంగళ్లలో తెలిసిన వారి దగ్గర పుర ప్రముఖుల వద్ద చిందులు తొక్కి వస్త్రాలను, తిండి గింజలను బహుమానంగా సంపాదిస్తారు. ఈ సమయంలో అభినయిస్తు రంగులుపూసుకొని కూని రాగాలు తీస్తూ వీధుల వెంబడి పురుషులు ఆడుతుంటారు (రాఘవయ్య, వెన్నెలకంటి). వీరి నృత్యాన్ని చిందు నృత్యం అంటారు. వీరు చిందు భాగవతులు వేయడంలో ప్రసిద్ధులు.

దీపావళి పండుగకుముందు చెంచులు తుపాకీకోసం మంగమ్మను విసిగించాడు. తుపాకీకోసం పొగనారు వేయడానికి వెళ్ళాడు. కానీ వచ్చిన రూపాయి కూలీతో మంగమ్మ తుపాకీ కొనకుండా సరుకులు కొనుక్కొంది. ఆకలి తర్వాతే మిగిలిన అవసరాలు తీర్చుకోవడంగా దీన్ని భావించాలి. కానీ చెంచులు తనకు తుపాకీ కావాలనే మంకుపట్టు విడవలేదు. ఆర్థిక పరిస్థితులు బాగాలేక పండగరోజు పాచిపోయిన

అన్నమే తిన్నారు. ఇది యానాదుల దయనీయ పరిస్థితికి అద్దం పట్టింది. టపాసులు కొనలేక పోలయ్య తాటిగిలకలు తయారుచేసి యానాది సంఘానికంతా అందించి, అందరినీ దీపావళిలో భాగస్వాములను చేశాడు. అందుకు యానాదులందరూ పోలయ్యను మెచ్చుకున్నారు. దీపావళి అంటే దీపాలపండగ ఆ రోజు దీపాలే వెలిగించాలని కాలుష్యరహిత గిలకలను తయారుచేసి సంప్రదాయ బద్ధంగా దీపావళి పండుగ చేసుకొని ఆనందించారు. అంతకముందు దీపావళి అగ్రవర్ణ పండుగగా రచయిత పోలయ్య నోటిద్వారా పలికించాడు. పోలయ్యపాత్రకి ఆ చైతన్యం ఉన్నట్లుగా మనకు ఈ నవలలో ఎక్కడా కనబడదు. దీపావళి పండుగరోజు ఆకలికి తాళలేక, పాచిపోయిన అన్నాన్ని పడవేయకుండ పరమాన్నంగా మంగమ్మ కుటుంబమంతా తింటారు. డబ్బులనుబట్టే పండుగలు డబ్బులులేని ఏ వారికి ఏ పండగ అయినా ఒక్కటేనని చెప్పుకోవచ్చు.

ఎంత కష్టమొచ్చినా యానాది మొహంలో నవ్వు చెరిగిపోదు. అందుకే యానాదులు ఆకలి సమయంలో కూడ హాస్యమాడుకొని హాయిగా నవ్వుకుంటారు. ఆ నవ్వులలో ఆకలిని మర్చిపోవడానికి ప్రయత్నం చేస్తుంటారనవచ్చు. వెన్నెలలాంటి నవ్వులకోసం అంబేద్కరిజం మార్గంలో రాజ్యాధికారంకోసం పయనించాలని ఏకుల వెంకటేశ్వర్లు చాటాడు.

27. గిరిజన బిడ్డ! నిన్ను మరవదు ఈ గడ్డ (కొమురం భీం)

వై. శివకుమార్
ఎం.ఎ. ద్వితీయ సంవత్సరం, ఆంధ్ర సారస్వత పరిషత్తు,
ప్రాచ్యకళాశాల, హైదరాబాదు.

ఉపోద్ఘాతం

భారతదేశంలో నివసించే గిరిజనులలో గోండు గిరిజన తెగ అతిపెద్దది. తెలంగాణ రాష్ట్రంలో ఉత్తర తెలంగాణలోని చివరి జిల్లా ఆదిలాబాద్. ఈ జిల్లా పేరు చెప్పగానే గుర్తుకు వచ్చేది ఇక్కడ నివసించే గిరిజనులు.

ఈ గిరిజనుల చరిత్రను పరిశీలించినట్లయితే 1940లో ఒకసారి అలాగే 1980లో మరోసారి గోండు సంస్కృతి, జీవన విధానంలో సంక్షోభాలు సంభవించాయి. అటువంటి సందర్భంలో గోండుల గురించి పోరాడిన వారిలో ప్రముఖ వ్యక్తి కొమురం భీం.

జననం, విద్యాభ్యాసం, వివాహం

కొమురం భీం హైదరాబాద్ విముక్తి కోసం ఆసిఫ్ జాహిరాజ వంశానికి వ్యతిరేకంగా పోరాడిన ఆదిలాబాద్ జిల్లాకు చెందిన గిరిజనోద్యమ నాయకుడు. ఈయన గిరిజన గోండు తెగకు చెందిన కొమురం చిన్నూ – సొంబారు దంపతులకు ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ తాలుకాలోని సంకేపల్లి గ్రామంలో అక్టోబరు 22, 1901 వ సంవత్సరంలో జన్మించారు.

పదిహేడేళ్ళ వయసులో అటవీశాఖ సిబ్బంది చేసిన దాడిలో తండ్రి మరణించగా కరిమెర ప్రాంతంలోని సర్దాపూర్‌కు కొమురం భీం కుటుంబం వారు వలస వెళ్ళారు. అక్కడ వాళ్ళు సాగుచేసుకుంటున్న భూమిని సిద్ధిఖీ అన్న జమీందారు

ఆక్రమించుకోవడంతో ఆవేశం పట్టలేని కొమురం భీం కర్రతో అతని తల పగల కొట్టాడు. ఆ దెబ్బతో సిద్ధిఖీ అక్కడికక్కడే చనిపోయాడు. దీంతో భయపడ్డ భీం మహారాష్ట్రలోని బల్లార్షా, చందా దిక్కుగా పారిపోయాడు. అక్కడ తేయాకు తోటల్లో కూలీ పని చేసుకుంటూ చదవడం, రాయడం నేర్చుకున్నాడు. మరాఠీ, ఉర్దూ భాషలను నేర్చుకున్నాడు. కొత్త కొత్త పంటలు పండించటం, వాటిని మార్కెట్‌లో మంచి ధరకు అమ్మటం తెలుసుకున్నాడు – తరువాత కొంత కాలానికి భీం తల్లిదండ్రులు ఉంటున్న కాకన్‌ఘాట్‌కు వచ్చాడు. ఆ గ్రామంలోని గిరిజనుడు లచ్చప్ప వద్ద జీతానికి ఉండగా భీంకు సోంబాయితో పెళ్ళి జరిగింది.

ఉద్యమ స్ఫూర్తి – భీం

నిజాం పాలకుల నిరంకుశత్వానికి, అధికారుల దమన నీతికి ఎదురు నిలిచి పోరాడాడు కొమురం భీం. గిరిజనులు సుర్దాపూర్‌లో కష్టపడి అడవినరికి పోడు వ్యవసాయం చేసేవాళ్ళు. రాత్రింబవళ్ళు కావలి కాసి పంటలు పండించేవాళ్ళు. అటువంటి కష్టజీవులపై నిజాం సర్కారు పెత్తనం చాలా ఎక్కువగా ఉండేది. అప్పుడు పంటను కొట్టిన కల్లంలోనే కౌలు కింద గింజలు ప్రభుత్వానికి అప్పజెప్పే వారు. గిరిజనులు పోడు చేసుకునే భూములకు పట్టాదారులుగా ఇతరులు ఉండేవారు. గిరిజనులు ఎంతటి దట్టమైన అడవిలో భూములను సాగుచేసుకున్నప్పటికీ వాటిపై తమకే పట్టాలు ఉన్నాయని సర్కారోళ్లు, అటవీశాఖ వాళ్లు గొడవలు చేసేవాళ్లు. తిరగబడ్డ గిరిజనులపై కేసులు పెట్టేవారు. ఇలాంటి సంఘటనలే కొమురం భీంను కదిలించాయి.

ఉద్యమ జీవితం

భారతదేశంలో ఆదివాసీల హక్కుల కోసం జరిగిన పోరాటాలు చరిత్రాత్మకమైనవి. ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడి, దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ వీరోచితంగా పోరాటం చేశాడు. 1940 సంవత్సర మధ్యకాలంలో తెలంగాణ ప్రాంతాన్ని నిజాం ప్రభుత్వం పాలిస్తుండేది. సర్వాధికారాలు నిజాం నవాబువి. గోండు గిరిజనులు అడవిని నమ్ముకొని వ్యవసాయ క్షేత్రంగా మలుచుకొని జీవించేవారు. నిజాం ప్రభుత్వ అధికారులు ప్రత్యక్షంగానూ, ఆంగ్లేయులు పరోక్షంగానూ గిరిజనులకు వ్యతిరేకంగా

భూ చట్టాల్ని చేసి అటవీ సరిహద్దులు నిర్ణయించి, గిరిజనులపై కేసులు పెట్టి వారిని చిత్రహింసలకు గురి చేశారు. ప్రతి విషయంలోను గిరిజనులను దోచుకునేవారు. ఈ సమయంలో నిజాం విధానాలకు వ్యతిరేకంగా తన జాతిని ఏకంచేసి ఆదివాసీల ప్రత్యేక ప్రతిపత్తికోసం, నిజాం విధానాలకు, జంగ్లాతు (అటవీ) అధికారుల దుర్మార్గాలకు నిరసనగా గోండుల్ని సమీకరించి ఉద్యమాన్ని నడిపిన ధీరుడు కొమురం భీం.

కొమురం భీం ఆదిలాబాదులోని జొడేఘాట్ అటవీ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని ప్రత్యేక గిరిజన సైన్యాన్ని రూపొందించుకొని నిజాం వ్యతిరేక భూపోరాటం జరిపాడు. ఈ పోరాటంలో తన అనుచరులతో కలిసి తుపాకులను తయారు చేసి అడవులలోనే తమ స్థావరాలను ఏర్పరచుకొని ఎందరో నిరంకుశ అధికారులను చంపడం జరిగింది. అతని స్ఫూర్తితో గోండు యువకులు నిజాం సర్కారుపై తిరుగుభాటు ప్రారంభించారు.

గొండుల ఆరాధ్య వీరుడు కొమురం భీము గిరిజనులకు అటవీ భూములపై సర్వాధికారం కల్పించబడాలని పోరాడాడు. అటవీ ఉత్పత్తులు, అటవీ భూములే ఆదివాసుల జీవనానికి ప్రధానవనరు. వాటిని పరిరక్షించడానికి, వారికి హక్కులు కట్టబెట్టడానికీ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడానికీ వారి భూములు అన్యాక్రాంతం కాకుండా నిజాం మరియు బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా విప్లవబాటలో ఉద్యమించి గిరిజనుల జీవితాలలో వెలుగులు నింపి నైజాం సర్కార్ గుండెల్లో సింహ స్వప్నంగా మారిన పోరాట యోధుడు కొమురం భీం.

కొమురం భీం గ్రామాలను ఏర్పాటు చేసిన తీరు :

ఆ కాలంలో అరకకు అయిదు రూపాయలు, పోడుకు రెండు రూపాయలు చొప్పున పన్నును ఆసిఫాబాద్ తహసిల్దార్‌కు కట్టేవారు. కొమురం భీం అప్పటి తహసిల్దార్‌తో మాట్లాడి లచ్చప్పకు చెందిన పన్నెండు ఎకరాల భూమి కేసును కొట్టేయించాడు. అప్పటి నుంచి ఆ ప్రాంత గిరిజనులందరికి భీం నాయకుడయ్యాడు. 60 ఎకరాల అడవిని నరికి 12 గ్రామాలను ఏర్పరిచాడు.

ఆ గ్రామాలు జూడుణ్‌ఘాట్, పట్నాపూర్, బాబెఝురి, నర్సపూర్, కల్లెగాం, చాల్‌బడి, బొయికన్‌మోవాడ్, భీమన్ గొంది, అంకుసాపూర్, దేవునిగూడ,

గొగినవమోవాడ్. దీంతో అటవీ అధికారులు భీం మీద కేసుపెట్టారు. ఓ చౌకిదార్ అమీన్, తొమ్మిది మంది పోలీసులు వచ్చి భీం ఇంటిని సోదా చేయగా ఏమీ దొరకలేదు. దీంతో భీంకు కోపంవచ్చి వాళ్ళపై తిరుగబడి కొట్టాడు. దీంతో అధికారులు భీంపై కేసుపెట్టారు. గిరిజనులు పోడు చేసుకుంటున్న భూములకు పన్ను కట్టవల్సిన పనిలేదని కోర్టు తీర్పు ఇచ్చినప్పటికి అధికారుల వేధింపులు తప్పలేదు. భీం ఆయన అనుచరులను ఎదుర్కొనేందుకు 1940 సెప్టెంబరు 1న నైజాం పోలీసులు వచ్చి 300 మంది గిరిజనులు ఉన్న 12 గ్రామాలను చుట్టుముట్టారు. మొదట భూములకు పట్టాలు ఇస్తామని చెప్పడంతో గిరిజనులు ఇళ్ళల్లోంచి బయటకు వచ్చారు. వారిని పోలీసులు కొట్టడంతో గొడవ జరిగింది.

కొమురం భీం మరణం

నిజాం నవాబు పశువుల కాపర్లపై విధించిన సుంకానికి వ్యతిరేకంగా గిరిజనులను ఒక్కతాటిపై నడిపించి ఉద్యమించాడు. ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాలు మరియు జోడే ఘాట్ గుట్టలు కేంద్రంగా నిజాం నవాబుపై గెరిల్లా పోరాటాన్ని కొనసాగించాడు. కుర్దుపటేల్ అనే నమ్మకద్రోహి ఇచ్చిన సమాచారంతో నిజాం సైన్యం అర్ధరాత్రిపూట జోడేఘాట్ అడవుల్లోని కొమురంభీం స్థావరాలను ముట్టడించి 1940 అక్టోబరు 19న కొమురం భీంని హతమార్చింది. ఆ తర్వాత భీం నాయకత్వంలోని గిరిజనులు పోలీసులకు ఎదురు నిలిచిన సంఘటన నిజాం ప్రభుత్వాన్ని కదిలించింది. వారి సమస్యల పరిష్కారానికి సదుపాయాల కల్పనకు, వారి జీవన విధానంపై పరిశోధన చేసి నివేదిక సమర్పించటానికి ఇంగ్లాండ్‌కు చెందిన సామాజిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన గిరిజనులతో కలిసిపోయి వారి జీవన విధానాలను అధ్యయనం చేసి గిరిజనుల అభివృద్ధికి తీసుకోవాల్సిన పథకాలను సూచిస్తూ నివేదిక తయారు చేసి నిజాం సర్కారుకు అందజేశారు. నేడు జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి నాటి భీం త్యాగఫలితమే.

గత ప్రభుత్వాలు – గిరిజనులపై నిర్లక్ష్యం

ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీక కొమురంభీం. 'స్వయంపాలన, అస్తిత్వ ఉద్యమాల వేగుచుక్క భీం పోరాట పంథానే చివరకు సరైన మార్గమని, తన జాతి

ప్రజలను విముక్తి చేస్తుందని అక్షరాల నమ్మిన ఆదివాసీ పోరాట యోధుడు. ఆదిలాబాద్ అడవుల్లో భీం పోరాటం జరిగి నేటికి డెబ్బై రెండు ఏళ్ళు పూర్తి కావస్తున్నది. ఇప్పుడు ఒక ప్రత్యేక సందర్భంలో కొమురం భీం వర్ధంతిని ఆదివాసీ సమాజాలు జరుపుకుంటున్నాయి. స్వయం పాలన కోసం ఉద్యమిస్తున్న ఆదివాసీ సమాజాలను క్రూరంగా అణచి వేస్తున్న ప్రభుత్వాలు కండ్లముందు కనబడుతున్నాయి. దేశంలో తమ హక్కుల సాధనకోసం ఆదివాసీ సమాజాలు ఉద్యమించిన సందర్భాలు అనేకంగా ఉన్నాయి. బ్రిటీష్ చట్టాలకు వ్యతిరేకంగా దిర్సాముండా, సంతాల్‌లు తిరుగుబాటు చేశారు. జల్-జంగల్-జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు. తమపై సాగుతున్న అన్ని రకాల దోపిడి, పీడనలను ఎదిరించారు. చరిత్ర పుటల్లో అనేక సార్లు ఓటమి చెందినా తమ జీవితమే యుద్ధమైన చోట తమ అస్తిత్వం కోసం అలుపెరుగని పోరాటాలు నేటికీ జరుగుతున్నాయి.

ఏ హక్కుల కోసమైతే నాడు భీం ఉద్యమించాడో ఆ హక్కుల కోసం ఆదివాసులు నేటికీ నిరంతరం పోరాటం చేయవలసి వస్తున్నది. ప్రజాస్వామిక రాజ్యమని చెప్పుకుంటున్న నేడు కూడా ఆదివాసుల అవస్థలు ఏమీ తీరలేదు.

నిజాం రాజు నియమించిన హైమన్ డార్ఫ్ సూచనలను కూడా నేటి పాలకులు పాటించడం లేదు. నాటి నిజాం ప్రభువైనా గిరిజనుల అభ్యున్నతి కోసం హైమన్ డార్ఫ్ సూచనలను పాటించాడు. వారి అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాడు. కానీ నేటి పాలకులు ఇవేవి పట్టకుండా ఆదివాసులపై సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నారు. హక్కుల కోసం పోరాటం చేస్తున్న ఆదివాసులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. కొమురం భీం స్ఫూర్తితో విప్లవ సంఘాల నాయకత్వంలో మరొకసారి ఆదివాసులు సంఘటిత పోరాటాలు చేశారు. దీంతో ఆదివాసుల ఐక్యతను చూసి తట్టుకోలేని ప్రభుత్వం ఇంద్రవెల్లి మరణకాండను సృష్టించింది.

ఇది ఆధునిక కాలంలోని మరో జలియన్‌వాలాబాగ్‌గా ప్రజాస్వామిక వాదులు పిలుస్తున్నారు. దేశవ్యాప్తంగా ఆదివాసుల పోరాటానికి సంఘీభావం వచ్చింది. ప్రభుత్వ దమననీతిని ఖండించారు. రాజ్యం తన హేయమైన చర్యలు చేస్తునే మరోవైపు సంస్కరణలు చేపట్టింది. ఆదివాసుల మౌలిక సమస్యలు పరిష్కరించకుండా పై పూత

మాటలతో జోకొట్టే ప్రయత్నం చేసింది. ఆదివాసీ ప్రాంతాలకు ప్రత్యేక్ష రక్షణ ఇచ్చే రాజ్యంగంలోని ఐదవ షెడ్యూలును తుంగలో తొక్కి ఆదివాసులపై అన్ని వైపుల నుంచి దాడులు జరుగుతున్నాయి- ప్రాజెక్టులు, గనుల తవ్వకాల పేరుతో నిర్వాసితులను చేస్తున్నారు.

గత ప్రభుత్వాలపై భీం భార్య అభిప్రాయం

కొమురం భీం భార్య సోంబాయి బతికున్నప్పుడు అన్న మాటలు 'నిజాం సర్కారే నయం' కొమురం భీం పోరాడి పొందిన 12 గ్రామాలను భీంనే ఏలుకొమ్మని నిజాం అనుమతినిచ్చాడు. అయితే ఆదివాసీలందరికీ హక్కులు కావాలని పోరాటాన్ని మరింత ఉధృతం చేయడంతో నిజాం సర్కారు భీంను చంపేసింది. కానీ ఇప్పటి సర్కారు ఆదివాసీల కనీస హక్కులను కూడా హరిస్తోంది. కనీసం తాగేందుకు నీళ్ళు కూడా లేకుండా చేస్తోంది. ఈ సర్కారు కన్నా నిజాం సర్కారే నయం నా భర్త రూపొందించిన 12 గ్రామాలను ఏలుకొమ్మని అధికారం ఇచ్చాడు. నిజాం సర్కారు కేవలం భూములపై, పంటలపై, అడవిపై మాత్రమే ఆంక్షలు విధించి వీటిని చెల్లించాలని ఆదివాసీలపై పెత్తనం చెలాయించేది కానీ ఇప్పుడున్న సర్కారు ఆదివాసీల కనీస హక్కులను సైతం హరిస్తోంది. 72 ఏళ్ళ క్రితం జల్-జంగల్-జమీన్ కోసం పోరాడి ప్రాణాలను వదిలిన కొమురంభీం ఆశయాలను ఇంత వరకు మన పాలకులు, అధికారులు నెరవేర్చలేక పోతున్నారు. అటవీ చట్టాల పేరుతో అడవుల్లో ఆదివాసీలను మైదానాలకు తరిమి వేయడానికి పన్నాగాలు పన్నుతున్నారు. ఆదివాసీల సమస్యలు ఎప్పటికీ తీరవనే ముందు చూపుతోనే ప్రస్తుత సర్కారు కన్నా నిజాం సర్కారే నయమని సోంబాయి అనుకొని ఉంటారు.

ఆదివాసులపై తెలంగాణ ప్రభుత్వ బాధ్యత

నూతన తెలంగాణ ప్రభుత్వం ఆదివాసీల బాధ్యత వహించాలి. ఆదివాసీ ప్రాంతాలకు ప్రత్యేక రక్షణ ఇచ్చే రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూలుకు అనుగుణంగా పరిరక్షించాలి. వారికి హక్కులు కట్టబెట్టి గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలి. ఆదివాసీ భూరక్షణ చట్టం 1/70 చట్టాన్ని అమలుపర్చాలి. అన్యాక్రాంతమౌతున్న అడవులను, భూములను పట్టించుకోవాలి. గోండు తెగకు

సంబంధించిన ప్రధాన్, తాటి, మన్నె కోయ తెగలే కాకుండా నాయక్ పొడ్, అంధ్ ఇతర ఆదివాసీ తెగలు ఆదిలాబాద్‌లో నివసిస్తున్నాయి. ఆయా తెగల ప్రజలను ఆదుకోవాలి. 1975కు పూర్వం వలస బంజారాల జనాభా కేవలం పదివేలేనని హైమన్ ధార్ఫ్ స్పష్టంచేశారు. ఇప్పుడు వీరి జనాభా పదింతలపై ఉన్నది. వలస వచ్చిన వాళ్ళు ప్రజా ప్రతినిధులవడంతో వీరి కష్టాలు రెట్టింపయ్యాయి. ఆదిమ సమాజం వీరి వల్ల రక్షణను కోల్పోతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఆదివాసీల మనుగడ కష్టమౌతుందని ఆదివాసీ నాయకులు మధన పడుతున్నారు. ఆదివాసీల రక్షణ ప్రభుత్వానిదే అయినప్పుడు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్న ప్రభుత్వాల వైఖరిలో మార్పురావాలి. ఏటా విషజ్వారాలతో ప్రాణాలు కోల్పోతున్న ఆదివాసీలకు కనీస వైద్య సౌకర్యం అందించాలి.

ప్రతి ఏటా రెండు వందల నుంచి మూడు వందల వరకు మలేరియా మరణాలు సంభవిస్తున్నాయి. వాటిని అరికట్టాలి. పోషకాహార లేమితో మరణిస్తున్న పిల్లల సంగతిని పట్టించుకోవాలి. భీం పోరాటం చేసిన ప్రాంతంలో నేటికి తాగడానికి నీళ్ళు లేవు. ఆ ప్రాంతానికి మంచి నీళ్ళు అందించాలి. సరైన సదుపాయాలు లేకపోవడంతో ఆదివాసీ సమాజాల జీవన ప్రమాణాలు క్షీణిస్తున్నాయి. వాటిని మెరుగు పర్చాలి. భీం పోరాటం జరిగి డెబ్బైరెండు ఏళ్ళు అవుతున్నా ఆ పోరాట స్ఫూర్తి నేటికీ ఉన్నది. శివుడు శివతాండవం ఆడి ఉగ్రరూపం దాల్చినట్లే ప్రజలు కూడా ఏదో ఒకరోజు ఆ ఉగ్రరూపం దాల్చక మునుపే ప్రభుత్వాలు మేల్కొనాలి.

28. తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు

పసుల బుచ్చయ్య
ప్రధాన కార్యదర్శి,
ఆదివాసి నాయకపోడు సేవా సంఘం, తెలంగాణ రాష్ట్ర కమిటి

నాయకపోడు తెగ ఉనికి

నాయకపోడ్ల జనాభా ప్రధానంగా ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ఎక్కువగాను, ఇతర తెలంగాణ జిల్లాలలో చెదురుమదురుగా తక్కువ సాంద్రతతో జీవిస్తున్నారు.

నాయకపోడులను ప్రాంతీయ పరిభాషల్లో నాయక, నాయకులు, నాయకపు, నాయకపోళ్ళుగా పిలుస్తారు. నాయకపోడ్లు తమను తాము పాండవ నాయకులు, పద్మా నాయకులుగా చెప్పుకుంటారు. గోండులు నాయకపోడులను మచ్చలీర్‌గా పిలుస్తారు. నాయకపోడ్లు దక్షిణ భారత గిరిజన తెగ. పూర్వం బోయలుగా అంటే ఆటవికులుగా పిలిచేవారు. వీరివి స్వతంత్ర బోయ రాజ్యాలు ఉండెడివి. వీటిని బోయ దుర్గములు లేదా బోయ కొట్టాలుగా పిలిచేవారు.

చాళుక్య రాజులు సుమారు క్రీ.శ. 700 నుండి 800 సం॥ల కాలంలో బోయదుర్గాలపై దండెత్తి నాశనం చేసారు. తర్వాత కాలంలో చోళులు, రాష్ట్ర కూటులు యుద్ధాలు చేసి ఈ ప్రాంతాలను వశపర్చుకొని రాజ్యపాలన చేసారు. బోయ స్వతంత్ర నాయకుల మద్దతుతో రాష్ట్రకూటులను ఓడించి కొంత ప్రాంతానికి ఒకొక్క నాయకునికి అధికారమిచ్చి నాయక వ్యవస్థ నెలకొల్పడం ద్వారా క్రీ. శ. 1000సం॥ల కాలంలో కాకతీయ సామ్రాజ్యం అవతరించింది. 14 వ శతాబ్ద ఆరంభంలో ఢిల్లీ సుల్తానులు కాకతీయ సామ్రాజ్యాన్ని అంతమొందించి తమ పాలన కొనసాగించారు. పరాయి వారైన తురుష్కుల పాలనకు వ్యతిరేకంగా ప్రోలయ నాయకుని నాయకత్వంలో గోదావరి నదీతీర ప్రాంతంలో మాల్యవంత పర్వత ప్రాంతంలో రేఖపల్లి రాజధానిగా

నాయక రాజ్యాన్ని క్రీ.శ. 1336–1369 సం॥ వరకు పాలన సాగించాడు. ప్రోలయ మరణానంతరం కాపయ నాయకుడు పాలన కొనసాగించినట్లు శిలా శాసనాల ద్వారా చరిత్రకారులు చెపుతున్నారు. క్రీ.శ. 1369–1375 సం॥ వరకు సింగబోయుని నాయకత్వంలో రాచకొండ రాజధానిగా రేచర్ల పద్మనాయక రాజ్యాన్ని స్థాపించి పరిపాలన సాగించి, ఎడతెరిపి లేని అంతర్గత యుద్ధాలు, తురుష్కుల దండయాత్రలలో తమవారినెందరినో కోల్పోయిన పద్మ నాయకులు దట్టమైన అడవుల్లోకి పారిపోయారు. ఈ నాయకరాజ్యాలలోనివారే నాయక గిరిజనులు. నేటికిని నాయక రాజ్యాలు ఏలిన ప్రోలయ నాయకున్ని, సింగబోయున్ని పూజిస్తారు. పూర్వీకుల కాలం నుండి పోడు వ్యవసాయమే ప్రధానంగా ఆచరించేవారు. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం వీరిని నాయకపోడు గిరిజనులుగా గుర్తించింది.

అరణ్యవాస కాలంలో పాండవులు తమ గూడేలకు వచ్చినట్లు, ఆటవిక జీవనం గడిపే వీరికి పోడు వ్యవసాయంలో మెలకువలు నేర్పించినారని, పాండవులనే ఆరాధ్య దైవాలుగా కొలిచే వీరు పాండవ నాయకులుగా చెప్పుకోవడం విశేషం. మొదటిసారిగా వచ్చిన పంటను కొత్తల పేరుతో పాండవులకు నైవేద్యంగా సమర్పిస్తారు. అలాగే పద్మ నాయక రాజ్యంలోని వారుగా పద్మ నాయకులుగా తమ ఉనికిని తెలియజేసుకుంటారు.

నాయకపోడ్లు పోడు వ్యవసాయంలో కొర్రలు, సామలు చల్లేవారు. అలాగే పచ్చ జొన్నలు, మొక్క జొన్నలు పండిస్తారు. వీరు ఆహారంగా జొన్నలతో కాచిన అంబలిని (జావ) తాగుతారు. అడవిలో దొరికే గోవింద గడ్డలు, ఊలెక గడ్డలు, ఎల్లేరు గడ్డలు, ముసలమ్మ గడ్డలు, విషపూరితమైన తెల్ల చెన్న, నల్లచెన్న దుంపలను ఉడికించి తింటారు. అడవుల్లోని మడుగుల్లో, చెరువుల్లో సహజంగా మొలిచి పంట పండే దుస్సారి లేదా నవారిడ్లు దులుపుకొని తెచ్చి తింటారు. దీనిని పాండవుల పంటగా చెప్పుకుంటారు. చేపల వేటంటే వీరికి ఎంతో సరదా. చెరువుల్లో దొరికే కుంచె కలం గడ్డలు, కోటెగ్గడ్డలు, అల్లి గడ్డలు, తొక్కుడు గడ్డలు, బోద గడ్డలను తెచ్చితింటారు. అడవుల్లో దొరికే పుట్టకొక్కులు, వెదురు పిలకలు, బొద్దికూర, దేవదారు కూర, పోడు భూముల్లో దొరికే దొగ్గలి, కోడి జుట్టాకు, గునుగు కూర తెచ్చి వండి తింటారు. నాయకపోడ్లు వ్యవసాయపరంగా చాలా వెనుకబడినవారు. తొలిసారిగా వచ్చిన కొర్ర పంటను పాండవులకు నైవేద్యం పెట్టడం ఆచారంగా అలాగే మొక్కజొన్న, పచ్చకూర సైతం దేవర్లకు పెట్టడంకొరకు కొత్తల పండుగ జరుపుకుంటారు.

ఈ తెగలో ధాన్యం, వస్తు మార్పిడి రెండు దశాబ్దాల క్రితం వరకు కొనసాగింది. ఆహారంలో కారం వాడకం ఎక్కువ. మిరప పంట పండించటం నేటికిని నాయకపోడులకు తెలియదు. మిరపకాయలను రెండైతే జోడాగా, నాలుగైతే కుచ్చంగా కుప్పలుగా పెట్టి బదులు తెచ్చుకునేవారు. నాయకపోడ్లు పాలు, నెయ్యిలను గిద్దెలు, అర గిద్దెలలోను, ధాన్యాన్ని అరసోల, సోల, తవ్వెడు, మానెడు, అడ్డెడు, కుంచెడు, కుందుడు, తూమెడు, ఇద్దుం, ముత్తుం, పందుం, ఏదుం, శెలగ (పుట్టి) కొలతలతో పిలిచేవారు. ధాన్యాన్ని అప్పుగా పొందుటకు నాగులు పద్ధతిని పాటించేవారు. తిండి గింజలకు దేడినాగు, విత్తనాల అప్పుకు సరినాగు పద్ధతి ఉపయోగించేవారు. దేడినాగు ఒక బస్తాకు పంట పండిన తర్వాత ఒక బస్తా మూడు కుంచాలు కలిపి ఇవ్వాలి. సరినాగుకు ఒకటికి రెండొంతులు కొలవాలి. స్వంతంగా పశువులు లేనివారు ఆవులను లేదా ఎడ్లను పాలికి తోలుకొచ్చి దున్నుకునేవారు. ఎడ్లకు చెందిన కిరాయి లేదా బాడుగ పంట పండిన తర్వాత మాట్లాడుకున్నదాన్నిబట్టి కొలిచేవారు. ఆవులు, మేకలను మేపుటకు కూడా పాలు పద్ధతినే సం॥ల తరబడి మేపేవారు. వాటికి పుట్టిన సంతానాన్ని స్వంతదారు మేపేవారికి విధిగా సగం పంచి ఇవ్వాలి. పశువులు, మేకల మందలను మేపువారు అడవుల్లో వీటి జాడ తెలుసుకొనుటకు వీటికి కట్టెతో చేసిన లొటకలను, ఇనుప కప్పెరలను, బొనగలను వీటి మెడల్లో కడతారు. ఆ శబ్దాన్ని వినుకుంటూ మందంతా అనుసరించుకుంటూ వెళ్తుంది.

తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, జిల్లాలో నాయకపోడుల జన సాంద్రత ఎక్కువగా, ఇతర జిల్లాలో స్వల్ప పరిమాణంలో కన్పిస్తుంది. నాయకపోడులను ప్రాంతీయ పరిబాషల్లో నాయక, నాయకులు, నాయకపు, నాయకపోళ్ళుగా కూడా పిలుస్తారు. వీరి జనాభా ఏజన్సీ ప్రాంతంలో ఎక్కువగాను మైదాన ప్రాంతంలో పాక్షికంగా కన్పిస్తుంది.

నాయకపోడుల జీవనం ప్రధానంగా సహజ సిద్ధంగా ఉన్న నీటి వనరులైన గోదావరి నదికి ఇరుప్రక్కల గల తీరప్రాంత అడవులలో, వాగుల సమీపానగల కొండల ఏటవాలు ప్రాంతాలు, వాగులు, కాకతీయుల కాలంలో నిర్మించిన పెద్ద పెద్ద చెరువులు ఉదా॥ వరంగల్ జిల్లాలోని పాకాల, రామప్ప, లక్నవరం, కంబాలపల్లి చెరువులు, ఖమ్మం జిల్లాలోని బయ్యారం, సింగభూపాలెం మొదలగునవియేకాక ఇంకా ఎన్నెన్నో చిన్న చిన్న చెరువుల ముందు లోతట్టు ప్రాంతాల్లో వీరి జీవనం

కన్పిస్తుంది. మనుషుల, పశువుల తాగునీరు, వాడకం అవసరాలకోసం చెరువులను ఆశ్రయించి జీవిస్తుంటారు. ప్రధానంగా ఆహారంకోసం కొద్దిపాటి పోడు వ్యవసాయం చేస్తూ, అడవులే ప్రధానవనరుగా గడ్డలు (దుంపలు) అడవి జంతువులు, ఇప్ప పూవు, తేనె, పుట్ట కొక్కులు (పుట్ట గొడుగులు) వెదురు పిలకలు మొదలగునవి సేకరించి జీవిస్తుంటారు. తేనె సేకరణలో వీరిది అందెవేసిన చేయి. అడవుల్లో వేట సమయంలో జంతువులను పొడిచి, నరికి చంపే ఆయుధాల కంటే ఎరపద్ధతులు (ట్రాప్స్) ఉపయోగించి జంతువులను ప్రాణాలతోటే పట్టుకుంటారు. జంతువుల జాడలు తీయడంలో నేర్పరులు.చేపల వేటంటే వీరికి మహా ఇష్టం. చేపలు పట్టడానికి యువకులు, ముసలివారు, చిన్న పిల్లలు అని వయసుతో నిమిత్తం లేకుండా కదిలివెళతారు.

నాయకపోడ్ల ఇండ్ల నిర్మాణం చాలా సాదాగా, తేలికగా కట్టుకునేటట్టు ఉంటుంది. చదరంగా లేదా చుట్టు గుడిసె రూపంలో వుండి నిట్రాడు తప్పనిసరిగా ఉండేలా చాలా చిన్నవిగా కడతారు. నిట్రాడు లేకపోతే ఇంటికి మూలపురుషుడు కూడా లేకుండా పోతాడని వీరి నమ్మకం. ఇంటి పైకప్పుగా బొగ్గు తులసి (మాబీర), అంచె గడ్డి, గుట్ట గడ్డితో కప్పుతారు. కొంతమంది ప్రత్యేకంగా చీపురు గడ్డితో కప్పుతారు. కాని చీపురు గడ్డిని సేకరించడం చాలా కష్టంతో కూడుకున్న పని. ఇంటికి కొడిశె పొరక, దేవదారు పొరకతో చుట్టూ దడి (తడకలు) కడతారు. ఇంటి గుమ్మాలు, మొత్తలు ఒక ఇంటికి వేరొక ఇల్లు ఎదురెదురుగా కన్పించేలా కడతారు. దీనిని వీరు ఇంటికి చాటు చేయడంగా పిలుస్తారు. ఇంటికి మొత్తను సన్నటి పెండెలతో తడకలాగా కట్టి గుదిగర్రలు ఉపయోగిస్తారు. పశువుల్లో లేగటి ఆవుల కోసం ఇంటికి ఉత్తర ప్రక్కన సూరు నుండి మారపాక/మోరపాకను వాసాలతో నేలను ఆనేటట్లుగా దించి కప్పువేస్తారు.ఇంటిముందు కనీసం పందిరి కూడా వేసేవారు కాదు. వీరి ఇండ్లను పరిశీలించితే ఇండ్ల నిర్మాణం కోసం పెద్దగా ఆసక్తి చూపినట్టుగా కన్పించదు. ఇతరుల చెక్కుడు వాసాలతో కట్టిన పెద్ద పెద్ద దూలపు ఇండ్లను చూసిన పిల్లలు ఎవరైనా అలా కడితే తప్పా, ఎందుకు కట్టరు? అని అడిగినా పెద్దలు కసురుకొని, కోపంతో పిల్లలను నోర్లు మూయించేవారు. ఇంకా వివరంగా ఎవరైనా అడగాలని చూసినా, మీకు అన్ని సంగతులు కావాలని కోపంతో చెక్కుడు వాసాలతో కట్టిన దూలపు ఇండ్లు మనకు అచ్చి రావని తిట్టి అక్కడినుండి పెద్దలే పక్కకు వెళ్ళిపోయి ఆ విషయాన్ని మర్చిపోయేటట్టు చూస్తారు.

ఇండ్ల నిర్మాణాన్ని జాగ్రత్తగా పరిశీలించినపుడు నెత్తిపై నీడవుంటే చాలనే విధంగా నిస్తేజంగా ఎందుకు నిర్మించారనే విషయం ఆలోచింపచేస్తుంది. కనీసం ఇంటిముందు పందిరి కూడా వేయరు. ఇంటిలో మేరువ/జగిలి కొద్దిపాటి మందం మట్టిని పోస్తారు. పుట్టమన్ను, ఆవుపేడతో అలుకుతారు. పోడు వ్యవసాయంలో ఒకచోటు నుండి వేరొక చోటుకి మారడం ఒక కారణమైతే, రెండవది బలమైనది నాయక రాజ్యాల కాలంలో ఎడతెరిపిలేని నాయకులు, వెలమలు, రెడ్లు ఎడతెరిపి లేని అంతర్గత యుద్ధాలు, తురుష్కుల దండయాత్రలు, శ్రీకృష్ణదేవరాయలు సామ్రాజ్య విస్తరణ కాంక్షతో జరిపిన యుద్ధాల వల్ల భయకంపితులై అడవుల్లోనే బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా గడపడానికి అలవాటుపడినారు. తమ ఉనికిని గురించి కూడా బయటి వారికి తెలియకుండావుండటానికి సమాజంతో సంబంధం లేకుండా వున్నారు. తెలియని వ్యక్తులెవరితో కూడా మాట్లాడటానికి ఎంతమాత్రం ఇష్టపడేవారు కాదు. వీరితో ఇతరులెవరైనా మాట్లాడాలంటే కుల పెద్దతో సంప్రదించి, పిలిచినపుడు మాత్రమే మాట్లాడేవారు. ఇట్లాంటి మనస్తత్వం వల్ల వీరు అనుమానస్తులుగా, ప్రతి దానికి శకునం పాటించేవారుగా పేరుపడ్డారు. కొందరైతే వీరిని ఏకంగా చాతగాని వారిగా మాట్లాడి అవమానపరుస్తుంటారు.

ఇంటి చుట్టూతా కంక చిల్ల (వెదురు చిన్న చిన్న మండలు) లేదా కొడిశె, ముష్టి పొరక నిలువుగా వుంచి బారుగా వుండే పెండెలతో ఎనుగు (కంచె) కడతారు. కట్లుగా నల్ల తీగలు, గూడపాల తీగ లేదా దుశేరు తీగలను ఉపయోగిస్తారు. ఇంటికి వాసాలు, గడ్డి, దళ్ళు, కంచె పొరక మొత్తం అంతా కూడా తల, భుజాలపైనే మోస్తారు. ఇండ్లలో రెండు దశాబ్దాల క్రితం వరకు కూడా కర్రపెండెలతో పాతిన గడిమంచెలపైననే నిద్రించేవారు. అడవుల్లోని వొర్రెల గట్లెంబడి దొరికే కోపెర నార (దారపు పోగులలాంటి గడ్డి) తో పేనిన నులక మంచాలను వాడేవారు.

ఆదివాసుల వ్యవసాయ పద్ధతుల గురించి క్రిష్టాఫ్ వాన్ ఫ్యూరర్, హైమన్ డార్ఫ్ గారు కొలాములు, నాయకపోడుల వ్యవసాయ పద్ధతులు గోండుల లాగా అభివృద్ధి చెందలేదని చెప్తారు. 1940 వ సం॥ వరకు వీరు కొంకలు, గస్కె కర్రలతో పోడు భూముల్లో వ్యవసాయం చేసేవారు. ఎడ్లు, నాగండ్లు ఉపయోగించలేదని చెప్తారు. వీరు ప్రధానంగా కొద్దిపాటి పోడు వ్యవసాయంపైనే ఆధారపడేవారు. అదికూడా కొర్రలు, సామలు పోడు భూముల్లో అలికేవారు. కొర్ర, సామ పంట రెండు నెలలలోపే చేతికొస్తుంది. అదైననూ పుట్ట గుంపులు, పోడులో కాల్చిన బూడిద బాగా ఉన్న దగ్గర

మాత్రమే మిర్రుగా పండి కొద్దిపాటి పంట చేతికొచ్చేది. ఊరికి దగ్గరగా ఉన్న పెరడ్లు, చేలల్లో మొక్క జొన్న వేసేవారు. కాని అడవి జంతువులు, పక్షుల బారినుండి పంటను కాపాడటానికి మంచెలు పెట్టి పంటచేతికొచ్చేదాకా ఇంటిమొఖం చూడకుండా చేన్లవద్దే కాపలాలు కాసేవారు. మిగతా కాలమంతా ఫారెస్టు డిపార్టుమెంటు వారికి కూలీలుగా పనిచేసేవారు. కూలిలేని రోజుల్లో ఆహారం కోసం అడవి ఫలసాయాల మీదనే ఆధారపడేవారు. వెదురుతో బుట్టలు, గంపలు లేదా చాటలు, తడికలు అల్లి వాటిని అమ్ముకొని జీవించేవారు.

నాయకపోడ్లు నల్లని రంగుతో ఎత్తుగా, బలమైన శరీరసౌష్టవం కలిగి ఉండి ఎంతసేపైనా ఆకలికి తట్టుకొనివుంటారు. వీరు పోడు నరికేటపుడు, చేపలు పట్టేటపుడు, ప్రత్యేకంగా ఉడుములు పట్టేటపుడు అవి దొరికేంతవరకు పట్టుదలతో వేట కొనసాగించేవారు. వీరు వేటాడేటపుడు నిశ్శబ్దంగా ఉండి సైగలతోనే పనిచేస్తారు. అడవికి గాని చేపలు పట్టడానికి గాని, ఇంటినుండి బయలుదేరి వెళ్ళేటపుడు తమకు ఇతరులు ఎదురు కాకుండా చూసిన తర్వాతనే బయలుదేరుతారు. కొంతమంది ఎదురొస్తే తమకు వేటలో ఏమీ దొరకవని వీరి నమ్మకం. ఒక్కొక్కసారి తమకు గతంలో వేటకువెళ్ళేటపుడు ఎవరైనా అనుకోకుండా ఎదురొచ్చినా ఆరోజు వేటలో బాగా లభించినపుడు వారిని గుర్తుపెట్టుకొని ఎదురురమ్మని మరీ కోరి బయలుదేరుతారు.

నాయకపోడుల మనస్తత్వం బయటివారికి తొందరగా అంతుపట్టదు. వీరి కులస్తులతో కలిసి వున్నంతగా ఇతరుల తోటి కలువడానికి, మాట్లాడటానికి ఇష్టపడరు. ఎవరైనా కొత్త వ్యక్తులు ఇంటి ముందుకి వచ్చి పిలిచినా బయటికి రారు, సమాధానం కూడా ఇవ్వరు. వీరిని పిరికి వారు, చాతకాని వారుగా జమకట్టి అపహాస్యం చేస్తుంటారు. రాజకీయాల జోలికి అసలే వెళ్ళరు. రాజకీయాలు మనకు అచ్చిరావని ఇలా బతికితే చాలు ఎలాంటి పదవులు, నాయకత్వాలు మనకొద్దని పెద్దలు వాళ్ళల్లో వాళ్ళు, పిల్లలతో అన్న సందర్భాలను గుర్తుచేసుకొని అయోమయంతో మౌనంగా ఉండిపోతారు. వీరి మౌనానికి కారణం పూర్వం పద్మ నాయక రాజ్యంలో నాయకత్వం చేసిన తమ వారిలో చాలామంది చంపబడటమే.

చేపల వేటకు వెదురు పుల్లలతో అల్లిన ఊతలు, ఎత్తెల, మావులు, గుమ్మిలను ఉపయోగిస్తారు. ఊతను చెరువులు, మడుగులు, పారే నీళ్ళలో సైతం పది, ఇరవై మంది గుంపుగా ఒకేచోట చుట్టూ చేరి కేకలతో ఊతలు పొడిచి చేపల్ని

దొరకపడుతారు. మావులను నడుములబంటి (నడుముల లోతు) నీళ్ళలో కొయ్య గూటాలు పాతి, మావును కొయ్యగూటాలను కల్పి తాళ్ళతో కట్టి, మావు ప్రక్కలమ్మటి నుండి చేపలు వెళ్ళకుండా కొంత గడ్డిచెత్తను వుంచుతారు. దీనితో చేపలు నేరుగా మావు ఆసుల నుండి (కన్నె లేదా డంగు అని కూడా పిలుస్తారు) లోనికి వెళ్ళి మావులో చిక్కుబడిపోతాయి. తెల్లవారి ఉదయాన్నే మావును తీసి వొడ్డుకు తెచ్చి దులిపి చేపలు తీసుకొస్తారు. గుమ్మిలాలను నీరుపారే చిన్న చిన్న మెదులల్లో సాయంత్రం ఉంచినిచ్చి ఉదయం వేళలో వెళ్ళి దులుపుకొని చేపలు తెస్తారు. ఎత్తెలలను వెదురు పుల్లలతో మూడు మూలలుగా, అడుగు లోతు ఉండేట్టుగా అల్లి తోపుడు వలలాగా నీళ్లలో ముంచి ఎత్తుతూ చేపలు పడుతారు. నీళ్లలో ముంచుతూ ఎత్తుతూ చేపలు పట్టడం వలన ఎత్తెలగా పిలుస్తారు. మడుగుల్లో నీళ్లను గుప్పి చేపలు పట్టడానికి ప్రత్యేకంగా వెదురుతో అల్లిన గూడలను లేదా రెండు చాటలను ఎదురెదురుగా కలిపి తాళ్ళతో కట్టి వంతులవారిగా, జోడీలు జోడీలుగా (ఇద్దరిద్దరు) మడుగుల్లోని నీళ్ళను కట్టవేసి వేరే మడుగుల్లోకి గుప్పి చేపలు పడుతారు. ఎండాకాలం రోజుల్లో నీళ్ళు బయటికి గుప్పలేని పెద్ద లోతైన నీటి మడుగుల్లో గార చెక్క దంచి కలిపేవారు. కొంత సమయానికి చేపలు ఈదలేక, కదలలేక పైకితేలేవి అప్పుడు పట్టుకొనేవారు.

ఉడుముల మాంసం అంటే వీరికి మహా ఇష్టం. ఉడుముల కాలి గోళ్ళ జాడలను బట్టి ఏ పుట్టలో, కొయ్య తొర్రలో దూరింది కనిపెడతారు. కొన్నిసార్లు కుక్కల సాయంతో జాడలు తీస్తారు. పుట్టల్లో దూరిన ఉడుములు పట్టడానికి పుట్ట కన్నెలన్ని (కలుగు) చెట్ల ఆకులతో బుచ్చలు పెట్టి ఎదురెదురుగా వున్న రెండు కన్నెలను మాత్రం వదిలివేస్తారు. ఒక కన్నె దగ్గర మంటపెట్టి పచ్చిఆకులను మంటలో వేసి పొగవచ్చేట్టు చేసి పొగను పుట్టలోకి పంపుతారు. రెండవ కన్నెపై ఒక గుడ్డ ముక్కను కప్పి ఉంతారు. పుట్టలోనికిపోయిన పొగవల్ల ఉడుముకు ఊపిరి ఆడక, కండ్లు మండి పైకి రావటానికి చూస్తుంది. కన్నెలన్నీ ఆకులతో బిర్రుగా బుచ్చలు పెట్టివుండడంవల్ల గుడ్డముక్క కప్పిన కన్నెవైపునుంచి గుడ్డను తోసుకొని పైకి రాబోయేటపుడు దాని మెడపట్టుకొని బయటికి లాగి గోర్లు విరిచి దాని తోకతోనే ముడివేసి పట్టుకొస్తారు. అందుకే ఉడుము తోకను ఉడుము మెడకే ముడి పెడతారని సామెత చెపుతారు. ఉడుములను పట్టేటపుడు ప్రమాదకరమైన విషపు పాములు, తేళ్ళు కూడా బయటికి వస్తాయి. వాటిని చంపి ఉడుములు పట్టుకొస్తారు. ఆహారం కోసం ఎంతటి విష జంతువులతోనైనా పోరాడక తప్పనిసరి పరిస్థితిలో వేటచేస్తారు. పొగతో ఊదరగొట్టేటపుడు బలమైన ఉడుము

పుట్టనుండి బయటికి రాకుండా కస్సుమనే శబ్దంతో, గడ గడమనే గురకలాంటి అరుపులతో శబ్దం చేయడాన్ని రంతులు చేస్తున్నట్లు చెపుతారు.

ఆహారం

వీరు ఆహారంలో ఎక్కువ భాగం పచ్చ జొన్నలు, మొక్క జొన్నలతో చేసిన గట్క, అంబలిని (జావ) తాగుతారు. అంబలిని కాయడానికి కొద్దిమాత్రం ధాన్యం అంటే సోలెడు గింజలు ఉంటే నలుగురు, అయిదుగురికి సరిపడే అంబలి కాయొచ్చు. ఈ గట్క, అంబలి కాసే పిండి దంచడానికి రోలు, రోకళ్ళు వాడతారు. తర్వాత కాలంలో ఇసురు రాళ్ళు వాడకంలోకి వచ్చాయి. అన్నం, కూర వండటానికి మట్టి అటికెలు వాడేవారు. చిన్న సైజులో ఉండి పొయ్యి పైనుండి దింపడానికి పైభాగంలో చెవుల ఆకారంలో వుండడం వల్ల వీటిని చెవుల అటికెలు అని కూడా పిలుస్తారు. అన్నం కలియబెట్టడానికి కట్టె తెడ్లను వాడుతారు. అన్నం గంజి వార్చడానికి దుసేరు తీగలతో అల్లిన శిబ్బిని వాడుతారు. నేలలో గుంట తవ్వి మంటపెడితే తంపిటిగా, తొట్టిలాంటి కుండలో మంటపెడితే కుంపటిగా పిలుస్తారు. మంచినీళ్ళకు కుండలు వాడేవారు. అన్నం కూడా మట్టి మూకుడులలోనే తినేవారు. ఇత్తడి చెంబులు, గిలాసలు, కంచాలు ఇంటిలో ఒక్కొక్కటివుంటే మహాగొప్పగా చెప్పుకునేవారు. మట్టి కుండల వాడకం దాదాపు ముప్పై సం॥ల క్రితం వరకు ఉండేది. రాను రాను సత్తు గిన్నెలు (అల్యూమినియం) వాడుతున్నారు.

నాయకపోడ్లు ఎక్కువగా గడ్డలను (దుంపలు) ఆహారంగా వాడుతారు. చెరువుల్లో, పెద్ద పెద్ద మడుగుల్లో దొరికే కుంచెకలం గడ్డలు, కోటెగడ్డలు, అల్లి గడ్డలు, తొక్కుడు గడ్డలు, బోడ గడ్డలను వెతికి తీసుకొస్తారు. అడవుల్లో దొరికే గోవింద గడ్డలు, ఊలెక గడ్డలు, ఎల్లేరు గడ్డలు, ముసలమ్మ గడ్డలు, నిలువు గడ్డలు, చెన్న గడ్డలను తవ్వడానికి కొచ్చెగా చెక్కిన గస్కె కర్రలు లేదా కర్రుగొయ్యలతో తవ్వి తెచ్చి ఉడికించి తింటారు. దుంపలల్లో విషపూరితమైన తెల్ల చెన్న గడ్డ, నల్ల చెన్న గడ్డలు కూడా తెచ్చితింటారు. విషపూరితమైన చెన్నగడ్డలను మద్దికారంతో (మద్ది బూడిద) కలిపి రాత్రిపూట ఉడకబెట్టి జల్లిబుట్టలో వుంచి వాగుల్లో పారే నీటిలో ఉదయం నుండి సాయంత్రం వరకు ఊరబెట్టి ఆ తర్వాత తింటారు. ఒక్కొక్కసారి సరిగా కారం కల్పకపోయినా లేక నీటిలో సరిగా ఊరబెట్టకపోయినా వాటిని తిన్నవారి కాళ్ళు, చేతులు, ముఖం వాపులు వస్తాయి. కొంతమందికి కాళ్ళు, చేతులు పడిపోయి చాలా

కాలం పనిచేయకుండా పోయేవి. చెన్న గడ్డల విషానికి విరుగుడుగా చింత పులుసు చిక్కగా కలిపి తాపించేవారు. నిదానంగా కొంత కాలానికి విష ప్రభావం పోయి మామూలుగా అయ్యేవారు.

నాయకపోడ్లు వస్త్రధారణలో చాలా సాదాగా, నిరాసక్తంగా జీవిస్తారు. వీరికి కట్టు బట్టలు ఎక్కువగా వుండవు. పూర్వపు రోజుల్లో మగవారు గోచి మాత్రమే పెట్టేవారు. ఆ తర్వాత కాలంలో నడుముకు ధోతి(పంచె), భుజముపై తుండుగుడ్డ వాడేవారు. వీరు చొక్కాను ధరించడం అరుదు. వీరు చొక్కాను కూసంగా పిలుస్తారు. బయటి ఊర్లకు వెళ్ళేటపుడు మాత్రం చొక్కాను ధరిస్తారు. ఒక్కొక్కసారి తమకు చొక్కాలేకపోతే ఉన్నవారి దగ్గర అడిగి తొడుక్కొని ఊరు ప్రయాణం చేసేవారు. ప్రస్తుతం మగవారిలో ధోతులను పూర్వపు పెద్దలు మాత్రమే కడుతున్నారు. యువకులంతా లుంగీలు వాడుతున్నారు. ఆడవారు పూర్వం చీరకట్టి గోచి పెట్టేవారు. చీరకొంగునే భుజాలచుట్టూ తిప్పి బొడ్లో దోపుకొనేవారు. తర్వాత కాలంలో చివరలు కలిపి ముడివేసే రవికలు వాడకంలోకి వచ్చాయి. ఆడవారు బట్టలు ధరించడంలో పెద్దగా మార్పులేమి రాలేదు. కొందరు మాత్రమే పనికి వెళ్లినపుడు చీరను మోకాళ్లపైకి కట్టి గోచి పెట్టి, ఖాళీగా వున్నపుడు పాదాలవరకు వదిలివేస్తారు. ఆడవారు బట్టలు కట్టడంలో ఇలాంటి స్వల్ప మార్పులు తప్ప ఏమీమారలేదు. వీరిలో చాలా మంది నేటికిని సంతల్లో పాత బట్టలు కొని కట్టుకుంటున్నారు.

కుల వ్యవస్థ :

నాయకపోడులు కుల వ్యవస్థను గౌరవించి కట్టుబాట్లకు లోబడి జీవిస్తారు. నేటికిని వీరి కుల కట్టుబాటు చెక్కు చెదరలేదు. ప్రతి గూడేనికి కుల పెద్ద ఉంటాడు. కుల పెద్దతోపాటు పూజారి, కుల జవాను వుంటారు. ఈ ముగ్గురిని కుల సభ్యులందరూ కలిసే నియమిస్తారు. కుల పెద్దమనిషి ఆదేశానుసారం పూజారి పెండ్లిళ్ళ, దేవరలు, జాతరలు, కొలుపులు నిర్వహిస్తాడు. కుల జవాను పెండ్లికి, చావుకు, పంచాయితీలకు, కొలుపులు, జాతరలు మొ॥ అన్ని సందర్భాలలో అందరినీ పిలుచుకొచ్చి సమావేశపరుస్తాడు.

నాయకపోడుల ఆచారాల్లో పుట్టుక, పెళ్ళి, చావులకు గూడెంలోని అందరూ స్పందిస్తారు.

పుట్టుక

నాయకపోడ్లు తమ ఇంటిలో బిడ్డ పుడితే, చనిపోయిన తమ పూర్వీకులు తిరిగి పుట్టినట్లుగా సంతోషిస్తారు. తల్లి పురుడుపోసుకునేటప్పుడు ఇంటిలో ఒక ప్రక్క తడికలతో చాటు కట్టి వేరుగా ఉంచుతారు. భూత, ప్రేత పిశాచాల చూపుబారకుండా అడవి నుండి తెచ్చిన ఆరె, గార మండలను ఇంటి గుమ్మానికి తగిలిస్తారు. బిడ్డ పుట్టిన దగ్గర నుండి 11 రోజుల వరకు స్నానం చేయడాన్ని 5 వంతులుగా పిలుస్తారు. 11వ రోజును కుండల్లోకి రావడంగా పిలుస్తారు. చిన్న పిల్లలకు జ్వరం వస్తే చనిపోయిన పెద్దల కొంటెతనం వల్లనేనని తమ బిడ్డలను చల్లంగా కాపాడాలని తమను కొలుచుకుంటామని చనిపోయినవారికి (పితృదేవతలకు) కోడిని కోసి నీళ్ళు వారబోసి మొక్కుతారు. బిడ్డ పుట్టేటపుడు తమ పూర్వికుల సంప్రదాయాలను నేటికిని ఆచరిస్తారు. ఇంటిలో బిడ్డ పుట్టటం ఒక అపూర్వ సంఘటనగా భావిస్తారు. బిడ్డ పుట్టటంతో ఆ ఇంటిలోని వారు సంతోషంతో చిన్న వయసువారి నుండి ముసలివారి వరకు పుట్టిన బిడ్డ పోలికలను తమ పూర్వికులలో ఎవరికి కలిగివున్నాయో గుర్తుచేసుకుంటూ మురిసిపోతారు. బిడ్డ పుట్టిన దగ్గరనుండి ఆ ఇంటిలో సంతోషాలు వెల్లివిరుస్తాయి. బిడ్డ పుట్టే ముందు నుండి ఉయ్యాలలో (బారసాల) వేసేంతవరకు తంతు ఈ క్రింది విధంగా వుంటుంది. బిడ్డ పుట్టబోయేముందునుండే ఆ స్త్రీని ప్రత్యేకమైన అర్రలో (గది) వుంచుతారు. ఆమె సంరక్షణను ముసలి వారైన అమ్మమ్మ, నాయనమ్మలు చూస్తుంటారు. పురుడు వచ్చే సమయానికి ఆమె తల్లిదండ్రులు, అక్కజెల్లెళ్లు, దగ్గరి బంధువులకు కబురుచేస్తారు. బంధువులు ఇండ్లనుండి వచ్చేటపుడు కొన్ని డబ్బులు, కొర్రలు లేదా జొన్నలు తమ దగ్గర ఏవివుంటే అవి గుడ్డ మూటల్లో తీసుకొస్తారు.

బిడ్డ జన్మించిన వెంటనే ఇంటిలోని మగవారు అడివికి వెళ్ళి ఆరె మండ, గారమండను తీసుకొచ్చి ఇంటి గుమ్మానికి తగిలిస్తారు. జొన్నగగ్గె, మొక్కజొన్న బొండుతో లేక కట్టె దుల్లుతో రెండు మూడు కట్టెపేళ్లు పెట్టి కుంపటి అంటుపెడతారు. దీనివల్ల భూత ప్రేత పిశాచాల చూపు తల్లీ బిడ్డలకు తగలకుండా రక్షణ కలిగిస్తుందని వీరి విశ్వాసం. బిడ్డ పుట్టిన వెంటనే బొడ్డు కోసి జొన్నలు గాని ఏదేని ధాన్యం చాటలో పోసి, పుసుపు కుంకుమలు ఒకపక్కన ఉంచి బిడ్డను పడుకోబెడతారు. ఇలా చేసిన యెడల పుట్టిన బిడ్డలు ఎదిగి జీవించేకాలమంతా ఆహారం లోటు లేకుండా జీవిస్తారని వీరి నమ్మకం. చాటలో పోసిన ధాన్యాన్ని పురుడు పోసిన మంత్రసానికి ఇస్తారు. తల్లి

బిడ్డలకు స్నానం చేయించడానికి పూర్వం తలంటు గింజలపొడిని వాడేవారు. ఈ మధ్య కాలంలో ఈ పిండి వాడకంలో మార్పులొచ్చి పెసర్లు, మినుములు, శనగలతో చేసిన సున్ని పిండి వాడుతున్నారు.

పురుడుపోసుకున్న తల్లికి స్నానం చేయించడంలో నాయకపోడ్లు తమదైన పద్ధతిని నేటికి ఆచరిస్తారు. వేపాకులో ఉప్పు, పసుపు వేసి ముద్దగా నూరి వొంటికి పట్టిస్తారు. వావిలి ఆకులు వేసి కాచిన వేడి నీటితో స్నానం చేయిస్తారు. స్నానం చేయించేటపుడు అడ్డపాప గుడ్డను కుడి భుజం మీదనుండి ఎడమ సంకలోకి వచ్చునట్లు వేసి స్నానానంతరం తీసి దాచిపెట్టి తిరిగి స్నానం చేసేటపుడు వేస్తారు. స్నానంచేయించడం అయిదు (5) వంతులుగా పిలుస్తారు. పుట్టిన రోజు నుండి మూడో రోజును మూడొద్దులుగా పిలుస్తూ 1వ వంతుగా, ఐదొద్దులు–2వ వంతు, ఏడొద్దులు–3వ వంతు, తొమ్మిదొద్దులు–4వ వంతుగా, పదకొండొద్దులు–5వ వంతుగా పిలుస్తారు. 5వ వంతు స్నానానికి గూడెంలోని అందరిండ్ల నుండి వేడినీటిని కాచి తెచ్చి తల్లీ, బిడ్డలకు తలా ఒక చెంబుడు నీళ్లు పోసి స్నానం చేయించి ఆ ఇంటిలో భోజనం చేసి వెళతారు. ఆ రోజున పురుడుపోసుకున్న గదినుండి ఇంటిలోనికి తీసుకొస్తారు. ఈ పదకొండో రోజును కుండల్లోకి రావడంగా పిలుస్తారు. మూడు నెలలదాకా తప్పని సరిగా బాలింతకు (బిడ్డ తల్లి) ఎల్లిపాయ కారంతోనే అన్నం పెడతారు. తల్లీ, బిడ్డలకు వాడే ఆముదం నూనెను వావింటి, వేరు, ఉత్తరేణి వేరు వేసి కాచి వాడుతారు.

ఇరవై ఒకటో రోజు జరిగేంతవరకు తల్లీ, బిడ్డలు తమ ఇంటి ఆవరణలోనే కుటుంబ సభ్యుల మధ్యనే గడుపుతారు. ఈ రోజునే బిడ్డను ఉయ్యాల్లో (బారసాల) వేయడం కార్యక్రమం గూడెంలో సందడిగా జరుగుతుంది. అయిన వాళ్ళు, దగ్గరి చుట్టాలు తల్లీ, బిడ్డలకు బొట్టుపెట్టి కొత్త బట్టలు పెట్టి పలకరిస్తారు. గూడెంలోని ఇంటికొకరు ఆడవాళ్ళు వచ్చి భోజనంచేసి వెళతారు. బారసాల అనంతరం తల్లీ, బిడ్డలు తొలిసారిగా ఎవరింటికైనా వెళ్లితే కాళ్ళకు పసుపు రాచి బొట్టుపెట్టి వెదురు బుట్టతో ధాన్యం, వెల్లిపాయలు, ఇంగువ, వామును కానుకగా ఇస్తారు. అలా ఇవ్వని యెడల ఆ ఇంటివారి ధాన్యాన్ని, బట్టలను ఎలుకలు కొరికి పాడుచేస్తాయని ఈ తెగవారి నమ్మకం.

నాయకపోడు ఆదివాసుల్లో బిడ్డ పుట్టిన దగ్గరనుండి మేనమామకు బాధ్యత పెరుగుతుంది. ప్రతి విషయాన్ని తల్లిదండ్రులతో పాటు మేనమామ కూడా దగ్గరుండి చూసుకుంటాడు. అందుకే అయ్య, అవ్వ చచ్చినా మేనమామ

బతికుండాలని చెప్పుకుంటారు. గొగ్గిపళ్లుగాని వస్తే మేనమామకు కీడని తుండును (కండువా) అడ్డంపెట్టి మేనమామ ఎడమ కాలితో బిడ్డ మూతిమీద తన్నిస్తారు. పేగు మెడకుపేసుకొని పుడితే కీడని బిడ్డను దుష్ట శక్తులు ఆవరించకుండా కోడిని ఎడమచేతితో బిడ్డచుట్టూ తిప్పి, దిగతుడిచి కోసి కోడి పేగును బిడ్డ మెడకు చుడతారు. ఎదురు కాళ్ళతో బిడ్డపుడితే మంత్రసానికి కీడని పురుడు సమయంలో బిడ్డను ఎవరూ చూడకుండా గొంతునొక్కి మంత్రసాని చంపేస్తుంది. ఒకవేళ ఎదురు కాళ్ళతో పుట్టిన బిడ్డ బతికినట్లైతే అతీత శక్తులు వస్తాయని చనిపోయిన వారు, భూత ప్రేత పిశాచాలు, భూమిలోని నిధి, నిక్షేపాలు ఈ బిడ్డకు కనిపిస్తాయని ఈ తెగవారి నమ్మకం. వర్షాలు కురిసే సమయంలో పిడుగులు ప్రత్యేకంగా వీరిపైనే పడుతాయని కూడా వీరి నమ్మకం.

మనువు/పెండ్లి:

నాయకపోడ్లు తెలుగు మాట్లాడుతారు. నాయకపోడ్లు పూర్వీకుల కాలంనుండి ఇంటి పేర్లద్వారా వావి వరుసలు కలిగి వుంటారు. నాయకపోడు ఆదివాసులు నల్లెల్ల లేదా నల్లాని అనే వారు ఒకే గోత్రీకులు. నాయకపోడు తెగలో పెండ్లిళ్ళు ఆరు రకాలుగా జరుగుతాయి. పెండ్లి కొడుకుకి పెండ్లి కూతురికి వరుగులు కలిస్తేనే పెండ్లి చేస్తారు. ఇద్దరు భార్యలను చేసుకోవటాన్ని అనుమతిస్తారు. పెండ్లిళ్ళు పెళ్ళి కొడుకు ఇంటి వద్దనే జరపడం పూర్వీకుల కాలం నుండి వస్తున్న ఆచారం. ఈ తెగలో తల్లిదండ్రులు కులపెద్దలు కూర్చొని ఇంటిపేర్లనుబట్టి పూర్వంనుండి వావివరుసలు లెక్కించి సంబంధాలు నిర్ణయిస్తారు. వీరి పెండ్లిళ్లు పెండ్లి కొడుకు ఇంటి వద్దనే జరుగుతాయి. తెల్ల దారానికి పసుపు రాసి, పసుపుకొమ్ము కట్టి తాళిగా కట్టేవారు. నల్ల పూసలు గుచ్చిన మెడలో ధరిస్తే పెండ్లిఅయిన స్త్రీగా గుర్తిస్తారు. ఇది పూర్వీకుల కాలం నుంచి వస్తున్న ఆచారం. 1) కుండ మార్పిడి మనువు. 2) ఎత్తు మనువు.3) సుకమంచి 4) ఇల్లరికం 5) బలవంతపు పెండ్లి (పిల్లను ఎత్తుకుపోయి పెండ్లి చేసుకోవడం). 6) మారు మనువు.

కుండమార్పిడి మనువు

ఈ రకం పెండ్లిళ్లు సాధారణంగా మేనరిక సంబంధంలో జరుగుతాయి. పూర్వం తమ్ముళ్ళు చాలా చిన్న వయసు వారుంటే అక్కల పిల్లలను మేనమామకే ఇచ్చి

పెండ్లి చేసేవారు. తమ తల్లి, తండ్రి తోడబుట్టిన అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళ పిల్లలను మేన బావ వరుసతో కలిపి చేస్తారు. అలాగే తల్లిదండ్రుల తోడబుట్టకపోయినా తమ (పాలి వాళ్ళు) తాతగారికి పుట్టిన ముందు తరం వారిని కూడా ఈ రకం పెండ్లిలో అంగీకరించి ఆమోదిస్తారు. ముఖ్యంగా ఒక ఇంటి పిల్లను (పెండ్లి కూతురు) ఏ ఇంటి వారికైతే ఇస్తారో అదే ఇంటి పిల్లను మొదట పిల్లనిచ్చినవారి పిల్లవాడికి (పెండ్లి కొడుకు) ఇచ్చిచేస్తారు. ఇలాంటి సంబంధంలో పాలపేరిట వారు నీళ్ళ పేరిట వారిని తమవాళ్లుగా ఆమోదించి ఎంచుకుంటారు. ఒకే తాతకు పుట్టిన తండ్రులు, పిల్లల వరకు పాలి వాళ్ళుగా, ఒకే ఇంటి పేరు కలిగివున్న వారిని నీళ్ళు పేరిట వాళ్ళుగా పిలుస్తారు. ఈ రకం పెండ్లిలో ఎదురు బొదురు ఇచ్చి పుచ్చుకుంటారు. అందువల్లనే కుండ మార్పిడి మనువుగా పిలుస్తారు.

ఎత్తు మనువు

ఈ రకం పెండ్లిలో అమ్మాయి, అబ్బాయిల ఈడు జోడు, రంగు రూపులను కోరడం ఒకటైతే, చాలా కాలం వరకు పెండ్లి కాకుండా ఉండడం వల్ల తప్పనిసరియై తమ కుటుంబంతో పూర్వపు సంబంధాలు కలిగివుండకపోయినా కులంలోని ఇతరుల ద్వారా తెలుసుకొని వియ్యమందుకుంటారు. పెండ్లికి పెట్టిన మేళగాళ్ళ ఖర్చును పెండ్లి కొడుకు ఒక్కడే భరించడం, మరికొన్ని ఇద్దరూ చెరిసగం వారి స్తోమతనుబట్టి భరిస్తారు.

సుకమంచి

ఈ రకం పెండ్లి నాయకపోడుల గూడేలలో ఇప్పటికి అక్కడక్కడ కన్పిస్తుంది. ఈ రకం పెండ్లిలో మగ పెండ్లివారే మొత్తం ఖర్చును భరించవలసి వుంటుంది. ఉప్పు, పప్పు, నూనె, జొన్నలు లేదా బియ్యం, పెండ్లి కూతురికి వస్త్రాలు అన్నింటితో పెండ్లి కొడుకు వచ్చి ఆ ఊరి కులసభ్యులందరికి చూపించి కులపెద్ద అనుమతి పొంది అనంతరం విందు ఏర్పాటు చేయించి అమ్మాయిని పెండ్లి చేసుకొని తీసుకొని వెళ్ళిపోతారు. ఈ పెండ్లినే పప్పుతో ఇద్దుం బియ్యం కొలిచి పెండ్లి చేసుకోవడంగా కూడా పిలుస్తారు.

ఇల్లరికం

ఇల్లరికపు పెండ్లి అరుదైనది. ఆడపిల్ల తోడ మగపిల్లలు పుట్టని ఇంటిలో, అందునా ఆస్తి ఎక్కువగా ఉంటే ఆగమైపోతుందని, ఆస్తిని కాపాడటానికే ఇల్లరికపు అల్లుణ్ణి

తీసుకురావడానికి ఇష్టపడతారు. కొన్నిచోట్ల అమ్మాయి ఇంటిలో మగపిల్ల ఉన్నప్పటికి వాళ్ళు చిన్నవారైనా, లేక కుంటి, గుడ్డి ఏదైనా లోపంవున్నా ఆ కుటుంబానికి రక్షణగా ఉంటారని ఈ రకం పెండ్లిని ఆమోదిస్తారు. ఆ ఇంటిలో మగపిల్లలు ఉంటే వారితో సమానమైన ఆస్తిని ఇల్లరికపు అల్లునికి ఇవ్వాలి. ఇల్లరికం వచ్చేవారు కూడా తమ తోడ ఇద్దరు ముగ్గురు అన్నదమ్ములు కలిగివుంటేనే తల్లిదండ్రులు పంపడానికి ఇష్టపడతారు. అమ్మాయి, అబ్బాయిల తల్లిదండ్రులు మాట్లాడుకున్న తర్వాత అబ్బాయిని అమ్మాయి ఇంటికి పంపిస్తారు. ఆ రోజు నుండి ఆ ఇంటికి సంబంధించిన అన్ని పనులు అబ్బాయే చూసుకోవాలి. ఇల్లరికపు అల్లుడు జీవితాంతం అత్తవారింటిలోనే గడపాలి. ఈ విషయాలన్నీ పెద్ద మనుషుల పర్యవేక్షణలో జరుగుతాయి.

బలవంతపు పెండ్లి (పిల్లను ఎత్తుకుపోయి పెండ్లి చేసుకోవడం)

ఈ రకం పెండ్లిళ్లు చాలావరకు పూర్వపు రోజుల్లో జరిగేవి. ఇలాంటివి కుల సంప్రదాయంగా ఒప్పుకుంటారు. ఒక అబ్బాయి అమ్మాయి ఇష్టపడి అమ్మాయి తల్లిదండ్రులు ఒప్పుకోని కారణంగా అమ్మాయిని ఎత్తుకు రావడం జరుగుతుంది. అలాగే మేనత్త కూతురిని ఇచ్చి చేయడానికి వారి తల్లిదండ్రులు ఒప్పుకోకపోయినా అందరూ చూస్తుండగా మేన బావలు ఎత్తుకొచ్చినా ఎవరూ అడ్డుకోవడానికి వీలులేదు. మేనత్తకు ఆడపిల్ల పుడితే మేనబావలకు ఆ బలిమి వుంటుందని ఈ తెగ వారందరూ అంగీకరిస్తారు. ఈ బలవంతంగా ఎత్తుకొచ్చేటపుడు గూడెం పెద్దల సలహాలు, యువకుల సహకారం తీసుకుంటారు. కాని వీరు కాపురం చెయ్యడానికి మాత్రం తప్పక కులానికి దండుగ కట్టాలి. అప్పుడు కులపెద్దల సమక్షంలో అందరిముందు తాళి కడతాడు. కొన్నిసార్లు వేరే పెండ్లి జరుగుతున్నపుడు ఏ సంబంధం లేకపోయినా ఇష్టమైన అమ్మాయిపై అబ్బాయి కండువా వేస్తాడు. అలా కులం అందరిముందు కండువా వేసినందున ఆ అమ్మాయిని ఎవ్వరూ చేసుకోవడానికి ఇష్టపడరు. ఇలా కండువా వేసినందుకు ఆ అబ్బాయికి భారీగా దండుగవేసి అతనికే కట్టబెడతారు. ఈ దండుగ సొమ్ము కులం అంతా విందు చేసుకుంటారు.

పెండ్లిళ్లలో ఒక ఆచారాన్ని పాటిస్తారు. కుండలు మగపెళ్ళి వారైతే అయిరేని కుండలు తప్పకుండా తెస్తారు. ఈ అవిరేణి (అయిరేని) కుండలు రెండు మూడు సైజుల్లో వుండే బానలు. ఇంకా వజ్జ పేర్పులు, పోలు ముంతలు, గరిగె బుడ్లు తెస్తారు. ఇవి కుమ్మరి ఇంటినుండి తెచ్చేటపుడు డప్పు చప్పుళ్ళతో తెస్తారు. అన్నదమ్ములు

వేరుపడేటప్పుడు వీరికి ఇచ్చేస్తారు. వీటిలో ధాన్యం పోయడానికి ఉపయోగిస్తారు. పెండ్లిలో నవధాన్యాలను ఈ అవిరేణి కుండల దగ్గర పోసి ఇవి మొలిచేదాకా ప్రతి రోజూ పెళ్ళి కూతురుచే నీళ్ళు పోయిస్తారు. పదహారొద్దుల పండుగ జరిపి ముత్యాలమ్మకు పెట్టుకొని ఈ మొలకలను తీసుకెళ్లి పారే నీళ్ళలోగాని, బావినీళ్ళలోగాని వేస్తారు. ఇలా చెయ్యడం వలన తమ అవిరేణి కుండల్లో ఎప్పటికి ధాన్యం నిలువవుంటుందని వీరి విశ్వాసం.

ఈ తెగలో ఎవరైనా చనిపోయినట్లైతే తమ కుటుంబంలో ఆప్తుడిని కోల్పోయామని గూడెంలోని వారందరూ బాధపడతారు. పెండ్లైన వారిని పాడె కట్టి మోసుకెళ్ళి కట్టెలతో దహనంచేస్తారు. పెండ్లి కానివారిని ఒంటి బడితెతో మోసుకెల్లి బొందపెడ్తారు. ఇంటి వద్ద ఉన్నవారు జ్యోతిని వెలిగిస్తారు. దహనం చేసినవారు చనిపోయిన వారి ఇంటికెళ్లి జ్యోతికి దండంపెట్టుకొని ఎవరింటికి వారెళ్లిపోతారు. మూడవ రోజున కోడిని కోసి చనిపోయినవారికి జీవి గంజిని పోస్తారు. 11 వ రోజున దహనం చేసిన చోట మట్టితో తిరుపెల్లె కట్టి కర్మలు జరిపి పిట్టకేస్తారు. అనంతరం గూడెంలో దినం (కర్మ) పేరున భోజనాలు చేస్తారు.

లక్ష్మి దేవరను తమ ఇలవేల్పుగా కొలిచే నాయకపోడ్లు కొర్రాజులు పేరుతో పంచ పాండవులను, కృష్ణుణ్ణి, ప్రోలయ, సింగబోయుడు, మైసమ్మ, పోతురాజు,పెద్దమ్మ, మద్ది రామక్క, గట్టు ముసలమ్మ, ఎర్రమ్మ (ఎర్రమారి) మొదలగు దేవరలను కొలుస్తారు. నాయకపోడుల పూర్వికులు లక్ష్మి దేవర నాయకపోడుల ఆడబిడ్డగా చెపుతారు. అరణ్యవాస, అజ్ఞాత వాస కాలంలో తమ గూడేలకు వచ్చిన పాండవులు తిరిగి తమ రాజ్యానికి వెళ్ళేటపుడు నాయకపోడుల ఆడబిడ్డ అయిన లక్ష్మిని నాయకపోడుల మధ్య గడిపిన గుర్తుగా తమతో పాటు తమ రాజ్యానికి తీసుకువెళతారు. పాండవులు కౌరవులకు జరిగిన పద్మవ్యూహం యుద్ధంలో అభిమన్యుని చావుకు శ్రీకృష్ణుడే కారణమని భావించిన లక్ష్మి పురుష సైనిక దుస్తులలో మారువేషంలో శ్రీకృష్ణునిపై దాడి చేస్తుందని అప్పుడు అర్జునుడు పురుష సైనిక మారువేషంలో వున్న లక్ష్మి శిరస్సు ఖండించి వేస్తాడు. దాడిచేసినది లక్ష్మి అని తన తప్పు తెలిసుకున్న అర్జునుడు శ్రీకృష్ణుని సలహామేరకు అశ్వం తలనరికి లక్ష్మి మొండానికి అతికించి ఈమెను లక్ష్మీదేవరగా ఏలుకొమ్మని చెప్పినట్లు కథలు, కథలుగా చెప్పుకుంటారు. లక్ష్మీదేవర వృత్తాంతాన్ని డా॥ కంచర్ల మోహన్ రావు గారు, డైరెక్టర్, టి.సి.ఆర్ & టి.ఐ. 1993లో విడుదల చేసిన సోషియో కల్చరల్ ప్రొఫయిల్ ఆఫ్ ట్రైబ్స్ ఆఫ్ ఆం.ప్ర., అనే పుస్తకంలో రాశారు.

అజ్ఞాతవాస కాలంలో దుర్గమమైన అరణ్యాలలోని కొండ గుహలలో నివాసమున్నట్లు, చెప్పుకునే కథలద్వారా, లభ్యమయ్యే ఆధారాల ద్వారా తెలుస్తున్నది. ఆదిలాబాద్ జిల్లాలోని సత్మల కొండలు కొన్ని కిలో మీటర్లవరకు పరుచుకొని ఉంటాయి. లక్సెట్టిపేట మండలంలోని చెల్లంపేటకు దగ్గర అడవిలో చిన్నయ్య గుట్టలో భీముడి ఆరాధన, దండెపెల్లి మండలంలోని పెండ్లి మడుగు, ఊట్ల దగ్గర పెద్దయ్యగుట్టలో ధర్మరాజు కొలువై ఉంటాడు. పెద్దయ్యగుట్ట చిన్నయ్య గుట్టకు పడమరలో 6 కి.మీ దూరంలో ఉంటుంది. పెద్దయ్యగుట్టకు ఉత్తరం వైపున కొండ ఆవలి ప్రక్కన సుమారు 2 కి.మీ. దూరంలో తిర్యాణి మండలంలో అర్జున్ లొద్ది ఉంటుంది. అలాగే వరంగల్ జిల్లాలోని రేగొండ మండలంలోని పాండవుల గుట్ట, 23 నాయకపోడుల గూడేలలో లక్ష్మీ దేవర నగుర్లు (ఇల్లార్లు), పాండవులు, సింగబోయుడు, ప్రోలయ, పోతురాజు, పంది రాజు, గుర్రాపోతు, లేడి మొ॥ కొయ్యతో చేసిన ముఖ తొడుగులను చూడవచ్చు. నాయకపోడ్లు అధికంగా నివసించే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో గూడేలన్నింటిలో వీరిని కొలుస్తారు.

తెలంగాణలో నాయకపోడులచే పూజలందుకుంటున్న పాండవ క్షేత్రాలు

అడవులు, కొండల్లో నివసించే ఆదివాసులు యుగయుగాల చరిత్రను , తరతరాల సంప్రదాయ వారసత్వాన్ని నేటి ఆధునిక సమాజానికి అందించే గనులు. వేద కాలము నాటి పురాతన చరిత్రలను తమ గూడేలలో, గుండెలలో పదిలంగా దాచుకొని తమదైన శైలిలో దేవరలను ఆరాధిస్తారు. మహాభారత కాలంలో మాయా జూదంలో ఓడిన పాండవులు ఆదివాసులు నివసంచే ప్రాంతాలకు అరణ్యవాసం వచ్చినట్లు కథలు కథలుగా చెప్పుకుంటారు. అజ్ఞాతవాస కాలంలో దుర్గమమైన అరణ్యాలలోని కొండ గుహలలో నివాసమున్నట్లు చెప్పుకునే కథలద్వారా, లభ్యమయ్యే ఆధారాల వల్ల తెలుస్తున్నది.

అటువంటి స్థలాలు ముఖ్యంగా తెలంగాణలోని ఆదివాసులు నివసించే ప్రాంతాల్లో కన్పిస్తాయి. ఆదిలాబాద్ జిల్లాలో నాయకపోడు ఆదివాసులు పూజించే చారిత్రాత్మకమైన పాండవ క్షేత్రాలను ప్రముఖ చరిత్రకారులు డా॥ ద్యావనపల్లి సత్యనారాయణ గారు పరిశోధన చేసి ప్రకృతి సౌందర్యానికి పరాకాష్ట పెద్దయ్య గుట్ట పేరున ధర్మరాజును కొలిచే గుట్టను, చిన్నయ్య గుట్టలో చిత్రమైన చరిత్ర పేరుతో

భీముణ్ణి గురించి 2011, 2012 సం॥లోనే వార్తా దిన పత్రికలు, తెలంగాణలో కొత్త పర్యాటక స్థలాలు పుస్తకం ద్వారా వెలుగులోకి తెచ్చారు.

ఈ కొండల్లో నాయకపోడ్లు ఆచరించే పూజా విధానం ఎంతో భక్తితో కూడుకొని ఆశ్చర్యం గొలిపే రీతిలో ఉంటుంది. ఈ కొండ గుహల్లోని చిహ్నాలు, ఆధారాలను బట్టి చరిత్ర పూర్వ యుగానికి సంబంధించినవిగా శాస్త్రీయంగా నిర్ధారించినట్లు డా. ద్యావనపల్లి సత్యనారాయణ గారు తన వ్యాసాలలో తెలియజేశారు. పష్కర్ భట్నాగర్ అనే ఒక ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ అధికారి అమెరికా నుండి టైమ్ మిషిన్ను దిగుమతి చేసుకొని, అందులో భారతంలో వివరించబడిన ఖగోళ స్థితి వర్ణనలను పొందుపరచి పాండవులు వనవాసం చేస్తూ దక్షిణాదికి (ఆంధ్రప్రదేశ్‌కి) తెలంగాణకు వచ్చింది సుమారు క్రీ.పూ. 3150 ప్రాంతంలో అని, గుహలలోని పెయింటింగ్స్, చిహ్నాలు 5160 సం॥ల క్రిందటివని తేల్చినట్లు రాశారు.

నాయకపోడ్లు పాడే నివాళి పాటలు లక్ష్మీ దేవర, పాండవులకు చెందినవిగా ఈ క్రింద చూడవచ్చు.

(వరంల్ జిల్లా ఏటూరునాగారం మం. రొయ్యూరు గ్రా. ఆవుల గంగమ్మ పాడిన పాట)

పన్నెండు టంబాల పందిరుల కింద–పంచె రంగుల ముగ్గు బట్టైన పరిచి
పంచె రంగుల ముగ్గు బట్టైన పరిచి–పాండు రాజు గొంతెమ్మ నీకు నివ్వాళి
పాండు రాజు గొంతెమ్మ నీకు నివ్వాళి–పాశం అండిన కుండ పంచన్నా రుచులు
పాశం అండిన కుండ పంచన్నా రుచులు–పాండవుల గన్నాది శ్రీ ఆలా గొంతి
పాండవుల గన్నాది శ్రీ ఆలా గొంతి–గోగు పూవు రథమైన గోచక్రమైన
గోగు పూవు రథమైన గోచక్రమైన–గోపాల కిష్టమ్మ నీకు నివ్వాళి
గోగు పూవు రథమైన గోచక్రమైన–గోపాల కిష్టమ్మ, భూలక్ష్మి నీకు నివ్వాళి
కిష్టమ్మ, భూలక్ష్మి నీకు నివ్వాళి–తెల్లని అశ్వాలు దేవ రథమైన
తెల్లని అశ్వాలు దేవ రథమైన–దేవుడ ధర్మరాజ, చింతేని నీకు నివ్వాళి
ధర్మరాజ, చింతేని నీకు నివ్వాళి–పికిలి కుంచెల రథము పిల్లన కోగిలలు
పికిలి కుంచెల రథము పిల్లన కోగిలలు–భీముడ ఇలనంబి నీకు నివ్వాళి
భీముడ ఇలనంబి నీకు నివ్వాళి–వనమంత కొలుపడిగ అగ్నిశిల రథము

వనమంత కొలుపడిగ అగ్నిశిల రథము–అర్జున్న సుభద్ర నీకు నివ్వాళి
అర్జున సుభద్ర నీకు నివ్వాళి–నెమలి కుంచెల రథము నాగా సారాలు
నెమలి కుంచెల రథము నాగా సారాలు–లకులుడ బొన్నాలి నీకు నివ్వాళి
లకులుడ బొన్నాలి నీకు నివ్వాళి–కాలికి అందైన కంచు రథమైన
కాలికి అందైన కంచు రథమైన–కడగొట్టు సహదేవ చంద్రావతి నీకు నివ్వాళి
కడగొట్టు సహదేవ చంద్రావతి నీకు నివ్వాళి–గోగు పూవు రథమైన గోచక్రమైన
ఒక్కొక్క రుద్రాక్ష పేరు మెడనేసి–ఓరుగంటి శంభుడ నీకు నివ్వాళి

నాయకపోడ్లు నేటికిని తమ ఆచార, సంప్రదాయాల్లో కుల కట్టుబాటుకు ఎక్కువ విలువనిస్తారు. నేటికిని వీరి కుల కట్టుబాటు చెక్కు చెదరలేదు. ప్రతి గూడేనికి కుల పెద్ద ఉంటాడు. కులపెద్దతో పాటు పూజారి, కుల జవాను వుంటారు. ముగ్గురితో కూడిన కుల పెద్దల వ్యవస్థ అన్ని విషయాలలోనూ ప్రధాన పాత్ర వహిస్తుంది. కొర్రాజుల వారు వీరికి అడ్డివారు. పాండవుల కథలను చెప్తూ నాయకపోడులను ఆశ్రయించి జీవిస్తారు. కుల పెద్ద ఆదేశానుసారం పూజారి పెండ్లిళ్ళు, దేవరలు, జాతరలు , కొలుపులు నిర్వహణ చూస్తాడు. కుల జవాను కుల పెద్ద ఆదేశానుసారం పెండ్లికి, చావుకి, పంచాయితీలకు, కొలుపులు, జాతరలు మొ॥ అన్ని సందర్భాలలోను అందరినీ పిలుచుకొచ్చి సమావేశపరుస్తాడు.

పంచ పాండవులను తమ ఇలవేల్పులుగా నాయకపోడ్లు పూజిస్తారు. లక్ష్మీ దేవర, పోతురాజు, ప్రోలయ, సింగబోయుడులను, అడవి దేవతలైన పెద్దమ్మ (వరంగల్ జిల్లాలో పెద్దేవర/దుర్గమ్మ పేరుతో, ఆదిలాబాద్ జిల్లాలో చంద్రమ్మ పేరుతో పులిపై కూర్చున్న స్త్రీ శక్తి స్వరూపాన్ని పూజిస్తారు), గట్టమ్మ, గట్టు ముసలమ్మ, ఎర్రమ్మ, మద్ది రామక్కలను, గ్రామంలోని ముత్యాలమ్మను పూజిస్తారు. లక్ష్మీ దేవర జాతర, కొర్రాజుల (పాండవులనే కొర్రాజులుగా పిలుస్తారు) కొలుపు, పెద్దమ్మ కొలుపుల్లో పాండవులను, నాయక రాజ్యాలు ఏలిన ప్రోలయ నాయకుణ్ణి, సింగబోయుణ్ణ, వీర సైనికుడైన పోతురాజును ఆరాధిస్తారు.

పోతురాజు పాట

పోతురాజు కొడకా పోతు మన్నేడా
పొడల బెల్లందీసి పొద్దాపినాడు

నాగబెల్లం దీసి నన్నాపినాడు
పోతు పోతులరాజు నువ్వేనా
పోతుల్లరాజువి నువ్వేనా
పోతుల్లరాజువి నువ్వేనా
నగురు పోతురాజు నువ్వేనా
పోతుల్ల పోతువై.....
నగురు పోతురాజై........
మట్టి కుండలరాడ నువ్వేనా
మలియేట కాడివి నువ్వేనా
మాయ కుండల కాడ నువ్వేనా
భలె యేటకాడవు నువ్వేనా
సార కుండల కాడ నువ్వేనా
అక్కలకు తమ్ములకు నువ్వేనా
ఆచారమంతుడివి నువ్వేనా ॥పోతు॥

సరియేట కాడివి నువ్వేనా
సాము గరిడీలల్ల నువ్వేనా
సాధనా బోయుడవ్ నువ్వేనా ॥పోతు॥

జమ్మి పాట

జమ్మి రావో జమ్మీ ...వలజమ్మీ కానా
పాండవుల ఆయుధాలు దాసినవూ జమ్మీ
జమ్మి చుట్టూ తిరిగీ దండాలు పెట్టు ॥జమ్మి॥

ఎద్దుతొక్కిన గంట యశోద గంట
ఎప్పటికి తప్పదు పాండవుల పంట
కొర్రల్లు, సామల్లు కొత్తల్లు బెట్టు ॥జమ్మి॥

దుస్సొరి బియ్యంబు గరిసెల్లా తీసి
సన్న వరి బియ్యంబు సంచుల్ల బట్టి
సాగిరీ పాండవులు జమ్మీ తిరునాలకు ॥జమ్మి॥

లక్ష్మీ దేవర పాట

భూసింత పూసిందీ– భూసింత కాసిందీ
పాండవుల భూలక్ష్మి–నీకు నివాళి ॥

చింతాకు చక్కన–చిగురాకు చక్కన
సిరిగల్ల లచ్చిందేవి–నీకు నివాళి ॥

ఆనగాయ బూసిందీ–ఆనగాయ కాసిందీ
ఆనగాయ పువ్వుల్ల–అక్క లచ్చిందేవి
అక్క లచ్చిందేవి–ఆటెంతో చక్కన
గుమ్మడి పువ్వుల్ల–ఏమిట్లా బోలు
కుదుల లచ్చిందేవి–కుంకుమల్లబోలు॥

తియ్యన్నీ తేనెల్లో–కమ్మన్నీ పండ్లల్లో
కానొచ్చే నీరూపు–నీకు నివాళి
కొత్త చీపుర్లు దెచ్చి–కోరికతో ఊడుస్తా
తొల్లీ ముగ్గుల్లు దెచ్చీ–నీ నగురుకే ఏస్తా
కోటాకుపాల ఇస్తర్ల–కొత్తల్లు నే పెడతా॥

గోగు పువ్వు రతమైన–గోచక్రమైన
గోపాల క్రిష్ణయ్య–నీకు నివాళి ॥

అందరు దేవుళ్ళను ఒకే చోట చేర్చి ఒకేసారి చేసే వేడుకనే కొలుపుగా పిలుస్తారు. కొర్రాజులు, పెద్దమ్మ కొలుపుల్లో అడవి నుండి సంద్ర చెట్లను రాజు సరువు, పోతురాజు సరువును తెచ్చి అగ్ని గుండాలుగా తయారుచేసి అగ్ని (నిప్పుల) గుండాలపైనుండి నడిచి దేవరలకు తమ భక్తి, విశ్వాసాన్ని చాటుతారు. భీమన్న జాతరను ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలో ఎంతో భక్తితో, సంతోషంతో జరుపుకుంటారు. ఈ జాతరలు, కొలుపులలో మేకలు, కోళ్ళను కోసి బలియిస్తారు. ఈ కొలుపు జరిపే సమయంలో ప్రతి ఒక్కరూ చాలా ఉత్సాహంతో పాల్గొని డోళ్ల దరువులతో నృత్యాలు చేస్తారు. ఈ నృత్యాలలో అడవిలోని జంతువులను, పక్షులను అనుసరించి నృత్యం చేయడం ఒక వేడుక. అనాది కాలంనుండి మూడు యేండ్లకు ఒకసారి జరుపుకుంటారు. కొలుపులు, జాతరలు జరిపే సమయంలో దేవర్లను ఎత్తుకొని, జంతువుల ముఖతొడుగులను తగిలించుకొని నృత్యం చేస్తారు. కొర్రాజులు, పెద్దమ్మ కొలుపుల్లో అగ్ని గుండాలపై

నుండి నడిచి దేవరలకు, నాయక రాజ్యాలు ఏలిన రాజులకు తమ భక్తి విశ్వాసాన్ని చాటుతారు.

ప్రతి మూడు యేండ్లకు ఒకసారి ఖమ్మం జిల్లా ఏజన్సీలోని వి.ఆర్. పురం మండలం, రేఖపల్లి గ్రామంలో కొర్రాజుల కొలుపు ఆదిమ తెగల వారైన నాయకపోడ్లు, కొండరెడ్లు ఎంతో వేడుకగా తమ కుల దైవాలుగా కొలిచే పంచ పాండవులను కొర్రాజుల కొలుపు పేరుతో ఎంతో భక్తిగా ధూప, దీప, నైవేద్యాలతో మేళ, తాళాల మధ్య ఆట, పాటలతో కొలిచి అగ్ని గుండాలపై నుండి నడిచి తమ విశ్వాసాన్ని ప్రకటించి తమకు ఎలాంటి ఆపదలు రాకుండా కాపాడాలని కోళ్ళు, మేకలను బలి యిచ్చి మొక్కుబడులుగా చెల్లిస్తారు. ఈ కొలుపు జరిగే సమయంలో దూర దూరాలలో వున్న తమ బంధువులనందరినీ పిలుచుకుంటారు. కొత్త బట్టలు కొనుక్కుంటారు. కొలుపు పదకొండు (11) రోజులు జరుగుతుంది. కొలుపు మొదలు పెడుతున్నట్లుగా మొదటి రోజు జెండా ఎత్తుతారు, దేవరలను నగురుకు చేరుస్తారు. పదకొండవ రోజున ఉదయం కర కర పొద్దు పొడిచేటపుడు కొండాలు (అగ్ని గుండాలు) తొక్కడంతో పూర్తి అవుతుంది. కొలుపు జరుగుచున్న ప్రతి రోజు మువ్వ, రుంజ, సన్నాయి, డోలు లాంటి వాయిద్యాలతో దేవరల వేడుకలమధ్య పిల్లలు,యువకులు, పెద్దలు నృత్యాలు చేస్తారు. ముఖ్యంగా స్త్రీలు అడవినుండి తెచ్చిన చెమ్మకాయలతో శబ్దంచేస్తూ అడుగు, అడుగు కలుపుతూ ఆడతారు. గణాచారులు సిగమొచ్చి (పూనకం) ఊగడం, గాలి,ధూళి, పీడ, పిశాచి పట్టినవారికి భండారి (పసుపు బొట్టు) పెట్టి వీరతాడుతో కొట్టి దేవుని వాక్కులు పలుకుతారు.

ఆదిలాబాద్, నిజామాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో భీమన్నను కొయ్యతో చేసిన గజాల రూపంలో కొలుస్తూ జాతరలు నిర్వహిస్తారు. ఆదిలాబాద్ జిల్లాలోని దండెపెల్లి మండలంలో పెండ్లిమడుగు, ఊట్ల దగ్గర పెద్దయ్య, లక్సెట్టిపేట మండలంలోని చిన్నయ్య గుట్టల్లో పాండవులను కొలిచే నాయకపోడుల పూజా విధానం ఎంతో పురాతనమైనది. అరణ్యవాసకాలంలో పాండవులు ఈ ప్రాంతంలో నివసించారనడానికి ఎన్నో సాక్ష్యాధారాలున్నాయి. నేటికిని ఇక్కడ నాయకపోడు పూజారులచే నిత్యం పూజలందుకోవడం విశేషం.

పెద్దయ్య, గుట్ట చిన్నయ్య గుట్టల్లో ధర్మరాజును భీముణ్ణి, అర్జున్ లొద్దిలో అర్జునుణ్ణి నాయకపోడ్లు ఆదిమకాలం నుండి కొలుస్తున్నారు. చంద్ర వంక, సూర్యుణ్ణి

కాషాయ రంగుతో ముద్రించిన తెల్లని జెండాలను ఎగురవేసిన గజాలు ఇల్లార్ల ముందు పాతి ఉంటాయి. పూజా విధానం ఎంతో పురాతనమైనది. దేవుణ్ణి ఉంచే గుడశెతో ఉండే ఆలయాన్ని ఇల్లారిలని మరికొన్ని ప్రాంతాల్లో నగురు అని నాయకపోడ్లు పిలుస్తారు. నాయకపోడు పూజారులు చెట్ల కొమ్మలతో ఇల్లారిని ఊడ్చి బండారి బసంతం (పసుపు నీళ్ళు) ఇల్లారి, రాజుల బండ, చుట్టు పక్కల జల్లి, మూడు రకాలు బియ్యపు పిండి, పసుపు, కుంకుమలతో పట్నం ముగ్గు వేస్తారు. పూజారి నోటికి వాసన గట్టి అంటే రుమాలుతో నోరు, ముక్కు, చెవులను కప్పివుండేటట్టు కట్టుకొని నోటి, ముక్కు శ్వాస తగులకుండా బెల్లం, బియ్యం (పూర్వం జొన్నలతో చేసేవారు) పాలతో పాయసం వండి 5 పారుటాకులలో ఉపారాలు పెడుతారు. రూపంవేసి వీరగొల (వీరతాడు/అలుగుతాడు) చేతబూని పూనకంతో (ఉగ్రం, శిగం) నిటారుగా వున్న పెద్దయ్య గుట్టను పరుగుతో ఎక్కుతాడు. ఎంతెంతో దూరాలనుండి వచ్చిన భక్తులు చప్పట్లతో పెద్దయ్య దేవుడ గోవిందా అని పెద్దగా అరుస్తుంటారు. గుట్టను ఎక్కి దిగి వచ్చేటపుడు గుట్ట మధ్య భాగాన, చివరకు చేరిన తర్వాత రెండుసార్లు మాత్రమే కన్పిస్తాడు. సుమారుగా 300 మీటర్ల ఎత్తున తల ఎత్తి చూస్తే రుమాలు జారిపడే అంత నిటారుగా వున్న పెద్దయ్య గుట్టను అరగంట వ్యవధిలో ఎక్కి దిగి వస్తాడు. పెద్దయ్య గుట్టపైన దేవ గణికెలతో (దేవకన్యలు) మాట్లాడి అన్ని విషయాలు తెలుసుకొని భక్తుల కోర్కెలకు అభయమిచ్చి సందేహాలు తీర్చి బండారిని ఇస్తాడు.

చిన్నయ్య గుట్టల్లోని అద్భుతాలు నమ్మశక్యంగాకుండా వుంటాయి. భీముడినే చిన్నయ్య, బొజ్జలయ్య, ఎల్లయ్య పేర్లతో భక్తితో పిలుచుకుంటారు. లక్సెట్టిపేట మం॥లోని చెల్లంపేటకు దగ్గర అడివిలో ఒక కి.మీ. దూరంలో చిన్నయ్య వాగు భీముని గుండం, పెండ్లి మడుగు కన్పిస్తుంది. మూడు కి.మీ.ల దూరంలో చిన్నయ్య గుట్ట వద్ద చిన్నయ్య ఇల్లారి ఉంటుంది. ఈ ఇల్లారిలో కొయ్యతో చేసిన, ఇత్తడితో చేసిన గజాలుంటాయి. గజాలపై భీముడు, ఇలనంబి (హిడింబి)ల బొమ్మలు చెక్కి ఉంటాయి, అలాగే ఘటోత్కచుణ్ణి ఎత్తుకున్న హిడింబి బొమ్మలను చూడవచ్చు. ఇంకా ఏనుగులు, పెద్ద పులులు, అశ్వాలు మట్టితో చేసినవి కోర్కెలు తీరిన భక్తులు చేయించి తెచ్చి పెట్టి తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఇల్లారికి 15 మీటర్ల దూరంలో రాజుల బండ వద్ద శూలాలు, బరిశెలు, కత్తులు నిలబెట్టబడి వుంటాయి.

ఇల్లారికి వెనుక గల గుహలో ఉయ్యాల పందిరి మంచం, గదా శూలాలు మరికొన్ని బొమ్మలు చిత్రించినవి చూడవచ్చు. ఇవి మామూలుగా కనిపించవు. దివిటీలు

లేదా టార్చి లైట్ల వెలుతురుతో పూజారి సలహాతో మాత్రమే గుహలోకి వెళ్ళగలము. ఇల్లారినుండి ఇంకా గుట్టపైకి కొంత దూరం వెళితే అక్కడ భీముడు వ్యవసాయం చేసిన గొర్రు బండలు, పందుల అడుగులు రాతిలో కన్పిస్తాయి. ఇంకొంచెం ఒక కి.మీ. ముందుకు వెళ్ళితే మరొక అద్భుతం కుండ లొద్ది. చప్పట్లకు నీళ్ళు రాలే మంచుకొండలు. లొద్దిలోనికి దిగి చప్పట్లు కొడితే నీళ్ళు జల జల రాలుతాయి.

నాయకపోడ్లు రాజుల బండ వద్ద శూలాలు, బరిశెలు, కత్తులు మొదలగు ఆయుధాలుంచి నాయక రాజ్యాలు ఏలిన రాజులకు కోళ్ళు, మేకలను కోసి నైవేద్యం పెట్టి తమ భక్తిని, విశ్వాసాన్ని ప్రకటించి తమను చల్లంగా కాపాడాలని మొక్కడం ఆచారం. అన్ని కులాల వాళ్ళు ఇక్కడికి వచ్చి పెద్దయ్య దేవుణ్ణి తమను చల్లంగా కాపాడాలని, కోర్కెలు తీర్చాలని మొక్కుతారు. కోర్కెలు ఫలించినవారు శూలాలు, బరిశెలు, అశ్వాలు, ఏనుగుల బొమ్మలను మట్టితో తయారు చేసినవి లేదా ఇనుముతో తయారు చేసినవి పెట్టి కోళ్ళు, మేకలను కోసి మొక్కులు చెల్లించుకుంటారు. పూజారి మంత్రించి ఇచ్చిన బండారిని, పెద్ద గుండంలోని నీటిని తీసుకెళ్లి తమ ఇండ్లలో, పశువులు, పంట పొలాలపై చల్లుకుంటారు.

ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్‌లోని మెట్‌పల్లి ప్రాంతాలలోని నాయకపోడ్లు భీమన్న జాతరలు నిర్వహిస్తుంటారు. అరణ్యవాస కాలంలో భీముడు తమ ఇంటి ఆడబిడ్డ అయిన హిడింబిని పెండ్లాడినట్లు పూర్వికులు, కొర్రాజుల వారి కథల్లో చెప్పుకుంటారు. చిన్నయ్య గుట్టలో భీముడు ఏదులతో (అడివి దున్నలు) వ్యవసాయం చేసిన గొర్రు బండల ఆనవాళ్ళు నేటికిని కన్పిస్తాయి. నాయకపోడుల పూర్వికులకు పోడు వ్యవసాయంలో మెలకువలు నేర్పించినట్లు, వినని వారిని తుంగ మడుగులో వేసి తొక్కి దండించినట్లు కొర్రాజుల వారు కథ చెప్పేటప్పుడు హాస్యంగా వల్లించేవారు. భీమన్న జాతరలలో భీమునికి హిడింబికి పెండ్లి చేసి తలంబ్రాలు వేసి అగ్ని గుండాలపై నడుస్తారు. తప్పెట్లు, పిల్లనగోవుల చప్పుళ్ళతో నృత్యాలు చేస్తారు. వేడుకల అనంతరం అందరూ భోజనం చేసి వెళతారు.

అర్జున్ లొద్దిలో అర్జునుని గుహలోని రాతి అద్భుత విశేషాలు

1. మైసమ్మ గుండు
2. కొండలోని అర్జునుని గుహ

3. గుహ లోపలి సొరంగ మార్గం

4. మెరుపు గుండు

5,6, 7. గుహ పై భాగంలోని కిరీటాలు

8. పాలు కారే గంగావు పొదుగు.

పెద్దయ్యగుట్టకు ఉత్తరం వైపున కొండ అవలి పక్కన సుమారు 2 కి.మీ దూరంలో తిర్యాణి మండలంలో అర్జున్ లొద్ది ఉంటుంది. ఈ లొద్దికి తూర్పున, దక్షిణాన పూర్తిగా అర్జున గుట్ట, దక్షిణం గుట్ట అవలి వైపున పెద్దయ్య గుట్ట. ఉత్తరం ప్రక్కన పంటచేలు పడమర వైపున తిర్యాణి నుండి వచ్చే కచ్చా రోడ్డు. అర్జున్ గుట్టకు దగ్గరగా నాయకపు గూడ కొంచెం ఈవల కొలాం గూడలు కల్సుకొని ఉంటాయి.

అర్జున్ లొద్దికి ఒక ఫర్లాంగు దూరం నడువగానే కుడి చేతి పక్కన గల ఏనె (గట్టు) దాటగానే రెండు గుట్టల మద్యన పల్లపు ప్రదేశంలో పంట పండిన వెదురు వొడ్లు గల కంక బిడాలు, టేకు చెట్లు దాటుతూ కొంత దూరం పోగానే మహా ప్రాకారాల లాగా నిలిచి వున్న అర్జునుని గుహ కొండ ముందు నుండి పారే వాగు కలుస్తుంది. వాగు ముఖద్వారంలో మైసమ్మ గుండుగా కొలిచే పెద్ద బండ ఎదురౌతుంది. కుడి వైపున వంద మీటర్ల ఎత్తుకు పైబడిన ఎత్తులో మహా ప్రాకారం లాంటి కొండలో అర్జునుని గుహ ఉంటుంది. గుహముందు నుండి పారే వాగులో తొలి గుండం, పాలగుండంగా రెండు మడుగులు కన్పిస్తాయి.

గుహ వద్ద చంద్ర వంక, సూర్యుని బొమ్మలతో రంగులద్దిన తెల్ల జెండాలు ఎగురవేసిన గజాలలుంటాయి. గజాల నుండి 5 అడుగుల పైన గుహకి 10 అడుగుల కింద వున్న రాజుల బండ. అతి కష్టంగా గుహలోకి చేరుకున్న తర్వాత చిమ్మ చీకటిగా ఉన్న గుహలో దివిటీలు లేదా టార్చిలైట్ల వెలుతురు సహాయంతో రెండున్నర అడుగులు మాత్రమే ఎత్తుండే సొరంగం ద్వారా నాలుగు అడుగులు పాకుతూ లోనికి పోవాలి. గుహలో మెరుపు గుండు అర్ధ చంద్రాకారంలో గుహలోని ఎడమ ప్రక్క గోడకు అతుక్కొని 8 అడుగుల ఎత్తుతో 3 అడుగుల వెడల్పుతో నిలబడి ఉంది. ఈ మెరుపు గుండు గోరంత చిన్న చిన్న స్ఫటికాల సైజులో ముత్యాల తెలుపుతో ధగ ధగ మెరుస్తున్నది. ఇది రాతి లేదా లోహ సంబంధమైనదా, ఈ గుహ అంతర్భాగంలో ఎలా ఏర్పడింది అనేవి నిపుణుల పరిశోధనల ద్వారా తెలియవలసివున్నది.

గుహ పైకప్పులో రాతిలో కిరీటాలుగా పిలిచే ఆకారాలు 5 కానవస్తాయి. వీటిని పాండవుల కిరీటాలుగా నాయకపోడ్లు పిలుస్తారు. 5 అడుగులు ముందుకు కదిలి ఎడమ వైపునకు తిరిగి చూస్తే 5 అడుగుల ఎత్తులో ఇంకొక సొరంగంలోకి టార్చి లైటు ఫోకస్ చేసి చూస్తే రాతి ఆవు పొదుగు రూపం కన్పిస్తుంది. ఆదివాసులు గంగావు పొదుగు అని పిలుస్తారు. ఈ గంగావు పొదుగు నుండి పాలు కారుతాయని కూడా చెప్పడం విశేషం. పొదుగు తడిగా ఉండటాన్ని పరిశీలనగా చూడొచ్చని చెప్తారు. ధైర్యం చేసి గుహలోకి వచ్చినవాళ్ళు చేయి చాపుతారని ఎవరిచేతిలోనైనా పాల బొట్టు పడితే అదృష్టంగా భావిస్తారట.

మిర్గ (మృగశిర కార్తె) పూనంగానే ఎడ్ల బండ్లు కట్టుకొని ఇక్కడికి వచ్చి వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని, పిల్లా జెల్లా, గొడ్డు గోదలను క్రూర మృగాల బారినుండి, రోగాల బారినుండి చల్లంగా కాపాడాలని మొక్కుకుంటారు. రాజులు బండ వద్ద దీపం (జ్యోతిని) వెలిగించి, ధూపం వేసి కొబ్బరి కాయలు కొడతారు. పాలు నైవేద్యం పెట్టి, తాము తెచ్చిన కోడి పుంజులు లేదా మేకలను జడతా పడతారు. దేవుడికి తమ పట్ల దయ వున్నట్లైతే మేకలు నిండార్లుగా జడతా ఇస్తాయని, కోడిపుంజులు కొరుకు ముడతాయని నాయకపోడు ఆదివాసులు ప్రబలంగా విశ్వసిస్తారు. కొంత మంది తమ కోర్కెలు నెరవేరినట్లైతే రాజులు ఎక్కిపోయే అశ్వాన్ని మట్టి, ఇనుము లేదా ఇత్తడిది చేయించి పెడతారు.

రాజుల బండ వద్ద జడతా పట్టిన కోళ్ళు, మేకపోతులు గజాల వద్దకు తీసుకొచ్చి కోసి నెత్తురు ఎర చూపిస్తారు. అనంతరం కోసుకొని వంటలు చేసుకుంటారు. తాము కొలుస్తున్న దేవరలను ఆత్మసాక్షిగా విశ్వసిస్తున్నట్లు గజాలను పాతి తెల్లటి జెండా మధ్యలో చంద్ర వంకను ముద్రించి లేదా కుట్టించి ఎగురవేస్తారు. కురుక్షేత్ర యుద్ధంలో కౌరవులపై గెలిచిన పాండవులు చేసిన దిగ్విజయ యాత్రలో సహదేవుడు అశ్వాలపై ఈ ప్రాంతానికి వచ్చినట్లు, విజయ కేతనంగా వెండి గొడుగులను, తెల్ల జెండాలను అశ్వాలపై ఎగురవేసి విజయ యాత్రను జరిపి వుండవచ్చు.

ఇక్కడికి వచ్చి దర్శించుకున్నవారు వాగులోని పాలగుండంలోని నీటిని పవిత్రమైనవిగా భావించి తమతో తీసుకెళ్తారు. గంగావు పొదుగు నుండి పాలబొట్టు చేతిలో పడినవారు పాలగుండంలోని నీటిలో కలుపుకొని మరీ తీసుకెళ్తారు.

రోగాల బారిన పడకుండా పశువులపై, చీడ పీడల బారిన పడకుండా పంటచేలపై చల్లుకుంటారు. పంటలన్నీ ఇంటికి చేరిన తర్వాత తమకున్న వీలుని బట్టి తిరిగి దేవుణ్ణి దర్శించుకుంటారు.

ఇంకొక విశేషమేమంటే అర్జునుని గుహలోనుండి సామ్‌గూడ, ఊట్ల నాయకపోడుల గూడెం దగ్గరిలోని కాంచన బావి దగ్గర వరకు సొరంగం ఉన్నట్లుగా స్థానికులు చెప్తున్నారు. ఈ కాంచన బావి విశేషాలను డా. ద్యావనపల్లి సత్యనారాయణ గారు తన పరిశోధనాత్మక రచనలలో కొన్ని సం॥ల క్రిందటే తెలిపారు. తెలంగాణలోని చరిత్రలు, విశేషాలు, అద్భుతాలనెన్నింటినో వెలికితీసి ప్రపంచానికి చూపించిన డా. ద్యావనపల్లి సత్యనారాయణ గారిని అర్జున్‌లొద్ది లోని అద్భుతాలను వారి వివరణాత్మక సందేశంతో ప్రపంచానికి తెలియజేయాలని కోరుతున్నాను.

తిర్యాణి మండలంలోని గోవెనలో గోనయ్య గోరి కలదు. పాండురాజునే గోనయ్యగా పిలుస్తారు. పాండురాజు సమాధి దుర్భేద్యమైన కొండల మధ్యన పెద్ద పులులు సంచరించే ప్రాంతంలో ఉంటుంది. ఈ సమాధి వద్ద నాయకపోడ్లు పూజలు చేస్తారు.

గాంధారి ఖిల్లా

మందమర్రి మండలంలోని బొక్కతగుట్ట గ్రామం నుండి 10 కి.మీ.ల దూరంలో గాంధారి ఖిల్లా ఉంటుంది. ఈ ఖిల్లాలో నాయకపోడ్లు పూజలు ఆచరిస్తున్నారు. ఖిల్లాలోనికి చిన్న దర్వాజ నుండి ప్రవేశించి 400 మీటర్ల దూరం పోయాక పెద్ద దర్వాజ వస్తుంది. పెద్ద దర్వాజ 10 అడుగుల వెడల్పు ఉండి సుమారుగా 18 నుండి 20 అడుగుల ఎత్తున ఉంటుంది. చిన్న దర్వాజ నుండి 100 మీటర్ల దూరంలో రాతిలో చెక్కిన ఏనుగు బొమ్మ 5 అడుగుల ఎత్తులో కన్పిస్తుంది. అలా ముందుకు వెళ్తే పెద్ద దర్వాజ దర్శనమిస్తుంది. లోనికి వెళ్ళక ముందే దర్వాజ కుడి పక్క రాతి గోడలో చెక్కిన ఎనిమిది అడుగుల మైసమ్మ విగ్రహం ఉంటుంది. దేవర్ల పున్నమకు నాయకపోడ్లు మైసమ్మ దగ్గర పట్నం (మూడు రకాల ముగ్గుతో) వేసి మేకపోతులను బలి ఇస్తారు. మొక్కులు ఉన్నవారు అశ్వాలు, ఏనుగులు మట్టితో, ఇనుముతో చేసినవి సమర్పిస్తారు. ఖిల్లా లోన పెద్ద బావి, సముతుల బావులుంటాయి. మైసమ్మ దగ్గర మొక్కులు చెల్లించుకొని వచ్చి గుట్ట కిందికి దిగి వచ్చి భోజనాలు వండుకొని తిని వస్తారు.

కరీంనగర్ జిల్లాలో గొంతెమ్మ కొల్లు , పాండవుల పాదాలు, నైన గుళ్ళు

కాటారం మం॥ ప్రతాపగిరి గ్రామంలో ప్రతాపగిరి గుట్టకు గొంతెమ్మ కొల్లు అనే నీటి గుంట వద్ద పూర్వికుల కాలం నుండి నాయకపోడ్లు పూజలు చేస్తుంటారు. కుంతీ దేవినే గొంతెమ్మ పేరుతో పిలుస్తారు. విత్తనాలు వేసిన తర్వాత పైరు పూత, కాతకు వచ్చే సమయంలో (సమారుగా ఆగష్టు నెలలో) పూనకం వచ్చిన పూజారులు దేవుణ్ణి కలుపుకొని మంచిరోజు సెలవిస్తారు. డప్పు చప్పుడ్లు, మేళ తాళాలతో లోఈమ దేవరను, పాండవుల ముఖతొడుగులను ధరించి ఆట పాటలతో గుట్టలోని కొల్లు దగ్గరకు వెళ్ళి పసుపు కుంకుమలు, పాలతో వండిన నైవేద్యం సమర్పించి డప్పులు, మేళాల హోరులో పెద్దగా అరుస్తూ చప్పట్లు కొడుతూ కేకలు వేస్తూ ఆరంభం చేస్తారు. కొల్లు గుంటలో ఎప్పుడూ చిలప చిలపగా వుండే నీరు పొంగి బయటకు పొర్లుతుంది. ఎంత పెద్ద ఎత్తున శబ్దం చేస్తే అంతగా నీరు బయటికి పొంగి పారుతుంది. ఈ నీటిని తీసుకొచ్చి చీడ పీడల బారిన పడకుండా తమ పంట చేన్లపై, రోగాలు రాకుండా పశువులపై, శుభం జరగాలని ఇండ్లపై చల్లుకుంటారు. ఇది అనాది కాలంనుండి చేస్తున్న పూజ. ఆ రోజును తెలుసుకొని ఇక్కడికి అన్ని కులాల వారు వచ్చి నీటిని తీసుకెళ్తారు.

మల్హార్ మండలం పి.వి.నగరం గ్రామంలో మానేరు ప్రక్కన పాండవుల లొద్దిలో నైన గుళ్ళు ఉన్నాయి. ఈ గుళ్ళలో పురాతన పెయింటింగ్స్ ఉన్నట్లు అక్కడి నాయకపోడ్లు చెపుతుంటారు. ఒక గుడిలో తుంగ దూలం సమారు 10 అడుగుల పొడవు, ఒక అడుగు లావుతో వుండేదట. అది వేల ఏండ్ల క్రిందటిది కావడం వలన చదలు పట్టి పోయిందని చెపుతారు. ఆ దూలపు ఆనవాల్లు ఇప్పటికి కన్పిస్తాయని కూడా స్థానిక నాయకపోడు పెద్దలు చెపుతారు. ఆ ప్రక్కననే కాపురపు ఖిల్లాగా పిలువబడే గుట్టల్లో ఇప్పటికి మల్లె చెట్లు ఉన్నట్లు చెపుతారు. ఈ నైన గుళ్ళ దగ్గరవున్న రెండు గుట్టలను భీముడు అర్థరాత్రి వేళ రెండుగా చీల్చిన చీపురు పుల్లకు తగిలించుకొని మానేరు నదికి అడ్డంగా వేయడానికి తెచ్చేటపుడు శ్రీకృష్ణుడు కోడి పుంజై కూయడంతో ఆ గుట్టలు అక్కడే ఆగిపోయాయని కథలు కథలుగా చెపుతారు. ఇక్కడే పాండవుల బండపై పాండవుల పాదముద్రలున్నాయి. ఈ పాదముద్రలు ఆదిలాబాద్ వైపు పయనించినట్లుగా చూపిస్తాయి. మంథని మండలంలో లంజమడుగు వద్ద భీముని పాదం బాగా పేరులోకి వచ్చింది. వీటిపై ఇంకా పరిశోధన జరుగవలసి ఉన్నది.

వరంగల్ జిల్లాలో ములుగులో గట్టమ్మ వద్ద, మంగపేట మండలంలో హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి వద్ద పూజలు:

ములుగుకు రెండు కి.మీ.ల దూరంలో ప్రధాన రహదారిపై గట్టమ్మ ఆలయం వుంది. దుర్గమ్మను నాయకపోడ్లు తరతరాలుగా కొలుస్తున్నారు. సుమారు 30 సం॥ల క్రితం వరకు కూడా ములుగులో నాయకపోడ్లదే జనాభా ఎక్కువగా ఉండెడిది. గిరిజనేతర వలసలు పెరిగిపోయి తమ భూములను కోల్పోయి ఊరి మధ్యన వున్న నాయకపోడ్లు ఊరి చివరన ఇరుకు సందుల ఇండ్లలో జీవిస్తున్నారు. నాయకపోడులే పూజారులు. సుమారు 50 సం॥ల క్రితం గట్టమ్మ కొండ దిగువ భాగంలో చేన్లలో వుండేది. పూర్వపు ఎడ్ల బండ్ల దారుల్లో ఉన్న గుట్ట దిగువ నుండి ఆకుల నర్సయ్య అనే నాయకపోడ్ కుల పెద్దమనిషి ప్రస్తుతం వున్న విగ్రహాన్ని కూడా చేయించి రోడ్డు ప్రక్కకు తెచ్చి పూజలు చేశాడు. నాయకపోడ్లు ప్రతి ఇంటిలో దుర్గమ్మను కొలుస్తారు. గట్లల్లో వుండడం వలన గట్టమ్మగా పిలువబడుతున్నది. గట్టమ్మ ప్రక్కననే సమ్మక్క సారక్కల గద్దెలను కూడా నిలుపుకొని పూజిస్తున్నారు. సమ్మక్క సారక్క జాతరకు వెళ్ళే భక్తులు ముందుగా గట్టమ్మను దర్శించుకొని మేడారం వెళ్తారు. ప్రతి రోజు రోడ్డుపై వెళ్ళేవారు గట్టమ్మ దగ్గర ఆగి దర్శించుకున్న తర్వాతే ముందుకు వెళ్తారు.

మంగపేట మండలం మల్లూరులోని హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి భక్తుల కోర్కెలు తీర్చే దైవంగా పూజింపబడుతున్నాడు. ఈ ఆలయం ఎంతో పురాతన చరిత్ర కలిగియున్నది. నాయకపోడు కుల పెద్దలు, ప్రస్తుత పూజారులు చెప్తున్న కథనం ప్రకారం నాయకపోడ్లే పూజారులు. ఈ ఆలయం పైభాగంలో వున్న కోటను పద్మనాయక రాజులు ఏలినట్టు ఆలయంలో వున్న దేవతా ప్రతిమల భంగిమలు, ఆలయ గోడలపై పురాతన లిపిలో వున్న రాతలనుబట్టి చరిత్రకారులు, ఇక్కడి పూజారులు చెప్తున్న విషయాల ద్వారా తెలుస్తున్నది. ఈ ఆలయ నిర్మాణాలు తమ పూర్వికులే చేసినట్లుగా కూడా చెపుతారు. మేకలు కాసుకొని జీవించే ఒక నాయకపోడికి స్వప్నంలో దేవుడు కన్పించి తాను ఈ గుట్టలో ఎలిశానని (వెలియడం) తనకు ఆలయం నిర్మించి ఏలుకున్నట్లైతే మీకు మేలు జరుగుతుందని తెలియజేసినట్లు, అతను ఈ విషయాన్ని తనవారితో చెప్పి స్వప్నంలో చెప్పిన చోట తవ్వడం మొదలుపెట్టాడు. తవ్వేటపుడు గడ్డపార స్వామీ వారి నాభిలో దిగబడిందని, అందుకే స్వామీ వారి నాభినుండి నేటికీ రక్తం కారుతుంది. అప్పటినుండి నాయకపోడ్లు దేవుణ్ణి కొలుస్తున్నారని పూజారులు కూడా తెలియజేస్తున్నారు. ఆ తర్వాత కాలంలో పద్మనాయక రాజులు ఇక్కడ ఆలయ

నిర్మాణం చేశారు. నాయకపోడులనే నాయకులుగా పిలుస్తారు. నలుగురిని పూజలు చేయడానికి, నలుగురిని స్వామివారి ఆలయం శుభ్రం చేయడానికి, నలుగురిని కోనేటినుండి నీళ్ళు తేవడానికి మరొక నలుగురిని కట్టెలు తేవడానికి నియమించారు. మొత్తంగా 16 మందిని నియమించి వీరిపై ఒక దండ నాయకుణ్ణి నియమించారు. ఈ ఆలయంలో సేవలు చేయడానికి నాయకపోడులకు నిజాం నవాబు తామ్ర, వెండి సిక్కాలు కూడా ప్రదానం చేశాడు. నాయకుల మాన్యంగా పిలువబడే భూములను మల్లూరు, శనిగకుంట కొన్ని చెరువుల క్రింద వీరికి కేటాయించారు. ఈ సిక్కాలు నేటికి నాయకపోడ్ల దగ్గర నిదర్శనంగా లభిస్తాయి.

కాల క్రమంలో నాయకపోడ్ల సేవలో నుండి బ్రాహ్మణ పూజారుల చేతుల్లోకి మారిపోయింది. అటవీ జీవనం గడిపే నాయకపోడ్లు మాంస ప్రియులు. వేటకు వెళ్ళిన నాయకపోడ్లు మనుబోతు మాంసం, రక్తం మరకలతో వచ్చి పూజలు చేయడాన్ని కొంతమంది తప్పుగా ఉదహరించడం వలన అప్పటినుండి పూజలు మానుకొని కేవలం సేవకులుగా మిగిలారు. అభివృద్ధి చెందుతున్న క్రమంలో గుడి నియామకాల్లో గిరజనేతరులు తమ పలుకుబడిని ఉపయోగించి ఈ ఆలయ కమిటీల్లోకి ప్రవేశించారు. చదువు, తెలివి, బలంలేని నాయకపోడ్లు సిక్కాలు, చరిత్రలు ఎన్నివున్నా కొద్దిమంది మాత్రమే సేవకులుగా మిగిలారు. ఎన్నెన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి.

ఈ గుడికి దిగువన నాయకపోడ్లు నివసించే లక్ష్మీపురం అనే గ్రామం ఉండెడిది. సుమారు 60సం॥ల క్రితం వరకు కూడా ఇక్కడే వుండేవారు. భారత స్వాతంత్ర్య పోరాట సమయంలో నిజాం నవాబుకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు జరిపిన పోరాట సందర్భంలో రజాకార్ల భయానికి లక్ష్మీపురంను వదిలి గుట్టదిగి మల్లూరులో నివాసముంటున్నారు. వీరు నివాసమున్న చోట చింత చెట్లు, మల్లెచెట్లు పాతపాదు (లేచిపోయిన ఊరు) ఆనవాళ్ళు కన్పిస్తాయి. నాయకపోడ్లు కొలిచే లక్ష్మీదేవర నగురు (ఇల్లారి) గుట్టప్రక్కన ఇప్పటికీ కన్పిస్తుంది. వరంగల్ జిల్లాలో 23 లక్ష్మీదేవర నగుర్లు వీరి గూడేలలో ఉన్నాయి.

ఖమ్మం జిల్లాలో అక్షరాల లొద్దిలో పూజలు

ములకలపల్లి మండలంలోని నల్లమూడి గ్రామం వద్ద అక్షరాల లొద్దిలో గల అతి పురాతన గుహలలో నాయకపోడ్ల పూజలు పూర్వికుల కాలంనుండి కొనసాగిస్తున్నారు.

అరణ్యవాస కాలంలో ఇక్కడ వున్న గుహలలో పాండవులు నివాసమున్నట్లు చెపుతారు. ఈ గుహలను నాయకపోడ్లు భవంతులుగా పిలుస్తారు. కొండ ముందు బాగంలో 30 అడుగుల పొడవుతో, 15 అడుగుల ఎత్తులో పందిరిలాగా (పోర్టికో) ముందుకు చొచ్చుకొని వచ్చిన రాతి నిర్మాణంలో పురాతన పెయింటింగ్స్ కన్పిస్తాయి. ఈ పురాతన పెయింటింగ్స్‌నే నాయకపోడ్లు అక్షరాలుగా పిలుస్తారు. అక్షరాల లొద్దిని ప్రముఖ చరిత్రకారులు శ్రీ ద్యావనపల్లి సత్యనారాయణ గారు దర్శించి విశ్లేషించారు. ఫిబ్రవరి 2015లో ఈ రాతి చిత్రాలపై ఖమ్మం జిల్లాలో అతి ప్రాచీన రాతి చిత్రాలు, ఖమ్మం జిల్లాలో అరుదైన రాతి చిత్రాలు పేరున వార్తా పత్రికలలో కథనాలు అచ్చువేయబడినాయి. పైన భవంతులలో (గుహలలో) మూడు తూర్పు వైపున ఉండగా రెండు భవంతులు కొండ పడమర వైపున ఉంటాయి. వీటికి దగ్గరగా కోనేరులో స్వచ్ఛమైన నీరు పుష్కలంగా వుంది. ఈ కోనేరు చాలా లోతుగా రెండు నిలువుల పైబడి ఉంటుంది.

ఆవిటి, మొదగల నాయకపోడ్లు ఇక్కడికి వచ్చి పాండవులకు పాలు పొంగించి పాయసం వండి నైవేద్యం పెడతారు. చుట్టు పక్కల గ్రామాలలోని ఇతర రైతులు పాలు, బెల్లం ఇచ్చి వీరికి సహకరిస్తారు. కన్నె పిలగాండ్లతో పంచ పాండవులకు గోవింద కొట్టిస్తారు. అప్పుడు పాండవుల శిరసులు కన్పిస్తాయని చెపుతారు. ఇక్కడ ఎంతో నిష్ఠతో పూజలు చేస్తారు. లొద్దిలో పూజలు చేసి ఇండ్లకు చేరుకునే లోపుననే కుంభ వర్షం కురిసేదని చెప్తుంటారు. అది పాండవుల సత్యంగా నేటికీ భావిస్తారు. అంటు, ముట్టు లేదా చుట్టు అంటే తమవారినెవరినైనా కోల్పోయి అంటున్నవారు ఈ లొద్ది లోకి వెళ్ళరు. ఒకవేళ వెళితే కందిరీగలు, తేనెటీగలు కుట్టి వెంటబడి తరుముతాయి.

భూదేవర బృందం (లక్ష్మీ దేవర, పాండవులు) దేశాంతరం అంటే పాండవులు తమ రాజ్యాన్ని వదిలివెళ్ళిన తంతుగా దేవర్లను ఎత్తుకొని గూడేలన్నీ తిరుగుతూ రాత్రి వేళల్లో ఆట ఆడుతారు. అలా బయలుదేరే భూదేవర అక్షరాల లొద్దికి వచ్చి తావు అంటే పాండవులు నివసించిన జాగను దర్శించుకొని వెళ్ళేవారు.

లక్ష్మీ దేవర, పాండవుల జాతరలు ఖమ్మం జిల్లా పినపాక మండలంలోని చేగరిశెలలో, వాజేడు మండలంలోని కడేకల్ గ్రామాలలో అత్యంత ఉత్సాహంతో ఆట, పాటల మధ్యన మూడు ఏండ్లకు ఒకసారి జరుపుకుంటారు.

నిన్నటి ఖమ్మం జిల్లాలో వుండి విభజన సమయంలో ఆంధ్ర ప్రదేశ్‌లోకి మారిన వి.ఆర్.పురం మండలంలోని రేకపల్లిలో కొర్రాజుల కొలుపులో పాండవులు, వారి తల్లులు అయిన పెదసారలమ్మ, చిన సారలమ్మలకు (కుంతి, మాద్రి) నాయక రాజ్యం

ఏలిన ప్రోలయ నాయకునికి తమ భక్తి విశ్వాసాలు చాటేందుకు అగ్ని గుండాల్లో నడుస్తారు. రేకపల్లికి ఆరు కి.మీ.ల దూరంలో గల ముల్కపల్లిలో పాండురాజు కొలుపు చేస్తారు. పాండురాజును దొంతర గొడుగుల రూపంలో నెమలి ఈకలతో అలంకరిస్తారు. తెలంగాణలో నాయకపోడ్లు నివసించే గూడేలన్నిటిలో ఈ ఒక్క గూడెంలోనే పాండురాజు కొలుపు చేయడం విషేషం.

నాయకపోడ్లు మాట్లాడే భాష తెలుగే అయినప్పటికి ఇతర కులాల, తెగల వారికన్నా భిన్నంగా ఉంటుంది. వీరి ఆచార వ్యవహారాలు ఎంతో పురాతన సమాజాలను, సంస్కృతులను గుర్తుచేసేవిగా ఉంటాయి. వీరు పూజించే దైవాలను దేవరలుగా పిలుస్తారు. దేవరలను ఉంచే ఆలయాలను ఇల్లారులు లేదా నగురులుగా పిలుస్తారు. కొలుపులు, జాతరల సందర్భంగా ఇల్లార్లు లేదా నగుర్లను శుద్ధిచేయడాన్ని బండారి బసంతంగా పిలుస్తారు. దేవరను ఎత్తుకొని చుట్టు ప్రక్కల గూడేలకు వెళ్ళి ప్రచారం చేస్తూ, కానుకలు స్వీకరించడాన్ని ఆరెకెత్తడం, సుంకులు అడగడం లేదా జోగు పేరుతో పిలుస్తారు. అల్లు బండలు అంటే సకిణం పట్టేవి మనసులో తలుచుకొని పరీక్షించుకోవడం. పంట గొలుకులు అంటే పూజారులు జ్యోతిష్యం చెప్పేవి. దేవకన్యలను దేవగణికెలు అంటారు. కొలుపులు, జాతరల సందర్భంగా అగ్నిగుండాలపై నడవడం నాయకపోడు తెగవారు ప్రధాన సంప్రదాయంగా భావిస్తారు. అగ్నిగుండాలుగా సండ్ర చెట్టు నిప్పులను తయారుచేస్తారు. కొలుపునకు తెచ్చే సండ్ర చెట్లను సరువులుగా పిలుస్తారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర అవతరణ కోసం గౌరవనీయులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారి నాయకత్వంలో చేపట్టిన ఉద్యమంలో తెలంగాణ ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించారు. ఈ ఉద్యమంలో విద్యార్థులెందరో ప్రాణత్యాగం చేశారు.

మేధావుల ఆలోచనలతో తెలంగాణ ఉద్యోగులు చారిత్రాత్మకమైన పోరాటం చేశారు. ఈ పోరాటంలో గిరిజనుల్లో కూడా వెనుకబడి వున్న మేము మా వంతు కృషిగా మీటింగులు, ధర్నాలు, నిరసనలు, ర్యాలీలు మొదలగు అన్ని సందర్భాల్లోను మాకు చేతనైనంతగా పాల్గొన్నాము. వెనుకబడిన వారికోసం తెలంగాణ యేర్పాటు ద్వారా నాయకపోడుల సమస్యకు పరిష్కారం దొరుకుతుందనే ఆశలు మాలో కలిగాయి.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించే క్రమంలో తెలంగాణలోని నాయకపోడు ఆదివాసులమైన మేము ఎదుర్కొంటున్న సమస్యల నుండి విముక్తి కొరకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగారైన శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారికి, భారత రాష్ట్రపతి

గారికి, గవర్నర్ గారికి, తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ వారికి ఈ క్రింది విధముగా మా మొరను నివేదించడమైనది.

నాయకపోడు తెగను మొట్టమొదటిగా హైదరాబాదు రాష్ట్రంలో నిజాం నవాబు పరిపాలనలో ద ట్రైబల్ ఏరియాస్ రెగ్యులేషన్, 1359 (1949) నెం.111 ఆఫ్ 1359 ఫస్లీ (1949) ఆఫ్ గవర్నమెంటు ఆఫ్ హైదరాబాదు చట్టం (పేజి.151) ద్వారా గుర్తించబడిన 9 తెగలు గిరిజనులనగా భిల్, చెంచు, గోండు, హిల్‌రెడ్డీస్, కొలామ్, కోయ, నాయకపోడ్లు, పర్ధాన్, థోటి. 1950 వ సం॥ గిరిజన తెగల జాబితాలో పార్ట్ 9లో హైదరాబాదు రాష్ట్రం అంతటా వరుస నెం.4లో గోండు (నాయకపోడు, రాజ్‌గోండు) గుర్తింపబడినారు. 1956 వ సం॥ రాష్ట్రాల పునర్విభజన సమయంలో విడుదలచేసిన జాబితాలో ఉపవిభాగం 3లో వరుస నెం. 3లో గోండు (నాయకపోడు, రాజ్‌గోండు) లుగా 2003వ సం॥ల జాబితాల్లో వరుస నెం.6లో గోండు, నాయకపోడు, రాజ్‌గోండు, కోయితూర్ చూపించబడుతున్నారు. ప్రభుత్వ 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో గోండు, నాయకపోడులను కలిపి 2,98,488 గా చూపించబడుతున్నాము. గోండులలో నాయకపోడులను కలిపి చూపిన కారణంగా నాయకపోడుల జనాభా ప్రత్యేకంగా చూపించబడటం లేదు. గోండులు ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే నివసిస్తున్నారు. కాని నాయకపోడ్లు ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ప్రధానంగా జీవిస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఆదిలాబాద్ జిల్లాలో గోండు జనాభాగా నమోదైన సంఖ్య 2,30,072. ఇందులో నాయకపోడుల జనాభ సుమారుగా 60% కలిగి వుంటుంది.

నాయకపోడు తెగను హైదరాబాదు రాష్ట్రంలో ద ట్రైబల్ ఏరియాస్ రెగ్యులేషన్, 1359 (1949) నెం. ఆఫ్ 1359 ఫస్లీ (1949) ఆఫ్ గవర్నమెంటు ఆఫ్ హైదరాబాదు. (పేజి.151) ద్వారా, క్రిస్టాఫ్ వాన్ ఫ్యూరర్ హైమన్ డార్ఫ్ గారి రచనలు నిజామ్ గజిట్‌లో 1945లో ప్రచురించబడిన ట్రైబల్ హైదరాబాద్, ట్రైబ్స్ ఆఫ్ ఇండియా స్ట్రగుల్ ఫర్ సర్వైవల్ 1940-1980ల లోని రిపోర్టులలో ప్రత్యేక గిరిజన తెగగా గుర్తింపబడినాము. 1950 సం॥లో ప్రకటించబడిన గిరిజన తెగల జాబితాలో గోండులలో కల్పబడి గోండులకు ఉప తెగలాగా మారిపోయాము. ఎలాంటి కారణాల వలన గోండులలో చేర్చబడినదో తెలియడం లేదు. ఇది క్రమంగా 1956, 1976, 2003 సం॥లోని గిరిజన తెగల జాబితాలలో యథావిధిగా వరుస

నెంబరు 6.లో గోండు, నాయకపోడు, రాజ్‌గోండు, కోయితూర్‌లలో భాగంగా చూపించబడుతున్నాము.

నిజానికి నాయకపోడు, గోండు రెండు వేరు వేరు తెగలు. ఈ రెండు తెగల ఆచార, సంప్రదాయాలు వేరు వేరు. గోండులకు మాతృభాష గోండి (కోయ). నాయకపోడులకు మాతృభాష తెలుగు. ఈ రెండు తెగల మధ్యన పెండ్లిండ్లు జరుగవు, అలాగే ఈ రెండు తెగలు సంప్రదాయ, సాంస్కృతిక ఆచారాలు వేరు వేరుగా కల్గిఉన్నాయి.

హైదరాబాదు రాష్ట్రంలో 1949లో ప్రకటించబడిన 9 గిరిజన తెగలలో నాయకపోడు ఒకటి. కాని 1950 సం॥లో ప్రకటించబడిన గిరిజన తెగల జాబితాలో గోండులలో కల్పబడి గోండులకు ఉప తెగలాగా ప్రకటించబడినది. 1949 సం॥ వరకు స్వతంత్ర తెగగా నాయకపోడు తెగ 1950 సం॥ ఒక సం॥ కాల వ్యవధిలో విడుదలచేసిన గిరిజన తెగల జాబితాలో ఎందుకు కల్పబడినదో వివరించలేదు. అదే సమయంలో ఆంద్ అనే తెగను కొత్తగా చేర్చి 9వ గిరిజన తెగలుగా ప్రకటించబడినది.

సయ్యద్ అబ్దుల్ గఫూర్, డైరెక్టర్ గారు వ్రాసిన సోషల్ సర్వీసెస్ ఇన్ హైదరాబాదు అనే పుస్తకంలో పేజి నెంబరు 18లో ఈ క్రింది విధముగా తెలియజేసియున్నారు.

పర్ధాన్‌లు, థోటిలు, కొలాములు, నాయకపోడ్లు ఆదిలాబాద్ జిల్లాలోని ఒకే ప్రాంతంలో గోండులతో సహా జీవిస్తున్నారు వీరిని గోండుల ఉప తెగలాగా పొరపాటుగా పేర్కొన్నారు.

("Pardhans, Thotis, Kolams and Naikpods have been living in symbosis with the Gonds in Adilabad and have therefore been incorrectly described as sub-tribes of Gonds")

కాని పర్ధాన్, థోటి, కొలాములను వేరు వేరు తెగలుగా గుర్తించి వ్యక్తిగత గుర్తింపును ఇచ్చారు. కాని నాయకపోడులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వలేదు.

నాయకపోడులను గోండులలో కల్పి చూపించిన కారణంగా నాయకపోడుల జనాభా ప్రత్యేకంగా గుర్తింపబడుటలేదు. నాయకపోడ్లు బతికి వుండి కూడా లేనివారిగా చూడబడుతున్నది. తెలంగాణలోని అన్ని జిల్లాల నాయకపోడు జనాభా గోండు జనాభాగా చూపించబడుతున్నది. ఈ కారణంగా నాయకపోడ్లు కుల ధృవీకరణ పత్రాలు, విద్య, ఉద్యోగ అవకాశాలను అందుకొనలేక ఎన్నో సమస్యలను

ఎదుర్కొంటున్నారు. గుర్తింపులో స్పష్టత లేని కారణంగా చట్టబద్ధమైన సామాజిక పదవుల్లో ఎన్నికయ్యే అవకాశం లేక ప్రభుత్వానికి తమ సమస్యను వివరించే ఆధారం లేకుండా పోయినది. గిరిజన సంక్షేమ, ఇతర ప్రభుత్వ అధికారుల నిరాదరణకు గురి అవుతున్నారు.

కుల గుర్తింపులో స్పష్టత లేని కారణంగా నాయకపోడ్లు అంటే లంబాడీలా అని ప్రశ్నిస్తున్నారు. లంబాడాలకు వారి పేర్ల చివరన నాయక్ అని ఉండడం వలన, ప్రచారం ఎక్కువగా కలిగివున్న తెగ కావున ఈలాంటి ప్రస్తావనలు వస్తున్నవి. నాయకపోడ్ల గురించి తెలియజేసుకొనుటకు గోండు నాయకపోడ్లు లేదా గోండులు లేని జిల్లాలలో కోయనాయకపోడ్లుగా విధిగా సపోర్టుగా చూపించవలసిన పరిస్థితి ఏర్పడుతున్నది. వీరు నాయకపోడ్లుగా పుట్టి గోండు జనాభాగా నమోదు అవుతున్నారు. వీరి దేవరలు, ఆచార, సంప్రదాయాలు కోయలవిగా నమోదువుతున్నాయి.

గిరిజన సాంస్కృతిక పరిశోధనా & శిక్షణా సంస్థ వారిచే పరిశోధన చేయించి కేంద్ర ప్రభుత్వానికి రికమెండు చేయించి తద్వారా ప్రత్యేక నోటిఫికేషన్ ఇప్పించి తెలంగాణలోని గిరిజన తెగల జాబితాలో నాయకపోడు తెగకు వ్యక్తిగత వరుస నెంబరు (Individual Serial No) లో గుర్తిస్తూ తమ తెగను ప్రభుత్వం ఆదుకోవాలని నాయకపోడ్లు కోరుకుంటున్నారు.

29. బంజారాల సామెతలు - సామాజిక చైతన్యం

పి. గోపినాథ్ రాథోడ్
పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం,
సెల్ నెం. 9618417839,
Mail: gopinathrathod1984@gmail.com

జానపద విజ్ఞానంలో సామెతలకు ఎనలేని ప్రాధాన్యమున్నది. తరతరాల జీవిత అనుభవ సారాన్ని దాచుకున్న భాండాగారాలు సామెతలు. సంస్కృతిని పరిరక్షించడంలో సామెతలు ప్రధాన పాత్రను పోషిస్తున్నాయి. సంస్కృతంలో 'సామ్య' అనే పదానికి సాధురూపం సామ్యత. సామ్యతే 'సామెత' అయిందని సాటిఅయినదే సామెత అనీ సాటి జేసి అంటే పోల్చి చెప్పడమే ప్రధాన గుణమని 'తెలుగు సామెతలు' పీఠిక కర్తలంటున్నారు.

"సామెత లేని మాట ఆమెత లేని ఇల్లు" అనేది తెలుగు సామెతలకున్న ప్రాశస్త్యాన్ని తెలుపుతుంది. పై వాక్యంలో సామెత అంటే అనుభవ సారమని అర్థం. ఆమెత అంటే విందు అని అర్థం. ఇందులోను అనుభవసారముంది. అంటే భాషకు సామెతలు ఎంతందమో ఇంటికి విందులు, వినోదాలు, అలంకరణలు అంతే అందమని అర్థం. ఇక సామెతలకు సంస్కృతంలో లోకొక్తి, సూక్తి, సుభాషితాలు, అని తమిళంలో పళమెళి (పాతపాట) కన్నడంలో 'గాదె' (గాథ) లేక నాణ్ణుడి అనే పేర్లున్నాయి. అలాగే బంజారా భాషలో కావత్ లేదా 'సాక్తర్' అని అంటారు.

ప్రపంచంలో జానపద విజ్ఞానానికి భారతదేశం గనిలాంటిది. ఎందుకంటే భారతదేశం అనేక కులాలు, ఆదిమజాతుల సంస్కృతుల సమాహారం. అందులో బంజారా జాతి ఒకటి. వీరినే తెలంగాణ రాష్ట్రంలో 'లంబాడిలు' అని ఆంధ్రప్రదేశ్‌లో 'సుగాలి' అని పిలుస్తున్నారు. వీరికి ఒక ప్రత్యేకమైన భాష ఉన్నది. ఇది చాలా విలక్షణమైనది. దానికి లిపి లేనందువల్ల మౌఖికంగానే వ్యవహరింపబడుతుంది. లిపి లేని భాషల్ని అనాగరిక భాషలని అంటున్నాం. నాగరిక భాషలైనా అనాగరిక భాషలైనా

సామెతలు సహజాలంకారాలు. ఒక్కొక్క సామెతలో ఒక్కొక్క జీవనసారముంటుంది. సందర్భానుసారంగా మాటల్లో సామెతలను ప్రయోగిస్తూనే ఉంటారు. వారి సంస్కృతి సంప్రదాయాలకు ఆచారవ్యవహారాలకు సంబంధించిన అంశాలు, వారి అనుభవాలు, అభిరుచులు, మౌఖికంగా సామెతల రూపంలో నిక్షిప్తమై ఉంటాయి. వీరి సామెతల్లో సామాజిక స్పృహ ప్రతిబింబిస్తుంది. వారి పూర్వికుల నుండి పరంపరంగా వస్తుంది. వారు తమ జీవిత అనుభవ సారాన్ని రంగరించి భావితరాలు సన్మార్గంలో నడిచేటట్లు మార్గదర్శనం చేస్తాయి. వీరి సామెతలో విజ్ఞానంతో పాటు నీతి, పంచాయితీ, మనస్తత్వం, సరసం మొదలైన సామాజిక స్పృహను కల్పించే సామెతలు కనిపిస్తాయి.

సామెత : "ధాన్ ఖావు ధణిరోన్ గీద్ గావు విరారో"

అర్థం : ధాన్ = అన్నం, ఖావు = తినడం, ధణిరోన్ = భర్తది, గీద్ = పాట, గావు = పాడటం, విరారో = తమ్ముడిది.

తెలుగు: "అన్నం తినేది భర్తదైతే పాటపాడేది తమ్ముడిది"

వివరణ: ఈ సామెతలో సామాజిక సౌందర్యం తొణికిసలాడుతుంది. సహజంగానే స్త్రీలకుండే లక్షణం ఈ సామెతలో కన్పిస్తుంది. ఇది చాల ప్రసిద్ధమైన సామెత. స్త్రీలు సహజంగా పుట్టింటి వారిపై ఉండే అభిమానం వల్ల ఎల్లప్పుడు వారి గురించే గొప్పలు చెప్పడం మనం వింటూవుంటాం. పుట్టింటి వారి నగల గురించో లేదా ఏడాదికోసారి పెట్టే చీరల గురించో గొప్పగా మాట్లాడుకోవడం. అదే సమయంలో భర్త ఇంటివారిని తెగడటం. అత్తింటి వారు ఏంచేసినా అందులో వంకలు తీయడం ఆడవాళ్ళలో ఉండే సహజగుణం. దీన్ని మార్చుకోవాలనే ఉద్దేశంతోనే పై సామెత పుట్టుకొచ్చింది.

స్త్రీలు కేవలం పుట్టింటి వారినే కాక మెట్టినింటి వారు చేసే పనులగురించి లేక వారిని గౌరవించే విధంగా మాట్లాడాలని ఈ సామెత బోధిస్తుంది. ఇలాంటి సామెతలు తెలుగులో 'సొమ్మొకరిది సోకొకరిది'. 'తిండి ఎవరిది తింటున్నామో పాటకూడ వారిదే పాడాలి' వంటివి. కాని ఇక్కడ వ్యతిరేకంగా జరిగిన సందర్భంలో ఇలా కాకూడదు అని నీతిని బోధించే ఈ సామెత బంజారా సమాజంలో ప్రసిద్ధిచెందింది.

సామెత: 'సో సనారేర్ అన్ ఎకజ్ లవారేర్'

అర్థం: సో = వంద, సనారేర్ = కంసాలివాడిది, ఎకజ్ = ఒకటే, లవారేర్ = కమ్మరివారిది.

తెలుగు: కంసలివాడి వంద సుత్తి దెబ్బలకు కమ్మరివాడి ఒక్క సమ్మెట దెబ్బసరి.

వివరణ: బంజార సమాజంలో చాలా ప్రసిద్ధమైనది. తండా పంచాయితి (నసాబ్) తీర్పు సందర్భంలో పంచాయితి పెద్దలు ఇలాంటి సామెతలు ఎక్కువగా ఉపయోగిస్తారు. పంచాయితి సమయంలో వాద ప్రతివాదులు ఫిర్యాదులు చేయడం పెద్దలు ఇద్దరి వాదనలు విన్న తర్వాత వంద మాటలెందుకు నేను ఒక్కటే చెప్పుతాను అని చెప్పే సందర్భంలో ఇలాంటి సామెతలు పుట్టి ఉంటాయి.

బంజారాల పంచాయితి వ్యవస్థ ఎంత పటిష్టమైనదో పై సామెతల వల్ల తెలుస్తుంది. ఇందులో వస్తు సంస్కృతికి సంబంధించిన అంశాలు అంతర్లీనంగా దాగివున్నాయి. ఇందులో 'సో సనారేర్' అంటే వంద కంసాలివాడి సుత్తిదెబ్బలు అంటే కంసాలి వాడు ఆభరణాలు చేసే సమయంలో చిన్న సుత్తితో అనేక దెబ్బలు కొడతాడు, కాని అదే కమ్మరివాడు కొలిమిలో ఇనుమును సాగదీయడానికి పెద్ద సమ్మెటతో ఒక దెబ్బ వేస్తాడు. అంటే కంసాలివాడి వంద దెబ్బలకు కమ్మరి వాడి ఒక్క దెబ్బ సమానం అన్నమాట. అలాగే సనార్, లవార్ అనే పదాలు బంజార సమాజంలో వారి ఆభరణాలు తయారుచేయడానికి "సనార్ మరియు వారి వ్యవసాయానికి సంబంధించిన పరికరాలు చేయడానికి లవార్ ప్రత్యేకంగా ఈ తెగలవారు ఉంటారు. వీరు బంజార సమాజంలో ఉపకులాలుగా ఉండడం ఇక్కడ గమనించదగిన అంశం.

సామెత: "ఢాడి ఏక్ గారో – డుంగ్ ఏక్ గారో"

అర్థం: ఢాడి = బంజారాలలో ఒక ఉపకులం గాయకులు, ఏక్ = ఒక్కటి, గారో = పాడుతున్నాడు. డుంగ్ = వంతపాడెవాడు, ఏక్ = ఒక్కటి, గారో = పాడుతున్నాడు.

తెలుగు: ఢాడి ఒక్కటి పాడుతుంటే డుంగ్ మరొకటి పాడుతున్నట్లు.

వివరణ: ఇది చాలా ప్రసిద్ధమైన సామెత. ఇక్కడ ఢాడి అనే పదం బంజారా సమాజంలో ఒక ఉపకులం. వీరు బంజారా వంశాలైన రాథోడ్, చౌహాన్, పమార్, జాదవ్ వారి కులపురాణాలను గానం చేస్తూ ఉంటారు. వీరిని ఢాడీ బంజారలని పిలుస్తారు. బంజారా సాంస్కృతిక కార్యక్రమాలలో వీరు పాటపాడే సమయంలో ఢాడి ఒక్కటి పాడితే వెనకాల వంతపాడే వాడు డంగ్ మరొకటి పాడే సందర్భంలో ఈ సామెత పుట్టి ఉంటుంది. తెలుగులో "తానా అంటే తందానా" అన్నట్లు అంటే ప్రధాన గాయకుడు పాడే పాటకు సంబంధం లేని రాగాన్ని వంతపాడే వారు పాడే సందర్భంలో ఇలాంటివి వినిపిస్తాయి. ఇవి ప్రస్తుత సమాజంలో మనం ఒక్కటి చెప్పితే ఎదుటివారు మరొకటి చేసే సందర్భంలో ఇలాంటి సామెతలు బంజారాలు ప్రయోగిస్తుంటారు.

సామెత: "సాసుమరి సివాళేమా ఆసుకాడి వర్షాళేమా"

అర్థం: సాసు = అత్త, మరి = చనిపోయింది. సివాళేమా = చలికాలంలో, ఆసు = కన్నీరు, కాడి= కార్చింది, వర్షాళేమా = వర్షాకాలంలో.

తెలుగు: అత్తచనిపోయింది చలికాలమైతే కోడలు ఏడ్చింది వర్షాకాలంలో అన్నట్లు.

ఇలాంటి సామెతలు తెలుగులో కూడా కన్పిస్తాయి. అత్త చచ్చిన ఆరునెల్లకు కోడలు ఏడ్చినట్లు, అలాగే దొంగలు పడ్డ ఆరునెలలకు కుక్కలు మొరిగినట్లు అనే సామెతలు ఈ కోవకు చెందినవే. అత్తాకోడళ్ళ మధ్య ఉండే సహజమైన వైరుధ్యాన్ని ఈ సామెత ద్వారా బంజారాలు వ్యక్తపరిచారు. అత్తాకోడళ్ళ మధ్య గొడవలు అయినప్పుడు కోడలు అత్త ఎప్పుడు చస్తుందా అని ఎదురు చూస్తుంది. అత్త చనిపోయినప్పుడు దీని పీడ విరగడైంది అని సంబరపడిపోయింది. అలా చలికాలంలో చనిపోతే వర్షాకాలంలో ఏడవటం ఏమిటి? అని సందేహం రావచ్చు. అంటే వర్షాకాలంలో వేసినపంటలు చలికాలంలో చేతికి వస్తాయి. అలా చేతికి వచ్చిన పంటను ఎండాకాలంలో కూర్చోని తింటుంటారు. మళ్ళీ వర్షాకాలం వచ్చేసింది, అప్పుడు వ్యవసాయపు పనులు ప్రారంభం అవుతాయి. అప్పుడు కోడలికి బాధ్యతలు గుర్తొచ్చి అత్త ఎందుకు తిడుతుండేదో తెలుసుకొని అప్పుడు ఏడ్చిందట. ఇలాంటి సామెతలు బంజార సమాజంలో కుటుంబ గొడవలు జరగకుండా సామాజికమైన చైతన్యాన్ని కల్గిస్తాయి.

సామెత: 1. జవానిమా జాత్ కళేని – నిందేమా వఛాణో కళేనికచ

2. జవానిమా జాత్ కళేని – అందరేమా రాత్ కళేనికచ

అర్థం: 1. జవానిమా = యవ్వనంలో, జాత్ = వావివరుసలు, కళేని = తెలియవట నిందేమా = నిద్రలో, వచ్చాణో = పరుపు, కళేనికచ = తెలియవు

2. జవానిమా = యవ్వనంలో, జాత్ = వావివరుసలు, కళేని = తెలియవు అందరేమా = చీకట్లో, రాత్ = రాత్రి, కళేనికచ్ = తెలియవు.

వివరణ: బంజార పెద్దలు ఎంతో అనుభవ పూర్వకంగా చెప్పినటువంటి సామెతలు ఇవి. ఇలాంటి సామెతలు తెలుగులో కూడా కన్పిస్తాయి. "ఆకలి రుచి ఎరుగదు – నిద్రచోటెరగదు" అని అంటారు. కానీ బంజార సామెతలో మొదటి వాక్యం ప్రసిద్ధమైనది. అంటే యవ్వనంలో ఉన్నప్పుడు వావివరసలు తెలియవు. కామంతో కళ్ళు మూసుకుపోయి రకరకాల అనర్థాలకు దారితీస్తుంది. అందుకే పెద్దలు అంటారు

కామాతురాణాం నభయం నలజ్జా. ఇలాంటి సామెతలు ప్రస్తుతం యువతరానికి ఎంతో అవసరం. రెండవ వాక్యంలో నిద్రలో పరుపు తెలియదు అంటారు. నిజమే ఎంత ఉన్నత శ్రీమంతులైనా నిద్ర వచ్చినప్పుడు కటిక నేలమీద కూడా పడుకుంటారు. ఇక రెండవ సామెతలోని రెండవ వాక్యం చీకట్లో రాత్రి తెలియదు అంటే బంజారాలు పొద్దును చూసి సమయం తెలుసుకుంటారు. రాత్రి చంద్రుణ్ణి, చుక్కల్ని చూసి సమయం కనుక్కుంటారు. అయితే అమావాస్య రాత్రుల్లో చంద్రుడు కనిపించడు, ఆ సమయంలో రాత్రి సమయం తెలుసుకోవడం కష్టం. ఇలాంటి పరిస్థితుల్లో ఈ సామెత పుట్టి ఉంటుంది. ఇలాంటి సామెతలు యువతను మేల్కొల్పి మంచి మార్గంలో నడిచే విధంగా చైతన్యపర్చుతాయి. ఇలాంటి సామెతలు నేటి తరానికి అందించాలి.

సామెత: "కాణోకైపతి లంగ్డో హక్మతి"

అర్థం: కాణో = గుడ్డివాడు, కైపతి = కైలాసపతి, శివుడు,
లంగ్డో = కుంటివాడు, హక్మతి = ఉపాయం కలవాడు.

తెలుగు: గుడ్డివాడు కైలాసపతి, కుంటివాడు ఉపాయాలకోరు.

వివరణ: ఈ సామెత బంజారా సమాజంలో ప్రసిద్ధిచెందినది. సహజంగానే మానవుని శరీరంలో ఏదైనా అవయవలోపం ఉన్నవారు చాలా తెలివిగా ఉపాయాలతో పనులు చక్కబెట్టుకుంటారు, శరీరంలో ఒక అవయవం పనిచేయకపోతే దాని స్థానంలో మరో అవయవం చురుకుగా పనిచేస్తుంది. అనేది శాస్త్రీయ అంశం ఈ సామెతలో కనిపిస్తుంది. కాణోకైపతి అంటే గుడ్డివాడు కైలాసపతి, అంటే కైలాసంలో శివుడు ఎల్లప్పుడు కండ్లుమూసుకొని యోగనిద్రలో ఉంటాడు. కాని ప్రపంచానంతటిని తనలో లయం చేసుకుంటాడు. ఒక గుడ్డివాడిని శివునితో పోల్చడం విశేషం. లంగ్డో హ్మాతి = కుంటివాడికి ఉపాయాలు ఎక్కువ, కూర్చున్న చోటునుంచే తన పనులను ఏదో ఒక రకంగా చేసుకోవడం మనం సమాజంలో చూస్తూనే ఉంటాము. ఇలాంటి సామెతలు తెలుగులో కనిపించవు.

సామెత: "కాణిన్ కఛోళో మళోతో పాణి విపిన్ పెట్ ఫుటన్ మరీతికచ"

అర్థం: కణిన్ గుడ్డిదానికి, కఛోళో = కంచుపళ్ళెం.
మళోతో = దొరికితే, పాణి = నీళ్ళు.
పిపిన్ = త్రాగిత్రాగి, పెట్ = కడుపు, ఫుటన్ = పగిలి, మరీతికచ = సచ్చిందట.

తెలుగు: గుడ్డిదానికి కంచు పళ్ళెం దొరికితే నీళ్ళుత్రాగి త్రాగి కడుపు పగిలి సచ్చిందటా.

వివరణ: ఈ సామెత మానవుని కోరికకు, ఆశకు, వెకిలితనానికి నిదర్శనం. మనిషి ఆకలికి, నీచత్వానికి ప్రతీక. ఈ సామెతలో ఒక అనామకురాలైన అంధురాలికి ఒక కంచు పళ్ళెం దొరికితే దాన్ని ఎలా వాడాలి. ఏంచేయాలో కూడా తెలియక అందులో నీళ్ళు నింపి తాగి తాగి కడుపు పగిలి చనిపోయింది అని అర్థం. పైకి చూస్తే ఇందులో హాస్యం కనిపిస్తుంది కాని లోపల అంధురాలి అత్యాశ కనబడుతుంది. ఈలాంటిదే సమాజంలో కొందరు కొత్త వస్తువేదో దొరికినప్పుడు ఎలా వాడాలో తెలియక ఏదో చెయ్యబోయి ప్రాణాల మీదికి తెచ్చుకుంటారు. ఈ సామెతలో కాణన్ అనే పదానికి అంధురాలు అని అర్థం. కాని అంతర్గతంగా అంధకారం, అజ్ఞానం అనే అర్థాలు దాగి ఉన్నాయి. ఏ వస్తువును ఎలా వాడాలో తెలియక పోవడమే అజ్ఞానం, లేదా అంధకారం దీన్ని ఒక అమాయకురాలైన అంధురాలితో పోల్చడంలో బంజారాల తాత్త్విక దృష్టి కనబడుతుంది.

ఈ సామెతలో బంజారాల వస్తు సంస్కృతి కూడా కనిపిస్తుంది. కఛోళో కంచుపాత్ర, దీనికొక ప్రత్యేకత ఉంది. బంజారాల పెళ్ళిళ్ళల్లో స్త్రీలకు అత్తారింటకి పంపేసమయంలో అనేక వస్తువులను, ఆభరణాలతో పాటు కంచు పాత్రలను కూడా ఇవ్వడం వారి సంప్రదాయం. ఈ పాత్రలోనే స్త్రీలు భోజనం చేసేవారు. అందులో వేరేవారెవరైనా తిన్నా సహించేవారు కాదు. ఈ పాత్రకు సంస్కృతిపరంగా ఎంతో ప్రత్యేకత ఉంది.

సామెత: "ఆయిరే కలి దునియా నకిలి"

అర్థం: అయిరే = వచ్చింది, కలి = కలికాలం, దునియా = ప్రపంచం, నకిలి = నకిలీది.

తెలుగు: నకిలీ కలిలోకంలో వచ్చింది.

ఈ సామెతను బట్టి బంజారాలు ధర్మబద్ధులని, న్యాయవ్యవస్థపట్ల గౌరవం కలవారని ఎంతో ముందుచూపు కలవారుగా కనిపిస్తారు. కలికాలంలో ధర్మం నశించిపోయి, అధర్మం పెచ్చుమీరుతున్న సందర్భంలో ఈ సామెత ఆవిర్భవించి ఉంటుంది. మనం ప్రతి సందర్భంలోను కలికాలం అని అంటూ ఉంటాం. అలాగే బంజారా సమాజంలోను ప్రపంచం మొత్తం అవినీతిమయం అంతా మాయగా కలిప్రభావం చేత లోకం మొత్తం నకిలీగా మారిందని భావించేదే ఈ సామెత.

సామెత: "సరురో జోడ సోనేరో తోడ పచ్చేరో జోడ ఛాతిరో ఫోడ"

అర్థం: సరురో = మొదటిది, జోడ = జంట, సోనేరో = బంగారం,
తోడ = హారం లేదా ముక్క, పచ్చేరో = రెండోది, జోడ = జంట,
ఛాతిరో = యదలో, ఫోడ = కురుపు/మంట

తెలుగు: మొదటి జంట బంగారపు ముక్క రెండో జంట ఎదలో మంట.

ఈ సామెతలో బంజారాల సమాజంలో సంస్కరణ దృష్టి కనబడుతుంది. పూర్వం బంజారాలు బహుభార్యత్వ వ్యవస్థను కలిగి ఉండేవారు. దాని వల్ల జరిగే అనర్థాలను నివారించడానికి బంజారా పెద్దలు జాతిని సంస్కరించే ఉద్దేశంతో ఈ సామెతను సృష్టించి ఉంటారు. ఈ సామెతను తెలుగులో అనువదించడం కష్టం. ఇలాంటివి తెలుగులో కనిపించవు.

బంజారా సమాజంలో ఒక వ్యక్తి భార్య ఉండగానే మరోపెళ్ళి చేసుకోకూడదు అని చెప్పే సందర్భంలో ఈ సామెతను వాడారు. మొదటిసారి పెళ్లైన జంట బంగారపు ముక్కలాగ యెదకు హత్తుకొని ఉంటుంది. రెండవసారి పెళ్ళిచేసుకున్న జంట అది ఎన్నటికైనా యెదలో ఒక పుండులాగ మంటను రేపుతూ ఉంటుంది. అని చెప్పడం వల్ల బంజారాల సంస్కరణ దృష్టి స్పష్టంగా కనిస్తుంది.

సామెత: "సెల్డి ఆఏర్ వేళా మోవడ చుఏర్ వేళా"

అర్థం: సెల్డి = ఏదు/ముళ్ళపంది, ఆఏర్ = వచ్చేవేళ = సమయం
మోవడ = ఇప్పపువ్వు, చుఏర్ = రాలే, వేళ = సమయం.

తెలుగు: ముళ్ళపంది వచ్చేసమయం ఇప్పపువ్వు రాలే సమయం.

ఈ సామెతను చూసినట్లయితే ముళ్ళపందికి ఇప్పపువ్వుకి సంబంధమేమిటి? అనే ప్రశ్న ఉదయిస్తుంది. రెండు పరస్పర విరుద్ధమైన జాతులు. ముళ్ళపంది అడవి జంతువు, ఇప్పపువ్వు చెట్టునుంచి వచ్చేది. ఈ సామెత వల్ల అడవికి, అడవి జంతువులకు సంబంధించిన విశేషమైన పరిజ్ఞానం బంజారాలకు ఉందని తెలుస్తుంది.

ముళ్ళపందికి ఒళ్ళంతా ముళ్లు ఉంటాయి. దాని ఆత్మ రక్షణ కోసం ఆ ముళ్లు బాణాల లాగా ప్రయోగిస్తుంది. అవి చాలా విషపూరితమైనవి, ఆ విషయం బంజారాలకు బాగా తెలుసు. ముళ్ళ పందిని వేటాడే సమయంలో బంజారాలు జాగ్రత్తగా దాని తలమీద కొడతారు. తలమీద కొడితే తప్ప అది చావదు అనే విషయం బంజారాలకు తెలుసు. ముళ్ల పంది శరీర భాగాల్లో తల భాగం చాలా సున్నితమైనది. దాని తలపై

వేపగింజతో కొట్టినా అది చస్తుంది. అయితే ఈ సామెతలో అనుకోకుండా ముళ్ళపంది మేతకు వెళ్ళి విప్పచెట్టుక్రిందికి వెళ్ళే సమయం, పైనుంచి విప్పపువ్వు రాలే సమయం ఒకటే కావడం యాదృచ్ఛికంగా జరిగింది. ఇప్పపువ్వు దాని తలమీద పడటం చేత అది అక్కడే చనిపోయింది. అయితే ఈ రెండు ప్రక్రియలు ఏకకాలంలో జరగడం విశేషం. ప్రకృతికి సంబంధించిన విషయం బంజారాలకు బాగా తెలుసు కాబట్టి ఈ సామెతను ఉపయోగించారు. ఇప్పపువ్వుతో బంజారాలు సారాయి తయారు చేసుకొని విందులు వినోదాల సమయంలో తాగడమనేది వీరి సంస్కృతిలో అంతర్భాగం.

సామెత: "హరోదేకన్ చర – సుకోదేకన్ విచ్కవ్"

అర్థం: హరో = పచ్చగా, దేకన్ = చూచి, చర = మేస్తాయి,
సుకో = ఎండినది, దేకన్ = చూచి, విచ్కవ్ = నవ్వుతారు.

ఈ సామెత బంజారా సమాజంలో ఎంతో ప్రాచుర్యం పొందింది. ఇలాంటివి సుమతి శతకంలో "తెప్పలుగ చెరువులు నిండిన కప్పలు పది వేలు చేరును". భాస్కర శతకంలో "బలయుతుడైన వేళ నిజబంధుడు తోడ్పడు గాని యాతడే బలంబు తొలంగనేని తనపాలిట శత్రుడైనట్లు" అనే పద్యాల్లోను ఇదే భావం కనిపిస్తుంది. అంటే ధనం ఉన్నప్పుడే బంధువులు వస్తారు. ధనం లేని సమయంలో మనల్ని చూసి నవ్వుతారు. అనే విషయం బంజారాలకు బాగా తెలుసు అనే విషయం ఈ సామెత వల్ల తెలుస్తుంది.

ముగింపు:

బంజారాల సామెతలను పరిశీలించినట్లయితే వీరికి వారి సంస్కృతి సంప్రదాయాల పట్ల గౌరవం, సామాజిక అంశాల పట్ల వారికున్న స్పృహను గమనించవచ్చు. బంజార సమాజంలో అనేక సందర్భాలలో సామెతలు ప్రయోగిస్తు సమాజం పట్ల వారికున్న అవగాహనను తెలియజేశారు. సామాజిక ప్రయోజనాన్ని ఆశించే ఇలాంటి సామెతలు అనేకం. వాటిలో అర్థాల్ని, పరమార్థాల్ని వ్యాఖ్యానించవచ్చు. సామెతలు సామాజాన్ని ఆచరణ పథంలో నడిపిస్తాయి. ఇలాంటి బంజార సామెతలన్నింటిని సేకరించాల్సిన అవసరం నేటి పరిశోధకులపై ఉంది. అంతే కాకుండా సామెతలపైన పరిశోధనలు చేయవలసిన అవసరం ఉంది. బంజార సామెతలు వారి జీవన విధానాన్ని సామాజిక అంశాల్ని చైతన్యపరిచే విధంగా ఉన్నాయనడంలో సందేహం లేదు.

30. తెలుగు బోధన భాష – బంజారా విద్యార్థుల సమస్యలు

శ్రీ కె. భానుచందర్
పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్

శ్రీమతి వి. సరస్వతి
అసిస్టెంట్ ప్రొఫెసర్, విద్య & మానవ వనరుల అభివృద్ధి శాఖ
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం – 517 426
చరవాణి: 9951694120

భూమిపై జన్మించిన జీవజాలాలన్నింటిలో మానవుడికి ప్రత్యేకమైన స్థానం ఉంది. దానికి గల కారణం అతడి భాషా సామర్థ్యం. భాషవల్లనే మనిషి మానవుడయ్యాడనే నానుడి కూడా ఉంది. భాష వలనే మనిషి భూమి మీద ఉన్న అన్ని శక్తులను తన స్వాధీనంలోకి తెచ్చుకొని ఆ జీవులపైన ఆధిపత్యాన్ని సాధించగలిగాడు. మనిషి తన భావాల్ని, ఆలోచనల్నీ వ్యక్తీకరించడానికి, మేధాశక్తి ఉపయోగించడానికి భాష సహాయపడుతుంది. ఆరంభంలో భాష పరస్పర సంభాషణ కోసమే పరిమితమైనప్పటికి నాగరికత పెంపొంది సంస్కృతులు అభివృద్ధి చెందడంతో భాషకు అనేక ప్రయోజనాలేర్పడ్డాయి. భాష ద్వారానే మానవుడికి మానసిక, భౌతిక వికాసం కలుగుతుంది. ప్రజ్ఞాపాటవాలు అబ్బుతాయి. నైపుణ్యాలు, సామర్థ్యాలు అలవడుతాయి. భాష కేవలం మానవులకే కాదు జంతువులకు, పక్షులకు, కీటకాదులకు కూడా ఉంటుందని తత్త్వవేత్తలు అభిప్రాయపడ్డారు. కాని అన్ని ప్రాణుల భాషకంటే మానవ భాష సర్వోత్తమమైందని భాషావేత్తల అభిప్రాయం. ప్రపంచం మొత్తంలో 2796 భాషలున్నాయని, ఒక భారతదేశంలో వంద భాషలకుపైగా మాట్లాడే ప్రజా తెగలు ఉన్నాయని భాషాశాస్త్రజ్ఞులు అభిప్రాయం. ప్రపంచంలో ఒక భాషను మాట్లాడే వారికి ఇంకొకరి భాష అర్థం కానట్లనిపిస్తుంది. కాని ప్రతి వారికి దైనందిన అవసరాలను తీర్చుకోవడానికి భాష అవసరం ఎంతైనా ఉంది. మానవుడు మొదట సంభాషణను

అలవరుచుకొని తరువాత తన అనుభవాలను ముందు తరాల వారికి అందించడం కోసం లిపిని కనిపెట్టి భాషకు నిశ్చిత స్థితిని కల్పించాడు. ప్రపంచ వ్యాప్తంగా విద్యార్జనలో భాష కీలకాంశంగా మారుతోందని భావించి మనదేశంలో త్రిభాషా సూత్రాన్ని అమలుపరచడం జరిగింది.

ఈ త్రిభాషా సూత్రాన్ని అనుసరించి విద్యాబోధన మాతృభాషలో జరగాలి కాని బంజారా విద్యార్థుల విషయానికి వస్తే లిపి సాహిత్యం లేకపోవడంతో మాతృభాష అయిన బంజారా భాషా సమస్యగా మారింది. భారతీయ విద్యారంగం ఎదుర్కొనే సమస్యలో భాష సమస్య ప్రధానమైనదిగా చెప్పవచ్చును. భారతదేశంలో సుమారు 1600 భాషలున్నాయి. వీటిలో లిపి, సాహిత్యం ఉన్న భాషలను గుర్తించగా 93వ రాజ్యాంగంలో 8వ షెడ్యూల్ ప్రకారం మొదట 18 భాషలుగా తరువాత 400 భాషలుగా గుర్తించారు. రాజ్యాంగంలో 8వ షెడ్యూల్ ప్రకారం మొదట18 భాషలుగా గుర్తించగా 93వ రాజ్యాంగ సవరణ కింద బోడో, డోంగ్రి, మైథిలి, సంతాలి అనే భాషలను చేరుస్తూ మొత్తం 22 భాషలను ప్రధాన భాషాలుగా గుర్తించారు. అయితే విద్యావ్యవస్థలో మాధ్యమంగా 30 భాషలు మాత్రమే వాడుకలో ఉన్నాయి. దీన్నిబట్టి చూసినట్లైతే బంజారా భాషపై ఇతర భాష ప్రభావం అపారంగా ఉందని చెప్పవచ్చును. బంజారా జనాభా దేశమంతా విస్తరించినప్పటికీ వారు మాతృభాషకే కట్టుబడి ఉన్నారు. ఈ మేరకు చూసినట్లైతే ఆయా ప్రాంతీయ భాషలు వీరికి ద్వితీయ భాష కిందనే వస్తాయి. మనుగడలో భాగంగా ఆయా ప్రాంతావాసులతో సంబంధాలు కొనసాగిస్తూ ప్రాంతీయ భాషలతో పరిచయం పెంచుకొన్నప్పటికి బంజారా విద్యార్థులు మాత్రం ప్రాథమిక విద్యాస్థాయిలో భాషాపరమైన సమస్యలు ఎదుర్కొనక తప్పడం లేదు. మన రాష్ట్రంలో కూడా దాదాపు ఇదే పరిస్థితి నెలకొని ఉంది. మన రాష్ట్ర భాష తెలుగు మాధ్యమంగా సాగే విద్యాబోధన బంజారా విద్యార్థులకు మాతృభాషేతరంగా ద్వితీయభాష అయిన తెలుగులో విద్యనభ్యసించవలసి వస్తుంది. మాతృభాషలో విద్యాబోధన విద్యార్థులకు జ్ఞానార్జనకు పునాదిగా తోడ్పడుతుంది. భావవ్యక్తీకరణ సులభమవుతుంది. విషయ గ్రహణ సామర్థ్యం అధికమవుతుంది. కాని బంజారా విద్యార్థులకు మాతృభాషేతరంగా, ద్వితీయ భాషగా పిలువబడే తెలుగు భాషలో విద్యాబోధన కొనసాగడం వలన వారికి అర్థం కాకపోవడంతో చదువులో బాగా రాణించలేకపోతున్నారు. దీనితో ప్రాథమిక స్థాయిలో విద్యాశాతం గణనీయంగా తగ్గిపోతుందని చెప్పవచ్చు.

జీవద్భాష

ఒకరి భావాలు మరొకరికి తెలియచెప్పే విధానం భాష, సాధారణంగా భాషలో మార్పులు జరుగుతూ వుంటాయి. మార్పులు జరగడం భాష సహజ లక్షణం. మార్పు అనేది ప్రపంచంలోని ప్రతీ భాషలోనూ వుంటుంది. వివిధ రంగాల్లో ఎప్పటికప్పుడు చాలా పరిణామాలు జరుగుతూ వుంటాయి. ఇదే విధంగా భాషలో కూడా పరిణామాలు వస్తూవుంటాయి. ఈ పరిణామలన్నింటినీ స్వీకరిస్తూ సమకాలీన సమాజానికి అనుగుణంగా అద్దం పట్టేది జీవద్భాష. మానవ సమాజంలో సాంఘిక జీవనం భాషవల్లే సాధ్యపడుతుంది. మనిషి భాషను సహజంగానే నేర్చుకుంటాడు. ఒక వ్యక్తి ఏ భాషా సమాజంలో పుట్టి, పెరిగి, అభివృద్ధి చెందుతాడో ఆ సమాజానికి అనుగుణంగా ఆ భాష అలవడుతుంది. ఆ భాషలోనే తన ప్రతిభా ప్రజ్ఞాపాటవాల్ని చూపిస్తాడు. అయితే ప్రత్యేకమైన అధ్యయనం వల్ల ఇతర భాషల్ని క్షుణ్ణంగా నేర్చుకుంటాడు. సమాజంలో భిన్న సంస్కృతికి చెందినవారు భిన్న కులాల, మతాలవారు కలిసిమెలసి జీవిస్తారు. వీళ్ళందరినీ ఒకటిగా చేసి సాంఘిక జీవనంలో సన్నిహితులను చేసేది భాష మాత్రమే.

శిశువుకు తొలి విజ్ఞానం వెలుగు నిచ్చేదీ, మనసులో పొంగిపొర్లి వచ్చే భావాలకు, అభిప్రాయాలకు, వ్యక్తీకరణరూపం ఇచ్చేదీ, సభ్యత, సంస్కారాల మీద, చరిత్ర, సంస్కృతుల మీద గౌరవ భావం పెంచేదీ మాతృభాష. ఇది జన్మత వచ్చే మాధ్యమం.

బంజారా విద్యార్థులకు భాషేతర ఉపాధ్యాయులు సమస్య

విద్యార్థుల విద్యాభ్యాసంలో భాషకీలకమైన పాత్రవహిస్తుంది. ప్రాథమిక స్థాయిలో పిల్లవాడికి మాతృభాషలో బోధన కొనసాగించాలి. కాని బంజారా భాషకు లిపి లేకపోవడం వలన బంజారా విద్యార్థులు వారి ప్రాంతీయభాషలో విద్యను అభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయులు చెప్పే అంశం విద్యార్థులు సరిగా అర్థం చేసుకోకపోయిన ఉపాధ్యాయులు వారి భావాలను పిల్లలపై రుద్దుతున్నారు. భాషాస్పృహ అనేది ఉపాధ్యాయుడికి ఉన్నట్లయితే పిల్లవాడి మేధో భావాత్మకత అవసరాలకు చక్కగా ప్రతిస్పందించగలుగుతాడు. కాని విద్యార్థి ఉపయోగించిన భాషకు ఉపాధ్యాయుని స్పందన అనేది ఉండదు. ఇక్కడ ఉపాధ్యాయులు భాషేతర అంశాలపై దృష్టి సారిస్తున్నారు. ఉపాధ్యాయులు చెప్పే అంశం విద్యార్థులకు అర్థం

కాకపోవడం విద్యార్థులకు తెలుగు భాషరాకపోవడం వలన విద్యార్థులు అర్థంకాని విషయాన్ని తిరిగి తెలుసుకోలేకపోతున్నారు. దీని వలన బంజారా విద్యార్థులు విద్యాభ్యాసంలో వెనుకబడిపోతున్నారు. మాతృభాషలో విద్యాబోధన కొనసాగితే పిల్లలు సులభంగా అర్థం చేసుకోగలుగుతారు. పసిపిల్లవాడికి తల్లిపాలు ఎంత శ్రేష్ఠమో విద్యార్థికి మాతృభాషలో బోధించడం అంతే ఉత్తమమైనదనీ రవీంద్రనాథ్ ఠాగూర్ చెప్పారు. మాతృభాషలో బోధనకు ఇతర భాషలో బోధనకు తల్లిపాలకు, పోతపాలకు ఉన్నంత తేడా ఉంటుందని భాషాశాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. భాషా శాస్త్రజ్ఞుల ప్రకారం ఒక వ్యక్తి తన భావాలను మాతృభాషలో వ్యక్తపరచినంత స్పష్టంగా వేరే భాషలో వ్యక్తపరచలేరు. కాని బంజారా విద్యార్థుల విషయానికోస్తే ఇది పూర్తి వ్యతిరేకంగా ఉన్నదని చెప్పవచ్చు. బంజారావారు విద్యాభ్యాసానికై ప్రాంతీయ భాషలపై ఆధారపడటం వారి ఎద్యావ్యాప్తిపై అపారమైన ప్రభావాన్ని చూపిస్తున్నదని చెప్పవచ్చు. ఈ విధంగా బంజారాల విద్య అభివృద్ధి కుంటుపడడానికి భాషే ప్రధాన కారణమని విద్యవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ పోటీ ప్రపంచంలో అభివృద్ధి చెందిన కులాలు, జాతులు మరీ పోటీపడి ముందుకు సాగిపోతుంటే అభివృద్ధి చెందని బంజారాలు మరీ వెనుకబడి పోతున్నారు.

లిపి సమస్య

బంజారా భాషకు ప్రత్యేకంగా లిపిలేకపోవడం అనేది వారి విద్యాభ్యాసానికి ప్రధాన సమస్యగా పరిణమించింది. ఒక విద్యాపరంగానే కాక మొత్తం జాతికే ఒకలోపంగా తయారైందని కూడా చెప్పవచ్చు. బంజారాలకు గేయాలు, సామెతలు, కథలు, కథనాల వంటి అపార సాహిత్యం ఉన్నప్పటికీ లిపిలేని కారణంగా ఇవి వాటి ఉనికిని కోల్పోతున్నాయి. అంతేగాక బంజారాలు దేశమంతా విస్తరించి ఒకే భాషను మాట్లాడుతున్నప్పటికి లిపి లేకపోవడం వల్ల సంబంధ బాంధవ్యాలు కొనసాగించడానికి వీలులేని పరిస్థితి నెలకొంది. దానివల్ల జాతి మొత్తానికే నష్టం కలుగుతుందని బంజారా విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. భారతదేశం అంతట బంజారాలు నివసించి ఉండి ఒకే భాషను మాట్లాడగలిగి ఉండి కూడా లిపి లేని కారణం వలన ఒకరి భావాన్ని మరొకరు పంచుకోలేకపోతున్నారు. దీనివలన బంజారా విద్యార్థులకు ఎంతో భరించరాని నష్టం కలుగుతుంది.

బంజారా భాష పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలు

1. బంజారాలు నివసిస్తున్న ప్రాంతాల్లో వారి మాతృభాష మాధ్యమంలో వారికి విద్యను అందించాలి.
2. బంజారాలు నివసిస్తున్న తండా పాఠశాలలో బంజారా ఉపాధ్యాయులనే నియమించాలి.
3. తండా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న బంజారేతర ఉపాధ్యాయులకు బంజారా భాష పట్ల అవగాహన కలిగించాలి.
4. ఉద్యోగస్తులైన తల్లితండ్రులు ఇంట్లో తప్పకుండా వారి పిల్లలతో వారి మాతృభాషలోనే మాట్లాడుకోవాలి.
5. ప్రాథమిక తరగతికి చెందిన పాఠ్యపుస్తకాలను పాఠ్యప్రణాళికలో చేర్చి వారి మాతృభాషలో ముద్రించాలి.
6. బంజారా భాష అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి.
7. బంజారా భాషపై పరిశోధనలు జరగాలి. పరిశోధనకు ప్రభుత్వం ప్రోత్సహించాలి.
8. బంజారా సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించిన అంశాలను పాఠ్యాప్రణాళికలో చేర్చాలి.

ఉపయుక్త గ్రంథాలు:

1. తెలుగు భాషాధ్యయనంలో లంబాడీ విద్యార్థుల సమస్యలు – పరిష్కారాలు – డా. వన్నె గోపాల్, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
2. తెలుగు – బోధన పద్ధతులు – తెలుగు అకాడమి, హైదరాబాద్.
3. తెలుగు భాషా చరిత్ర – ప్రొఫెసర్ వెలమలసిమ్మన్న, విశాఖపట్టణం.

ఆంధ్ర సారస్వత పరిషత్తు కొన్ని ప్రచురణలు

1.	ఆంధ్ర మహాభారతోపన్యాసములు	రూ.	100/-
2.	తెలుగు వాగ్గేయకారులు - అన్నమయ్య విలక్షణ వ్యక్తిత్వం	రూ.	70/-
3.	తెనుగు సాహితి	రూ.	36/-
4.	స్త్రీల రామాయణపు పాటలు	రూ.	36/-
5.	సమీక్షణం	రూ.	36/-
6.	పరిణతవాణి - 1,2,3,4,5,6 సంపుటాలు (36,45,60,65,60,150)	రూ.	370/-
7.	ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు	రూ.	70/-
8.	ఇరివెంటి వ్యాసాలు	రూ.	30/-
9.	శాలివాహన గాథా సప్తశతీసారము	రూ.	15/-
10.	రాయప్రోలు రచనలు - తత్వవివేచన	రూ.	60/-
11.	తెలుగు సాహిత్యోద్ధారకులు	రూ.	40/-
12.	మల్లికా గుచ్ఛము	రూ.	8/-
13.	మన జాతినిర్మాతలు	రూ.	4/-
14.	సుమతి, వేమన, కృష్ణ శతకాలు	రూ.	24/-
15.	ఆంధ్ర సారస్వత పరిషత్తు స్వర్ణోత్సవ సంచిక	రూ.	50/-
16.	ఆంధ్ర సారస్వత పరిషత్తు వజ్రోత్సవ సంచిక	రూ.	250/-
17.	తెలంగాణాలో జాతీయోద్యమాలు	రూ.	10/-
18.	సంస్కృత పాఠవల్లరి	రూ.	4/-
19.	నా సాహిత్యోపన్యాసములు	రూ.	5/-
20.	గౌతమబుద్ధుడు - జవహర్‌లాల్ నెహ్రూ	రూ.	3-60
21.	విమర్శకవతంసులు	రూ.	45/-
22.	మన దేశం - తెలుగుసీమ	రూ.	7/-
23.	మన నదులు - కృష్ణా గోదావరులు	రూ.	3/-
24.	మధురభక్తి - ముగ్ధభక్తి	రూ.	80/-
25.	ప్రాచీన కవిత	రూ.	10/-
26.	ప్రసంగ వ్యాసాలు	రూ.	5/-
27.	దశరూపక సారం	రూ.	5/-
28.	భారతీయ వాస్తు శిల్ప విజ్ఞానం	రూ.	2/-
29.	నా రేడియో ప్రసంగాలు	రూ.	5/-
30.	సాహిత్యానువాదం : సమాలోచనం	రూ.	60/-
31.	శివరాత్రి మాహాత్మ్యము	రూ.	75/-
32.	తెలుగు రచన	రూ.	7/-
33.	ఆంధ్ర వాఙ్మయ చరిత్ర	రూ.	85/-
34.	సాహిత్య సోపానములు	రూ.	75/-
35.	మన హాస్యము	రూ.	100/-
36.	తెలుగు భాషా సాహిత్య వైశిష్ట్యం	రూ.	100/-
37.	వ్యాస గుళుచ్ఛం (1, 2 భాగాలు)	రూ.	130/-
38.	తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం	రూ.	150/-